ధన్యజీవులు




పురుషోత్తమపుత్ర భార్గవ

పి.యస్.ఆర్. ఆంజనేయ ప్రసాద్



ధన్యజీవులు



రచన

పురుషోత్తమపుత్ర భార్గవ

పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

ప్రచురణ

శ్రీ విశ్వజననీపరిషత్, జిల్లెళ్ళమూడి

ప్రథమ ముద్రణ : అక్టోబరు 2013, నాన్నగారి శతజయంతి

కాపీలు : 1000

ప్రతులకు : శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి - 522 113.
బాపట్ల తాలుకా, గుంటూరుజిల్లా.
ఫోన్ : 08643 -227324, 227492

వెల : రూ. 100/-

డి.టి.పి. : క్రియేషన్ గ్రాఫిక్స్
7/3 అరండల్‌పేట, గుంటూరు-2.
ఫోన్ : 0863-2250885

ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి ఆర్ట్ ప్రింటర్స్
2/4 బ్రాడీపేట, గుంటూరు-2.
ఫోన్ : 0863-2235036.

అమ్మ ఆశీస్సులు

కృతజ్ఞతలు

గ్రంథకర్త - గ్రంథము ఎవరో ఏమిటో

తెలియకుండానే

గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహాయం అందించిన

సహృదయుడు - సౌజన్యహృదయుడు

కర్ణాటక రాష్ట్రంలోని హోసూరు నివాసి

శ్రీ దండెన శివప్రసాద్ రావు గారికి

కృతజ్ఞలు తెలుపుకుంటూ

వారికి, వారి కుటుంబానికి

విశ్వజనని అమ్మ ఆశీస్సులు

సర్వదా సర్వథా వర్షించాలని కోరుకుంటున్నాను.

రచయిత

పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

శ్రీ విశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి

అంకితం



శ్రీ అంగర సూర్యనారాయణ గారి దౌహిత్రి,

చిరంజీవి జి.ఎ. పద్మప్రియ కుమార్తె

ఇంజనీరింగ్ (ఎలక్ట్రానిక్స్) చివరి

సంవత్సరం చదువుతూ 6-6-12న

అర్థాంతరంగా అమ్మలో లీనమైన

కుమారి చిన్మయ గాయత్రికి ....



అమ్మను సర్వస్వంగా భావించి

అమ్మ ఏది యిస్తే దానిని ప్రసాదంగా

స్వీకరించిన

ధన్యజీవి

సింగుపాలెం జానకికి ....

ఈ గ్రంథం అంకితం

His Holiness - Jagadguru

SRI SIDDHESWARANANDA BHARATISWAMY

Siddheswari Peetadhipati - Courtallam

Mounaswamy Mutt,
Courtallam - 627 802
(Via Tenkasi),
Thirunelveli (Dt.)
TAMILNADU
Ph:04633-283707

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు

శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి

సిద్ధేశ్వరీ పీఠాధిపతి - కుర్తాళం

Camp Office :
B1-C40,
Kaalipeetham Street,
4th Line,
Ravindra Nagar,
GUNTUR-522 006
Ph : 0862-2231625
2256666



ఆశీర్వాద శ్రీముఖము

మా ఆంజనేయ ప్రసాద్ రచించిన "ధన్యజీవులు" అనే గ్రంథం చూచాను. జిల్లెళ్ళమూడిఅమ్మ మాతృశ్రీ అనసూయాదేవి యందు భక్తి కలిగి, చిరకాలం ఆ తల్లితో అనుబంధం గలిగిన కొందరి చరిత్రల సంపుటి యిది. ఇవన్నీ ఇదివరకే మాసపత్రికలలో ముద్రితమైనవే. అమ్మ భక్తులకు ఇవి ఎలానూ సంతోషాన్ని కలిగిస్తవి. రచనాశక్తి వల్ల, భక్తునికి భగవంతునికి ఉండే సంబంధం - అవతారమూర్తికి, ఆశ్రితులకు ఉండే అనుబంధం వల్ల వీటికి అలంకారశాస్త్రంలో చెప్పబడిన సాధారణీకరణం అనే ధర్మం వర్తించి అందరినీ చదివేలా చేసి తదుదిత భావానుభూతిని కలిగిస్తుంది. రచయితలకు, పఠితులకు అందరికీ అమ్మ ఆశీస్సులు లభించును గాక!

నారాయణ స్మరణతో

సిద్ధేశ్వరానంద భారతీ స్వామి



పరిషత్ అభినందన

శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్ గత 1958 నుండి అమ్మ వద్దకు వస్తున్న సోదరుడు. అమ్మతో పెనవేసుకొన్న అతని జీవితంలో అమ్మ యిచ్చిన ఎన్నో అనుభూతులను హృదయంలో పదిలపరచుకున్నాడు. అమ్మ వద్దకు వచ్చే ఎందరు సోదరీసోదరులతోనో పరిచయ భాగ్యాన్ని నోచుకున్నాడు. అమ్మ జీవిత మహోదధిలో తరంగాలను పారాయణం చేశాడు. అమ్మ సేవలో తమ జీవితాలను పునీతం చేసుకొన్న ఎంతోమందితో సన్నిహితంగా సంచరించాడు.

అమ్మ అతడికి ఎందుకు ఈ ప్రేరణ ఇచ్చిందో తెలియదు గాని హైదరాబాద్ నుండి మన సోదరులు ప్రచురిస్తున్న "మదర్ ఆఫ్ ఆల్" పత్రికలో మొదటి పత్రిక నుండి నేటి వరకు ధారావాహికంగా అమ్మ సేవలో తరించిన ధన్యజీవుల చరిత్రను చిత్రించటానికి కృషి చేశాడు. ఇప్పటికి దాదాపు 54 మందిని గూర్చి వ్రాసినట్లున్నది. ఈ గ్రంథంలో 64 దాకా ఉన్నాయి శీర్షికలు.

ఈ మధ్య పి.యస్.ఆర్.కు 75 ఏళ్ళు నిండుతున్నట్లున్నది. తన రచనలు ప్రచురించాలనే ఆలోచన వచ్చింది. తొందరేమున్నది వ్రాస్తూనే ఉన్నావు కదా ! తర్వాత చూద్దాంలే అన్నా వినలేదు. నాన్నగారి శతజయంతి సంవత్సరంలోనే 'విశ్వజననీ వీక్షణం' అని తన సంపాదకీయ రచనలన్నీ దాదాపు 900 పేజీల పుస్తకం ప్రచురించాడు. ఇప్పుడు "ఈ ధన్యజీవులు" ప్రకటిస్తున్నాడు. శ్రీ విశ్వజననీపరిషత్ సభ్యుడిగా, కార్యకర్తగా ఈ ప్రచురణలన్నీ శ్రీ విశ్వజననీపరిషత్ ప్రచురణలు గానే ప్రచురించటం ఎంతో అభినందించదగ్గ విషయం.

శ్రీ పి.యస్.ఆర్.ను అభినందిస్తూ అతడింకా ఇంకా ఇంకా ఈలా రచనలు చేస్తూ అమ్మ సేవలో పాల్గొంటూనే ఉండాలనీ, అలాంటి శక్తి ఆయుస్సు అమ్మ ప్రసాదించాలనీ కోరుకుంటున్నాము.

–శ్రీవిశ్వజననీపరిషత్,
జిల్లెళ్ళమూడి

ఈ గ్రంధానికి యీ రూపం ఏలా వచ్చిందంటే



అమ్మ ఆలయంలో చేరిన తర్వాత చాలా ప్రాంతాలలో అమ్మ అనంతోత్సవాలు జరిగాయి. హైదరాబాదులో అమ్మ తత్త్వచింతన సదస్సు జరపాలని నిర్ణయించారు. దానికి అనుబంధంగానే ఒక (సావనీర్) ప్రత్యేకసంచిక తేవాలనుకొని నంబూరి పరబ్రహ్మమూర్తి అధరాపురపు శేషగిరిరావుగారిని గూర్చి వ్యాసం వ్రాసి పంపమని నన్ను కోరాడు. శేషగిరిరావుగారు అందరింటి రూపశిల్పులలో ఒకడు. అమ్మ అనుగ్రహం పొందినవాడు. నాకు చాల ఆప్తుడు, గౌరవనీయుడు, ఆత్మీయుడు. అంతకన్న మహద్భాగ్య మేమున్నదని ఒక వ్యాసం వ్రాసి పంపాను. అది ఆ ప్రత్యేక సంచికలో ప్రచురింపబడింది.

కారణాలేవైనా 1992 నుండి జిల్లెళ్ళమూడి నుండి ప్రచురింపబడే మాతృశ్రీ మాసపత్రిక ఆగిపోయింది. కొంతమంది హైదరాబాదు సోదరులు 'మదర్ ఆఫ్ ఆల్' పేరుతో ఒక త్రైమాసిక పత్రికను 2000 జనవరి నుండి తసుకొని రావాలని నిర్ణయించి నన్ను ఒక వ్యాసం వ్రాయమని అడిగారు. అప్పుడు పూర్వం నేను శేషగిరి రావుగారి మీద వ్రాసిన వ్యాసమే పంపాను. దానితో మొదలైంది. ప్రతి మూడు నెలలకు ఏదో ఒక వ్యాసం వ్రాయవలసి వచ్చింది ఆపత్రిక కొరకు. అప్పుడు అమ్మ సేవలో జీవితాలను తరింప జేసుకొన్న ధన్యజీవులను గూర్చి వ్రాయటం మొదలు పెట్టాను. అలా అలా వ్రాసినవి యీ పదునాలుగు సంవత్సరాలలో 54 దాకా అయ్యాయి. కొన్ని వందల మంది అమ్మ అనుగ్రహంతో జీవితాలను ధన్యం చేసుకొన్నవారితో నాకు పరిచయాలున్నాయి. నేనూ 1958 నుండి అమ్మ వద్దకు వెళ్ళుతున్నవాడిని కనుక చాలామంది తెలుసు. అయితే వాళ్ళను గూర్చి వ్రాయాలంటే అంతమాత్రమే చాలదు. అమ్మతో వారి సంభాషణలు వారి జీవిత విశేషాలు కూడా కావలి. నా చేతనయిన పరిధిలో ప్రయత్నం చేస్తూ వ్రాశాను. ఆ వ్రాతలు చాలా మంది సోదరీ సోదరులకు నచ్చాయి. తమను గూర్చి కూడా యిలా పి.యస్.ఆర్.గారు వ్రాస్తే బాగుండును అని జీవించి ఉన్నవారు కూడా అనుకున్న సందర్భాలున్నాయి.

ఏమైనా ఆ వ్రాసిన రచనలు సమగ్రమైనవని నేననుకోను. అయినా అమ్మ

అనుగ్రహించినంత వరకు గిలికాను. ఈ విషయ సేకరణలో కొండముది రామకృష్ణ, మన్నవదత్తాత్రేయశర్మ, అయ్యగారి కుసుమాచక్రవర్తి వంటివారు వ్రాసిన గ్రంథాలేకాక వ్యక్తిగతంగా కూడా కొందరు తోడ్పడ్డారు. ఇక మాతృశ్రీ జీవితమహోదధిని గూర్చి చెప్పేదేముంది. అది ఒక మహాసముద్రం. ఎవరి చేతిలో ఉన్న పాత్రతో వారు తీసుకోవటమే. అందులో నుండి కొంత తీసుకున్నాను.

అమ్మను వాసుదాసస్వామి శ్రీరామచంద్రునిగా భావించారు. కుర్తాళం మౌనస్వామి అమ్మలో ఏదో ఒక మహత్తరశక్తిని దర్శించారు, రెడ్డిపాలెం కాంతయ్యా యోగిగారు రాజరాజేశ్వరియే అమ్మ అన్నారు. శృంగేరీ విరూపాక్ష పీఠాధిపతులు కళ్యాణానందభారతీస్వామివారు అమ్మతో ఆధ్యాత్మిక విషయాలు ఎన్నో చర్చించారు. రామనామం తప్ప మరోనామం చెయ్యని అవధూతేంద్ర సరస్వతి అమ్మ నామం "జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి"ని గానం చేశారు. శ్రీశైలం పూర్ణానందస్వామి "మదర్‌లెస్ శివా Found his Mother" ఇలా ఎందరో ఎందరో మహనీయుల నుండి పల్లెటూరిలో పొలం పనిచేసే గురవయ్య, మంత్రాయి వరకు ఎందరో అమ్మతో తమ జీవితాలను పెనవేసుకొని అమ్మ సేవలో ధన్యులైనారు.

అమ్మ నాకిచ్చిన ఈ ప్రేరణ ఎంతకాలం సాగిస్తానో చెప్పలేను. కాని మా బంధువు, సాహిత్య ఆధ్యాత్మిక వ్యవసాయం చేస్తున్న పరమాత్ముని శ్రీ దత్తప్రసాద్ మీరు వ్రాసిన యీ 'ధన్యజీవులు' గ్రంథాన్ని ప్రచురించమని రెండేళ్ళుగా పోరుపెడుతున్నాడు. ఇప్పుడే తొందరేంటి ఇంకా వ్రాస్తూనే ఉన్నావు కదా ! కానివ్వండి తర్వాత చూద్దాం అన్న ఆత్మీయులు ఉన్నారు. అయితే నా వయోభారం నన్ను అయినంతవరకు ప్రచురిద్దాం. తరువాత వ్రాస్తే వ్రాసినివ రెండో భాగంగా వేయవచ్చు అని ఇప్పటికివి గ్రంథంగా తేవాలనిపించింది.

నా అదృష్టమేమిటంటే అమ్మ ఈస్థానకవిగా అనుగ్రహించడంతో పాటు నన్ను సాహిత్యంలో తీర్చిదిద్దిన నా అగ్రజులు కవికులపతి డాక్టర్ ప్రసాద్‌రాయకులపతి (ప్రస్తుత కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి) వారి ఆశీస్సులు నాకు పుష్కలంగా దొరకటం. ఇక నా పెద్దకుమారుడు 'ప్రేమకుమార్' నాకు అన్ని విషయాలలోనూ అండగా ఉండే పితృసేవకుడు. వాడి అకాలమరణం నాకు శరాఘాతమే. అయినా అమ్మ అనుగ్రహం నా మీద పరిపూర్ణంగా ఉన్నది. నాకు ఆలోటును తీర్చటానికి నేనున్నాను అని ముందుకు వచ్చిన ఆత్మీయుడు శ్రీ మల్లాప్రగడ

శ్రీమన్నారాయణమూర్తి. నేను ప్రతిదానికి ఆయన మీదనే ఆధారపడుతుంటాను. అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. అతిచనువు తీసుకొని ఇబ్బంది పెడుతున్నానా ? అని. అయినా ఆ సహృదయుడు నా పట్ల గౌరవము ఆదరము కలవాడుగా ఉండటం నాకెంతో అండ దండ.

ఇక ఈ గ్రంథ ప్రచురణ విషయంలో కూడా శ్రీమన్నారాయణమూర్తి ప్రమేయం ఉన్నది. వారి ప్రతిభా పాండిత్యాలకు, వారి ఉపన్యాస విన్యాసానికి, విషయ విశ్లేషణకు ప్రభావితులైన శ్రోతలలో ఒకరు. ఎక్కడో కర్ణాటక రాష్ట్రంలో హోసూరులో ఉన్న శ్రీ దండెన శివప్రసాదరావుగారు. ఒక సత్కార్యానికి ధనమిస్తానని ముందుకు వస్తే ఆ వితరణను ఈ గ్రంథముద్రణకు అందించారు. నిజానికి వారి గ్రంథాలే ప్రచురించుకోవచ్చు. కాని వారి సౌజన్యం సహృదయత అలాటిది. ఇట్లు అమ్మకార్యము – ఆత్మీయ మిత్రుని గ్రంథ ప్రచురణ కార్యము ఉభయత్రా కలసి వచ్చే విషయంగా భావించి యీ సత్కార్యానికి మళ్ళించారు. అలా సత్కార్యానికి ముందుకు వచ్చిన శ్రీ శివప్రసాదరావుగారికి ఆత్మీయులు శ్రీ శ్రీమన్నారాయణమూర్తికీ కృతజ్ఞతలు. అమ్మ ఆశీస్సు వారికి వారి కుటుంబాలకు ఎప్పుడూ ఉండాలని కోరుకుంటాను.

ఈ విషయంలో ఇంకొక్కరిని కూడా తలచుకోవాలి. సోదరుడు చిరంజీవి శ్రీ ఎ.వి.ఆర్.సుబ్రహ్మణ్యం శ్రమజీవి, అమ్మ సేవాశ్రమజీవి. యీ గ్రంథ ప్రచురణకు తోడ్పడ్డాడు. అతనికి శుభాకాంక్షలు – శ్రీరావూరి ప్రసాద్, మాతృశ్రీ డిజిటల్ లైబ్రరీ వారు ఈ గ్రంథానికి కావలసిన చిత్రాలు అందించారు. వారికీ నాసాధువాదాలు తెలియచేస్తున్నాను.

పరమపూజ్యులు నాన్నగారి శతజయంతి సందర్భంగా ఈ గ్రంథం ఆవిష్కరణకు నోచ్చుకోవటం అమ్మ సంకల్పం. నా అదృష్టం. ఈ గ్రంథాన్ని గూర్చి తమ అభిప్రాయాలు వ్రాసిన ఆప్తులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావుగారికి, శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిగారికి, బ్రహ్మాండం రవికి నా కృతజ్ఞతలు.

ఇంతమందిని తలచుకొని నన్ను అమ్మ వద్దకు తీసుకెళ్ళి నాకు మరోజన్మను ఇచ్చిన సోదరుడు తంగిరాల కేశవశర్మను తలచకపోతే కృతఘ్నుడనౌతాను. కేశవుడు నేను శరీరాలు రెండైనా ఒకటిగానే మెలిగాం. మిత్రుడు శబ్దానికి సరియైన నిర్వచనం కేశవశర్మ. అతడికి అంజలి సమర్పిస్తున్నాను.

– పురుషోత్తమపుత్రభార్గవ

పి. యస్. ఆర్. ఆంజనేయప్రసాద్



విలక్షణ సర్వస్వం

డా॥ పొత్తూరి వెంకటేశ్వరరావు
సుప్రసిద్ధ జర్నలిస్ట్

అమ్మ సంకల్పించి జిల్లెళ్ళమూడికి రప్పించుకున్న అందరూ అదృష్టవంతులే. అమ్మకూ, అమ్మ నెలకొల్పిన సంస్థలకూ యథాశక్తి సేవలందించిన అందరూ ధన్యులే. అమ్మ కొందరిని కష్టాలనుంచి గట్టెక్కించడానికో, సుగతి ప్రసాదించడానికో రప్పించి ఉండవచ్చు. మరికొందరిని తనకు సన్నిహితంగా ఉండి సేవలు అందించే మహదవకాశం ఇవ్వడంకోసం రప్పించి ఉండవచ్చు. ఎవరిని ఎప్పుడు ఎందుకు రప్పించినదో అది జరిగిన వెంటనే ఇతరులకు తెలియదనీ, అమ్మకు మాత్రమే తెలుసుననీ అనడానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. "ధన్యజీవులు" గ్రంథకర్త శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్‌గారికి జిల్లెళ్ళమూడితో అనుబంధం ఇందుకు ఒక ఉదాహరణ.

1962 సంవత్సరంలో ఆ రోజు సంక్రాంతి పర్వదినం. అందరింటి ఆవరణలో వేదికమీద అమ్మ కొలువుతీరి కూర్చుని ఉన్నది. ఉద్దండులైన కవులు, పండితులు, రచయితలు అమ్మకు ఇరువైపులా రెండు వరుసలలో కూర్చుని ఉన్నారు. డాక్టర్ ప్రసాదరాయకులపతి, శ్రీ మిన్నికంటి గురునాథశర్మ, శ్రీ కృష్ణభిక్షు, శ్రీ పోతరాజు పురుషోత్తమరాయకవి అందులో కొందరు. సభ సాహిత్య సదస్సుగా అమ్మ సాక్షాత్తు సరస్వతిగా భాసిల్లిన దృశ్యాన్ని చూస్తూ అక్కడకు వచ్చిన అన్నయ్యలు, అక్కయ్యలు ఆనందిస్తున్నారు. అమ్మ కవిపండితులను ఆశీర్వదించే ఘట్టం వచ్చినపుడు మొదట అమ్మే స్వయంగా శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్‌గారిని పిలిచారు. ఆయన దగ్గరకు వచ్చి నమస్కారం చేస్తుండగా తన మెడలోని అందమైన మల్లెపూలమాలను తీసి పి.యస్.ఆర్.గారి మెడలోవేసి ప్రసన్నదృక్కులతో ఆశీర్వదించారు. నా మటుకు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. వేదికమీద వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులు లోకప్రసిద్ధులైన ఇందరుండగా అమ్మ పి.యస్.ఆర్.గారిని పిలవడమేమిటనిపించింది. శ్రీ పి.యస్.ఆర్ మా అందరిలోకి వయసులో చిన్నవాడు. కులపతిగారికి స్వయానా తమ్ముడు. మేమందరం కూడా అతడిని

చిన్నతమ్ముడిగానే చూసేవాళ్లం. మొదట పి.యస్.ఆర్.గారిని పిలిచి దండవేయటమంటే అది అగ్రతాంబూలం ఇవ్వటమే. అమ్మ ఆంతర్యం ఏమై ఉంటుందో మాలో ఎవరికీ అంతుబట్టలేదు. ఆయనను అలా సత్కరించినందుకు ఎవరికీ కష్టంగానీ బాధగానీ కలుగలేదు. తమ్ముడికి అలాంటి గౌరవం దక్కితే సంతోషంగాని బాధగానీ ఉండే ప్రసక్తి లేదు. ఆశ్చర్యం మాత్రమే కలిగింది. అప్పటికి పి.యస్.గారు కవిత్వం వ్రాస్తాడని మాలో చాలామందికి తెలియదు. తెలిస్తే కులపతిగారికి తెలిసి ఉండవచ్చు. సంవత్సరాలు గడుస్తున్న కొలది పి.యస్.ఆర్.గారి ప్రతిభ లోకానికి తెలియసాగింది. అమ్మను గురించి వ్రాయడం సరే చక్కని పద్యాలు వ్రాస్తారనీ, వచనం వ్రాసినా చాలా బాగా వ్రాస్తారనీ గుంటూరు సాహిత్య వర్గాలో పేరు వచ్చింది. ఎవరికి సన్మాన పత్రాలు వ్రాయవలసి వచ్చినా పంచరత్నాలు వ్రాయవలసి వచ్చినా ఆయన వద్దకే వచ్చేవారు. అవన్నీ వందల సంఖ్యలో ఉండి ఉంటాయి. తరువాత కవితల పుస్తకాలు వ్రాశారు. కులపతిగారు నిర్వహించిన భువనవిజయం మొదలైన వందలాది సాహిత్య రూపకాలలో నాటి తెనాలి రామకృష్ణకవి మొదలు నిన్న మొన్నటి శ్రీశ్రీ వరకు వైవిధ్యం కలిగిన అనేకపాత్రలు ధరించి పండితపామరులందరి మెప్పు పొందారు. అన్నింటికి మించి ఆయన "విశ్వజనని" మాసపత్రికా సంపాదకత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించటం ఎవరూ ఊహించనిది. "మాతృశ్రీ"కి వ్యాసాలు వ్రాయటం వేరు,"విశ్వజనని" పత్రికకు సంపాదకత్వం వహించటం వేరు. తాను విలువైన సమాచారంతో, విశ్లేషణంతో సంపాదకీయాలు వ్రాయడమే గాక ఇతరులచే వ్యాసాలు వ్రాయించటంలోనూ సంపాదకుడి ప్రతిభ కనిపిస్తుంది. గడచిన రెండు దశాబ్దాలలో విశ్వజనని పరిషత్తు ప్రచురించిన పుస్తకాలలో చాలా వాటిపై పి.యస్.ఆర్.గారి ముద్ర ఉన్నది, ఆయన స్వయంగా వ్రాసినవీ, సంపాదకత్వం వహించినవీ ఉన్నాయి. పి.యస్.ఆర్.గారిలో ఇంతటి ప్రతిభ ఉన్నదని 1962 సంక్రాంతినాటికి మాకెవరికీ తెలియదు. భూత, భవిష్యత్, వర్తమానాలన్నీ, వర్తమానాలే అయిన అమ్మకు మాత్రమే తెలుసు. అందుకే ఆయనకు అమ్మ తొలి ఆశీః పూర్వక అభినందన, సత్కారం, అగ్రతాంబూలం.

మాతృశ్రీ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ శ్రీ పి.యస్.ఆర్. ప్రచురిస్తున్న సరికొత్త గ్రంథం "ధన్యజీవులు". ఇది మొదలే గాని తుది లేని ఒక విలక్షణ గ్రంథం. అమ్మకు అలనాడు ప్రత్యక్షంగా సేవచేసిన వారెందరో ఉన్నారు. అందులో

ఇప్పటికి అమ్మ తనలో కలుపుకున్న వారి సంక్షిప్త చరిత్రలనే శ్రీ పి.యస్.ఆర్. ఈ గ్రంథంలో చేర్చారు. అది అర్థం చేసుకొనదగినదే. మలి ముద్రణలు మరెన్నో రావలసి ఉంది, వస్తాయి. అందులో స్థానం పొందే మరెందరో ఉన్నారు. అమ్మ ఆలయంలో ప్రవేశించి బిడ్డలందరికీ అదృశ్యంగా పూర్వం వలెనే ఆదరిస్తున్నప్పుడు సైతం అమ్మకు ప్రతిరూపమైన విశ్వజననీపరిషత్తుకు సేవచేస్తున్న సోదరీసోదరులూ ధన్యులే. వారికీ మున్ముందు ఎప్పుడో "ధన్యజీవులు" తాజా ప్రచురణలలో చెరగని చెదరని గౌరవస్థానం లభిస్తుంది.

1950 దశకం చివరి సంవత్సరాల నుంచి జిల్లెళ్ళమూడిని దర్శించుకొనే అవకాశాలను, అదృష్టాన్ని, అమ్మ నాకు ప్రసాదించింది. "ధన్యజీవులు" గ్రంథంలోని చాలామందిని, (అంటే అత్యధిక సంఖ్యాకులకు అర్థం కాదు) స్వయంగా చూశాను వారితో పరిచయాలు కలిగించుకొన్నాను. కాని, వారిని గురించి పి.యస్.ఆర్.గారు వ్రాసిన వివరాలు చదువుతుంటే నాకు తెలయని విశేషాలు ఉన్నాయా అనిపించి ఆసక్తిగా అన్ని వ్యాసాలను చదివాను. పి.యస్.ఆర్.గారు తనకు తెలిసినవి వ్రాయడమే గాక, ఎవరిని సంప్రతిస్తే ఎక్కువ సమాచారం లభిస్తుందో తెలుసుకొని, వారి నుంచి లోకానికి అంతగా తెలియని చాలా విశేషాలను రాబట్టి గ్రంథస్తం కావించారు. ఉదాహరణకు రహి జీవితం చూడండి. నేను అతనిని చూడాలను కొన్నాను. కాని చూడటం తటస్థ పడలేదు. నన్ను ఆయన చూశాడని అమ్మ చెప్పేవారు. రహి త్యాగపురుషుడు, మహనీయుడు. ఆయనను గురించి తనకు తెలిసినప్పటికీ పి.యస్.ఆర్గారు వ్రాయని విశేషాలు కొన్ని ఉండవచ్చు. ఐనా, వ్రాసిన విశేషాలన్నీ అద్భుతమైనవి. బాపట్ల గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద స్పృహలేని స్థితిలో పడున్న రహిని అమ్మ కాపాడటం, అతడు తరువాత అమ్మ దరి చేరిన బిడ్డడుగా ఒక ముఖ్యుడు కావడం చరిత్ర. మహనీయులు మౌనస్వామి, లక్ష్మీకాంతయ్య యోగి, పూర్ణానందస్వామి, అవధూతేంద్రస్వామి, కళ్యాణానంద భారతీస్వామి, మేధావులు శ్రీ పాదగోపాలకృష్ణమూర్తి, వీరమాచనేని ప్రసాదరావు, ఎక్కిరాల భరద్వాజ, స్వాతంత్ర్య సమరయోధులు అధరాపురపు శేషగిరిరావు, సుప్రసిద్ధ పౌరాణికులు మల్లాప్రగడ శ్రీ రంగారావు, నాన్నగారు అమ్మ ఆలయ ప్రవేశానికి ముందు గర్భగుడిని కొన్ని సంవత్సరాలు రాత్రింబవళ్లు అమ్మ నామంతో,

ప్రణవనాదంతో పవిత్రీకరించిన రాధాకృష్ణరెడ్డి, మహాభక్తుడని అమ్మ వర్ణించిన పుల్లయ్య "మందరం" రామాయణము (పద్యకావ్యం), వ్యాఖ్య వ్రాసిన వాసుదాసస్వామి, "సరస్వతీపుత్ర పుట్టపర్తినారాయణాచార్యులు, అద్భుతమైన అమ్మ పాటలు వ్రాసిన వాగ్గేయకారుడు నదీరా, జీవితాన్ని అమ్మసేవకు అంకితం చేసిన గజేంద్రమ్మ, త్యాగమయి జానకి, ఇంకా అమ్మ రప్పించుకొన్న ఎందరి జీవిత సంక్షిప్త చిత్రణలో ఇందులో కనిపిస్తాయి. నిరంతరం అమ్మను నీడలా కనిపెట్టుకొని ఉండి, అమ్మ ఆంతరంగిక కార్యదర్శిగా సేవచేయడమే గాక "మాతృశ్రీ" పత్రికకు సమర్థవంతంగా సంపాదకత్వం వహించిన కొండముది రామకృష్ణ గురించి ఎన్నో విశేషాలు ఆయనపై వ్రాసిన వ్యాసంలో ఉన్నాయి. అమ్మ జీవితచరిత్రలో స్థానం సంపాదించుకున్న యోగిని రాజమ్మ అమ్మకు మంత్రోపదేశం చేయాలనుకొన్న ఘట్టం ఆమెను గురించిన వ్యాసంలో ఎంతో ఆసక్తి కలిగిస్తుంది. మనుషులను గురించేకాదు, అమ్మకు సేవచేసిన "పెద్దకుక్క" చరిత్ర ఈ గ్రంథంలో ఉంది. పి.యస్.ఆర్.గారు దానిని ధన్యచరిత అన్నారు. అది సంస్కారం కలిగినదనీ, దానిది విశాలహృదయమనీ, అమ్మను ప్రాణాప్రదంగా ప్రేమించినదనీ వర్ణించారు. "మనిషిని మనిషి ఎంత దూరం ప్రేమించవచ్చు అంతదూరం అది ప్రేమించగలదు" అని అమ్మ చెప్పిన మాటను ఆయన మనకు అందించారు.

శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ వ్రాసిన గ్రంథాలు, ప్రచురించిన పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో దేని ప్రత్యేకత దానికి ఉన్నది. ఐతే వివిధ ప్రక్రియల గ్రంథాలలో విజ్ఞాన సర్వస్వానికి ప్రత్యేక స్థానం ఉన్నట్టు, ఎప్పటికీ ఉపయోగపడే లక్షణం ఉన్నట్టు భవిష్యత్తులో విస్తృతి పొంది అనేక ముద్రణలుకాగల అవకాశం ఉన్న "ధన్యజీవులు విలక్షణ రచన. ఇంత మంచి గ్రంథరచనా కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం కావించిన శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్ అభినందనార్హుడు.



"అందరికీ సుగతే" - అమ్మ

ఆర్ష విద్యాసాగర, ప్రసన్నవ్యాస
శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

"సతాం ప్రసంగే మమ వీర్య సంపదః ।
భవంతి హృత్కర్ణ రసాయనాః కథాః ॥" - భాగవతం

దైవాన్ని నమ్మి, సన్నిధికి చేరి, సేవించి, తరించిన భక్తుల వృత్తాంతాలు పరోక్షంగా దైవాన్ని గురించే తెలియచేస్తాయి. అంతేకాదు, ఆ భక్తుల గాథలు ఆలకించే చెవులకు, ఆస్వాదించే హృదయాలకూ కూడా రసాయనాలు. భాగవతం చెప్పిన ఈ ధర్మం ముమ్మూర్తులా వర్తించే గ్రంథం "ధన్యజీవులు".

చిరకాలంగా అమ్మను సేవిస్తూ, అమ్మనే సకలదేవతాస్వరూపంగా దర్శిస్తూ, 'అందరింటి' సోదరబృందంతో ఆత్మీయబంధం పెనవేసుకున్న శ్రీ పి. యస్. ఆర్. ఆంజనేయప్రసాద్ అందించిన ఆణిముత్యం ఈ గ్రంథం. హైదరాబాద్ సోదరుల సారధ్యంలో వెలువడుతున్న త్రైమాసిక పత్రిక "మదర్ ఆఫ్ ఆల్" కోసం రూపొందించిన వ్యాసాల సంకలనం "ధన్యజీవులు"

భాగవతం అంటే భగవంతుని కథ. భక్తుల కథ. భగవద్భాగవత సంబంధమే భాగవతం. భక్తులకు భగవంతునితో అనుబంధం ఏ కారణంగానైనా ఏర్పడవచ్చు. తట్టుకోలేని కష్టం వస్తే "ఆర్తి"తో పిలిచేవారు కొందరు. అసలు ఈ దైవం ఎవరు ? తత్త్వం ఏమిటి ? ఈ దైవంతో నాకున్న సంబంధం ఏమిటి? - తెలుసుకోవాలనే "జిజ్ఞాస"తో అన్వేషించేవారు కొందరు. ఏ వేళకు ఏ అవసరం కలిగినా, "అర్థార్థు"లై దైవానుగ్రహంతో అన్ని ప్రయోజనాలూ సాధించుకోవాలనుకునేవారు కొందరు. దైవాన్ని గురించి చక్కని అవగాహన కలిగి ఉండి, సర్వస్వార్పణం చేయాలని 'తెలిసి' ఆరాధించే 'జ్ఞానులు' కొందరు. "ఉదారా స్సర్వఏవైతే" అన్నాడు గీతాచార్యుడు. వీరందరూ ఉదాత్తమైన వారే నన్న శ్రీకృష్ణుని మాటలనే "అందరికీ సుగతే" అన్న మాటలలో 'అమ్మ' వివరించింది.

అమ్మను దర్శించి, సేవించి ధన్యులైన కొందరు సోదరుల జీవితానుభవాలకు అక్షరాకృతి ఈ రచన.

అమ్మను దర్శించినవారిలో అన్ని తరగతులవారూ ఉన్నారు. పండితులున్నారు, పామరులున్నారు, మేధావులున్నారు, సామాన్యులున్నారు. సేవతాతత్పరులున్నారు, రచనాధురంధరులున్నారు. "విచక్షణ లేని వీక్షణం"తో అందరినీ అనుగ్రహించింది అమ్మ. తారతమ్యాలు లేని తరగని వాత్సల్యంతో అందరినీ తరింపజేసింది. కొందరు నమ్మికతో వచ్చారు. కొందరు వచ్చిన తర్వాత కొన్ని అనుభవాలు పొంది, సత్యసందర్శనం చేయగలిగారు.

"శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం

అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం..." అని ప్రహ్లాదుడు ప్రతిపాదించిన నవవిధభక్తి మార్గాలలో అన్ని మార్గాలను అనుసరించినవారూ అమ్మ బిడ్డలలో కనిపిస్తారు. మధురభక్తికి, వైరభక్తికీ కూడా ఉదాహరింపదగిన సోదరుల కథలూ లేకపోలేదు. వారందరి కథలనూ సేకరించి, వారి వారి జీవితకథాపుష్పాలను భక్తి అనే అంతస్సూత్రం ఆధారంగా సురభిళ సుమహారంగా కూర్చి సమర్పించారు శ్రీ పి. యస్. ఆర్. ఆంజనేయప్రసాద్.

ఆ సోదరీ సోదరుల జీవితగాథలను, అమ్మ సన్నిధిలో వారు పొందిన అనుభవాలను వ్యక్తీకరించడంలో శ్రీ పి. యస్. ఆర్. చూపిన మెలకువ, పాటించిన సంయమనం చరిత్ర రచయితలకందరికీ ఆదర్శప్రాయమైనది.

అమ్మ అనుగ్రహంతో అమృతసిద్ధిని పొందిన 'ధన్యజీవులు' శ్రీ పి. యస్. ఆర్. రచనలో ఒదిగి 'అక్షరులు', అమరులు అయ్యారు. భావితరాల వారు అమ్మను సేవించుకుని, తరించడానికి తన రచన ద్వారా మార్గం సుగమం చేశారు శ్రీ పి. యస్. ఆర్.

అమ్మ 'పాదకమలసేవ'తో పాటు అమ్మ "పాదార్చకులతోడి నెయ్యమును" గలిగిన శ్రీ పి. యస్. ఆర్. ఈ గ్రంథంలో అమ్మకు, ధన్యజీవులైన ఆ బిడ్డలకు గల బంధాన్ని హృద్యంగా ఆవిష్కరించారు.

'అందరింటి' సోదరులందరికీ ఉపయుక్తమైన చక్కని గ్రంథాన్ని అమ్మకు వాఙ్మయోపహారంగా సమర్పించిన సుకృతి శ్రీ పి. యస్. ఆర్. గారికి వినమ్రభావంతో నమస్కరిస్తూ........ సెలవు.

అభినందన




'మదర్ ఆఫ్ ఆల్' పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడిన 'ధన్యజీవులు' అనే శీర్షిక క్రింద వచ్చిన వ్యాసాలను ఒక సంపుటిగా ప్రచురిస్తున్నారు శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ గారు. అమ్మను అత్యంత నిష్ఠతో సేవించి తరించిన ఎందరో జ్ఞానులు, భక్తులు ఎంతో సేవాభావంతో విభిన్న కోణాలలో అమ్మను దర్శించి పునీతులైనారు. జీవితాలు చరితార్థం చేసుకొని అమ్మలో ఐక్యమైనారు. భావి తరాలకు స్ఫూర్తిదాతలైన వారికి అమ్మతో, అమ్మ సంస్థతో ఉన్న అనుబంధాన్నీ, ఆత్మీయతా బంధాన్నీ అవలోకించిన సోదరులు శ్రీ పి.యస్.ఆర్ గారు ఈ వ్యాసాలలో చిత్రీకరించారు. ఎంతటి పెద్ద విషయాన్నైనా చిన్న చిన్న మాటలలో వ్యక్తీకరించగల్గిన దిట్ట. అమ్మ ఎంచుకొన్న ఈస్థానకవి శ్రీ పి.యస్.ఆర్.గారు. కవిత్వం వాళ్ళ ఇంట పుట్టింది, వంటబట్టింది. అయినా జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గరే వెలుగుచూసింది.

అమ్మను గూర్చి ఎన్నో గ్రంథాలు వ్రాశారు. ఎన్నో గ్రంథాలు వెలుగు చూడటానికి నిష్ఠతో శ్రమిస్తున్నారు. నాన్నగారి శతజయంతి సందర్భంగా ఎన్నో క్రొత్త గ్రంథాల ప్రచురణకు తోడ్పడుతున్నారు. పాత గ్రంథాలను మళ్ళీ మళ్ళీ పునర్ముద్రిస్తున్నారు. శతజయంతి ప్రత్యేక సంచికను కూడా తెస్తున్నారు.

ఈ వయసులో వారు చేస్తున్న కృషిని అభినందిస్తూ, వారినీ, వారికి సహకరిస్తున్న వారి కుటుంబానికి అమ్మ ఆయురారోగ్యాలు ప్రసాదించాలనీ, అమ్మ నాన్నల ఆశీస్సు వారందరిపై వర్షించాలని కాంక్షిస్తున్నాను.

– శ్రీ బ్రహ్మాండం రవీంద్రరావు

విషయసూచిక



1. మౌనస్వామి

ఆంధ్రప్రదేశ్‌లోని పూర్వం గుంటూరుజిల్లా ఇప్పటి ప్రకాశంజిల్లాలోని చీరాల వద్దగల నూనెవారిపాలెంలో 1868 వైశాఖశుద్ధ చతుర్ధినాడు అచ్యుతుని బాపనయ్య సీతమ్మల మూడవ కుమారుడుగా జన్మించారు మౌనస్వామి. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు పిచ్చయ్య. బాపనయ్యగారి బంధువులు అచ్యుతుని లక్ష్మీనరసయ్య, సుందరమ్మలు పిచ్చయ్యను దత్తత తీసుకొని శివయ్య అని పేరు మార్చి పెంచి విద్యాబుద్ధులు నేర్పించారు. వయసు రాగానే శివయ్యకు కామేశ్వరమ్మతో వివాహం జరిపించారు. ఏవో చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. శివయ్యకు నాగభూషణం అనే కుమారుడు, లక్ష్మీనరసమ్మ, సుందరమ్మ అనే కుమార్తెలు కలిగారు. 1903లో పెద్దకుమార్తెకు ఆ తర్వాత రెండవ కుమార్తెకు, అదే కాలంలో కుమారునకు ఉపనయనం చేశారు.

చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక చింతన, దేవీ ఉపాసన నిత్యకృత్యాలు శివయ్యకు. అబ్కారీ డిపార్టుమెంట్‌లో కొంతకాలం, రాజమండ్రిలో ప్లీడరు గుమాస్తాగా కొంతకాలం, ఒక వ్యాపారస్తుని దగ్గర కొంతకాలం ఉద్యోగం చేశారు. ఆ రోజుల్లోనే ఒక బైరాగితో పరిచయమైంది. అప్పుడు బాహ్య జగత్తునుండి అంతర్జగత్తులోకి దృష్టి మళ్ళింది. 1906 డిసెంబరులో అప్పటిదాకా 12 సంవత్సరాలుగా రాజమండ్రిలో సంసారంతో ఉన్న శివయ్య అన్ని లౌకికబంధాలు తెంచుకొని హిమాలయాల వైపు ప్రయాణించారు. అక్కడ నైమిశారణ్యంలో పర్వత

గుహల దగ్గర 'వెంకటాచలం పంతులు' అనే తెలుగు వృద్ధ యోగితో భగవంతుని కృపతో పరిచయం అయింది. వారికి సేవచేసి కొన్ని నెలల పాటు వారి అనుగ్రహాన్ని పొంది ఆకలిదప్పులు లేని, విషజంతువులచే బాధనొందని విద్యను పొందారు. అక్కడ నుండి హిమాలయాలకు ప్రయాణం సాగించారు.

హిమాలయాలలో అచ్యుతానందసరస్వతి అనే మహాసిద్ధుని ఆశ్రమం కనిపించింది. ఆ స్వామి దత్తాత్రేయుని సంప్రదాయానికి చెందిన యోగి. దశమహావిద్యల మూలదేవత అయిన సిద్ధేశ్వరీదేవిని పరశురాముని అనుగ్రహంతో సాక్షాత్కరించుకొన్న వాడు. అచ్యుతానందసరస్వతీస్వామి శివయ్యకు సన్యాసదీక్షను ఇచ్చి 'శివచిదానంద సరస్వతి' అని యోగపట్టా ప్రసాదించాడు. ఆ ఆశ్రమంలోనే తపస్సు చేసుకుంటుండే నిఖిలేశ్వరానంద, విశుద్ధానంద ఆ ఆశ్రమానికి వచ్చారు. వారితో కలసి సాధన చేశారు శివచిదానందస్వామి.


అచటి నుండి గురువుల ఆజ్ఞతో శివచిదానందస్వామి దేశ సంచారం చేస్తూ దత్తభక్తులైన వాసుదేవానందసరస్వతిని కలిశారు. వారిని టెంబేస్వామి' అని కూడా పిలుస్తారు. వారు శివచిదానందస్వామికి యోగరహస్యాలు చెప్పి సిద్ధపురుషులుగా తయారు చేశారు. శివచిదానందస్వామి 'మౌనస్వామి'గా ప్రసిద్ధి నందటానికి రెండు కారణాలు చెపుతారు. ఒకసారి స్వామి కాశ్మీరులో పర్యటన చేస్తుండగా అక్కడి వృద్ధపండితుల విద్వద్గోష్ఠిలో వివాదాస్పదమైన కొన్ని సందేహాలకు సమాధానం చెప్పి వారి కోపానికి కారణమైనారు. ఈ విషయం తెలిసిన గురువుగారు శివచిదానందను మౌనంగా ఉండమన్నారు. మరొక కారణం ఒకసారి వృద్ధాచల సమీపారణ్యంలో తపస్సు చేస్తుండగా కోపావిష్టులైనారు. తన కోపం కారణంగా ఇతరులకు కష్టం కలగవచ్చునని గ్రహించి స్వచ్ఛందంగా 'మౌనవ్రతం' స్వీకరించారు. అప్పటినుండి సంజ్ఞలద్వారానో, లిఖితపూర్వకంగానో తన అభిప్రాయాలను వెల్లడిస్తుండేవారు. ఎప్పుడూ పెదవి విప్పి మాట్లాడేవారు కాదు. అందువల్లనే వారిని 'మౌనస్వామి' అని సమస్త ప్రజానీకం పిలవడం ప్రారంభించింది. అయితే స్వామి వారు ఒకసారి మాత్రం మాట్లాడారు జిల్లెళ్ళమూడి అమ్మతో ఆమెకు 7 ఏండ్ల వయస్సులో.

అమ్మ బాల్యంలో తాతమ్మ మరిడమ్మగారితో కలిసి చీరాల వెళ్ళింది. ఆ సమయంలో మౌనస్వామివారు నూనె పానకాలుగారి తోటలో విడిది చేసి ఉన్నారు.

తాతమ్మతో కలసి అమ్మ మౌనస్వామిని చూడటానికి వెళ్ళింది. చూచి అందరూ తిరిగి వచ్చారు. మరుసటి రోజు అమ్మ ఒక్కతే వారి వద్దకు వెళ్ళింది. స్వామి వద్ద నుండి అందరూ భోజనాలకు వెళ్ళిన సమయం చూచుకొని దొడ్డి వాకిలిగుండా స్వామివారి వద్దకు వెళ్ళింది. అమ్మను చూచి స్వామి దగ్గరకు పిలిచారు. అమ్మ స్వామిని మౌనమంటే ఏమిటి? అని అడిగింది. అనవసరమైన మాటలు మాట్లాడకుండా ఉండటానికి మౌనం ఆధారం అన్నారు స్వామి. మీరుమన్నవలో వేసిన యంత్రం రాజరాజేశ్వరీ యంత్రమా? రాజ్యలక్ష్మీయంత్రమా? అని అడిగింది. నీకాసందేహం ఎందుకొచ్చింది? అన్నారు స్వామి. ఆ ఊళ్ళో ఒకళ్ళు రాజరాజేశ్వరి అనీ, మరొకరు రాజ్యలక్ష్మి అని అనుకుంటున్నారు అన్నది అమ్మ. రాజరాజేశ్వరీ యంత్రమే అన్నారు స్వామి. మీరు అసలు మాట్లాడతారో మాట్లాడరో అనుకుంటూ వచ్చాను అన్నది అమ్మ. నిన్ను చూడగానే మాట్లాడాలనిపించిందమ్మా! ఇంకొకటి గూడా అనిపిస్తున్నదమ్మా! నీవు దేదీప్యమానంగా వెలిగిపోతూ దర్శనమిస్తున్నావు నేనెవరికీ చెప్పను గాని నీవెవరు? అన్నారు. అప్పుడు అమ్మ అదిసరే గాని మీరు అందరికీ బాలమంత్రం ఇస్తుంటారా? అని అడిగింది. స్వామి ఆమాట పట్టించుకోకుండా నీ రాక చాల గోప్యంగా ఉంచుకుంటానమ్మా! నీతో మాట్లాడినట్లు తెలిస్తే వీరంతా ప్రాణాలు తీస్తారు. నేను మౌనం ప్రత్యేక సాధనగా పెట్టుకోలేదు. కొన్ని అవసరాలు అలా కల్పించినవి అన్నారు. మీరు బాల చెప్పిన వాళ్ళందరికీ నేను ఆజపం చెపుతానన్నది అమ్మ. స్వామీ ఆశ్చర్యపోయి అమ్మను చూస్తూ అక్కడున్న రుద్రాక్షమాలను అటునుండి ఇటూ, ఇటు నుండి అటు త్రిప్పుతూ ధన్యోస్మి ధన్యోస్మి అని. అజపమంటే ఏమిటమ్మా? అన్నారు. నోటితో ఉచ్చరించనిది అన్నది అమ్మ. అటువంటి దాన్ని ఎట్లా చెపుతావు? అన్నారు. చెప్పటమంటూ వచ్చినపుడు మాటలు లేకుండా ఎట్లా ఉంటాయి. చెప్పేటప్పుడు మాటలతో చెప్పినా చేసేటప్పుడు మాటలు లేకుండా చేసేది అన్నది అమ్మ. స్వామి ఎవరో వస్తున్న అలికిడికాగానే వెళ్ళమ్మా వెళ్ళు అన్నారు అమ్మను. ఎందుకువెళ్ళటం అన్నది అమ్మ. నా నిష్ఠకు భంగం అన్నారు స్వామి. నిష్ఠ అంటే ఏమిటి స్వామీ ? అని అడిగింది అమ్మ. నిష్ఠ అంటే అనుష్ఠానం అన్నారు స్వామి. ఇంతలో బయట నుండి తలుపులు తట్టటంతో అమ్మ మరొక వైపు నుండి బయటకు వచ్చింది.

ఇలా అమ్మకు మౌనస్వామికి మహత్తరమైన సంభాషణ జరిగింది. అమ్మ ఆ చిన్నప్పుడే మన్నవలో రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయానికి వెళ్ళినపుడు అమ్మవారి క్రింద ఉన్న యంత్రం మౌనస్వామి వేశారు అన్నారు. అందుకని అమ్మ మౌనస్వామిని ఆ యంత్రాన్ని గూర్చి ప్రశ్నించింది. తను చెప్పింది సత్యమని ఋజువు చేసింది. ఆ రోజులలో స్వామివారు చీరాల, బాపట్ల, మన్నవ, రాజమండ్రి ప్రాంతాలలో సంచరించి నట్లు కొన్ని చోట్ల దేవతా ప్రతిష్ఠలు చేసినట్లు దాఖలాలున్నాయి.

కుర్తాళం స్వామి దత్తమతాన్ని నెలకొల్పారు. స్వామివారు ఎన్నో మహిమలు చూపించారని వారి జీవితచరిత్ర చదివిన వారికి అర్థమౌతుంది. తమిళనాడు గవర్నరు ఇంగ్లీషు దొర తన సతీమణితో స్వామి దర్శనానికి రాగా రెండు గులాబీ దండలు యాపిలు పండ్లు సృష్టించి ఇచ్చారు. ఇసుక పట్టుకుంటే బంగారుమయ్యే సువర్ణవిద్య స్వామి కరతలామలకం. మౌనస్వామి మహాయోగసిద్ధుడు. 23.12.1943 పుష్యశుద్ధ పాడ్యమినాడు సిద్ధిపొందారు. వారి తర్వాత వచ్చిన పీఠాధిపతులలో శ్రీ శివచిదానంద భారతీస్వామి. శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి అమ్మవద్దకు వచ్చిన మహనీయులు.





2. వాసుదాస స్వామి

వాసుదాస స్వామి తెలుగులో 'రామాయణం' పద్యకావ్యంగా వ్రాశారు. ఆ కావ్యానికి 'మందరము' అనే పేరుతో వ్యాఖ్య వ్రాశారు. తెలుగులో రామాయణాన్ని వాల్మీకి మహర్షి చెప్పినది చెప్పినట్లుగా వ్రాసిన మహానుభావుడు, దానిని చక్కని వివరణ కూర్చి ఆంధ్ర ఆధ్యాత్మిక జీవులకు వాల్మీకి హృదయాన్ని అందించిన మహానుభావుడు శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు.

కడపజిల్లా జమ్ములమడుగు గ్రామంలో 23.1.1863న వావిలకొలను రామచంద్రరావు కనకాంబ దంపతులకు రెండవ కుమారునిగా పుట్టారు. తండ్రి వీరి 12వ యేటనే చనిపోవటంలో పినతండ్రి లక్ష్మాజీరావు చదువు సంధ్యలు నేర్పించారు. చిన్నప్పటి నుండి క్షయవ్యాధితో బాధపడేవారు. సంస్కృతాంధ్ర

ఆంగ్లభాషలను స్వయంగానే నేర్చుకున్నారు. యం.ఎ. చదువు మధ్యలోనే అనారోగ్యం వల్ల ఆపివేసి ప్రొద్దుటూరులో తాలుకాఫీసులో గుమాస్తాగా చేరారు. రంగనాయకమ్మను వివాహం చేసుకున్నారు. క్షయవ్యాధి ముదరటంతో ఉద్యోగం మానివేశారు. కడపలో నన్నేమియా సాహెబ్ అనే వైద్యుని వద్ద మందులు తీసికొని జబ్బు తగ్గించుకున్నారు. ఆ తర్వాత మద్రాసులోని హిందూ హైస్కూలులో తెలుగు పండితునిగా చేరి అక్కడే 1920లో రిటైరైనారు. అయినా ప్రభుత్వం ఇచ్చిన 'అనువాదకుని' ఉద్యోగంలో చేరి కొంతకాలం భాషా సేవ చేశారు. అప్పటికే 'కుమారాభ్యుదయము' 'కౌసల్యాపరిణయము' 'తల్పగిరి రంగనాయక శతకం' వంటివి వ్రాశారు.

తన 22వ యేట మొదలు పెట్టిన రామాయణాన్ని ఉద్యగ విరమణ సమయానికి పూర్తిచేసి శ్రీరామునకే అంకితం చేశారు. ఆర్యకథానిధి అని ఎన్నో భాగాలు వ్రాశారు. ద్విపద భగవద్గీత, రామకృష్ణలీలామృతము, హితచర్య వంటి గ్రంథాలెన్నో వ్రాశారు. 'ఆంధ్రవాల్మీకి' అనే బిరుదాన్ని పొందారు. వాల్మీకి రామాయణాన్ని 108 సార్లు పారాయణం చేశారు, 108 సీతారామకళ్యాణాలను, 108 శ్రీరామపట్టాభిషేకోత్సవాలను నిర్వహించారు. నిత్యాన్నదానయజ్ఞాన్ని, వైద్యశాలను రామసేవాకుటీరాన్ని ఏర్పాటు చేశారు. 'భక్తిసంజీవిని' అనే పత్రిక నిర్వహించారు. ఊరూరా తిరిగి రామభజనలు చేసి భిక్షాపాత్ర పట్టి ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని పునరుద్ధరించారు.


బహుశః నిత్యాన్నదానము, వైద్యశాల, భిక్షద్వారా రామాలయ పునరుద్ధరణ వంటి కార్యాలు సర్వాంతర్యామి అయిన అమ్మ మనసుకు బాగా పట్టాయనుకుంటాను. పినతండ్రి మన్నవ రామబ్రహ్మంగారితో తన 10వ యేటనే వాసుదాస స్వామిని చూడటానికి వెళ్ళింది. స్వామివారి కాళ్ళమీద పడి నమస్కారం చేస్తూ పది నిమిషాల దాకా లేవలేదు. స్వామి తలమీద చెయ్యి పెట్టి లేపి ముఖం వంక చూచి తల్లిలేని పిల్లవు కదా! అందరికీ నీ మీద ప్రేమ ఉండేటట్లు ఆశీర్వదించేదా!" అని అడిగారు. అందుకు అమ్మ "నా మీద ఎవరికి ప్రేమ ఉన్నా, లేకున్నా నేను అందరినీ ప్రేమించేటట్లు ఆశీర్వదించండి" అన్నది. అందుకుస్వామి "ఎందుకమ్మా అలా అన్నావు అందరిప్రేమ నీ మీద అక్కరలేకపోవటమేమిటి? నీకు అందరిమీదా ఉండాలనటమేమిటి?" అన్నారు.

అందుకు అమ్మ "అసలు ప్రేమంటే ఏమిటో తెలియాలంటే నాకుఉంటేనేగా తెలిసేది. ఇతరులకు ఉంటే నాకేమి అర్థమౌతుంది" అన్నది. అప్పుడు స్వామివారు "పోనీ నీకేం కావాలో చెప్పమ్మా? అన్నారు. దానికి అమ్మ "ఏమన్నా కావాలనేది అక్కరలేకుండా కావాలి" అన్నది.

స్వామివారు "ఏ పండ్లు కావాలి నీకు ? అని యేవో పండ్లివ్వబోయారు అమ్మకు. అమ్మ ఏ పండూ వద్దు అంటుంది. అంటే "అన్ని పండ్లూ తింటావా?" అని అడిగారు. "ఆ అందరిపండ్లూ తింటాను" అన్నది అమ్మ. అమ్మ ఇచ్చే యీ సమాధానాలకు ఆశ్చర్యపోయిన స్వామివారు "నా ఎదురుగుండా వచ్చి నిలుచో! అని అమ్మను కన్నార్పకుండా అయిదు నిమిషాలు పెద్ద పెద్దకళ్ళు చేసి చూసి నాభి దగ్గర నుండి షడ్జమస్థాయి అందుకునేటట్టుగా పెద్దగా "రామబ్రహ్మం" అని పిలిచారు. అమ్మలో వారు ఉపాసించే శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చేసరికి ఆనందంతో అంతటి శబ్దం వచ్చింది.

రామబ్రహ్మం అన్న పెద్దకేకకు అమ్మ పినతండ్రి రామబ్రహ్మం గారు వచ్చి పిలిచారా అని అడిగారు. నిన్ను కాదు నాయనా ! మన రామబ్రహ్మాన్ని అంటూ తన మెడపై వేలాడుతున్న రాముని బిళ్ళను చూపించారు. అమ్మాయిని చూస్తూ కేక వేశారెందుకు? అని అడిగారు. అందుకు స్వామి "అది నేను చెప్పేదీ కాదు. మీరు వినేది కాదు. ముందు ముందు అనుభవంతో– మీకే తెలుస్తుంది" అంటూ అమ్మకోసం చేతులు చాచారు రమ్మని. అమ్మ వాసుదాసస్వామి చేతుల్లో వాలిపోయింది. అమ్మను పొట్టను కరిపించుకొని అమ్మ నొసట ముద్దుపెట్టుకున్నారు. అమ్మ అక్కడి నుండి ఊరికి బయలుదేరగా స్వామివారు కంటితోనే నమస్కారం చేస్తూ రాముడే బాలగా వచ్చాడా అనుకున్నారు.

అమ్మ స్వామి వద్దకు వెళ్ళే నాటికి వారి వయస్సు 70 సంవత్సరాలు అంటే 1933లో ఆ తర్వాత వారు 1.2.1936న అమ్మలో కలిసిపోయారు.



3. కల్యాణానందభారతీస్వామి

శ్రీ శృంగేరీ విరూపాక్ష పీఠాధిపతులు శ్రీ కల్యాణానందభారతీస్వామివారితో అమ్మ తన యేడవ సంవత్సరములో గుంటూరులో సంభాషించింది. బి.ఏ.స్వాముల వారుగా, ప్రతివాదభయంకరులుగా, పరమహంస, పరివ్రాజకాచార్యులుగా, జగద్గురువులుగా, వేదాంత విజ్ఞాన సంపన్నులుగా ప్రసిద్ధులైన స్వామివారు అమ్మను చాల ఇష్టపడి తన వద్ద ఉండమని కోరారు.

కల్యాణానందభారతీస్వామివారి పూర్వనామం కామేశ్వరశర్మ, కామేశ్వరీదేవి వారింటి దేవత. పేరూరు ద్రావిడశాఖకు చెందిన వారు. తల్లిదండ్రులు పార్వతీదేవి చినకామేశ్వరశాస్త్రి. కామేశ్వరశర్మ 1882 మాతామహుల ఇంట గోదావరి జిల్లా ఏకతాళ అగ్రహారంలో ఒంటితాడిలో చిత్రభాను నామ సంవత్సర వైశాఖ శుద్ధ అష్టమి మంగళవారం జన్మించారు. సుప్రసిద్ధ వైయాకరణ సార్వభౌమ, కలాప్రపూర్ణ, మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రి (రాయుడుశాస్త్రి) వీరికి మేనమామ. చిన్నతనంలోనే సంస్కృతాంధ్ర ఉర్దూ భాషలలో ఆరితేరారు. పెదతండ్రిగారు భీమునిపట్నంలో వైద్యవృత్తి చేసేవారు. వారి వద్ద వైద్యవిద్యా రహస్యాలు గ్రహించారు. కామేశ్వరశర్మ 11వ యేటనే ద్రావిడ సంప్రదాయానుసారం శ్రోత్రియ

టుంబానికి చెందిన కన్యకిచ్చి వివాహం చేశారు. వివాహమైన అయిదవ రోజుననే తల్లి మరణించింది. దానితో గార్హత్య జీవిత మందు విరక్తి ఏర్పడింది. 1896లో ఏముని పట్నంలోనే హైస్కూలు విద్యలో చేరి 1897లో విజయనగరంలో పెదతల్లి వద్దకు వెళ్ళి అక్కడే 1905 నాటికి బి.ఎ. పట్టభద్రులైనారు.

గొప్ప ఉపాసకులైన రాణి మహాగ్ని చిన్న నృసింహచయనుల వారి వద్ద మంత్ర దీక్ష పొందారు. శ్రీ విద్యోపాసన, ఉపనిషత్తులు, గీత అభ్యసించారు. మేనమామ రాయుడు శాస్త్రి గారి వద్ద భాష్యశాంతి చేశారు. చదువుకునే రోజులలోనే రాజమండ్రి హిందూ సమాజం వారు నిర్వహించిన గీతాపరీక్షలో ప్రధములుగా వచ్చారు. ఆ తర్వాత పూర్ణదీక్షాపరులైనారు. మంత్రశాస్త్ర రహస్యాలు తెలుసుకున్నారు. మంత్రశాస్త్ర గురువైన చయనులు గారు వీరి శ్రద్ధను గుర్తించి మంత్రశాస్త్ర రహస్యాలన్నీ నూరిపోశారు.

క్రైస్తవుల ప్రచారాన్ని ఎదుర్కోవటానికి బైబిల్ చదివారు. బ్రహ్మ సమాజ ప్రబోధాలను, ఆర్యసమాజ విజ్ఞానులను, దివ్యజ్ఞానమార్గీయులను ఎదుర్కొని ప్రతివాదిగా వైదికమత ప్రాశస్త్యాన్ని నిలబెట్టటానికి ఎన్నో ఉపన్యాసాలిచ్చారు.

రాణి మహాగ్ని చిన్న నృసింహమూర్తిగారు భార్యవియోగంతో వైరాగ్య చిత్తులై సచ్చిదానంద భారతీస్వామి వద్ద యధావిధి సన్యాసం స్వీకరించి బోధానందభారతులుగా శృంగేరీ విరూపాక్ష పీఠాన్ని అధిరోహించారు. అమలాపురంలో ఉన్న ఆస్వామి వారి వద్దకు 1907లో కామేశ్వరశర్మ వెళ్ళి తాము కూడా యత్యాశ్రమ స్వీకరాన్ని సంసిద్ధతను వ్యక్తం చేశారు. అప్పుడు అంగీకరించని బోధానందులు కొన్నినెలలోనే అనారోగ్య వంతులైనారు. అక్కడి పండితులందరినీ రావించి కామేశ్వరశర్మ అధికారమును మీరంతా పరీక్షించి నిర్ణయింపమని కోరగా, వారంతా పరీక్షించి కామేశ్వరశర్మకు పరివ్రాజకత్వము నిచ్చి కల్యాణానందభారతీస్వామిగా యోగపట్టా ప్రసాదించిరి. బోధనాంద ఆరోగ్యము కుదుటపడింది. కళ్యాణానందులు 1908 నుండి 1919 వరకు పేరూరులోనే ఉంది సకల శాస్త్రపారంగతులైనారు.

తరువాత వివిధ పట్టణాలలోని వారు కల్యాణానందభారతీస్వామి ప్రవచనాలు వినదలచి 1919 నుండి 1923 మధ్యకాలములో విజయవాడ, గుంటూరు, తెనాలి, బాపట్ల పట్టణాలలో ఆధ్యాత్మ జిజ్ఞాసువులు వారిని

ఆహ్వానించారు. ఆ సమయములోనే గుంటూరులో సభలు జరుగుచుండగా గురుదేవులు బోధానందభారతీస్వామి వృద్ధులగుటచే పీఠాధిపత్య బాధ్యతను కల్యాణానందభారతీస్వామికి అప్పగించి పట్టాభిషేకము 23.12.1923 న జరిపారు.

గుంటూరులో కల్యాణానందుల భాష్యపాఠాన్ని విన్న శిష్యులు శ్రీ పొన్నాడ రామకోటిగారు స్వామివారి పీఠాన్ని గుంటూరులో పెట్టమని ప్రార్థించి స్థలమును సమకూర్చారు. స్వామి 1932లో శ్రీ సదనము పేర ఏర్పాటైన ఆ భవనములో విద్యాశంకరులను, శ్రీ రాజరాజేశ్వరీదేవిని ప్రతిష్ఠించారు. అక్కడ నిత్యము శాంకర శారీరక మీమాంసా భాష్య ప్రవచనాలు స్వామివారు చేసేవారు నాడు నలుబది మందికి పైన శిష్యులు ఆ ప్రవచనలు వినటానికి వచ్చేవారు. అందులో మహామహోపాధ్యాయ జమ్ములమడక మాధవరామశర్మ, ఉభయభాషా ప్రవీణ, వేదాంతపారీణ శ్రీ మిన్నికంటి గురునాధశర్మ, న్యాయవాదులు రాయప్రోలు లింగన సోమయాజులుగారు వంటివారెందరో వచ్చేవారు. బ్రహ్మశ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రిగారు కూడా స్వామి ఆజ్ఞతో ప్రవచనాలు చేస్తూ ఉండేవారు.

స్వామివారు ఆధ్యాత్మిక మార్గాన్వేషులకు ఉపయోగపడే నిమిత్తం శతానేకంగా గ్రంథాలు వ్రాశారు. అందులో బ్రహ్మసూత్ర సంజీవీని, శారీరక మీమాంసా సంగ్రహః, కల్యాణగీతా, రహస్యగీతా, కల్యాణశ్రీకల, శ్రీకలాదర్శనమ్, శ్రీవిద్యాదర్శనమ్, శ్రీ చక్రదర్శనమ్, వనదుర్గోపాసనావిధి, శ్రీ గుణనికాదీధితి, మహారుద్రయాగత్రయమ్ వంటి 50 సంస్కృత గ్రంథాలు – ఆత్మబోధ, శ్రీవిద్య, కామకల, అనుభూతి ప్రకాశిక వంటి 32 తెలుగు గ్రంథాలు, థియోసోఫీ అన్‌వీల్డ్, కామకల అండ్ మాజిక్ స్క్వేర్స్, థియోసఫీ అండ్‌ట్రూత్, ది డెవలప్‌మెంట్ ఆఫ్ రేసెస్ అండ్ నేషన్స్, మనుస్మృతి సార వంటి 21 ఇంగ్లీషు గ్రంథాలు వ్రాశారు.

అమ్మ 1923లో ఆవిర్భవించింది. అప్పటికే 41 సంవత్సరాల వయస్సున్నవారు శ్రీ కల్యాణానందభారతీస్వామివారు. అమ్మ తన 7వ యేట అంటే 1930లో గుంటూరులో స్వామివారితో సంభాషించింది. ఆ సంభాషణకు ముగ్ధులై అమ్మలోని ప్రత్యేకతను గుర్తించారు. ఆ సంభాషణ సారం ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

లోకంలో సత్యసందర్శనం చేసిన వారెందరో ఉండవచ్చు. అమ్మలోని మానవాతీశక్తులను గుర్తించి అమ్మలోని అద్వైతదీప్తికి అచ్చెరువు చెందిన మహనీయులు ఎందరో ఉన్నారు. వారిలో మహనీయులైన పీఠాధిపతులు ఉన్నారు, పండితులు ఉన్నారు. మౌనస్వామి, వాసుదాసస్వామి, రెడ్డిపాలెం కాంతయ్యయోగి, అవధూతేంద్రసరస్వతి వంటివారు. వారి వారి మార్గాలలో అత్యున్నత స్థానాలను అలంకరించిన వారున్నారు. అతి సామాన్య మానవులు అమ్మ వద్దకు వచ్చి అచిరకాలంలోనే తమ జీవితాలను చరితార్థం చేసుకొన్న వారున్నారు. శ్రీ కల్యాణానందభారతీస్వామి వారితో అమ్మ చేసిన సంభాషణ ఎందరికో మార్గదర్శనం చేస్తుంది. గమనించండి. స్వామివారు 1955లో గుంటూరులో సిద్ధిపొందారు.

అమ్మ తనయేడేళ్ళ వయసున్నప్పుడు మరిడమ్మ తాతమ్మతో కలసి గుంటూరు వెళ్ళింది. ఆరోజులలో రోడ్డు మీద వెళుతుంటే పురాణపఠనం వినిపించి లోపలకు వెళ్ళింది. అది కల్యాణానందభారతీస్వామివారి ఆశ్రమం. 30 రోజులువరుసగా ఆస్వామివద్దకు వెళ్ళిన తర్వాత 31వ రోజున స్వామివారు అమ్మను దగ్గరకుపిలిచి నీవెవరు? అని అడిగారు. నేనెవరో నాకు తెలియకే తెలుసుకుందామని వచ్చాను అన్నది అమ్మ. మీదే కులము ? మంత్రం చెప్పించుకుంటావా? అని అడిగారు స్వామి. ఎందుకు? అన్నది అమ్మ. నేనెవరో తెలుసుకుందామని వచ్చానన్నావుగా ! అన్నారు. దానికి మంత్రమే కావాలా? అసలు మంత్రమంటే ఏమిటి? కొన్ని అక్షరాలకు శక్తియిచ్చి మాబోటివారు రహస్యంగా మీకు చెప్పేది మంత్రం అన్నారు స్వామి. మీకు యిచ్చేశక్తి ఉంటే గడ్డిపోచకు కూడా శక్తి ఇవ్వవచ్చు గదా! అని అమ్మ అంటే "చిన్నపిల్లవునీకెందుకివన్నీ" చెప్పించుకో మంత్రం అంటూ అన్నిపూలల్లో ఏది మంచి వాసన అని అడగ్గా ఎవరికేది ఇష్టమయితే అది వారికి మంచి వాసన అన్నది అమ్మ. తరుణం వచ్చినపుడు మంత్రం చెప్పించుకుంటాను. తరుణం అంటే తప్పించుకుందామన్నా తప్పనిది, చేద్దామన్నా చేయలేనిది. వీటిన్నిటీ నడిపించేది. ఆ తరుణం వచ్చింది కనుక ఇప్పుడు మీ దగ్గరకు వచ్చాను నాయనా ! అన్నది అమ్మ. నాయనా ! అంటూన్నావేమిటి? అని స్వామి అడగ్గా అది నావిధి అన్నది అమ్మ. విధి అంటే ఏమిటి? అన్నారు స్వామి. విధానమే విధి – విధే విధానము, విధికర్త; విధానము కర్మ అన్నది అమ్మ. మరి మంత్రం చెప్పేదా అన్నారు స్వామి. మంత్రాన్ని గూర్చి మీరు చెప్పిన వివరణ చాలలేదు అన్నది అమ్మ. పోనీ నీవు

చెప్పు ? అన్నారు స్వామి. నేనెవరైై చెప్పాలి అన్నది అమ్మ. ఏం చదువుకున్నావ్ నీవు ? అని స్వామి అడగగా బడికిపోలేదు ఈ బడికే వచ్చా అన్నది. ఏమన్నా పెడితే తింటావా ? అని అడిగారు స్వామి. చీవాట్లు పెడితే తినను, కొడితే పడను అదీ నన్నడిగి చేస్తే అన్నది అమ్మ. నీకే పండు ఇష్టం ? అడిగారు స్వామి. తింటే తరగని పండు, ఎప్పుడూ తినే పండు తలపండు అన్నది అమ్మ. తరువాత పంపరపనసపండు తెచ్చి స్వామికిచ్చి నమస్కారం చేయబోగా 'మొత్తం మీద తలపండంత పండు తెచ్చి ఇచ్చావమ్మా' అంటూ స్వామి నేనడిగింది చెపుతావా ? అన్నారు స్వామి. మీరడిగేది నాకర్థమైన దాన్ని బట్టి చెపుతాను అన్నది అమ్మ. ఎందుకు అర్థంకాదు అన్నారు స్వామి. నేను మీరు కాలేదు కనుక. నేను మీరయినప్పుడు సర్వమూ అవుతాను అన్నది. ఆ సమాధానములకు స్వామి అమ్మను దగ్గర తీసుకొని తన గుండెలకు హత్తుకొని, నీవు నాదగ్గరుండాలమ్మా ! అన్నారు. నేనుండలేను కాని మీరుంచుకోండి అన్నది అమ్మ. నీవు బాల రాజరాజేశ్వరివా ? అని స్వామి అడుగగా అంటే చిన్న రాజరాజేశ్వరిని అనా? అడగగా. కాదమ్మా ! అన్నీ ఆమే అన్నారు స్వామి. మరి రెండు మాటలెందుకు అన్నది అమ్మ. ఒకే వస్తువు అన్నిరూపాలు అయింది కనుక అన్నారు స్వామి. అప్పుడు అమ్మ అదే అన్నింటికీ ఆధారమయితే, కాగితంపై కలం పెట్టే చుక్క ఘర్షణకాదా? ఇదే శాస్త్రమని మీ ఉద్దేశమా? మంత్రమంటే మనస్సు. బీజాక్షరాలంటే శబ్దము. శబ్దము యొక్క స్థాయికే అక్షరాలు నాయనా ! అన్నది. తర్వాత స్వామి పాయసం తెప్పించి అమ్మకిచ్చి అమ్మ తాగుతుండగా నాకూ కొద్దిగా యివ్వవూ అని అడిగారు. కొద్దిగా ఎలా సరిపోతుంది. ఇంకొక గ్లాసుతెచ్చి ఇస్తానన్నది. సగం సరిపుచ్చుకుంటాను ఇవ్వమ్మా ! అన్నారు. తృప్తి గల మనస్సు లేక కొద్ది దాన్ని ఎక్కువ చేస్తారా ? అని అడిగింది అమ్మ. తృప్తి అంటే ఏమిటి? అని అడిగారు స్వామి. ఇంతకంటే మరొకటి లేని స్థితి అన్నది అమ్మ. అబ్బా ! ఏమన్నావమ్మా! మీ ఊరేది ? మీ తల్లిదండ్రులెవరు? అని అడిగారు స్వామి. అమ్మ పేరు ఆధారం, నాన్నపేరు అవకాశం అన్నది అమ్మ. వాళ్ళకు వేరే పేర్లు లేవా? అని స్వామి అనగా ఆధారమనేది పేరే కదా ! సర్వమూ ఆధారము మీదనే ఆధారపడి ఉన్నది కనుక ఆధారం సర్వసాధారణమైంది అన్నది అమ్మ. అయితే విశేషము లేదా? అన్నారు స్వామి. ఆ శక్తికి విశేషము లేదు అన్నది అమ్మ. నీ యదార్థస్థితి చెప్పమ్మా ? అన్నారు స్వామి.

'యదార్థమే నా స్థితి' అన్నది అమ్మ. అలా కల్యాణానందభారతీస్వామితో సంభాషణ సాగించిన అమ్మ బయలుదేరుతూ స్వామికి నమస్కారము చేయబోగా స్వామి నమస్కారం చేయనియ్యకుండా చేతులు పట్టుకున్నారు. చేతుల కలయికే కాదుగా నమస్కారమంటే అన్నది అమ్మ. ఈ మాటకు ఆస్కారమేమిటి? అన్నారు స్వామి. 'సంస్కారమే ఆస్కారము' అని స్వామితో ఆశీర్వదించండి బాబూ ! అయినా ఆశీర్వచనము అడిగేది చెప్పేది కాదు సంప్రదాయ ప్రకారం అడిగాను అని బయలుదేరింది స్వామి వారి వద్దనుండి.

అమ్మ స్వామివారికి సమాధానాలు చెప్పినట్లుగా ఉన్నా మనందరికీ మంత్రమంటే ఏమిటో, తృప్తి అంటే ఏమిటో, సంస్కారమంటే ఏమిటో, ఆధారమంటే ఏమిటో, విధి అంటే ఏమిటో వంటి మరెన్నో విషయంలో పండు వలచినోట్లో పెట్టినట్లు చెప్పి, భౌతికంగా తానుండటం కాదు తనను నిరంతరం మన మనస్సులలో ఉంచుకోవాలి అని స్పష్టంగా చెప్పింది.





4. రఘువరదాసు

అవధూతేంద్ర సరస్వతీస్వామిగా లోకంలో ప్రసిద్ధులైన రఘువరదాసుగారి అసలు పేరు పెమ్మరాజు విశ్వేశ్వరరావు. వారిది పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం దగ్గర ఉన్న అత్తిలి గ్రామం. వినికిడి ద్వారానే సంగీతం వంటి బట్టింది. స్వయంకృషితో కర్ణాటక సంగీతాన్నీ, హైదరాబాదులోనూ, గ్వాలియార్‌లో హిందూస్థానీ సంగీతాన్నీ కూలంకషంగా అవగాహన చేసుకున్నారు.

శ్రీరాముడంటే ఎంతో ఇష్టం. బ్రహ్మచారిగానే అయోధ్యలో రామజన్మస్థలిని దర్శించారు. అక్కడే ఒక మహాత్ముని ద్వారా రామమంత్రాన్ని ఉపదేశం పొందారు. నిత్యం సరయూనదీలో స్నానం చేసి, రామమంత్రజపమూ ధ్యానములు చేసి మంత్రపునశ్చరణ చేశారు. శ్రీరామదర్శనం పొందారు. దానితో వైరాగ్య భావం అంకురించింది. మంత్రోపదేశం చేసిన గురుదేవులిచ్చిన "రఘువరదాస్" నామంతోనే ప్రయాగలో ఉన్న ప్రభుదత్త బ్రహ్మచారి ఆశ్రమానికి వెళ్ళారు. అక్కడ నిత్య సంకీర్తనలో పాల్గొన్నారు. వారితో వారి బృందంలో చేరి తీర్థయాత్రలు చేస్తూ సంకీర్తనలు చేస్తూ కొన్ని నెలలు గడిపారు. ఉత్తర భారతదేశంలో రఘువరదాసు పేరువినని వారు ఆధ్యాత్మిక రంగంలో లేరంటే అతిశయోక్తి కాదు.

ఆ రామనామామృతాన్ని తన రాష్ట్ర ప్రజలకు కూడా అందించాలని ఆంధ్రదేశానికి వచ్చారు. మొదటిసారిగా 1954లో గుంటూరుజిల్లాలోని మట్టిపూడిలో రామనామసప్తాహాన్ని నిర్వసించారు. 1952లోనే అవధూతగా అప్పికట్లలో అమ్మను చూచినా 1954లో రామనామచింతనలో నిరంతరం కాలం గడుపుతూ ఒకరకమైన తాదాత్మ్యస్థితిలో సంచరిస్తూ జిల్లెళ్ళమూడి చేరారు. అప్పుడు అమ్మ వారిని భిక్షకు పిలిచి వారి కాళ్ళు కడుగబోగా అమ్మలో ఏమి దర్శనమైందో కాళ్ళు కడుగనివ్వక హైమమ్మ చేత కడిగించుకున్నారు. అమ్మ పెట్టిన ఆనాటి అన్నపు ముద్దల ప్రభావమేమో తెలియదు. అమ్మ యెడల భక్తి విశ్వాసము. అమ్మకు వారిపైన అపారమైన వాత్సల్యము. ఆనాడు అమ్మ - వారితో "నాన్నా! నీకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు వచ్చి నీ అమ్మ దగ్గర ఉండవచ్చు. ఇక్కడ నీ తల్లి ఉన్నదన్న విషయం మరిచిపోకు" అని చెప్పింది. అమ్మ చెప్పిన ఆ మాట మంత్రమై పనిచేసింది. చాలాసార్లు అమ్మవద్దకు వచ్చారు. తన మనో వేదనలెన్నో అమ్మతో చెప్పుకొని తృప్తిపడేవారు. అమ్మ మంచంపై, అమ్మ ఒడిలో పడుకొని పరవశం చెందేవారు. తన రాముడే తనను దగ్గరకు తీసుకోవటానికి యీ రూపంలో ఉన్నాడని భావించేవారు. అమ్మ అన్నం కలిపి ముద్దలు నోటి కందించేది, పండ్లు తినిపిస్తూ తానూ ఆనందించేది. ఆ ఆనంద పారవశ్యంలో వయస్సు ప్రభావం కనిపించేది కాదు. భగవంతుడికి, భక్తుడికీ మధ్య ఎంత మధురబంధం ఉండేదో కాని తల్లీబిడ్డల మధ్య మాత్రం ఆ వాత్సల్యబంధం అత్యంత శక్తివంతమైనది.

అమ్మను సిద్ధపురుషులెవరితోనూ పోల్చటానికి రఘువరదాసుగారు ఇష్టపడేవారు కాదు. 1954లో మట్టిపూడిలోనే సప్తాహం చివరలో సన్యాసదీక్ష తీసుకోవాలని ఆలోచన వచ్చింది. నిజానికి వారు అప్పటికి సన్యాసజీవితం గడుపుతూనే ఉన్నారు. ఏమైనా మనసులో ఆ ఆలోచన వచ్చింది గనుక శ్రీ సదాశివేంద్ర సరస్వతీస్వామివారి ద్వారా యత్యాశ్రమాన్ని స్వీకరించి "శ్రీ అవధూతేంద్రసరస్వతీస్వామిగా" యోగపట్టా పొందారు.

వంగదేశంలో శ్రీ చైతన్యప్రభువు మాదిరిగానే తెలుగునేలపై అవధూతేంద్ర సరస్వతీస్వామివారు కూడా భక్తి సంకీర్తనలో మైమరచి నృత్యం చేస్తుంటే జనమంతా తన్మయులై పోయేవారు. తెలుగునాట ఆనాడు గ్రామగ్రామానా రామనామ

మధురభక్తి సంకీర్తన మారుమ్రోగిపోయింది.

ఆ రోజులలో రఘువరదాసుగారి సంకీర్తన జరుగుతున్నదంటే ఎన్నో గ్రామాల నుండి రెండెడ్ల బండ్లు కట్టుకొని వందల వేలజనం పాల్గొనటానికి వచ్చేవారు. ఈ ఆంధ్రదేశంలో ఒక సంకీర్తనాచార్యునిగా వారి పేరు మారుమ్రోగిపోయింది. ఈ నాటికీ వారి శిష్యరికంలో తయారైన ఎంతో మంది తమ సంకీర్తన సమాజాలతో జనాళిని పరవశింప చేస్తున్నారు. ఏకాహాలు, సప్తాహాలు వారు పెట్టిన భిక్షే.

సామాన్యంగా ఏమిటి? ఎన్నడూ రామనామం తప్ప మరొక నామం చేయని రఘువరదాసుగారు 'జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి" అనే నామాన్ని చేశారంటే లోకమంతా ఆశ్చర్యపోయింది. ఈనాడు ఆంధ్రదేశంలో తులసీదాసు రచించిన 'హనుమాన్‌చాలీసా' వాడవాడలా పారాయణ జరుగుతున్నదంటే కారణం ఆ మహానుభావుని ప్రచార ప్రభావమే.

పరమభాగవతోత్తముడు, నామయోగి, అపరచైతన్యమహాప్రభువు, ఆధ్యాత్మిక జనారాధ్యుడు, సంకీర్తనాప్రియుడు అయిన శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామివారు 11.6.1975లో అమ్మలో ఐక్యమైనారు. అమ్మ అనురాగాన్నీ, అనుగ్రహాన్నీ పొందిన అదృష్టవంతుడు స్వామివారు.

జిల్లెళ్ళమూడిలో వారి శిష్యబృందం వారు "అవధూతేంద్రభక్తసమాజము" పేరుతో సప్తాహాలు నిర్వహించారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం వచ్చి నిర్వహిస్తున్నారు. వారి శిష్యులు జిల్లెళ్ళమూడిలో జరిగే అఖండనామ సంకీర్తన యజ్ఞంలో పాలుపంచు కుంటున్నారు. వారి సంకీర్తనా నామాలహోరు ఆంధ్రాకాశంలో సంచరిస్తూ భక్తులను చైతన్యపరుస్తూనే ఉంటాయనటం సత్యదూరం కాదు.



5. రెడ్డిపాలెం కాంతయ్య యోగి

కాంతయ్య యోగి గారి అసలు పేరు లక్ష్మీకాంతయ్య. యోగాభ్యాసం బాగా చేసినందువల్ల కాంతయ్య యోగి అయినాడు. గుంటూరుజిల్లా లోని చేబ్రోలుకు దగ్గరగా ఉన్న రెడ్డిపాలెం వారి ఊరు. కొమ్మరాజు చిన్నంరాజు కామేశ్వరమ్మ దంపతుల పెద్దకుమారుడు లక్ష్మీకాంతయోగి, 1887 పుష్యబహుళ ఏకాదశి పుట్టాడు. గుంటూరులో మెట్రిక్యులేషన్ దాకా చదివి డ్రాఫ్ట్యుమెన్ కోర్సు పూర్తిచేశారు. సంస్కృతాంధ్రాంగ్ల హిందీభాషలలో చక్కని ప్రావీణ్యం సంపాదించారు. ఆ రోజులలోనే ప్రాణాయామసాధన చేశారు. రాగయుక్తమైన కమ్మని కంఠం ఉండటంతో హరికథలు, పురాణాలు చెప్పేవారు. నాటకాలలో కూడా వివిధ పాత్రలు ధరించి మహానటులైన హరిప్రసాదరావు మెప్పుపొందారు. ఆయుర్వేద వైద్యంలో నిష్ణాతుడై వైద్యునిగా మంచి పేరు పొందారు. మంత్రశాస్త్రంలో మంచిదిట్ట. మంత్రదేవత లెందరో ఆయన అదుపులో ఉండేవారు. తేలు మంత్రం, పాము మంత్రం వంటివి ప్రయోగించి ఎందరికో వాటి బాధను తొలగించేవారు. ఈశ్వర శతకం, మానసబోధ, విజ్ఞానాంజలి, దక్షిణామూర్తి స్తోత్రము, త్రిపురా రహస్యము, భగవద్గీత వ్యాఖ్యానం వంటివి 23 గ్రంథాలు రచించారు. భజన కార్యక్రమాలు, సప్తాహాలు జరిగే చోట కాలికి గజ్జెకట్టి నర్తించేవారు.

కొత్తరెడ్డిపాలెంలో శ్రీ చంద్రశేఖరానంద సరస్వతి స్వామివారు 'ఆనందాశ్రమం' స్థాపించారు. వారికి అత్యంత ప్రియశిష్యులైనారు. 1916లో

స్వామివారు సిద్ధి పొందుతూ ఆశ్రమ బాధ్యతలు కాంతయ్య యోగిగారికి అప్పగించారు. కర్మ, భక్తి, జ్ఞాన యోగాలను సొంతం చేసికొని ఆధ్యాత్మిక లోకానికి జ్ఞానభిక్ష పెట్టేవారు. ఒకసారి భద్రాచలం పోయి వచ్చిన తర్వాత భార్య అనసూయమ్మ స్వర్గస్థులైనారు. అనంతరం యోగిగారు నిరంతర భగవధ్యాసలో గడపసాగారు. ఆనందాశ్రమంలో ఆంజనేయాలయాన్ని నిర్మించి ప్రతిష్ఠించారు. అలాగే నర్సరావుపేట దగ్గర నకరికల్లులో విశ్వనాథస్వామి ఆలయాన్ని ఏర్పాటు చేశారు. పొన్నూరు దగ్గర కసుకుర్రులో బాలకోటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం ప్రతిష్ఠ దగ్గరుండి జరిపించారు. గంగినేని గ్రామంలో వీరాంజనేయ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆనందాశ్రమంలో గాయత్రీ అమ్మవారినీ, మేధాదక్షిణామూర్తినీ, దత్తాత్రేయస్వామినీ ప్రతిష్ఠించి నిత్యపూజలు ఏర్పాటు చేశారు.

కంచికామకోటిపీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామివారు, అవధూత పిచ్చమ్మ, కుర్తాళం సిద్ధేశ్వరీపీఠాధిపతులు, జిల్లెళ్ళమూడి అమ్మ ఈ ఆశ్రమాన్ని దర్శించిన మహనీయులు.

మరిడమ్మ తాతమ్మ – చేబ్రోలులో ఉన్న సుబ్బాయ్మగారు ఇద్దరు గుంటూరు మల్లెల రత్తమ్మగారి దగ్గర మంత్రోపదేశం పొందినవారు. సుబ్బాయమ్మ చనిపోయినదని వార్త రావటంతో తాతమ్మ చేబ్రోలు వెళ్ళింది. తాతమ్మ వెంట అమ్మ కూడా వెళ్ళింది. ఆ సందర్భంలోనే ఒకరోజు రెడ్డిపాలెం కాంతయ్య యోగిని దర్శించటానికి చాలామంది వెళ్ళుతుంటే తాతమ్మ అమ్మ కూడా వెళ్ళారు. ఆ రోజు సాయంత్రం ఆనందాశ్రమంలో కాంతయ్యగారు తంబురా తీసుకొని నామసంకీర్తన ప్రారంభించారు. సంగీత సాహిత్యాలలో పండితులైనవారు ఆర్తితో మధురంగా సంకీర్తన చేస్తుంటే అందరూ తన్మయులైనారు. కాంతయ్య బాబుగారు కూడా పరవశులై అశ్రునయనాలతో నిశ్చలతను పొందారు. వారి శిష్యురాలు కోటంరాజు భాగ్యమ్మగారు ఎన్నో పాటలు వ్రాశారు. అమ్మ ఆ పాటలు వినటం, చదవటం వల్ల భాగ్యమ్మ గారంటే అమ్మకు ఎంతో మంచి అభిప్రాయం ఏర్పడింది. అమ్మ ఆమె దగ్గరకు వెళ్ళి పలకరించింది. "ఎవరమ్మాయివి?" అని అడిగింది భాగ్యమ్మగారు. నేను "అందరి మాయిని అమ్మాయిని అయి ఉండాలనుకుంటాను" అన్నది అమ్మ. "అబ్బో అబ్బో" అని భాగ్యమ్మగారు అమ్మని దగ్గరకు తీసుకొని తల నిమురుతూ బాబుగారి దగ్గరకు తీసుకెళ్ళి "ఈ అమ్మాయిని చూచారూ !

ఎంతముద్దుగా ఉన్నదో ! మాటలు అంతకంటే ముద్దుగా ముచ్చటగా ఉన్నాయి" అని చెప్పింది. ఓహో ! అట్లాగా ! ఎవరమ్మాయి ? అంటూ అమ్మ వంక చూచారు అమ్మలో వారికి ఏమి సాక్షాత్కారమైనదో అలాగే అనిమేషులయి నిశ్చేష్టులయినారు. అక్కడ నుండి బయలుదేరుతూ అమ్మ అక్కడ ఉన్న తులసీదళాలు కోసుకుంటుంటే "అమ్మాయి! తులసి చెట్టును తాకకు" అని కసిరారు ఎవరో ! "తులసి చెట్టు అంత అంటరానిదా?" అని కాంతయ్య బాబుగారి వంక చూసి నవ్వింది అమ్మ. అమ్మా ! అని బాబుగారు చేతులు చాచారు తన వద్దకు రమ్మని. అప్పటికే అమ్మ పరిగెత్తి, కనుమరుగయింది. అప్పుడు అమ్మకు తొమ్మిది సంవత్సరాలే అంటే 1932 ప్రాంతంలో నన్నమాట.

ఆ తర్వాత 25 సంవత్సరాలకు 1957 లో జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించారు. అప్పటికి నాలుగు దశాబ్దాలపై చిల్కుగా యోగసాధన చేసి మహనీయునిగా లోకంలో ప్రసిద్ధులై ఉన్నారు. వారు స్వయంగా చెప్పిన మాటలు వినండి. "నేను షుమారు ముప్పది సంవత్సరములు తెలిసియో తెలియకయో ఏకాంతంగా శ్రీదేవీ దివ్య కటాక్ష ప్రాప్తికై చేసిన సాధన ఫలితంగా కొద్దో గొప్పో అనుభవాన్ని పొందినవాడిగా ప్రథమంగా జిల్లెళ్ళమూడి అమ్మను చూచినపుడు అమ్మయందు కొన్ని దివ్యశక్తులు నాకు గోచరించాయి. అప్పుడు అమ్మ 'రాజరాజేశ్వరి' అని ఒక దివ్యశక్తి ప్రేరణ నాచే పలికించింది. ఆనాడు నా జీవితాంతము మరువరాని ఒకానొక అన్యోన్య ప్రేమాలింగిత దివ్యానందానుభూతిని పొందాను" అని చెప్పారు. ఆ తరువాత కూడా అమ్మను గూర్చి ఇతరులకు చెప్పవలసి వచ్చినపుడు, అమ్మ నామం స్మృతికి వచ్చినపుడు మొదటిసారి అమ్మను చూచినపుడు పొందిన దివ్యానందాన్నే అనుభవించేవాడిని అని అహంకార రహితంగా, అతిశయోక్తిలేకుండా చెపుతున్నానని పలికేవారు. అంతేకాక "జగత్కుటుంబిని అయిన అమ్మ' మనతో కలసి మెలిసి తిరుగుతూ ఆనందిస్తూ ప్రేమామృతసాగరంలో ఆశ్రితులను తరంగరూపులుగా చేసి సముద్రానికి తరంగాలకు భేదము లేని స్థితిని ప్రసాదించటం వల్ల అమ్మ జగన్మాత అనటం నిర్వివాదము" అన్నారు.


"అమ్మయందు నాకు కలిగిన భావాలను ఒకసారికి పదిసార్లు మననం చేసుకొని అమ్మ యందు నాకు, నాయందు అమ్మకు కలిగిన అభేదప్రేమ యొక్క

ఫలాన్ని నావలెనే అందరూ అనుభవించి సుఖించాలని నా అనుభవంలో కొంతవరకూ వెల్లడించాను. నిజానికి అమ్మ చరిత్ర వ్రాయాలని ఉన్నా కంటిచూపు సరిగా లేకపోవటం వల్ల ఆ భాగ్యానికి నేను నోచుకోలేకపోయినందుకు విచారిస్తున్నాను" అని చెప్పారు.

"అమ్మ విశ్వగర్భిణి. ఎవరు అమ్మ అనుగ్రహంతో, అమ్మను తెలుసుకొని అమ్మను వదలకుండా నిత్యం ఆరాధించే బుద్ధిబలం కలవారై, ఎవరు అమ్మ యొక్క దివ్యస్వరూపంలో ఉన్న దాంపత్య మర్మాన్ని తెలుసుకుంటారో అట్టివారు మాత్రమే అమ్మ యొక్క సగుణ నిర్గుణ రూపముల సంధి నెఱిగి అంతర్దృష్టి కలవారై జీవన్ముక్తిని పొందగలరు" అని చెప్పిన సత్యవచనాలు ఎంతో అనుభవంతో చెప్పినవి.

కాంతయ్య యోగిగారు, లక్ష్మీకాంతానందయోగిగా సన్యాసం స్వీకరించ కుండానే ఒక మహాయోగిగా గుర్తింపు పొందారు. తెలుగుదేశంలో వారి మహిమలు కథలు కథలుగా చెప్పుకుంటుంటారు. 1928, 29 లలో అనావృష్టి కలిగి వర్షాలు పడక ప్రజలు బాధపడుతుంటే శీతలాయంత్ర వరుణదేవతారాధన చేసి వర్షాలు కురిపించి రైతులకు ఊరట కలిగించారట. రమణమహర్షి అన్నా జిల్లెళ్ళమూడి అమ్మ అన్నా చాల యిష్టంతో ఉండేవారు. ఆశ్రమానికి వచ్చిన ఎవరినీ భోజనం చేయకుండా పోనిచ్చేవారు కాదు. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన రామేశ్వరంలోని జ్యోతిర్లింగం ప్రక్కకు ఒరిగితే సరిచేసి పునః ప్రతిష్ఠించాలని ప్రయత్నించిన ఋత్విక్కులకు లింగాన్ని చుట్టుకొని నాగసర్పం ఉండటం చూచి భయపడుతుంటే కాంతయ్య యోగిగారు ఆ సమయంలో అక్కడే ఉన్నందువల్ల వారు ఆలయంలోకి వెళ్ళి ప్రార్థించగా సర్పం అదృశ్యమై ప్రతిష్ఠ నిరాటంకంగా జరిపించారని చెప్పారు. ఇటువంటి విశేషాలెన్నో వారి జీవితంలో చోటుచేసుకొన్నవి ఉన్నాయి. శ్రీ కాంతయ్య యోగి గారు 21.11.1970 న కార్తీకమాసంలో అమ్మలో లీనమైనారు.

కాంతయ్య యోగిగారు బ్రహ్మీభూతులైన తర్వాత కూడా అమ్మ కొత్తరెడ్డి పాలెంలోని వారి ఆనందాశ్రమానికి వెళ్ళి అక్కడి ఆలయాలను దర్శించి వారిని గూర్చి అక్కడి వారికి ఎన్నో విషయాలు చెప్పింది. కాంతయ్య యోగిగారు ధన్యాత్ములు.



6. పూర్ణానందస్వామి

1968లో శ్రీ పూర్ణానంద స్వామి, సోదరులు శ్రీ అన్నంరాజు రామకృష్ణారావుగారితో కలిసి అమ్మ వద్దకు వచ్చారు. ఆ రావటం కూడా ఒక విచిత్రమైన అలౌకిక సన్నివేశమే - అమ్మ జన్మదినోత్సవ సంధర్భంగా మాష్టర్ ఎక్కిరాల భరద్వాజ అమ్మను గూర్చి వ్రాసిన వ్యాసం ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో అచ్చయింది. అమ్మ ఛాయాచిత్రము, ఆవ్యాసము చూచి అమ్మను గూర్చిన విశేషాలు అందులో ఉటంకించినవి సోదరులు అన్నంరాజు రామకృష్ణారావుగారు స్వామికి చెప్పి ఆ పత్రిక చూపించారు. చూసీ చూడగానే అమ్మ "రాజరాజేశ్వరి", అమ్మను దర్శించు అని రామకృష్ణారావుగారికి చెప్పారు స్వామి. అప్పటికి రామకృష్ణారావు గారికి కూడా అమ్మను గూర్చి తెలియదు. అందువల్ల స్వామివారిని, రామకృష్ణారావుగారిని అమ్మే తన వద్దకు రప్పించుకుంది అనటం వాస్తవం.

స్వామి కాషాయాంబరధారియై నిగనిగలాడే నల్లని జటాజూటంతో విభూధిరేఖలు నుదుటన, జబ్బలపై, ముంజేయిపై మురుపు చూపుతుండగా, బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతుండగా అపరశంకరులా అన్నట్లుగా ఎవరినైనా ఆకర్షించే స్ఫురద్రూపియైన ఒక మహాతపస్వి కనిపించారు.

పూర్ణానందస్వామి తాతగారు పిచ్చుమణి అయ్యార్ తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మధురైలో నివసించేవారు. ఆయన మంచి కవీశ్వరుడు. 'కవిరాయర్' అనే బిరుదు కూడా ఉండేదివారికి. వారి కుమారులు, సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీచక్రోపాసకులు.సంస్కృత తమిళభాషలో మంచి పాండిత్యం సాధించారు. తాతతండ్రుల నుండి వచ్చిన సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్నారు పూర్ణానందస్వామి. పూర్ణానందుల తల్లివైపువారు కూడా అత్యంత ప్రతిభావంతులు. పండితులు, స్వామివారి తల్లి పర్వతవర్ధని. ఆ అమ్మ సుబ్రహ్మణ్యస్వామి ఆశీర్బలంతో జన్మించిన పుణ్యాత్మురాలు. పర్వతవర్ధని సుబ్రహ్మణ్యస్వామి కామకళా యాగం చేసిన తర్వాత 7.11.1939న జన్మించడం వల్ల స్వామికి "కామేశ్వరన్" అని పేరుపెట్టారు తల్లిదండ్రులు. చిన్నతనంనుండే ఆధ్యాత్మిక జిజ్ఞాసలోనే కాలంగడిపేవారు. తన ఆరవయేటనే తనకుపాఠం చెప్పే ప్రధానోపాధ్యాయులచే యజ్ఞం చేయించారు స్వామి.

యస్.యస్.యల్.సి. దాకా చదివిన స్వామి కొంతకాలం ఒకటిరెండు చోట్ల ఉద్యోగాలు కూడా చేశారు. అయితే ఆధ్యాత్మిక జిజ్ఞాస ఆ ఉద్యోగాలలో ఎక్కువకాలం ఉండనిచ్చేది కాదు.

తమిళనాడులోని కరచూర్ దగ్గర గల బాణ తీర్థంలోనూ, పొదుగై పర్వతాలలోని వరుణ గుహలోనూ తపస్సులో కాలం గడుపుతుండేవారు. ఆ రోజులలో రాఖాడీ బాబా (ఓంకారానంద్) అనే సన్యాసి వీరి తపస్సుకు మెచ్చి 1967 కార్తీక పూర్ణిమనాడు సన్యాస దీక్షను ప్రసాదించి "పూర్ణానంద స్వామి"గా దీక్షానామాన్నిచ్చారు. గురువుగారి ఆజ్ఞననుసరించి "పాపనాశనం" శివాలయంలో కొంతకాలంతపస్సు చేశారు. అక్కడ నుండి శ్రీశైలంలోని హటకేశ్వరలో దేవాలయం వద్దగల ఆశ్రమంలో పంచాగ్నిమధ్యంలో ఒంటి కాలిపై నిలబడి ఏకదీక్షగా భగవత్సాక్షారం కోసం తపించిన స్వామికి అమ్మ సాక్షాత్కారం కావటం విశేషం. ఆదిశంకరులు తపస్సు చేసిన ప్రాంతమది. జ్ఞాన రోచిస్సులు వెదజల్లుతూ తపోదీక్షలో ఉన్న స్వామిని ప్రజలు కనుగొన్నారు. ఒక్కొక్కరే వారి వద్దకు చేరటం ప్రారంభమైనది. ఆలా చేరిన మొదటి ఒకరిద్దరు వ్యక్తులలో శ్రీ అన్నంరాజు రామకృష్ణారావుగారొకరు. అలా ఒక చోటకు చేరిన గురుశిష్యులిద్దరూ అమ్మ వద్దకు వచ్చారు.

అమ్మ తన సహజ సిద్ధమైన వాత్సల్యంతో స్వామీజీని పసిపిల్లవానికి వలెనే లాలించి సపర్యలు చేసింది. అన్ని విషయాలు స్వయంగా చూసింది. గోరుముద్దలు చేసి భోజనం పెట్టింది. గుడ్డలు పెట్టింది. ఆప్యాయతతో నిమిరింది. అమ్మకు దేవుళ్ళు, బిడ్డలే, బిడ్డలూ దేవుళ్ళే. ఆ తర్వాత స్వామి రెండు మూడు సార్లు అమ్మ జన్మదినోత్సవాలప్పుడు దసరా ఉత్సవాలకు వచ్చారు. అమ్మ మామూలుగా తాను వేసే తీర్థం అందరికీ స్వామి చేత వేయించింది. అమ్మ చెప్పిన "సర్వావస్థలయందు సమానస్థితే సమాధి స్థితి" అన్న సూక్తికి పరవశించి అమ్మను గూర్చి "షీయీజ్ నన్ అదర్‌దాన్ భువనేశ్వరి" అని భావించిన స్వామి మొదటిసారి రెండు గంటలకుపైగా అమ్మ వద్ద మౌనంగా కూర్చొని అమ్మ సపర్యలు పొందిన స్వామిని అమ్మనుగూర్చి ఇప్పటి మీ అభిప్రాయమేమిటి అని అడగ్గా "సంపూర్ణత్వం అంటే అమ్మే- అమ్మ అంటే సంపూర్ణత్వమే" అని చెప్పారు. అమ్మ పెట్టిన అమృతపు ముద్దలు తిన్న స్వామి "At last the motherless Shiva has found his mother" అని ఆనంద పరవశులయ్యారు.

1970 దసరాలలో వచ్చిన పూర్ణానందస్వామిని పర్సా దుర్గాప్రసాద్ రావు (మాజీప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావుగారి బావగారు) గారు అమ్మను గూర్చి స్వామిజీ అభిప్రాయం అడుగగా 'అమ్మ' అనటంలోనే సర్వదేవతలకు ఆధారమైనదన్న భావం ఉన్నది కదా! అన్నారు స్వామీజీ. అప్పుడు దుర్గాప్రసాద్‌రావుగారు "Please clarify whether Amma is Mother or Father" అనగా వెంటనే స్వామి "Mother of Father" అన్నారు. అక్కడి వారందరూ ఆ అసంకల్పిత సమాధానానికి సమ్మోహితులైనారు. అయితే ప్రసాదరావుగారు అంతటితో వదిలిపెట్టక Father of Mother కూడానా? అన్నారు. అందుకుస్వామి "No. Mother of All means the origin of everything" అని వివరించారు.

అమ్మ స్వామీజీతో స్వామీజీకి శరీరాన్ని ప్రసాదించిన అమ్మను కూడా జిల్లెళ్ళమూడికి తీసుకొని రమ్మంది. అమ్మ ఆజ్ఞను శిరసావహించి తన తల్లి "పర్వతవర్ధని"ని అమ్మ వద్దకు తీసుకొని వచ్చారు. అమ్మను చూచి ఆ తల్లి కూడా పరవశించింది.

స్వామీజీ శిష్యపరంపర వందలు వేలకు పెరిగింది. శ్రీశైలంలోని సున్నిపెంటలోనూ భాగ్యనగరం దగ్గరి హటకేశ్వరంలోనూ ఆశ్రమాలలో ఆధ్యాత్మిక

కార్యక్రమాలు ముమ్మరమైనవి. లలితా సహస్ర, త్రిశతి, ఖడ్గమాలా, అష్టోత్తర శతము, చండీ సప్తశతి పారాయణలు హోమములు అత్యంత ఉత్సాహంతో వీనుల విందుగా, కన్నుల పండువుగా వేదనాదాలు మిన్ను ముట్టుతుండగా లలితలలితంగా కన్యలు మధుర కంఠస్వరంతో స్వరయుక్తంగా రాగయుక్తంగా ఆలాపనచేస్తుండగా భక్తుల మనస్సులు వాటిలో లగ్నమై ఎంతో హాయుగా, తృప్తిగా ఊపిరి పీల్చుకుంటాం స్వామి సన్నిధిలో. ఆ వాతావరణం ఒక ఆధ్యాత్మిక తపోమందిరం. మధుర మధురానంద బంధురం. భయము భక్తి పడుగు పేకల్లా పెనవేసుకొని నడుస్తున్న సుమనోసుందరం. జిల్లెళ్ళమూడి నుండి ఒకపరి నాన్నగారు సున్నిపెంటలోని స్వామి ఆశ్రమానికి వెళ్ళగా స్వామి నాన్నగారిని ఒక మహాశివునిగా వారికి జరిపిన పూజలు గౌరవాలు ఉపచారాలు చూచి అక్కడి జనం పొంగిపోయారు. అంతేకాదు జిల్లెళ్ళమూడి నుండి ఎవరు వెళ్ళినా మామూలుగా అక్కడ ఉండే విధినియమాలు ప్రక్కనపెట్టి స్వామి అత్యంత ఆప్యాయతతో ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవటం చూచిన వారిశిష్యులు ఆశ్చర్యపోతుండేవారు. అమ్మ చూపిన ఆదరణే స్వామివద్ద జిల్లెళ్ళమూడి సోదరీసోదరులు పొందేవారు.

స్వామీజీ సున్నిపెంటలోని తమ ఆశ్రమంలో అమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైన అన్నపూర్ణాలయం నెలకొల్పారు. అమ్మ నిలువెత్తు ఛాయాచిత్రాన్ని అక్కడ ప్రతిష్ఠించారు. యాతామీత భక్తబృందానికి అమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైన ఉచిత భోజన సదుపాయం ఆ అన్నపూర్ణాలయంలో ఏర్పాటు చేశారు స్వామి.

ఆధ్యాత్మిక కార్యక్రమము ద్వారా మానసికోన్నతికి, సమాజసేవకు స్వామీజీ ఎంతో తోడ్పడుతున్నారు. స్వామీజీ ప్రేమతో శిష్యులు తన్మయులైపోతుంటారు. స్వామీజీ సున్నిపెంటలో వేదపాఠశాల ఏర్పాటు చేశారు.

జిల్లెళ్ళమూడిలోని సోదరీసోదరులు భౌతికంగా అమ్మలేని లోటును విపరీతంగా అనుభవిస్తున్న తరుణంలో స్వామీజీ 1991 ఆగష్టులో జిల్లెళ్ళమూడి వచ్చారు. వారి రాక చాల మందికి ఆనందాన్ని కలిగించింది. అమ్మ మాదిరిగానే ప్రేమతో పలకరించటం, ఆప్యాయంగా ఒళ్ళు నిమరటం, ఆదరణగా మంచి చెడులు విచారించటం, అండగా స్వామీజీ ఉన్నారనే భావన కల్గించటంతో హృదయాలు ద్రవించాయి. ఎన్నో మనోమయురాలు పురివిప్పి నాట్యం చేశాయి.

జిల్లెళ్ళమూడి అందరింటిలోని ప్రతి భాగానికి వెళ్ళి పలకరించారు. పూజలు స్వీకరించారు. శ్రీ విశ్వజననీ పరిషత్ కార్యకర్తలతో మంచి చెడులు మాట్లాడారు. భవిష్యత్కార్యక్రమాలు తెలుసుకొన్నారు. అమ్మే తిరిగి స్వామీజీ రూపంలో వచ్చింది అన్న భావన సోదరీ సోదుల మనస్సులతో బాగా నాటుకుంది.

ఆ రకంగా ఎవరి మనసులూ నొప్పించకుండా అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సమష్టి కుటుంబ ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాలని స్వామి భావించారు. ప్రతి సంవత్సరం కనీసం ఒక పక్షం రోజులు జిల్లెళ్ళమూడిలో సోదరీ సోదరుల మధ్య గడపటానికి చండీ సప్తశతి హోమాలు పూజలు నిర్వహించటానికి అంగీకరించారు. అమ్మ ఈ అవకాశాన్ని కల్గించిందనుకున్నాం. కాని స్వామి ఆరోగ్యం రోజు రోజుకు సన్నగిల్లటం మొదలైంది. షుగరు జబ్బు వారి శరీరంపై ప్రతాపం చూపించటం ప్రారంభించింది. వారి శిష్యగణం స్వామిని సాధ్యమైనంత వరకు తిరగనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. తగిన వైద్య సదుపాయం కల్గించారు. స్వామి ఆరోగ్యం క్షీణించటం ప్రారంభించింది. చివరకు 6.4.2000న స్వామి అవతార పరిసమాప్తి అయింది. ఒక విచిత్రమేమిటంటే స్వామివారి గురుదేవులు రాఖాడీబాబాది కూడా అనసూయాశ్రమమే- స్వామి వచ్చింది అనసూయ మందిరానికే- పూర్ణానందస్వామి అనసూయలోనే చేరడంలో ఆశ్చర్యమేముంది? స్వామి శివులు. త్రిమూర్తులను ఆడించిన, స్తన్యమిచ్చిన తల్లి కదా అనసూయ. స్వామీజీ శాశ్వతులు నిరంతరం చిరకాలం మనమనస్సులలో నిలచి పోతారు.





7. ఎక్కిరాల భరద్వాజ

ఎక్కిరాల భరద్వాజ 'సాయిమాష్టర్'గా ఆంధ్రదేశంలో ప్రసిద్ధుడు. సాయిబాబా దివ్యచరిత్రను వ్రాయటమేగాక వివిధ ప్రదేశాలలోసాయి మందిరాలు నిర్మించి చాల మంది ప్రజలను షిరిడీకి తీసుకొని వెళ్ళిన సాయి మార్గ ప్రచారకునిగా లోకంలో ప్రసిద్ధి చెందాడు. 1963 మొదట్లో అన్నగారైన వేదవ్యాస్‌తో కలసి అమ్మను చూడటానికి జిల్లెళ్ళమూడి వచ్చాడు. ఆ సమయాన అమ్మ అందరికీ, పాయసం ప్రసాదంగా పంచుతున్నది. భరద్వాజకూ పెట్టింది. దానిలోని విశిష్టత వారిపై ప్రభావం చూపించి కొన్ని సంవత్సరాలు జిల్లెళ్ళమూడిలో ఉంచింది.

ఎక్కిరాల అనంతాచార్యులవారు సంస్కృతము, ఆంధ్రము, ఆంగ్లము భాషలలో పండితులు. ఆయుర్వేదము, వేదాంతము, జ్యోతిషము, వంటి శాస్త్రములలో నిష్ణాతులు. వారి సంతానంలో నలుగురు కుమారులు ఆయా రంగాలలో ప్రసిద్ధులే. ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు జగద్గురు పీఠం స్థాపించి ప్రపంచంలో 40 దేశాలలో దాని కేంద్రాలు స్థాపించి భారతీయ ధర్మచైతన్యాన్ని వ్యాపింపచేశారు. అలాగే ఎక్కిరాల వేదవ్యాస కూడా మరొక ఆధ్యాత్మిక సంస్థను స్థాపించి జాతి చేతనకు వారిసేవ వారు చేస్తున్నారు. బోధాయన మాత్రం ఆయుర్వేద హోమియో వైద్యాలు వంటబట్టించుకొని ప్రజలకు వారి సేవ వారు చేస్తున్నారు. భరద్వాజ షిరిడీ సాయిబాబాను ఉపాసిస్తూ ఆ మార్గంలో ఎందరినో తరింప చేయటానికి ప్రయత్నించాడు. ఎందరికో ఆచార్యుడు ఆరాధ్యుడు అయినాడు.

నిరంతర సత్యాన్వేషి అయిన భరద్వాజ ఎందరో సాధువులను సంతులను దర్శించాడు. ఎన్నో క్షేత్రాలను చూచాడు. అమ్మ, రమణమహర్షి, షిరిడీ సాయిబాబాల ప్రభావం అతని మనసుపై చెరగని ముద్ర వేసింది. అతని సునిశిత పరిశీలన, అతని రచనల ద్వారా బోధల ద్వారా అవగతమవుతుండేది. అతను దర్శించిన ఎందరో మహనీయులను గూర్చి ఎన్నో గ్రంధాలు వ్రాశాడు. అలాగే జిల్లెళ్ళమూడి అమ్మను గూర్చి ఇంగ్లీషులో తెలుగులో కూడా ఎన్నో రచనలు చేశాడు. అవి ఇంగ్లీషులో తెలుగులో గ్రంధాలుగా వెలువడ్డాయి. వాటి ద్వారా పరిశీలిస్తే అతను అమ్మ సన్నిధిలో, అమ్మతో సంభాషణలలో, అమ్మతో ఉన్నవారి అనుభూతులతో ఎలా ప్రభావితుడైనదీ మనకు తెలుస్తుంది. తను చిన్నతనంలోనే తల్లిలేని పిల్లవాడుగా ఎలా పెరిగింది, దానిని అమ్మ వద్ద ఎలా భర్తీ చేసుకోగలిగిందీ తెలుస్తుంది. అమ్మ వద్ద గడపిన నాలుగైదు సంవత్సరాలలో వారుపొందిన ఆనందము తృప్తి తక్కువకాదు. అమ్మ సంస్థ నుండి వెలువడిన ఆంగ్ల మాసపత్రికకు కొన్ని సంవత్సరాలు సంపాదక వర్గంలో ఉన్నాడు కూడా.

అమ్మ ఒకసారి తన పాదాలకు తానే పూజచేసుకోవడం చూచిన భరద్వాజలో విచికిత్స మొదలైంది. దైవము తానే, జీవుడుతానే, బుద్ధితానే, ప్రేరణతానే, భక్తితానే అయిందన్నమాట. భక్తుడి దృష్టిలో భగవంతుని ధ్యానిద్దామన్న సంకల్పం తాను, సంకల్పంకల మానవుడూ తానే. అందుకే అమ్మ "దైవ సంకల్పం కాదు సంకల్పమే దైవం" అన్నది. అజ్ఞాని దృష్టిలో దైవం వేరు, తాను వేరు. కాని దైవం దృష్టిలో భక్తుడు, భక్తి, పూజ అన్నీ తానే అయి ఉంటాడు. అదే అమ్మ తన పాదాలకు తాను పూజ చేసుకోవటంలోని భావం అనుకుంటున్నాడు. ఇంతలో ఎవరో వచ్చి మేము నీ పాదపూజ చేసుకుంటామమ్మా! అని అడిగితే అమ్మ భరద్వాజతో "అసలు పూజంటే ఏమిటినాన్నా!" అని అడిగింది. వారు తన మనసులో జరిగిన ఆలోచనలన్నీ క్రోడీకరించుకొని "జరిగేదంతా పూజేనేమో! సృష్టే పూజేనేమోనమ్మా!" అన్నాడు. 'అంతేగా!' అన్నారు అమ్మ వారి కిచ్చిన ఆలోచన తనిచ్చిందే అని గుర్తుచేస్తున్నట్లుగా. అమ్మ తనకు తానే పూజచేసుకుంటుంటే ఎదుట ఉండే సర్వసృష్టిలోనూ తనను చూచుకోగలగటమేగా, దీన్ని అమ్మ బింబప్రతిబింబన్యాయం అని చెప్పింది. అందుకే ఆత్మకు ప్రతిబింబమేగా జగత్తు.

సర్వాలంకార భూషితయై అమ్మ ఉంటే, అమ్మకు అలంకారా లెందుకు? అందుకే అమ్మకిరీటాన్నెవరో దొంగిలించారట అని అనుకునే వారున్నారు. అమ్మ

వీటిని గూర్చి చెపుతూ "కళంకరహితమైనదే అలంకారం. నా కిరీటాన్ని ఎవరో దొంగలించలేదు. అది ఒకరు పెడితే వచ్చింది కాదు, ఒకరు తీస్తే పోయేదీ కాదు" అన్నది అమ్మ. భరద్వాజ ఈ విషయాన్ని వివరిస్తూ అమ్మ అన్నీ అయి అర్థం కానిదై, ఆద్యంతములు లేనిదై, ఆద్యంతమంతా అయి, అడ్డులేనిదీ ఆధారమైనదీ కావటమే అలంకారం. అమ్మలోని సర్వత్వం కిరీటం, సర్వకారిణి కావటమే గాజులు. ఉంగరాలు, తన నడకే సృష్టినడకై, సర్వాన్నీ తన పాదాలలో ధరించడమే బంగారు మెట్టెలు, పట్టాలు, తానే మూడై మూడూ ముడి వేసుకొని త్రిపుటి అయి త్రిపుర సుందరికావటమే కేశాలంకరణ, శబ్ధ రూపిణియై సర్వసృష్టినీ వాక్కుగా చేసుకోవడమే కంఠాభరణాలు, సృష్టిస్థితిలయాలు తన ఉచ్ఛ్వాస నిశ్వాస సంధులుగా శ్వాసల్లో సర్వకాలాన్నీ బంధించింది కనుకనే ఆకాశంలో వ్రేలాడే బ్రహ్మాండంలా అమ్మ బులాకీ, ఆభరణాలు ఎవరూ అర్పించక ముందే అమ్మకు సహజాలంకరణలై ఉన్నాయి అంటారు.

భరద్వాజకు సాధన చేయటమంటే చాల ఇష్టం. అమ్మ వద్దకు వచ్చేవారు, అమ్మ వద్ద ఉన్నవారు ఇంతటి దివ్యమూర్తి సన్నిధిలో ఉంటూ కూడా ఏ సాధనా చేయకుండా మామూలు కార్యక్రమాలలో కాలం వృధా చేసుకుంటున్నారేమీ? అని అనుకుంటుండేవాడు. దానికి అమ్మే ఒకసారి సమాధానం చెప్పింది. "ఏ కొండల్లోకో అడవుల్లోకో పారిపోయి అక్కడ కళ్ళూ ముక్కూ మూసుకొని ఏకాగ్రతకోసం విఫలప్రయత్నం చేయటం, సృష్టిలో సహజసిద్ధమైన స్త్రీ పురుష సంబంధాన్ని అణుచుకోలేక తపో భంగం పొందేకంటే ఈ ఆవరణలో ఎప్పుడూ అమ్మను ప్రేమిస్తూ, అమ్మ నామాన్ని ఉచ్చరిస్తూ, సోదర ప్రేమలోనూ, సేవలోనూ, సంపూర్ణమానవత్వంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ నిత్యకార్యకలాపాల్లో వాళ్ళ దేహాలను దగ్ధంచేసే వీరి తపస్సు చాల సుగమం, సులభం పతనానికి తావులేనిది. ఈ దృక్పథంతో చూస్తే సర్వత్రా విజ్ఞానాన్ని పొందవచ్చు" అన్నది.

ఒకరోజ భరద్వాజ అమ్మ చాల మందితో మాట్లాడుతుండగా నమస్కారం చేసుకోవటానికి వెళ్ళాడు అమ్మ వద్దకు. నమస్కారం చేసుకొని వెడతాను అన్నాడు. ఏ ఊరు? నవ్వుతూ అడిగింది అమ్మ. ఈ ఊరే అన్నాడు భరత్వాజ "ఈ ఊరికైతే ఒక్క కాల్చాలు" అన్నది. అమ్మ అలా అన్నదేంటి? అని ఆలోచిస్తున్నాడు. మళ్ళీ అమ్మ అదే మాట"ఈ ఊరుకు ఒక్క కాల్‌చాలు" అన్నది. అప్పుడు స్ఫురించింది భరద్వాజకు, ఇంగ్లీషులో 'కాల్' అంటే పిలుపుఅని అర్థం కదా! అంటే అమ్మ

సంకల్పంలో ఒక్కసారి రమ్మని పిలిస్తే మనమింక జిల్లెళ్ళమూడి మళ్ళీమళ్ళీవెళ్ళక తప్పదని అర్థమయింది వారికి.

అమ్మ మహాత్యాలు చెయ్యదు. ఒకవేళ జరిగినా వాటి పట్ల తన కర్తృత్వాన్ని అంగీకరించదు. ఒకసారి భరద్వాజ అమ్మను అడిగాడు. అమ్మా! నీ వల్ల జరిగే మహాత్మ్యాలను నీవు చేసినట్లు అంగీకరించవెందుకని? అట్లా చేస్తే మాకు నమ్మకం భక్తీ బాగా వృద్ధి పొంది మేం బాగుపడతాం కదా? అని. అమ్మ దానికి సమాధానం చెపుతూ "సరియైన నమ్మకం అలాంటి వాటివల్ల కలుగదు నాన్నా! వాటి ననుసరించి ఏర్పడ్డ నమ్మకం అట్లా జరుగని మరుక్షణం సడలి పోతుంది. సరైన నమ్మకం ప్రేమలా నిర్హేతుకంగా ఏర్పడుతుంది. తరుణం వచ్చినప్పుడు, అంటే నీ కేర్పడడం అవసరం అని నాకనిపించినప్పుడు" అన్నది. భరద్వాజకు అమ్మ తాత్కాలికంగా అమ్మ తన నోరు మూయించడానికి ఆ సమాధానం ఇచ్చింది అనుకున్నాడు కాని తర్వాత బైబిల్ చదివినప్పుడు క్రీస్తు తనను విశ్వసించని థామస్‌తో "నీవు నన్ను చూచావు గనుక నమ్మావు కాని నన్ను చూడకనే నమ్మినవారు ధన్యులు" అన్నమాటతో, అమ్మ చెప్పిన మాటలలోని సత్యం అర్థం చేసుకున్నాడు.

ఒక సందర్భంలో అమ్మ "నేను గురువును కాను మీరు శిష్యులుకారు, నేను తల్లిని మీరు బిడ్డలు" అన్నది. భరద్వాజ ఈ మాటను ఎవరి ద్వారానో అమ్మ సద్గురువునుకాను" అన్నదని విని అమ్మను అడిగాడు, అమ్మ దానికి "నేను సద్గురువును కాదని అనలేదు. గురువును కానని మాత్రమే అన్నాను. సద్గురువును అంటే నా ఉద్దేశం దైవమనీ. నేను గురువును కాదు అన్నప్పుడూ నా ఉద్దేశం ఈనాడు సంఘంలో 'గురువు' అన్నపదం బహుతేలిక అయినదని" అన్నది.

అమ్మ ఆహారం ఏమీ తీసుకోదు. పిల్లలు బలవంతం చేస్తే కాఫీ రెండు మూడు సార్లు తీసుకుంటుంది తప్ప. భరద్వాజకు ఒక అనుమానం. ఎందరో బలశాలులైన తన బిడ్డలను ఆశ్చర్యచకితుల్ని చేసే ఇంత శక్తి సామర్థ్యలెక్కడివి అమ్మకు? అని. దానికి సమాధానంగా అదే సమయంలో అమ్మ దర్శనానికి ఒక కుటుంబం వచ్చింది. వారిలో ప్రసంగవశాన అమ్మ "కొందరు ఏం చేసుకున్నా నాకు పెట్టిన తర్వాతే తిందామనుకుంటారు దూరదేశాల్లో ఉన్నా. కానీ జిల్లెళ్ళమూడి బయలు దేరే తొందరలో వాళ్ళ పిల్లలకు ఇడ్లీ పెట్టాలన్న ఆతురతలో పచ్చడిలేని ఇడ్లీ నాకు పెట్టి, వాళ్ళ పిల్లలకు మాత్రం చక్కగా నేతితో రాచి పచ్చడినలిపి పెట్టారు. నాకేమో ఒట్టివి తినడం కష్టమైపోతున్నది" అన్నది. ఆ కుటుంబం

అమ్మకు పదేపదే నమస్కారం చేసుకున్నారు- కళ్ళవెంట నీరు కారుతుండగా, ఆ సంభాషణ పొడుగునా అమ్మ వారినే సూచిస్తున్నదని భరద్వాజకు తెలిసింది అప్పుడు ఇటువంటి అనుభవమే భరద్వాజకు కూడా కలిగింది. 19.8.1964న అమ్మ దగ్గరగు తాను వచ్చిన రోజున క్షీరాన్నం చేయించి అమ్మకు నివేదన ఇచ్చాడు భరద్వాజ. పెద్ద గిన్నె నిండా పరమాన్నం ఉన్నది. పొయ్యిమీద నుండి అప్పుడే తేవటం వల్ల పొగలు వస్తూ చాల వేడిగా ఉన్నది. సాధారణంగా అమ్మ ఒక చుక్క నోటిలో వేసుకొని మిగిలింది అందరికీ పెట్టమని ఇచ్చేస్తుంటుంది. ఈసారి మాత్రం ఆ వేడి వేడి పాయసాన్ని తినటం మొదలు పెట్టింది. పరధ్యానంగా గిన్నెలోని పాయసమంతా ఆరగించింది.

బాగా తినగలవాళ్ళకు ఎక్కువయ్యేంత పాయసమది. తానుతినేటప్పుడు 'కొంచెం తిను ఇంకొంచెం తినమ్మా!' అని ఒక పసిపిల్లకు తినిపించినట్లు మాట్లాడింది. అంతా తిన్న తర్వాత "అంతా అయిపోయిందే! నీవేం తింటావు" అంటూ ఖాళీగిన్నెలో చెయ్యి కడుగుకొని "నవ్వు ఇది తీసికో" అన్నది. ఎక్కడో అరణ్యాల్లో ఉండి అవసరాలు గమనించేందుకు ఎవరూ లేనివారిని ఎవరు చూస్తారు?" అన్న అమ్మ మాటలలోని నిగూఢమూ అసంపూర్ణమూ అయిన వాక్యంలోని సంకేతార్థం భరద్వాజకు బాగా అర్థమైంది. దిక్కులేని వారికి దేవుడే దిక్కు కదా! ఆ దేవుడే అమ్మ కదా!

అమ్మ వద్దకు వచ్చే చాల మంది ఎందుకని వెక్కి వెక్కి ఏడుస్తుంటారు? భరద్వాజకు సందేహం కలిగి అమ్మనే ప్రశ్నించే సాహసం చేశాడు. చాలసార్లు సమాధానం చెప్పటం దాటవేసేది. ఒక్కొక్కసారి "ఎదుటి వ్యక్తిలో మంచితనాన్ని చూస్తే ఏడుపొస్తుంది" అని ఏదో ఒక సమాధానం ఇవ్వటానికి చెప్పినట్లు చెప్పేది. అసలు కారణం చెప్పమని గట్టిగా ప్రాధేయపడ్డాడు భరద్వాజ. అప్పుడు అమ్మ "పుట్టగానే పసిబిడ్డ ఎందుకు ఏడుస్తుందో అదే కారణం దీనికి కూడా " అన్నది. నీదర్శనంతో వారి ఆంతర్యం పునరుద్భవించినట్లా? అని ఎవరో అనగా "అవును. నిజానికిది విచారం కాదు. అంతకన్నా మంచిపదం దొరకక ఏడవటం అంటున్నాం" అన్నది. భరద్వాజకు అలా అశ్రువులకు లోనుకాని, వాటిని అదుపులో ఉంచగలననే ధీమా ఉండేది. ఆ విధంగా అమ్మతో చెప్పాడు కూడా, కానీ అది ఎక్కువకాలం నిలబెట్టుకోలేక పోయాడు. ఒకసారి వేదికపై ఉన్న అతని వైపు చూచింది. భావావేశం వైపు చూడకుండా దృష్టి మళ్ళించింది. కాసేపయింతర్వాత మళ్ళీ చూచింది. ఆ

చూపులో ఏమహత్తున్నదో అతని కళ్ళనిండా నీళ్ళు నిండాయి. గొంతు గద్గదమైంది. అశ్రువుల నరికట్టే ప్రయత్నంలో మనస్సు బిగుసుకుపోయింది. అప్పుడు అమ్మ తన దృష్టి భరద్వాజపై నిలిపింది కళ్ళనిండ అశ్రువులు ధారాపాతంగా కురిశాయి. అతనిలోని పట్టుసడలి చాల హాయిని అనుభవించాడు. నిజంగా నియమనిష్టలతో ఏ సాధన చేయలేని వారిని అమ్మ స్పృశింపగానో, అమ్మ ఒక మాట 'పలికితేనో తీవ్ర భక్త్యావేశం, ఆధ్యాత్మికోన్నతికి తీసుకొని వెళ్ళుతుందంటే అది అమ్మ అనుగ్రహమే. ఇదే అమ్మ వద్ద కన్నీటిలోని దివ్యత్వం. అమ్మ యొక్క అదృశ్యోపదేశం ప్రాప్తిస్తుంది. అంతరంగ శాంతి లభిస్తుంది. వ్యక్తుల జీవితాలలో అమ్మ ప్రభావంతో వారికి తెలియకుండానే ఒక నూతన పంథాలో ప్రయాణం మొదలవుతుంది.

అమ్మ ఒకసారి "ముక్తి పొందేది కాదు. నిర్ణీత సమయంలో దైవ సంకల్పం చేత అనుగ్రహింపబడుతుంది. కావలసిన అర్హత కూడా దానంతట అదే వస్తుంది. మానవ ప్రయత్నం వల్ల వస్తుందని తెలియని వారనుకుంటారు" అన్నది. దానికి భరద్వాజ "ప్రతిచిన్నవిషయమూ పూర్వమే అంతా నిర్ధారణ అయిపోయి అంతమార్చలేనిదే అయితే జరుగుతున్న అద్భుతాలకు అర్థమేమిటి? మహర్షులు, ప్రవక్తలు మరణించినవారిని పునరుజ్జీవింప చెయ్యలేదా? దైవ సంకల్పం కూడా మానవ రూపంలో ఆవిష్కరిస్తూ ఉంటుంది. దైవం తన నిర్ణయాన్ని తాను తప్పక మార్చ కలిగి తీరుతుంది. లేకపోతే అది సర్వోత్కృష్టమే కాదు కదా" అని అమ్మను అడిగాడు.

అందుకు అమ్మ "దైవం తన నిర్ణయాన్ని మార్చగలదు. తాను కావాలనుకున్నప్పుడే అలా జరిగేది. తన సంకల్పం మార్చుకోగోరితే అది సంకల్పమే కాదు. సర్వోత్కృష్టమే కాదు. మనకు లాగే ఒక కల్పన అవుతుంది. అయినా మీరు చెప్పే అద్భుతాలు అద్భుతాలే కాదు నాదృష్టిలో. సృష్టికి మించిన అద్భుతమేమున్నది? అద్భుతాలనబడే ఆ సంఘటనలు కూడా ముందుగా నిర్ణయింపబడినవే" అన్నది.


వీటన్నిటి కన్నా జిల్లెళ్ళమూడిలో భరద్వాజను కట్టిపడేసిన అంశం మరొకటి ఉన్నది. 1942లో భరద్వాజకు 4వ ఏట తల్లి చనిపోయింది. ఎన్నో కొన్ని సంఘటనలు మాత్రమే అతని మనస్సుపై చెరగని ముద్రవేస్తాయి. తల్లికోసం తనెప్పుడూ ఏడ్వలేదు. అయితే తనను పూర్తిగా అర్థం చేసుకో గలిగే వ్యక్తి మళ్ళీ కనబడదు. అని మాత్రం అనిపిస్తుండేది అతనికి. కాని ఆ ఆలోచనలకు భిన్నంగా

జిల్లెళ్ళమూడిలో "హైమ" కనిపించింది. తనను కన్నబిడ్డగా ఆదరించే పరిపూర్ణమాతృత్వంగా నిలిచింది. హైమ అత్యంతము ప్రేమించి లాలించిన ఆటవస్తువు భరద్వాజ. భరద్వాజ కోరుకున్న తల్లి కాదు హైమ- హైమ కోరుకున్న బిడ్డ భరద్వాజ. భరద్వాజ తనకు తెలియకుండానే తాను అనుభవిస్తున్న ఒంటరితనాన్ని, బైటకు కనపడకుండా లోలోపల అంతర్గతంగా అనుభవిస్తున్న విచారాన్ని పోగొట్టాలని కోరుకున్నది హైమ. తానొక తల్లియై మూడేండ్ల బిడ్డకు తల్లి ఎలాంటి సేవ చేస్తుందో ఆ సేవలన్నీ నీళ్ళు పోయటం, అన్నం పెట్టడం, తలదువ్వడం, ఒడిలో పడుకోబెట్టుకొని లాలించడం, నిద్రపుచ్చటం, భరద్వాజకు తానే చేయాలని హైమకోరుకున్నది. భరద్వాజతో ప్రమేయం లేకుండా "నా బాబు లాగా పెంచుకోవటం నీకు కాకపోయినా నాకు అవసరం. ఆ ఆలోచన వస్తే చాలు నా హృదయంలోని ఒంటరితనం, విచారము దూరమైపోతాయి. నిన్ను చూచిన నాటి నుండి నీపై మమత పెరుగుతూనే ఉన్నది. నీతో మాటాడకముందే నిన్ను చూచాను. నీ గురించిన ఆలోచనలు వదిలిపెట్టడం నాకు సాధ్యం కావటం లేదు" అని తన మాతృత్వ మమకారాన్ని క్రుమ్మరించింది. ఆ మాటలు కాదనగల సాహసం చేయలేక పోయాడు భరద్వాజ. హైమసాన్నిధ్యంలో మళ్ళీ శైశవాన్ని బాల్యాన్నీ గడపగల అదృష్టాన్ని పొందాడు.

హైమదేవాలయంలో చేరిన తర్వాత జిల్లెళ్ళమూడి వదిలి వెళ్ళాలని ఆలోచిస్తుండగా భరద్వాజతో అమ్మ "నీలో హైమను చూచుకుంటాను- దాని అపేక్షకి ప్రియమైన వాడివి నువ్వు. నీ జాగ్రత్త నేను తీసుకోవాలని తన చివరి మాటగా నాకు చెప్పింది. హైమకు ప్రియమైన జాగ్రత్త తీసుకోవటంలో నాకానందం కనుక నిన్ను ఉండమంటున్నా" అన్నది.

నిజమే ఎవరి జాగ్రత్తనైనా అమ్మకన్నా ఎవరు తీసుకోగలరు. భరద్వాజ నిజంగా ధన్యజీవి. జిల్లెళ్ళమూడి సోదరియైన రాజుబావ చెల్లెలు మంగను వివాహం చేసుకున్నాడు. ఒక కుమారుడు ఒక కూతురు.

చిరంజీవియై ఎందరి హృదయాలలోనో మెదలుతూనే ఉన్నాడు.



8. రాజమ్మగారు

అనురాగరూపిణి అయిన అమ్మ ఎవరిని ఏ రీతిగా తరింప చేస్తుందో చెప్పలేము. వారి యోగ్యతా యోగ్యతలతో కూడా పని లేదు. అమ్మకరుణ అకారణంగా ప్రవహిస్తుంది. కారణమున్నట్లు మనకు కనుపింప చేస్తుంది ఒక్కొక్కసారి. ప్రేమా- ద్వేషము కూడా అమ్మ రూపాలే అనిపిస్తుంది. అమ్మ చరిత్ర చూస్తే అవతరించిన నాటి నుండి ఆ రకమైన అనుగ్రహమే కనిపిస్తుంది. తన నగలు దొంగిలించిన జాలరినికాని, పెమ్మరాజు సత్యనారాయణ మూర్తిని కాని ఎవరినైనా శిక్షణేగాని శిక్షలేదు అమ్మ దగ్గర- పద్ధతులలో తేడాలుండవచ్చు. దేశిరాజు రాజమ్మగారిది మరొక పద్ధతి.

బాపట్లలో దేశిరాజు రాజమ్మగారుండేవారు. ఆమె యోగిని. మంత్రో పాసకురాలు. రాజయోగ అనుభవం పొందినది. చాలామంది ఆమెవద్ద మంత్రోపదేశం పొందారు. ఆమె సంప్రదాయ పద్ధతిలోని మంత్ర గురువు. సహజంగా పురుషులకున్నంత విస్తృత గోష్ఠి అవకాశాలు స్త్రీల కుండవు. రాజమ్మగారు పాత ఆచారాలకు, మంత్రాలకు అంటుకుపోయిన వ్యక్తి.

అమ్మలోని అసాధారణ మేధా సంపత్తిని కాంతిని గమనించిన పిన్నత్తగారు బ్రహ్మాండం అనసూయమ్మగారు అమ్మను ఎవరైనా పెద్దవాళ్ళ వద్దకు తీసుకొని వెళ్ళి ఉపదేశం చేయిస్తే ఇంకా ఉన్నతస్థితి వస్తుంది అని భావించి 1949 ఆగస్టులో రాజమ్మగారి దగ్గరకు తీసుకొని వెళ్ళింది. ఆ అనసూయమ్మ ఏ ఉద్దేశంతో తీసుకొని

వెళ్ళినా ఈ అనసూయమ్మ మాత్రం రాజమ్మగారికి ఉద్ధరింపబడే తరుణం ఆసన్నమైంది కనుకే అక్కడకు వెళ్ళింది.

అమ్మ ఎవరి మార్గంలో వారికి ప్రోత్సాహాన్నిచ్చినా అమ్మది ప్రధానంగా జిజ్ఞాసా మార్గం. రాజమ్మగారిని కలిసిన మొదటి రోజు ప్రొద్దుపోయే సమయంలో దీపం వెలిగించే ప్రస్తావన వచ్చింది. అమ్మను దీపం వెలిగించమంది రాజమ్మగారు. అమ్మను దీపం వెలిగించమంటే అమ్మ జ్ఞాన దీపం వెలిగించే ప్రయత్నం చేసింది. అయితే అంతలో వారి మనుమరాలు దీపం వెలిగించి తెచ్చింది. అందువల్లె రాజమ్మగారికి అమ్మ వెలిగించటానికి పూనుకున్నా పూర్తిగా ఆ వెలుగులో వెలుగు కాలేకపోయింది. మెరుపులు చూచిందేకాని వెలుగును చూడలేకపోయింది.

ఇంటికి తిరిగి వెళ్లేముందు అమ్మను రాజమ్మగారు బొట్టు పెట్టుకొని వెళ్లమంది. మీరే పెట్టండి అన్నది అమ్మ– ఆమె విధవరాలు కావడంచేత తనకా భాగ్యం లేదన్నది. అందుకు అమ్మ మీకు తప్పులేకపోతే పెట్టమన్నది. అనాది ఆచారం కనుక పెట్టలేన్నది రాజమ్మగారు. “కీడు చేయటమైనా మీ చేతులో ఉంటే చేయండి చూద్దాం” అన్నది అమ్మ– ముత్తైదువుల చేత మొదలు పెట్టిస్తారు కదా? వైధవ్యం ఎందుకు వచ్చింది అని అడిగింది? అమ్మ. వాళ్ళ యోగ్యత అన్నది రాజమ్మగారు. అంటే బొట్టు కారణం కాదు గదా!” అని అమ్మ పాత ఆచారాన్ని ఖండించింది.

రాజమ్మగారికి దైవ సంకల్పం కాదు సంకల్పమే దైవమనీ, అమ్మ అంటే అంతులేనిది. అడ్డు లేనిది అని; మనస్సును ఒక స్థాయిలో పెట్టించ గల్గినదే మంత్రం అనీ, వేదాంతం చెప్పేవాడికీ వినేవాడికీ అనీ, సృష్టి అంటే హెచ్చు తగ్గులేననీ, అన్నీ తానైనది జ్ఞానమనీ, తల్లి అంటే తొలి అనీ, గురుశిష్యు లంటే పరమాత్మ జీవాత్మలనీ, నేనే సర్వమనీ, దైవం అంటే ఒక్కడే. అతడు స్త్రీగా కూడా ఉండవచ్చుననీ, పంచామృతాలంటే ఒక అమృతంలో నుండి పంచబడ్డవి. పాలు, మీగడ, పెరుగు, వెన్న, నెయ్యి అనీ, తమ సంభాషణలో వివరించింది.

రాజమ్మగారు ఈ మాటలు వింటూ అమ్మవంక కన్నార్పకుండా చూచింది. ఆమెలో కదలిక ఆరంభమైనది. కొన్నిక్షణాలు అలా చూచి కొన్నిక్షణాలు ఆలోచించి ‘ఓం’ అని ప్రణవం పట్టింది. తను ఎన్నడూ చూడని అనన్యతేజస్సూ అద్భుత

దృశ్యమూ దృగ్గోచరమైంది. శరీరం పులకించింది, కన్ను చెమర్చింది, కంఠం గద్గదమైంది "తల్లీ! తల్లీ! అన్నపూర్ణేశ్వరీ! అంటూ తన పాదాల మీద ఉన్న చెయ్యి తీయమని "అమ్మల గన్న అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ" అనే పద్యం చదివింది. అమ్మలో ఏదో అద్భుతం చూచిన రాజమ్మగారు అమ్మకు గురువుననిపించుకోవాలనే తపన ఎక్కువైంది. లేకపోతే ఒక మహాభాగ్యాన్ని పోగొట్టు కుంటానేమోనని భావించి మనసులో రేగిన కల్లోలానికి కలిగిన అయోమయావస్థకూ మాటల రూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తూ; "అమ్మా! ఏమిటో ఏమీ తోచడం లేదు. నీవు ఎవరో అర్థం కావటం లేదు. నీవు ఎందుకు వచ్చావో తెలియడం లేదు. ఏమి చేయాలో తెలియడం లేదు" అని అమ్మకు అన్నం పెట్టి తులసీదళాలు తీసుకొని రమ్మని అమ్మకు చెప్పి "నేను ఏ దళం వేసుకొని పుట్టానో ఈ దానం కోసం" అనుకున్నది. రాజమ్మగారు అమ్మను సంకల్పం చెప్పుకో మన్నది. సంకల్పం చెప్పుకొనేది కాదు కలిగేది అన్నది. సంకల్పం కలిగింది అన్నది. రాజమ్మగారు గురు ధ్యానం చేసుకోమని అమ్మకు చెప్పింది. గుర్తు చూపినవాడే గురువు అంటుంది అమ్మ. రాజమ్మగారు అమ్మకు ఏ గుర్తూ చూపలేదు. పైగా ఆమెకు చూపిన గుర్తులు ఆమె గుర్తించలేదు. ఈ తతంగం అంతా అయిం తర్వాత అమ్మ తమ ఇద్దరి సమావేశం భవిష్యత్తులో సర్వప్రయోజనకారి అవుతుందని వివరించింది. సర్వత్రా భిన్నత్వం లేకపోవడమే పరిపూర్ణత్వం అని చెప్పి, తనకున్నది తప్పించుకోలేని, దైవం తలిస్తేనే తాను తలుస్తాడు. కాని తాను తలచేది వేరేలేదనీ, గుర్తించే గుర్తులేక కన్నులున్నా దీపమున్నా చూడలేమనీ, తన్నుతాను తెలుసకోవటమంటే భగవంతుని తెలుసుకోవటమేననీ, సర్వాన్నీ తెలుసుకొనే తెలివే భగవంతుడనీ అమ్మ చెప్పే మాటలకు దిమ్మెరపోయి "నీ యదార్ధస్థితి ఏమిటో చెప్ప"మని అమ్మను అడిగింది. అమ్మ అంతలో తెరవేసి మాయగప్పి "నా యదార్థ స్థితి నాకు తెలిస్తే మీ వద్దకు వచ్చే దాన్ని కాదుగా" అన్నది.

ఈ కార్యక్రమం అంతా అమ్మకు మంత్రోపదేశం కోసమే ఏర్పాటయిందని భావించిన రాజమ్మగారికి భ్రాంతిని వదలించటానికి సంకల్పించిన అమ్మ ఈ కార్యక్రమం మీకూ, నాకూ, ప్రపంచానికీ అని చెప్పింది. ఎక్కడో రాజమ్మగారింట్లో సంభాషణ వల్ల ప్రపంచానికి, ప్రయోజనమేమిటి? అంటే కృష్ణార్జునుల సంభాషణే భగవద్గీత అయింది కదా! నేటికీ మార్గదర్శనం చేస్తున్నది కదా! అలాగే ఈ


సంభాషణ కూడా లోకానికి మార్గదర్శనం చేయాలని అమ్మ ఆకాంక్ష !

ధ్యానం అంటే ధ్యేయాన్ని స్మరించటమేనని, మాటలన్నీ మంత్రాలేననీ, గురువు బ్రహ్మమయితే ఆత్మార్పణ చేసుకోవటమేనని, ఏ మంత్రమైనా దైవానికి శబ్ద స్వరూపమేననీ, ఏ అవతారమైన రూప స్వరూపమేనని అమ్మ చెపుతుంటే అమ్మ అసాధారణ అలౌకికవ్యక్తి అన్న గుర్తింపు రాజమ్మ గారికి కలిగినా, తాను అలాంటి అమ్మకు గురువౌదామన్న ఉబలాటానికే పనికి వచ్చింది.

అమ్మకు "ఓం ఐం క్లీం హ్రీం శ్రీం ఓం" అని మంత్రోపదేశం చేసింది రాజమ్మగారు. అమ్మ 'ఓం' సుదీర్ఘంగా పలికే లోపలే సర్వేంద్రియాలు నిశ్చలత పొందాయి- అంతే, సమాధిలోకి వెళ్లింది. చాల సమయం తర్వాత అమ్మ రాజమ్మగారి పాదాలు పట్టుకోబాగా రాజమ్మగారే "అమ్మా! తల్లీ! జగజ్జననీ! నా కాళ్ళు పట్టు కుంటావా వద్దు వద్ద"ని అమ్మ పాదాలు పట్టుకున్నది. అమ్మ రూపాన్ని హృదయంలో నింపుకున్నది. అమ్మ ఆనంద స్వరూపమయిన బ్రహ్మోగా అనిపించింది, రాజమ్మగారికి.

అమ్మకు రాజమ్మగారికి ఈ సంభాషణ జరుగుతున్నంత సేపు అమ్మ రెండవ కుమారుడు 'రవి' మూడేళ్లవాడు అమ్మ వద్దే ఉన్నాడు. బహుశా నారదుడు లీలావతికి మంత్రోపదేశం చేస్తే గర్భంలోని ప్రహ్లాదుడు ఆ మంత్రాన్ని ధ్యానించినట్లుగా అమ్మ గర్భవాసాన పుట్టిన రవికి ఈ సంభాషణలోని సారాంశం వంట బట్టిందేమో, అంత కంటే మనసుకు అతనికి తెలియకుండా పట్టిందేమో అనిపిస్తుంది. మనందరికి కూడా అమ్మ ఆ యోగం పట్టించాలని కోరుకుందాం.

'మాతృదేవోభవ' అంటే తల్లి దేవతగా కలవారము అవుదాం. అమ్మ రాజమ్మగారి కోరిక ప్రకారం కొన్నివందల మందికి మంత్రోపదేశం చేసింది. మంత్రమే అమ్మ కదా!



9. "సరస్వతీపుత్ర" పుట్టపర్తి నారాయణాచార్యులు

అమ్మ ఒడిలోకి పుట్టపర్తి నారాయణాచార్యులవారు 1974 ఫిబ్రవరిలో వచ్చారు. లక్షమందికి ఒకే పంక్తిన భోజనం పెట్టిన అమ్మ కోటిమందికి దర్శనం ప్రసాదించడానికి వాత్సల్యయాత్రలో 6.2.1974 కడప వెళ్ళగా అక్కడ పుట్టపర్తివారు కవితాపద్యశ్రీలతో స్వాగతం పలికారు. "నిను పిలుతురు పదిపేరుల - నిపుణమతుల తపోయుతులు, మేమెరిగిన పేరొకటే మమ్మోమెడు తల్లివని; అమ్మా ! రావమ్మా ! నీమనసే వైకుంఠం - నీవేమాకవతారం" అంటూ ఆహ్వానించారు. అమ్మకు దేవుని గడపయైన కడపలో. అలాగే కడప నుండి మరలిపోతున్నపుడు వీడ్కోలు గీతం పలికారు. "తరలిపోవుచుంటి గాని - తనువుతోడ నీవుతల్లి, మనసులందు మాకు సతము మసలుచుందువు, పోయిరమ్మ జగజ్జనని - పోవుట నీవచ్చుటకే" అంటూనే అమ్మను తన మనస్సులో నింపుకున్నారు. అమ్మకు భౌతికంగా అప్పటికి వీడ్కోలు పలికారు కాని తాను అమ్మను తన మనస్సులో నింపుకున్నారు. అమ్మకు భౌతికంగా అప్పటికి వీడ్కోలు పలికారు కాని తాను అమ్మను వదలలేదు. అతి త్వరలో భార్యాబిడ్డలతో జిల్లెళ్ళమూడి వచ్చారు. అక్కడి మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి ఆచార్యులతో, విద్యార్థులతో అమ్మ సన్నిధిలో ఆనందాన్ని అనుభవించారు.

అమ్మ సన్నిధిలో సౌందర్యలహరిని గురించి, భాగవతాన్ని గురించి, ఉపన్యాస పరంపర నందించారు. భక్తితత్వాన్ని, భక్తుల చరిత్రను వివరిస్తూ రామాయణంలోని వివిధ పాత్రలను పరిచయం చేశారు. రామగాథకుటుంబగాథ అనీ, మానవుడికి సన్నిహితంగా మెలగే అవతారం రామావతారమనీ

హృదయరంజకంగా పేర్కొన్నారు. 14 భాషలు తెలిసినవారు ఆయా భాషలలోని రామాయణ రహస్యాలను పేర్కొని సరస్వతీపుత్రు దనిపించుకున్నారు.

1914 మార్చి 28న అనంతపురంజిల్లా పెనుగొండదగ్గరలోని చియ్యేడు గ్రామంలో పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, లక్ష్మీదేవమ్మలకు జన్మించారు. బాల్యంలోనే సంగీతం, నృత్యం, సాహిత్యకళల్లో ప్రావీణ్యం సంపాదించారు. విచిత్రమేమటంటే తాను రచించిన కావ్యాన్నే తన పాఠ్యగ్రంథంగా చదివి పరీక్ష వ్రాసిన అరుదైన కవి శ్రీ పుట్టపర్తివారు. తమ బంధువైన శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వద్ద ప్రాకృతభాషను అధ్యయనం చేశారు.

ఇరవై ఏళ్ళ వయసులో ప్రొద్దుటూరుకు చెందిన కనకమ్మను పెళ్ళి చేసుకున్నారు. అప్పటికి స్థిరమైన ఉద్యోగం లేదు. ఆ తర్వాతనే తిరుపతిలో ప్రాచ్యకళాశాలలో విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులై ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూలులో తెలుగుపండితునిగా చేరారు.

నారాయణాచార్యుల వారు శతాధికంగా గ్రంథాలు వ్రాసినా పెనుగొండ లక్ష్మి, మేఘదూతము, పురోగమనము, అగ్నివీణ, శివతాండవము ఆయనకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి. అందులోనూ శివతాండవము మరీ ప్రధానమైంది. ఏ సభకు ఆచార్యుల వారు వెళ్ళినా ప్రేక్షకులు దానిని పాడించుకోకుండా ఉండరు. నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డి పాలెం శివాలయం ప్రారంభోత్సవంలో ఆచార్యులవారు నృత్యం చేస్తూ శివతాండవాన్ని గానం చేసిన తీరు నభూతో నభవిష్యతి అని లోకం మెచ్చుకున్నది. విశేషమేమిటంటే పరమ వైష్ణవుడైన శ్రీ పుట్టపర్తివారి చేతిలో శివకావ్యం శివతాండవం రూపుదాల్చడం. ఆచార్యుల వారిలోని శివకేశవ అభేదతత్త్వానికి తార్కాణం. శ్రీ పుట్టపర్తి వారు జనప్రియ రామాయణం కూడా వ్రాశారు. అయితే అది పూర్తికాలేదు.

భారతప్రభుత్వం 1972 లోనే ఆచార్యులవారికి 'పద్మశ్రీ' సమర్పించి సత్కరించింది. 1975లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 1987 లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి ఆ మహనీయుని గౌరవించాయి. వీటన్నింటి కన్నా వారు జిల్లెళ్ళమూడి అమ్మ చేతులమీదుగా సత్కరింపబడటం విశిష్టమైనదిగా భావించారు. సోదరుడు శ్రీరాజుపాలెం శేషు రచించిన 'రాగబంధం' అవిష్కరణ అమ్మ చేయగా ఆ గ్రంథంపై అమ్మ సన్నిధిలో ప్రసంగిస్తూ ఎంతో మెచ్చుకున్నారు.


పుట్టపర్తివారికి సరస్వతీ కటాక్షమే గాని లక్ష్మీ కటాక్షం లేదు. ఎన్నో సన్మాలు జరిగినా ఉండటానికి సొంత ఇల్లులేదు. అమ్మ కడప వెళ్ళిన సందర్భంగా పుట్టపర్తివారిని కటాక్షించి సొంత ఇల్లు ఏర్పాటు చేసుకొనే అవకాశం కల్పించిందని వారి జీవిత చరిత్రలో చదివాను.

ప్రారంభదశలో ఆచార్యులవారు హిమాలయాలకు వెళ్ళి అక్కడే తన జీవితానికి చరమాంకం పాడాలనుకున్నారు గాని, విధి మరొక విధంగా నిర్ణయించింది. ఎందుకంటే దేశం పట్టనంత మహాకవి కావాల్సి ఉండగా అలా ఎందుకు జరుగుతుంది. దాదాపు 150 గ్రంథాలకు పైగా వ్రాసి ఆంధ్ర సంస్కృత ఆంగ్లభాషలను పుష్టివంతం చేశారు.

ఆచార్యులవారు హిమాలయాలో రెండు సంవత్సరాలు తపస్సు చేసి హృషీకేశ్‌లోని శివానందాశ్రమానికి చేరారు. అక్కడ ఆరుమాసాలు దాదాపుగా ఉన్నారు. స్వామి శివానందసరస్వతి ఆచార్యుల వారి అమోఘమైన ప్రతిభాపాటవాలకు అచ్చెరువంది వీరికి 'సరస్వతీపుత్ర' అనే బిరుదు ప్రదానం చేశారు. అక్కడి నుండి పాండిచ్చేరిలోని అరవిందాశ్రమానికి వెళ్ళి అక్కడ కొంతకాలం ఉన్నారు. ఆ సమయంలోనే అరవిందఘోష్ ప్రభావం ఆచార్యులవారిపై పడింది. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి వద్ద ప్రాకృత, సంగీత సాహిత్య రహస్యాలు ఎన్నో తెలుసుకున్నారు.

భార్య కనకమ్మగారు కవి పండిత వంశం నుండి వచ్చింది. వీరి రచనా వ్యాసంగానికి ఎంతో చేదోడు వాదోడుగా ఉండేది. సంస్కృతరామాయణం ఆమెకు హృత్కవిలె. ఆచార్యుల వారు వారి శ్రీమతితో బిడ్డలు అనూరాధ, నాగపద్మినీ దేవీలతో జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మ వద్ద పసిపిల్లవానివలె మాతృత్వ మహాత్వాన్ని రుచి చూశారు.

ఆచార్యుల వారికి ఒక కుమారుడు అయిదుగురు కుమార్తెలు. భార్య 1983లో ఆచార్యుల వారిని ఒంటరిగా చేసి వైకుంఠస్థురాలైంది. అప్పటి నుండి జీవితాన్ని ఏదో విధంగా గడిపారు. 1.9.1990 న అమ్మ అందించిన ఇంటిలోనే అమ్మలో కలిసి పోయారు కడపలో.



10. కొండముది రామకృష్ణ

“వాడు అప్పికట్లకు కరణం నాకు ఉపకరణం. వాడు జనానికి దర్శనం ఇప్పించటానికి కూర్చుంటే నాకు హాయిగా ఉంటుంది. చిన్నవయసులోనే జిల్లెళ్ళమూడిలో పెద్ద బాధ్యతలు నెత్తికెత్తుకున్నాడు. వాడిదేముందిరా ! నీ అంతవాడు లేడు. నీవు చేయకపోతే ఎవరు చేస్తారీ పని, నీవే చేయాలన్నయ్య అంటే పొంగిపోయి నెత్తినేసుకుని దగ్గరుండి అన్నీ జరిగేటట్లు చూస్తాడు” అని అమ్మ మనసులో చోటు సంపాదించుకొన్న అనుంగ బిడ్డడు కొండముది రామకృష్ణ.

జిల్లెళ్ళమూడి నాన్నగారితో దగ్గర బంధుత్వం ఉన్నది. బంధుత్వ రీత్యా జిల్లెళ్ళమూడి వెళ్ళిన సన్నివేశాలు తక్కువ. 1962లో అమ్మ జన్మదినోత్సవానికి ‘మాతృశ్రీ’ పేర ఒక అభినందన సంచిక తేవాలనే ప్రయత్నం జరిగింది. అప్పుడు ఆ పత్రిక సంపాదకత్వం వహించి దాన్ని వెలుగులోకి తేవటానికి ఆర్థికంగా హార్థికంగా శ్రమించాడు. తన సోదరుడు కొండముది బాలగోపాలకృష్ణమూర్తితో కలసి. అది మొదలు జిల్లెళ్ళమూడి రావడం ఎక్కువైందని చెప్పవచ్చు. అధరాపురపు శేషగిరిరావు గారు జిల్లెళ్ళమూడి సంస్థ బాధ్యతలు నిర్వహిస్తున్న రోజులలో అమ్మ వద్దకు వచ్చిపోతూ వారి బరువును కొంత భరించేవాడు. అమ్మ కోరికపై రామకృష్ణ తల్లి అన్నపూర్ణమ్మ గారు అమ్మ అతిలోక శక్తిపై నమ్మకంతో 1964 జనవరిలో అమ్మవద్దకు వచ్చి, జ్యోతిష్కులు రామకృష్ణకు త్వరలో మారకయోగం ఉన్నదని

చెప్పారని చెప్పి, తన భయాన్ని వ్యక్తపరచి, రామకృష్ణను అమ్మ చేతులలో పెట్టి "వీడ్ని నీకు అప్పజెప్పుతున్నాను చంపుకుంటావో, రక్షించుకుంటావో నీ ఇష్టం" అన్నది. అమ్మ రెండు చేతులతో ఆప్యాయంగా అక్కున చేర్చుకొని ఆశీర్వదించి "వీడి సంగతి నేను చూచుకుంటాను. నీవు దిగులుపడబోకు" అని అభయం ఇచ్చింది. ఆ రోజునుండి రామకృష్ణకు జిల్లెళ్ళమూడి నివాసంగా మారింది. అప్పికట్లకు ఉద్యోగరీత్యా అప్పుడప్పుడు పోయి వచ్చేవాడు. అమ్మకు అప్ప చెప్పిన తల్లి అన్నపూర్ణమ్మ, భార్య పద్మావతి ఎక్కువ కాలం అప్పికట్లలో ఉండటానికి ఇష్టపడలేదు. అందువల్ల సంసారాన్ని కూడా జిల్లెళ్ళమూడి తరలించక తప్పలేదు. అప్పటి నుండి సంస్థ వేరు తను వేరు అనే భావన లేకుండా సేవచేశాడు. 1934లో పుట్టిన రామకృష్ణ మూడు దశాబ్దాలు కూడా నిండకముందే జిల్లెళ్ళమడి సంస్థలో మూడు దశాబ్దాల సేవ చేశాడు గోపాలన్నయ్యతో కలసి.

చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో ఇంటి బాధ్యతల నీదటం, అప్పికట్లలో గౌతమ గ్రంథాలయ స్థాపన, మూతపడిన రామాలయాన్ని ప్రత్యర్థులకు సామరస్యం కూర్చి తెరిపించడం, రక్షిత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేయడం, విక్రమ స్పోర్ట్స్ క్లబ్, నాగార్జున కళాసమితి వంటివి నిర్వహించడం, వీటన్నింటిని మించి అమ్మ అనుగ్రహం జిల్లెళ్ళమూడి సంస్థ నిర్వహణకు తోడ్పడ్డాయి. రామకృష్ణ మంచి స్పోర్ట్స్‌మెన్. చెడుగుడు పోటీలలో పాల్గొన్నవాడు - నాటకాలు ఆడినవాడు, ఆడించినవాడు.

కొండముది వారి వంశంలో కవితా వాసన లేకపోలేదు. అది రామకృష్ణకు కూడా అబ్బింది. చిన్నప్పుడే ఆకాశవాణి నుండి సంగీత రూపకాలు ప్రసారమయినాయి. రామకృష్ణ వ్రాసిన గేయాలు తెలుగు స్వతంత్ర, స్రవంతి, ప్రతిభ, ప్రజామత, ప్రగతి, నగారా, శారద వంటి పత్రికలలో ఎన్నో ప్రచురింపబడ్డాయి. 'తపస్వి' అనే కలం పేరుతో ఆ రోజులలో వ్రాసేవాడు. ఆనాడు వ్రాసిన గేయాలను అమ్మ చాలసార్లు చదివించుకొని విన్నది. ఈ రచనా కౌశలం తరువాత మాతృశ్రీ పత్రిక సంపాదకునిగా బాధ్యతలు స్వీకరించటానికి తోడ్పడింది. దాదాపు రెండు పుష్కరాలపై చిల్కు మాతృశ్రీ సంపాదకునిగా సమర్థవంతంగా నిర్వహించాడు. ఒక వైపు జిల్లెళ్ళమూడిలో అమ్మను చూడటానికి వచ్చిన వారికి దర్శనం ఇప్పించటం. మరొక వైపు బాపట్ల మాతృశ్రీ ప్రింటర్స్‌లో

మాతృశ్రీ మాసపత్రిక అచ్చు. రెంటినీ సమర్థవంతంగా నిర్వహించాడు. సంపాదకీయాలు చివరి నిమిషంలో వ్రాయవలసి వచ్చినా ఎంతో హృద్యంగా సహృదయ నైవేద్యంగా వ్రాశాడు. అమ్మ అంటుండేది. "వాడికి ఆ ప్రెస్‌మిషన్ మ్రోతల మధ్య వ్రాయటం అలవాటైపోయింది" అని. జిల్లెళ్ళమూడి నాన్నగారు మాతృశ్రీ మాసపత్రిక పెట్టేరోజుల్లో రామకృష్ణతో" ఒక వ్యక్తిని గూర్చి ప్రతినెలా "ఏమి వ్రాస్తారురా?" అన్న ప్రశ్నకు "అదేమిటి నాన్నగారు ! చూసే కన్ను వ్రాసే పెన్ను ఉంటే ఎంతైనా వ్రాయవచ్చు" అని సమాధానమిచ్చి ఆ రంకంగా పుంఖానుపుంఖంగా సంపాదకీయాలు రచనలు చేసిన ప్రతిభా సంపన్నుడు రామకృష్ణ. ఇవన్నీ ఒక ఎత్తయితే అమ్మ సినిమాకు స్క్రిప్టు వ్రాయటం మరొక ఎత్తు. సినిమా సెన్సారు బోర్డు వారే ఇటువంటి రచన 'న భూతో న భవిష్యతి' అని మెచ్చుకున్నారు. రామకృష్ణ రచనలో కూడా కవిత్వం ఉట్టిపడుతుంటుంది. ఔచిత్య పద ప్రయోగం అర్థ గాంభీర్యం, సునిశిత పరిశీలన సర్వేసర్వత్రా గోచరమౌతుంది. రామకృష్ణ, మాతృదర్శనం, శ్రీ చరణ వైభవం, మాతృసంహిత, అన్నపూర్ణాలయం, వాత్సల్యగంగ, అనసూయా కళ్యాణం, హైమాలయం, అమ్మ అవతారమూర్తి, దేవుడి గెలుపు, అంతస్స్రోత్రం, విశ్వసంస్తుతి వంటి గ్రంథాలెన్నో మాతృసంహిత అనే మాతృశ్రీ సంపాదకీయాల సమాహారం బృహత్తర గ్రంథం వ్రాతప్రతి ఎలక్షన్ కమీషనర్ శ్రీ జి.వి.జి.కృష్ణమూర్తి చేత ఆవిష్కరింపబడి అనంతకాలంలో ప్రచురింపబడింది. విశ్వసంస్తుతి తప్ప మిగతా రచనలన్నీ అమ్మను గూర్చి వ్రాసిన రామకృష్ణ హృదయస్పందనలే. అమ్మ ప్రసాదించిన అనుభవాలమాలలే. వీరి శ్రీచరణ వైభవంపై మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి విద్యార్థి ఒకరు పరిశోధన చేసి సెంట్రల్ యూనివర్శిటీ నుండి యం.ఫిల్‌పట్టా తీసుకోవటం విశేషం.


అమ్మ వ్రాయించిన జీవిత చరిత్రలోని వానికి తనదైన శైలిలో 'భాషా సౌష్టవం కూర్చి మాతృశ్రీ మాసపత్రికలో మాతృశ్రీ జీవితము ధారావాహికంగా ప్రచురించారు. దేవీచరణ్, రహి అనే కలం పేరుతో మాతృశ్రీలోఎన్నో రచనలు చేశారు.

రామకృష్ణ అమ్మను లోకానికి ఒక దేవతగా కన్నా ఒకమానవతా మహనీయమూర్తిగా, మమతల పాలవెల్లిగా, ఒక సంఘ సంస్కర్తగా, ఒక ఆధ్యాత్మ విప్లవవాదిగా చూపించటానికి ఎక్కువ శ్రమించాడు. తన రచనల ద్వారా తానేకాక

అమ్మ సేవలో తన కుటుంబము తన బంధుమిత్రులు అందరినీ దగ్గరకు తీసుకొచ్చాడు. ప్రతిభా సంపన్నమైన తన వ్యక్తిత్వంలో అమ్మ అనుగ్రహం కూడా వాళ్ళమీద అలాగే ప్రవహించింది.

రామకృష్ణ ఎవరినైనా తనవాడుగా తీసుకొంటే అమ్మకు, సంస్థకు ఉపయోగ పడతాడు అనుకుంటే ఎంతో సహాయసహకారాలందించేవాడు. జిల్లెళ్ళమూడిలో జరిగిన ఎందరి వివాహాలకో పెళ్ళి పెద్దగా నిలచి వాళ్ళనుకున్నదానికన్నా గొప్పగా చేయించేవాడు. జిల్లెళ్ళమూడిలో అభాగ్యజీవులెందరికో తనే కొడుకై తల కొరివి పెట్టేవాడు. అనారోగ్యంతో బాధపడుతున్నా షుగర్ వ్యాధి శరీరంలోని అణువణువునూ కబళిస్తున్నా లెక్కచేయకుండా సంస్థ అభివృద్ధికి కృషిచేశాడు. మాతృశ్రీ విద్యాపరిషత్‌ను ఆయన బహిఃప్రాణంగా భావించాడు. శ్రీ విశ్వజననీ పరిషత్‌కు, విద్యాపరిషత్‌కు అధ్యక్షునిగా, కార్యదర్శిగా ఎంతోకాలం ఎన్నో బాధ్యతలు నిర్వహించాడు. అకుంఠిత దీక్ష - బహుముఖీనమైన ప్రజ్ఞ. కుశాగ్రబుద్ధి కలిగిన రామకృష్ణ అందరిచే అన్నయ్యగా పిలవబడుతూ కార్యనిర్వహణలో అందరింటి పెద్దగా ప్రతిభావంతునిగా ఏకచ్ఛత్రాటిపై సంస్థను ఏలాడు. అమ్మ సేవకు అంకితమై తన మనసులోని కోరిన మేరకు అమ్మ అనుగ్రహంతో జిల్లెళ్ళమూడిలోనే అమ్మ శ్రీచరణంలో 1998 ఆగష్టు 23న ఐక్యమైనాడు.

అమ్మ తన సేవకు ఎన్నుకున్న వ్యక్తులలో కొండముది రామకృష్ణ అగ్రగణ్యుడు. ధన్యజీవి. విశ్వమానవాలయంలో ప్రధమ ప్రధాన అర్చకుడు.





11. శేషగిరిరావన్నయ్య

"అమ్మ దివ్యసిద్ధాంత తత్త్వ మహాలయ ప్రాకారానికి మూల స్వరూపంగా భాసిల్లి ఆ అన్నపూర్ణేశ్వరి ఆశయాభిలాషలకు ఊపిరిగా వర్ధిల్లి, జగజ్జనని తన బిడ్డల క్షేమానికై సంకల్పించిన విద్యా, వైద్య, ప్రయాణాది సమస్త రూపశాఖలకు పట్టుగొమ్మగా, ఆటపట్టుగా, జీవధారగా భాసించి, అమ్మ దర్శనార్థమైవచ్చు అశేష జనసందోహ నివాసవిలసితమైన "అందరిల్లు"కు ఆయువుపట్టుగా, నిర్మాణ విరాట్టుగా కృషి సల్పిన పెద్ద అన్న అధరాపురపు శేషగిరిరావు అన్నయ్య.

పొన్నూరులో మధ్య బ్రహ్మణ కుటుంబంలో అధరాపురపు కృష్ణారావు ప్రయాగమ్మల పూజాఫలంగా 23.5.1912న జన్మించిన శేషగిరిరావుగారు విద్యా వినయ వివేక సంపన్నులై చిన్నతనం నుండీ అందరికీ తలలోని నాల్కగా ఉండేవారు.

జిల్లెళ్ళమూడి రాకముందు మహాత్మాగాంధీ స్వాతంత్ర్యోద్యమంలో ప్రభావితుడై 17వ యేటనే చదువుకు స్వస్తి చెప్పి 1929లోనే విదేశవస్తు బహిష్కరణలో పాల్గొన్నారు. 18వ ఏట ఉప్పు సత్యాగ్రహంలో తర్వాత క్విట్ ఇండియా ఉద్యమంలోనూపాల్గొని అరెస్టయి జైలు జీవితం గడిపారు. తమకున్న 200 ఎకరాల పొలాలు బీదలకు పంచటం చూచి భూదానోద్యమ నాయకుడు వినోబాభావే మెచ్చుకున్నారు. కులమత విచక్షణ లేకుండా వారింట్లో నిత్యభోజన వితరణ జరిగేది. పొన్నూరు చుట్టుప్రక్కల, గ్రామాలలో దేవాలయాలలో హరిజన

ప్రవేశం కావించారు. రాష్ట్ర మోటారు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా సేవాసమితి స్థాపించిన వారిలో ముఖ్యులై కొంతకాలం అధ్యక్షులుగా పనిచేశారు. జయప్రకాష్ నారాయణ చేత ప్రశంసలందుకున్నారు. 1955లోనే భావానారాయణస్వామి దేవాలయం వద్ద మహాత్మాగాంధీ మందిరాన్ని నెలకొల్పి గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

కల్మషమైన రాజకీయ రంగంలో కూడా కలుషహారియైన గంగానది వంటి పవిత్ర హృదయులు కొందరుంటారు- అనటానికి ఉదాహరణ వీరి జీవితం. మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్, మదనమోహన్ మాలవ్యా వంటి నిస్వార్థ దేశసేవా పరతంత్రుల కోవకు చెందినవారు శ్రీ అధరాపురపు శేషగిరిరావుగారు.

ఏ విశ్వవిద్యాలయాల్లోనూ పట్టా పుచ్చుకోక పోయినా జీవితం నేర్పిన పాఠాలవల్ల, సత్స్నేహ సంపత్తివల్ల సద్గ్రంథ పరిచయం వల్ల సంస్కారవంతుడుగా తీర్చిదిద్దబడి చిన్నతనంలోనే మాతృదేశ దాస్యవిముక్తికై స్వాతంత్ర్య సమరరంగం లోకి దూకి శ్రీ కృష్ణ జన్మస్థానాన్ని దర్శించారు. పదవుల కోసం ప్రాకులాడక ప్రజాహితజీవనంలో తన ఆస్తిపాస్తులు కర్పూరంలా కరిగించిన త్యాగమయ జీవి. పొన్నూరు పంచాయతీబోర్డ్ అధ్యక్షుడుగా ఉన్నా, మరి ఏ ఇతర పదవుల చేపట్టినా, అవి పదవులుగా కాక, బాధ్యతలుగా స్వీకరించి ప్రజాసేవ ప్రధాన లక్ష్యంగా వ్యవహరించారు. ఎల్లప్పుడూ పదిమంది మధ్య చిరునవ్వుతో ఖద్దరు దుస్తులను ధరించిన ఆ స్వచ్ఛమైన విగ్రహం అందరినీ ఆకర్షించేది. రాజకీయ ప్రత్యర్థులు కూడా ఈయనలోని నిజాయితీని, స్వార్థ త్యాగాన్ని హర్షించేవారు, సాహసాన్ని, ధైర్యాన్ని ప్రశంసించేవారు. స్వాతంత్ర్య సమరయోధునిగా తనకిచ్చిన 5 ఎకరాల భూమిని అమ్మ సంస్థ అభివృద్ధికి సమర్పించారు.

1959వ సంవత్సరంలో ఆయన జీవితం రాజకీయాల నుండి మరో మలుపు తిరిగింది. జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించటం, ఆ పవిత్ర మాతృమూర్తి పాదపద్మాల దర్శన స్పర్శనం ఆయనలో ఒక వినూత్న సుప్తదీప్తిని జాగృతం చేసింది. మాతృత్వపు మమకారపు రుచులు చవిచూసిన ఆయన హృదయం నిరంతరం ఆ దివ్యత్వంలోని అమృతం సేవించాలనే ఆరాటంలో మునిగిపోయింది. అందువల్ల ఆయన వంటి కర్తవ్య పరాయణులు అమ్మ వద్ద అందరింటి బాధ్యతలు స్వీకరించి, అక్కడే ఉండవలసి

వచ్చింది. నిరంతర కార్యశీలి అయిన శ్రీ శేషగిరిరావుగారు జిల్లెళ్ళమూడిలో నేడు కనిపిస్తున్న ప్రతిపనికి పునాది వంటివారు. ఆయన అగ్రేసరతలో అక్కడ పని రూపుదిద్దుకున్నది.

అధరాపురపు శేషగిరిరావు గారు జిల్లెళ్ళమూడి అందరింటి వాస్తుశిల్పి అంటే ఆశ్చర్యం లేదు. వారు సంస్థ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న రోజులలోనే ఇప్పుడున్న అందరిల్లు. అన్నపూర్ణాలయం నిర్మాణం జరిగాయి. వారి అవిరళకృషి వల్లనే సంస్కృత పాఠశాల, కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. వారెప్పుడూ అర్థరాత్రి జిల్లెళ్ళమూడి వచ్చేవారు. ఒకరోజు జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మ నిద్రింస్తుండంతో నమస్కారం చేసుకొని వెళ్ళిపోయారు నిద్రపోవడానికి,

అమ్మ పడుకొని ఉన్నది. అమ్మ మంచం ప్రక్కనే గోపాలన్నయ్య పండుకొన్నాడు. మధ్యలో లేచి అమ్మ చేయి పట్టుకుంటే విపరీతంగా జ్వరం ఉన్నది. అమ్మా! జ్వరం 104 ఉన్నట్లున్నది అన్నాడు గోపాలన్నయ్య. "అయితే ! ఏం చేద్దాం?" అన్నది అమ్మ, గోపాలు శేషగిరిరావు గారి దగ్గర మందు తీసుకొని వస్తానన్నాడు. మొదటి రోజులలో సంస్థ నిర్వహణ బాధ్యతలు కొంతకాలం నిర్వహించిన సీతాచలంగారు ఆయుర్వేద డాక్టరు. వారు అమ్మకు మందులిచ్చేవారు. ఆ తర్వాత వచ్చిన శేషగిరిరావు గారు హోమియో డాక్టరు. సరే, వెళ్లిరా! ఆయన ఎక్కడ ఉన్నాడని వెళ్తావు అన్నది అమ్మ. గోపాలన్నయ్య వెతకటానికి వెళ్ళి ఆవరణంతా వెతికి చివరకు అన్నపూర్ణాలయం డాబా మీదకు వెళ్ళి ఒక మూల మంచుపడకుండా దుప్పట్లు తలపై వేసి జాగ్రత్తగా ఒక వ్యక్తి పడుకొని ఉండటం చూసి, ఆయనే శేషగిరిరావుగారేమోనని అక్కడకు వెళ్లాడు. దగ్గరకు వెళ్ళుతున్నకొద్దీ అక్కడ ఏదో వడ్లు దంచుతున్న శబ్దం వినిపిస్తున్నది. ఇప్పుడెక్కడ వడ్లు దంచుతున్నారు? ఈ శబ్దం ఎటువైపు నుండి వస్తున్నది. అని శ్రద్ధగా ఏకాగ్రంగా గమనించారు. ఆ శబ్దం శేషగిరావుగారి వైపు నుండి వస్తున్నది. ఇంకా శ్రద్ధగా గమనించారు. ఆయనలో నుండి "అంఆ, అంఆ, అంఆ," అనే శబ్దం వడ్ల దంపుడు వలె వినిపించింది. వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాల నుండి అలా వస్తున్నది. ఆయన పీల్చి వదిలే గాలిలో సైతం అమ్మ శబ్దతరంగాలు, జాగ్రత్త నిద్రావస్థలలో కూడా వారి ప్రాణంలో ప్రాణమై అమ్మ ఎలా సంచరిస్తున్నదో అర్థమైంది. అటువంటి మహానుభావుల సాహచర్యం లభించినందుకు ఎంతో ఆనందించాడు. అమ్మ

శేషగిరిరావుగారంటే ఎవరో ఏమిటో తెలియ చెప్పటానికే ఈ సన్నివేశం కల్పించిందేమో! అని భావించాడు గోపాలన్నయ్య. నెమ్మదిగా నిద్రలేపి అమ్మ జ్వరం విషయం చెప్పి, నిద్రమత్తులోనే వారు మందు పేరుచెబితే దానిని తెచ్చి అమ్మకు వేశారు. అమ్మకు తెల్లవారేటప్పటికి జ్వరం తగ్గింది.

ఆ ఉదయం అమ్మ వద్ద ఈవిషయం ప్రస్తావన వచ్చింది. శేషగిరి రావుగారు నేను మందు చెప్పానా? నాకేమీ జ్ఞాపకం లేదే అన్నారు.

మరి అమ్మ ఆయన రూపంలో చెప్పి మందు వేయించుకున్నదేమో? ఈ సంఘటన వల్ల తెలుస్తున్నది. అలాంటి మహనీయులు ఎంత మందో అమ్మ సేవలో తరించారు. ధన్యులైనారు. శేషగిరిరావు అన్నయ్య వంటి వారి మార్గదర్శకత్వమే గోపాలన్నయ్య లాంటి వారికి అమ్మ సేవచేసి తరించేందుకు ఆలంబనమైంది.

శ్రీ శేషగిరిరావు గారు జిల్లెళ్ళమూడి వచ్చిన క్రొత్తలోనే నాన్నగారి వద్దకు పోయి అమ్మను వదిలి ఉండలేని తన స్థితిని వివరించి తనను నాన్నగారి రెండవ కుమారుడైన రవి తర్వాత బిడ్డగా స్వీకరించమని అర్థించాడు. సంస్థ అభివృద్ధికై ఆయన ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేసుకొని అమలు పరచడానికి ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నమే ఆయన తపస్సు. ఆ పనిలో అన్నం, నీరు పట్టేవి కాదు, ఎండ, వాన లెక్కచేసేవారు కాదు. అర్ధరాత్రి ప్రయాణం చేస్తున్నా ఏదో ఒక మహత్తర జ్యోతి ఆయనకు ముందు దారి చూపిస్తూ తీసుకొని పోయేది. ధ్యాసే ధ్యానం అన్న అమ్మ మాట ఆధారంగా సర్వవేళలా అమ్మ ధ్యాసలోనే ఉండేవారు. పొంగు క్రుంగులు ఆయనలో లేవని నేనను. కాని అమ్మ ఓదార్పు లాలనలు ఆయనకు శాంతిని ప్రసాదించేవి. అయితే, చేపట్టిన పని పూర్తయ్యేవరకు విశ్రమించేవారు కాదు.

ఒకసారి శేషగిరిరావన్నయ్య అమ్మతో 'అమ్మా! నువ్వు జిల్లెళ్ళమూడిలో వచ్చిన నీ బిడ్డలకు దర్శన మిస్తుండగా నేను మద్రాసు మౌంట్ రోడ్డులో నిన్ను తలచుకుంటూ నడుస్తుంటే నీకెలా అనిపిస్తుంది?" అని అడిగారు. అందుకు అమ్మ "నాకంటి ముందు నడుస్తున్నట్లే ఉంటుంది" అని చెప్పింది. అలాగే మరొకసారి 1961లో హైదరాబాద్‌లో తంగిరాల కేశవశర్మ ఇంటికి వెళ్ళారు. అప్పుడే ఉద్యోగం

కోసం వెతుక్కుంటూ సరియైన ఉద్యోగం దొరక్క నానాయాతనలు పడుతూ, తిన్ననాడు తింటూ, లేనినాడు పస్తుంటూ గడుపుతున్న రోజులవి. శేషగిరిరావు గారిని చూడగానే కేశవ ఆనందించి ఆయన కేదన్నా పెడదామని చూచాడు. ఏమీ కనిపించక, చివరకు దొండకాయలు ఆయనకు పెట్టారు. శేషగిరిరావుగారు కేశవ పరిస్థితికి బాధపడి అమ్మ వద్దకు వచ్చి కేశవ శర్మ పరిస్థితిని వివరించి కన్నీరు పెట్టుకున్నారు. అప్పుడు అమ్మ వాడు నాకేం చెప్పలేదుగదా అన్నది. కాని అలా చెప్పిన కొద్ది కాలానికే కేశవశర్మకు మంచి ఉద్యోగం రావటం జీవితంలో స్థిరపడటం జరిగింది.

శేషగిరిరావుగారి భార్య రమాబాయమ్మ అక్కయ్య కూడా అమ్మ సేవలో ఏమాత్రం తీసిపోయేది కాదు. అమ్మ వద్దకు వచ్చిన వారికి తలంట్లు పోయటం, పెళ్ళి కొడుకులను చేయడటం వంటి కార్యక్రమాలలో పాల్గొంటుండేది. తమ ఇంటికి వచ్చిన వారి కార్యక్రమాలలో పాల్గొంటుండేది. తమ ఇంటికి వచ్చిన వారికి పెట్టిపోతల విషయంలో కూడా ఎంతో ఆప్యాయత, ఆదరణ కనబరిచేది అమ్మ శేషగిరిరావు గారింటికి వరుసగా 1961, 62 సంవత్సరాలలో ఏప్రియల్‌లో వెళ్ళటం నేను ప్రత్యక్షంగా వారింటి వద్ద అమ్మను దర్శించడం వారి ఆతిథ్యం స్వీకరించడం జరిగింది. కొన్ని వందల మంది అమ్మతో, వారింటికి వచ్చారు. పొన్నూరులో అమ్మకు వైభవంగా ఊరేగింపు జరిపారు శేషగిరిరావుగారు. అమ్మతో పాటు హైమను కూడా వాళ్ళింట్లో దర్శించుకున్నాం ఆనాడు. అక్కడ నుండి అమ్మ జన్మస్థలమైన మన్నవలో అమ్మ జన్మదినమహోత్సవానికి వెళ్ళాము.

అమ్మపై ఆయన ఆరాధన భావం అచంచల మయినది. ఆయన విశ్వాసం చెక్కుచెదరనిది. ఎన్ని ఆటుపోటులు వచ్చినా ఎన్ని బాధలు కల్గినా ఆఖరికి తన ఆరాధ్య దైవమే తనను పరీక్షలకు లోను చేసినా ఆ విశ్వాసం నుంచి కించిత్తు కూడా చలించలేదు.

అమ్మ ఆజ్ఞ అయితే అది కొండ మీద కోతినయినా తేవలసిందే. ఆ స్వామి భక్తి పరాయణత అటువంటిది. ఆ ప్రయాసలో శరీరము మనస్సు స్వస్థత తప్పిన లెక్కించేవారు కాదు. రామునకు ఆంజనేయునిలా, అమ్మకు శేషగిరి రావు అన్నయ్య ఉండేవారు. ఆయన నమ్మకానికి తగ్గట్టే అమ్మ కూడా ఆయనకు ఎన్నో అనుభవాలను

ప్రసాదించింది. అన్నిటికన్నా ముఖ్యమైనది. ఒకటి ఉదహరిస్తాను.

అన్నయ్యకు ఒకనాడు తన భార్య రమాబాయమ్మ గారు కృష్ణుడుగా అమ్మగా కనుపించింది. ఆయన ఆశ్చర్యపోయి కళ్ళు నులుముకొని చూచాడు. తన నిరంతర భావనే అలా అనిపించిందేమోనని. కాని అలా కాదు అమ్మ రూపం ప్రత్యక్షంగా కనిపించింది. ఇక ఆనాటి నుండి ఆయన మనస్సన్యాసియై ఆమెలో అమ్మను దర్శించారు. "పాతివ్రత్యానికి చరమదశ భర్త కూడా భార్యను అమ్మా! అని పిలవటం" అని అమ్మ అన్నారు. కాని భర్త భార్యను అమ్మా అని పిలిచే స్థితికి వచ్చినపుడు ఆ భర్తను ఏమనాలి? శ్రీ శేషగిరి రావన్నయ్య పండిపోయాడనాలి. సర్వత్రా మాతృత్వాన్ని చూచే జ్ఞానపరాకాష్ఠ అది.

కారణాలేవైనా శేషగిరిరావన్నయ్య పద్మనాభరావు (బాబురావు) గారింట్లో ఉండగా 26.12.1970లో అమ్మ చింతనలో ఉంటూ అమ్మలో లీనమైనారు. అందరిల్లే ఆయనకు ఆధారమైంది. అమ్మే ఆరాధ్యమైంది. అమ్మే సర్వస్వమైంది. సర్వసంగపరిత్యాగిని చేసింది. ముక్తిని ప్రసాదించింది.

జిల్లెళ్ళమూడి వచ్చిన వారిలో తరుచుగా నేను చూచే అత్యంత సహజము ప్రధానమైన విషయం ఒకటున్నది. చావు యెడల భయం లేకపోవటం. ఆయన మృత్యు ముఖంలో ఉన్నప్పుడు కూడా డాక్టరు బ్రహ్మాండం రాము చూడటానికి వెళ్ళితే, మరణాన్ని గూర్చి నాకేనాడూ భయంలేదు. ఆ చనిపోయేటప్పుడు అమ్మ పాదాల మీద యీ తల ఆన్చి ప్రాణం వదలాలని ఉన్నది. చనిపోయేలోగా అమ్మను ఒకసారి చూడాలని ఉన్నది అన్నారు. అన్నయ్య కోరిక ఏ రూపంలో అమ్మ నెరవేర్చిందో తెలియదు కాని అయనకా కోరిక తీరకపోయెనే అనే వెలితి మాత్రం మా అందరినీ బాధ పెట్టింది. తను, మన, ధనాలతో అమ్మను ఆరాధించి ధన్యుడు శ్రీ శేషగిరిరావు అన్నయ్య.

స్వయంగా నాకు వారితో జరిగిన అనుభవం చెబుతాను. వారితో ప్రయాణం చేస్తే బస్సులు చాలా తేలికగా దొరుకుతాయి. అది అలా ఉంచండి. ఒకసారి హైదారాబాద్‌లో ఒక ఆఫీసులో పని చేయించవలసి వచ్చింది. నేను అన్నయ్యగారి వద్దకు వెళ్ళి ఈ పని చేయించాలి. మీరు హైదరాబాద్ వెళ్ళేటప్పుడు చెప్పండి. నేను కూడా మీవెంట వస్తాను అని అడిగాను. అందుకాయన నీవు వెంట వస్తే గాని ఆ పని చేయనా? ఈ పనికి నీవు రానక్కరలేదు. ఎల్లుండికి నీకు ఆ పని

జరిగినట్లు ఉత్తరం వ్రాస్తాను అన్నారు. తన స్వంత పనిగా భావించి తన ఖర్చుతో నా పని చేసి పెట్టిన ఆ వ్యక్తిని చూసి చలించిపోయాను. ఇలా ఎంతమందికి ఎన్ని పనులు చేసిపెట్టారో!

అమ్మ వద్ద కూచుంటే ఆ ఆనందాతిరేకంతో హృదయం ద్రవించి కళ్ళవెంట నీరు కారుస్తుండేవారు. ఆ మహనీయుని భావశబలతకు, ఆరాధనకు ఎంతో సంతోషించేవారు అమ్మ. ఇలాంటి అన్నయ్య మనకు కొండంత అండ అనుకునేవాళ్ళం.

'నేటి జిల్లెళ్ళమూడి రోడ్డు నిర్మాణంలో వారి స్వేదధార ఉన్నది. జిల్లెళ్ళమూడిలోని విద్యుద్దీప కాంతిలో వారి విజ్ఞాన రోచిస్సు ఉన్నది. దినదినాభివృద్ధి నొందే అన్నపూర్ణాలయపు గాడిపొయ్యి మంటలో విశ్వశ్రేయస్సుకై వారి వేదనా జ్వాల ఉన్నది. సముచితమై సర్వజనాశ్రయమై తనవారే భవనద్వయ సౌందర్యంలో వారి మందస్మితం ఉన్నది. మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీ పునాది రాతిలో వారి సర్వస్వం ఉన్నది" అని వారి తర్వాత సంస్థ బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ అన్నయ్య వ్రాసిన వ్రాతలు అక్షరాల నిజాలు.

అమ్మకు అత్యంత ప్రియతమ పుత్రుడయిన శ్రీ శేషగిరిరావు అన్నయ్య జిల్లెళ్ళమూడిలోని ప్రతి అణువణువులోనూ ప్రత్యక్షమౌతారు. ఆయన చిరంజీవి. ఆయన వేసిన బాటలు మనకు ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం నెరపుతుంటవి.

వారి శతజయింతి సందర్భంగా పొన్నూరు ఆర్.టి.సి. బస్‌స్టాండులో వారి మిత్రులు శేషగిరిరావుగారి విగ్రహం నెలకొల్పారు. శ్రీ విశ్వజననీ పరిషత్ తమ వంతు సాయం అందించింది. అందరింటి సోదరీ సోదరులందరూ హర్షించదగ్గ విషయం ఇది.



12. మరిడమ్మ తాతమ్మ

అమ్మ జీవితమహోదధిలో వెలసిన ఉత్తుంగ తరంగం మరిడమ్మ తాతమ్మ. బంధుత్వరీత్యా అమ్మ తండ్రి సీతాపతిగారికి చిన్న మేనత్త మరిడమ్మగారు. సంసారసుఖం ఎరుగని బాలవితంతువు. ఆధ్యాత్మిక సంపన్నులరాలు. భక్తురాలు. అన్నగారి కుమారుడు, మేనల్లుడు అయిన సీతాపతి శర్మగారి కుటుంబంలోనే ఒక సభ్యురాలిగా కాలం వెళ్ళబుచ్చింది. పరోపకారపరాయణిగా అందరి మేలుకోరుతూ అందరికీ సేవచేసింది.

అమ్మ పుట్టిన 29వ రోజున యాజలి నుండి వచ్చిన మరిడమ్మగారితో అమ్మ తల్లి రంగమ్మగారు అమ్మ ఉనికిని గూర్చి భయపడుతూ చెపితే "నీ పిల్ల వంశపావని," భయపడాల్సిన పని లేదు అని రంగమ్మను దగ్గరకు తీసుకుని ఓదార్చింది. ఆ రోజు రాత్రి పడుకున్న రంగమ్మ ముఖంలో అమ్మమ్మ ఒడిలో వుండి అమ్మ పాలుత్రాగుతున్నట్లు అమ్మమ్మ పడగ పట్టినట్లు కనపడుతుండగా "ఇంకా అనేక విచిత్రములు జరగును" అని వినపడ్డది. మొదటిసారి అమ్మ జన్మించిన తర్వాత జరిగిన విశేషం మరిడమ్మగారికే కావటం అమ్మ అనుగ్రహంలో భాగమే- అంతేకాదు అటు జరుగుతున్న చిత్రములు ఇటు రంగమ్మగారు పిలుస్తున్న పిలుపు గమనిస్తూ రెండూ ఒకేసారి కాలాన్ని గుర్తించక గుర్తిస్తున్నది. దీనినే సహజ సమాధి అంటారు పెద్దలు.

ఆ రోజు నుండి మరిడమ్మగారే అమ్మకుమేలుకొలుపులు పాడుతూ నిద్రలేపటం, జోలపాడుతూ నిద్రపుచ్చటం చేస్తుండేది. అమ్మకు మూడవ నెలరాగానే పూర్ణిమనాడు ముద్దుకుడుము లిద్దామని నానబోసిన బియ్యం పిండి కొట్టమని పనిమనిషిని ఖాదర్‌బీకి చెప్పి ఇంట్లోకి వెళ్లింది. ఖాదర్‌బీకి ఈ మాట వినపడక ఏదో పని చేసుకుంటున్నది. ఖాదర్‌బీ కనుపించలేదుగాని పోటువినపడి బియ్యం మెదిగి, పిండి అయి ఉంటుంది. బియ్యానికి మించిన పిండి ఉన్నది. జల్లెడపట్టాల్సిన అవసరం లేనంత మెత్తగా ఉన్నది. ఇదంతా తన గురువుగారు పాతగుంటూరులోని మల్లెల రత్తమ్మగారి మహిమ అనుకుంటుంది మరిడమ్మగారు. ఆమెకు ఆ రోజు ఎన్నో అనుభవాలు ప్రసాదించింది అమ్మ. సంవత్సరన్నర కూడా సరిగా నిండని అమ్మకు మరిడమ్మగారు నిత్యం చేసే సత్కాలక్షేపం అర్థమవుతూనే ఉండేది. ఆ రోజులలోనే ఒకసారి మన్నవలో మంత్రి ప్రగడ రాజమ్మగారింట్లో దానిమ్మ

చెట్టుక్రింద, తెనాలిలో అమ్మ అమ్మమ్మగారింట్లో దానిమ్మచెట్టు క్రింద నల్లగుడ్లను పైకి పోనిచ్చి అరమోడ్పు కన్నుతో చేప నిద్రమాదిరిగా యెడమ కాలును చాచి కుడికాలును వెనక్కు పోనిచ్చి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆపి శాంభవీముద్రలో ఉన్నది అమ్మ. తెనాలిలో అమ్మ పెదతల్లి అన్నపూర్ణమ్మగారు అమ్మను ఎందుకట్లా కూర్చున్నావని అడిగితే అది శాంభవీముద్రలే, మరిడమ్మ తాతమ్మ చెప్పిందిలే అన్నది. చెప్పిందా చేస్తుంటే చూశావా? అంటే చేస్తుంటే చూశాను అడిగితే చెప్పింది అని సమాధానం ఇచ్చింది అమ్మ. సహజంగా యోగీశ్వరేశ్వరీ అయిన అమ్మ మరిడమ్మగారికే ఆ గొప్పతనాన్ని కూర్చాలనుకున్నది. ఏమైనా మరిడమ్మగారే అమ్మకు శ్రద్ధగా అన్నం పెట్టుతుండేది. అయితే ఆ అన్నం అమ్మకు ఇమిడేది కాదు లోపలికి పోయిన రీతిలోనే బయటకు వచ్చేసేది.

అమ్మ తల్లి రంగమ్మగారు పోయిం తర్వాత పిల్లలని ఎవరు పెంచాలి అనే సమస్య వచ్చింది. అమ్మను అందరూ తీసుకెళ్ళుతూవుంటారు గాని రాఘవరావుమామయ్యని ఎవరూ తీసుకెళ్ళటానికి ఇష్టపడకపోతే మరిడమ్మగారు ఒక సంవత్సరం దాకా ఎవరో ఒకరు చూస్తే యేతల్లో ఒక తల్లి కాచి పోస్తుందిలే అని సీతాపతి తాతగారికి రెండవ పెళ్ళి ప్రస్తావన తెస్తుంది. తాతగారు ఒప్పుకోరు. అమ్మను తెనాలిలోని అమ్మ మాతా మహులు తీసుకెళ్ళుతామంటే తాతగారు నాకూ బాధ్యత తీరుతుంది తీసుకెళ్ళమంటారు. మరిడమ్మకారు సీతాపతి తాతగారితో "నీకున్న బాధ్యత నీకున్నది పిల్లను వారితో పంపించేసి పిల్లాడి పెళ్ళి చేసేద్దామనుకోగానే బాధ్యత తీరిపోదు. దేనికైనా కాలం కలిసి రావాలి" అంటుంది.

గంగరాజు పున్నయ్యకారు అమ్మను కృష్ణునిగా దర్శించి తెలిసీ తెలియని స్థితిలో ఉండగా, చిదంబరరావుగారు అమ్మతో మాట్లాడుతుంటే మరిడమ్మగారు కల్పించుకొని మీగొడవే మీదా! పున్నయ్య సంగతి ఏమైనా ఆలోచించారా? అన్నది. అందుకు అమ్మ ఆలకించలా, లాలించానన్నది. లాలించట మేమిటి బ్రహ్మాండమై నప్పుడు పాలించదూ అన్నారు చిదంబరరావుగారు. బ్రహ్మాండమైనప్పుడు పాలించే తీరుతుంది అన్నది అమ్మ. మరిడమ్మతో అమ్మ "మా అన్నయ్య ఇంకా అన్నానికి రాలేదు, అందరం తిన్నాం తల్లికి ఒక బిడ్డ రాకపోయినా దిగులే" అన్నది. అదేమిటి అన్నయ్యను పట్టుకొ బిడ్డ అంటావు? వాడు అన్నం తిన్నకపోతే బాధపడే తల్లి దాటిపోయిందిగా? అన్నది మరిడమ్మగారు. "వాడు అన్నం తినకపోతే బాధ పడే తల్లిపోయినా ఎవరు అన్నం తినకపోయినా బాధపడే తల్లి ఉన్నది?" అన్నది. "పెంచిన మమకారం నీకు ఈ మాట చెప్పే అమ్మ అమ్మగా అర్థం

గాకుండానూ ఉన్నది" అన్నది అమ్మ. మరిడమ్మగారికి అమ్మ ముఖంలో తన గురువుగారు మల్లెల రత్తమ్మగారు వచ్చి చెబుతున్నట్లున్నది. చిదంబరరావుగారు మరిడమ్మగారితో మీ నాయనమ్మ అమ్మాయమ్మగారు, అన్నగారు చలపతిరావు, అందరికీ సేవచేసే నీవు మీ ముగ్గురి సాధన చతుష్టయ సంపత్తి సారం అమ్మగా (అనసూయ) అవతరించింది అంటే ఆనందంతో మరిడమ్మగారు కళ్ళనీళ్ళు పెట్టుకొని ఈ ఉద్దేశం చెదరకుండా నీలో చేర్చుకో తల్లీ! మళ్ళీ మాయను కప్పవద్దని స్తోత్రం చేసింది. అమ్మ పుట్టినప్పటి నుండి జరిగిన విశేషాలు తలచుకొని మహాపురుషుడు పుట్టేటప్పటి లక్షణాలున్నయ్యనుకుంది.

అమ్మ మరిడమ్మగారితో మీ అమ్మ అమ్మాయమ్మగారి సంగతి చెప్పు అనగా "మా అమ్మ అమ్మాయమ్మే ఈ అమ్మ అయితే ఇంకా చెప్పేదేముంది? నీకు తెలియందేమున్నది" అన్నది. అందుకు అమ్మ నాది తెలిసీ తెలియని స్థితి అన్నది. అది నీవంటి వాళ్ళకు వర్తిస్తుందటమ్మా? అది చిన్న పిల్లల్ని అనే మాట అంటూ కృష్ణుని సుద్దులు పాడుతూ అమ్మకు తలంటి స్నానం చేయించింది, మరిడమ్మ తాతమ్మ. ఒకసారి తాతమ్మ అమ్మను తీసికొని గుంటూరు పోతుండగా తాటిపర్తి దగ్గర ఒక ఘోషాయి కన్పించి అమ్మకు నమస్కరించాడు. అమ్మ అతన్ని కుశల ప్రశ్నలు వేసింది. తాతమ్మతో సన్యాసమంటే ఏమిటి? గృహస్థంటే ఏమిటి? ఘోషాయి అంటే ఎవరు? అంటూ రకరకాల ప్రశ్నలు వేస్తూ ఆరాలు తీస్తుంటే ప్రహ్లాదుడు, ధ్రువుడల్లే అవుతావేమో! అంటుంది అమ్మతో. అమ్మ పినతల్లి శేషమ్మగారు అమ్మను వాళ్ళింట్లో అట్టిపెట్టుకుంటానికి తీసుకు రమ్మంటే తాతమ్మ అమ్మను తీసుకొని చీరాల వెళ్ళింది. అక్కడ నూనె పానకాలుగారి తోటలో మౌనస్వామి ఉన్నారని తెలిసి అమ్మ, తాతమ్మ అక్కడకు పోయి వచ్చారు. తర్వాత అమ్మ మౌనస్వామితో మాట్లాడి మౌనం వీడి తనతో మాట్లాడినందుకు సంతోషిస్తుంది. మరిడమ్మగారితో కలిసి మంత్రోపదేశమైన సుబ్బాయమ్మగారు సన్యాసి జీవితం గడుపుతూ పోయింది. ఆరాధన అంటే ఏమిటో చూద్దామని అమ్మ కూడా తాతమ్మతో చేబ్రోలు వెళ్ళింది. అప్పుడే రెడ్డిపాలెం కాంతయ్యగారి ఆశ్రమానికి కూడా తాతమ్మతో వెళ్ళింది. తిరగి వస్తూ కాలువ గట్టున నడిచి వస్తుండగా చిన్నపిల్ల అమ్మను నడిపిస్తున్నందుకు తాతమ్మ బాధపడ్డది. అమ్మ తాతమ్మతో నేనే బాటలో నడిచినా చింతలు కనబడుతుంటయ్యేం? ఏమైనా నా వెంట చింతలు తప్పవు, అంటూ దాహం వేస్తున్నది అన్నది. తాతమ్మ తన వద్ద ఉన్న ఒకనారింజ పండు ఇచ్చింది. అది వొలుస్తుంటే ప్రక్కనే ఉన్న కాలువలో పడ్డది. అక్కడ ఒక కొండ చిలువ ఉన్నది.

దారిన పోయే ఒక అబ్బాయి దగ్గర తాబేటి కాయ ఉంటే పిల్లకు మంచి నీళ్ళుకావాలని అడిగింది. అవీ లేవు అయిపోయినవి అంటాడు. అప్పుడు అమ్మ "ఎంత ప్రేమగల వాళ్ళున్నా, ఎన్ని ఉన్నా బాధపడే యోగ్యత ఉన్ననాడు ఎవరూ తప్పించలేరు" అన్నది తాతమ్మతో.

అమ్మ ఒక రోజు నానబెట్టిన మినపప్పుకడుగుతూ తాతమ్మను ఈ నీరెందుకు పచ్చుబడ్డది? పొట్టుకున్న రంగు నీటి కొచ్చింది. సాంగత్యబలం అంటే ఇదేనా? నీరే పొట్టును పప్పును విడదీసింది. కాని దాని సహజమైన రంగు మారకతప్పలా. శక్తి రకరకాలుగా ఉన్నది. ఈ శక్తేనేమో భగవంతుడంటే. భావానికి రూపం ఉన్నది, రూపానికి పేరున్నది, శక్తి ఉన్నది. ఇందులో ఏదీ తక్కువది కాదు. అంతేనా తాతమ్మా? అనగా ఎవరో అడిగినట్టు చెప్పుకు పోతున్నావు. నన్నడిగేదేమున్నది అన్నది తాతమ్మ. తాతమ్మను అడుగుతున్నట్లు ఉండి తానే తాతమ్మనలా తీర్చి దిద్దుతున్నదేమో అనిపించే రీతిలో ఉంటుంది అమ్మ తత్త్వచింతన.

అమ్మ పెళ్ళి విషయంలో కూడా తాతమ్మ అమ్మను నాన్నగారి కిచ్చి చేయాలని ఆశ. ఇటు తల్లిలేని పిల్ల అటు తండ్రిలేని బిడ్డ, ఆ యిద్దరినీ ఒకటి చేసి తన కున్న ఆస్తి కూడా వాళ్ళకే ఇద్దామని వాళ్ళ దగ్గరే కడతేరి పోదామని ఆమె కోరిక, అటు సీతాపతి తాతగారికి, ఇటు కనకమ్మ బామ్మకు పరిపరి విధాల చెప్పి చూస్తుంది. అందరినీ పెంచింది ఆమే కనుక అందరినీ ఒప్పించటానికి తాపత్రయ పడ్డది. నాన్నగారు అంగీకరిస్తారు తాతమ్మ మాటకు. తర్జనభర్జనల అనంతరం ఎట్టకేలకు అనుకున్నట్లుగానే అమ్మ నాన్నల కళ్యాణం తాతమ్మ ఇష్ట ప్రకారం జరిగింది.

రైతు పాపయ్యకు అమ్మ గ్రామదేవత, పోతరాజుగా కనిపిస్తుంది. తన్మయావస్థలో ఉంటాడు. మరిడమ్మగారు చూచి నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళాడనుకుంటుంది. మరిడమ్మగారికి ధ్యానయోగం తెలుసు ధ్యానం ఎట్లా చేస్తావు తాతమ్మా? అని అమ్మ అడుగగా దృష్టిని మనస్సును ఏకం చేసి చూస్తామన్నది. దృష్టిని మనస్సును ఏకం చేసేది మనస్సే కదా? అప్పుడు నీవు ఎక్కడ వుండి చేస్తావు అన్నది అమ్మ. చిన్నపిల్లైనా ఆత్మజ్ఞానం కలిగిన పిల్ల అనుకున్నది తాతమ్మ.


అమ్మ సందె గొబ్బెమ్మ పెడతానంటే తాతమ్మ సరేనని వడపప్పు, పానకం, జామపళ్ళు ముత్తైదువులకు ఇవ్వు అంటుంది. తమల పాకులు కావద్దా అన్నది అమ్మ. అవి ఈ ఊళ్ళో దొరకవు కదమ్మా అన్నది తాతమ్మ. పోనీలే వేప చిగుళ్ళు, రావి ఆకులు ఇద్దాం అన్నది అమ్మ. తమల పాకులు మంగళప్రదం. రావి

ఆకులనివ్వటమేమిటి? అని తాతమ్మ అనగా అమ్మ ఏది మంగళప్రదముకాదు? ప్రతి ఆకు మంగళప్రదమే. భగవంతుడికి ఇష్టంకానిదేముంది? ఆ సందేహనివారణకే వినాయక చవితి నాడు అన్ని ఆకులతో పూజచేయడం. ఆ సందేహం పోవడానికి ఆవు పేడతో సందెగొబ్బెమ్మను చేసి గౌరిదేవిగా పూజిస్తారు అన్నది అమ్మ. తాతమ్మ అమ్మతో ఏకీభవిస్తుంది.

కామేశ్వరమ్మ అమ్మమ్మ, అమ్మ మాట్లాడుకుంటూండగా అమ్మ అన్న మాటలు విని తాతమ్మ ప్రేమ, ద్వేషముకూడా తన కొరకే అనుకోవచ్చునా అని అడిగింది. దూషణలు, భూషణలు సర్వం తనకొరకే. సర్వం తనుగా తోచనంత వరకూ ఈ నిజస్థితి అర్థంకాదు. అంతా తన కొరకే అని తోచినా నాడు అంతా తానే అవుతాడు అన్నది అమ్మ. తాతమ్మ కళ్ళవెంట నీళ్ళు తిరిగి అమ్మను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్నది.

అమ్మకు దెబ్బ తగిలింది. తాతమ్మ మానసికంగా బాధపడ్డది. ఏబాధైనా అది శరీర బాధైనా, మానసిక బాధైనా పడేది మనస్సే అన్నది అమ్మ. శరీర బాధను అనుభవించకుండా మనస్సును వేరు చేయవచ్చు. రమణ మహర్షి అలా చేశాడు. దానిని సమాధి స్థితి అంటారు అన్నది తాతమ్మ. మనస్సుకు శరీరానికి సంబంధం లేకుండా వేరు చేయడమా? అని, అలా రమణమహర్షిలా వేరుచేయడం చేతకాక, ఏమత్తూ, తీసుకోకుండా బాధలేకుండా ఉండేస్థితిని ఏమంటారు? అన్నది అమ్మ. సందె గొబ్బెమ్మను కాలవలో ఓలలాడించి రమ్మంది తాతమ్మ. ఓలలాడించటమంటే నీళ్ళలో కలపటమేగా! తయారుచేసింది కాలువలో మట్టిపెట్టి. ఎక్కడ తయారయిందో అక్కడ కలిసి పోవటమన్నమాట. ఆ కలిసిపోయే వేడుకలో, ఆ వేడుకకు కావలసిన సామానులో దైవత్వాన్ని చూడటానికే ఇవన్నీ అన్నదిఅమ్మ. ఆ విషయం సందెగొబ్బెమ్మ పెడుతున్న రోజే చెప్పావు? నీకు క్రొత్తగా చెప్పేముంది? నీకు తెలియని దేమున్నది? అన్నది తాతమ్మ. నిజంగా నీకు నామీద అటువంటి అభిప్రాయం ఉన్నదా? తాతమ్మా! అని అమ్మ అడగ్గా తప్పకుండా ఉందమ్మా! అన్నది తాతమ్మ.

ఈ రకంగా మరిడమ్మగారి తత్త్వం వింటున్నట్లు నటిస్తూ అసలు తత్త్వాన్ని వివరిస్తూ తనయెడల పూర్ణ విశ్వాసాన్నీ నమ్మకాన్నీ కలిగించి మరిడమ్మ తాతమ్మను తరింప చేసింది అమ్మ. మాయా మానుష రూపిణి, లీలా నాటక విలాసినియైన అమ్మ మరిడమ్మ తాతమ్మకు శాశ్వతానందాన్ని ప్రసాదించింది.



13. వీరమాచనేని ప్రసాదరావు

వీరమాచనేని ప్రసాదరావుగారు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారితో కలసి అమ్మతో తత్త్వచింతన చేసిన జిజ్ఞాసి. అమ్మ ప్రత్యేకించి ఏ అద్వైతమార్గాన్నో, విశిష్టాద్వైతమార్గాన్నో, ద్వైతమార్గాన్నో అనుసరించిన వ్యక్తికాదనీ, ఆలా అని నిరీశ్వర వాది కూడా కాదనీ, అమ్మ సహజ స్వభావి అనీ, అమ్మకు ప్రత్యేకించి ఒక సిద్ధాంతంలేదనీ, అమ్మ సర్వసిద్ధాంత సార్వభౌమ అనీ, మల్లెపువ్వు తను మల్లెపువ్వు అని చెప్పుకో లేనట్టే అమ్మ సహజ స్థితిలో ఉంటుందనీ, అమ్మే తెలివి గనుక, అమ్మను మనం గుర్తించాల్సిందేకాని అమ్మకు తానెవరో తెలుసుకోవటానికి తనకు భిన్నంగా వేరే ఏమీ లేదు గనుక అమ్మ తనకు చెప్పేదేమీ లేదని, అమ్మది 'వల్లకాని మిట్ట ప్రదేశమని' గుర్తించిన మహానుభావుడు.

అమ్మ సర్వజ్ఞ అని ఆయన అంటూ ఏది తెలిస్తే అంతా తెలుస్తుందో ఆ తెలుసుకొన్న స్థితి సర్వజ్ఞత్వం కదమ్మా! అంటే అమ్మ "సర్వజ్ఞత్వం అంటే అంతా తానై ఉండి మూడు కాలాలూ తెలిసికొని మూడుగా గుర్తించక ఉన్న స్థితిని సర్వజ్ఞత్వం అంటున్నారు. మీరు అన్నట్టు ఏది తెలుసుకుంటే అన్నీ తెలుస్తాయో అది నాకు తెలియదు. కానీ ఎప్పుడు ఏది కావాలంటే అది నాకు తెలుస్తుంది" అన్నది. నిజమే అంతా తెలిపిన వారికి ఎప్పుడు ఏది కావాలంటే అది తెలుస్తుంది. అన్నారు ప్రసాదరావుగారు.

ఆశ్చర్యమేమిటంటే సామ్యవాద సిద్ధాంతాలకు ప్రభావితుడై కమ్యూనిస్టు పార్టీలో రాటుదేలిన కార్యకర్తగా, పార్లమెంటు మెంబరుగా, సుప్రసిద్ధుడైన వ్యక్తి

ప్రసాదరావుగారు. 1970లో ఏదో పనిమీద తెనాలిలో వారికి తెలిపిన వారింటికి వెళ్లాడొకసారి. వాళ్ళింట్లో అమ్మ బొమ్మతో గల కాలెండరు తగిలించి ఉన్నది. ఎవరామె? కాలెండరులో వుండగల విశిష్టత ఏమిటని ప్రశ్నించారు. వారు ఆయనతో అమ్మ అందరికీ వర్ణవర్గ విచక్షణ లేకుండా ఆకలే అర్హతగా అన్నం పెడుతుందనీ, అందరినీ తన బిడ్డలుగానే ప్రేమిస్తుందనీ, ఆర్తులపట్ల అభాగ్యులపట్ల-ఆదరణతో ఆప్యాయతతో దగ్గరకు తీసుకొని స్వాంతన కలిగిస్తుందనీ చెప్పినమాటలకు ఆశ్చర్యపడి, కమ్యూనిస్టులుగాక ఇలా ప్రవర్తించే వారున్నారా! అయితే తప్పక ఆమెను చూడాల్సిందే అని జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మను చూచిన వారెవరైనా ఆ వాత్సల్యానికి, ఆ మమకారానికి, ఆ అప్యాయతకు లొంగి పోవలసిందే, కోపంతో, ద్వేషంతో వచ్చినా అమ్మ ప్రేమకు తలవంచాల్సిందే. ప్రసాదరావుగారిలో తానూ పూర్వం చూచిందీ, అనుభవించిందే

కాక ఇంకా తెలుసుకోవలసింది ఎంతో ఉన్నది అనిపించింది. వారిలో వారికి తెలియకుండానే మార్పు చోటుచేసుకున్నది. అక్కడి అన్నపూర్ణాలయంలో సమాదరణ, సహపంక్తి భోజనాలు, అక్కడి సంచరించే వారిలోని అక్కయ్య, అన్నయ్య అనే పలకరింపులు కల్మషం లేకుండా సహజ సిద్ధంగా ఉన్న ఆ వాతావరణం ఆయనను ఎంతగానో ఆకర్షించాయి. తాను చిరకాలంగా అనుసరిస్తున్న, ఆచరిస్తున్న సామ్యవాద సిద్ధాంతం ఇంత తేలిగ్గా, ఇంత సహజంగా రావాలి అనుకున్నారు. అందరూ ఒక కుటుంబంలోని సభ్యులుగా మెలగటంచూచి ఆనందించారు.

ఆ తర్వాత వారు హైదరాబాదు వెళ్ళి డాక్టర్ శ్రీపాదవారు, డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు, డాక్టర్ తంగిరాల సింహాద్రిశాస్త్రిగారు, శ్రీ చంద్రమౌళి వెంకటకృష్ణగారు వంటి వారితో అమ్మను గూర్చి చర్చించటం, అమ్మ ప్రసంగవశాన చెప్పిన విషయాలు తెలుసుకోవటం, అమ్మను గూర్చిన గ్రంధాలు చదవటం వంటివి చేశారు. ఈ సందర్భంలోనే వారి జీవితాన్ని మలుపు త్రిప్పే మరొక సంఘటన జరిగింది.

1972 అక్టోబరులో సికిందరాబాద్‌లో ప్రసాదరావుగారి కుమారుడు, కోడలూ ఒక జీపులో పోతుండగా ఆ జీపును ఒకలారీ వేగంగా వచ్చి ఢీకొన్నది. జీపు నుగ్గైపోయింది. కుమారునకు గాయాలైనాయి. అయితే పెద్దగా ప్రమాదం లేదన్నారు వైద్యులు. కాని వారి కోడలుకు మాత్రం ముఖం అంతా ఎముకలు

విరిగిపోయి, వికృత రూపమై ఆ ఎముకల ముక్కలు గ్రుచ్చుకొని మెదడు దెబ్బతిన్నది. స్పృహతప్పిపోయింది. హాస్పిటల్‌లో చేర్చారు. డాక్టర్లు పెదవి విరిచారు. ప్రాణానికి హామీ యివ్వలేమన్నారు. ఆపరేషన్ జరుపటానికి మాత్రం నిశ్చయించారు. శస్త్ర చికిత్స జరుగుతున్నది. బయట ఉన్న బంధు గణంలో ఆతురత, ఉద్విగ్నత చోటు చేసుకొన్నాయి. ఆ సమయంలో ఆపద్బాంధవునిలాగా శ్రీ జమ్మి వెంకటరత్నంగారు అమ్మవద్ద నుండి ప్రసాదమూ తీర్థమూ తెచ్చి ఇచ్చారు. లక్ష్మణుని బ్రతికించటానికిసంజీవ పర్వతం తెచ్చిన హనుమంతునిగా వెంకటరత్నంగారు కనిపించారు ప్రసాదరావుగారికి, వెంటనే తీర్థాన్ని కోడలి నోటిలో పోశారు. స్పృహ లేని కోడలు ఈ తీర్థాన్ని గుటక వేసింది. ఇక భయంలేదనుకున్నారు ప్రసాదరావుగారు. ఆమె కోలుకుంటుందనే ఆశ చిగురించింది.

ఇంతలో ప్రసాదరావుగారికి ఒక దృశ్యం కళ్ళముందు కదిలింది. అమ్మ డాక్టర్ వేషంలో ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళినట్లు, అమ్మ స్వయంగా ఆపరేషన్ జరుపుతున్నట్లు కనిపించింది. ఆపరేషన్ విజయవంతమైంది. బందువులేకాక డాక్టర్లు కూడా ఆశ్చర్యపోయారు. ఇలాంటి శస్త్రచికిత్సలలో లక్షలలో ఒకటి విజయవంతమౌతుందని విస్మయం ప్రకటించారు. ఏదో బలీయమైన శక్తి మీకోడలిని బ్రతికించింది అని ప్రసాదరావుగారితో చెప్పారు.

శస్త్రచికిత్స సక్రమంగా జరిగినా ముఖాకృతి వికృతం కావచ్చు. కాని మళ్ళీ ముఖం మారకుండా ఆ కళ్ళు, ముక్కు ఏ స్థానంలో అవి అమరి స్మృతి కలిగి మాటలు వచ్చాయి. అమ్మ అకారణ కారుణ్యానికి ఆనందించారు. అమ్మ చేసిన ఈ రకమైన విశిష్టతను తనతోటి కమ్యూనిష్టులకు పార్లమెంటు మెంబర్లకూ ప్రసాదరావుగారు చెప్పితే హేతువాదులైన వాళ్ళంతా 'ఇట్లా మారిపోయాడేమిటి మనవాడు' అని వాళ్ళు అనుకుంటుంటే, ప్రసాదరావుగారు చెప్పారు. "పూర్వం ఇటువంటి అనుభవాలు, నిదర్శనలూ, నిరూపణలూ లేవు- ఇప్పుడు వచ్చాయి నమ్మకపోతే ఎట్లా? ఏమీ అనుభవంలేకుండా మూఢంగా నమ్మితే ఎట్లా? అని పూర్వం అనుకున్నాను. అనుభవిస్తూ. చూస్తూ కూడా నమ్మకపోతే మూర్ఖత్వమే కదా" అని చెప్పారు. వాళ్ళకి. ఆపత్సమయాల్లో ఎందరిని ఆదరించిందో అమ్మ గ్రంథాల్లో చదివిన ప్రసాదరావుగారు అనుభవంలోకి వచ్చేటప్పటికి అమ్మను గూర్చి లోతుగా తెలుసుకోవాలనే ఆరాటం బయలు దేరింది. 1974 నుండి

శ్రీపాదవారితో కలిసి అమ్మ దగ్గర ఎక్కువకాలం గడుపుతూ ఎన్నో అనుమానాలు తీర్చుకుంటూ అమ్మ తత్త్వచింతన చేస్తూ అమ్మను గూర్చి లోకానికి తెలియచేయాలని ఆరాటపడ్డారు.

శ్రీరాజుపాలెం రామచంద్రరావుగారు తనతో అమ్మ చెప్పిన నాన్నగారి, బామ్మగారి, పొట్లూరి సుబ్బారావుగారి పునర్జన్మలను గూర్చిన విషయంగల వ్యాసం నేనొకసారి 1986 తర్వాత మాతృశ్రీలో ప్రచురించాను. వారికి మనస్సు కష్టం వేసినన్ను 'ఇదేమిటి? ఇలాంటివి ప్రచురించారు?' అని నిలదీశారు. "మీకు అమ్మ ఎలా జన్మలు లేవని చెప్పిందో- రామచంద్రరావుగారికి, పొట్లూరి సుబ్బారావుగారికి ఉన్నవని చెప్పింది. వారు వ్రాశారు. వారు వ్రాసింది అబద్ధమని అనలేం కదా! మీకు లేవని అమ్మ చెప్పింది" మీ వ్యాసంలో వ్రాయండి అన్నాను. వారు వ్రాయలేదు. అమ్మ పరిణామ సిద్ధాంతాన్ని ఒప్పుకొన్నది. ప్రతిక్షణమూ జరిగే మార్పుకూ, చావనుకొనే మార్పుకూ తేడాలేదా అంటే గుర్తింపు వస్తున్నది. లేకపోతే ఇంత ఏడుపెందుకు? శరీరం వదలిన తర్వాత అది ఏమవుతున్నదో, ఉందో లేదో తెలియదు. ఇదీ పరిణామమే- అదీ పరిణామమే- మనకర్థం కాని మార్పు జరుగుతున్నది అన్నది అమ్మ.

ఏది ఏమైనా ప్రసాదరావుగారు అమ్మను ప్రగాఢంగా విశ్వసించిన మహత్తన జీవి. అందరికి సుగతిని ప్రసాదించిన అమ్మ ప్రసాదరావుగారిని తనలోనే కలుపుకున్నది. ఆయన ధన్యజీవి.





14. తంగిరాల కేశవశర్మ

తండ్రి నరసింహారావుగారి వద్ద పాదకాంతదీక్ష తీసుకొని నిత్యం శ్రీ చక్రార్చన చేసేవాడు - చివరలో సన్యసించాలని తపన పడ్డాడు. కాని అమ్మ సన్యాసం తీసుకొనేది కాదు సన్యాసి కావడమే అన్నది. కేశవశర్మ నిజానికి నిజమైన సన్యాసి. అమ్మ, అమ్మ సంస్థ తప్ప మరొకటి ఎరుని మనస్సన్యాసి.

శ్రీ తంగిరాల కేశవశర్మగారు అమ్మ చేత 'ఋషి' అనిపించుకొన్నవాడు. "మీ అందరికంటే వాడే నయం వాడిది నిర్మలమైన మనస్సు, ఆ ఒక్క బలహీనత తప్ప వాడిని వేలెత్తి చూపే పనే లేదు" ఇలా ఏవేవో చెప్పేది అమ్మ కేశవశర్మను గూర్చి -

కేశవశర్మ అమ్మ వద్దకు రావటం ఒక విచిత్ర సన్నివేశమే. కేశవరావటమేమిటి? అమ్మ రప్పించుకోవటమే కదా ! రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ప్రచారక్‌గా చీరాలలో ఉన్న రోజులలో 'ఆర్గనైజర్' అనే వారపత్రిక (ఆ సంస్థకు సంబంధించినది) చందా కట్టించుకొనే నిమిత్తం మన్నవ బుచ్చిరాజుశర్మ (రాజుబావ) గారి కోసం కొమ్మూరు వెళ్ళాడు కేశవశర్మ. రాజుబావ జిల్లెళ్ళమూడి వెళ్ళాడని తెలియటంతో వారి కోసం జిల్లెళ్ళమూడి వచ్చాడు. అక్కడ ఉన్న రాజు బావకు, కేశవశర్మకు అమ్మ కాఫీ ఇచ్చింది. అయితే అమ్మను గూర్చి కేశవశర్మకు అప్పుడేమీ తెలియదు. తరువాత కొన్ని నెలలకు అమ్మను గూర్చి తెలిసి అమ్మను

చూడటానికి వచ్చాడు. అప్పటి నుండి అంటే 1958 నుండి అమ్మ వద్దకు చివరి ఊపిరి పీల్చిందాకా అమ్మను గూర్చి చింతతోనే గడిపాడు.

జిల్లెళ్ళమూడి వచ్చిన క్రొత్తల్లో కూడా అమ్మను చూచిన తర్వాత ఊరికే కూర్చునేవాడు కాదు. అమ్మ ఉన్న తడికెల గోడలకు పేడ కలిపిన మట్టి అతకటమో, నీళ్ళు చెరువు నుండి తేవటమో ఏదో ఒక పని చేస్తూ కాలం గడిపేవాడు. అమ్మ వద్ద మంత్రముగ్ధ జీవనం గడుపుతున్నా, మంచి యౌవనంలో ఉండడం వల్ల మనసు వ్యామోహంతో ఘర్షణ పడుతుండేది. తనను తను శిక్షించుకోవటానికి మనస్సును అదుపులో ఉంచుకోవటానికి కాలి నడకన ఆరునెలలు కన్యాకుమారి యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాడు. అమ్మ అందుకు అంగీకరించలేదు. అంతకాలం బిడ్డను చూడకుండా ఉండలేనన్నది. ఒకనెలలో తిరిగి రమ్మన్నది. ఏమైనా కాలినడక సాగలేదు కాని చేతిలో కానీ లేకుండా కన్యాకుమారి యాత్రసాగింది. కన్యాకుమారి ఆలయంలో అమ్మవారి వద్ద హైమ పాదాల మువ్వల సవ్వడి విన్నాడు. అత్రి అనసూయలు తపస్సు చేసిన జ్ఞానారణ్య ప్రదేశం చూశాడు. మరుత్వామలై కొండ గుహలో అమ్మవారి పాద చిహ్నాలు చూశాడు. కావాలనుకున్నప్పుడల్లా అమ్మ ఇచ్చిన తీర్థంలో అమ్మ రూపాన్ని దర్శించాడు. అమ్మ చెప్పినట్లుగా నెలరోజులలోనే యాత్ర ముగిసింది. అమ్మ వద్దకు వచ్చినప్పుడు అమ్మ "నీ పిలుపు నాకు వినపడుతోంది. కానీ నేను ఓయ్ అంటే నీకు వినపడదు" అన్నది. పైసా చేతిలో లేకుండా కన్యాకుమారి యాత్ర నెలలో ముగించుకొని అమ్మవద్దకు అమ్మ చెప్పినట్లుగా వచ్చాడు కేశవశర్మ. సమస్యకు పరిష్కారం బయట వెతకటం కాదు. అంతరంగంలోనే వెతకాలనే నిర్ణయానికి వచ్చాడు. అంటే ప్రేరణ నడత అన్నీ అమ్మ ఇచ్చేవే కదా!

కేశవశర్మ వివాహం కూడా అమ్మ విచిత్రంగానే చేసింది. అమరావతి నుండి దెందుకూరి శ్రీనివాసరావు అమ్మవద్దకు వస్తుండేవాడు. 1959 అన్నపూర్ణాలయ ప్రథమ వార్షికోత్సవానికి వచ్చాడు కేశవశర్మ. తిరుగుప్రయాణంలో శ్రీనివాసరావుతో కలసి పొండ్ల మాణిక్యమ్మగారింట్లో ఆగారు. మాటల సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబాన్ని గూర్చి, పెళ్లీడుకొచ్చిన అతని చెల్లెల్ని గూర్చి చెప్పింది. కేశవశర్మ "నేను చేసుకుంటాను" అని మాట ఇచ్చాడు. ఆ మాట నిలబెట్టుకోవడానికి అతడెన్నో

కష్టాలు పడాల్సి వచ్చింది. ఒకరోజు అకస్మాత్తుగా అమ్మవద్దకు వచ్చి "అమ్మా! నన్ను పెళ్ళికొడుకును చెయ్యమ్మా!" అని అడిగాడు. "పెళ్ళికూతురెవరురా ?" అన్నది. తెలియదన్నాడు. ఎప్పుడురా పెళ్ళి అన్నది. తెలియదమ్మా అన్నాడు. అక్కడున్నవారితో అమ్మ వీడు పెళ్ళికూతురెవరో తెలియకుండా, పెళ్ళి ఎప్పుడో తెలియకుండా పెళ్ళికొడుకును చేయమంటున్నాడు. చేసే పని తప్పు కాదు కదా! అని తలంటి నీళ్ళు పోయించి పెళ్ళికొడుకును చేసింది. కేశవశర్మకు ధైర్యం చిక్కింది. అమ్మ పెళ్ళికొడుకును చేసింది కనుక పెళ్ళి జరిగి తీరుతుంది అని. ప్రయత్నాలు ఎన్ని జరిగినా కేశవశర్మ నాన్నగారు ఇష్టపడలేదీ పెళ్ళికి. ధైర్యం చేసి కనకదుర్గగుళ్ళో పెళ్ళి చేసుకొంటానని చెప్పి వాళ్ళింటి నుండి హైదరాబాద్‌కు వెళ్ళిపోయాడు కేశవశర్మ. వాళ్లనాన్న ఇష్టపడిన తర్వాత అదే పెళ్ళికూతురితో పెళ్ళి జరిగింది. అమ్మ వాళ్ళ నాన్నగారి మనసు మార్చి కేశవశర్మకు ఇచ్చిన మాట నిలబెట్టి జరిపిన పెళ్ళి అది.

1959లో పెళ్ళి జరిగేనాటికి కేశవశర్మకు మంచి ఉద్యోగం లేదు. ఏవేవో కంపెనీలలో వాళ్ళ అన్నగారు చంద్రశేఖరంగారు చూపించిన వాటిలో చేసేవాడు. వాళ్ళ అన్నగారి సూచనతో యల్.ఐ.సి.లో ఉద్యోగం కోసం పరీక్ష వ్రాయటం జరిగింది. ఆ పరీక్ష వ్రాసి వచ్చిం తర్వాత నాతో రెండు మార్కులబిట్ ఒకటి తప్పుచేశాను. 98% మార్కులే వస్తాయి అన్నాడు. ఉద్యోగం వస్తుంది అన్నాడు. ఎంత విశ్వాసమో తనపట్ల తనకు. అలాగే ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగంలో గుమాస్తాగా చేరిన కేశవశర్మ డివిజనల్ ఆఫీసులో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా రిటైర్ అయినాడు. తన హయాంలో సెలెక్షన్ బోర్డు మెంబరుగా ఎంతమందికో సాయం చేశాడు. నలుగురు చేసే పని తనొక్కడే చేసేవాడు. తనతోటి వారితో చేయించేవాడు.

అసలు మంచి ఉద్యోగం రావటానికి అమ్మ అనుగ్రహానికి ఒక చిత్రమైన సన్నివేశం కారణం. ఒకసారి హైదరాబాద్‌లో కేశవశర్మ ఉన్నగదికి అధరాపురపు శేషగిరిరావు గారు వెళ్ళారు చూడటానికి. అన్నయ్య వచ్చే సమయానికి వారికి పెట్టటానికి ఏమీ ఇంట్లోలేవు. చాపమీద కూర్చోబెట్టి దొండకాయలుంటే అవి ఇచ్చాడు తినటానికి. కేశవపరిస్థితి చూచిన శేషగిరిరావన్నయ్య అమ్మతో కళ్ళనీళ్ళు

పెట్టుకుంటూ చెప్పాడు. అంతే చక్రం తిప్పింది అమ్మ. దాని పర్యవసానమే ఈ ఉద్యోగప్రాప్తి.

జొన్నలగడ్డ చంద్రశేఖరంగారు కేశవశర్మకు పెద్దమ్మకొడుకు. వారంటే కేశవశర్మకు ఎంతో ఇష్టం. ఆయన భార్యవద్ద చనువు. వాళ్ళకు చాలాకాలం సంతానం కలుగలేదు. అమ్మను దర్శించి వెళ్ళండి మన బాధ చెప్పుకోకుండానే తీరుస్తుంది అమ్మ, అని వాళ్ళకు చెప్పి తీసికొని వచ్చాడు. అలాగే జరిగింది. వాళ్ళకిచ్చే ప్రసాదంలో అమ్మ పూలతో కట్టిన జడ, మూడు అరటిపండ్లు వచ్చాయి. అంటే ముగ్గురు ఆడపిల్లలు పుట్టారా ! అన్నది వాళ్ళ వదిన. కాని జడతో సహా కలుపుకొని నలుగురు ఆడపిల్లలు పుట్టారు. అమ్మ అనుగ్రహం అలా ఉంటుంది. కేశవ బంధుప్రీతినీ తెలియచేస్తుంది.

కొణకంచి జగన్నాథంగారు తన మనుమడితో జిల్లెళ్ళమూడి వచ్చాడు 1959లో. అమ్మ పాదాలకు నమస్కరించి నీ పాదాల్లో పార్వతీ పరమేశ్వరులు కనిపిస్తున్నారన్నాడు. ఆయన గురుశంకనివృత్తికి తనతో బయటకు తోడు రమ్మంటే కేశవశర్మకూడా వెళ్ళాడు. పెద్దవాడు కదా! అని. తిరిగి వస్తూ మూలవిరేచనం అయింది. నాకు అంత్యకాలం సమీపించినట్లుంది అన్నాడా ముసలాయన. ఆరోజే అంతిమశ్వాస వదిలాడు. ఆయన అంత్యక్రియలు బాపట్లలో జరిగాయి. ఆయన మనుమడి బాధ్యత కేశవశర్మ మీద పడ్డది. వాడు కేశవశర్మకు మాలిమి అయినాడు. మొత్తం మీద మాటలు సరిగారాని వాడు వాళ్ళ తండ్రి రామచంద్రరావు అని చెప్పాడు. ఊరూ పేరూ తెలియని ఆ పసివాని సేవచేసి వాళ్ళ తల్లిదండ్రుల చిరునామా తెలుసుకొని వారిని రప్పించి ఆ పిల్లవాడ్ని అప్ప చెప్పాడు. మానవసేవ చేయడంలో కేశవశర్మ చిన్నప్పటి నుండి ముందుండేవాడు. ఆ పిల్లవాని తండ్రి మోగులూరి రామచంద్రరావుగారే ఆ తర్వాత రామకృష్ణ అన్నయ్య వియ్యంకుడయ్యాడు.

70 దశకంలో కేశవశర్మ విశృంఖలంగా తిరుగుతున్న రోజులలో ఒక రోజు అమ్మతో నేను "అలా వదిలేస్తే ఏలాగమ్మా ! కేశవ మనకు దక్కేటట్లు లేడు" అన్నాను. అప్పుడు అమ్మ "వెళ్ళనీయరా ! ఎంతదూరం పోతాడు? ఎప్పటికైనా అగి పోక తప్పదు కదా ! అప్పుడు పట్టుకుందాం" అన్నది. విశాఖపట్టణంలో

కేశవశర్మ ఉద్యోగం చేస్తున్న రోజులు 'మాతృశ్రీ అధ్యయన పరిషత్'ను ప్రారంభించాడు. ప్రతివారం లలితా లక్షనామార్చనతో అమ్మ పూజ చేయించడం జరుగుతున్నది. ఆ సందర్భంలోనే ఉపదేశం కాకుండా లలితా పారాయణ చేసే అధికారం మీకెవరిచ్చారని ఒక పీఠాధిపతి ప్రశ్నించటంతో అమ్మ అనుమతితో తన తండ్రి గారి వద్ద నుండి 'శ్రీ విద్యాదీక్ష' తీసుకున్నాను. అమ్మ చెప్పినట్లుగా శ్రీ మల్లాప్రగడ శ్రీరంగారావు గారిచే లలితా సహస్రనామభాష్య ప్రవచనం చేయించాడు. అధ్యయనపరిషత్ సభ్యులచే అఖండ అహోరాత్ర లలితాపారాయణ చేయించాడు. అందులో త్రికాల పూజలు, బాల, కుమారీ, సువాసినీ పూజలు ఒకటేమిటి? వైభవంగా జరిపాడు.

జిల్లెళ్ళమూడిలో శ్రీ మల్లాప్రగడ శ్రీ రంగారావుగారు చండీయాగం చేయమన్నారు. అమ్మ గాయత్రీ యాగం చేయండి నాన్నా! అన్నది. ఆ యాగానికి యజమానిగా అమ్మ సూచనల మేరకు కేశవశర్మ, శారద దంపతులను కూర్చోబెట్టటం జరిగింది. శ్రీరంగారావుగారు చెప్పిన లలితా ప్రవచనాలను భారతీవ్యాఖ్యగా, త్రయీవిద్య గ్రంథాలను కేశవశర్మ ఆధ్వర్యంలో విశాఖ అధ్యయన పరిషత్ వారు ప్రచురించటం జరిగింది. అమ్మ ఎలా తిరిగేవాడ్ని ఏలా మలుపు త్రిప్పిందో చూడండి. ఉద్యోగంతో పాటు నిమిషం తీరిక లేకుండా ఉండే శ్రీ చక్రార్చన, హోమప్రీతి మిగిలిన సేవా కార్యక్రమాలు పెట్టి కేశవశర్మ మనస్సును ఆక్రమించుకున్నది, మరొక ఆలోచనకు చోటు లేకుండా.

కేశవశర్మకు ఒక మగపిల్లవాడు, ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. 1970లో మరొక మగపిల్లవాడు పుట్టాడు. అమ్మ వాడికి వాత్సల్యమూర్తి అని పేరు పెట్టింది. ఒకరోజు అమ్మ దగ్గరకు వెళ్ళిన కేశవశర్మ ఉన్నట్టుండి సందర్భం లేకుండా "ఎంత కష్టం వచ్చినా నవ్వుతూ అనుభవించే వరమీయమ్మా! అని అమ్మను కోరాడు. ఆశ్చర్యం. అతడేమీ అమ్మను మామూలుగా కోరడు. అతడికి ఏం ఇబ్బంది వచ్చినా అమ్మతో నేను చెప్పేవాడిని. ఆఖరికి గుంటూరులోని కేశవశర్మ ఇంట్లో పంపుల్లో మంచినీళ్ళు రాకపోయినా అమ్మతో నేనే చెప్పేవాడిని. దాని పరిష్కారం ప్రసాదించేది. అలాంటిది ఇలా కోరాడు. అమ్మ నవ్వుతూ ప్రసాదించింది. అంతే రాత్రి ఇంటికి చేరే సమయానికి వాత్సల్యమూర్తికి జ్వరం ప్రారంభమైంది. అమ్మ ఇచ్చిన వరానికి

నిలబడతాడో లేడో చూడటం మొదలైంది. బాపట్ల ఆస్పత్రిలో ఫలితం లేక గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్చారు రాత్రి 12 గంటలకు. అసలు డాక్టర్ వచ్చి పరీక్ష చేయటానికి 12 గంటలు టైంపట్టింది. ఆ పసివాడికి బ్లడ్ క్యాన్సర్ (లుకేమియా) అని తేల్చారు. బ్రతికే అవకాశాలు తక్కువన్నారు. ఒక క్రిస్టియన్ మదర్ వచ్చి పిల్లవాడు బంగారంవంటి బిడ్డ భగవంతుని ప్రార్థించండి అని వెళ్ళిపోయింది. వాడు ప్రాణాలు వదిలాడు. కేశవ నాన్నగారు కేశవను చూచి కౌగలించుకొని నీకెంత కష్టం వచ్చిందిరా అని కన్నీళ్ళు పెట్టుకున్నారు. అత్యంత ప్రీతిపాత్రమైంది లేకుండా చేస్తేనే కదా! కష్టాన్ని నవ్వుతూ అనుభవింగలడో లేడో చూచేందుకు. అవలీలగా వరాలిచ్చే దేవత ఇచ్చిన వరంలో కేశవశర్మ నెగ్గాడు కాని శారద కన్నతల్లి కదా ! కట్టల త్రెంచుకొని వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. అమ్మ మళ్ళీ మగబిడ్డను ప్రసాదించేదాకా !

కేశవశర్మ మంచి కవి. తెలుగు ఆంగ్లభాషలపై మంచి ప్రావీణ్యం కలవాడు. **Mother of All** లో కొంతభాగాన్ని విశ్వజనని పేరుతో అనువాదం చేశాడు. 'అంతరంగ తరంగాలు' అనే పద్య, గేయ వచన కవితలు గల గ్రంథాలను ప్రచురించాడు. డాక్టర్ ప్రసాదరాయ కులపతి, డాక్టరు బిరుదురాజు రామరాజు వంటివారు ఎందరో మెచ్చుకొన్నకవి కేశవశర్మ. కేశవశర్మ కుమారుడు వాత్సల్యమూర్తి చనిపోయినపుడు అతడు వ్రాసిన "అమ్మా! ఇక నిన్నేమీ కోరను" అనే వచన కవిత ఆ దశాబ్దంలో వచ్చిన విశిష్టమైన కవితగా మెచ్చుకోబడింది.

శ్రీ విశ్వజననీపరిషత్, శ్రీ విద్యాపరిషత్, మాతృశ్రీ పబ్లికేషన్ ట్రస్ట్ వంటి సంస్థల నిర్మాణ సమయంలో అమ్మ ప్రత్యేకించి తన సంకల్ప మాత్రం చేత బదిలీ చేయించి బాపట్లకు పిలిపించింది కేశవశర్మను. ఆ సమయంలో జరిగిన సంఘటనలు చెపితే ఒక గ్రంథమౌతుంది. అడుగడుగునా అమ్మ చూపించిన విశేషాలు మాతృశ్రీ పబ్లికేషన్ ట్రస్టు సభ్యులు ముగ్గురిలో కేశవశర్మ ఒకడు అది విశ్వజననీపరిషత్‌లో కలిసేదాకా. వేదపరిషత్ నిర్మాణములోనూ, మాతృశ్రీ అధ్యయనపరిషత్‌ల నిర్మాణంలోను అతని శ్రమ అనన్య సామాన్యం.

శ్రీ విశ్వజననీపరిషత్ ఆర్థికంగా బలంగా ఉండటం కోసం "శ్రీ అనసూయేశ్వరాట్రస్ట్" ఏర్పాటు చేశాడు. మన్నవలో అమ్మ దేవాలయము, అమ్మ

పేర బీద విద్యార్థులకు, అనాధలకు, పేదలకు సహాయం చేయటానికి "అమ్మ జన్మస్థల ట్రస్టు" ఏర్పాటు చేశాడు. ఇవి ఏర్పాటు చేయటానికి అప్పులు చేశాడు, ఇల్లు అమ్మి చేశాడు. తను మన ధనాలతో ఆరాధించటం అంటే యేమిటో చేసి చూపించాడు. ఆదరణాలయం ఏర్పాటు చేశాడు. తానేకాదు తన బిడ్డ తేజోమూర్తి, భగవతి సైతం పాల్గొనేటట్లు చేసి పన్నెండు లక్షల దాకా విరాళం అందే ఏర్పాటు చేశాడు. మాతృశ్రీ సంస్కృత కళాశాల హాస్టల్ బిల్డింగ్‌కు వారి కుటుంబం వారి రెండవ కుమారుడు తేజోమూర్తి చేత తొమ్మిది లక్షల రూపాయలు వచ్చేటట్లు చేశాడు. తన బిడ్డలు ఎంత తనకు ఇస్తానన్నా తనకు వద్దని అంతా అమ్మ సంస్థలకే సమర్పించమన్న నిస్వార్థ త్యాగమయజీవి కేశవశర్మ.

హైమాలయ విగ్రహ ప్రతిష్ఠ సమయంలో శ్రీ యం.పూర్ణచంద్రరావు అప్ప చెప్పిన ప్రతిష్ఠా కార్యక్రమ నిర్వహణ బాధ్యత సక్రమంగా నిర్వహించాడు. అనసూయేశ్వరాలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగాను అతని కార్యనిర్వహణ దక్షత అమోఘం.

"శ్రీ విశ్వజననీచరితం" సప్తశతిగా సంస్కృతంలో చండీసప్తశతి లాగా వ్రాయించి పారాయణలు, హోమములు నిర్వహింపబడాలని కలలు కన్నాడు. వ్రాయించి సాకారం చేసుకొన్నాడు. పారాయణలు, హోమాలు నిర్వహించాడు.

అమ్మ బాల్యంలో గడిపిన బాపట్ల చిదంబరరావు తాతగారి ఇల్లు సూపర్‌స్పెషాలటీహాస్పిటల్‌గా రూపుదిద్దుకోవాలని చాలా కాలంగా ఆలోచన. కార్యరూపం ధరించలేదు. దాని కొరకు ఆ స్థలంలో బీదలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించాడు తన సొంతఖర్చుతో.


శ్రీ విశ్వజననీపరిషత్‌లో ఏ పదవీ తీసుకోకుండా అన్ని పనులు తానే నిర్వహించేవాడు. కంప్యూటర్‌లో భక్తుల వివరాలు నమోదు చేయటంలో తానే కాదు తన బిడ్డలు, బంధువులు అందరి సేవలు స్వీకరించి ఒక పద్ధతిలో పెట్టాడు. రశీదులు సైతం కంప్యూటర్ ద్వారా ఇచ్చే ఏర్పాటు చేశాడు.

1935 సెప్టెంబర్‌లో పుట్టిన కేశవశర్మ తన 75వ యేట 2010లో సైతం అనసూయేశ్వరాలయ పూర్వం వైభవస్థితికి అహరహం తపించాడు. అమ్మ చెప్పిన మాట నెరవేర్చండి, మెజారిటీ సభ్యుల మాటను అనుసరించండి అని సభ్యుల

సంతకాలు సేకరించి శ్రీ విశ్వజననీపరిషత్‌కు సమర్పించాడు. ఇప్పటికైనా అతని ఘోషను గుర్తించి అమ్మ మాటను అమలు చేయటమే కేశవశర్మకు మనమిచ్చే నిజమైన శ్రద్ధాంజలి.

ఇలా ఇందులో ఉన్నాడు అందులో లేడని లేదు. అమ్మకు సంబంధించి ఏ పనైనా ముందుండి ఒక వ్యక్తిగా కాక ఒక సామూహికశక్తిగా కదిలేవాడు. అలాంటి కేశవశర్మగారిని అమ్మ 4.6.2010 శుక్రవారం రాత్రి 7-30కు తనలో కలుపుకున్నది. జిల్లెళ్ళమూడి సంస్థ ఒక మూలస్తంభాన్ని కోల్పోయింది. ఆయనకేం అయన ధన్యుడు. శ్రీచక్రార్చన చేసే వాళ్ళకు అదే తుది జన్మ అని శాస్త్రకారులు చెపుతారు. అమ్మ ఎలాగూ అందరికీ సుగతేనన్నది. కాకపోతే కేశవశర్మకు ముందుగా ఇచ్చింది సంస్థకు ఆయన లేని లోటు అంత తేలిగ్గా పూడుతుందని నేననుకోను. వ్యక్తిగతంగా నాతో అరవై ఏళ్ళ అనుబంధం. ఈ విధంగా దూరం కావటం నాకు అత్యంత బాధాకరం. హృదయాన్ని కలచివేస్తున్నది.

పొరపొచ్చెమ్ములు లేని మాదయిన సంపూర్ణానురాగానికిన్
వరమై నిల్చిన స్నేహమాధురికి, సేవాభావ సంపత్తికిన్
అరవై యేడులు నిండి పండినవి, ధ్యేయమ్మైన మాత్రర్చనన్
తిరమై నిల్చితి మిట్లు, నన్విడిచి పొందెన్ ముందె మాతృస్థలిన్





15. శ్రీపాద మాతృశ్రీపాద

డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు జిల్లెళ్ళమూడి అమ్మ సాహిత్యానికి సంబంధించినంత వరకు వేదవ్యాసుడే. అమ్మ గ్రంథాలు వ్రాయలేదు. ఉపన్యాసలివ్వలేదు. తన దగ్గరకు వచ్చిన బిడ్డలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పేది. అవి అమ్మ అనుభవ వేదాంత నిధులు. అవి లోకానికి సూక్తి సుధలు. శ్రీపాద వారు అమ్మ వద్దకు వచ్చే నాటికే అమ్మ దినచర్య వ్రాసే అలవాటు కొందరు సోదరీమణులకుండేది. అందులో అమ్మ వివిధ విషయాలపై చెప్పిన భావాలున్నవి. ఆ ముడి పదార్థాలను తీసుకొని శీర్షికలుగా విభాగించి 'అమ్మ-అమ్మ వాక్యాలు' 'అమ్మతో సంభాషణలు' మూడుభాగాలుగా విభజించి సంపాదకత్వం వహించగా ప్రచురించారు. 'అర్కపురి విశేషాలు' అనేదానినే సంకలనం చేశారు. అవే ఈనాడు జిల్లెళ్ళమూడి సోదరీసోదరులకు వేదాలు. అమ్మది తోలునోరు కాదు కదా తాలుమాట రావటానికి. ఆ మాటలన్నీ ఆణిముత్యాలే.

అమ్మ మాటలలోని ప్రత్యేకతే శ్రీపాదను అమ్మ వద్దకు చేర్చింది. బాపట్ల ఆర్ట్సు కాలేజి ప్రిన్సిపాల్‌గా వచ్చిన శ్రీపాదతో స్నేహితుడు పద్మాజీ జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను చూచిరా, ఆమె మహిమాన్వితురాలు అని చెప్పాడు. ఇంకా ఎవరెవరో చెప్పారు. ఇంతమంది దైవం అని చెపుతున్న ఆమె ఎంతటిదో చూద్దాం అని

1964లో ఏప్రిల్‌లో అమ్మ వద్దకు వచ్చారు. అమ్మ ముఖ మండలంలో వెలిగిపోతున్న ప్రశాంతత వారిని ఆకర్షించింది. కాని అక్కడివారు అమ్మకు చేస్తున్నపూజలు చూచి అమ్మ తనను పూజ చేసుకోవటానికి అంగీకరించటం రుచించలేదు వారికి. ఈ విషయాన్ని తనను అమ్మను చూడమని ప్రోత్సహించిన పద్మాజీకి వుత్తరం వ్రాసి టేబుల్‌పై పెడుతుండగా "ఆ! ఏమంటున్నావ్?" అని శబ్దం వినిపించింది. ఎవరూలేరక్కడ. టేబుల్‌వైపు చూచారు. తను వ్రాసిన ఉత్తరంపై సిరా ఒలికి ఒక మూల అమ్మ చిత్రంగా రూపుదిద్దుకొని ఉంది. పైగా ఆ చిత్రంలో నుదుటను కుంకుమ ఉన్నది. ఆశ్చర్యపోవటం ఆయన వంతైంది. ఈ రకంగా ప్రారంభమైన అమ్మతో సాన్నిహిత్యం అమ్మే సర్వస్వం అయ్యే వరకూ పెరిగింది.

సహజంగా శ్రీపాద సైన్సు విద్యార్థి. భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీ సాధించినవారు. ఏ విషయాన్నైనా పరిశోధన చేసి నిగ్గు తేలిస్తేగాని అంగీకరించరు. సత్యాన్వేషణలో ఆయన నిష్ఠ అంతటిది. ఒక్క శాస్త్ర విషయంలోనేకాదు ఆధునిక సాహిత్యంలోను సంగీతంలోనూ, శిల్పకళలోనూ, మంచి పరిశోధన చేసిన ప్రతిభావంతుడు, మేధా సంపన్నుడు. ఆంధ్రవారపత్రికలో 'విజ్ఞాన వీధులు'– "వైజ్ఞానిక గాధాశతి" అనే శీర్షికలతో ఎన్నో వ్యాసాలు వ్రాశారు. గ్రంథాలుగా ప్రచురించారు. జానపదగేయాలలోని 'గతి' గురించి పరిశోధన చేసి వ్యాసాలు ప్రచురించారు. దామెర్లవారి చిత్రకళను గూర్చి, అజంతా, చరిత్ర గురించి ఎన్నో వ్యాసాలు వ్రాశారు. "సత్యసాయి వాగ్విభూతి", "షిర్డిసాయి తత్త్వప్రకాశము", "సాయి వాక్యవిభూతి", "శ్రీరమణవాక్యములు", "ఉపనిషద్ వాణి" మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలు వ్రాశారు.

అమ్మను నిశితంగా పరిశీలించారు, డైరీలు చదివారు, అధ్యయనం చేశారు. అమ్మ మాటలలోని విలక్షణత, విశిష్టత, వినూత్నత, అమ్మ వ్యక్తిత్వము వారిని ఆకట్టుకొన్నాయి. వారు ఎందరో మహనీయులను చూశారు, మాట్లాడారు. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు చదివారు, ఉపనిషత్తులు అధ్యయనం చేశారు. మహనీయుల జీవిత చరిత్రలు చదివారు, వారి బోధలు చదివారు. ఎక్కడా అమ్మ మాటలలోని పరిపూర్ణత వారికి కనుపించలేదు. అందువల్లే పూర్ణచంద్రుణ్ణి చూడాలంటే జిల్లెళ్ళమూడి రావలసిందే. ఇంకెక్కడైనా చంద్రవంకలే అన్నారు. అమ్మను గూర్చి చెప్పటమంటే బాపట్ల దగ్గర ఇసుక పాతర త్రవ్వటమలనేవారు. 'మాతృశ్రీ' తెలుగు

-ఇంగ్లీషు పత్రికల ద్వారా అమ్మ తత్వాన్ని లోకానికి అందించటానికి ప్రయత్నించారు. "అమ్మచెప్పేది" , "అమ్మను గురించి", "అమ్మ సూచించే కొత్తదారి", "అమ్మ - మహర్షి", అనే గ్రంథాలు స్వతంత్రంగా వ్రాశారు. తాను నమ్మిన అమ్మ సిద్ధాంతాన్ని, తనకు తృప్తి నిచ్చిన జగద్వ్యాప్తం కావాలని ఆరాటపడేవారు. వారు ఎంతో విశ్వాసంతో ఔద్ధత్యంగా ఉపన్యసించేవారు. అమ్మ సిద్ధాంతమనే గండ్రగొడ్డలి తీసుకొని బయలుదేరుతున్నాను ఎవరైనా అడ్డగించగలిగిన వారుంటే ముందుకు రమ్మనేవారు.

తనకు ఊహతెలిసి నప్పటినుండి క్రొత్త విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస, శాస్త్రవితరణ, పరిశీలన, సమన్వయము శ్రీపాద వారిలో జీర్ణించిన లక్షణాలు, నిర్దుష్టమైన భావాలు, నిష్కళంకమైన నడవడి, దేనికీ భయపడని మనస్తత్వము, ఏకాగ్రత, నిష్ఠ, ప్రేమించే గుణము, ఆప్యాయత వారిలో మనకు కనిపించే లక్షణాలు.

అమ్మ తత్వాన్ని అధ్యయనం చేసిన శ్రీపాద అమ్మ తత్త్వం అనుభవాన్నించి వచ్చిందని, శాస్త్రాలు చదివితే వచ్చిందికాదని, అందుకే అమ్మ చెప్పే జవాబులు శాస్త్రాలను తెగేసుకుంటూ పోతున్నట్లుంటాయనీ, అమ్మవల్ల గుర్తెరిగిన వారేకాని అమ్మకు గుర్తుచూపించిన గురువులెవరూ లేరనీ, అమ్మ మాటలు జీవితానికి సంబంధించినవిగానూ, జీవితంలో పొందటానికి వీలైనవిగానూ వినిపిస్తాయనీ, అమ్మ చెప్పే మాటలు సంప్రదాయ విరుద్ధంగా కనిపిస్తాయికాని పరిపూర్ణ సత్యం నుండి వచ్చే కాంతులేననీ, అమ్మ చెప్పేది దారికాదు గమ్యమేననీ,అమ్మ సూక్తులు ఏది పట్టుకున్నా "అంతా అదే" దగ్గరకు తీసుకు వెళ్ళుతుందనీ, ఇలా జీవితాన్నంతా సమన్వయించినవారు ఇది వరకు లేరనీ, వేరెవరూ ఇంత బలంగా సూచించలేదనీ అందుకే అమ్మ వద్దకు రాని సామాన్యులు కష్టాలను ఏడుస్తూ అనుభవిస్తారనీ వచ్చినవారు నవ్వుతూ అనుభవిస్తారనీ, అమ్మ సన్నిధి అపురూప నిధి- అమ్మ ఐహికానికి ఆముష్మికానికి వారధి అనీ, అందరిల్లు లోకానికి నమూనా అనీ, అమ్మ జగనాత్మ జిల్లెళ్ళమూడిలో పిలిస్తే పలికే అమ్మ అయి ఉన్నది, అని తన అనుభవసారాన్ని జనానికి తెలియచేశారు.

శ్రీపాద 27.9.1908 శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారంలో జోగమ్మ-కామేశ్వర రావులకు జన్మించాడు. భౌతికంగా, తనే కని వారి తల్లిదండ్రులకు పెంపుడిచ్చాను అన్న జగజ్జనని అమ్మమాట ప్రకారం ఆధ్యాత్మిక పుత్రుడై తను

వెతుక్కుంటున్న గమ్యాన్ని చేరగలిగిన ఒక యోగి, భక్తుడు, జ్ఞాని. మామూలు సామాన్య వ్యక్తికూడా తన ఆలోచనల ద్వారా జిజ్ఞాసద్వారా పూర్ణ సత్యాన్ని కనుగొనవచ్చు. అని అమ్మ వాక్యాల నుండి క్రొత్త దర్శనాన్ని పితికిన గోపాలుడీ గోపాలకృష్ణుడు. శ్రీపాదవారు ఎందరో విద్యార్థులకాచార్యులైనా అమ్మ పాదాల వద్ద ఒక విద్యార్థిగా ఉన్నాడు. అమ్మను గూర్చి ఎంతో తెలుసుకున్నా వారు అమ్మతో "నిన్నెరుగుదును అనటానికి ఎవరికీ దమ్ములేదు" అన్న వినయ వినమిత పూర్ణుడు. అందుకే వారిని గూర్చి చెపుతూ "తపించాడు- తరించాడు, అంతా అమ్మే అయినాడు" అన్నది అమ్మ. ఈరకంగా అమ్మ ఇంకెవరిని గూర్చి చెప్పినట్లు వినలేదు.

అమ్మ మానవిగా జిల్లెళ్ళమూడి కరణంగారి భార్య. ఆసంబంధమే లేకపోతే అమ్మ మనకు అంది ఉండకపోను. "అమ్మను మనం మొక్కుబడి దేవతగానో, లౌకికమైన ఈతిబాధలు తీర్చమనోకాదు కోరవలసింది. ఆధ్యాత్మిక పథంలో మన తప్పటడుగులు దిద్దమని, చైతన్యపు భాషనేర్పమని, గుండె ధైర్యమిమ్మని, ఆనందభుక్తి పెట్టమని, పాపకూపంలో పడకుండా ఎత్తుకొమ్మని ప్రార్థించాలి" అన్నారు శ్రీపాద. కాని అమ్మకు లౌకికము ఆధ్యాత్మికము అని రెండు లేవు. పాపపుణ్యాల ప్రసక్తి లేదు. అందరినీ తన బిడ్డలుగానే భావించింది. శ్రీపాద రాజమండ్రిలో చనిపోతే శరీరాన్ని జిల్లెళ్ళమూడికి తెప్పించింది. వారి కూతురు గాయత్రిచేత అంతిమ సంస్కారాలు చేయించింది. ప్రేమారామంలో రాలిపోయిన ఆ పుష్పాన్ని తన గుండెలకు హత్తుకున్నది. ముద్దుపెట్టుకున్నది. కన్నీరు కార్చింది. శ్రీపాదకేం! మాతృశ్రీ పాదమైనాడు. అమ్మలో లీనమైనాడు. అమ్మేతానైనాడు.

ఈ అందరిల్లు ఒక అగ్రజుని కోల్పోయింది. సాహిత్యంలోని ఒక స్రష్టను కోల్పోయింది. ఒక సత్యవిమర్శకుని కోల్పోయింది. ఒక చారిత్రక పరిశోధకుని కోల్పోయింది. శ్రీపాద ధన్యజీవి. శ్రీపాద మాతృశ్రీపాద.



16. రెడ్డి సుబ్బయ్య

మంత్రాయి తర్వాత నాన్నగారింట్లో పనిచేసినవాడు రెడ్డి చినసుబ్బయ్య. సుబ్బయ్య తండ్రి రెడ్డి రాఘవులు చందోలు గ్రామ కాపురస్థుడు. ఆయన భార్య సింగిరమ్మ. జిల్లెళ్ళమూడిలో ఖగ్గావారు సంపన్న కుటుంబీకులు. ఖగ్గా వారి దగ్గర జీతగానిగా చేరాడు రాఘవులు. రాఘవులకు పెద్ద సుబ్బయ్య, చిన్న సుబ్బయ్య అని ఇద్దరు కుమారులు. వీరిలో చినసుబ్బయ్యకు నాన్నగారింట్లో సేవచేసే అదృష్టం పట్టింది. రెడ్డి చిన్న సుబ్బయ్య ప్యాపట్లు చెందిన అదెమ్మను పెళ్ళి చేసుకున్నాడు. సుబ్బయ్యకు నలుగురు మొగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుధాకరరావు, కృష్ణ మొగపిల్లలు. రాగమ్మ, పార్వతి, దైవలక్ష్మి ముగ్గురు ఆడపిల్లలు. అమ్మ దగ్గర బాగా అలవాటైనది పార్వతి. సుధ ఇప్పుడు మన సంస్థలో పనిచేస్తున్నాడు.

అయితే సుబ్బయ్య అమ్మ దగ్గరకు చేరటంలో కూడా ఊళ్ళో వాళ్ళ ప్రోద్బలం తోడయింది. జిల్లెళ్ళమూడిలోని ప్రజలకు స్త్రీల శీలసంపద పట్ల అంత విశ్వాసం ఉండేదికాదు. మంత్రాయి నాన్నగారింట్లో జీతగాడు. మంత్రాయి మీద అందరికీ అనుమానం. మంత్రాయి మీద నిఘా కోసం సుబ్బయ్యను వాళ్లే నాన్నగారింటికి పంపిచారు. ఆ రకంగా చేరాడు అమ్మ దగ్గరకు. మంత్రాయి మొక్క జొన్నలు

దంచుతున్నాడు. అమ్మ రవ్వ జల్లెడ పడుతున్నది. గాదె చాటు నుండి రెడ్డి సుబ్బయ్య అనుమానంతో చూస్తున్నాడు. చాటుగా నిలుచున్న సుబ్బయ్యను కందిరీగ కుట్టింది. ఇవతలికి రాలేదు అక్కడ బాధతో ఉండలేదు. అంతటితో వదిలింది దయామయియై అమ్మ. కాఫీ కలిపి మంత్రాయిని రమ్మని సంజ్ఞ చేసింది అమ్మ. చేతి సంజ్ఞతోనే, కళ్ళతోనో మంత్రాయిని రమ్మని ఏ పనికి పిలిచినా గాదెచాటు నుండో గడ్డివాము చాటు నుండో చూచిన సుబ్బయ్య అందరికీ చెప్పేవాడు. అమ్మ పిలిచిందని. అమ్మ నాన్న గారికీ విషయం చెప్పింది. నాన్నగారు నీవు ఎవరినీ లెక్క చేయవలసిన అవసరం లేదని చెప్పారు. ఆ రకంగా దగ్గరకు చేరిన రెడ్డి సుబ్బయ్య మంత్రాయి చనిపోయిన తర్వాత అమ్మ ఇస్తున్న ఎన్నో అనుభవాలున్నా అమ్మను పరీక్ష చేయటం మానలేదు.

అమ్మ నా వద్ద వందరూపాయలు లేకపోయినా వంద మందికి అన్నం పెట్టుకుంటాననేది. ఎట్లా పెట్టుకుంటుందో చూడాలని సుబ్బయ్య అమ్మ చేతిలో చిల్లిగవ్వకూడా లేని రోజున ఆరుగురు బాగా తిండి పుష్టిగలవారిని తెచ్చి ఆకలిగా ఉన్నది అన్నం పెట్టమని అడగండి అని చెప్పాడు. వాళ్ళు వచ్చి నీ చేతిమీదుగా అన్నం తినాలని ఉందమ్మా! అన్నారు. ఇంట్లో గ్లాసెడు బియ్యమే ఉన్నాయి. అవి కడిగి కుంపటి మీద పెట్టి వండింది. అందరినీ కూచోబెట్టి వాళ్ళు తృప్తిగా కడుపునిండా ఇంక తినలేము చాలమ్మా! అనేంత వరకూ పెట్టింది. రెడ్డి సుబ్బయ్యకు ఆశ్చర్యం వేసింది. అమ్మ ఎలా ఇంత మందికి పెట్టింది? ఏదో మహత్తు ఉన్నది అనకున్నాడు. దుర్వాసునకు, శిష్యులకు ధర్మరాజు ద్రౌపదుల చేత శ్రీకృష్ణపరమాత్మ కడుపునిండా భోజనం పెట్టించిన సన్నివేశం జ్ఞాపకం వచ్చింది సుబ్బయ్యకు.

ఒకసారి అమ్మ మూడు సోలల బియ్యం వండి 60 మందికి భోజనం పెట్టింది. రెడ్డి సుబ్బయ్య గొడ్లను తోలుగొని వచ్చాడు. కాళ్ళు కడుక్కొని రారా! అన్నం పెడుతానన్నది అమ్మ. ఇంతమందికి పెట్టావు ఇంకా అన్నం ఎక్కడిది? అన్నాడు సుబ్బయ్య. పోరా! కాళ్ళు కడుక్కొచ్చి గిన్నె చూడు అన్నది అమ్మ, తీరా సుబ్బయ్య మూత తీసి చూస్తే గిన్నె నిండా అన్నం ఉన్నది. ఆశ్చర్యంతో అమ్మకు నమస్కరించాడు. ఇలాంటి సన్నివేశాలెన్నో చూచాడు సుబ్బయ్య.

సుబ్బయ్య ఊళ్ళో టీలు అమ్ముకొని బ్రతికేవాడు. అమ్మ వద్దకు చేరి అమ్మను కనిపెట్టుకొని అమ్మ చెప్పిన పనల్లా చేసేవాడు. నాన్నగారు జమాబందీకి బాపట్లకు

వెళ్ళినపుడు అమ్మ నాన్నగారి కోసం మూలపాలెం మీదగా అన్నం తీసుకెళ్ళేది. అమ్మకు సాయంగా వస్తానవేవాడు రెడ్డి సుబ్బయ్య, 'నీవు పిల్లలకు తోడు ఉండు నేను పోయి వస్తాను' అని అమ్మ బయలుదేరేది. ప్రాణం ఒప్పక సుబ్బయ్య కూడా అమ్మ వెనుక బయలు దేరేవాడు. సుబ్బయ్య ఎంత తొందరగా నడిచినా అమ్మ అందేదికాదు. అమ్మ కనిపించేవరకూ వెళ్ళి తిరిగి వచ్చేవాడు.

ఒకరోజు మామూలుగా అమ్మ ఇంటి ముందు కావలి కాస్తున్నాడు. భార్య ఆదెమ్మ పురిటి నెప్పులు పడుతున్నదని కబురు రాగా సుబ్బయ్య ఇంటికి వెళ్ళాడు. ఆనాటి రాత్రి నాన్నగారి ఇంట్లో దొంగలుపడి నగలు, వస్తువులు దోచుకున్నారు. మర్నాడు సుబ్బయ్య రాగా "నాన్నా! రాత్రి నీవు లేవు. ఏం జరిగిందో చూచావుగా" అన్నది. సుబ్బయ్య బాధపడ్డాడు.

సుబ్బయ్య పొలం దున్నుతుంటే అమ్మ నాగలిమీద కూర్చొన్నది. నీవు నాగలిమీద కూర్చుంటే నేనలా దున్నేది? అన్నాడు. అంతే వామనుడు విరాట్ స్వరూపుడైనట్లు, శ్రీకృష్ణుడు కురుసభలో విశ్వరూప సందర్శనం చేయించినట్లు అమ్మ ఆకాశం నిండిపోయినట్లు తన ఆకారాన్ని పెంచింది. సుబ్బయ్య ధన్యుడు. అమ్మ విశ్వరూపం దర్శించాడు.

జిల్లెళ్ళమూడిలో ఎవరూ ఆకలిబాధతో ఉండకూడదనే ఉద్దేశ్యంతో అమ్మ పిడికెడు బియ్యపు పథకం ప్రవేశపెట్టింది. అమ్మకు సాయం చేసేవాడు సుబ్బయ్య. బియ్యం పోగుచేయటం అవసరమైన వారికి అప్పుగా ఇవ్వటం మళ్ళీ తీసుకు రావటం చేస్తుండేవాడు. అందులో నిల్వ ఉన్న బియ్యం జాగ్రత్త చేసేవాడు. ఊళ్ళో రామాలయం కట్టాలని గ్రామ పెద్దలు తీర్మానించి అమ్మకు చెప్పారు. అమ్మ తన వద్ద నిల్వ ఉన్న బియ్యం అమ్మి రూ. 170/- లతో ఇప్పుడు అనసూయేశ్వరాలయం ఉన్న స్థలం కొన్నది. తీరా గుడి కట్టబోయే సమయానికి ఆస్థలం అమ్మినవాడు నాకు సొమ్ము ముట్టలేదని అబద్ధమాడాడు. అమ్మ సుబ్బయ్యను పిలిచి డబ్బు ఇవ్వలేదంటున్నాడు మళ్ళీ డబ్బు ఇవ్వమన్నది. సుబ్బయ్య 20 బస్తాల ధాన్యం అమ్మి తెచ్చి ఇచ్చాడు. అసత్యదోషానికి అతని కుటుంబం చితికిపోయింది. అమ్మ పాదాలపై పడి క్షమాపణ కోరాడు. ఆ సొమ్ము తెచ్చి ఇచ్చాడు. ఆ ధనం సుబ్బయ్యకు ఇప్పించింది. సుబ్బయ్య ఆలయ నిర్మాణానికి ఖర్చుపెట్టాడు. అమ్మకు ఏమైనా ఇవ్వాలే కాని అమ్మ వద్ద తీసుకోకూడదని సుబ్బయ్య నిశ్చయం.

సుబ్బయ్య తాను ఇల్లు కట్టుకోటానికి పదివేల ఇటుక కాల్చి తెచ్చి పెట్టుకున్నారు. అధరాపురపు శేషగిరిరావు వచ్చిం తర్వాత అమ్మ పూరింట్లో ఉండటం ఏమిటి? అని ఇటుకల కోసం వెతుకగా సుబ్బయ్య వద్ద ఉన్నాయని తెలిసి అడిగాడు. దానితో ప్రస్తుతం అలంకార హైమ ఉన్న ఇల్లు కట్టబడింది.

సుబ్బయ్యను ఎక్కడికీ వెళ్ళవద్దని చెప్పింది అమ్మ. తన పొలం కోతకు వచ్చింది కూలీలను పెట్టి వస్తానన్నాడు. పొలంపని నేను చూచుకుంటాలేరా అన్నది. అన్నా వినకుండా బయలుదేరాడు. తీరా వెళుతుంటే దారిలోనే కూలీలు కనిపించి కోతపని పూర్తి చేసి వస్తున్నామన్నారు. పోటా పోటీగా కోత పని చేశామని చెప్పారు. ఆశ్చర్యపోయాడు సుబ్బయ్య అమ్మ చర్యకు.

పొలంలో ఉన్న తన కుమారుడు సుధను పాము కరిచిందని వచ్చింది వార్త. అమ్మ సేవలో ఉన్నాడు సుబ్బయ్య. సుధను తెచ్చి ఏదో మంత్రం వేయించారు. కట్టు కట్టించారు. శరీరం చల్లబడిపోయింది. అమ్మ వద్ద ఉన్న సుబ్బయ్య వద్దకు వచ్చి నీ కొడుకు పరిస్థితి అలా ఉంటే ఇంకా నీవు ఇక్కడే ఏం చేస్తున్నావు? అని అడిగారు. సుబ్బయ్య వెంటనే వెళ్ళి సుధను బుజాన వేసుకొని వచ్చి అమ్మ పాదాల వద్ద ఉంచాడు. ఆ సమయానికి డాక్టర్ నారపరాజు శ్రీధరరావుగారు అక్కడే ఉన్నారు. సుధను చూచి పెదవి విరిచారు. అమ్మ సుధ చెవి పట్టుకొని ఏదో చెప్పింది. ఏదో చేసింది. కొద్ది క్షణాలలో సుధ లేచి కూర్చొన్నాడు. అమ్మ ఆనాడు సుధకు ప్రాణదానం చేసింది.

ఒకసారి నాన్నగారితో గుంటూరు ప్రయాణమైంది అమ్మ. అమ్మకు ఆ సమయాన వెంట తీసుకెళ్ళటానికి మరొక చీరె లేదు. ఊళ్ళోకి చీరలమ్మే వాడు వచ్చాడు. పరిస్థితి తెలిసిన సుబ్బయ్య ఏడు రూపాయలు పెట్టి ఒక చీరె కొని పరుగెత్తుకుంటూ ఏడవ మైలు వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్న అమ్మకు ఇచ్చి వచ్చాడు. ఈనాడు ఇరవై, ముప్పై వేలు ఖరీదు చేసే చీర కూడా ఆ చీరె ముందు తీసికట్టేనందిఅమ్మ. ఆనాటి ఆ చీరె వెనుక ఉన్న ఆపేక్ష, ఆర్ద్రత గొప్పవి కదా! అవసరం విలువైనది కదా! శ్రీ కృష్ణ పరమాత్మకు వేలుకోసుకొని రక్తం వస్తుంటే ద్రౌపది చీరె చెంగు చించి ఆ వేలుకు కట్టింది. అలాంటిదే సుబ్బయ్య చేసిన పనీ.

రెడ్డి సుబ్బయ్యను చూచినవారికి తెలుసు మనిషి ఎట్లా ఉండేవాడో. అంత సుబ్బయ్యకు కూడా చీకటిపడితే భయం. ఒంటరిగా తిరిగేవాడు కాదు. ఒకసారి

వరినారు కోసం బాపట్ల వెళ్ళాల్సి వచ్చింది. అమ్మతో "అమ్మ! నీవు నాతో ఉండాలి. నేను వరినారు కోసం బాపట్ల వెళుతున్నాను అన్నాడు. అట్లాగే నాన్నా!" అన్నది అమ్మ. నారు పీకించి కట్టలు కట్టించాడు. బండ్ల కెత్తించాడు. చీకటి పడ్డది. ఆ సమయానికి ఊరి వెలుపలి శ్మశానం దగ్గరకు వచ్చేటప్పటికి భయం. గుండెల్లో గుబులు. పొలం గట్టున ఉన్న ఒక పెద్దాయిన సుబ్బయ్యతో బండి వెంట వచ్చాడు. సుబ్బయ్యకు ధైర్యం వచ్చింది. ఆరవ మైలు దాకా వచ్చిన అతను ఒకపావలా అడగ్గా సుబ్బయ్య ఇచ్చాడు. జిల్లెళ్ళమూడి చేరగానే అమ్మ వద్దకు వెళ్ళాడు. జనం కూర్చుని ఉన్నారు అమ్మ చుట్టూ. అమ్మ 'సారాయి తాగుతాను అంటే పావలా ఇస్తావా? నాకు నీ పావలా వద్దు ఇదుగో' అంటూ పావలా నాణాన్ని సుబ్బయ్య చేతిలో పెట్టింది. సుబ్బయ్య తనకు తోడు వచ్చింది అమ్మే ఆ ఆకారంలో అని తెలిసి అమ్మ పాదాలపై వాలిపోయాడు. చుట్టూ ఉన్న జనం పూర్వాపరాలు తెలిసిం తర్వాత ఆశ్చర్యపోయారు.

మిన్ని కంటి గురునాథశర్మగారు ఉభయభాషా ప్రవీణులు వేదాంతపారీణులు, కవిశేఖరులు, కవితామహేశ్వరులు. వారు వ్రాసిన 'అమ్మ' కావ్యంలో రెడ్డి సుబ్బయ్యను గూర్చి వ్రాస్తూ

'రెడ్డి సుబ్బయ్య నీకును ప్రీతిపాత్రు
దాదుకొను నీదు చేతికి నడ్డు వచ్చి
నిను నిదురలేపగా వచ్చి నిలివెదెత్తు
పాముతో నాడు నిను గను బ్రధమమంధు" అని వ్రాశారు. అంటే అమ్మతో పాము ఆడుకుంటుంటే చూచాడట రెడ్డి సుబ్బయ్య.

కులపతిగారు కూడా తమ 'అంబికాసాహస్రి', గ్రంథంలో దీనిని ప్రస్తావిస్తూ

'ప్రకటితరాగ్ని ఫూత్కృతి విభాసిత దివ్య ఫణామణి ప్రభా
చకిత దిగంతురుండయిన సర్పవిభుండు సముజ్జ్వలమ్ముగా
నికటము నందు నీ యెదుట నిల్చిన అద్భుత సన్నివేశపుం
బ్రకృతి- ప్రశంస సేయును ప్రపంచము- దాని స్మరింతు సంబికా"!

అంటారు.

అంటే రెడ్డి సుబ్బయ్య అమ్మ ముందు పాము ఆడే సన్నివేశం చూచాడు. చిదంబరరావు తాతగారూ చూచారు ఒకసారి నాగులచవితినాడు.

ఇప్పుడు అన్నపూర్ణాలయం, అందరిల్లు ఉన్న స్థలం ఆనాడు పంట పొలం. ఆ పొలం అమ్మకానికి వచ్చింది. అమ్మా! నాదగ్గర అంత డబ్బులేదు కొనటానికి కొద్దిగానే ఉన్నది అని అమ్మకు చెప్పాడు. అమ్మ నేనిస్తాలే కొనరా అని చెప్పింది. పొలం సుబ్బయ్య కొన్నాడు. సుబ్బయ్య పేరనే రిజిష్టరయింది. అయితే సుబ్బయ్య ఉండగానే ఆ స్థలంలో అన్నపూర్ణాలయము, అందరిల్లు నిర్మాణాలు జరిగాయి. అమ్మతో సుబ్బయ్య ఆ స్థలాన్ని రిజిష్టరు చేస్తాను సంస్థకు, చేయించుకోమని అడిగాడు. తర్వాత చూద్దాంలే అన్నది అమ్మ. ఆ తర్వాత రెండు నెలలకే రెడ్డి సుబ్బయ్య అమ్మలో 15.1.1983 న కలిసిపోయాడు. ఆ తర్వాత సుబ్బయ్య పిల్లలకు కొంత డబ్బు ఇచ్చి ఆస్థలం శ్రీ విశ్వజననీపరిషత్ రిజిష్టరు చేయించుకుంది. మనం అమ్మకు సేవచేస్తే మన అవసరాలు మనం అడక్కుండానే తీరుస్తుంది. రక్షిస్తుంది అనేది సుబ్బయ్య అచంచలమైన విశ్వాసం.

అమ్మకు ఆంతరంగిక సేవకునిగా, అంగరక్షకునిగా భక్తునిగా, ఆత్మీయబంధువుగా సుబ్బయ్య నిలిచారు. వేద వేదాంగాలు చదివినా, కఠోర నియమ నిష్ఠలతో తపస్సు చేసినా, ఉపాసన చేసినా ప్రాప్తించని అనన్యశరణాగతి, ఏకాగ్రత భక్తి విశ్వాసాలు సుబ్బయ్యకు అమ్మయందు కలిగాయి.

ధూర్జటి తన కాళహస్తీశ్వర శతకంలో సాలెపురుగు, పాము, ఏనుగు, చెంచుజాతివాడు ఏం చదువుకున్నారని మోక్షం ప్రసాదించాడు పరమేశ్వరుడు. చదువులు కాదు కావలసింది. అనన్యమైన భక్తి, భగవత్సేవ- ఈరెండూ రెడ్డి సుబ్బయ్యకు ప్రసాదించి తరింపచేసిందిఅమ్మ- ధన్యుడు- మనందరికీ ఆదర్శ సోదరుడు- అగ్రజుడు.

17. రహిమ

అమ్మకు వివాహమై కాపురానికొచ్చిన క్రొత్తల్లో ఒకరోజు బాపట్లలో చిదంబరరావు తాతగారింటికి దగ్గరలో ఉన్న గవర్నమెంటు హాస్పిటల్‌కు దగ్గరలో హాస్పిటల్ గోడ నానుకొని ముసుగు కప్పుకొని పడి ఉన్న మనిషిని చూసింది అమ్మ. కదులుతాడేమోనని కాసేపు చూసింది. ఏమాత్రం కదలికలేదు. ముసుగు తీసి చూద్దామని పైనకప్పుకొన్న గుడ్డ పట్టుకోగానే దారిన పొయ్యేవారు 'నీకెందుకమ్మా! చిన్నపిల్లవు. నాలుగు రోజులబట్టీ ఇక్కడే ఉన్నాడు. అసలు చచ్చిపోయాడేమో! అంటూ వెళ్ళిపోయారు.

అమ్మ ముసుగు తీసి నోటివెంట కారుతున్న చొంగ తన చీరతో తుడిచి, కళ్ళు అంటుకుపోయి పుసులు కారుతుంటే తుడిచి, వళ్ళు పట్టుకొని చూచి జ్వరం మండిపోతున్నదని దగ్గరలోనే ఉన్న రైల్వే డాక్టరుగారింటికి వెళ్ళి వారికి సంగతి చెప్పి అక్కడికి వచ్చి చూడమంటుంది. మొదట్లో కొంచెం తటపటాయించిన డాక్టరుగారు మాది రైల్వే ఆస్పత్రి, మా రైల్వేలో పని చేసేవారికే మందులిస్తుంటాం' అన్నారు. అమ్మ ' మీ బిడ్డగా అనుకొని దిక్కులేని వాడికి దిక్కై చూడండి. కావల్సిన డబ్బు నేను కడతాను' అని అమ్మ కాలి గొలుసు తీసి ఇవ్వబోగా డాక్టరుగారు "అసలు ప్రాణం ఉన్నదో లేదో చూద్దాం పదమ్మా! అని అయినా పెద్ద వాళ్ళెవరూ లేరా"? అని అడిగారు. నేను పొట్టిగా ఉన్నానుకుంటున్నారా? నాకంటే పెద్ద ఎవరు? మీరు చెయ్యవలసిన ధర్మం మీకు గుర్తు చేస్తున్నాను కదా"! అన్నది అమ్మ. డాక్టరుగారు స్టెతస్కోప్ తీసుకొని బయలు దేరి అతడి వద్దకు వచ్చారు. ఇంతలో చిదంబరరావు తాతగారు అటుపోతూ అమ్మ పిలుపు విని అక్కడికి వచ్చారు. డాక్టరుగారు విషయం చెప్పగా అమ్మను నీవు ఇంటికెళ్ళమ్మా! ఆ చేతులు చూడు ఎంత బొబ్బలెక్కాయో ? ఇతన్ని నేను హాస్పిటల్‌లో చేర్చి వస్తాను. నీవుపో అన్నారు తాతగారు. నా సంగతిప్పుడెంధుకు ? ఇతని సంగతి చూడండి అన్నది అమ్మ. అతని సంగతి చూడటానికి నీవున్నావు. మరి నీ సంగతి చూచేది ఎవరు? అని తాతగారంటుండగా డాక్టర్‌గారు పరీక్ష చేసి ఇతనికి టైఫాయిడ్ అండీ. నయమవుతుందో లేదో చాల ప్రమాదస్థితిలో ఉన్నాడు. అని కప్పిన దుప్పటి తీసి వాసన వస్తున్నదన్నారు. అమ్మ మల మూత్రాలలో కలుషితమైన శరీరాన్ని తన చీరె చెంగు చించి శుభ్రం చేసి 'తగ్గదని మందు లిప్పించకుండా ఉండలేం కదా? హాస్పిటల్‌లో చేర్చి మందులిచ్చి మీ ధర్మం మీరు చేయండి' అని చెప్పింది. అమ్మ.

చిదంబరరావు తాతగారు అతన్ని హాస్పిటల్‌లో చేర్పించి వైద్యానికయ్యే డబ్బు తానిస్తానని డాక్టర్‌గారికి చెప్పి ముందు కొంత బయానా ఇచ్చి. అతడు కట్టుకోవడానికి ధోవతులు కొని పంపిస్తానని అంటే అమ్మ 'పైజమాలు కుట్టించి పంపండి ధోవతులు కట్టుకోవడ చేతకాక పోవచ్చు' అన్నది. అమ్మ ఇంటికి బయలు దేరుతూ అతన్ని ముద్దుపెట్టుకోగానే అమ్మ వంక చూసాడు కళ్ళుతెరిచి.

మరుసటి రోజు రాత్రి అమ్మ వచ్చి అతన్ని ప్రక్కకు తిప్పి పడుకోబెట్టింది. డాక్టరుగారు 'ఎక్కడి సంబంధమమ్మా ఇతడు రాత్రే అయిపోతాడనుకున్నాను. ఈ రోజు తేటగా ఉన్నాడు. రెండు రోజుల్లో జ్వరం తగ్గవచ్చు.' అన్నాడు. మీ మందు మహాత్మ్యం అని పొగిడింది అమ్మ. భగవంతుడి లీల అన్నారు వారు. వారి పేరు రాయప్రోలు రామనాథశాస్త్రి. వారు పూజించే కామేశ్వరి కుంకుమ, తీర్థం ఇచ్చినందువల్లనే తగ్గిందనుకున్నారు వారు. తగ్గితే పథ్యం నేనే పెడతానన్నది అమ్మ.

డాక్టరుగారు పానకము. వడపప్పు తెచ్చి అమ్మ కిస్తే అమ్మ వడపప్పు రోగినోట్లో వేస్తుంది. పానకం తాగితే పత్యం పెట్టినట్టే నన్నారు చిదంబర రావుగారు. ఫరవాలేదు లెండి దేవీప్రసాదం ఏమీ చేయదు అన్నారు డాక్టరుగారు. మీరిచ్చింది దేవీ ప్రసాదం వాడు తీసుకొన్నది తల్లిప్రసాదం. 'తల్లి ప్రసాదం తరగని ప్రసాదం' అన్నారు తాతగారు– అంటే? అన్నారు డాక్టరుగారు. ఎల్లప్పుడూ తినేది, ఎంత తిన్నా తరగనిది అని సమాధానం ఇచ్చారు తాతగారు.

అమ్మ మరుసటి రోజు ఉసరికాయి పచ్చడి, చారు అన్నం తీసుకొని హస్మిటల్‌కి వచ్చింది. డాక్టరుగారు ఎవరినో పేషంటును చూస్తూ ఇతడికి కూడా నీచేత్తో పత్యం పెట్టమ్మా! నీ చేత్తో ఏది పెట్టినా అమృతమే అంటారు. అతనికి కూడా అమ్మ పత్యం పెడుతుంది. అమ్మగోరు గుజ్జులు చేసి రహి నోటికి అందిస్తుంది. కళ్ళ వెంట నీళ్ళు కారినై అతనికి. అమ్మ సముదాయించగా పెద్దగా ఏడ్చారు. అమ్మ పమిటి చెంగుతో కళ్ళు, ముక్కూ తుడిచింది. డాక్టరుగారు 'మీ తల్లీ కొడుకులని చూస్తుంటే నా కొస్తున్నది కన్నీరు' అని తుడుచుకొని తిను నాయనా! అదృష్టవంతుడివి అని చెప్పి. నీ పేరేమిటి అని అడిగారు. మేరానామ్ 'రహి' అని హిందీలో చెప్పాడు– తెలుగు రాదేమో! అని డాక్టరుగారంటే ఇంగ్లీషులో అడగ్గా "మా అమ్మ" అని చెప్పాడు. ఎప్పటి నుండీ పరిచయం? అంటే 'ఇప్పుడే పుట్టాను' అని చెప్పాడు. అమ్మ "ఒక నెల హాస్పిటల్‌లో ఉంచుకోండి ఇతన్ని" అని అడగ్గా డాక్టరుగారు అది

వీలుకాదమ్మా! హాస్పిటల్‌లో ఉండనివ్వరు. మా ఇంట్లో ఉంచుకుంటాను" అని చెప్పారు.

తరువాత డాక్టరుగారు అడగ్గా తనకు 17 ఏళ్ళని, పెద్దగా చదువుకోలేదని, తల్లి దండ్రి ఎవరో తెలియదని, అన్నీ అమ్మేనని చెప్పాడు. చిదంబరరావు తాతగారితో అతనికి కావలసిన పళ్ళూ. టానిక్కులు కొని పెట్టమని చెప్పింది అమ్మ.

చిదంబరరావు తాతగారు అమ్మకు బిస్కెట్ పెట్టబోతే రహికి పెట్టమంటుంది. వాడు తింటే నేను తిన్నట్టే అంటుంది. అమ్మ వెండి గిన్నెలో అన్నం కలిపి రహికి పెడ్తుంది. తాతగారు అయ్యో వెండి గిన్నెలో కలిపి పెట్టావు అది ఇక మనకు పనికి రాదు అతనికే ఇచ్చెయ్యమంటారు. అప్పుడమ్మ మీరన్న మాట మీరే మరచారు " అసలయిన తల్లి దగ్గరకు చేరాడన్నారు" కదా! అయినా ఇది మా అమ్మ గిన్నె. మీరే నాకిచ్చారు అని చెప్పింది.

కొంత కాలానికి రహికి నయమైంది. ఒకరోజు అమ్మఅంట్లు తోముతుంటే తను వచ్చి అన్ని అంట్లూ తోమి చెప్పకుండానే దొడ్డి అంతా చిమ్మి శుభ్రం చేశాడు. అన్ని పనులూ ఇంట్లో చేసి అమ్మ 'రహి' ఉన్నాడో లేదో చూద్దామని బయటకు రాగా రహి తలగుడ్డ అరుగు మీద పరిచి దాని మీద అమ్మను పడుకోమంటాడు. అమ్మ పడుకోగానే అమ్మ కాళ్ళు ఒళ్ళో పెట్టుకొని అరచేత్తో మోకాళ్ళ నుండి క్రింద పాదాల వరకు రాస్తాడు. తరువాత అమ్మ రహి తల ఒళ్ళో పెట్టుకొని ఏంకావాలి? అని అడిగింది. 'అమ్మ కావాలి' అంటాడు రహి. ఉన్నానుగా ఎందుకు ఏడుస్తావు? అని అమ్మ అంటే ఇంకా ఏడుస్తూ తన బొడ్లో ఉన్న గారెముక్క అమ్మ నోట్లో పెట్టాడు. అమ్మ తీసి వాడి నోట్లోనే పెట్టి నీవేం చెయ్యొద్దు నేను పెట్టింది తింటుండు అన్నది. 'నీవు తినే దల్లా పెట్టమ్మా' అన్నాడు రహి. అమ్మ ఇక్కడకు ఇంటికి రావద్దని తను పంపువద్దకు నీళ్ళకు వచ్చినప్పుడు కనిపిస్తానని చెప్పింది. అమ్మను చూడకుండా ఉండలేనంటాడు రహి. ఇంటికి తలుపులడ్డంగా ఉన్నట్లు కళ్ళకు రెప్పలడ్డంగా ఉన్నయ్ అమ్మను తదేకంగా చూడటానికి అని వాపోతాడు.

ఒక రోజు అమ్మ శరీరం నుండి రక్తం కారుతుంది దెబ్బ తగిలి. రహి చూచి మూర్ఛపోతాడు. అమ్మ నీళ్లు చల్లి వాడ్నిలేపి ఉపచారం చేస్తుంది. రహి లేచి రక్తసిక్తమైన అమ్మ శరీరాన్ని శుభ్రం చేస్తాడు. అమ్మవంట్లో రక్తం ఎంత కారిందో రహి కళ్ళవెంట నీరు అలా ధారాపాతంగా కారినయ్. అమ్మ చేసే ప్రతి పనికి అడ్డువచ్చి తను చేసేవాడు. అమ్మ దొడ్లోకి వచ్చేసరికి నీళ్ళు చల్లటం ముగ్గులెయ్యటం అన్నీ చేసేవాడు.

ఎవరు చేశారు నాన్నా! అని అమ్మడిగితే నేనే అని గుండె మీద చెయ్యి వేసుకొని చూపించేవాడు. అమ్మ నాన్నగారి ధోవతులు తడిపి పెట్టి వంట ప్రయత్నం మీద లోపలికి పోగానే గుడ్డలన్నీ ఉతికి పెట్టేవాడు. అమ్మ మొయ్యకుండా బరువులన్నీ తనే మోసేవాడు. సరివీ తుక్కు మోపులన్నీ తనే మోసి తెచ్చేవాడు. అమ్మ చెయ్యవలసిన పనులన్నీ తనే చేసేవాడు. ఒక భోజన హోటల్‌లో అంట్లు తోమి అన్నం తెచ్చి అమ్మ బయటకు వచ్చినపుడు అమ్మకు తినమని బతిమిలాడి కలిపి నోట్లో పెట్టేవాడు. అమ్మ తినకపోతే తానూ తినకుండా కుక్కలకు పెట్టి గిన్నెలు కడిగేవాడు. ప్రొద్దుటి పూట కాఫీ హోటల్‌లో పని చేసి ఇడ్లీ తెచ్చి పంపు దగ్గరకు అమ్మ వచ్చినపుడు తినమని వేధించేవాడు. నేను సంపాదించుకొస్తానని అమ్మ రెండు చేతులూ పట్టుకొని ఏడ్చేవాడు.రాత్రి పగలు నిద్రలేకుండా ఇరవై నాలుగుగంటలూ పని చేసేవాడు. అమ్మ అనారోగ్యంతో ఉంటే అమ్మ నీళ్ళుపోసే అందరిళ్ళల్లో రహి చీర కట్టుకొని మంచినీళ్లు పోసి వచ్చేవాడు. ఆడపని, మగపని అని విచక్షణ లేకుండా మేజోళ్ళు అల్లటం. పూసలు బుట్టలు అల్లటం కూడా నేర్చుకున్నాడు. దారంతో బనీన్లు అల్లేవాడు. దర్జీపని నేర్చుకున్నాడు. దూదేకుల సాయిబులతో తిరిగి పరుపులు కుట్టటం నేర్చుకున్నాడు. 'రహి' అసలు దూదేకుల కులంలోనే పుట్టాడు. బంగారపు పని మొదలుకొని అన్ని పనులూ నేర్చుకున్నాడు. శిల్పిఅయినాడు. క్రమేపీ చదువుల్లో ఉత్తీర్ణుడైనాడు. చిదంబరరావుతాతగారి వద్ద కవిత్వం నేర్చుకున్నాడు. రెండు సంవత్సరాల్లో విద్యలన్నీ నేర్చుకున్నాడు.

చిదంబరరావు తాతగారు అమ్మతో రహిని గూర్చి "నీకొడుకు ఏకసంతాగ్రాహి వరపుత్రుడు. చచ్చి బ్రతికాడు. వాడి పేరు 'దేవీచరణ్' అంటే బాగుంటుంది అన్నారు. అందుకు అమ్మ దేవీ చరణేమిటి 'మాతృచరణ్' అంటే ఇంకా బాగుంటుంది అన్నది. తాతగారు, వాడు నేర్చుకుంటే వస్తున్న విద్యకాదమ్మా, నీమీద ప్రేమవల్ల, నీ సేవా భాగ్యం వల్ల కలుగుతున్న విద్య. వీడిక్కడ కెందుకొచ్చాడో వీడి సంస్కారం ఎంత గొప్పదో! అని తనమనసులో రామకృష్ణుడికి వివేకానందుడు దొరికినట్లు. రాముడికీ తోకవాడు ఏర్పడ్డట్లు, మా అమ్మకు ఈ రహి ఏర్పడ్డాడేమో! అంటుండేవారు. అమ్మతో కాళిదాసుకన్నా గొప్ప వాడమ్మా రహి, కాళిదాసుకు భార్యాభక్తివల్ల అనుగ్రహం లభిస్తే, ఇక్కడ తల్లే తనయుడి కోసం తాపత్రయపడ్డట్టు తెలుస్తున్నది" అన్నారు.

అమ్మ, నాన్నగారు పాపత్తయ్య పెళ్ళైన తరువాత అత్తగారి 'ఊరు పుసులూరు మూడు నిద్రలకు వెళ్ళారు. రహి కూడా అక్కడకు వెళ్ళి లంకంత పెద్ద లోగిలి చూచి మనకిట్లాంటిది ఉంటే బాగుండును అంటాడు అమ్మతో. అమ్మ ఇంత

తక్కువ కోరావేం. మనది ఎంత వరకు ఉందో నీకు తెలియదు. ప్రపంచమంతా మనదే. మనమే తలాకాస్త వాడుకోమని ఇచ్చాం అంటుంది.

అమ్మ పినతల్లి శేషమ్మగారు భర్త నారాయణరావుగారు నాన్నగారిని అడిగి చీరాల వాళ్ళింటికి తీసుకొని వెళ్ళారు అమ్మని. రహి కూడా చీరాల వెళ్ళాడు. అమ్మ పెట్టె అమ్మమ్మ పెట్టెల సామాన్లు అన్నీ మోసుకొచ్చాడు. అమ్మతో 'ఊరంతా చూచానమ్మా! బేర్ ఆస్పత్రి దగ్గర ఒకతను నాన్‌రొట్టె- బిస్కెట్లు చాలా రకాలు చేస్తున్నాడు. అతని దగ్గర కూలికి చేరి అన్నీ నేర్చుకుంటాను. భోజన హోటల్లో చేరి వంట నేర్చుకుంటాను. మంగలి షాపులో చేరి మంగలిపని. ఇస్త్రీ కొట్లో చేరి ఇస్త్రీపని. కుమ్మరి వాడి దగ్గర కుమ్మరిపని, సాలివాని దగ్గర గుడ్డలు నేసేపని మాట్లువేసేవాని దగ్గర మాట్లపని. వైద్యుని దగ్గర వైద్యం. ఈ పనీ ఆ పనీ, అనకుండా అన్ని పనులూ నేర్చుకొని నీకు ఏ పనీ లేకుండా నీకుఆహారం పెడుతూ, నిన్ను కూర్చొబెట్టి నీవు చేసే ప్రతిపనీ నేను చేయాలని. నీవు పడే బాధలన్నీ నేను పడాలనీ నా మనస్సు శరీరం మరో వైపు పోకుండా నీ చుట్టుతా తిరగాలనీ, నాకోర్కె, నా కోర్కె తీర్చమని నిన్ను ప్రార్థిస్తున్నాను. అలా జరిగితే నా జన్మ సార్థకమౌతుంది. నిన్ను చూస్తున్న కొద్దీ నీవు మామూలు మనిషిగా తోచడం లేదు. నీవు నాకు అర్థమై ఇంకొకరికి చెప్పే రీతిగా చెయ్య, నీవు ఏ ఊళ్ళో ఉంటే ఆ ఊళ్ళో ఉంటా, నా పొట్టనే పోసుకొని నీ అవుసరాలు తీరుస్తా అన్నాడు.

అయితే నీవేపనీ చెయ్యొద్దు అన్నది, అమ్మ, అట్లయితే నీవు చెప్పింది చెయ్యను. నీకవసరమైంది చేస్తానన్నాడు రహి. నా అవసరం నీకేం తెలుస్తుంది. అన్నది అమ్మ చిదంబరరావు తాతగారు నేనూ మాట్లాడుకొని వారు ఎట్లా చెబితే అట్లా చేస్తానంటాడు రహి.

తరువాత తరువాత అమ్మ చరిత్ర వ్రాసిన 'రహి' ఇతడే అమ్మే తానుగా, తానే అమ్మగా జీవించిన ఋషీశ్వరుడు. చిదంబరరావు తాతగారన్నట్లు సేవా భావం మూర్తీభవించిన ఆంజనేయుడు ఈ రహిగా ఆవిర్భవించాడో లేక అమ్మే ఇనుమును తన పరశువేది స్పర్శతో బంగారం చేసిందో? 'రహి' అంటే సంతోషము, ఆనందం కదా! ఆ ఆనంద స్వరూపమే సంతోష స్వరూపమే సేవా భావంతో మనకు ఆదర్శమై నిలిచింది. అమ్మ సేవలో తరించింది. లోకానికి అమ్మ జీవిత సముద్రము లోతులను ఆకాశపు టెత్తులను చూపించింది.

రహీ! "ధన్యమహో, ధన్యమహో ధన్యం తవ జీవనం"

18. మౌలాలీ

బాపట్లలో భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద చింపిరి గుడ్డలతో సుస్తీగా ఉన్న ఒక సాయిబు. అమ్మను చూచి అమ్మ ఎటుపోతుంటే అటే తలత్రిప్పుతూ కన్నార్పకుండా అమ్మ వంకను చూస్తూ ప్రత్యక్షమైనాడు మొదటిసారి అమ్మ వద్ద. అమ్మలో ఏం కనిపించిందో, ఏం చూశాడో దృష్టి త్రిప్పలేకపోయాడు. “నేను కనిపిస్తేనే మీరు చూస్తారు’ అన్న అమ్మ, అతడ్ని అనుగ్రహించి అతడి దగ్గరకు వెళ్ళి “ఏం నాయనా!’ అని పలకరించగానే అమ్మను తన గుండెలకు హత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు. “దూరంగా ఉన్నప్పుడు భారీగా కనిపించి, దగ్గరకు వచ్చేటప్పటికి చిన్న పిల్లవయినావేంటమ్మా! ఇంత త్వరగా మారిపోయావేంటమ్మా!” అన్నాడు. “అది సరే నీకేం కావాలో చెప్పునాయనా!” అంటే ఆ సాయిబు “నీవే కావాలమ్మా” అంటూ ఏడ్చాడు. నీ దగ్గరే ఉన్నాను కదా ! ఏడుపెందుకు అంటే, ఇది ఆనందాతిరేకంతో వచ్చిన బాష్పాలంటాడు. “బ్రహ్మంగారి మనుమరాలు ఈశ్వరమ్మగా కనిపించావు” అన్నాడు. అమ్మ సాయిబును ఇంటికి తీసుకొనిపోయి అన్నం తెచ్చి పెట్టింది. అమ్మకు సాష్టాంగ నమస్కారం చేసి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు అమ్మ “అన్నం కోసం బాధపడకు నాయనా! ఇల్లు చూపించానుగా ఎప్పుడు వీలైతే అప్పుడురా” అని చెప్పింది అతడే మౌలాలీ.

మరుసటిరోజు అమ్మను చూస్తూ నిలుచుంటే “ఏం కావాలి నాయనా! నీకు?” అన్న అమ్మ మాటలకు నీవే కావాలి ఇంకేమీ వద్దు అన్నాడు. నేను ఒక చోట ఉండనుకదా! ఎట్లా ఉంచుకుండేది? అయినా నీకేదైనా జీవనానికి ఉందా అని అడిగి తన బంగారపు జడకుప్పెలు తీసి మౌలాలీకి ఇచ్చి చీరాల ఆస్పత్రి దగ్గర రొట్టెలు అమ్ముకుంటూ బ్రతుకు అన్నది. ఇలా బంగారం వస్తువులు ఇస్తే ఇంట్లో వాళ్ళు అరవరూ! బంగారపు వస్తువులు నాకెందుకమ్మా! నీదగ్గర ఉంచుకొని పట్టెడన్నం పెట్టు చాలు అన్నాడు. నేనీ ఊళ్ళో ఉండనుకదా ! ఊరికెళ్ళిపోతున్నాను అన్నది అమ్మ. నేను నీ వెంటనే వస్తాను ఎక్కడికెళ్ళితే అక్కడకు వస్తాను. అక్కడ అడుక్కుతిని నీ దగ్గర ఉంటా. భార్యాపిల్లలు లేరు. తల్లి, తోడూ నీడా అన్నీ నీవే. దూరంగా ఉండి నీకు నమస్కారం చేసుకుంటునమ్మా ? అని బతిమాలాడుతాడు. అమ్మ సరేనన్నది. మౌలాలీని తీసుకెళ్ళి చిదంబరరావు తాతగారికి పరిచయం చేసింది. చిదంబరరావుగారు కూడా అమ్మతోనే ఉండాలనే మౌలాలీ పట్టుదలకు సంతోషించారు.

అమ్మ మన్నవలో ఉండగా దొప్పలపూడిలో అడుక్కుని తింటూ మన్నవ వచ్చి అమ్మను చూచి వెళుతూ ఉన్నాడు మౌలాలీ. ఒకరోజు అమ్మ అన్నం తెచ్చి పెడుతూ మాట్లాడుతుంటే బంధువులు 'అడుక్కునేవాడితో మాటలేంటి?' అంటూ అమ్మను మందలించారు. ఆనాటి నుండి మౌలాలీ దూరంగా ఉండే అమ్మను చూడటం మొదలు పెట్టాడు. ఒకసారి చింతలతోపులో 11 రోజులు అమ్మ స్పృహ లేకుండా పడి ఉంటే మౌలాలీయే రోజూ వచ్చి అమ్మను చూచి వెళ్ళేవాడు. మళ్ళీ 12రోజులు అలాగే అమ్మ చింతలతోపులోనే చింతరసం త్రాగుతూ ఉన్నది. మౌలాలీ తప్ప మరెవ్వరూ తోడులేరు. అమ్మ మౌలాలీకి రకరకాల అనుభవాలిచ్చింది ఆ రోజుల్లో.

శ్రీకృష్ణుడు యశోదకు విశ్వరూప సందర్శనం చేయించాడు తన నోట్లో, అర్జునునకు యుద్ధరంగ మధ్యలో గీతోపదేశము విశ్వరూప సందర్శనము చేయించాడు. ధృతరాష్ట్రుని నిండు కొలువులో భీష్మాది రాజర్షులకు మునులకు ఆఖరికి అంధుడైన ధృతరాష్ట్రునకు విశ్వరూప సందర్శనం చేయించాడు. మౌలాలీ అదృష్టం పండింది. అతనికి అమ్మ విశ్వరూప సందర్శనం ప్రసాదించింది. మౌలాలీకి కూర్చుంటే ఏదో మైకం కమ్మినట్లుంది. అమ్మను చూస్తూ అమ్మలో కలిసిపోయినవాడిలా, చైతన్యం లేనివాడిలా కూర్చున్నాడు. అమ్మ వంటిమీద అనేక రకాల పక్షులు వాలిపోతున్నా కొట్టాలని అనుకుంటాడు కాని కొట్టలేడు. అనేక రకాల పురుగులు పాకుతూ ఉన్నా తీసివేద్దామనుకున్నా తీసివేయటానికి చేతులు రావటం లేదు. కాళ్ళు కదలటం లేదు. కనురెప్పలు కొట్టడానికి కూడా స్వాధీనం కావడం లేదు. శరీరం గుర్తిస్తాడే కాని సంకల్పాలు కూడా రావటం లేదు. అలా అయిదురోజులు గడచిన తర్వాత పౌర్ణమిరోజు అర్ధరాత్రి 12 గంటలకు అమ్మను చుట్టుకొని అమ్మతలపై అర్ధగజం దూరంలో గొడుగులాగా పడగవిప్పి లెక్కపెట్టటానికి వీలు లేనన్ని శిరస్సులతో, ఒక దివ్య సర్పం కనబడింది. శేషశాయిమాదిరిగా అమ్మ పడుకుని ఉన్నది. ఆదిశేషుడు గొడుగై ఎండకు వానకు కాపాడుతున్నట్టున్నది. ఇంకా అనేకకానేక రూపాలు. ఆ రూపాలన్నీ పోయి ఒకే అమ్మ అనేక తలలతో, అన్నీ మరుగై మళ్ళీ అమ్మ మామూలుగా కనిపించింది. అమ్మ మౌలాలీని తరింపచేసింది. ఇక తనకు జన్మలేదని, జన్మకు మూలం అమ్మేనని అనిపించిందతనికి. గుర్తించటం అంటే మాటలతో కాదు మనోవాక్కాయకర్మలా గుర్తించటం. అదే బ్రహ్మను తెలుసుకోవడం, ఇదే బ్రహ్మంగారు చెప్పారు. అమ్మ చూపించింది అనుకున్నాడు మౌలాలీ.

'ఏమిటి మౌలాలీ లోపల లోపల గొణుక్కుంటున్నావు' అంటే 'ఏమీ లేదమ్మా! నేను భగవంతుణ్ణే అని గుర్తిస్తున్నాను' అన్నాడు. అయతే నీవు బ్రహ్మవైనావా? అని అమ్మంటే, ఔను నిన్ను బ్రహ్మముగా గుర్తించాను కనుక నేను బ్రహ్మనై ఉన్నాను అంతా వెలిసినట్లుంది. గోడలు అడ్డంగా లేవు. ఇక నిన్ను వదిలిపెట్టి ఉండగలుగుతాను. ఏదైనా నీవు ప్రసాదించినదే అన్నాడు. అమ్మ అన్నం తెచ్చి మౌలాలీకి పెట్టి ఇంకా ఎన్నో జంతువులకు పెట్టింది. ఒకరికి తెచ్చింది ఇంతమందికి పెట్టావు ఇక ముందు ముందు ఇలాగే జరుగుతుందనుకుంటాను అని మౌలాలీ అంటే అమ్మ నీవే నయం మౌలాలీ ! నీకు జరుగబోయే సంగతులు తెలుస్తున్నాయి అన్నది అమ్మ. నీదయ ఉంటే అన్నీ తెలుస్తాయి తెలియందేముంది ? అన్నాడు.

అమ్మ కరుణ అమ్మకు కూడా తెలియకుండా మౌలాలీపై ప్రసరించింది. అంతకు ముందు మౌలాలీకి పోలేరమ్మ పోసి కళ్ళుపోయాయి. జగదీశ్వరిగా ఈనాడు వచ్చి దివ్యదృష్టి నిచ్చింది. తనలోనే కలుపుకుంది. శరీరాన్ని వేరుగా ఉంచింది గాని ఈయవలసిన మానసిక తాత్విక అనుభవాలిచ్చింది మౌలాలీకి. బ్రహ్మదండి అంటే ఏమిటో, వెన్నెముక క్రింద ఉండేనాడి సుషుమ్న అనీ. అది ఆపాదమస్తకమూ ఉంటుందనీ, దాన్ని కొందరు సాధకుల ఉచ్ఛ్వాస నిశ్వాసాల ద్వారా గుర్తిస్తారనీ, కొందరు రెండు కనుబొమ్మల మధ్య దృష్టిని నిలిపి గుర్తిస్తారనీ, అదే కుండలినీ ప్రబోధమనీ, పడుకున్నపామును కొడితే తలెత్తి బుసకొట్టినట్లుగా కొంతమంది సాధకులు హఠయోగమంటారనీ, దాన్నే సహస్రారానికి వెళ్ళిందంటారు అని యోగరహస్యాలు ఎన్నో చెప్పింది అమ్మ.


ఇవన్నీ నాకెందుకమ్మా ! నీవు దేవుడివి. కాదు కాదు అమ్మవు. నేను బిడ్డను. సూదిమోపను సందు లేకుండా సర్వత్రానిండి ఉన్నావు. నిన్ను సరిగా వాడుకోవటం చేతగాక విరగదీసి పెడతారు. ఇంతయాతన ఎందుకమ్మా ? ఎందుకమ్మా ఈ కార్యభారం? అన్నాడు మౌలాలీ. అందుకు అమ్మ భరించలేనప్పుడు కదా నాన్నా బాధ. నేనన్నింటినీ భరిస్తాను అన్నది. అమ్మ ఎవరికి ఏ స్థితి ఉన్నదో దానికి తగ్గట్టు వారికి దర్శనమిస్తుందనీ, ఎలా ఇవ్వగలదు అంటే మూలానికే మూలమనీ, అమూల్యమైన ఆదరణతో ఆదరణ గల అవతారమనీ, అమృతత్వమయిన అవతారమని ఆనాడే గుర్తించాడు. అమ్మ గుంటూరులోని కళ్యాణానంద భారతివద్దకు పంపింది మౌలాలీని. కళ్యాణానందభారతిస్వామి

అమ్మకు ముందు ముందు చాల గొప్ప స్థితి కలుగుతుందని చెప్పారు. ఇప్పుడు లేదా గొప్పస్థితి అని మౌలాలీ అడగ్గా అందరూ గుర్తిస్తారు ముందు అని చెప్పి పంపుతాడు.

అమ్మ వివాహ విషయంలో రకరకాల ప్రస్తావనలు వస్తే. నీకు వివాహం అవసరం అంటావా? ఏ అడవులలోకోపోయి హాయిగా ఉందాం అంటాడు. మౌలాలీ ఇది అడవి కాకపోలేదా? ఎక్కడ బాధలక్కడ ఉంటాయి. అక్కడా చెట్లు, పక్షులు తేళ్ళు, పాములు, మృగాలు ఉన్నాయి. అన్నింటికీ మనస్సు ఉన్నది. ఒక్కళ్ళకు ఒకళ్ళు స్వజాతి కూడా అర్థం చేసుకోలేకుండా ఉంది. ఈ అర్థం చేసుకోలేని బాధ సర్వత్రా ఉన్నది అన్నది అమ్మ. కష్టాలలో నీవు చూపించే ఓర్పే ఆధ్యాత్మిక సాధన అయితే మాత్రం ఇటువంటి సాధన ఎవరికీ వద్దని వేడుకుంటాడు మౌలాలీ.

అమ్మ మౌలాలీని గుళ్ళోకి తీసుకెళ్ళి రాళ్ళంటే మనస్సనీ, సిమెంట్ అంటే భక్తి అనీ భక్తి చేత భగవంతుడ్ని గుర్తిస్తామని, మనస్సు, భక్తి రెండూ భగవంతుడేననీ, మనస్సును గుర్తించడానికి భక్తి ఆధారమయిందనీ, భక్తికి మనస్సు ఆధారమయిందనీ, అదే మనస్సును మనస్సుతో గుర్తించటమని గీతోపదేశం చేసింది.

అమ్మ నాన్నల వివాహం చూచినవారిలో శ్యామలతో పాటు మౌలాలీ కూడా ఉన్నాడు. ఈ పెళ్ళి జరగటానికి కూడా యేదో ఒక మహత్తరమైన కారణముంటుందనీ, ప్రపంచానికి ఆదర్శంగా చూపించటానికే ఈ వివాహమని అనుకుంటాడు. అమ్మే సర్వస్వమని భావించి అమ్మను సర్వత్రా చూస్తూ ఎక్కడున్నా ఏం చేస్తున్నా తన మనోయవనికలో అమ్మను దర్శిస్తూ అమ్మ ఆజ్ఞతో శ్యామలకు తోడుగా కొంత కాలం ఉండటానికి అమ్మ అనుజ్ఞతో మహానంది వెళ్ళి అప్పుడప్పుడు భౌతికంగా ఉన్న అమ్మను చూడటానికి వచ్చిపోతుండేవాడు. ఎక్కడ ఉన్నా ఎక్కడకుపోయినా అమ్మ ఒడిలో కూర్చున్నట్లే ఉండేది అతనికి. అమ్మ ఇచ్చిన గుర్తుతో అమ్మను గుర్తించటమే కాదు ఉన్న చోట చెట్లను, గుట్టలను, నదులు, నిధులు కొండలు అన్నీ అన్నయ్యలు అక్కయ్యలుగా భావించటం, అవి అలా పిలుస్తున్నట్లు తోచటం అమ్మ వాత్సల్య చైతన్య స్రవంతిలో ఓలలాడటం శాంతంగా జీవితం గడపటంలో మౌలాలీ ధన్యుడైనాడు. ద్వంద్వంలో ఉన్నా ద్వంద్వాన్ని గుర్తించినవాడు, అద్వైత శిఖరాలను అమ్మ చూపించగా చూచిన ధన్యజీవి మౌలాలీ.



19. భద్రాద్రి రామశాస్త్రి

రాయప్రోలు, భద్రాద్రి రామశాస్త్రిగారు గుంటూరు నివాసి. సంప్రదాయ వైదిక కుటుంబంలో పుట్టి వేదాధ్యయనం చేసిన పండితుడు. కవిత్వము-వేదాంతము అధ్యయనము చేసినవాడు. మంచి వ్యాకరణవేత్త. కాశీ కృష్ణాచార్యులు, ఎ.ఇ.యల్. యం. కాలేజిలో ఆంధ్ర అధ్యాపకులుగా పని చేశారు. వీరు సర్వధారినామ సంవత్సర కార్తీక శుద్ధ ద్వాదశి (1886) లో వెంకట శివావధాని - సీతమ్మలకు జన్మించారు. 1960 సంక్రాంతి నాడు మొదటిసారి అమ్మను దర్శించుకున్నారు. అమ్మ వద్దకు రాకముందే శ్రీ రామచంద్రశతకము, మహేశ్వరీ శతకము, సీతారామ కళ్యాణము (ప్రబంధము), శివనారాయణ స్తవము మొదలగు గ్రంధాలు వ్రాశారు. ప్రబంధకవి- చతుర్విధ కవితా ధురీణుడు, చిత్రకవి, శ్లేషకవి, ప్రౌఢకవి అనే బిరుదులు పొందారు. బంధ, గర్భ, చిత్ర, శ్లేష, కవిత్వములు చెప్పుటలో దిట్ట.

గాయత్రీ స్థగిత- రామాయణార్థక "అనసూయాస్తోత్రా"న్ని రచించారు. అందులో అమ్మదయా విశేష సన్నివేశాలను చిత్రీకరించారు. "ముకుందమాల" అను కంద పద్యాలను వ్రాశారు. అమ్మ ఇచ్చిన అనుభూతులను "మానస బోధగా" రచించారు. అమ్మను గాయత్రీ మాతగా ఆరాధిస్తూ 'మాతృశ్రీ'లో వ్యాసాలు వ్రాశారు.

సాధికారకంగా శాస్త్రాధారంగా 'అమ్మ అవతార నిరూపణము' అనే వ్యాస పరంపరను రచించారు. రూఢిగా అమ్మ 'అవతారమూర్తి' 'పరదేవత' అనే నొక్కి వక్కాణించారు.

అమ్మను చూచిన నాటి నుండి అమ్మ వద్ద ఉండాలనే తపన పెరిగిపోయింది. అమ్మ చరణాలకు అంకితమై అమ్మ వద్దే ఉన్నారు. 1966లో అమ్మ సంస్కృత, పాఠశాల పెట్టి భద్రాద్రి తాతయ్యనే ఉపాధ్యాయునిగా ఏర్పాటు చేసింది. 'హైమ' అంటే వారికి చాల ఇష్టం. విద్యాసాగర్‌గారి పిల్లలు ఝాన్సీ, సావిత్రి, హైమలు కూడా ఆ రోజుల్లో భద్రాద్రి తాతయ్య వద్ద సంస్కృతం నేర్చుకొని జిల్లెళ్ళమూడి వెళ్ళిన అందరినీ సంస్కృతంలో పలకరిస్తుండే వాళ్ళు హైమ వారి ప్రియశిష్యురాలు. సంస్కృతం నేర్చుకున్నది. బుద్ధిమంతురాలు, తెలివిగలది, నెమ్మదస్తురాలు అని చెపుతుండే వారు హైమను గూర్చి.

ఒకసారి అమ్మ మంచం మీదఅమ్మ ప్రక్కనే హైమ దుప్పటి కప్పుకొని పడుకొని ఉన్నది. తాతగారు వచ్చి అమ్మ పాదాలనుకొని హైమపాదాలకు నమస్కరించారు. హైమ తన పాదాలు ఎవరో ముట్టుకున్నారని చూస్తే భద్రాద్రి తాతగారు. "ఈ పాదాలు నావి తాతగారూ! అమ్మవి కావు" అని చెప్పింది. అప్పుడు అమ్మ "ఏపాదాలకు నమస్కరించినా' నాకే చెందుతవిలే- అయినా ముందు ముందు ఆ పాదాలకే నమస్కరించే రోజు వస్తుంది" అన్నది. తోలు నోరు కాదు కద్దా తాలుమాట రావటానికి? ఆ తర్వాత హైమ 1968లో దేవాలయంలో ప్రవేశించటం, ఆ ఆలయానికి భద్రాద్రి తాతగారే ప్రథమ పూజారి కావటం యాదృచ్ఛికం కాదు. అమ్మ నిర్ణయంలో భాగమేననుకుంటాను. నిత్యము రుద్రాభిషేకము- సహస్రనామ పూజలు హైమకు చేసేవారు శాస్త్రిగారు.

హైమను గూర్చి 'శ్రీ హైమవతీ! శతకం వ్రాశారు. అందులో హైమ దయామూర్తి అని, పతితజనోద్ధరణ తత్పరమతి అని, వేదములచే కొనియాడ దగినదని స్తుతించారు చూడండి.

"అతిభక్తిన్ యజియించుచుండెద మహాయోగక్రమారాధ్యయై
పతితోద్ధారణ తత్పరత్వమతియై భాస్వద్దయామూర్తియై
శ్రుతి సంస్తోత్రి మహాప్రభావనిధియై శోభిల్లియున్ మానవా
కృతి కన్పట్టుచు దైవతం బయిన శ్రీ గీర్వాణి హైమావతిన్!"

ఒక దీపంతో మరొక దీపం వెలిగిస్తే రెండింటికీ తేడాకన్పించదు. అలాగే నీవు, అమ్మ ఒకటే.

"అమ్మకును నీకు సుంత భేదమ్ము లేదు
దీపమును దీపమొదలింప తేజమందు
రెండు దివ్వెల భేదంబు లుండబోవు" అన్నారు.

తాను పాఠాలు చెప్పిన గురువైనా హైమను ఆరాధించిన మహనీయుడు. నేను నీ బిడ్డను నన్ను వదిలి పెట్టబోకు. నీ ప్రేమ నాపై ప్రసరింప చేయమని వేడుకుంటారు.

హైమ వారి వద్ద చదువుకుంటున్న రోజులలో భద్రాద్రి తాతగారు అనారోగ్యంతో చిక్కిపోతే అమ్మతో "తాతగారు బాగా చిక్కిపోయారు- చూడమ్మా!" అని హైమ చెపితే అమ్మ నవ్వుకున్నది. వారి కన్నా ముందే హైమ ఆలయంలో చేరి వారిచేతే పూజలందుకున్నది.


మొదట్లో కవిగా, పండితునిగా బంధ, గర్భ చిత్ర శ్లేషాదులు బిగించి "అనసూయాస్తవము" వ్రాశారు. అది సామాన్యునకు అర్థంకావటం లేదని వారే భావించి తేలికగా ద్రాక్షాపాకంతో ఉండేవిధంగా 'గీతాంజలి' అనే పేరుతో ఒక శతకం వ్రాశారు. అందులో అమ్మ మహిమ తెల్పటానికి వేదాలే వెనుకాడుతాయనీ, ఏమి చదువు సంధ్యలు రాని వాడు కూడా అమ్మ పాదాలకు మ్రొక్కితే మోక్షాన్ని పొందుతాడని, అన్యథా శరణం నాస్తి అని అమ్మను దర్శిస్తే చాలు వారి చింతలన్నీ పోగొట్టి ఓదార్చి శాంతిని ప్రసాదిస్తుందనీ, చెడ్డవాడ్ని మంచి వాడ్ని సమదృష్టితో ప్రేమించే కరుణార్ద్ర సుగుణ స్వభావనీ ఎన్నో రీతులలో 'జిల్లెళ్ళమూడి అమ్మ' అనే మకుటంతో శతకం వ్రాశారు. జిల్లెళ్ళమూడిని కాశీగా ప్రక్కనే ప్రవహించే ఓంకారదని (మురుగు కాల్వ) గంగానదియనీ, వాకిట్లో ఉన్న కుక్కే కాలభైరవుడనీ, పర్ణశాలే దేవాలయమనీ, అమ్మఅపర్ణ, అనీ, భక్తులంతా మునులు, ఋషులనీ మొత్తం ఇది పవిత్రమైన వారణాసీ క్షేత్రమని భావించి వర్ణించి తరించారు. తనకు జన్మలేదని విశ్వసించారు. - "అమ్మ మంత్ర ముపాసించి అలరునేను- పొందనిక జన్మజిల్లెళ్ళమూడి అమ్మ" అని ఎంతో ధైర్యంగా విశ్వాసంతో అమ్మతోటే చెప్పగలిగారు. మంత్రం అంటే ఏమిటో అమ్మతో చర్చించి చివరకు సర్వం సర్వానికీ

ఆధారం అని గుర్తించి, అన్ని భూతాలలోనూ ఉన్నది ఒకటే అని విశ్వసించి, ఆబ్దికంనాడు పోయిన పెద్దలందరినీ తలచుకొని అగ్నిహోత్రంలో ఒక ముద్దవేసిమనం తినటమే అని అమ్మ చెప్పిన మాటలని నమ్మి ధన్యుణ్ణి అయినానన్న మహనీయుడు. అమ్మ ఇదంతా విన్నా వినకపోయినా ధన్యుడినే అనిపించుకొన్న విశిష్టవ్యక్తి.

ఆయన మరణంలో కూడా ఒక విశిష్టత ఉన్నది. తాను మరణించినపుడు తనను దహనం చేయవద్దని ఖననం చేయమని తన వీలునామాలో వ్రాసి పెట్టారు. విచిత్రంగా వారు మరణించిన రోజున తుఫాను వచ్చి ఎడతెరిపి లేని వర్షాలు. భోరున కురిసే వర్షాలలో వారిని దహనం చేయాలన్నా ఇబ్బందే. శాస్త్రప్రకారం దహనం చేయాలి. కాని వారి వీలునామా ప్రకారం ఖననం చేశారు. హైమను, అమ్మను ఆరాధించిన ఆ మహనీయుడు మూడవ నేత్రం (జ్ఞాననేత్రం) వికసించి అలా వ్రాశారో, లేక అందరికి సంకల్పాలు ఇచ్చే అమ్మే వారికి ఆ ఆలోచనను కలిగించిందో చెప్పలేం.

ఏమైనా భద్రాద్రి రామశాస్త్రిగారు తను, మన ధనాలతో అమ్మను ఆరాధించి, హైమను సేవించి సర్వసమర్పణ చేసి తరించిన ధన్యజీవి.





20. మల్లాప్రగడ శ్రీరంగరావు

సుప్రసిద్ధ పౌరాణికులు శ్రీ మల్లాప్రగడ శ్రీరంగారావు గారు అమ్మను మొదటిసారిగా మచిలీపట్నంలో 1974లో శ్రీ విన్నకోట ఉదయ భీమరాజు గారింట్లో చూశారు. ఆ పట్టణానికి మున్సిపల్ ఛైర్మన్‌గా చేసినవారు ఉదయభీమరాజుగారు. సుప్రసిద్ధ అడ్వకేటు. మనకు తెలిసేటట్లు చెప్పాలంటే బందరు సూరివాళ్ళనాన్నగారు. తరువాత రెండవసారి 1978లో బాపట్ల భావనారాయణ స్వామి దేవాలయంలో దేవీభాగవత ప్రవచన చేయటానికి వచ్చినప్పుడు శ్రీ కోటంరాజు సత్యనారాయశర్మగారితో కలసి జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించారు శ్రీరంగారావుగారు. అమ్మ లలితాదేవిని గూర్చి చెప్పమని అడగ్గా శ్రీరంగారావుగారు కొద్ది నిమిషాలలోనే లలితాదేవిని గూర్చి వివరణ చేశారు. అప్పుడు అమ్మ "లలిత" ఉందో లేదో నాకు తెలియదు. వాడు (శ్రీరంగారావుగారు) పదినిమిషాలల్లో తన మాటలలో నాకు లలితను చూపించాడు". అని చెప్పింది. అమ్మ చేత ప్రశంసింపబడిన శ్రీరంగారావుగారు ఎంత అదృష్టవంతుడో.

అసలు మల్లాప్రగడ వారిది కృష్ణాజిల్లా దివితాలూకా నాగాయలంక మండలం నంగేగడ్డ గ్రామం. 1923 అక్టోబరులో సత్యనారాయణ- సీతామహలక్ష్మి దంపతులకు ప్రథమపుత్రునిగా జన్మించారు. బాపట్ల శంకర విద్యాలయంలో వేదశాస్త్రాలభ్యసించారు. నెల్లూరు వేద సంస్కృతి కళాశాలలో సాహిత్య విద్యాప్రవీణులైనారు. మహామహోపాధ్యాయ జమ్ములమడక మాధవ రామశర్మగారి వద్ద సాహిత్య, అలంకార శాస్త్రాలు అభ్యసించారు. శ్రీ శ్రీ శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి వారి వద్ద మంత్రదీక్షితులైనారు.

మచిలీపట్నంలో స్వతంత్రదినోత్సవం నాడు (15.8.1947) జైహింద్ హైస్కూలులో సంస్కృతాధ్యాపకులుగా చేరి జీవనం సాగించారు. కృష్ణాజిల్లా టీచర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఉపాధ్యాయుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులను ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దటమే కాక తన పురాణ ప్రవచనాలతో సామాన్యజనంలో కూడా ధర్మచైతన్యాన్ని కలిగించటానికి కృషి చేశారు. ఆంధ్ర సంస్కృత రామాయణ, భారత, భాగవతాలే కాక దేవీభాగవతములో సహా అష్టాదశ పురాణాలు ప్రవచనం చేసేవారు. రాష్ట్ర రాష్ట్రేతరప్రాంతాలతో ఒక ఉద్దండుడైన పండితునిగా పండితలోకంలో పేరు ప్రతిష్ఠలు సాధించుకున్నారు.

1987 లో శృంగేరీ శారదా పీఠాధిపతులు శ్రీ భారతీతీర్థస్వామి వారు తమ పీఠ ఆస్థాన విద్వాంసులుగా ప్రకటించి విశిష్ఠ సత్కారం చేసి గౌరవించారు. రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో లెక్కలేనన్ని సత్కారాలు జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో "గండ పెండేరం" తొడుగగా, విజయవాడలో కనకాభిషేకం చేశారు. గుంటూరు శ్రీనాధపీఠం వారు స్వరాజ్యలక్షమ పురుషోత్తమ రాయకవి పురస్కారంతో సత్కరించారు.

ఒరిస్సా ఛత్రిపురం తెలుగు సంఘం వారు 'మధురభారతి' గానూ, విశాఖ ద్వారకానగర్ శంకరమఠం వారు 'భాగవత సుధాసింధు' వుగానూ, మచిలీపట్నం హిందూమత బాలసమాజం వారు 'ఆర్షవిద్యాభూషణ' గానూ, మచిలీపట్నం సరస్వతీ కళాసమితి వారు 'పౌరాణిక సార్యభౌము'నిగానూ, విశాఖ పట్టణప్రజలు "ఉపన్యాసకోకిల' గాను గుర్తించి ఆయా బిరుదులతో సత్కరించి బ్రహ్మరథం పట్టారు.

విశాఖ మాతృశ్రీ అధ్యయనపరిషత్ శ్రీ తంగిరాల కేశవశర్మగారి ప్రోత్సాహంతో మూడు పూలు ఆరుకాయలుగా విస్తరిల్లింది. కేశవశర్మగారికి, విశాఖలో తమ అధ్యయన పరిషత్ పక్షాన 'లలితా సహస్రనామ భాష్యం' చెప్పించుకోవాలనే కోరిక కల్గింది. ఆ ప్రాంతంలో శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్యుల వారు సుప్రసిద్ధ పౌరాణికులు. శ్రీ కేశవశర్మ అమ్మ వద్దకు వచ్చి ఆచార్యుల వారిచే లలితాభాష్యం చెప్పించుకుందామని ఉందమ్మా అని అడిగారు. అందుకు అమ్మ "వారిని గూర్చి నాకు తెలియదు నాన్నా! బందరులో మల్లాప్రగడ శ్రీరంగారావుగారున్నారు. వారు చెపితే లలిత మీకు కనిపిస్తుంది. ఆయన చేత

చెప్పించుకోండి" అన్నది. విశాఖ అధ్యయన పరిషత్ పక్షాన 1981 ఫిబ్రవరిలలో "శ్రీ లలితా సహస్రనామ భాష్య ప్రవచనం" 24 రోజులు శ్రీ రంగారావుగారి చేత చెప్పించుకోవటం జరిగింది.

ఆ తర్వాత 1981 నవంబరులో జిల్లెళ్ళమూడిలో అమ్మ సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ ప్రవచనం చేశారు శ్రీరంగారావుగారు. అప్పటి నుండి అప్పుడప్పుడు అమ్మ వద్దకు రావటం జరుగుతుండేది. 1984లో అమ్మ సన్నిధిలోనే 'శాక్తేయ ఉపనిషత్తుల' ప్రవచనం కూడా రంగారావుగారు చేశారు. 1984లో కేశవశర్మగారు అమ్మ వద్ద చండీయాగం చేయాలనుకున్నారు. శ్రీ రంగారావుగారు 'గాయత్రీ యాగం' చేయాలని సలహా ఇచ్చారు. జిల్లెళ్ళమూడిలో శ్రీరంగారావుగారి నిర్వహణలో గాయత్రీ యాగం అత్యంత వైభవంగా సర్వులకూ సంతృప్తి కలిగే రీతిలో జరిగింది. అమ్మ కోరికపై రంగారావు గారు 'మహాభారతంలో యక్షప్రశ్నలు' ప్రవచనం చేసి అందరి మన్ననలూ పొందారు. అలాగే త్రయీ విద్యను కూడా ప్రవచనం చేశారు.


1985 విశాఖ మాతృశ్రీ అధ్యయనపరిషత్ వారు శ్రీరంగారావుగారి శ్రీ లలితా సహస్రనామ భాష్యాన్ని టేపులలో భద్రపరిచిన దానిని వ్రాయించి 'భారతీశ్యాఖ్య' పేరుతో ప్రచురించారు. బాపట్ల మాతృశ్రీ ప్రింటర్స్‌లోనే అది ముద్రితమైంది. అమ్మ స్వయంగా ఆ గ్రంథాన్ని ఆవిష్కరించింది. మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీ అధ్యాపకులు రంగారావు గారి కుమారులు శ్రీ శ్రీమన్నారాయణ మూర్తి ముద్రణ కార్యభారం స్వీకరించి పూర్తి చేశాడు. ఇప్పుడు ఆనాటి భాష్యానికి విపుల వ్యాఖ్య కూడా తయారుచేస్తున్నారు పునర్ముద్రణకు.

ఆ గ్రంథ ముద్రణ జరిగే రోజులలో ఒకనాటి సాయంత్రం అమ్మ సన్నిధిలో శ్రీమన్నారాయణ మూర్తి ఉండగా అమ్మ "నాన్నా! నీకు శంకరాచార్యులను గురించి తెలుసా?" అన్నది. కొద్దిగా తెలుసునమ్మా! అంటూ శంకరాచార్యుల జీవిత విశేషాలు సంగ్రహంగా చెప్పారు శ్రీమూర్తిగారు. అమ్మ "నాన్నా! శంకరాచార్యులుఏయే గ్రంథాలు వ్రాశారురా?" అని అడిగింది. ఆచార్యుల వారి రచనలన్నింటిని గూర్చి సవిస్తరంగా వివరించారు. శ్రీమూర్తిగారు. అమ్మ "నాన్నా! శంకరాచార్యులు విష్ణు సహస్రనామ భాష్యం వ్రాశారంటున్నావు. ఆయన దేవీ భక్తులు కదా! లలితా సహస్రనామాలకు వ్యాఖ్యానం వ్రాయలేదా?" అని అడగ్గా మూర్తిగారు

లేదమ్మా! కానీ 'లలితాత్రిశతి'కి భాష్యం వ్రాశారు అన్నారు. 'లలితా సహస్రనామాలు ఎందుకు వ్రాయలేదురా?' అని అమ్మ అడిగింది. ఏమో తెలియదమ్మా! అన్నారాయన. అప్పుడు అమ్మ 'నేను చెప్పనా? మీ నాన్న వ్రాసాడని ఆయన వదిలేశాడురా' అన్నది. శ్రీ మూర్తిగారు పులకితగాత్రుడై ముకుళిత హస్తాలతో సజలనయనాలతో అమ్మ పాదాలకు నమస్కరించాడు. ఎన్ని గంటల సేపు ఉపన్యాసం చేసి చెప్పి వివరించినా "లలితా సహస్రనామ భాష్య రచనకు" శ్రీరంగారావు గారు అర్హుడు అని ఒక్క వాక్యంలో అమ్మ ఇచ్చిన ఈ యోగ్యతా పత్రానికి సాటి కాదు. అంతగా అమ్మ కరుణకు పాత్రులైనవారు శ్రీ రంగారావుగారు.

శ్రీ విశ్వజననీ సేవా సమితి, హైదరాబాద్‌లో నిర్వహించిన సెమినార్‌లోనూ, బందరు, గుంటూరులో జరిగిన ప్రేమార్చన ఉత్సవాలలోనూ పాల్గొని సభలకు నిండుదనం చేకూర్చారు శ్రీరంగారావుగారు 1983లో అమ్మ వజ్రోత్సవాలలో జరిగిన సభలలో ఎన్నింటిలోనో కీలకపాత్ర పోషించారు.

అమ్మతో శ్రీరంగారావుగారికి ఒక చిత్రమైన సంభాషణ జరిగింది. అమ్మ ఎన్నో తాత్విక అంశాలు వారితో చర్చిస్తుండేది. అమ్మ సన్నిధిలో లలితాభాష్య ప్రవచనాలు చేసే రోజుల్లో ప్రవచనానంతరం వసుంధర అందించిన వేడిమిఠాయిలు తన చేతిలోకి తీసికొని అమ్మ తానే స్వయంగా నోటితో ఊది వేడి చల్లార్చి శ్రీరంగారావుగారికినోటికి అందించేది. రంగారావుగారు పాలు త్రాగిన తర్వాత ఆప్యాయంగా ఆయన పొట్టనిమిరేది. అలా నిమిరుతూ "ఈ చిన్ని బొజ్జలో వేదాలు, శాస్త్రాలు, ఉపనిషత్తులు, పురాణాలు - ఇన్ని ఎలా ఇమిడి ఉన్నాయి నాన్నా!" అంటూ అవ్యాజ ప్రేమ వాత్సల్యాలను కురిపించేది. ఒకసారి అమ్మ శ్రీరంగారావుగారు ఆశ్చర్యంగా "అదేమిటమ్మా! అయినా నువ్వు విశ్వజననివి కదా! బిడ్డలందరం నీ రక్తం పంచుకొని పుట్టినవాళ్ళమే" అన్నారు. అందుకు అమ్మ "అది సరేలే మనిద్దరికీ ప్రత్యేకంగా 'రక్తసంబంధం' ఉన్నదిరా! నువ్వూ 'రుధిరోద్గారి'లోనే పుట్టావు- నేనూ 'రుధిరోద్గారి' లోనే పుట్టాను. రుధిరం అంటే రక్తం కదా! మనది 'రక్తసంబంధం' కదా" అన్నది. శ్రీరంగారావుగారు మౌనంగా అమ్మ పాదాలపై వ్రాలిపోయారు. 2007 ఏప్రిల్ 9న అమ్మలో కలిసిపోయారు. నిజంగా మల్లాప్రగడ శ్రీరంగారావుగారు ధన్యజీవి.



21. సింగుపాలెం జానకి

జానకి అనే మాట వినగానే ఒక పవిత్రత, ఆరాధ్యభావన స్పందింపజేసే ఆదర్శ నారీమణి మన హృదయాంతరాళాల్లో మెదులుతుంది. అలాగే, జిల్లెళ్ళమూడికి 1960 దశకం, మొదటి భాగంలో వచ్చిన కొద్ది మంది సోదరీ మణులలో, అమ్మను ఆరాధిస్తూ అమ్మ మాట, చేత ఆదర్శగా తన జీవితానికి అన్వయించుకొని నడచిన నారీమణి సింగుపాలెం జానకి.

రేపల్లె తాలూకా సింగుపాలెలో తొట్టెంపూడి రాఘవయ్య సత్యవతమ్మ దంపతుల ప్రథమ పుత్రిక జానకి. జిల్లెళ్ళమూడికి వచ్చి అదే తమ స్థిరనివాసంగా ఏర్పరచుకొన్న సింగుపాలెం వాస్తవ్యులు యార్లగడ్డ రాఘవయ్య, భాస్కరరావు అన్నయ్యలతోపాటు జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించి అమ్మ అనురాగ జలధిలో ఉండిన అదృష్టవంతురాలు జానకి.

జిల్లెళ్ళమూడిలోని అందరింట్లో ఏ పని చేయవలసివచ్చినా అది ఆడపని, మగపని అని తేడా లేకుండా, ఇంటి పునాదులు తీయవలసి వచ్చినా, ఇసుకలారీలో వెళ్ళి ఇసుక తీసుకొని రావలసినా, నాట్లు నాటవలసి వచ్చినా, వరికోతలు కోయవలసి వచ్చినా ప్రతిపనికి ముందుండి ఆ పనిని ఒక పవిత్ర ఆరాధనాభావనతో చేసేది. ఏపనీ చేయకుండా ప్రసాదం (భోజనం) తీసుకోవడం తనకు ఇష్టముండేదికాదు. భగవంతునితో ఎంత సామీప్యాన్ని సంపాదించుకొన్నదంటే, 'అంఆ' జీవితచరిత్ర అమ్మ చెబుతుంటే లేఖకురాలిగా ఉండగల్గిన అదృష్టం

పొందిందంటే, అంత కంటే సార్థక్యం ఏముంటుంది! అమ్మ అనుగ్రహం పొందిన అదృష్ట వంతురాలని మేమంతా ఎంతో ఆనందించే వాళ్ళం.

పది పన్నెండు సంవత్సరాల వయస్సులోనే అమ్మ వద్దకు వచ్చిన జానకికి పెళ్ళి సంబంధాలు చూద్దాం అని తల్లిదండ్రులు అనుకొంటున్న సమయంలో అమ్మ జానకికి శ్రీ తంగిరాల కేశవశర్మచే ఒక ఉత్తరం వ్రాయించింది. సకల లక్షణ సంపన్నుడైన భర్త కావాలా? సకల దుర్లక్షణ సంపన్నుడు కావాలా? ఎలాంటి భర్త నీకు కావాలో కోరుకొమ్మంది. అందుకు జానకి సమాధానంగా అమ్మ ఎవరిని ప్రసాదిస్తే వారిని దైవంగా స్వీకరించటమే తన కర్తవ్యమని పలికింది.

మృకండమహర్షికి పరమశివుడు ప్రత్యక్షమై సకలసద్గుణసంపన్నుడు, అల్పాయుష్కుడు అయిన కుమారుడు కావాలో, దీర్ఘాయుష్మంతుడు, చెడ్డ గుణాలు కల్గిన కొడుకు కావాలో కోరుకోమంటే- అల్పాయుష్కుడైనా సద్గుణ సంపన్నుడ్నే కోరుకుని చిరంజీవియైన కొమరుని కన్నాడా మహర్షి.

కాని జానకి అలా కోరుకోలేదు. భగవతి తనకు ఎవరిని ప్రసాదిస్తే వారినే దైవంగా స్వీకరించింది. 1964 జనవరి 24వ తేదీన జరిగిన పెళ్ళినాటి నుంచి, తుదివరకు అమ్మను ఇలా చేశావేమని ఎన్నడూ ప్రశ్నించలేదు. అమ్మ సింగుపాలెం వెళ్ళినప్పుడు ప్రతి ఇంటికి వెళ్ళింది. అందరికీ దర్శనం ప్రసాదించింది. ఆరాధించుకొనే అవకాశం ఇచ్చింది. బృందావనంలో గోపికల మధ్య గోపాలకృష్ణునివలె విహరించింది. సింగుపాలెం బృందావనమేనన్నది. మరి జానకి బృందావనంలో రాధిక అని అమ్మ భావమేమో? రాధ భక్తిని గూర్చి పలుకుతూ అమ్మ కృష్ణుని ఉచ్ఛ్వాస నిశ్వాసలే రాధ అంది. అంటే వారి సంబంధం అద్వైతస్థితి అంతటిది. అలాగే జానకికీ, తనకూ అంతటి అద్వైతబంధం ఉన్నది అని అమ్మ మనకు చెప్పిందేమో!

జానకికి కూడా అమ్మను గూర్చిన నిరంతర చింతన ఉండేది. ఏ పని చేసినా ఈ ఆలోచనే- చేట, చీపురు, రోలు- రోకలి, తిరుగలి నాలుగువేదాలు అని అమ్మ అన్నట్లుగా, జానకి భర్త సేవ, బిడ్డలసేవ, గొడ్లసేవ దేనిలోనైనా అమ్మను దర్శించి అమ్మ సేవగా భావించింది.

జిల్లెళ్ళమూడి నుండి ఎవరు వాళ్ళయింటికి వచ్చినా వారి పట్ల ఆమె చూపే ఆదరణకు ఆప్యాయతకు అవధులులేవు. ఎంత చేసినా తానింకా వారికి

చేయవలసినంత సేవ చేయలేకపోయాననే అని బాధ పడేది. ఆ ఆదరణకు అనురాగానికి మనం ఎంత వరకు అర్హులం? అని సిగ్గుపడాల్సి వచ్చేది.

అమ్మ తనూభవులు సుబ్బారావు- రవి- హైమలతో ఆమె అనుబంధం భగవంతుడికి భక్తుడికి ఉన్న సంబంధం వలె ఉండేది. సుబ్బారావు, రవిలలో ఎవరైనా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు అమ్మను చూచినట్లు వారిని చూచేది. వాళ్ళకొరకు ఏర్పాటు చేసిన తుండుగుడ్డ, ధోవతి, సబ్బు, గ్లాసు ఏ వస్తువైనా మరొకరికి వాడేది కాదు. వాటిని పవిత్రంగా భద్రపరచేది. ఇక హైమ, జానకిలు ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుకొనేవారు. అది ఒక అనిర్వచనీయమైన ప్రేమానుబంధం.

తప్పు చేసినా మన్నించే క్షమాగుణం వాత్సల్యంతో ఆదరించే అతిమానుషతత్వం ఒక్క అమ్మకే ఉన్నదనుకొనేవాళ్ళం. ఎందుకంటే "తప్పించుకోలేక తప్పుచేస్తారు తప్ప, తప్పు చెయ్యాలని ఎవరూ చెయ్యరు. కాని తప్పు లెన్నటం మొదలు పెడితే ఏడవమైలు దిగేవాడుండడు. చేతలు నీ చేతుల్లోలేవు. నాకు తప్పుకనిపించదు. ఎందుకంటే మీరు చేస్తున్నారని నేనను కోవడంలేదు. మీరంతా నా అవయవాలు" అని తన గర్భ తీపి ప్రకటించిన నిత్యచూలింత, నిత్యబాలింత మన అమ్మ కనుక.

అమ్మ జీవితంలో ఎంత ఒరిపిడి, బాధలు అనుభవించిందో అమ్మ చరిత్ర చదివిన వారెరుగుదురు. "అమ్మ ఓరిమి భూమి ఓరిమి. అవనే అనసూయమ్మ" అని రాజుబావ చెప్పినవి అక్షరసత్యాలు.

జానకిలో కూడా అలాంటి క్షమాగుణాన్ని ఓర్పును దర్శించాం. శారీరకంగా మానసికంగా తను ఎంత చిత్రవధకు లోనైనా మొహంపై చిరునవ్వు ఎన్నడూ వీడనిచ్చేది కాదు. ఆ కళ్ళలో, ఆ మాటలో, ఆ చేతలో ఆమె ప్రతి కదలికలో ఏదో అనిర్వచనీయమైన ఆత్మీయతా బంధం తొణికిసలాడుతుండేది.

అభిమానం పట్టుదల చిన్న తనం నుండి రక్తగతమైన లక్షణాలుగా ఉన్నవి ఆమెలో చిన్న సహాయం ఎవరి నండి స్వీకరించినా రాముని వలె- అమ్మ వలె జీవితాంతం గుర్తుపెట్టుకొని తనలోని బాధను ఎవరికీ తెలియనిచ్చేది కాదు. తనకు అపకారంచేసినా సహించేది, మరిచిపోయేది.

ఒక ఆదర్శ నారీమణిగా, ఒక పతివ్రతగా భర్తను సేవించింది. ఒక

తల్లిగా బిడ్డలను పెంచి పెద్దచేసింది. భర్త అర్థాంతరంగా వదలి వెళ్ళినా బాధ్యతలను మాట రాకుండా నెరవేర్చింది. అయితే ఇవన్నీ తన ధర్మంగా నిర్వర్తించింది. తామరాకుమీద నీటి బొట్టులాగా దేనినీ అంటుకోనివ్వలేదు. వీటన్నిటిని వదలిపెట్టాల్సిన పరిస్థితులు వచ్చినపుడు అంతనిశ్చలంగా నిర్మలంగా నిర్మమకారంగా, నిస్సంగంగా వదలిపెట్టింది.

అంత అనురాగమూర్తిలో ఇంత విరాగం ఉన్నదని ఎవ్వరూ ఎప్పుడూ ఊహించలేదు. సర్వత్రా అనురాగమే విరాగం అని అమ్మ అన్నమాటను తలక్రిందులు చేసి సర్వవిరాగియై అనురాగంతో మనల్ని తన్నుక చావమని, బాధపడమని, ఏడ్వమని చెప్పా చెయ్యకుండాపోయింది. భర్త అర్థాంతరంగా తనను,, తన బిడ్డలనూ వదలి వెళ్ళితే, తను అర్థవంతంగా బాధ్యతలను నెరవేర్చి 1991 నవంబరులో సుదూరలోకాలకు తరలివెళ్ళింది.

'నీ బాధ్యతలు పూర్తిచేశావు జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మ సేవలో కాలం వెళ్ళబుచ్చుమ' ని మేమంతా అడిగితే, 'వస్తాను ఆసమయం వస్తే' అనేది.

అమ్మ సేవలో అమ్మ ఒడిలో కన్నా అమ్మలో కలిసిపోవటానికే ప్రాధాన్యతనిచ్చిన ధన్యజీవి జానకి. లడ్డు అవటంలో కన్నా లడ్డును అనుభవించటం లోనే అనందం, తృప్తి ఉన్నదన్న అమ్మ సూక్తిని ఎందుకు మరిచినదో మాత్రం అర్థం కావటం లేదు.

తన జీవితమంతా బాధలనే పూజా పుష్పాలతో బాధల భగవంతుడిని ఆరాధించి తన విశ్వాసాన్ని శ్వాసలో మిళితం చేసి ఆఖరి శ్వాసను, ధ్యాసను అమ్మలో కలిపి అమ్మలో కలిసిపోయిన చారిత్రకమూర్తి, ఆదర్శమూర్తి సింగుపాలెం జానకి ధన్యజీవి.



22. శ్యామల

అమ్మను మొదటిసారిగా తెనాలిలో సినిమా హాలులో శ్యామల చూచింది. అమ్మలో ఏమి చూచిందో ఆకర్షితురాలయింది. శ్యామలకు 16 ఏళ్ళే. భర్త చిన్నప్పుడే పోయాడు. తల్లీ, తండ్రీ తోబుట్టువులు ఎవరూ లేరు. పినతల్లి గారింట్లో ఉంటున్నది. స్వగ్రామం రెంటచింతల. శ్యామల తల్లిది జిల్లెళ్ళమూడి దగ్గరి కాకుమాను. తెలుగు విద్వాన్, చక్కని గాత్రంతో పాటలు పాడేది.

శ్యామల పుట్టుకే విచిత్రమైనది. శ్యామల తల్లి వింతతువు. ఒకడు మోసం చేసి గర్భం చేశాడు. కుగ్లర్ హాస్మిటల్‌లో శ్యామలను ప్రసవించి చచ్చిపోయింది. చావక ముందు శ్యామలను కూడా చంపాలనే ప్రయత్నించింది. కానీ భూమి మీద నూకలు మిగిలి అదే సమయానికి చిదంబరరావుగారి భార్య పురుడు పోసుకోను అదే హాస్పిటల్‌లో ఉండటం వల్ల చిదంబరరావుగారు చూచి డాక్టర్ కుగ్లర్‌తో చెప్పి మంచి మందు ఇప్పించటం వల్ల బ్రతికింది. తర్వాత రెంటచింతల వాస్తవ్యురాలు నాగమణి అనే స్త్రీ శ్యామలను పెంచుకోవటానికి తీసుకెళ్ళింది. ఆమె భర్త కొమ్మరాజు కోటేశ్వరరావు. శ్యామలకు పేరు పెట్టింది కూడా వెళ్ళే. శ్యామలను 8 ఏళ్ళకే తన తమ్ముడికిచ్చి పెళ్ళి చేసింది నాగమణి. స్ఫోటకం వచ్చి నాగమణి, వాళ్ళ తమ్ముడు చనిపోయారు. కోటేశ్వరరావు మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆమె శ్యామలను సరిగా చూడకపోవటం వల్ల కోటేశ్వరరావు, నాగమణి చెల్లెలు కమలమ్మ దగ్గర శ్యామలను దించుతాడు. అక్షరాభ్యాసం చేసిన నాటి నుండి శ్యామలకు 'ఓం' అన్న అక్షరం ఎప్పుడూ ఎదురుగా కనపడుతుండేది. కోటేశ్వరరావుగారికి అమ్మరూపం గాయత్రిగా కనుపిస్తుండేది. శ్యామలకు కూడా ఓంకారం అమ్మ రూపంలో కనుపించేది. శ్యామలకు మూర్ఛల జబ్బు ఉండేది. చందలూరు మహాలక్ష్మమ్మ పూజ చేసుకొంటే తగ్గి పోతుందని కమలమ్మ చెప్పగా అమ్మనే మహాలక్ష్మమ్మగా భావించి ధ్యానిస్తుండేది.

తాను నిత్యమూ ఆరాధించే గాయత్రీ రూపంగా అమ్మ సినిమాహాలులో కనిపించే సరిగి పెద్దగా కేకవేసి పడిపోయింది శ్యామల. అమ్మ శ్యామలను తీసుకొని వాళ్ళఇంటికి వెళ్ళుతుంది. శ్యామల అమ్మను చూపించి మన ఇంటికి

దేవత వచ్చింది. అని చెప్పుతుంది వాళ్ళ పిన్నితో, శ్యామలకు సర్వత్రా అమ్మే కనిపిస్తుంది. శ్యామల పిన్ని కమలమ్మకు కూడా చందలూరు మహాలక్ష్మమ్మగా కనిపించగా అమ్మ పాదాలు పట్టుకొని వదలదు. శ్యామల వల్ల తను కూడా తరించాననుకుంటుంది. లలితా సహస్రనామాలు త్రిశతి, ఖడ్గమాలతో అమ్మకు పూజచేసి హారతిచ్చారు శ్యామల, కమలమ్మ.

మరుసటి రోజు శ్యామల అమ్మ దగ్గరకు వెళ్ళేసరికి అమ్మ నాన్నగారు మాట్లాడు కుంటుంటారు. ఆయన ఎవరని శ్యామల అడగ్గా అమ్మ నన్ను అమ్మ అంటున్నావు గనుక ఆయన నాన్నగారు అంటుంది. నీకింకా పెళ్ళికాలేదు కదా అంటే మెళ్లో మంగళసూత్రం ఏది? అని అడగ్గా, అమ్మ పెళ్లయింది- నాది అందరికీ కనబడే సూత్రం కాదు అని చెప్పి సూత్రమంటే ఒకరకంగా ఇముడ్చుకునేదనీ, దారము, బొట్లు ఇందులో ఏదిలేకపోయినా సూత్రంకాదనీ, బొట్లు రెండు భర్త పాదాలని, మూడు ముళ్ళే త్రిపుటి అని, త్రిపుటి అంటే సృష్టి అని చెప్పింది. అందుకు శ్యామల నా బోటి వితంతువుల గతి ఏమిటి? అని అడగ్గా అమ్మ భర్తనిన్ను విడిచినా నీవు భర్తను విడవకుండా ఉండటమే. భర్తంటే భావనే అని చెప్పింది.


అమ్మ పెళ్ళికి శ్యామల వచ్చి వడ్డన చేసింది. పెళ్ళిలో జరిగిన విషయాలన్నీ మౌలాలీకి చెప్పింది. అమ్మకోసం శ్యామల బాపట్లలో ఉంటుంది. అమ్మ శ్యామలను చదువుకోమన్నది. శ్యామలకు దూరపు బంధువయిన హనుమాయమ్మగారికి శ్యామలను అప్పగిస్తుంది. నిన్ను చూడకుంటూ ఎట్లా ఉండేది అని శ్యామల అడగ్గా చూడకుండా ఉండాలనుకున్నా ఉండలేను. నాకు తెలియకుండానే నీవు చూస్తావు అని చెప్పింది అమ్మ. అందుకు శ్యామల నేను ఎక్కడ ఉన్నా నీవు తప్ప రెండోది కనపడని స్థితి కావాలమ్మ! నాకు జ్ఞానం వద్దు- మోక్షం వద్దు. అమ్మే కనబడాలి ఎప్పుడూ అని కోరుకుంటుంది. అమ్మతో "ఏంచేయాలో తెలియటం లేదు. ఏ దారి చూపినా నీవే చూపాలి. ఏదిక్కు లేనిదానికి నీవేదిక్కు. దేని కిందైనా పడి చచ్చి పోదామని పించినా నిన్ను చూడటం కోసమైనా బ్రతకాలనిపిస్తున్నది" అన్నది.


శ్యామలకు అమ్మ సర్వంగా భాసించింది. అందులో ఏమాత్రం సందేహం లేదుఆమెకు. అమ్మ రూపం పాకీతట్ట పట్టుకుని చీపురు పట్టుకొని దొడ్లుచిమ్ముతున్నా

సరే అమ్మ అమ్మే– అమ్మ ఏది కాదు? అమ్మ డాక్టరు. అమ్మ రోగి. అమ్మ మందు, అమ్మే సర్వం.

శ్యామలకు చదువు చెప్పిద్దాం అనుకున్నారు చిదంబరరావు తాతగారు, కాని చదువుమీద అంత శ్రద్ధలేదు. పూసల బుట్టలల్లటం, లేసులు అల్లటం ఇలాంటివి చేసి అమ్మి జీవనం గడుపవచ్చుఅని చెప్పింది.

ఏది ఏమైనా, లక్ష్మణుడు రాముడి దగ్గరున్నాడు– భరతుడు రాముడ్ని తన దగ్గర ఉంచుకున్నాడు అన్నట్లు అమ్మను తన దగ్గర ఉంచుకున్నది శ్యామల. అమ్మ శ్యామలతో నీకేం కావాలి అని అడగ్గా 'నీవే కావాలి!' అని చెప్పింది. అమ్మ వివాహం అయింతర్వాత కొంతకాలం అమ్మను చూస్తూ గడిపి తర్వాత, మహానందికి ఉత్తరంగా ఉన్న మామిడితోటలలో ఉన్నది. తెనాలిలో నారపరాజు సుబ్బారావు అనే కాంపౌండరు వదినగారి కూతురు. చిన్న తనం నుండే గాయత్రిని ఉపాసించి అమ్మను గాయత్రిగా ఆరాధించింది. తాను మహానందిలో ఉన్నా అమ్మను, అమ్మ వద్ద ఉన్నవారిని అందరిని చూడగల అంతర్దృష్టి సాధించిన మహానుభావురాలు, ధన్యురాలు శ్యామల.





23. అమ్మనామ సంకీర్తనలో తరించిన రాధాకృష్ణరెడ్డి

పరమాత్మ అమ్మరూపంలో భూమిపైన మనల్ని ఉద్ధరించడానికి అవతరించడానికి. అమ్మ పాదాలవద్దనే తన జీవితం అర్పణ కావాలనీ, అమ్మ నామాన్ని జపించి తపించి అమ్మ నామస్మరణతో, అమ్మ నామ సంకీర్తనంలో తన్మయుడై తరించిన సంగీత యోగి, భక్తాగ్రేసరుడు జిల్లెళ్ళమూడి చరిత్రలో అపర నారద మహర్షి శ్రీ కాసు రాధాకృష్ణరెడ్డి.

రాధాకృష్ణ యుగళస్వరూపమైన అమ్మ సన్నిధిలో ఇద్దరు రాధాకృష్ణులు అమ్మను సేవించిందన్నారు. వారు ఒకరు సాహిత్య సరస్వతి అయితే మరొకరు సంగీత సరస్వతి. అమ్మ సుప్రభాత సంధ్యా వందనాదులను రచించి అందరి నాల్కలపై నర్తించేటట్లు చేసినవారు డాక్టర్ పన్నాల రాధాకృష్ణశర్మగారు. తన మధుర గానామృతంలో అందరినీ ఓలలాడించిన మహర్షి కాసు రాధాకృష్ణరెడ్డి. అమ్మ నామాన్ని అన్ని రాగాల లోనూ క్రొత్త రాగాలను సృష్టించి పాడిన వాగ్గేయ కారుడు. ఆ పాటలోని ఆర్తి, ఆత్మీయతా, తన్మయత ఎవరినైనా ఆకట్టుకొనేవి. రాధ చాలా పట్టుదల కలవాడు. ఒకరకంగా మొండి వాడు కూడా. ఎవరు చెప్పినా వినేవాడు కాదు. అమ్మ నామ సంకీర్తనలు, హైమ నామ సంకీర్తనలు మండల దీక్షల్లో చేసేటప్పుడు ఆహారము, నీరు కూడా ముట్టుకోకుండా చేసిన రోజులుండేవి. ఎవరు చెప్పినా ఆహారంగానీ, ఆఖరికి పాలు గానీ తీసుకోవడం లేదని అమ్మే స్వయంగా పంపించినా త్రాగేవాడు కాదు. పరమాత్మ పరిమిత రూపంలో వచ్చింది. అమ్మ నామ శక్తి అపరిమితమైనది. అమ్మ కన్నా అమ్మ

నామం గొప్పది అని అనగలిగిన మహాభక్తుడు, ధీశాలి. లోకమంతా అమ్మ పాదాల దగ్గరకు రావాలని పరితపించే వాడు. పార్లమెంటు సభ్యుడై పార్లమెంటులో అమ్మను గూర్చి చరిత్రాత్మక ఉపన్యాసం ఇవ్వాలని ఉబలాట పడేవాడు. పుట్టుకతో అంధుడైనా మన కన్నులు తెరవాలని ప్రయత్నించేవాడు. "ఆంజనేయులుగారూ! నాతో రండి అనసూయా వ్రతాలు చేయిస్తూ, అమ్మ నామ సంకీర్తన చేస్తూ దేశమంతా తిరుగుదాం." అనేవాడు నాతో, కొన్ని చోట్లకు అలాగా లాక్కెళ్ళాడు కూడా నన్ను. అయితే రాధాకృష్ణారెడ్డి అమ్మను అంత తేలిగ్గా నమ్మలేదు. చేయవలసిన పరీక్షలన్నీ చేసిన తర్వాతే అమ్మ పరమాత్మ అనే విశ్వాసాన్ని కుదుర్చుకున్నాడు. అతడు అమ్మ దగ్గరకు రావటమే ఒక విచిత్రం.

గుంటూరు జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతికి దగ్గరలో మునగోడు శివారు గ్రామమైన తురగావారి పాలెంలో పుట్టంధుడుగా జన్మించాడు. పదేండ్లు వచ్చీరాకముందే ఇంట్లోనే స్వయంగా సంగీతం ప్రారంభించాడు. తన జన్మ స్థలానికి దగ్గరలో ఉన్న కోసూరులో కంచి వెంకటదాసుగారి వద్ద సంగీత విద్య శాస్త్రీయంగా ప్రారంభించి, గుంటూరులో సాగి వెంకటేశ్వరరావుగారి వద్ద శిక్షణ పొంది, తెనాలిలోని ఉప్పలపాటి లక్ష్మీనారాయణగారి వద్ద మెళకువలు నేర్చుకొని, సంగీతానికి వన్నె పెట్టుకోవాలని విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో 1952 నుండి 1962 దాకా కఠోర పరిశ్రమ చేసి డొక్కా శ్రీరామమూర్తిగారి వద్ద సుశిక్షితుడై అక్కడ అధ్యాపక వర్గానికంతకూ ప్రీతి పాత్రుడైనాడు. అతడు ఏక సంథాగ్రాహి కావటంతో గురువులు కూడా అతనిలోని ప్రజ్ఞను మెచ్చుకొనేవారు. ప్రతి సంవత్సరం గణపతి నవరాత్రులకు విజయనగరం ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో తను ఆ కళాశాలలో విద్య నభ్యసించి నందుకు చిహ్నంగా గురుదక్షిణగా తప్పక సంగీత కచేరీ చేసి వచ్చేవాడు. ఆ కళాశాల ప్రాచార్యుడుగా ఉన్న ద్వారం దుర్గా ప్రసాదరావు రాధను గూర్చి చెపుతూ "రాధాకృష్ణరెడ్డి సంగీతం వల్ల కేవలం భౌతిక శ్రవణేంద్రియానందమే కాదు, అంతరాత్మకు ఆనందం కలిగించి వినే వారిని పరమాత్మ సన్నిధిలో నిలిపేది. అటువంటి సంగీతం నేను తృప్తిగా వినగలిగిన భాగ్యం కలిగింది. ప్రణవ సాధన చేసి అమ్మ సన్నిధి పొందారు. ఆర్తి, భక్తి, ప్రణవసాధనలతో పండిన సంగీతం కంటే పరమాత్మను చేరుకోవటానికి దగ్గరి మార్గం వేరొకటి లేదని నిరూపించిన సంగీత యోగి" అని ప్రశంసించారు.

గాత్ర సంగీతంలోనూ, వాయులీన విద్యలోనూ ఆరితేరిన నాదబిందు శరీరుడు రాధ. త్యాగరాజస్వామి వారి సమాధి వద్ద జరిగే ఆరాధనోత్సవాలలోనూ, తంజావూరు మొదలైన పుణ్య క్షేత్రాలలోనూ సంగీతవిద్యా ప్రదర్శన లిచ్చాడు. విద్యకు పరమావధి కాసులు సంపాదించటం కాదన్న కాసులవారు భగవదర్పితం చేసి, కళకు పరమావధి భగవత్ ప్రీతియే అని నమ్మి ఆచరించి చూపించాడు. రాధ ఒకసారి "ఓం హైమ నమో హైమ శ్రీ హైమ జయ హైమ" అనే నామం సప్తాహంగా జిల్లెళ్ళమూడిలో ఆలయంలో ఉండి దీక్షగా చేస్తున్నాడు. అర్ధరాత్రి అతను చేసే సంకీర్తన అమ్మకు వినిపించింది. అందరింట్లో మేడపైన వాత్సల్యాలయంలో ఉన్న అమ్మ ఆరుబయటకు వచ్చి ఆర్తిలో అతడు చేస్తున్న నామం విని "వీడు చేసే నామానికి హైమ, ఆలయంలో నుండి లేచి వస్తుందేమోరా" అన్నది. నిజమే ఎంత జడ రూపంలో ఉన్న దేవుడైనా కరిగి నీరై ప్రవహించాల్సిందే- హైమ గుండె అసలే జాలిది. భౌతికంగా మనకు కనుపించక పోయినా రాధాకృష్ణరెడ్డి వద్దకు వచ్చే ఉంటుంది. అతని శీర్షాన్ని నిమిరి ఉంటుంది. లేకపోతే గదిలో ఉన్న అమ్మ ఒక్క ఉదుటున లేచి వచ్చిందంటేనే అందులో ఏదో రహస్యమున్నదని తెలుస్తున్నది.

పుట్టుకతో అంధుడైనా రాధాకృష్ణరెడ్డికి అంతర్నేత్రాలున్నాయనే అనిపిస్తుంది. ఒకసారి లలితాంబక్కయ్యగారి పనిపిల్లను గూర్చి మాట్లడుతూ ఆమె ముఖం ఉదయించే సూర్య బింబంలాగా ఉన్నది అన్నాడుట. వెలుగంటే ఏమిటో తెలియని వాడికి ఉదయించే సూర్యబింబం ఎట్లా ఉటుందో ఎలా తెలిసింది? అలాగే ఒకసారి సింహాచల పుణ్యక్షేత్రంలో ఉన్న జడల బాబాతో అర్ధరాత్రి మాట్లాడుతూ వారికి దాహమైతే క్రొత్త చోట అయినా రాధ లేచి నాలుగు సార్లు మంచి నీళ్ళు అందించాడట. అప్పుడు రాధ " మనం ఇంకా ఎంతకాలం ఉందాం"? అని ప్రశ్నించగా వాడి ఆజ్ఞ కావాలిగా అని పైకి చూపించారట.

రాధ సర్వతంత్ర స్వతంత్రుడు. ఎవరినీ లెక్క చేసేవాడు కాడు. అవసరమైతే దేవుడి నైనా నిలదీసి ప్రశ్నించగల ధైర్యం ఉన్నవాడు. జిల్లెళ్ళమూడి రాకముందు 1962 లో పుట్టపర్తి ప్రశాంతినిలయంలో ఉన్నాడు. అక్కడ సంగీతం పాడుతూ కాలక్షేపం చేసేవాడు. సంగీతకళాశాల ఇక్కడ పెడదాము నీవు సంగీతపు పాఠాలు చెపుతూ ఇక్కడే ఉండమన్నారు సాయిబాబా, రాధాకృష్ణరెడ్డి తమ్ముడు వెంకటేశ్వరరెడ్డి (అతడూ అంధుడే. సంగీత విద్వాంసుడే) అక్కడే ఉందా మన్నాడు. కాని

స్వతంత్రభావాలు కల రాధాకృష్ణ రెడ్డి దాని కంగీకరించలేదు. ఆ మయంలోనే పుట్టపర్తి స్వామిని చూడటానికి వెళ్ళిన వేదాంతం లక్ష్మీపతిగారు రాధాకృష్ణరెడ్డితో "పరమాత్మ సాధారణ గృహిణియై జిల్లెళ్ళమూడిలో మనల్ని ఉద్ధరించటం కోసం కంకణం కట్టుకొని అవతరించాడు. అమ్మను దర్శించు" అని ఆర్తితో చెప్పారు. అంతకు ముందు అమ్మను గూర్చి విన్నా ఆడదానిని చూడటానికి వెళ్ళారా? అని భీష్మించుకున్నా వాడిలో, ఈ మాటలతో పోనీ చూద్దాం అనే ఆలోచన బయలు దేరింది. సాయిబాబాతో జిల్లెళ్ళమూడి అమ్మను చూచి వస్తాం అని తమ్ముడు వెంకటేశ్వరరెడ్డితో బయలు దేరగా స్వామి "అమ్మ సాక్షాత్ రాజరాజేశ్వరీ అవతారమే, వెళ్ళిరండి" అని చెప్పారు.

1963 జూన్ 12న బాపట్ల వచ్చి రానూ పోనూ రిక్షా మాట్లాడుకొని జిల్లెళ్ళమూడి వచ్చారు సోదరులిద్దరూ. అమ్మ ఇప్పుడు అలంకార హైమ ఉన్న పూరింట్లో అప్పుడు ఉన్నది. అమ్మ వద్దకు చేరి "జననీ! నిను వినా దిక్కెవ్వరే!" అని పాడారు. అమ్మ తల నిమిరి కాఫీ కప్పు నోటి కందించింది తాగమని. ఆ మాతృప్రేమ వాత్సల్యానికి రాధాకృష్ణరెడ్డికి జలజల కంటి వెంట నీళ్ళు కారాయి. సామాన్యంగా ఎంత కష్టం వచ్చినా ఏడ్చే తత్వం కాదు రాధది. నా అంతటివాడు ఏడవటమా? అని ఏడుపు బిగపట్టుకుంటున్నాడు. అమ్మ తన పమిట చెంగుతో కళ్ళనీళ్ళు తుడిచి వెన్ను నిమిరి ఊరడించింది. ఊరడించేకొద్దీ ఇంకా ఎక్కువైంది ఏడుపు. తను విజయనగరంలో చదువుకొనే రోజులలో "రామ! నన్ను బ్రోవరా!" అనే కీర్తన తన శక్తియుక్తులన్నీ ధారపోసి రాముడు దిగి రావాలనే ఆర్తితో పాడాడు. కానీ రాలేదు. అప్పట్నుంచీ పరమాత్మ దర్శనం కోసం అర్రులు చాస్తున్నాడు. "ఇదుగో అమ్మ చేతిలో పడగానే పరమాత్మమ దర్శనస్పర్శలు లభించాయి ఇన్నాళ్ళకు అని ఏడుపొచ్చింది" అంటాడు ఆ తర్వాత ప్రసంగవశాన.

అమ్మను పరీక్షించటం అంతతో ఆగలేదు. విశ్వాసం స్థిరపడటానికి ఎన్నో పరీక్షలు చేసాడు. అమ్మను బీడీలు తెప్పించమనేవాడు. అమ్మ తెప్పించి ఇచ్చేది. ఒక అడ్డెడు పప్పుతో గంప గారెలు చేయించమనేవాడు. చేయించి పెట్టేది అమ్మ. ఒక గుండిగతో పరమాన్నం చేయించమనేవాడు. చేయించి పెట్టింది అమ్మ. రాక్షసుడి లాగా అన్నీ తినేవాడు. అమ్మ ప్రక్కన కూర్చొని అమ్మ తొడమీద తాళం వేస్తూ గంటల తరబడి కచేరీ చేసేవాడు. అమ్మ తొడంతా కంది పోయింది. అయినా అమ్మ ఏమీ అనేదికాదు. బిడ్డను అమ్మ గాకపోతే ఎవరు చూచుకుంటారు అనేది


పరీక్షలన్నిటికీ తట్టుకొని నిలిచిన అమ్మ 'సహనదేవత' కాకపోతే నా అల్లరి కూడా తిట్టినా కొట్టినా వాడి ఆర్తి గొప్పది అంటుంది. బాధతో, సుఖంతో చెదరని భక్తి వాడిది అంటుంది. అంటూ ఎంతో మురిసిపోయి ముద్దు చేసేది.

ఒకసారి మాయింటికి వచ్చాడు. 'భోజనం చెయ్యి రాధా!' అన్నా, ఇవ్వాళ కాదులే అని భోజనంలోకి ఏం చేశారు అన్నాడు. నా భార్య కూర, కంది పచ్చడి, చారు అన్నది. ఆ కంది పచ్చడి గిన్నె తీసుకు రామ్మా!' అని ఆకంది పచ్చడి వట్టిదే తినేశాడు మొత్తం. మీఇంట్లో భోజనం చేసినట్లే అన్నాడు. ఇదే అమ్మ ప్రసాదం అన్నాడు. కరివేపాకు కారమా, పండు మిరప్పళ్ళ కారమా, చింతకాయ పచ్చడా అన్న తారతమ్యం లేదు. ఏదైనా అమ్మ ప్రసాదం అని తింటాడు. ఆ భావనే చాలా గొప్పది. జిల్లెళ్ళమూడి తన జన్మ స్థలమని తురగాయపాలెం దత్తత వెళ్ళానని చెపుతుంటాడు.

రాధాకృష్ణరెడ్డి చాలా అదృష్టవంతుడు. ఎందుకంటే ఇప్పుడు మనందరిచే దేవతగా ఆరాధింపబడుతున్న హైమవతీ దేవి నీళ్ళు పోస్తుంటే అమ్మ పాదాలు కడిగాడు. అమ్మనామం కొన్ని వేలమంది ముస్లిములచేత చేయించాడు. అనసూయా వ్రతాలు ఊరురా చేయించాడు. అమ్మ పాదాలు పట్టింతర్వాతే దైన్యమైన జీవితం లేకుండా పరమాత్మ నా అండన ఉన్నాడు అనే ధైర్యంతో నిర్భయంగా జీవించాడు. మొరటుతనం పోయి అమ్మ పాదాలపై సమర్పించబడితే సుకుమార పుష్పమైనాడు.

రాధాకృష్ణరెడ్డికి ఒక ఆలోచన ఉండేది. జిల్లెళ్ళమూడిలో ఆయుర్వేద రీసెర్చి సెంటర్ ఒకటి పెట్టాలని. గుండె జబ్బులు, పక్షవాతము, కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల నివారణకు మందులు కనిపెట్టాలని అంటుండేవాడు. అమ్మ దయతోఎప్పటికైనా అతని కోరిక నెరవేరు తుందేమో! రాధాకృష్ణరెడ్డి పేర ఒక సంగీత కళాశాల కూడా వస్తే బావుంటుంది. అనంతమైన కాలంలో జిల్లెళ్ళమూడిలో ఇవి రావటం విశేషమేమీ కాదు.

'జీవితాంతం అమ్మ నామం చేస్తూ అమ్మలో లయం కావాలి. అంతకు మించిన కోరిక నాకింకేం లేదు' అనేవాడు. అమ్మ నామంతో సప్తాహాలు, సప్తసప్తాహాలు అవలీలగా చేసేవాడు. రాధ శరీరంలోని ప్రత్యణువూ, అమ్మ నామ రసగంగలో పునీతమైంది. ఎంత అదృష్టవంతుడో! అమ్మ హృదయంలో చోటు సంపాదించుకున్నాడు. అతడు కోరుకున్న రీతిగా 23.10.1996న లయమైనాడు అమ్మలో..... ధన్యజీవి.



24. రావూరి నరసింహమూర్తి

జిల్లెళ్ళమూడి, అమ్మ ఉనికి వల్ల ఒక విచిత్రమైన పుణ్యక్షేత్రమైంది. అమ్మ తాను అవతరిస్తూ తనకు సంబంధించిన చాలా మందిని తనతో తెచ్చుకున్నది. ఎవరు ఏ పనికి అవసరమో ఎవరిచేత ఏపని చేయించాలో వారి చేత ఆ పని చేయించింది. చేయిస్తున్నది, అందువల్ల జిల్లెళ్ళమూడిలో చర్మచక్షువులకు కనుపించే వారు కనుపించనివారు ఎందరో దేవతలు ఋషులు ఉంటుంటారు. మనలో ఉన్న మహనీయులను ఎంత మందిని మనం గుర్తించాం! మనకు తెలిసి "రహి" మనతో తిరిగాడు. గుర్తించ గలిగామా? అమ్మలోని అతిలోక మానుషత్వాన్నే అంగీకరించని వారున్నారు. సరే దానికేమి? శ్రీ కృష్ణుని కాలంలో కృష్ణుడిని గారడి వాడు అన్నాడు దుర్యోధనుడు. ఎప్పుడూ ఉంటుంటారు మంచివాళ్లు, చెడ్డవాళ్ళు - అమ్మ మంచి, చెడ్డా 'వాడి'వే అన్నది కనుక రెండూ సమానమే ఆమెకు. అందరికీ సుగతిని ప్రసాదించగల అపూర్వ అద్భుత మాతృత్వం మహనీయత్వం అమ్మదే. మహనీయులైన ఋషితుల్యు లెందరో అమ్మను సేవించుకున్న వారున్నారు. వారిలో అగ్రశ్రేణికి చెందినవారు రావూరి లక్ష్మీనరసింహంగారు. అమ్మ మాత్రం ఆయనను నరసింహమూర్తి అని పిలిచేది.

నరసింహమూర్తిగారిది జిల్లెళ్ళమూడికి ఏడు మైళ్ళదూరంలో ఉన్న చెరుకూరు గ్రామం. 1960లో అమ్మను చూచారు. జిల్లెళ్ళమూడికి నడచివచ్చేవారు. మొదటిసారి వారు జిల్లెళ్ళమూడి వచ్చినప్పుడు అన్నపూర్ణాలయంలో చింతకాయ పచ్చడి రోకళ్ళతో దంచుతున్నారు. ఆయన అమ్మ వద్దకు కూడా పోకుండా, ఆ చింతకాయపచ్చడి దంచటంలో పాలు పంచుకున్నాడు. తరచు జిల్లెళ్ళమూడి

వచ్చి అమ్మ వాత్సల్యాన్ని పొందటమేకాక అందరింటిలో జరిగే సేవా కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొనేవారు. తన తల్లిదండ్రులకు ఒకడే కుమారుడు, గారాబంగా పెరిగాడు. ఐనా జిల్లెళ్ళమూడిలో అందరింటి పునాదులు తీయటంలో, ఇటుకలు తయారుచేయడంలో, ఇటుకలు కాల్చడానికి, ఊకతోలడంలో, ఇటుకలు కాల్చటంలో, పొలంపనులు చేయడంలో, అమ్మ స్నానానికి కావళ్ళతో నీళ్ళు మోయడంలో ఆయన ముందుండి చేసేవాడు, చేయించేవాడు. తన ఇంట్లో ఒక పని కూడ చేసి ఎరుగడు. కాని జిల్లెళ్ళమూడిలో ఒళ్ళువంచి తన పనిగానే కాదు భగవత్కార్యంగా భక్తి ప్రపత్తులతో చేసేవాడు.

ఒకసారి అమ్మను, 108 బిందెలతో అభిషేకం చేసుకుంటానమ్మా! అని అర్థించాడు. అమ్మ సరే నన్నది. అభిషేకం మొదలైంది. ఆయన ఒక్కడే కాదు ఆవరణలో వాళ్ళు ఊళ్ళో వాళ్ళు కూడా వచ్చి అమ్మకు అభిషేకం చేసుకోవటం మొదలెట్టారు. అమ్మ సమాధి స్థితిలోకి వెళ్ళింది. అంతసేపు అభిషేకాలు చేస్తుంటే నాన్నగారికి కోపం వచ్చి మందలించారు. తర్వాత అమ్మ తనే చేసుకోమన్నానని చెప్పింది. నాన్నగారూ శాంతించారు.

1968లో మాతృశ్రీ మాసపత్రిక నడపటానికి 'మాతృశ్రీ ప్రింటర్స్' పేర ఒక ప్రెస్‌ను మాతృశ్రీ పబ్లికేషన్స్ ట్రస్టు అధీనంలో పెట్టటం జరిగింది. ఆ ప్రెస్‌లో మన వాళ్ళు కంపోజింగ్, ప్రింటింగ్ నేర్చుకుంటే మంచిదని అమ్మ నరసింహమూర్తిగారిని కూడా పంపింది. వారి కుటుంబంలో వారి కుమారుడు రావూరి ప్రసాద్, కుమార్తె రమాదేవి కూడా అమ్మ సేవగా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసింహమూర్తిగారు నాలుగు సంవత్సరాలు ఆ బాధ్యతను నిర్వహించి అమ్మ నామ సంకీర్తనలో తన జీవితాన్ని పునీతం చేసుకోవాలని భావించారు. అమ్మ సరేనన్నది. బాపట్ల ప్రెస్‌పని చేస్తున్నవారు జిల్లెళ్ళమూడి వచ్చి అఖండ నామ సంకీర్తనలో పాల్గొన్నారు. శ్రమజీవి- వినయశీలి- సహన స్వభావుడు అయిన నరసింహమూర్తిగారు నామయజ్ఞంలో ఒక తపస్విగా, ఋషిగా పాల్గొనేవాడు. ఎవరు నామ సంకీర్తనలో పాల్గొన్నా లేకపోయినా ఆయన తన అదృష్టంగా భావించి ఆరాధించే వారు, ఎవరు ఏ పని చెప్పినా కాదనే వారు కాదు. అజాత శత్రువుగా ఉండేవారు. ఎంతో నీరాడంబరంగా జీవించేవాడు. తన వస్త్రధారణ ఎట్లా ఉన్నది అని కూడా పట్టించుకోనేవాడు కాదు.

అందరింటి యువకులు మాతృశ్రీ క్రీడా సాంస్కృతిక సంస్థను స్థాపించి ఆ సంస్థ ద్వారా పక్వమైన క్రీడలు, నాటకాలు ఏర్పాటు చేస్తే, మంచి శ్రుతి,

కంఠంగల నరసింహమూర్తిగారు నాటకాలలో స్వాములవారుగా పాల్గొని ఆధ్యాత్మిక కీర్తనలు మధురంగా ఆలాపన చేయటం నేను కూడా విన్నాను. పౌరాణిక నాటకాలలో హరినాగభూషణం గారితో. విద్యాసాగర శర్మగారితో కలసి ఎన్నో ప్రదర్శనలిచ్చారు. తోటి వారిపట్ల ఎంతో ప్రేమతో దయార్ద్ర హృదయుడై సాయం చేస్తుండేవారు.

అమ్మను 'పరమాత్మా'! అని పిలచేవారు, నామయజ్ఞంలో రోజుకు 18,20 గంటలు పాల్గొన్నరోజులు కూడా ఉన్నవి. సంధ్యా వందనంలో పాల్గొనే వారు. అమ్మ నామం ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో నిలచి పోయింది. ఆయన సేవా తత్పరతకు నిరాడంబరతకు శ్రమైక జీవనానికి నిదర్శనంగా ఆయన మురుగుకాలువలు కడుగుతుంటే, పరిశుభ్రం చేస్తుంటే చూచాము చాలమందిమి. ఎవరిని పల్లెత్తుమాట అనగా చూడలేదు. శాంతంగా చిరునవ్వుతో పలుకరించేవారు. ఒకసాధు పుంగవునిగా, నామయోగిగా కాలం వెళ్ళబుచ్చాడు. ఒక తపస్విగా ఋషిగా జీవనం సాగించాడు. అమ్మ అంటే అకుంఠిత విశ్వాసం.

ఇంకా రెండు మూడు రోజులలో చనిపోతాడనగా అమ్మ వద్దకు చేరి ఏకాంతంగా అమ్మతో "ఇన్నాళ్ళూ పిల్లలు చిన్నవాళ్ళు, వాళ్ళకోసం ఉండాలనిపించేది. సర్వ సృష్టిని పాలించే అమ్మవు నీవుండగా నేను చేసేదేముంది నన్ను నీలో కలుపుకో తల్లీ" అని అర్థించాడు. అమ్మ "ఏ సంవత్సరం వచ్చా విక్కడకు?" అని అడిగింది. "1960 లో వచ్చానమ్మా" అన్నాడు "అలాగే నాన్నా!" అని దగ్గరకు తీసుకుంది.

కృష్ణాష్టమి పూజలు జరుగుతున్నాయి. ఆ పూజలలో ఒక గోపాలునిగా పాల్గొనటం ఆయనకు ఇష్టం. 12.8.1974న కృష్ణాష్టమి, ఆ పూజలలో అమ్మ వద్దకు ఎవరినీ వెళ్ళనీయలేదు. అమ్మను తాకనీయ లేదు. నరసింహమూర్తిగారు మాత్రం ఎవరినీ లెక్కచేయకుండా వెళ్ళి అమ్మ పాదాలపైబడి నమస్కరించి ఇవతలకు వచ్చారు. ఆ రాత్రే హైమాలయం వద్ద అఖండ నామయజ్ఞంలో పాల్గొన్నారు. నామం చేస్తూ రాత్రి 1గంటకు అమ్మలో ఐక్యమైనారు. జీవితంలో కష్టాలు పడలేదనికాదు. కష్టాలను భరించే శక్తి, కష్టాలు కూడా భగవంతుడిచ్చినవే అని భావించే శక్తి అమ్మ ఆయనకు ప్రసాదించింది.

తన ధ్యేయమేదో తనకు తెలిసింది. ఆ ధ్యేయానికి చేరే మార్గం తెలిసింది. ఆ మార్గంలో నిరంతర నామయోగిగా తపస్విగా తన సర్వస్వాన్నీ అమ్మ పాదాలపై అర్పించిన పుణ్యజీవి- ధన్యజీవి శ్రీ రావూరి నరసింహమూర్తిగారు.



25. కోన వెంకట సుబ్బారావు

కోన సుబ్బారావుగారు, బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు (జిల్లెళ్ళమూడి నాన్నగారు) బాల్య స్నేహితులు. బాపట్లలో ఉన్న రోజులలో కలిసి నాటకాలు వేసేవాళ్ళు. 1957లో నాగులు (నాన్నగారు) భార్య ఏదో ఆధ్యాత్మిక స్థితిలో ఉన్నదిట అని ఎవరెవరో చెప్పుకుంటుంటే ఆ నోటా ఈ నోటా బడి చీరాలలో ఉన్న సుబ్బారావుగారి చెవిదాకా వచ్చినది. అంతేకాదు రంగన్న బాబుగారని రామసాక్షాత్కారం పొందిన మహనీయుడు చీరాలలో ఉండేవాడు. ఆయన అమ్మను గూర్చి రాముడే అమ్మగా అవతరించిందనీ, సీతమ్మ తల్లే ఈ జిల్లెళ్ళమూడి అమ్మనీ, వాళ్ళకూ అమ్మకూ తేడా లేదనీ, అమ్మ వడ్డిస్తుంటే అన్నం అక్షయ మవుతుందని చెప్పగా విన్నారు. తరువాత జిల్లెళ్ళమూడి ప్రతివారం వెళ్ళి వచ్చే రాజుపాలెం రామచంద్రరావుగారు, శ్రీహర్షరావుగారు, నోరి వెంకటేశ్వర్లుగారు, డాక్టర్ పొట్లూరి సుబ్బారావుగారు వంటి వారి ద్వారా కూడా అమ్మను గూర్చి విన్నారు.

ఒక సెలవ రోజు జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను చూచి వద్దాం అనుకున్నారు. ఇంతలో సుబ్బారావుగారికి పెద్ద జబ్బు చేసింది. చీరాల డాక్టర్ సుబ్బారావుగారి వైద్యం. ఆయన ఆయుర్వేద వైద్యుడు కావటంతో విపరీతమైన పథ్యాలలో నోరు చవి చచ్చి పోయింది. కోనా వారికా జిహ్వాచాపల్యం, నోరు కట్టుకోలేరు. రోగం ముదిరి బ్రతుకుతారా లేదా అనే అనుమానం వచ్చేటంతగా వికటించింది. చీరాల

నుండి వచ్చినవారు కోనా వారి అనారోగ్యం గూర్చి చెబితే అమ్మ ప్రసాదం పంపించింది. బాధ పడుతున్న సుబ్బారావుగారి భార్య వెంకాయమ్మగారికి కలలో కనిపించి "వాడి ప్రాణానికేం భయం లేదు. వాడికి కావలసింది చేసిపెట్టు. నేనున్నాను" అని అభయ మిచ్చింది. ఆనాటి నుండి సుబ్బారావుగారు కోలుకోవటం ప్రారంభించారు. కాస్త ఓపిక రాగానే జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ ఒడిలో వ్రాలిపోయారు. అమ్మ ఆదరణ, ఆప్యాయతలకు ఆయన పరవశించి పోయారు.

1958 ఫిబ్రవరి 3న మాఘాపూర్ణిమ వచ్చింది. అది ఒక చారిత్రక సన్నివేశం జిల్లెళ్ళమూడిలో, కొన్ని వందల మందికి అమ్మమంత్రోపదేశం చేసిన రోజది. కాలం స్తంభించి పోయిన రోజది. అతి కొద్ది సమయంలో అమ్మ అన్ని వందల మందికి ఎలా ఉపదేశం చేసిందా అని ఆశ్చర్య, పోయారంతా, ఆ పండుగకు రెండు రోజులు ముందే కుటుంబంతో సహా రమ్మని అమ్మ సుబ్బారావుగారికి చెప్పటంతో ఆయన ఫిబ్రవరి ఒకటవ తారీకునే జిల్లెళ్ళమూడికి చేరారు. అలా వచ్చిన తొలిరోజులలోనే అమ్మ వల్ల మంత్రోపదేశం పొందారు.

1962లో అమ్మ, చీరాల, ఓడరేవులలో చాలకాలం ఉన్నది. అప్పుడు సుబ్బారావుగారి భార్య వెంకాయమ్మగారు ఎన్నో నోములు నోచుకొంటూ ఉద్యాపనలకు అమ్మకే వాయినాలిచ్చి తీర్చుకున్నది. చివరలో జిల్లెళ్ళమూడి తిరిగి వచ్చే సమయంలో, అప్పటిదాకా తనకు రెండు నెలలుగా సేవచేస్తున్న వసుంధర వాళ్ళ ఇంటికి వెళ్ళింది. సుబ్బారావుగారితో "వసుంధరను నాతో జిల్లెళ్ళమూడి తీసుకు వెళ్ళుతున్నాను. అక్కడే ఉంటుంది. దీన్ని గూర్చి ఆలోచించవద్దు. దాని బాధ్యతనాది అని చెప్పి ఆనాటి నుండి వసుంధర సర్వ బాధ్యతలు తానే వహించింది. 1966మేలో వివాహం చేసుకున్నది. ఒక స్త్రీ మరొక స్త్రీని వివాహ, చేసుకోవటం విచిత్రంగా చెప్పుకున్నారా రోజుల్లో తల్లిదండ్రులైన కోనా సుబ్బారావు గారికిగాని, వెంకాయమ్మ గారికిగానీ వివాహం జరిగినపుడు తెలియదు. తెలిసిన తర్వాత విచారించలేదు సరికదా, జగదీశ్వరితో వివాహం జరిగినందుకు సంతోషించి కూతురుకు అల్లుడికి చేయవలసిన సంప్రదాయ కార్యక్రమాలన్నీ నిర్వహించారు.

1967లో వెంకాయమ్మగారికి అనారోగ్యం చేసింది. అమ్మ వాళ్ళ పెద్దకుమారుడు సత్యానికి జిల్లెళ్ళమూడిలోనే వడుగు చేయించింది. తన అంత్యకాలం సమీపిస్తునినదని ఎఱిగిన వెంకాయమ్మగారు తన శేషజీవితాన్ని అమ్మ వద్దనే గడపాలకున్నది. అమ్మ అంగీకరించింది. సుబ్బారావుగారొక్కరే చీరాలలో ఉద్యోగం చేస్తూ జిల్లెళ్ళమూడి వచ్చి పోతూ ఉండేవారు.

వెంకాయమ్మగారికి జలోదరం జబ్బు ముదిరి పోయింది. అవసాన కాలం సమీపించింది. ఆ బాధ భరించలేక తనలో కలుపుకోమని అమ్మను వేడుకున్నది. ఆమె లేవలేని స్థితిలో ఉండగా ఆవు నేతితో దీపారాధన చేయాలనే ఆమె కోరికను భర్త సుబ్బారావుగారి సాయంతో చేయించింది అమ్మ. 1967 డిసెంబరు 31న రాత్రి ఆమెకు ముక్తి ప్రసాదించదలచి అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేయమన్నది. ప్రాణం పోలేదు కదమ్మా! అప్పుడే ఏర్పాట్లు ఏంటి? అంటే, "ఇంకెంత సేపు తేదీ మారటం కోసమేగా ఉన్నది" అన్నది. సుబ్బారావుగారితో ఇంకా నీ బార్య ఉండాలని ఉన్నదా? అని అడిగింది "ఉంచేట్లయితే ఆరోగ్యంగా ఉంచమ్మా! ఇలా బాధపడుతూ కాదు" అన్నారాయన. అర్ధరాత్రి 12దాటింది. తేదీ మారింది. చీరాల డాక్టరుగారు, కొమ్మూరు డాక్టరుగారు ఇద్దరూ వచ్చి "అమ్మా! వెంకాయమ్మగారు చనిపోయింద"ని చెప్పారు. అమ్మ వెంకాయమ్మగారి వద్దకు వచ్చి "అప్పుడే ఎక్కడ పోయింది?" అని ఆమె చెవి దగ్గర నోరు పెట్టి "నన్ను గుర్తు పట్టావా?" అన్నది. ఆమె కళ్ళుతెరిచి కళ్ళతోనే గుర్తుపెట్టినట్లు చెప్పింది. "ఇంక చాల్లే కళ్ళు ముయ్యి" అని తలనిమిరింది. అంతే శాశ్వతంగా కళ్ళు మూసింది. ప్రాణంపై అమ్మకున్న అధికారాన్ని జనవరి 1వ తేదీ కోసం అమ్మ వద్దకు వచ్చిన అందరూ ప్రత్యక్షంగా చూశారు. అమ్మ స్వయంగా శ్మశానికి వెళ్ళి దహన సంస్కారపు అంత్యక్రియలన్నీ చేసింది, చేయించింది.

సుబ్బారావుగారు పదవీ విరమణ చేసిన తర్వాత జిల్లెళ్ళమూడినే స్థిరనివాసం చేసుకున్నారు. మాతృశ్రీ పబ్లికేషన్స్‌లో పనిచేస్తూ అమ్మ సేవలో కాలం గడిపేవారు. ఆయన మంచి కవి. చెయ్యి దిరిగిన కవి. అమ్మను గూర్చి మూడు వందల పద్యాలు వ్రాశారు. ఆయన చదువుతుంటే అమ్మ ఆనందంగా వినేవారు.

చందన శీతలములు మక
రంద స్వాదువులు సుమ పరాగాంచితముల్
చందురు వెన్నెల లమృతపు
విందులు మా అమ్మ హాసవీక్షణ సూక్తుల్

అమ్మ దరహాసాన్నీ చూపులను ఆయన వర్ణించిన తీరు చూస్తే ఆయన అనుభూతి ఆనందము వ్యక్తమౌతుంది. లక్ష్మీదేవికిస్థానమై, మండుటెండన పడి వచ్చిన ఆశ్రితులకు దప్పిక తీర్చే తీయని చెరుకు రసమై,విశ్వమంతా విశ్వసించే విశ్వాసరూపమై, సంసారమనే కారు చీకటిని హరించునదై, శరత్కాలంలోని పూర్ణచంద్రబింబమైన అమ్మ పాదపద్మాలు తనకు ఉపాస్యాలని ఆయన భావించారు.

అమ్మ ఒక ప్రేమ ఫలం. తిన్నకొద్దీ తియ్యగా ఉంటుంది, వెగటువేయక ఇంకా ఇంకా తినాలనిపిస్తుంది. ఆ పండుతింటే మృత్యువును జయించవచ్చు, శాశ్వతమైన ఆనందాన్ని పొందవచ్చు. ఆలసించకుండా వచ్చి తినడంని లోకానికి తన అనుభూతిని అందంగా కవిత్వంలో వివరించారు.

దాచిన ధనమయి, దొంగలు
దోచనిదయి వైరివర్గ దుర్గమమయి, శి
ష్టాచారాతీతంబయి,
వాచవులూరించు మాతృ వాత్సల్య మహో అంటారు

అమ్మ వాత్సల్యాన్ని గూర్చి. ఆయన ఎంతగా అమ్మలో మమేకమైనారంటే

అమ్మ నిలయమె మాకు దేవాలయమ్ము
అమ్మ పూజయె మాకు ముదావహమ్ము
అమ్మ నీరాజనమె మాకు, ఆత్మదీప్తి
అమ్మ తేజంబె ఆ పరాత్మానుభూతి.

వారికి అమ్మ ఎక్కడుంటే అది దేవాలయం. అమ్మ పూజ ఆయనకు సంతోషాన్నిస్తుంది. అమ్మ నీరాజనం ఆయనకు ఆత్మదీప్తి కలిగిస్తుంది. అమ్మ తేజస్సులో తేజమై అపరోక్షానుభూతిని, ఆ పరాత్మానుభూతిని పొందాడు.

ఆయన వ్రాసిన "పాములబుడే" అనే ఖండికను చూచిన సుప్రసిద్ధ కవి వర్యులు శ్రీ ప్రసాదరాయ కులపతులు ఎంతో ఆనందించి వారి రచనలు గ్రంథంగా తెమ్మని చెప్పారు. శ్రీ మద్రామాయణాన్ని మొత్తాన్నీ కందపద్యాలతో వ్రాశారు. ఆయన రచనలకు పరవశించే శ్రోతను నేను.

వారి ఆదరణ, ఆప్యాయత ఇతరులకు భోజనం పెట్టడంలో ఆయన అనుభవించే తృప్తికి నేను ప్రత్యక్ష సాక్షిని. శ్రీ సుబ్బారావుగారి పిల్లలు వసుంధర, సత్యం, సేవ చేసినవారే. వసుంధర అమ్మకు అర్ధాంగిగా సేవ చేస్తే, సత్యం అమ్మ ప్రేరేపించే హోమియో వైద్య విద్య చదివి అమ్మకు, జిల్లెళ్ళమూడి గ్రామవాసులకు, జిల్లెళ్ళమూడి వచ్చే సోదరీ సోదరులకు వైద్య సేవలందించాడు. వెంకటేశ్వరరావు న్యాయవాదియై అమ్మ సంస్థ అభివృద్ధికి పాటుబడ్డాడు. అమ్మ కుమారి పసిపిల్లగా జిల్లెళ్ళమూడి వచ్చి అక్కడే అమ్మ ఆరాధకునే వివాహం చేసుకున్నది. అమ్మ, నాన్నగారూ తామే పీటలమీద కూర్చొని సత్యం వివాహం చేశారు. అమ్మ అనుగ్రహ వర్షంలో సుబ్బారావుగారి కుటుంబం యావత్తూ తడిసిపోయింది. అమ్మ సేవ

ఇతరులకు ఆదర్శవంతమైంది. సుబ్బారావుగారు తాము ధన్యులమగుటయేకాక కుటుంబాన్ని మొత్తాన్నీ అదృష్టవంతులను చేశారు.


సత్యం పెళ్ళిసందర్భంగా సుబ్బారావుగారి మీద నేను వ్రాసిన పద్యాలు వారి పట్ల నాకున్న గౌరవానికి, అభిమానానికి, అభిప్రాయాలకు నిదర్శనాలు.

ఏనాడున్ చెయిజాప దెవ్వరిని యేయేరీతులందున్న తా
జానేదేవని లెక్కచేయ దెదిరించన్ దూకు లోకమ్ముపై
ఈనాడో తన ముద్దు మన్మలకు చేయిన్ జాపనుంకించె మా
కోనా వెంకటసుబ్బరావు కొడుకున్ కోడల్ ప్రహర్షింపగన్

ఏనాడో తన సర్వ బాధ్యతలు హోయిన్ నిల్పెలే అమ్మపై
తానా సేవలు చేసె నిష్ఠమెయి సంస్థా కార్యనిర్మగ్నుడై
సానం బెట్టిన వజ్రమాతడొాక ఈషన్మాత్రముం జంక డీ
కోనా వెంకట సుబ్బరాయ గుణివౌ కోర్కెల్ పిసాళించుతన్

ఆతని పిచ్చి ప్రేమకొాక అర్థములే దెవరెంత చెప్పినన్
చేతికి అడ్డులే దతని చేతము మెత్తన సాహితీ పథ
మ్మూతగ కాలమున్ గడుపు నున్నది నల్వురు మెచ్చపెట్టిసం
ప్రీతిని తృప్తిగాంచగల వింత మనస్వికులమ్ము వృద్ధియౌ.

అనారోగ్యంతో బాధపడుతూ తన అవసానకాలం సమీపిస్తున్నదని తెలుసుకున్న సుబ్బారావుగారు కదలలేని స్థితిలో అమ్మను చూడాలనే తపనతో అమ్మ నివసించే మేడమీదకు పోలేక అమ్మను క్రిందకు పిలుచుకొని రమ్మని కబురు చేశారు. అమ్మ ఆయననే తన వాత్సల్యాలయానికి తెమ్మని చెప్పింది. సోదరులు కుర్చీలో కూర్చోబెట్టి అమ్మ వద్దకు తీసుకొని వెళ్ళారు. ఆయన అమ్మను కౌగిలించుకొని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. అమ్మకూడా కళ్ళనీళ్ళు పెట్టుకొన్నది. "ఇతరులలోని మంచి తనమే నన్నేడిపిస్తుంది" అన్న అమ్మ మాట ఎంత నిజమో! ప్రత్యక్షంగా కనిపించింది. సుబ్బారావుగారు ఆ మేడమీదనే అమ్మను దర్శించిన, స్పర్శించిన కొన్ని గంటలలోనే అమ్మలో లీనమైనారు. ఆ మేడమీద అమ్మ సన్నిధిలో చివరి శ్వాస విడిచే భాగ్యం దక్కింది సుబ్బారావుగారి కొక్కరికే. అమ్మ దర్శనం స్పర్శనంతోపాటు తృప్తినీ, ముక్తినీ ప్రసాదించింది. ఎంతటి అదృష్టం. అదృష్టం కూడా సుబ్బారావుగారి విషయంలో దృష్టమైంది. నిజంగా ఆయన ధన్యుడు.



26. జొన్నాభట్ల వెంకట్రామయ్య

ఊర్ధ్వమూల మధఃశాఖం అశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।
ఛందాంసి యస్యవర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ - భగవద్గీత

సమస్త సృష్టికి మూలమైన వేళ్ళు పైన ఎక్కడో ఉన్నాయి. పైనుండి క్రిందకు దిగి వస్తున్నది రావి చెట్టు. అంటే వేళ్ళు పైన కొమ్మలు క్రింద ఉన్నవి. ఇది విచిత్రమైన రహస్యం సృష్టి దివ్యలోకాల నుండి మొదలైంది అని అర్థం. అఖండ సచ్చిదానంద చైతన్యమూర్తియైన అమ్మలో నుండి వచ్చిన అమృత పుత్రులం మనం.

"అశ్వత్థమేనం సువిరూఢమూలం అసంగశ్రస్త్రేన దృఢేనఛిత్వా" ఈ సువిరూఢ మూలమైన, బాగావేళ్ళు పాతుకుపోయిన మనలోని కామక్రోధాలను దేనియందు వ్యామోహం పెట్టుకోకుండా అసంగమన శస్త్రంతో ఛేదించాలి. పరమేశ్వరి దివ్యచింతనలో ఉండాలి. అంటే అన్నీ (కష్టం- సుఖం) అమ్మ ఇచ్చినవే అనే భావం పండాలి.

ఇదిగో అలా పండించుకున్న వ్యక్తులలో శ్రీ జొన్నాభట్ల వెంకట్రామయ్యగారొకరు. 1961 నుండి అమ్మ వద్దకు వస్తున్న కుటుంబాలలో జొన్నాభట్లవారిది కూడా ఒకటి. సనాతన సంప్రదాయ కుటుంబం. ఆచార వ్యవహారాలలో నిప్పులు

కదుక్కునే కుటుంబం. వెంకట్రామయ్యగారి తండ్రి వీరభద్రశాస్త్రిగారు తర్కవేదాంత శాస్త్రాలలో దిట్ట. తాతారాయడు శాస్త్రిగారి శిష్యులు పీఠాధిపతులచే గౌరవింపబడే పండితుడు. వెంకట్రామయ్యగారు గుంటూరులో ఉపాధ్యాయుడు.

అమ్మ ప్రథమ పుత్రుడు బ్రహ్మాండం సుబ్బారావు వారు పని చేసిన పాఠశాలలోనే కొంత కాలం పని చేయడం వల్ల నెమ్మదిగా అతనితో పరిచయమై తద్వారా అమ్మ వద్దకు పోతుండేవారు. అమ్మవద్ద వర్ణ సంకరమనీ, ఏక పంక్తి భోజనాలని వారి తండ్రిగారికి కోపం. తర్వాత తర్వాత వారి సహాధ్యాయి జమ్ములమడక మాధవరామశర్మ మిత్రులు రాయప్రోలు భద్రాద్రిరామ శాస్త్రి, డాక్టర్ ప్రసాదరాయ కులపతి, మిన్నికంటి గురునాధశర్మ వంటి పండితులు అమ్మను గూర్చి గొప్పగా చెప్పటం. విని తానుకూడా అమ్మను దర్శిద్దామనుకొన్నారు. కాని ఆ కోరిక తీరకుండానే పోయారు.

వెంకట్రామయ్యగారి ఆర్థికస్థితి అంతంతమాత్రమే అయినా జిల్లెళ్ళమూడి నుండి గుంటూరు ఎవరు వచ్చినా వారింట్లోనే భోజన భాజనాదులు జరిగేవి. అమ్మ వారింటిని రెండవ జిల్లెళ్ళమూడి అనేది. వారి భార్య సీతారామమ్మక్కయ్య అంటే ఆదరణకు ఆప్యాయతలకు మారు పేరు. సింగుపాలెం అంటే అమ్మ దృష్టిలో వ్రేపల్లె. ఆ ఊరి ప్రత్యేకత ఆ ఊరిదే. ఆ ఊరికి చెందిన రావినూతల రామమూర్తిగారు ఒక ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడు, ఆయన తన రెండవ కుమారుడు పదవ తరగతి పాసైన రఘుని ఎక్కడ ఎలా చదివించాలా? అని యార్లగడ్డ రాఘవయ్యగారితో కలసి అమ్మ వద్దకు వచ్చి సంప్రదించారు. అమ్మ గుంటూరులో వెంకట్రామయ్యగారింట్లో ఉంచి చదివించమన్నది. అలా రఘు వారింటికి వచ్చి వారి పిల్లలలో ఒక పిల్లవాడుగా డిగ్రీ పూర్తి చేసుకొన్నాడు. అలాగే రావూరి ప్రసాద్ తమ్ముడు లక్ష్మీనారాయణ, మతుకుమల్లి (శేషుతమ్ముడు) శీను కూడా వాళ్ళింట్లో ఉండి కొంతకాలం చదువుకొన్న వాళ్ళే. అమ్మ గుంటూరు రెండుసార్లు ప్రత్యేక కార్యక్రమాలపై వచ్చింది. ఆ రెండు సార్లూ అమ్మ వెంట వచ్చిన యావన్మంది సోదరీసోదరులకు వారింట్లోనే భోజన కార్యక్రమం, అమ్మ అనంతోత్సవాలు 1985లో జరిగినవి. అప్పుడు వారింట్లోనే అన్ని ఏర్పాట్లు జరిగాయి.

లోకంలో రామకోటి వ్రాసేవాళ్ళు మనకు కనిపిస్తూనే ఉంటారు. వెంకట్రామయ్యగారు అమ్మకోటి వ్రాసేవారు. అయితే వారిది ఒక విశిష్టమైన

వినూత్నమైన పద్ధతి. అందరూ కాగితాలమీద కలంతో వ్రాస్తే వారు మాత్రం తనచూపుడు వ్రేలితో తన బొటనవ్రేలిమీద వ్రాస్తూండేవారు ఎప్పుడూ. అమ్మ నామము మనసులో ఉచ్చరిస్తూ బొటనవ్రేలిపై వ్రాస్తూ నిరంతరం ఆ ధ్యాసలోనే ఉండేవారు. త్యాగరాజు చాల కోట్ల రామనామం చేశాడంటారు. వెంకట్రామయ్యగారు ఎన్నికోట్లు వ్రాశారో ఆయనకు తెలియదు. అమ్మకే తెలియాలి. ప్రతి సంవత్సరం వారింట్లో అమ్మ నామం ఏకాహం జరిపేవారు.

సీతారామమ్మక్కయ్యకు తమ్ముళ్ళు లేరు. సుబ్బారావును, రవిని తన తోబుట్టువులుగా చూచుకొనేది. వాళ్ళు కూడా ఆ కుటుంబంతో ఆ రకమైన అనుబంధాన్ని పెంచుకొన్నారు. వాళ్ళలో ఎవరు వచ్చినా వెంకట్రామయ్యగారు భార్యతో “ఏమమ్మోవ్! మీ తమ్ముడొచ్చాడు చూడు” అంటుండేవారు. అలాగే అమ్మ కూడా రవి బాపట్లలో క్రొత్త కాపురం పెట్టేటప్పుడు జొన్నాభట్ల అక్కయ్యచేత పాలు పొంగించే ఏర్పాటు చేసింది.

1977లో అమ్మ వెంకట్రామయ్యగారంటికి వచ్చి మూడు రోజులుంది. వెంకట్రామయ్యగారు సాక్షాత్తు గాయత్రీమాత ఐన అమ్మ పాదాలకు రోజు అర్ఘ్యప్రదానం చేసి అమ్మ చేతుల మీదుగా తీర్థం తీసికొనే మహద్భాగ్యాన్ని పొందాడు.

1966-67 లలో హైమ గుంటూరు వచ్చినప్పుడు జొన్నాభట్ల వారు కూడా హైమను వారింటికి తీసుకొని వెళ్ళి నూతన వస్త్రాలు పెట్టి పూజించుకోవటం అరుదైన అదృష్టం.

ఒకరోజు ఇంట్లో నుండి ఉదయం బయటకు పోతున్నారు. వెంకట్రామయ్యా పిల్లడికి పాలడబ్బా అయిపోయింది. తెమ్మని సీతారావమ్మక్కయ్య చెప్పింది. ఆయన ఆ విషయం మరచిపోయి జిల్లెళ్ళమూడి వెళ్ళారు. సాయంత్రం తిరిగి గుంటూరు వస్తుండగా ప్రొద్దున అక్కయ్య చెప్పిన పాలడబ్బా సంగతి గుర్తువచ్చింది. జేబులో పావలా మాత్రమే ఉన్నది. పాలడబ్బా అయిదురూపాయలు అమ్మను తలుచుకుంటూ బస్సు దిగబోతున్నారు. ముందు సీటు క్రింద అయిదు రూపాయలు నోటు ఉన్నది. దానిని తీసి ఆ సీటు మీద ఉన్నవారిని అడుగగా మాదికాదు అన్నారు. అమ్మ ఇచ్చిన ఆ అయిదు రూపాయలతో పాలడబ్బా కొని ఇంటికి తీసుకెళ్ళారు. ఇలాంటి సంఘటనలు వారి జీవితంలో కోకొల్లలు.

వారి పెద్ద కుమారుడు వీరభద్రశాస్త్రికి 1971లో పెద్ద యాక్సిడెంట్ జరిగింది. భయపడి అమ్మ వద్దకు పరుగెత్తగా “వాడికేం కాదు నిశ్చితంగా ఉండ” మన్నది. అలాగే శాస్త్రి ఆరోగ్యవంతుడైనాడు. తర్వాత అమ్మ ఏర్పాటు చేసిన ఆలయాల కమిటీలో వీరభద్రశాస్త్రిని సభ్యునిగా చేసింది.


1978లో వెంకట్రామయ్యగారికి మూత్రపిండాల సంబంధమైన వ్యాధి వచ్చింది. అమ్మ చెప్పగా వారిని చూడటానికి వచ్చిన డాక్టర్ యస్.వి. సుబ్బారావుగారు ఒక మందు ఇచ్చారు. అది అమ్మ మహాత్మ్యమో, అమ్మను నమ్మిన డాక్టరుగారి చేతి మహాత్మ్యమో మందు వేసిన కొద్ది సేపటికే నిరంతరం ఆగక వచ్చే ఎక్కిళ్ళు ఆగిపోయాయి. కానీ మళ్ళీ 1979 డిసెంబరు చివరలో వ్యాధి తిరగ బెట్టింది. హాస్పిటల్‌లో చేర్పించారు. ఆయన మనసులో ఈ జబ్బు తగ్గదేమో అనిపించి రెండు మూడురోజులు చూచి తగ్గకపోతే అమ్మ వద్దకు తీసుకుపోండి, నాసంగతి అమ్మే చూసుకుంటుది. అన్నారు. 1980 జనవరి 8వ తేదీన వెంకట్రామయ్యగారిని చూడటానికి నాన్నగారు, డాక్టరు పాప, రాచర్ల లక్ష్మీనారాయణ వచ్చారు. వారితో అమ్మ “డాక్టర్లు తమ వల్ల కాదు అంటే వెంకట్రామయ్యగారిని జిల్లెళ్ళమూడి తీసుకురండి, వాళ్ళకు ఎవరూ పెద్ద దిక్కులేదు అనే బాధకలుగనీయకండి” అని చెప్పింది. డాక్టర్లతో మాట్లాడి వాళ్ళు నమ్మకం చెప్పలేమన్న తర్వాత గుంటూరు వచ్చిన కారులోనే వెంకట్రామయ్యగారిని జిల్లెళ్ళమూడి తీసుకొని వచ్చారు. అమ్మ పాదాలు పట్టుకొని నమస్కారం చేసి “ఎక్కడకు చేరాలో అక్కడకు చేరాను. ఈజీవితం ధన్యమైంది” అన్నారు. హైమాలయం నుండి అప్పుడే వచ్చిన నివేదన వారికి పెట్టింది అమ్మ.


మాతృశ్రీ మెడికల్ సెంటర్‌లో గది ఇచ్చి వారి చికిత్సకు ఏర్పాటు చేశారు. వారు జిల్లెళ్ళమూడి వచ్చిన మూడు రోజుల తర్వాత వారున్న చోటనే అమ్మ నామసప్తాహం ఏర్పాటు చేయబడ్డది. వారి ప్రక్కకిటికీలో ఏర్పాటు చేసిన అమ్మ ఛయాచిత్రం చూస్తూ దానిపై చేయివేసి అమ్మ నామం వింటూ ఉండేవారు వెంకట్రామయ్యగారు. రాను రాను వెంకట్రామయ్యగారికి బ్లడ్ యూరియా పెరగటంవల్ల చూపు పోయింది పూర్తిగా. బుద్ధి మందగించింది. సంక్రాంతి నాడు అమ్మ అందరికీ భోగిపండ్లుపోసి వెంకట్రామయ్యగారి వద్దకు వెళ్ళి వారికీ పండ్లు పోసింది. చూపుపోయిన వారికి అకస్మాత్తుగా అమ్మ కనిపించటంతో

అమ్మ చేయిపట్టుకొని నమస్కారం చేశారు. కానీ విశ్వరూప సందర్శనంలో ధృతరాష్ట్రునికి వలెనే మళ్ళీ మరునిముషంలో కనిపించకుండా పోయాయి కళ్ళు. విశ్వరూపి అయిన అమ్మ ఆ క్షణంలో ఆ మహాద్భాగ్యం ప్రసాదించింది ఆయనకు. చివరిగా వారు చూచింది అమ్మ దివ్యమంగళ రూపాన్నే.

పరీక్షిన్మహారాజు పది రోజులలో చనిపోతానని తెలిసిన వెంటనే శుకమహర్షి భాగవత ప్రవచన శ్రవణంతో ముక్తిని పొందే ఏర్పాటు చేసుకున్నాడు. ఇక్కడ భగవంతుడే వెంకట్రామయ్యగారికి ముక్తిని ప్రసాదించదలచాడు. వెంకట్రామయ్యగారి మనస్సులో సన్యాసం తీసుకోవాలనే కోరిక ఉన్నది. ఇంట్లో వాళ్ళకెవరికీ ఈ విషయం తెలియదు. కాని అమ్మకు తెలుసు. ఆయన చెప్పాడా? అయినా అమ్మకు తెలియనిదేముంది? వీరభద్రశాస్త్రికి తండ్రి కోరిక విషయం చెప్పి యజ్ఞోపవీతము మొలత్రాడు త్రెంపి కుడిచెవిలో 'సోహం' అని చెప్పమన్నది అమ్మ. నేను చేస్తాను సరే ఆయనకు ఈవిషయం తెలుస్తుందా అంటే తెలుస్తుంది నేను చెప్పమన్నానుగా అని అభయప్రదానం చేసింది. అంతే శాస్త్రి ఈ కార్యక్రమం నిర్వహించటం, వెంకట్రామయ్యగారు కొద్ది సేపటికే అమ్మలో ఐక్యం కావటం జరిగింది. జిల్లెళ్ళమూడిలో 11రోజులు అమ్మ నామ సప్తాహంతో పునీతుడై, సన్యాస ఆశ్రమ స్వీకారంతో అసంగుడై తరించిన ధన్యజీవి శ్రీ వెంకట్రామయ్యగారు.

అయితే లోకంలో ఎవరికి వారు వారి సాధనలో తరించాలనుకొంటారు జీవులు. ఇక్కడ అందరికీ సుగతేనని అభయప్రదానం చేసిన అమ్మ తాను తరింపజేసింది. ఎంతో అదృష్టవంతుడు ధన్యుడు శ్రీ వెంకట్రామయ్యగారు.





27. అచ్యుతుని రామకృష్ణశర్మ

శర్మగారిది స్వర్ణగ్రామం. చీరాల డాక్టరుగారు (పోట్లూరి సుబ్బారావు), జిడ్డు ప్రసాదు (భీమరాజు వెంకట సుబ్బ ప్రసాదరావు), కటిక కోటేశ్వరరావులతో కలసి చీరాల నుండి అమ్మను చూడటానికి మొదటిసారి 1957 డిసెంబరులో జిల్లెళ్ళమూడి వచ్చారు.

శ్రీ రామకృష్ణశర్మగారు సంస్కృతాంధ్రాలు బాగా అధ్యయనం చేసినవారు. కవి, పౌరాణికుడు, గురుముఖతః భాష్యత్రయశాంతి చేసినవారు. అమ్మ ఉన్న తాటియాకుల పాకలోకి తలవంచుకొని లోపలికి వెళ్ళారు. ఎవరికైనా ఇక్కడ తలవంచక తప్పదన్నట్లుగా, నమస్కారాలు చేసుకొన్న తర్వాత చీరాల డాక్టరుగారు శర్మగారిని పరిచయం చేయబోయినారు. అమ్మ 'వారు నాకు తెలుసు నాన్నా! బాపట్లలో చూచాను' అన్నది. మీరు బాపట్ల వచ్చారా? అని శర్మగారడుగగా రాలేదన్నారు. అమ్మ. రాకుండానే చూచిందన్నమాట. అంతేకాదు 13సంవత్సరాల క్రితం ఎక్కడ ఎలా చూచింది ఆ సన్నివేశాన్నంతా వర్ణించి చెప్పింది. శర్మగారు దిమ్మెరపోయినారు. కొంత సేపు గడచింతర్వాత ఏదైనా ఒక పద్యం చదువునాన్నా! అన్నారు అమ్మ. శర్మగారు పద్యం ఎత్తుకున్నారు ఒకపాదం చదివారు రెండవ పాదం జ్ఞప్తికి రావటం లేదు. పోనీ వచ్చింది ఇంకొక పద్యం చదువు నాన్నా! అన్నారు అమ్మ- అదీ అంతే - మూడు వేల పద్యాలు నోటికి వచ్చిన శర్మగారు ఒక్కపద్యం చదవలేక పోయారు. అనర్గళంగా పుస్తకాపేక్ష లేకుండా సంజయ రాయభార ఘట్టం, శ్రీకృష్ణ రాయబార ఘట్టం, పురాణం చెప్పినవారే. అయినా పద్యం సాగలేదు. శర్మగారికి సిగ్గువేసింది. అహంకారం అణగిపోయింది. అమ్మ 'ఇప్పుడొక పాటపాడు' అన్నారు. పాటపాడారు. ఆగలేదు. ఇదంతా అమ్మ చేస్తున్న పనే అని తెలియటానికి చాలా కాలం పట్టింది.

తరవాత అమ్మ ఒక స్వాముల వారిని గూర్చి చెప్పారు. ఆ ప్రసంగంలో శర్మగారు కొంచెం బిరుసుగా వారిని విమర్శించారు. అమ్మ వారు తెల్లగుడ్డలు విసర్జించి కాషాయం కట్టే త్యాగమైనా చేశారు. మనం ఆ మాత్రం కూడా చేయలేదు కదా? "తన్ను తాను విమర్శించుకోవడం వివేకం ఇతరులను విమర్శించడం అవివేకం" అన్నారు. దాంతో శర్మగారు బాధకలిగినా సంబాళించుకున్నారు. అమ్మ అన్న ఆమాట తర్వాత తర్వాత జీవితంలో వారికి ఎంతో ఉపయోగపడింది.

ఆనాడు వచ్చిన వారంతా అమ్మకు పూజ చేసుకుందామనుకున్నారు. శర్మగారు లలితా నామాలు చెప్పారు. తర్వాత శర్మగారే అమ్మను గూర్చి అష్టోత్తర శతనామాలు వ్రాసే అదృష్టాన్ని పొందారు. అమ్మ పూజలో, సమాధి స్థితిలో ఉండటం గమనించారు.

అది ధనుర్మాసం కావడంతో సాయంత్రం అమ్మ సందెగొబ్బెమ్మ పెట్టి అందరి చేత పూజ చేయించింది. పద్యాలు, పాటలు నామ సంకీర్తన చేయించింది. మంత్ర పుష్పం చెప్పమన్నది అమ్మ. మంత్రపుష్పానికి చేతిలో పూలులేవే అనుకుంటుండగా అందరి చేతులలో మట్టి పెట్టింది అమ్మ. అదే గొబ్బెమ్మ పై వేసి నమస్కరించారు. మామూలుగా పేడకు నమస్కరించం, పసుపును గాని, కుంకుమను గాని నమస్కరించం. కానీ ఆవు పేడను గొబ్బెమ్మను చేసి పసుపు పూసి కుంకుమ పెట్టగానే భగవతి అనే భావన వచ్చి పూజించి హారతి ఇచ్చి నమస్కరిస్తున్నాం. అలాగే వేప చెట్టు. రావిచెట్టు విడివిడిగా పూజించం. రెండూ కలిసి లక్ష్మీ నారాయణులని పూజిస్తాం. వివాహాదులలో గుండ్రాయిని పూజిస్తాం. అంటే సర్వత్రా ఉన్న బ్రహ్మమే ఇన్ని రూపాలలో ఉన్నది అని తెలియచేయడమే అని అమ్మ చెపుతుంటే మబ్బులు విడిపోయి ఆకాశ నిర్మమైనట్లు మనస్సు జ్ఞానరోచిస్సులతో ప్రకాశవంతం అయింది శర్మగారికి ఆనాడు.

ఆనాటి నుండి శర్మగారు తరచుగా అమ్మ వద్దకు వెళ్ళటం అమ్మ మాట్లాడే మాటల్లోని ఆణిముత్యాలు ఏరుకుంటూ అవి తమ ఉపన్యాసాలలో, పురాణాలలో, కవితలలో ఉపయోగించడం జరుగుతుండేది.

ఒకసారి అమ్మ బిడ్డలందరిని మాఘపూర్ణిమకు రమ్మని చెపుతూ శర్మగారితో అమ్మాయిని కూడా తీసుకొనిరా అన్నది. 4.2.1958 మాఘపూర్ణిమ. 3వ తారీకు సాయంత్రానికే అందరు జిల్లెళ్ళమూడి చేరారు. విశేషమేమిటో శర్మగారికి తెలియదు. షుమారు 1500 మంది చేరారు ఆరోజు అమ్మ వద్దకు. జనసందోహం కోలాహలం, కొమరవోలు గోపాలరావుగారు చామదుంపల బస్తా తెచ్చారు. ఏడవమైలు నుండి ఎవరు మోసుకొస్తారా! అని ఆలోచిస్తుండగా రామకృష్ణ శర్మగారే ఆ బస్తా నెత్తిపై పెట్టుకొని మోసుకొచ్చారు జిల్లెళ్ళమూడికి.

తెల్లవారు ఝామున 2గంటలకు డ్రైయిను కాల్వకు అమ్మ బయలుదేరింది. అమ్మతో పాటు అందరూ బయలు దేరారు హైమతో సహా. సన్నగా బలహీనంగా ఉన్నా అమ్మతో ఎవరూ నడవలేకపోయారు. నామం చేస్తూ అందరూ అమ్మను అనుసరించారు. ఆ వెన్నెల వెలుగులో అమ్మ షుమారు వెయ్యిమందికి మంత్రోపదేశం చేసింది. అందులో శర్మగారు, శర్మగారి భార్య కూడా ఉన్నారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క నిమిషం చొప్పున పట్టినా షుమారు పదిగంటల కాలం పైన పట్టాలి. కాని కాలం అమ్మ ఆధీనం, 4గంటలలోనే అంత మందికి ఉపదేశం చేసింది.

మామూలుగా అమ్మ ఎవరికీ మంత్రోపదేశాలు చేయదు ఉపనయనాలలో తప్ప. ఆ రోజు దేశిరాజు రాజమ్మగారికిచ్చిన మాట ప్రకారం అంత మందికి చేసింది. శర్మగారు, శర్మగారి భార్య ఆ రోజు అమ్మచే ఉపదేశం పొందటం నిజంగా వారి అదృష్టం.

"మమపరిపాలిని పావనీ! పరమేశ్వరి శ్రీ భువనేశ్వరీ అంబ, విమల హృదంతర్వర్తినీ జననీ, వేద స్వరూపిణి మాంపాహి" అని సంస్కృతంలోనూ.

"సర్వాదర్శ సమన్వయాన్విత భవత్సాన్నిధ్య లోలత్వమే


సర్వాధ్యాత్మిక సంపదాళి నొసగునే సందేహమున్ లేదులే

సర్వాలంబనమీవె వేదపరిషత్ సంస్తుత్యదివ్యాకృతీ!

గర్వోన్మూలిని! కార్యకారణ విముక్తక్షేత్ర సంవాసినీ! అని తెలుగులోనూ శర్మగారు ఎన్నోపాటలు పద్యాలు వ్రాశారు. వారు వ్రాసిన "మాతృదేవికి మంగళం మా మంగళాంగికి మంగళం. శ్రీకరంబై దివ్యమై భాసిల్లు తల్లికి మంగళం" అనే మంగళ హారతి పాట నిత్యం జిల్లెళ్ళమూడిలోనూ, ఎక్కడ అమ్మ పూజ జరిగినా పాడుకుంటూనే ఉన్నాం.

శ్రీరామకృష్ణ శర్మగారు కొన్ని సంశత్సరాలు "మాతృశ్రీ ప్రింటర్స్"లో మేనేజర్గా సేవలు చేశారు. వీరు వ్రాసిన "అమ్మ అష్టోత్తర శతనామావళి"ని జిల్లెళ్ళమూడిలో తొలిరోజులలో పూజలలో వాడబడేది. శ్రీ రాచర్ల లక్ష్మీనారాయణచే నామాలు చదివించేది అమ్మ పూజలలో, వేదశాస్త్ర పరిజ్ఞానమంతా ఆ నామాలలో పొదిగి నిబంధించారు శ్రీ శర్మగారు.

ఆ రకంగా శర్మగారు అమ్మ సేవలో నిరంతర అమ్మ భావనతో తరించిన ధన్యజీవులు.



28. కె.పద్మనాభన్

తమిళనాడు నుండి జిల్లెళ్ళమూడి వచ్చే సోదరులలో శ్రీ.కె. పద్మనాభన్ ప్రముఖుడు. ఆయన భార్య రాజ్యలక్ష్మి గారు కూడా వారికి తగిన భార్య, అమ్మను విశ్వసించి ఒక దేవతగా ఆరాధించి, అమ్మ అపారమైన ప్రేమలో ఓలలాడి, అమ్మ నామమే జపంగా. అమ్మ ఆలోచనలే నిరంతర ధ్యానంగా, అమ్మ తలపులే తపనగా జీవించిన పుణ్యదంపతులు వారు.

మదరాసు సోదరులు చాల మంది 1973లో అమ్మ స్వర్ణోత్సవాల తర్వాత అమ్మ కోటిమంది బిడ్డలను చూడాలనే ఆప్యాయతతో తిరిగిన రోజులలో అమ్మకు దగ్గరైనారు. అమ్మ మద్రాసు యాత్ర ఏర్పాటు చూచినవారిలో ఎంబెరుమన్నార్‌చెట్టి, పొత్తూరి వెంకటేశ్వర్లు గారితో సోదరుడు పద్మనాభన్ కూడా ఒకరు.

మద్రాసులో హేమమాలినీ కళ్యాణ మండపంలో అమ్మ జనానికి దర్శనాలు ప్రసాదిస్తుండేది. ఒకరోజు పద్మనాభన్ సకుటుంబంగా వచ్చి తమ ఇంటికి రావలసిందిగా అమ్మను అభ్యర్థించాడు. అమ్మ అంగీకరించింది. వాళ్ళింటికి వెళ్ళింది. అమ్మను తృప్తిగా అభిషేకించుకున్నారు. వారి కుటుంబమేకాదు వారింటికి వచ్చిన వారందరూ కూడా. ఆనాడు అమ్మ వారికి కంచి కామాక్షిగా దర్శనమిచ్చి అనురాగవర్షంలో వారిని ముంచి వేసింది. ఆనాడు వారు అమ్మకు పెట్టిన చీరెను అమ్మ కొన్ని నెలలు కట్టుకొని తర్వాత పద్మనాభన్ కుటుంబం జిల్లెళ్ళమూడి వచ్చినప్పుడు రాజ్యలక్ష్మిగారికి శేషవస్త్రంగా బహూకరించింది.

అమ్మతో కలిసి ఫొటో తీయించుకోవాలని వాళ్ళకోరిక. చాలాకాలంగా అదిమనసులోనే ఉన్నది. నోరువిడిచి అమ్మను ఎప్పుడూ అడుగలేదు. అందరిమనసులో ఉండి వాటిని నడిపించే శక్తి అమ్మే కదా! జిల్లెళ్ళమూడిలో అమ్మవద్ద పద్మనాభన్ రాజ్యలక్ష్మిలు కూర్చుని ఉండగా అమ్మే ఫొటో గ్రాఫరును

పిలిపించి ఫొటోతీయించి వారి మనసులోని కోర్కె తీర్చింది.

ఒకసారి పద్మనాభన్ తన స్నేహితునితో రూర్కెలా నుండి మద్రాసుపోతూ మధ్యలో జిల్లెళ్ళమూడి వచ్చారు. ఆ సమయానికి రామకృష్ణన్నయ్య అమ్మకు ఒక అమ్మ ఫొటో ఇచ్చి దానికి ప్రాణప్రతిష్ఠ చేయమని అడుగుతున్నాడు ఎవరికో ఇవ్వటానికి. అమ్మ "అదేమిటిరా! ఇపుడా ఫొటోకు ప్రాణం లేదనా? నీ ఉద్దేశ్యం" అన్నది. అమ్మ ఫొటోనే కాదు అమ్మ ఆలోచనే అమ్మను ప్రత్యక్షంగా మన ముందుచుతుంది. అక్కడే ఉన్న పద్మనాభన్‌కు ఒక ఆలోచన వచ్చింది. మరి అమ్మను చూడనివారికి అమ్మనుగూర్చి తెలియని వారి సంగతేంటి? అని దానికి సమాధానం వెంటనే వారికి దొరికింది. వారితో వచ్చిన యువ మిత్రుడు ఇంతకుముందు అమ్మను చూడలేదు. అమ్మను గూర్చి వినలేదు. అతనిని చూడగానే అమ్మ దగ్గరకు పిలిచింది తన నుండి దూరంగా ఎక్కడో ఉద్యోగం చేయడానికి వెళ్ళిన బిడ్డ దగ్గరకు వస్తే ఎంత ఆప్యాయత, ఆదరణ, వాత్సల్యము ఉంటుందో అలాగా పిలచింది. కలిపి ముద్దలు పెట్టింది పసిపిల్లవాడికిలా. అతడికి చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు. అన్నగారి దగ్గర పెరిగాడు. అన్నకు పెళ్ళైవదిన వచ్చిన తర్వాత ప్రేమ తగ్గింది. వదిన కూడ తనతో సరిగా ఉండటంలేదు. ఆసమయంలో అమ్మ చూపించిన ప్రేమ అతని హృదయాన్ని కదిలించింది. మద్రాసు వెళ్ళింతర్వాత వదిన కూడా చాలా వాత్సల్యంగా చూచిందిట.

పద్మనాభన్‌గారి భార్యకు అమ్మను దర్శించిన నాటి నుండి అమ్మే సర్వస్వమైనది. అమ్మధ్యాసలోనే గడపటం అలవాటైనది. అమ్మ మీద పాటలు వ్రాసి తానే స్వరపరచి అమ్మ వద్ద భక్తితో, ఆర్తితో తన్మయత్వంగా పాడటంతో అమ్మ ఆనందించింది.

గంధపు చక్కను లక్షల లక్షలు అమ్మ నామజపంతో అరగదీసి ఆ గంధతో ఉండలుచేసి ఆ ఉండలతో ఒక మాలను తయారుచేసింది. ఆ మాలను తెచ్చి అమ్మ మెడలో వేసింది. అమ్మకు పూలమాలలు, బంగారు హారాలు వేసినప్పటికంటే నామంతో కట్టిన ఈ మాల పరిమళం అమ్మను ఎంత ఆనందపరచిందంటే జిల్లెళ్ళమూడి వచ్చిన ప్రతి బిడ్డకు రాజ్యలక్ష్మిగారు ఆ హారం తయారుచేయటంలోని భక్తి శ్రద్ధలను వివరించారు. ఎప్పుడో శ్రీరంగనాథునకు తాను ధరించిన పూలమాలను సమర్పించిన గోదాదేవి భక్తికంటే ఇది ఇంకా శోభస్కరంగా అమ్మ భావించింది.

మన మనసులోని భావాలను తెలుసుకోవటం అమ్మకు వెన్నతో పెట్టిన విద్య. ఎందుకంటే అమ్మే అందరి మనసులలో మనసై ఉన్నది. ఒకసారి పద్మనాభన్‌గారు వారి భార్య క్రొత్త సంవత్సరాది జనవరి ఫస్ట్‌కు జిల్లెళ్ళమూడి

వచ్చారు. జనం విపరీతంగా ఉన్నారు. అమ్మ దగ్గరకు వెళ్లే అవకాశం కనిపించక బాధపడ్డారు. ఇంతలో అమ్మ వద్ద నుండి పిలుపు, వసుంధర వచ్చి అమ్మ మిమ్మల్ని రమ్మంటున్నదని ఆనందంతో అమ్మ వద్దకు వెళ్ళారు. రాజ్యలక్ష్మి గారికి అమ్మపాద సంవాహనము, పద్మనాభన్ గారి చేతికి విసనకఱ్ఱ ఇచ్చింది. ఇద్దరూ అమ్మకు సేవచేసుకొనే అదృష్టాన్ని పొందారు. అమ్మ ప్రసాదంతో జబ్బులు తగ్గటం, ఏవీ తినటానికి దొరకలేదనుకున్నప్పుడు దొరకటం, కుంకుమ పొట్లాలు చేసే మహాత్మ్యాలు లెక్కలేనన్నీ వారి జీవితంలో ఉన్నాయి. ఇంతటి భక్తి ప్రపత్తులు ఉన్నాయి గనుకనే అమ్మ తాను ధరించే పాదుకలను వారికి ప్రసాదించింది పూజకు.

పద్మనాభన్‌గారి భార్యకు అమ్మ కలలో కనిపించి మద్రాసులో గుడి కట్టించమని చెప్పిందట. పద్మనాభన్‌గారికి మహాబలిపురం పాతరోడ్డులో కొంత జాగా ఉన్నది. తమకు చేతైనంతలో చిన్నగుడి కట్టిద్దామని భార్యభర్తల ఆలోచన. వారు స్థలం కొన్న యజమానిని గుడికట్టాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలి. అని అడిగారు. అమ్మను చూడని ఆ యజమాని ఈ మాటవిని 1500 గజాల స్థలం విరాళంగా ఇచ్చాడు. ఈ ఉత్సాహంతో "అమ్మ సేవా ట్రస్టును" ఏర్పాటు చేసి వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డిని కలుపుకొని బృహత్ప్రణాళిక సిద్ధంచేసుకొని అమ్మ ఆలయమేకాక అనుబంధంగా శివుడు, వినాయకుడు, కుమారస్వామి, సీతారామలక్ష్మణులు,సత్యనారాయణస్వామి, లక్ష్మీదేవి, అయ్యప్ప, శ్రీకృష్ణుడు, నవగ్రహాలను కూడా ప్రతిష్ఠించి ఒక ఆలయ సముదాయాన్ని నిర్మింపచేశారు.

పద్మనాభన్‌కు బ్రెయిన్ హెమరేజి వచ్చి ఆశలు వదులుకున్న పరిస్థితిలో అమ్మ అనుగ్రహంతో కోలుకొని మళ్ళీ నాలుగు నెలల్లో నడవగలగటం అమ్మ దయ. హైదరాబాద్ గెస్ట్‌హౌస్ నిర్మాణం జరుగబోతుందని తెలిసిన పద్మనాభన్‌గారు మద్రాసు సోదరులతో సంప్రదించి అమ్మ అనుమతితో మూడు నెలల్లో మద్రాసు గెస్ట్ హౌస్‌ను పూర్తిచేయగలగటం అమ్మ అపారకరుణ వారిపై ఉన్నదనటానికి నిదర్శనం. పద్మనాభన్‌గారు అనారోగ్యంతో అమ్మలో కలిసినా, వారి పిల్లలు జిల్లెళ్ళమూడి వచ్చి మే 5న అమ్మ కళ్యాణంలో పాల్గొంటూ పద్మనాభన్‌గారి అమ్మసేవలోని వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని తండ్రికి తనయులనిపించు కుంటున్నారు. పిల్లలలో అమ్మ పట్ల భక్తి విశ్వాసాలను కలిగించటంలో పద్మనాభన్‌గారు కృతకృత్యులై నలుగురికీ ఆదర్శంగా నిలచిన ధన్యజీవి.

29. కోరి అమ్మలో కలిసిన కొణకంచి జగన్నాథం

కొణకంచి జగన్నాథంగారు మంచి జ్యోతిష్కుడు. మంచి వైద్యుడు. హనుమకొండ నివాసియైన వృద్ధ బ్రాహ్మణుడు. చాలమంది పిల్లలు పుట్టిపోయారు. భార్యా ఈ ముసలి వాడ్నిఒంటరిని చేసి పోయింది. చనిపోయినవారు చనిపోగా మిగిలింది ఒక్క కూతురు. చాలా గారాబంగా పెరిగింది. వంట చెయ్యటం కూడా సరిగా రాదు. పెళ్ళిచేశాడు. ఒక పిల్లవాడు ఆ మనుమడు ఈ ముసలి తాతను వదలడు. వచ్చీరాని మాటలతో తాత ఒళ్ళోనే వాడి నివాసం.

తాత జగన్నాథానికి తన జాతకం ప్రకారం తానూ తనువును విడిచి పెట్టే రోజులు దగ్గర పడుతున్నయ్యని తెలుసు. "కాశ్యాన్ మరణాన్ ముక్తిః అథవాపుత్రసన్నిధౌ" అనే నానుడి లోకంలో ఉన్నది. పురాణాలూ ఘోషిస్తున్నాయి. కనుక కాశీలో మరణించి ముక్తిపొందాలనుకున్నాడు. ఈ సమయంలోనే తంగిరాల కేశవశర్మ బానమరది దెందుకూరి శ్రీనివాసరావు జగన్నాథం గారికి తటస్థపడ్డాడు. 'కాశీలో ఉన్నది రాతి బొమ్మ సజీవమైన అన్నపూర్ణ జిల్లెళ్ళమూడిలో ఉన్నది. అక్కడకు వెళ్ళు నీ జన్మతరిస్తుంది, నీకు ముక్తి వస్తుంది" అని చెప్పాడు. చెప్పినవాడు శ్రీనివాసుడు, విన్నవాడు జగన్నాథుడు. మనసుకు బాగా పట్టింది. క్షేత్రము, తీర్థము, దైవము మూడూ కలిసిన ప్రదేశం జిల్లెళ్ళమూడి అని తెలుసుకున్న ఆ పుణ్యపురుషుడు అమ్మ పాదాల వద్ద తన ఆఖరి శ్వాస వదలాలనుకున్నాడు.

జగన్నాథంగారు 1959 సంవత్సరం భాద్రపద మాసంలో జిల్లెళ్ళమూడి గడ్డపై అడుగుపెట్టాడు. ఆరోజు ఏకాదశి. అమ్మ పుట్టింది ఏకాదశినాడే. అమ్మఈ బిడ్డను కన్నది ఏకాదశినాడే కావటం యాదృచ్ఛికం కాదు. అప్పుడు చీరాలవారు అమ్మకోసం ఏర్పాటు చేసిన పాకలో తంగిరాల కేశవశర్మ, సొలస వెంకటేశ్వర్లు అమ్మ దగ్గర కూర్చొని ఉన్నారు. మాటల సందర్భంలో అమ్మ "కేశవ! ఎక్కడో మూలుగు వినపడుతుందిరా! అదొకరకంగా ఉంది" అన్నది. "నీకు ఎక్కడెక్కడివో వినిపిస్తుంటాయి. ఏభక్తుడు ఆర్తితో, బాధతో నిన్ను తలస్తున్నాడో" అన్నాడు కేశవ. ఇంతలో ఒక ముసలివాడు చంకలో పసివాడితో వస్తూ అమ్మా! పార్వతీ ఎక్కడున్నావమ్మా! అంటూ వరండాలో పిల్లవాడ్ని చంకలో నుండి దించాడు.

పిల్లవాడు అమ్మ కావాలంటూ ఏడుస్తున్నాడు. అదిగోరా! అసలు అమ్మ దగ్గరకే వచ్చాం బాబూ! అన్నాడు తాతగారూ. కేశవ బయటకు వచ్చి తాతగారిని పట్టుకొని పిల్లవాడ్ని చంకలో ఎత్తుకొని అమ్మ వద్దకు తీసుకెళ్ళాడు. అమ్మ పాదాలకు

సాష్టాంగనమస్కారం చేసి తాతగారు అమ్మతో శ్రీనివాసు చెప్పాడమ్మా! కాశీ వెళ్ళితే చనిపోయాక కైలాసం వస్తుంది. జిల్లెళ్ళమూడి వెళ్ళితే సశరీరకైలాస ప్రాప్తేనని. ఆ మాట మననమై మంత్రమై నన్ను నీదగ్గరకు చేర్చిందమ్మా! అంటూ పిల్లవాడితో అదిగోరా! అమ్మ పో! అంటూ అమ్మ వద్దకు త్రోశాడు. పిల్లవాడు ఏడుస్తూ కదలలేదు. పోరా! అంటూకసిరాడు. అప్పుడు అమ్మ "ఇవ్వాళ నా దగ్గరకు రాడు రేపు నీ దగ్గర ఉండడు" అన్నది. నాక్కావల్సింది అదే వాడ్ని ఆశీర్వదించమ్మా! అని తన కుటుంబ గాథ చెప్పటం మొదలుపెట్టాడు.

నాకు జోతిష్యం తెలుసు. గాలిపాటులకు, గ్రహ వీక్షణాలకు తాయత్తులు కట్టుతుంటాను. ఈ నెలలో నాకు గండం ఉన్నది. ఏదో ఒక పుణ్యక్షేత్రంలో పోతానని వ్రాసి ఉంది. నా బిడ్డ అమాయకురాలు, దాని మీద మమకారం. నాకున్నంతలో ఏదో ఇచ్చాను. అల్లుడు ఉద్యోగం చేస్తున్నాడు. హనుమకొండలో నాదగ్గరే ఉంటాడు అని చెప్పాడు. జగన్నాథం గారికి 104 డిగ్రీల జ్వరం. ఇంటి దగ్గర బయలు దేరిందగ్గర నుండి విరేచనాలు. రక్తం కూడా పడుతున్నది. నిద్రలేదు, కూర్చోలేడు. మృత్యువు తప్పదని అల్లుడితో చెప్పి వచ్చాడు.

అమ్మ తాతగారికి ప్రక్కవేయించి సపర్యలు చేయించింది. రెండు రోజులు గడిచాయి. తాతగారు ఆఖరి ప్రయాణానికి సిద్ధమైనట్లున్నదని అమ్మకు వచ్చి చెప్పారు. అమ్మ శొంఠిపొడి తేనె కలిపి నాలుకపై వేసింది. గుండె, పొట్టతడిమింది. పాదాలు రాసింది. తాత ఉలిక్కిపడి నొచ్చుకున్నారు అపరాధం చేసినట్లుగా, అమ్మ పాదాలు పట్టుకున్నారు క్షమించమని. తాతగారి ఒళ్ళు చల్లబడ్డది. జ్వరంలేదు. లేచి కూర్చుని "నీవు పార్వతి దేవివి అనుకున్నాను గాని పార్వతీ పరమేశ్వరులకు కూడా తల్లివి నీవు" అన్నాడు. అమ్మ తడి గుడ్డతో ఒళ్ళుతుడిచి క్రొత్త ధోవతి కట్టించింది. లక్ష్మీ నరసమ్మ గారితో చెప్పి చారు అన్నం వండించి పెట్టింది.

డాక్టర్ సాంబయ్య వచ్చాడు జ్వరం ఏలా ఉన్నది అంటూ, సాంబయ్యతో తాతగారు నేను కాలం వచ్చి చిక్కానుగాని కాళ్ళు లేక కాదండీ! నేనూ వైద్యుణ్ణే అంటూ కొన్ని గంటలపాటు వైద్యాన్ని గూర్చి విధానాల గూర్చి చర్చించారు. తన దినచర్య పుస్తకంలో ఇంటి దగ్గర నుండి బయలుదేరిం దగ్గర నుండి అప్పటి దాకా జరిగినంతా వివరంగా వ్రాశారు. ఇంతలో బయటకు వెళ్ళాల్సి వచ్చి అమ్మా! నాకు మూలమలం కదిలింది, మరణం తప్పదు. బాగా ఆకలి వేస్తున్నది అన్నం పెట్టించమ్మా అన్నారు. తాతకు ఇష్టమైన దోసకాయపప్పు, పెరుగు వేసి అన్నం పెట్టారు. భోజనం చేస్తుండగానే అమ్మా! ఓ మృత్యుదేవతా! వస్తున్నావా!

అంటూ అన్నంతిని లేచారు. కొద్ది సేపటికి జగన్నాథంగారు అమ్మలో కలిసి పోయారు. ఆ రోజు మహాలయ అమావాస్య పుణ్యకాలం, తెల్లవారితే దేవీనవరాత్రులు మొదలు.

అమ్మకు దేవుళ్ళూ బిడ్డలే బిడ్డలూ దేవుళ్ళే. "నేను మీలో దైవత్వం చూస్తాను. మీరు నాలో మానవత్వం చూస్తారు" అన్నది అమ్మ. నిజమే! దూరంగా ఉన్నప్పుడు అమ్మను దేవత అంటూంటాం గాని దగ్గరకు వెళ్ళంగా అమ్మను మానవిగానే చూస్తాం. అమ్మ అన్నట్లు ఈమంచం మీద కూర్చున్న అమ్మకాదు. అమ్మ అంటే- కొందరికి ఒక్క మాటతోనే జ్ఞానోదయమౌతుంది. కొందరికి సంవత్సరాల తరబడి అమ్మ దగ్గర ఉన్నా కాదు. ఏం చేస్తాం. జగన్నాథం గారికి శ్రీనివాస్ చెప్పిన ఒక్క మాట మంత్రమై వారిని ముక్తిని పొందేలా చేసింది. మరి మూడు రోజులలో పొందిన జగన్నాథం గారు ధన్యుడు కదా ! ఏడురోజులలో ముక్తిని పొందిన పరీక్షిత్తుకంటె- "అర్కపురీ క్షేత్రే మరణాన్ ముక్తిః" అనే విశ్వాసం ఆయనకు కావాల్సింది ఇచ్చింది. విశ్వాసమే భగవంతుడు కదా! పార్వతిగా పార్వతీ పరమేశ్వరులను కన్న తల్లిగా, మరణ దేవతగా, దర్శనమిచ్చి తనలోకి చేర్చుకోవటం ఆయన అదృష్టం. కోరినరీతిగా ముక్తుడైన- కైలాసాన్ని మించిన అర్కపురికి చేరిన ధన్యజీవి.

జగనాథంగారు ముక్తుడైన తర్వాత జరిగిన కథకేమి? మాటలు వచ్చీరాని వారంతా అమ్మ అనుగ్రహంతో జిల్లెళ్ళమూడి అమ్మతో అనుబంధాన్ని పెంచుకోవటం అమ్మ కరుణకు పాత్రులు కావటం మనకు తెలిసిన అంశాలే.

పోతూపోతూ జగన్నాథం గారు చూపిన దారి ఆయన కుమార్తె దమయంతి, అల్లుడు రామచంద్రరావు, మనుమలు, మనుమరాండ్ర జీవితాలలో వెలుగు వెల్లువలు నింపినయ్యని వాళ్ళు తృప్తి పడటం మనందరికీ మననీయమైన విషయం. కొండముది రామకృష్ణ కొడుకు సుబ్బారావుకు జగన్నాథం గారి మనుమరాలినిచ్చి వివాహం చేసి జిల్లెళ్ళమూడితో ఉన్న అనుబందాన్ని ఇంకా పటిష్ఠం చేసుకున్నారు. ఏమైనా కోరుకున్నట్లు కోరుకున్నచోటికే చేరిన ధన్యుడు శ్రీ జగన్నాథం గారు.

30. చీరాల భాస్కరరావు

1956లోనే అమ్మ వద్దకు వచ్చిన వారిలో చీరాల భాస్కరరావు ఒకరు. గుంటూరులోని రామరాజు కృష్ణమూర్తి, భాస్కరరావు మంచి స్నేహితులు. ఇద్దర కలసి కాలేజీలో చదువుకున్నారు. ఇద్దరికీ ఆధ్యాత్మిక జిజ్ఞాస ఎక్కువ. భాస్కరరావుగారి తల్లిదండ్రులు గుంటూరు నుండి చీరాల రావటంతో భాస్కరరావుగారి బస చీరాలకు మారింది. చీరాలలో ఉన్న రోజులలో కూడా అరవిందయోగిని గురించి, రామకృష్ణ పరమహంసను గూర్చి వారి యోగ సాధనలను గూర్చి ప్రచురింపబడిన గ్రంథాలను చదువుతుండేవాడు. గుంటూరులో ఉన్న రోజులలోనే రామరాజు కృష్ణమూర్తి గారి ద్వారా అమ్మను గూర్చి వింటుండేవాడు కాని ఎప్పుడూ అమ్మ వద్దకు పోవడం జరగలేదు.

వారికి ఒకసారి ఒక విచిత్రమైన అనుభవం కలిగింది. రాత్రి నిద్రపోయే ముందు కిటికీలో నుండి ఒక స్త్రీరూపం కదలాడినట్లు కనబడింది. గోడమీద ఒక స్త్రీ ఆకారం చిన్నదిగా కనిపించి ఆకాశం ఎత్తుగా ఎదుగుతూ కనిపించింది. భాస్కరావుగారికి భయమేసింది. అలాగే చీరాలలో ఉన్నరోజులలో చిత్రమైన దర్శనాలవుతుండేవి. ఒకసారి మూడునాలుగు రోజులు జ్వరం వచ్చింది. తగ్గి పథ్యం పుచ్చుకొన్నారు, గాని బాగా నీరసంగా ఉన్నది. అదే రోజు గుంటూరు నుండి రామరాజు కృష్ణమూర్తిగారు వచ్చి అమ్మను చూడటానికి జిల్లెళ్ళమూడికి వెళ్ళుదాం రమ్మన్నారు. భాస్కరరావుగారి తల్లి వాడికి నీరసంగా ఉన్నది. జ్వరం ఇప్పుడే తగ్గింది మళ్ళీ తిరగబెడుతుందేమో వద్దన్నది. కాని కృష్ణమూర్తి పట్టుబట్టడంతో భాస్కరరావుకు కూడా అమ్మను చూడాలనే ఉత్సాహం ఉండడంతూ 17-10-1956న బస్సులోబయలుదేరారు జిల్లెళ్ళమూడికి. ప్రయాణం చేస్తున్నసమయంలో భాస్కరరావుగారికి దేహస్మృతి పోయి ఏదో ఒక అలౌకిక అనుభూతికి లోనయ్యాడు.

తర్వాత బాపట్ల నుండి జిల్లెళ్ళమూడికి రిక్షాలో వెళ్ళారు. వీరు వెళ్ళే సమయానికి అమ్మ కూడ సమాధి స్థితిలోనే ఉన్నది. అప్పటికి అమ్మ ఇప్పుడు హైమాలయం ఉన్నచోట ఒకపాక ఉండేది. ఆ పాకలో ఉన్నది. సమాధిస్థితి నుండి కొంతసేపటికి బయటకు వచ్చిన అమ్మ మాటల సందర్భంలో బాపట్ల నుండి జిల్లెళ్ళమూడి వచ్చేదాకా వారు మాట్లాడుకున్న మాటలన్నీ ఏకరువు పెట్టిందట. వాళ్ళు అప్రతిభులైనారు. సర్వవ్యాపకత్వాన్ని గూర్చి, సర్వజ్ఞత్వాన్ని గూర్చి వారు చదువుకొని ఉన్నారు. ఇక్కడ ప్రత్యక్ష నిదర్శన కనిపించింది.

భాస్కరరావుగారిని "ఏమి సాధన చేశావు నాన్నా" అని అమ్మ అడిగింది. "సాధన అంటూ ఏమీ చేయలేదమ్మా, గ్రంథాలు చదవవటం తప్ప" అన్నాడు. "పుస్తకజ్ఞానం అనుభవం కాదుగా నాన్నా!" అన్నది అమ్మ. అమ్మ మాట్లాడుతుంటే వీణాస్వర మాధుర్యం వినిపించినట్లు ఒక్కొక్కమాట ఆత్మీయంగా హృదయాన్ని తాకుతున్నట్లు అనిపించింది. అమ్మ స్వయంగా వంటచేసి పెట్టింది. ఇద్దరికీ, కలిపి ముద్దలు నోటి కందించింది. పొయ్యి, గిన్నె, కట్టెలు చూపించి ఇవే నా సాధన సామాగ్రి అన్నది. కణకణమండే నిప్పులో కాల్చిన మేలిమిబంగారంగా ఉన్నది అమ్మ శరీరకాంతి- అనిపించింది భాస్కరరావుగారికి. ఆ రోజులలోనే అమ్మ "ఈ శరీరాన్ని వదిలిపెట్టాలని ఉంది నాన్నా" అన్నది. అందుకు భాస్కరరావుగారు 'శరీరం మార్చాలి గాని వదలవద్దు' అని అరవిందులు చెప్పిన మాట చెప్పారుట అమ్మతో. అమ్మ కూడా తర్వాత పరిణామ సిద్ధాంతాన్నే చెప్పింది.

రఘువరదాసుగారు నామయోగిగా లోకంలో ప్రసిద్ధుడు. ఎన్నివందల వేల రామనామ సంకీర్తన, యజ్ఞాలలో పాల్గొని ఆయన తరించడమేగాక ఎంతమందిని తరింపచేశడో! అ మహనీయుని శిష్యులు కొందరు భాస్కరరావు గారున్న రోజుల్లో జిల్లెళ్ళమూడి అమ్మవద్దకు వచ్చారు. వారు అమ్మ అనుజ్ఞతో రామనామం చేస్తుంటే ఒక నల్ల కుక్క అక్కడకు వచ్చి తన్మయత్వంతో నాట్యం చేసింది. నామంచేసేవారితోపాటు అందరికీ ఆనందభాష్పాలు వచ్చాయి. ఆ నల్ల కుక్కే తర్వాత తర్వాత జిల్లెళ్ళమూడి వచ్చేసోదరీ, సోదరులను ఏడవ మైలు వంతెన నుండి అమ్మ వద్దకు తీసుకొనిరావటం, అమ్మ వద్ద నుండి వెళ్లే వారిని ఏడవమైలు దాకా దించిరావటం చేసేది. అది ఎంత సంస్కారం చేసుకొన్నదో, అందుకే అమ్మ మానవులకే కాదు జంతువులకీ మనస్సున్నది అని చెప్పింది. ఆ సమయంలో భాస్కరరావు చేతిని అమ్మ పట్టుకుంటే అమ్మతోపాటు భాస్కరరావుగారు కూడా సమాధి స్థితిలోకి వెళ్లారు.


అదే పట్టున మండలం రోజులున్నారు అమ్మ దగ్గరవారు. బయలుదేరే రోజున అమ్మ వాళ్ళను కార్తీక పూర్ణిమకు రమ్మని చెప్పింది. భాస్కరరావు గారు వచ్చారు. అమ్మ భాస్కరరావు గారి నుదుట కుంకుమ పెట్టుతూ అమ్మ బొటనవ్రేలు భృకుటిని తాకగానే భావ సమాధిలోకి వెళ్ళిపోయారు. అమ్మ ఎవరి యోగ్యతను బట్టి వారికివ్వలసినవి ఇస్తుంది. అనభ్యాసంగానే అమ్మ వారికీ సమాధి స్థితులు ప్రసాదించింది. అమ్మ దగ్గర కూర్చొని మహాత్ముల గ్రంథాలు చదివి వినిపిస్తుండేవారు. అమ్మ "మహాత్ముల భావకర్పూరంతో నీ జిజ్ఞాసా హారతిని ఇస్తున్నావురా నాకు" అన్నదిట.

నిజమే అమ్మకు అందులో తెలుసుకోవలసినవి ఏమీ లేవు. తెలివే ఆమె కదా! మనకు తెలియచేయటానికే మనకు ఏదో ఈ రకమైన ప్రేరణను ఇస్తుంటుంది.

ఆ రోజుల్లో ప్రతి పూర్ణిమకు అమ్మ ఓంకారనదిలో (డ్రైన్‌కాలువ) స్నానం చేయటానికి వెళ్ళుతుండేది. అమ్మతో బిడ్డలందరూ వెళ్లేవారు. భాస్కరరావుగారు కూడా వెళ్లారు. చాలా లోతుగా ఉరవడితో ప్రవహిస్తున్న ఆ కాలవలో అమ్మ ఈతకొడుతూ నీటిమీద తేలడం, వెల్లికిలాపడుకొని వెళ్ళడం చూచి ఆశ్చర్యపోయాడు. అణిమ, లఘిమ, మహిమ, గరిమ వంటి అష్టసిద్ధులు అమ్మకు సహజసిద్ధంగానే ఉన్నవి అనిపించింది వారికి.

అమ్మ ఎవరైనా తన దగ్గర నుంచి ప్రయాణమై బయలుదేరుతుంటే కుంకుమ పొట్లాలు ప్రసాదంగా ఇవ్వటం మామూలు. కొందరు అది ప్రసాదం కాదనుకొని ప్రసాదం (అరటి పండో, పటిక బెల్లమో) ఇమ్మని అడగటం కూడా కద్దు. భాస్కరరావుగారికి అమ్మ ఒకసారి ప్రక్కనే ఉన్నకుంకుమ పొట్లం చేతిలోకి తీసుకొని నీకు పటిక బెల్లం ప్రసాదం ఇస్తున్నానురా అని ఇచ్చింది. ఆ కుంకుమ పొట్లంలో కుంకుమ లేదు పటిక బెల్లమే ఉన్నది. ద్రాక్ష పళ్లలోని గింజలు తీసి గుజ్జును నోటికి అందించేది. తొక్కలులేని అరటి పండ్లను పెట్టేది. ఇవ్వన్నీ అక్కడ ఉండేవి కాదు. అమ్మ లోపలికి పోయి కనిపించకుండా సృష్టించి పెట్టేది. ద్రాక్షగింజలుగాని, అరటి తొక్కలు గానీ ఎక్కడా కనిపించేవి కావు. అదృష్టవంతుడు భాస్కరరావు. భాస్కరరావేకాదు ఆ రోజులలో అమ్మ దగ్గరకు వచ్చిన వారందరూ అమ్మ అత్యద్భుత మహిమలు దర్శించినవారే.

భాస్కరరావుగారు అరవిందుల క్రియాయోగం పట్ల ఆకర్షితులైనారు. ఆ సంస్థలలో చాలాకాలం సేవలు చేశారు. అరవిందుల తత్త్వాన్ని ప్రచారం చేస్తూ ఉండేవారు. ఎప్పుడైనా కనిపిస్తే ఎలా అమ్మ అనుభవాలు ప్రసాదిస్తుందో, అమ్మలోని మానవతీత శక్తులను గూర్చి, యోగశక్తిని గూర్చి చెపుతుండేవారు. అమ్మ ఆలయాలలో చేరిన తర్వాత జిల్లెళ్ళమూడి వచ్చి కొంతకాలం అమ్మ సన్నిధిలో గడిపి శాంతిని పొందారు. చిన్నతనం నుండే ఆధ్యాత్మిక చింతనతో, యోగం పట్ల ఆకర్షితులై అదే జీవము జీవనముగా గడిపిన వారు అరుదుగా కనిపిస్తారు. ఏమైనా అమ్మ అనురాగము పొందిన ధన్యుడు, మాన్యుడు భాస్కరరావు.



31. గజేంద్రమ్మక్కయ్య

రావిపాటి గజేంద్రమ్మది గుంటూరుజిల్లా పొన్నూరు దగ్గర ఇటికంపాడు గ్రామము. భర్త సంపెంగరావు వ్యవసాయ దారుడు. 1957లో మొదటిసారి అమ్మను చూడటానికి వచ్చింది. ఆరోజు పూర్ణిమ. రెడ్డిపాలెం కాంతయ్యయోగిగారు అమ్మను చూడటానికి అమ్మతో వేదాంతచర్చ చేయటానికి వచ్చిన రోజది. వారు అమ్మను రాజరాజేశ్వరిగా గుర్తించిన శుభదిన మది.

గజేంద్రమ్మ అమ్మను చూచినపుడు అమ్మ కన్నులలో పార్వతీపరమేశ్వరులు కనిపించారు. అమ్మలో మహాద్భుతశక్తి ఉన్నది, అమ్మ మనకు కనిపించే మానవమాత్రురాలు కాదు అని నిశ్చయించుకొని పదిరోజులపాటు అమ్మ సన్నిధిలోనే ఉన్నది. అమ్మ స్నానాలగదిలో ఒకరోజు బంగారు వడ్డాణం దొరికింది గజేంద్రమ్మకు. అది తీసుకెళ్ళి అమ్మకిచ్చింది. అమ్మ "అది మీ కోడలే నాకిచ్చింది" అని చెప్పింది. అలా అమ్మ సేవ మొదలైంది.

జిల్లెళ్ళమూడి ఆరోజుల్లో సంస్థ పనులన్నీ సోదరీ సోదరులే చేసేవారు. కూలీలను పెట్టుకోవటం తక్కువ. పొలం పనైనా ఇల్లు కట్టేపనైనా ఏదైనా సరే, అన్నయ్యలు, అక్కయ్యలే చేసేవారు. మూలపాలెంలో 10 యకరాలు పొలం ఉండేది సంస్థకు. అక్కడ నాట్లు వేయటానికి, పంట కోయటానికి గజేంద్రమ్మ వెళ్లేది. గజేంద్రమ్మతో బెండపూడి రుక్మిణిమ్మక్కయ్య, పోతుకూచి విద్యాసాగర్‌గారి

పిల్లలు, రావూరి ప్రసాద్ తల్లిదండ్రులు వెళ్ళిపనులు చేసేవారు. వాళ్ళు పనిచేసి అందరింటికి తిరిగివచ్చేసరికి అమ్మ గోళ్ళల్లో మట్టి ఉండేది. అమ్మ అలిసిపోయి ఉండేది, ఏమిటమ్మా! ఈ మట్టి ఈ చమల అంటే "పొలంలో పని నేను చేయకుండానే మీరు చేశారా?" అనేది అమ్మ. కోతలు కోసేవాళ్ళు, 300 బస్తాలు పురికట్టేవాళ్ళు.

గజేంద్రమ్మ వచ్చిన తొలిరోజులలో అమ్మకు పూజ చేస్తుంటే అమ్మ సమాధిలోకి వెళ్ళిపోయేది. ఎన్నో దేవతా ముద్రలు పడుతుండేవి. ఆశ్చర్యపోయేది గజేంద్రమ్మ. అమ్మను ఆ రోజులలో రకరకాల వాళ్ళు రకరకాలుగా పూజలు చేసేవాళ్ళు. ఒకరు అమ్మకు వీచటానికి తాటాకు విసనకర్రలు తెచ్చి విసనకర్రలు పూలుగా పూజచేసేవాళ్ళు. సామాన్యంగా పూర్ణిమ, ఏకాదశి దినాలలో ఓంకారనదికి (నల్లమటకాలువ) స్నానానికి వెళ్ళేది అమ్మ. అమ్మతో చాలామంది వెళ్ళేవారు. గజేంద్రమ్మా వెళ్ళేది. ఒకసారి 'గజేంద్రమ్మ కాలువలో స్నానం చేసి గట్టుకు వెళ్ళింది. అమ్మ కాలువలో నుండి రాలేదు. కాలువలో కనిపించలేదు. గట్టుపై ఏడుస్తూ కూర్చున్నది గజేంద్రమ్మ. అమ్మ కాలువలో మునిగి మునకు ఈతకొట్టి ఎక్కడకో వెళ్ళి తేలింది. అమ్మ కనిపించేదాకా గజేంద్రమ్మ పడ్డ బాధవర్ణనాతీతం. తవసుఖేన మమసుఖం' భగవంతుడి సుఖమే నా సుఖం అని భావించే గోపికలాగా గజేంద్రమ్మ బాధపడ్డది.

ఒకసారి శ్రీకృష్ణుడికి తలనొప్పివచ్చిందట. ఎన్ని మందులు వేసినా తగ్గలేదట. నారద మహర్షి వచ్చాడు. ఏమి స్వామీ! ఏమిటీ గోల నీ బాధ ఎలా తగ్గుతుందోనీవే చెప్పరాదా? అన్నాడు "ఏం లేదు. నారదా! భక్తుని పాదరజం నా తలపై వేస్తే తగ్గిపోతుందయ్యా! నీవు నా పరమభక్తుడివి కదా! నీ పాదరేణువు నా తలపై వెయ్యవయ్యా! అన్నాడట కృష్ణుడు. క్షమించు స్వామి. జగదీశ్వరుడు, యోగీశ్వరుడు అయిన నీ తలమీద నా పాదరేణువులా? అలా చేసి పాపము మూట గట్టుకొని నరకానికి పోలేను. నావల్లకాదన్నాడు. మరి ఎట్లా ఈ తలనొప్పి తగ్గేది? నా భార్యల నడుగమన్నాడు కృష్ణుడు. నారదడు వెళ్ళి రుక్మిణీ దేవితో సహా అందరినీ అడిగాడు. ఎవరూ ఆ మహాపాపం మేం చెయ్యలేం అన్నారు అప్పుడు నారదుడితో కృష్ణుడు ఆ గోపికలేమన్నా ఇస్తారేమో కనుక్కోవయ్యా! వాళ్ళ పాదధూళి అన్నాడు. నారదుడు వెళ్ళి గోపికల నడుగగా అంతకంటే మహద్భాగ్యమేముంది నారదా! మే ఏ నరకానికి వెళ్ళినా సంతోషమే, కృష్ణుని ఆనందంకంటే మాకు కావలసిందేముంది? అన్నారుట. అదీ గోపికల నరసన. గజేద్రమ్మ ఆ కోవకు చెందిన ఒక గోపిక అనుకుంటాను.

గోపికలంతా భర్తలను వదిలి పెట్టి భగవంతుడైన కృష్ణుని వద్దకు రాత్రిళ్ళు వస్తుంటే స్వామి అడిగారట గోపికలను. 'ఇలా భర్తలను వదిలిపెట్టి రావచ్చా? వాళ్ళకు సేవచేస్తూ ఇళ్ళలోనే ఉండాలి గాని" అని. అందుకు వారు సమాధానం చెప్పారుట. "సత్యమే స్వామీ! నీవు చెప్పింది. ఎవరు నిజమైన భర్త? మాకేకాదు మా పతులందరికీ పతియైన జగత్పతివి గదా! నీవు, నిన్ను సేవించటం కంటే గొప్ప పాతివ్రత్యం ఏమున్నది?" అన్నారుట గోపికలు.

గజేంద్రమ్మ అలాంటి గోపిక. "నాకంటే పురుషు డెవడురా? ఈ లోకంలో" అనగలిగిన పురుషిక అమ్మ. ఆ అమ్మను సేవించగలిగిన అదృష్టవంతురాలు గజేంద్రమ్మ. అమ్మ కూడా గజేంద్రమ్మకు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చేది. ఏ పని ప్రారంభించాల్సి వచ్చినా జిల్లెళ్ళమూడిలో అమ్మ గజేంద్రమ్మను పిలిపించి మొదటిబోణి ఆమె చేతే వేయించేది.

ఒకసారి అడవులదీవి మధు లాండ్‌సీలింగ్ వ్యవహారాలలో చాలా ఇబ్బందులలో ఉన్నాడు. చేతిలో చిల్లి గవ్వలేదు. ఏ విషయమైనా అమ్మకు చెప్పుకొనే అలవాటు కనుక అమ్మ వద్దకు వచ్చాడు. అమ్మ అరే మధూ! హైమకు, ఒక వెయ్యి కొబ్బరికాయలు కొట్టుకోరా? అన్నది. బిత్తరపోయాడు. చేతిలో తిరుగుఛార్జీలకు కూడా అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితిలో వెయ్యి కొబ్బరికాయలు కొట్టుకోవటమా? ఎలా సాధ్యం? నారుపోసినవాడు నీరు పోయకుండా ఉంటాడా? కన్నతల్లి కడతేర్చుకుండా ఉంటుందా? అక్కడే ఉన్న గజేంద్రమ్మ "కొబ్బరికాయలు నేనిస్తాను కొట్టుకో మధు" అన్నది. గజేంద్రమ్మ ఆ మాట అనేసరికి అమ్మే ఈ రీతిగా పలికించిందనుకుని పని పూర్తి చేశాడు. గజేంద్రమ్మ అలా ఎంత మందికి అండగా ఉండేదో!

ఏకా అంజన్ (అంజన్‌కుమార్ ఆత్రేయ) కొంతకాలం బాపట్లలో మాతృశ్రీ ప్రెస్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తూ జిల్లెళ్ళమూడికి వచ్చేవాడు. అమ్మ గజేంద్రమ్మ ఇంటిని అతనికి నివాసంగా ఏర్పాటు చేసింది. పాపం రాత్రి ఎంత ఆలస్యంగా వస్తాడో బిడ్డ అని అంజన్ కోసం మంచం ప్రక్క వేసి ఆహారం రెడీగా ఉంచేది. అతని ఆలనాపాలనా చూస్తూ ఆదరించేది గజేంద్రమ్మ.

ఇలా ఎందరో గజేంద్రమ్మ ప్రేమను పొందినవారు ఒక నంబులనో, ఒక వాన్ డ్రైవర్ వెంకటేశ్వర్లనో ఎంత మందినని చెప్తాం? పాతవారు ఎవరు జిల్లెళ్ళమూడి వచ్చినా వారి కుటుంబ వ్యవహారాలు, భార్యపిల్లల క్షేమసమాచారాలు విచారిస్తూ

అప్యాయంగా పలకరించేది. కొన్నివందల మందిని వేలమందిని అమ్మ పెళ్లికొడుకులుగా, పెళ్ళికూతుర్లుగా చేస్తే వాళ్ళందరికీ తలంట్లు పోయటం గజేంద్రమ్మ కృష్ణవేణమ్మల పని. అలా ఎంత మందిని నూతన వధూవరులుగా తీర్చిదిద్దిందో గజేంద్రమ్మ.

హరిదాసుగారు సంస్థ చూసే రోజులలో అమ్మ వెంబడి ఒక సర్పం కూడా తిరగటం గజేంద్రమ్మ చూచింది. అమ్మకు పూజ జరిగిన తర్వాత, ముందుగా అమ్మ తీర్థం చాకలి శంకరానికిచ్చేది. ఒకసారి అమ్మతో చెప్పకుండా పుట్టమన్ను ప్రసాదంగా తీసుకెళ్తుంటే అమ్మ చూచి తప్పు అన్నట్లుగా ముక్కుమీద వేలు వేసుకున్నది. అప్పటి నుండి శంకరం పూజ జరుగుతుంటే అమ్మ వద్దకు వచ్చేవాడు కాదు అని గజేంద్రమ్మ చెప్పింది.

అమ్మ గజేంద్రమ్మతో "నా తలుపులు నీకోసం ఎప్పుడైనా తెరుస్తారు. నీకు ఆ ఆటంకం లేదు రావచ్చు" అని చెప్పింది. గజేంద్రమ్మ మేడ ఎక్కలేక అమ్మను చూడలేదే ఇవ్వాళ అనుకుంటే చాలు అమ్మ మేడ చివర పిట్టగోడవద్దకు వచ్చి గజేంద్రమ్మకు కనిపించేది. అందుకే గజేంద్రమ్మ అటుండేది! "నేను అమ్మ దగ్గరుకు పోనక్కరలేదు. అమ్మే నావద్దకు వస్తుంది" అని ఎంత ధైర్యం, ఎంత విశ్వాసం అమ్మ పట్ల.

ఒకసారి మునిపల్లె నుండి కొందరు వచ్చి అమ్మకుఫోటోలు తీశారు. వాటిలో అమ్మకు మూడు చేతులున్నవి. నాలుగో చెయ్యి ఎక్కడ దాచావు? అని గజేంద్రమ్మ అడిగితే "అవి నా ఫోటోలుకావు" అని అమ్మ మాటమార్చిందట. ఒకసారి గులాబిపూలతో అమ్మకు పూజ చేశారు. అమ్మ నోటినుండి అమృతధారలు కారాయి. ఆరోజు. అమ్మ వెంటనే ఆ ధారలు త్రాగటం గజేంద్రమ్మ చూచింది. 1962లో ఒకసారి అమ్మ చీరాల వెళ్ళింది. ఆ సమయంలో ఒక స్త్రీ జిల్లెళ్ళమూడి వచ్చింది. ఇది అమ్మ ఇల్లు కదా! అన్నది ఆమె. మర్నాడు గజేంద్రమ్మ చీరాలలో అమ్మ వద్దకు వెళ్ళితే "నీ వద్దకు వచ్చిన ఆమెను ఎందుకు పడుకో వద్దన్నావు?" అని అమ్మ అడిగింది. అమ్మే ఆ రూపంలోవచ్చిన విషయం గుర్తించలేపోయానే! అయ్యో! అని గజేంద్రమ్మ బాధపడ్డది.

అమ్మ "రవి" ఇంట్లో ఉన్న రోజుల్లో అమ్మ దగ్గరకు గజేంద్రమ్మ వెళ్ళగా "నాకు బఠానీలు, ఉప్పుశనగలు కావాలి' అని అడిగింది. అవీ తీసుకొని వచ్చి అమ్మ వద్దకు వెళ్ళగా అమ్మ పడుకొని నిద్రపోతున్నది అని చెప్పారక్కిడివాడు.

మర్నాడు గజేంద్రమ్మ వెళ్ళగా ఏవీ నేను అడిగినవి?" అని అమ్మ అడగగా "నేను వస్తే నీవు రాత్రి నిద్రపోతున్నావని చెప్పారమ్మా?" అని గజేంద్రమ్మ అనగా "నేను నిద్రపోతున్నానని వాళ్ళకు తెలుసా? అయినా నీకు అడ్డం లేదని చెప్పానుగా" అన్నది అమ్మ.

తొలిరోజులలో తన కిష్టమైనప్పుడు అమ్మవద్దకు వెళ్లేది. అమ్మ మంచం క్రింద పడుకునేది. తెల్లవారుఝామున లేచి చెరువుకు వెళ్ళి నీళ్ళు తెచ్చి గంగాళాలు నింపేది. రావూరిప్రసాద్ తల్లి స్వరాజ్యలక్ష్మి కూడా గజేంద్రమ్మతో కలసి అమ్మకు నీళ్ళు తెచ్చేది. ప్రసాద్ తండ్రి నరసింహం గారు ముక్కోటి ఏకాదశి నాడు అమ్మ నామం చేస్తూ అమ్మపాదాలపై వాలిపోవటం చూసిన గజేంద్రమ్మ అలా పోవాలయ్యా! అంటుండేది. అందుకే నేమో 20.11.2007 ఏకాదశనాడే తెల్లవారుఝామున (అమ్మ పుట్టింది తెల్లవారుఝామున) అమ్మలో కలిసిపోయింది.

గజేంద్రమ్మ వాళ్ళు పొలాల్లో పనిచేసి వస్తే వచ్చినవాళ్ళకి అమ్మ ప్రసాదాలు తన చేతితో తినిపించింది. మామూలుగా గజేంద్రమ్మ వంటచేసుకొనే తినేది. చివరిదాకా అంతే. చేసుకోలేని రోజులలో బ్రహ్మాండం శేషు తగు ఏర్పాటు చేసేది. అందరిల్లు డాబాకట్టే రోజులలో ఇసుక లారీలతో పాటు వెళ్లి ఇసుక తెచ్చేది. తట్ట నెత్తిన పెట్టకొని ఇటుకలు మోసేది. అమ్మకు మామిడికాయలు నివేదన చేయటమంటే గజేంద్రమ్మకు ఇష్టం.

రవి, సుబ్బారావు, కేశవవర్మ, మహాదేవశాస్త్రి, పొన్నూరు రవి, నేను గజేంద్రమ్మ ఇంటి ముందు కూర్చొని రేడియోలో క్రికెట్ మాచ్‌లు, పద్యాలు పాటలు వింటుండేవాళ్ళం. గజేంద్రమ్మ ఇల్లే కుర్రకారు అందరికీ విడిది గృహం. నాన్నగారు అప్పుడప్పుడు అక్కడకు వచ్చి ఏమిటర్రా! అందరూ ఇక్కడకు చేరారు అంటుండేవారు.


గజేంద్రమ్మకు సంస్థలో ఏ వస్తువైనా వృధా చేస్తుంటే సహించేది కాదు. వస్తువు జాగ్రత్త చేయకపోతే మందలించేది. అరిచేది. సంస్థకు కాపలాదారుగా ఉండేది. బ్రహ్మాండం సుబ్బారావు సరదాగా అందరిమీద పాటలు వ్రాస్తూండేవాడు. గజేంద్రమ్మ గట్టిగా అరవటం చూచిన సుబ్బారావు "లేచింది గజక్క గొంతు, దద్దరిల్లింది ఆవరణమంతా" అని వ్రాసి సిరిగిరి సుబ్బారావు చేత పాడిస్తుండేవాడు. ఆ రోజులలో సరదాగా వుండేది. నాన్నగారి పట్ల ఆ కుటుంబం పట్ల ఎనలేని గౌరవము. ప్రేమ గజేంద్రమ్మకు.

హైమ (దేవత) ఎక్కడకైనా ఊరు వెళ్ళితే అమ్మ గజేంద్రమ్మను, కృష్ణవేణమ్మను తోడు ఇచ్చి పంపేది. ఒకసారి హైమకు ఏదో అనారోగ్యం చేయగా గోవిందరాజు దత్తాత్రేయ శర్మగారు హైమను గుంటూరుకు తెచ్చారు. వారితో గజేంద్రమ్మ, కృష్ణవేణమ్మ వచ్చారు. హైమతో నాకున్న సాన్నిహిత్యం వల్ల మా ఇంటికి హైమను తీసుకెళ్తానండీ అని అడిగాను. ఆరోగ్యం బాగయ్యే దాకా ఎక్కడికీ పంపించేదిలేదన్నారు. తర్వాత చివరలో మాయింటికి తీసుకెళ్ళటానికి అనుమతించారు. గజేంద్రమ్మ హైమ ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధాసక్తులు తీసుకునేది. అలాగే మరొకసారి శిష్ట్లా దక్షిణామూర్తి భార్య అన్న పూర్ణావాళ్ళింటికి వచ్చినపుడు కూడా గజేంద్రమ్మ వెంట ఉండి నా అభ్యర్థన మన్నించి మాఇంటికి హైమను తెచ్చింది. నా పట్ల మా కుటుంబం పట్ల గజేంద్రమ్మకు వాత్సల్యం ఉండేది. బయటకు కరుకుగా మాట్లాడే గజేంద్రమ్మ హృదయం వెన్నపూసవలె మెత్తన, నిక్కచ్చి మనిషి.

బ్రహ్మాండం సుబ్బారావు పిల్లలపట్ల గజేంద్రమ్మ అత్యంత శ్రద్ధ కనబరచేది. రవి కుటుంబ క్షేమసమాచారాలు నిరంతరం కనుక్కుంటుండేది. నే నెపుడు జిల్లెళ్ళమూడి వెళ్ళినా మా అబ్బాయి రాలేదా? అని రవిని గూర్చి వాకబు చేసేది. ఏమైనా జిల్లెళ్ళమూడి వినీలాకాశంలో ఒక ధృవతార రాలింది. ఒక దివ్యజ్యోతి అమ్మలో కలసిపోయింది.

జిల్లెళ్ళమూడి అందరింటికి నాలుగు స్థంభాలుండేవి. వాళ్ళు లక్ష్మీనరసమ్మగారు, అందరమ్మమ్మ, కృష్ణవేణమ్మ, గజేంద్రమ్మ అని సరదాగా అనుకుంటుండేవాళ్ళం తొలిరోజుల్లో. ఇప్పుడు నాలుగో స్థంభం కూడా ఊడిపోయింది భౌతికంగా – "ఏడవ మైలులోని స్వర్ణోత్సవ సింహద్వారం ఊగుతున్నదమ్మా?' అంటే అమ్మ 'అవును నా శరీరంలా' అన్నది. అవును ఈనాడు గజేంద్రమ్మ కూడా భౌతికంగా శరీరం వదిలినా అమ్మలో లీనమై అమ్మ అతిమానుష దైవిక సాధానిక మూలస్థంభంగా చేరి ఉంటుంది.

అమ్మను, జిల్లెళ్ళమూడి సంస్థను తను, మన, ధనాలతో సేవించి తరించిన ధన్యజీవి గజేంద్రమ్మ.



32. నదీరా

1934లో తూర్పుగోదావరిజిల్లా ముమ్మిడివరంలో నవుడూరి వీరభద్రం-రత్నమాణిక్యమ్మల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించినవాడు శ్రీ నదీరా, బాలయోగి జన్మించిన ముమ్మిడివరంలోనే ఈకవియోగి, కీర్తనా నిర్మాణయోగి జన్మించడం యాదృచ్ఛికం అని అనలేము. అమ్మ అనురాగ రాగం ఆరూపంలో ప్రస్ఫుటమైంది.

మాతృసంకీర్తనాచార్యుడు మన్నవ బుచ్చిరాజుశర్మ (రాజుబావ) అయితే, ఆ సంకీర్తనా సామ్రాజ్యానికి క్రొంగొత్త తళుకులద్దినవాడు నదీరా. తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకట సోమసుందరశర్మ. మరి "నదీరా" అనే పేరెలా వచ్చింది. అది అతని కలం పేరుగా ఎలా రూపుదాల్చింది. విచిత్రమైన విషయం నవకవితాదీక్షా రాజే నదీరా అయినాడా! నటరాజ దీపిక శబ్దారామమే నదీరాగా రూపుదాల్చిందా! కాదు కాదు నదీరా అనే పేరు ఎలా వచ్చిందో ఒక విషయం ద్వారా తెలిసింది.

విజయవాడ లయోలా కాలేజిలో ఇతను చదువుకొనే రోజులలో కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు వీరికి తెలుగు పాఠాలు చెప్పేవారు. ఒకసారి వ్యాసరచన పోటీలు పెడితే ఇతను వ్రాసిన 'అనార్కలీ' వ్యాసానికి ప్రథమ బహుమతి వచ్చింది. అనార్కలీ అసలు పేరు 'నాదిరా'. ఆస్ఫూర్తితో కొద్దిగా ఆపేరును సంస్కరించుకొని తన కలం పేరు 'నదీరా'గా పెట్టుకున్నాడు. నిజానికి కరుణశ్రీ పేరు, శ్రీ శ్రీ పేరు వాళ్ళ పేర్ల కన్నా ఎంత ప్రఖ్యాతి కాంచాయో ఇతని పేరుకన్నా ఈ నదీరా పేరే లోకంలో స్థిరపడిపోయింది.

నదీరా అమ్మను గూర్చి 1970లో విన్నాడు. సుప్రసిద్ధ వ్యాపారవేత్తలు శ్రీ ఆకెళ్ళ శ్రీరామమూర్తిగారు (ఏ.ఎస్. ఆర్. మూర్తి), శ్రీ జి.కె. రావుగారు అమ్మవద్దకు వచ్చే సోదరులు. ఇతని పాటలు, ఇతని మాటలు ఇతను వ్రాసిన బుఱ్ఱకథలు విన్న ఆసోదరులు అమ్మ జీవిత చరిత్ర కూడా బుఱ్ఱ కథగా వ్రాయిస్తే బాగుంటుంది. అనుకున్నారు. మాతృశ్రీ జీవిత మహోదధిలో తరంగాలు పుస్తకాన్నిచ్చి బుఱ్ఱకథగా వ్రాయమని కోరారు. అప్పటికి నదీరా అమ్మను చూడలేదు. అయినా అనతికాలంలోనే అమ్మ చరిత్రలోని కొన్ని ఘట్టాలను ఏరుకొని బుఱ్ఱకథగా మలిచాడు. నదీరా కన్నా భౌతికంగా నదీరా వ్రాసిన బుఱ్ఱకథే అమ్మ ముందు గానం చేయబడింది.

"ఈశ్వరుని కన్ను కన్న- కవీశ్వరుని పెన్ను మిన్న

ఇంద్ర చంద్రపదవులే- కవీంద్ర పదవి కన్న చిన్న" అన్న నదీరా మాటలు అక్షర సత్యాలై నిలిచాయి.

అతని బుఱ్ఱకథ రచనా పద్ధతి, మిత్రులు పాడిన తీరూ విని, అక్కడున్న ఆనాటి సోదరీ సోదరులంతా "నిరుపమ కవితాగానం- నిర్మలగంగా స్నానం. మహిమాన్విత కవితాదరణం- మాతృమూర్తి కరుణావరణం" అనుకున్నారు.

అమ్మ కారుణ్యం నదీరాపై ప్రవహించింది. కొద్దికాలానికే అతడు జిల్లెళ్ళమూడి చేరాడు. అమ్మవాత్సల్య గంగలో స్నానం చేశాడు. పుంఖాను పుంఖంగా గీతాలు వ్రాశాడు. 1971లో మొదటిసారిగా అమ్మవద్దకు వచ్చిన నదీరా తరచూ అమ్మను చూడటానికి కుటుంబంతో సహా హైదరాబాద్ నుండి వచ్చిపోతూ ఉండేవాడు. 1973లో అమ్మ స్వర్ణోత్సవాల అనంతరం జిల్లెళ్ళమూడి సకుటుంబంగా వచ్చి ఒక సంవత్సరంపాటు జిల్లెళ్ళమూడిలోనే ఉన్నాడు. అమ్మ సమక్షంలో నిత్యకళ్యాణం, అన్నప్రాశనలో, అక్షరాభ్యాసాలో, ఉపనయనాలు, పెళ్ళిళ్ళు, సీమంతాలో, హేమంతాలో ఒకటేమిటి అన్నీ పండుగలే' సంప్రదాయంగా జరిగే ఉగాదులు, అమ్మ జన్మదినోత్సవాలు, అమ్మ కళ్యాణ దినోత్సవాలు, దసరాలు, దీపావళి, వంటి పండుగలన్నీ కన్నులారా చూచాడు. పెన్నులారా వాటిపై గీతాలు వ్రాశాడు. అమ్మకు నివేదించాడు. అతడు వ్రాయటమే కాదు అతడి పాటలన్నీ సద్యః ప్రసారంగా పాడబడేవి కూడా. శబ్ధసౌందర్యం, రాగతాళజ్ఞానం కలిగినవాడు కావటం వల్ల నదీరా పాడి వినిపించేవాడు. ఇతడు వ్రాసిన పాటలు కొన్ని అమ్మ సినిమాలో కూడా చిత్రించబడ్డాయి. శ్రీరావూరి ప్రసాద్, మల్లాప్రగడ సీతారామాంజనేయులు గారి కూతురు (లక్కరాజు) విజయ ఎంతో మధురంగా పాడి వినిపించే వారు అందరికీ. సినిమాలో సుప్రసిద్ధ ప్లేబాక్ గాయని జానకి, ఇంకా ఎందరో గాయనీ గాయకులు ఇతని పాటలు పాడారు. పాడేకొద్దీ, క్రొత్తపాటకూ- వాడే కొద్దీ కత్తిపీటకూ పరువం పదునూ ఎక్కుతుందని అతని విశ్వాసం. అక్షరం అక్షరం కలిస్తే మంత్రమూ, కలమూ గళమూ కలిస్తే మంత్రపుష్పము

అవుతుందని అతని నమ్మకం. వివిధ రాగతాళాలలో, విభిన్న వినూత్న బాణీలలో గాయకులకు తీర్చిదిద్ది పాడించేవాడు. అమ్మ బుఱ్ఱకథను రెండు జట్లుగా తయారుచేశాడు. రావూరి ప్రసాద్, రావూరి లక్ష్మీనారాయణ, జొన్నాభట్ల రాము ఒక బృందంగా– రావూరి వాణి, కొమరవోలు కుసుమ, కొమరవోలు రవి ఒక బృందంగా తయారయ్యారు. లక్షమందికి ఒకే పంక్తిన తన స్వర్ణోత్సవాలలో భోజనం పెట్టిన అమ్మ కోటి మందికి దర్శనం ప్రసాదించటానికి బయలుదేరిన సందర్భంగా ఈరెండు బృందాలు అమ్మ దర్శనం ఇవ్వటానికి ముందు బుఱ్ఱకథను గానం చేసేవి. కొన్ని సందర్భాలలో నదీరా పాల్గొన్న సన్నివేశాలున్నాయి. వాల్మీకి రామాయణానికి కుశలవుల కంఠాలుతోడై గానం చేసినట్లు నదీరా పాటలకు ఈ సోదరసోదరీ బృందాలు వన్నె చేకూర్చాయి.

అమ్మ స్వర్ణోత్సవాలు జరిగి దాదాపు మూడు దశాబ్దాలు గడుస్తున్నా ఈ నాటికీ **'అటు జనములు ఇటు జనములు ఎటు చూచిన యోజనములు– జనగణముల భోజనములు– జననికి నీరాజనములు"** – **ఉదయమిదే మాతృశ్రీ స్వర్ణోత్సవ మహోదయమిదే శుభోదయం– సుధామయం– మాతృశ్రీ స్వర్ణోత్సవ మహోదయమిదే** అంటూ నదీరా వ్రాసిన పాటలు ఇప్పటికీ చెవులలో రింగుమంటూనే ఉంటాయి. ఇక ఆయన వ్రాసిన **"అన్నదాతా! సుఖీభవ– అనసూయ మాతా సుఖీభవ– జన్మదాతా జయీభవ విజ్ఞానప్రదాత విజయీభవ"** అన్న పాట నిత్యం అందరి నోళ్ళల్లో నానుతూనే ఉంటుంది.

వెలలేని దేవతవు కద తల్లీ! వెదజల్లి వైతు నీ కథలల్లీ" అంటూ **"పచ్చడి మెతుకుల తిన్న ఒక్క దినమే– పచ్చటి బ్రతుకులయిపోవు ఆ క్షణమే" "అమ్మ శకమిక మొదలు– నిత్యకల్యాణము పచ్చతోరణము"** అంటూ అమ్మ శకానికి నాంది పలికారు నదీరా.

ఇక అమ్మ సినిమాలో నదీరా వ్రాసిన పాటలు గానం చేయబడ్డాయి. అందులో సుప్రసిద్ధమైన హైమాలయం పాట నిజంగా హైమకు ప్రతిరూపమా అన్నట్లు, హైమను మన కళ్ళకు కట్టిస్తున్నట్లు ఉంటుంది. **"అల్లదే హైమాలయం అది చల్లని దేవాలయం– పవిత్ర ప్రేమవిరాజితం ప్రపుల్లశాంతి మహార్ణవం– మూర్తిల్లిన ప్రేమ మృత్యుంజయ హైమ – సిద్ధిపొందిన దివ్యసీమ శిల్పమై నిలచినది హైమ– అచటి రాళ్ళలో అన్ని అణువులు అమ్మ రాల్చిన అశ్రుకణములు– మలచినట్టి అన్ని శిలలు మానవుని కన్నీటి అలలు – పుణ్యముల పుట్టిల్లదే పున్నమి వెన్నెల జల్లదే"** అన్న ఆ పాట ఎంత కఠినహృదయుని చేత కూడా కన్నీరు పెట్టిస్తుంది. అది అతని గుండె నుండి ఉబికిన కన్నీటిపాట. అంతేకాదు హైమను **"అమ్మగన్న హైమావతీ– అమ్మ కన్న దయామతీ"** అంటారు. ఎంత గొప్పభావన.

ఇక అమ్మ అద్వైత స్థితిని తాను దర్శించిన తీరు వర్ణిస్తూ నదీరా ఒక విచిత్రమైన అనుభవాన్ని "కనుగొంటినా లేక కలగంటినా- కనులు మూసుకొంటినా కనులు తెరిచి యుంటినా- క్రాసును కన్నాను మా ఏసన కున్నాను- అవును మరి అమ్మ అక్షరాల మరియమ్మ- అలా నేను చూశా అల్లాఅని కేకేశా- మోజుతీర చూశా నమాజు కూడా చేశా - చంద్రముఖి అనుకొంటిని చతుర్ముఖుని కనుగొంటిని. అమ్మ కాదు బ్రహ్మ పరబ్రహ్మమే" అంటూ అమ్మను మేరీగా, అల్లాగా, బ్రహ్మగా వీటన్నింటినీ మించిన పరబ్రహ్మగా దర్శించిన నదీరాను ఏ కోవలోకి చేర్చాలి.

అమ్మను అన్నపూర్ణతో పోలుస్తూ 'కాశీలో రాతివలె ఈ అన్నపూర్ణ కదలదు మెదలదు ఎవ్వరేమన్నా- రాతిరూపును విడిచి నాతిరూపున నడచి' వచ్చింది. ఈ రూపంలో అంటూ "అన్ని దానములయందు అన్నదానమె ముందు అక్షయమ్మదియేను అమ్మ సన్నిధియందు" అంటాడు. "అమ్మా! నేనిన్ను వీడనే అన్యుల వేడ" అని గుండెదిటువుగా పలుకుతూ తాను ఎవరో తను తెలుసుకున్నట్లుగా "రాగమాలికల రాముని కొలిచిన - త్యాగరాజునకు తమ్ముడనమ్మా! అన్ని యెడల గోవిందుని కొలిచిన అన్నమయ్య నా అన్నయెనమ్మా" అంటూనినువరించె నా కవితా కన్య తను తరించె ఎంతైనా ధన్య" అని తన తృప్తిని ఆనందాన్ని వ్యక్తపరుస్తాడు.

1980లో అతడొకరోజు అమ్మను చూడటానికి వచ్చాడు. అప్పటికే ఏదో రైలు ప్రమాదంలో అతని ఎడమ చెయ్యి తెగిపోయింది. రక్తం కారుతూ తెగిన చేయిని తీసుకొని డాక్టర్ల దగ్గరకు వెళ్లాడు. వాళ్ళు దానిని అతికిస్తారేమోననే ఆశతో. కాని వాళ్ళవల్ల కాలేదు. ఆ గాయం నయమయిన తర్వాత హైదరాబాద్ నుండి జిల్లెళ్ళమూడిలో అమ్మ సన్నిధికి వచ్చి అమ్మ ప్రక్కన అమ్మకు పూజచేయిస్తున్న రామకృష్ణన్నయ్య ఎడమచేతిని తన కుడిచేతితో తీసుకొని ఆ రెండు చేతులతో నమస్కారం చేస్తూ! అమ్మా నీకు నమస్కారం చేయటానికి వెయ్యి చేతులు కూడా చాలవు. కానీ నేను నారెండు చేతులతో కూడా నమస్కారం చేసే స్థితిలో లేనమ్మా! అని అమ్మతో చెబుతూ అమ్మ ఒడిలో వాలిపోయాడు. ఆ బిడ్డను చూచి అమ్మ కన్నీరు కార్చింది. తలనిమిరి ఒళ్ళు తడిమింది. ఆ సన్నివేశాన్ని చూచిన అక్కడి సోదరీసోదరులంతా కన్నీరు కార్చారు.


"లాలిమా కన్నతల్లీ! లాలి శ్రీ కల్పవల్లీ! పండు వెన్నెల పరుపు బాలీసులను వేసి- కొండపై జాబిల్లి గొడుగు పట్టెను నీకు" అంటూ లాలి పాటతో అమ్మను నిద్రబుచ్చిన నదీరా అమ్మను మేలుకొలుపుతూ "నీ ఒడిలో బాలుండె నింగిలో భానుండు నిత్యబాలెంతరో! మేలుకో! నీ వాకిలికి వస్తే నా ఆకలికి స్వస్తి నివ్వాళి తల్లిరో మేలుకో! నిఖిల లోకములన్ని నీ ముద్దు మోమెదుట నిలువుటద్దములాయె మేలుకో!" అంటాడు

ఎంత గంభీరమైన భావాలు! ఎంత లోతైన భావాలు! సృష్టి అంతా అమ్మకు ప్రతిబింబమే కదా!

అమ్మను మేల్కొల్పటమే కాదు "రండి రండి జిల్లెళ్ళమూడి లెండి లెండి నిద్రను వీడి. అన్నలారా రెండు కన్నులారా మీరు అమ్మను కంటారు అమ్మవారంటారు " వేడగనేల ప్రేమదైవమును చూడరిదేలా? అంటూ లోకాన్నంతా అమ్మ ఒడిలోకి రమ్మని నిద్రలేపుతాడు- ఉత్తిష్ఠిత- జాగ్రత్త ప్రాప్యవరాన్నిబోధత అనే వేదవాక్యాలను లలిత లలితమైన గీతాలలో అలవోకగా పలికిన శ్రీ నదీరా ధన్యుడు. తాను ధన్యుడు కావటమే కాక మనల్నందరినీ ధన్యులను చేశాడు.

దురదృష్టమేమిటంటే భార్య సత్యవరలక్ష్మిని తోడులేని ఒంటరిని చేయటమే కాదు తన బిడ్డలు బంగారు శ్రీనివాసు, బంగారు పద్మావతి, వెంకట ఉషలను తండ్రి లేని పిల్లలను చేశాడు. సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్‌గా బిహెచ్‌ఇయల్‌లో పని చేసిన నదీరా తనవారందరినీ సెక్యూరిటీలేని వారిని చేశాడు- జిల్లెళ్ళమూడి అందరింటికి ఒక వాగ్గేయకారుడు లేకుండా పోయడు. 14.2.2007న అమ్మలో కలిసిన నదీరా చిరంజీవిగా మన హృదయాలలో నిలచే ఉన్నాడు.

నవనీతం కవితాదీక్ష- నవనవరాగాపేక్ష
నదీ రాగ రమణీయ శృతి- నదీరా గీతాకృతి
అను ప్రాసతో క్రీడ అతడు కవితాప్రౌఢ
శబ్దాలవి కరిగిపోయి అతని చేతి శిల్పాలాయె
అతని చేతి గీతలు పంచదార చిలకలు
నలుగురి నోళ్ళలో, నానెను, దిగంతాలు ఎగబ్రాకెను
భాషాబలమే కాదు మాతృభావ బలంబే
మనస్సే ధనస్సుగా భావాలే బాణాలుగ పయనించే కళా నిగారం
అతడొక కవితా నాగారం.
తెలుసుకోండి కుతిదీరా- అతడే అతడే మన నదీరా!
నదీరా- నదీరా- నదీరా.



33. విద్యాసాగర్ - రవి

పోతుకూచి ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌గారు బాపట్లలో ఉండేవారు. జిల్లెళ్ళమూడి మున్సబు రామయ్యగారు, విద్యాసాగర్‌గారి కొట్లో అప్పుపెట్టి బట్టలు తెచ్చుకొనేవారు. ఆ బాకీ వసూలు చేసుకోవడానికి జిల్లెళ్ళమూడి వెళ్ళుంతుండేవారు విద్యాసాగర్‌గారు. మున్సబుగారు అమ్మను గూర్చి చెప్పి మహాత్మ్యం ఉన్న తల్లి అని, చూచి వెళ్ళమన్నారు. కాని సాగర్‌గారు అమ్మను చూడలేదు.

సాగర్‌గారి పెద్ద కుమారుడు రవి 'హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్‌తో, ఆయాసంతో బాధపడుతుండేవాడు. చాల తెలివిగలవాడు. చదువులో బాగా చురుకుగా ఉండేవాడు ఐ.ఎ.ఎస్. పాసై కలెక్టర్ కావాలని అతని కోరిక. అలాగే సాగర్‌గారి పెద్ద కూతురి జ్యోత్స్న కూడా తెలివిగల పిల్ల. యం.బి.బి.యస్ చదివి డాక్టరు కావాలని ఆ అమ్మాయి కోరిక. రవి జబ్బు నయం చేయించటానికి చాల మంది వైద్యులకు చూపించారు. అట్టే గుణం కనుపించలేదు. హైదరాబాద్‌లో ఎవరో ప్రకృతి వైద్యం బాగా చేస్తారని స్థానం పార్థసారథిగారు చెబితే ఆ వైద్యం కూడా చేయించారు. ఏమీ నంగుణం కనుపించలేదు.



సాగరుగారి భార్య రాజ్యలక్ష్మమ్మగారు (సుప్రసిద్ధ స్వాతంత్ర్య, సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్రోద్యమంలో 60 రోజులపై చిలుకు నిరాహార దీక్ష చేసినవారు. మహాత్మాగాంధీ అనుయాయులు అయిన స్వామీ సీతారాంగారి కుమార్తె) అమ్మను గూర్చివిని ఒకసారి అమ్మను దర్శించి రమ్మని సాగరుగారికి పదేపదే చెప్పింది. సరేనని ఒకసారి ఆమె పోరుపడలేక జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను దర్శించుకున్నారు. చీకటిపడటంతో రాత్రికి ఆగమన్నది అమ్మ. కాని 'వెడతానమ్మా' అన్నారు సాగరుగారు. అంతలో ఐదునిమిషాలలో కుండ పోతవర్షం కురిసింది. ఇప్పుడు వెళతావా? అన్నారు అమ్మ. వెళ్ళను అని రాత్రి అక్కడే ఉన్నారు. సాగరుగారికి కావలసిన గోధుమన్నము చేయించి పెట్టింది అమ్మ. ఉదయమే బయలుదేరి అమ్మను దర్శించి తిరుగు ప్రయాణం అయినారు. ప్రతి శుక్రవారము వచ్చి అమ్మను దర్శించాలి అనుకున్నారు. కాని 58 శుక్రవారాలు అమ్మను దర్శించలేకపోయారు.

ఒకసారి రవి, జ్యోత్స్నలను తీసికొని జిల్లెళ్ళమూడి వెళ్ళారు. రవి ఆరోగ్యం సంగతి జ్యోత్స్న చదువు సంగతి అడిగారు. జ్యోత్స్నకు వాళ్ళ నాన్న చదివించలేరేమోనని భయం. అమ్మ వాళ్ళను లాలించి "నీ చేతి ఇంజక్షన్ నేను తీసుకుంటానమ్మా" అన్నది జ్యోత్స్నతో. కాబట్టి జ్యోత్స్న చదువుకు ఇబ్బంది ఉండదు సాగుతుంది. యం.బి.బి.యస్. సీటువస్తుంది చదువుతుంది అనే ధైర్యం వాళ్ళకు కలిగింది. ఇక రవి ఆరోగ్యం విషయంలో అమ్మ "ఈ అనారోగ్యంతో వాడేం చదువుతాడు. పై చదువుల ఆశవద్దు, నా దగ్గరే ఉంచండి" అన్నది. మొత్తం మీద వాళ్ళు తర్వాత ప్రతి శుక్రవారం అమ్మ వద్దకు కుటుంబ సహితంగా రావటం, వెళ్ళటం కొంత కాలం జరిగింది. రవి జిల్లెళ్ళమూడి చేరి చప్పిడి ఆహారం తింటూ, అమ్మ వద్ద ఉండేవాడు. కొంతకాలానికి బాపట్లలో జరుగుబాటుకు ఇబ్బంది రావటంతో సాగరుగారి కుటుంబాన్ని జిల్లెళ్ళమూడి వచ్చి ఉండమన్నది అమ్మ. ఆ విధంగా ఒక కార్తీక పౌర్ణమినాడు సాగర్‌గారి కుటుంబం (ఇద్దరు మొగపిల్లలు, ఆరుగురు ఆడపిల్లలతో) అంతా జిల్లెళ్ళమూడి చేరారు.

అమ్మ వద్ద సేవ చేసుకుంటూ కాలం గడిపేవారు. అమ్మకు కావలసిన నీళ్ళను చెరువు బండి మీద తోలుకు రావటం సాగరుగారి పని. లక్ష్మీనరసమ్మ గారికి తోడుపడుతూ వంట ఇంట్లో భోజనాలు పెట్టటం సాగర్‌గారి భార్య

రాజ్యలక్ష్మమ్మగారి పని. ఆడపని మగపని అని తేడా లేకుండా వరి కుప్పలు పోయటానికి, ఇసుకలారీలపై పోయి ఇసుక తేవటానికి, ఇల్లుకట్టేటప్పుడు సిమెంటు బొచ్చెలు మోయటానికి, కుప్పలు నూర్చటానికి ఒకపని అని లేదు అన్ని పనులకు పిల్లలందరూ వెళ్ళి చేసేవారు.

రవి మాత్రం బాపట్ల మాతృశ్రీ ప్రింటర్స్‌లో కంపోజింగ్, బైండింగ్ పనులు చేసేవాడు. రావూరి నర్శింహమూర్తిగారు 'పెద్దోడా' అని పిలుస్తుండేవారు. రవి ప్రెస్‌లో పనిచేసే రోజుల్లో- జ్యోత్స్న యం.బి.బి.యస్. చదువుతున్న రోజులలో అమ్మ చాలసార్లు చాలా రకాలుగా వారికి అండదండలు అందిస్తుండేది.

1962లో సాగర్‌గారు ఆయన పుట్టినరోజునాడు హిందూస్తానీ బాణీలో 24గంటలు అమ్మ నామం ఏకాహం చేశారు. అమ్మ ఎంతో మెచ్చుకున్నారు. సాగర్‌గారు, పింగళి కాటూరులు వ్రాసిన "సౌందనందము"లోని పద్యాలు కూడా హిందూస్థానీ బాణీలో పాడేవారు. నాన్నగారు ఎంతో మెచ్చుకొనేవారు, అమ్మ ఆనందించేది.

ఒకసారి రవి ఓంకార నదిలో (జిల్లెళ్ళమూడి ఊరి ప్రక్కన ప్రవహించే డ్రెయిన్) పడి కొట్టుకు పోతున్నారు. ఈతరాదు. అయినా అమ్మను తలచుకుంటూ నమస్కారం చేశాడు. అంతే ఒడ్డుకు కొట్టుకొని వచ్చాడు.

మరొకసారి ఝాన్సీకి పెద్ద ప్రమాదం జరిగింది. కాలువ దగ్గర ఉన్న మోటార్ ఇంజనులో ఝాన్సీ తల జుట్టు ఇరుక్కొని పోయి చర్మంతో సహా లేచి వచ్చింది. ఝాన్సీ బ్రతుకుందో లేదో అనే అనుమానంతో గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో చేర్చారు. అమ్మ కరుణ ఆ కుటుంబంపై అపారంగా ఉన్నది. ఝాన్సీ తేరుకున్నది. సంస్కృత భాషా ప్రవీణురాలై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ సాధించి జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీలోనే రీడర్‌గా పనిచేస్తున్నది.

జిల్లెళ్ళమూడిలోనే సాగర్‌గారి ఆడపిల్లలందరికీ పెళ్ళిళ్ళు జరిగి సుఖ సంతోషాలతో ఉంటున్నారు.

34. గొల్లనాగమ్మ

అమ్మను భౌతికంగా తల్లీతండ్రి కంటే కూడ ముందుగా చూచిది గొల్లనాగమ్మ. ఎంత అదృష్టవంతురాలు. మన్నవలో మంత్రసాని అమ్మకు పురుడు పోయడంలోనే ఆమె భాగ్యం తెలుస్తున్నది. ఎందుకంటే అవతారమూర్తులు తమ అవతరణకు ముందుగానే తమ పరివారాన్ని వాళ్ళు ఆవిర్భవించే చోటికి పంపుతారట. అలాగే నాగమ్మ కూడా వచ్చింది. అసలు ఈ నాగమ్మ- నాగేశ్వర శబ్దాలతో అమ్మకు అనుబంధం ఎక్కువ. శాస్త్ర చర్చలోకి పోను, పోతే చెప్పాల్సింది చాలా ఉన్నది.

అమ్మ భూమి మీదకు నాగమ్మ చేతుల మీదగానే వచ్చింది. బొడ్డుకోయడానికి చాకు పట్టుకుంటే ఆ చాకు అతి పొడవుగా త్రిశూలం మాదిరిగా మెరుస్తూ కనుపించింది. ఆమెకు. చేతికి అమరనంత పెద్దదైంది. బొడ్డులోని బుడువు శంఖంలాగా కనిపించింది. తరువాత కొద్ది సేపటికి బొడ్డు కమలం లాగా కోమలంగా ఆ కమలంలో ఒక దివ్యతేజోమయ రూపిణి సర్వాభరణ భూషితయై ఉన్నది. కమలంలో ఉన్న రేకులు అందులోని ఆ రూపము గిరగిరా తిరుగుతూ ఉన్నాయి. తనకళ్ళు తిరుగుతున్నయ్యేమో నని కళ్ళుమూసుకొని కూర్చుంది కాసేపు. తరువాత కళ్ళు తెరిచి మామూలుగా బొడ్డుకోసింది. కాని మంత్రసాని నాగమ్మ మనస్సు మాత్రం ఇంతకు క్రితం తనకు కనిపించిన ఆ అమ్మవారి రూపం మీదనే లగ్నమైంది.

కొంతసేపటికి రంగమ్మ అమ్మమ్మతో మంత్రసాని నాగమ్మ అమ్మకు పాలిమ్మని చెప్పితే అమ్మమ్మ "నా పాలు పాపాలు నాగాం" అంటుండగా 'ఇప్పటికియ్యమ్మా! తరువాత నే పెంచుతాను' అంటుంది నాగమ్మ. తెలిసి అన్నా తెలియక అన్నా నాగమ్మ అమ్మను పెంచి పరమాత్మకు యశోద అయ్యే అదృష్టాన్ని పొందింది. నాగమ్మే అమ్మకు రోజూ ఉగ్గు బెట్టటం. పాలివ్వటం చేస్తుండేది. మూడు నెలలు గడచింతర్వాత అమ్మ తాతమ్మ మరిడమ్మగారు నాగమ్మతో "నీవే పిల్లను మీఇంటికి తీసుకెళ్ళి కనిపెట్టుకొని ఉండు. పాలిస్తూ నీళ్ళుపోస్తూ రోజూ ఒకసారి తీసుకొని వచ్చి చూపించి వెళ్ళు. వాళ్ళ అమ్మా, నాన్నలకు ఈ పిల్ల ఉన్న సంగతే పట్టడంలేదు" అని చెప్పింది. ఆ రోజు అమ్మచేత ముద్దకుడుములిప్పించే వేడుకలో అమ్మ చేతులకు నల్లగాజులు వేయించారు. గొల్ల అంటూ అంతా నవ్వుతుంటే గొల్లయింటికే

పోతున్నదిగా అని అమ్మమ్మ దుఃఖంతో అంటుంది.

నాగమ్మ మేళతాళాలతో బంధువులతో పెట్రోమాక్సులైటు వెలుతురులో అమ్మను వైభవంగా వేడుకతో వాళ్ళింటికి తీసుకొని వెళ్ళింది. నాగమ్మ వాళ్ళ ఇంటి ముందుకు పోగానే పెద్ద త్రాచుపాము పడగ విప్పి ఆడుతూ అమ్మ ముందుకు వచ్చి పడగ వంచి సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లుగా నేలపై పడుకుంది. అందరు కర్రలు తీసుకొని దాన్ని చంపటానికి వచ్చారు. పాము తళక్కున మెరసి అదృశ్యమైపోయింది.

నాగమ్మ అమ్మను తన ఇంట్లోకి తీసుకొనివెళ్ళి నులకమంచం పొత్తిగుడ్డల మీద పడుకోబెట్టింది. అమ్మ ఏడవడం మొదలు పెట్టే సరికి నాగమ్మ ఇంటి ముందు ఉన్న గంగరావి చెట్టుకు తన చిరిగి పోయిన చీరెతో ఉయ్యాల వేసి పడుకోబెట్టితే అందులో హాయిగా నిద్రపోయింది. "ఈ చిరిగిపోయిన చీరే నీకు సుఖంగా ఉందా" అని నవ్వు కుంటుంది నాగమ్మ.

అమ్మకు ఎనిమిది నెలలప్పుడు ఒకసారి నేలమీద పారాడుతూ, పారాడుతూ నాగమ్మ తింటున్న కంచంలోని ఎంగిలి మెతుకులు నోటిలో పెట్టుకుంది. అదే అమ్మకు అన్నప్రాశన. 15 నెలలపాటు నాగమ్మ ఈ విధంగా అమ్మను తన చేతుల మీదుగా పెంచింది. నాగమ్మ కూతురు సుబ్బలక్ష్మమ్మ కూడా అమ్మకు అప్పుడప్పుడు పాలిచ్చేది.


అమ్మమ్మ చనిపోయిం తర్వాత అమ్మకు అయిదేండ్ల ఆరుమాసాలప్పుడు ఒకసారి మన్నవ వస్తుంది. అమ్మ ఎవరింటికి వెళ్ళకుండా సీతాపతి తాతగారి ఇంటి ముందు అరుగుమీద కూర్చుంటుంది. ఎవరు పిలిచినా వెళ్ళలేదు. నాగమ్మ వచ్చి మనింటికి వెళ్ళుదాం రామ్మా! అని అమ్మను ఎత్తుకుంది. ఇంతలో తెనాలి నుండి జానకమ్మగారు (రంగమ్మ అమ్మమ్మ తల్లి)వచ్చి "మేం పిల్లకోసం వస్తే దాన్ని నువ్వెక్కడికి తీసుకెళ్తున్నావు? దించు" అంటూ అమ్మను ఎత్తుకోవటానికి నాగమ్మ దగ్గరకు వచ్చినా అమ్మ నాగమ్మ చంక నుండి దిగకుండా కరచుకొని కూర్చుంది. సరే తీసుకెళ్ళి కాసేపుంచి తీసుకొనిరా అని అమ్మను నాగమ్మతో పంపారు వాళ్ళు.


నాగమ్మ అమ్మను ఇంటికి తీసుకెళ్ళగానే అమ్మ "నీ కూతురు సుబ్బలక్ష్మి ఏది?" అని అడిగి అంతలో పొలం నుండి వచ్చిన సుబ్బలక్ష్మి అమ్మను దగ్గరకు తీసుకొని పాలివ్వబోయింది. అమ్మ త్రాగలేదు. నా తృప్తికోసం త్రాగమ్మా. అని

బతిమాలి పాలిస్తుంది. ఆమెను తరింపచేయటానికి అమ్మ రెండు గ్రుక్కలు త్రాగి నాగమ్మ వంక చూచి నాకు కాసిని నీళ్ళు పొయ్యి అంటుంది. సుబ్బలక్ష్మికి అమ్మ పాలు త్రాగుతుంటే ఆ ఆనందానుభూతి చెప్పనలవి గానిది. ఆ ఆనందాన్ని ఇంకా ఎవరైనా అనుభవించి తరిస్తే బాగుండును అనిపించింది.

తను పసిపిల్లగా ఉన్నప్పుడు తనకెక్కడ నీళ్ళుపోసింది, ఎక్కడ ఉయ్యాల కట్టి ఊపింది అన్నీ వాళ్ళకు చూపించేటప్పటికి అమ్మ జ్ఞాపకశక్తికి తల్లీ కూతుళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

అమ్మ గొల్ల నాగమ్మకు- ఆమె కూతురు సుబ్బలక్ష్మికి అనన్య సామాన్యమైన ఆనందానుభూతిని ప్రసాదించింది. శ్రీకృష్ణుడు యశోదకిచ్చిన ఆనందానుభూతి అది. ఆ తల్లీ కూతుళ్ళిద్దరూ ముగురమ్మల మూలపుతల్లి అయిన అనసూయమ్మకే తమ స్తన్యం ఇచ్చి ధన్యులైనవారు. సేవించి ముక్తులైనారు. అమ్మ ప్రేమ ప్రవాహంలో, మధురానుభూతిలో, లీలలలో తరించారు.





35. లక్ష్మీనరసమ్మక్కయ్య

1960 దశకం ప్రథమ భాగంలో జిల్లెళ్ళమూడిలో అమ్మను చూటటానికి వచ్చిన వారికి లక్ష్మి నరసమ్మక్కయ్యను గూర్చి తెలియని వారుండరు. ఆ రోజుల్లో వచ్చిన వారెవరైన లక్ష్మీనరసమ్మక్కయ్య అన్నపూర్ణాలయంలో 'చింతకాయ పచ్చడి చేసి పెట్టినా, చారుపోసి అన్నం పెట్టినా ఎంతో రుచిగా ఉంటుంది' అనుకొనేవారు. ఎవరైనా అన్నం తినకపోయినా కోపం వచ్చిన బ్రతిమిలాడి, తానువాళ్ళను కోపపడి ప్రేమగా ఆదరణగా అన్నం తినిపించేది. ఎవరి ఇళ్ళలో వాళ్ళు పంచభక్ష్య పరమాన్నాలతో తిన్నా దాని రుచి ఆ చింతకాయ పచ్చడికి ఆచారుకి ఎక్కడ నుండి వచ్చింది? అంటే, తెలుసుకోవటం కష్టమే. అది అమ్మ అమృత ప్రసాదం ఆ ఆహారంలో కలుస్తున్నదో! లక్ష్మీనరసమ్మగారిని అమ్మ అనుగ్రహించిందో ఆమె చేసే పాకంలో ఆ రుచి రావటానికి.

ఆరోజుల్లో ఆమె చేతి అన్నంతిన్న పొత్తూరి వెంకటేశ్వర రావుగారు కాని, చీరాల, గుంటూరు హైదరాబాదుల నుండి వచ్చిన సోదరులు కాని ఇప్పటికీ లక్ష్మీనరసమ్మగారు అప్యాయంగా, ఆదరణగా పెట్టిన ఆ అన్నాన్ని మరచిపోలేరు.

అసలు లక్ష్మీనరసమ్మగారు జిల్లెళ్ళమూడికి రావటం ఒక విశిష్టమైన సంఘటన. అమ్మ నిర్ణయంలో ఒక భాగమేమో అనిపిస్తుంది. వల్లూరు త్రయంబకంగారు అసలు వల్లూరు గ్రామానికి చెందిన వారైనా చిన్న తనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకోవటంతో మేనత్తగారి ఊరైన గుండవరం చేరారు. వారి ఆదరణలో పెరిగి పెద్దవారై ఆ ఊరికి కరణంగా చేశారు. ఆ రోజుల్లోనే లక్ష్మీనరసమ్మగారితో వివాహమైంది. హాయిగా సాగుతున్న కాలంలో కాలపురుషుని కరాళ దంష్ట్రలలో చిక్కుకొని త్రయంబకంగారు అకాలమరణం పాలయ్యారు. ఏడుగురు పిల్లలతో లక్ష్మీనరసమ్మగారు లంగరులేని నావ అయింది. తన సంసారాన్ని రక్షించే ఏడుగడ ఎవరా అని కోటిదేవుళ్ళకు మ్రొక్కుకుంది.

ఆ సమయంలో దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్నట్లుగా ఆ దేవుని దిక్కు చూపించటానికి లక్ష్మీనరసమ్మగారి మరిది వరగాని వాస్తవ్యుడు పాలపర్తి కృష్ణమూర్తిగారు వచ్చారు. ఆయన అమ్మ వద్ద నీ జీవితం వెళ్ళదీయవచ్చు. ఇతరులపై ఆధారపడవలసిన అవసరం లేదు" అని చెప్పారు. ఇతరులపై భారంగా ఉండటం కంటే అదే మంచిదనిపించి ఆయన సలహామేరకు అమ్మనుదర్శించటం జరిగింది.

"ఇక్కడ ఎవరి అన్నం వారికున్నది. ఎవరికి తగ్గపని వారికున్నది" అని చెప్పే అమ్మ లక్ష్మీనరసమ్మగారిని తన అక్కున చేర్చి ఓదార్చింది. ఆదరించింది. అన్నపూర్ణాలయంలో సోదరీ సోదరులకు. ప్రేమగా కడుపునింపే బాధ్యత అప్పగించింది. లక్ష్మీ నరసమ్మగారు ఆ బాధ్యతను ఆనందంగా స్వీకరించింది. శుచిగా, రుచిగా వంటచేయడం అమ్మకు నివేదించటం అందరికీ తృప్తిగా పెట్టడం. అదే అమ్మ సేవగా, భావించింది. అనుకోకుండా అమ్మ ప్రసాదించిన ఈ సేవ తనకు తన బిడ్డలకు కూడా ఆ జీవితాన్నీ, జీవనాన్ని చేకూర్చింది.

ఆ రోజుల్లో అమ్మ ఇచ్చిన అనుభవాలు, అమ్మ చూపించిన మహిమలు అనంతాలు. వాటిని అన్నపూర్ణాలయానికి వచ్చే సోదరీ సోదరులకు వివరిస్తూ అమ్మ యెడల తనకు గల అచంచల విశ్వాసాన్ని తెలియజేస్తుండేది. తన బిడ్డలలో ఒక బిడ్డ మరణించిన అమ్మ స్వీకరించిందని భావించింది.

స్వామి సీతారాంగారి దౌహిత్రుడు పోతుకూచి రవి అమ్మ సన్నిధిలో సేవ చేసుకుంటూ అమ్మలో లీనమైనాడు. ఆ రోజున అమ్మ అతడి అంత్యక్రియలకు

స్మశానానికి వెళ్తూ “లక్ష్మీనరసమ్మక్కయ్య దగ్గర 360 వత్తులు ఉన్నవి అవి తీసుకురండి. వాటితో రవి చితికి నిప్పంటిద్దాము అన్నది. లక్ష్మీనరసమ్మగారు కార్తీకమాసం కోసం పత్తితో వత్తులు చేసుకుంటుంది. అమ్మకు తెలియని దేమున్నది. ఒక మహాతపస్వి చితికి ఆ రకంగా ఉపయోగపడ్డాయి ఆ వత్తులు అమ్మ చేతుల మీదుగా, ఆ వత్తులకు అవి చేసిన లక్ష్మీ నరసమ్మగారికి అంతకన్నా ధన్యతేమున్నది.

తొలి రోజులలో అమ్మ స్వయంగా ఒక గృహిణిగా వచ్చి పోయే బిడ్డలకు వండి పెట్టేవారు. బిడ్డల సంఖ్య పెరగటంతో సహాయపడటానికి ప్రభావతక్కయ్య, చిదానందం అక్కయ్య నాన్నగారింట్లో కొంతకాలం పని చేశారు. లక్ష్మీనరసమ్మగారు వచ్చే సమయానికి అన్నపూర్ణాలయం స్థాపనకావడంతో ఆమెకు అందులో సేవచేసి తద్వారా అమ్మను సేవించుకుండే అవకాశం లభించింది. అలా పన్నెండు సంవత్సరాలు ఆ సేవా బాగాన్ని పొందింది. ఒక రకంగా పన్నెండేళ్లు తపస్సు చేసింది. అమ్మ అనుగ్రహాన్ని పొందింది. లక్ష్మీనరసమ్మగారు, 10 నెలలు చంటిబిడ్డ ‘లక్ష్మిత’తో జిల్లెళ్ళమూడి వచ్చిన లక్ష్మీనరసమ్మగారు బిడ్డల ఆలనాపాలనా చూచుకుంటూ సలక్షణంగా సంతృప్తిగా జీవనం గడిపి అమ్మలో ఐక్యమైన ధన్యురాలు.





36. తంగిరాల రాధ

సోదరుడు తంగిరాల రాధాకృష్ణమూర్తి 1960 దశకం మొదట్లో జిల్లెళ్ళమూడి వచ్చి సేవా కార్యక్రమాలలో పాల్గొన్న అదృష్టవంతుడు. గోదావరి జిల్లా తణుకు నుండి వచ్చిన తంగిరాల సత్యనారాయణగారు గుంటూరు జిల్లాలో జిల్లాపరిషత్ వైద్యునిగా చాలా గ్రామాలలో చేసిన పర్చూరు డాక్టరుగా జిల్లెళ్ళమూడిలో ప్రసిద్ధులు. అప్పికట్లలో బ్రహ్మాండం సుబ్బారావు చదువుకొనే రోజులలో అమ్మ అప్పికట్ల వెళ్ళితే అక్కడ సత్యనారాణగారి పిల్లలు అమ్మను చూచినా సుబ్బారావు తల్లిగానే చూచారు తప్ప ఒక దైవీమూర్తిగా గుర్తించలేదు.

సత్యనారాయణగారి కుటుంబం 1960లో జిల్లెళ్ళమూడి రావటం మొదలైంది. రాధమాత్రం 1961లో జిల్లెళ్ళమూడి వచ్చాడు. వచ్చిన రోజే హైమతో పరిచయం అయింది సుబ్బారావు చెల్లెలిగా. ఆ తర్వాతే హైమ అనారోగ్యంతో ఉన్నందున పర్చూరులోని వాళ్ళింటికి వైద్యం కొరకు తీసుకొని వెళ్ళారు. దాంతో అమ్మ, హైమలతో నాన్నగారి కుటుంబముతో వారి కుటుంబానికి సాన్నిహిత్యం పెరిగింది.

రాధ కాలేజీ విద్యాభ్యాసం గుంటూరులో జరిగింది. రాధ తల్లిగారు దమయంతి గారు నిండైన విగ్రహం. పవిత్రత, రాజసము, వాత్సల్యము, మూర్తీభవించిన శక్తి స్వరూపంగా ఉండేది. ఆమె క్యాన్సరు బాధకు చికిత్స నిమిత్తం గుంటూరులో ఉండగా నేను చూడటానికి వెళ్ళితే ఆమె నాకు రాధను అప్పగిస్తూ "నా పిల్లలలో వీడు చాల అమాయకుడు, వీడ్ని కనిపెట్టి ఉండు నాయనా!" అన్నది. ఆ తరువాత మా అనుబంధం మరింత ప్రగాఢ అయింది.

రాధ జీవితంలో అత్యంత ప్రధానమైన కాలం 1965-67. రెండు సంవత్సరాల కాలం. అమ్మను చూడటానికి 1965 జనవరిలో జిల్లెళ్ళమూడి వచ్చాడు. అధరాపురపు శేషగిరిరావుగారు ఆరోజుల్లో అందరింటి నిర్వహణలో ఉన్నారు. అమ్మ మాటల సంధర్భంలో ఆవరణ నిర్వహణకు మనిషి ఉంటే బాగుండును అనుకొన్నది. రాధను వచ్చి ఉండమని బహిరంగంగా అడగలేదు- కాని రాధ హైదరాబాదు వెళ్ళి ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చాడు. వారం రోజులలో "నేను ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానమ్మా, ఇక్కడ ఉండటానికి. నీవు ఏ పని చేప్తే ఆ పని చేస్తాను" అన్నాడు. "అదేమిటిరా! ఉద్యోగం వదిలి పెట్టితే మళ్ళీ ఉద్యోగం రావద్దా" అన్నది. "దాన్ని గూర్చి ఆలోచనలేదమ్మా! ఇక్కడ నీవే పని చెప్తే ఆ పని చేయటమే" అన్నాడు రాధ- నీకు ఇష్టమైన పని చేయినాన్నా! అన్నది అమ్మ. గారాబంగా ఉండి, సుకుమారంగానే పెరిగినా జిల్లెళ్ళమూడిలో కుప్ప నూర్పిళ్లల్లో, ఇటుకబట్టీ పనిలో, బొగ్గులారీలు దించటంలో, చెరువు నుండి నీళ్ళు తేవటం, జమ్ములపాలెం నుండి ఊకలారీలను నింపుకొని రావటం, ఇసుకలారీలో వెళ్ళి ఇసుక నింపుకొని రావటం, అందరింటి పనికి గానుగ త్రిప్పి సున్నం తయారుచేయటం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు రాధ.

భాస్కరావన్నయ్య గడ్డితో తాడు పేనటం నేర్పితే నేర్చుకున్నాడు. మన్నవ దత్తుతో కలిసి సున్నం గానుగ త్రిప్పాడు. సింగుపాలెం తాతయ్యతో కలసి తాటాకు పందిళ్ళు వేశాడు. సాగరుగారి పిల్లలు రమణ సావిత్రి వంటి వాళ్ళతో కలిసి వరి కోతలు కోసాడు.

ఒకసారి విపరీతంగా ఎండలు కాస్తున్నాయి. కోతపనికి వెళ్ళాలి. పిల్లలు వెళ్ళకుండా అమ్మ వద్ద కూర్చుంటే అమ్మ "ఏరా? కోతకు వెళ్ళలేదేం" అన్నది. నీవు గొడుగు ఏర్పాటు చేయమ్మా. అలాగే వెళ్ళుతాం అన్నాడు రాధ- సరే అలాగే అన్నది అమ్మ- అంతే 'విపరీతమైన ఎండఅన్నయ్యా. వడగాలి' అని పిల్లలు వారిస్తున్నా అమ్మ చెప్పింది కదా అని బయలు దేరదీశాడు పిల్లల్ని. అంతే పదనిమిషాలలో మేఘాలు కమ్మి ఎండకు గొడుగు పట్టించి చక్కగా పొలంపని చేసుకున్నారు పిల్లలు. అది అమ్మ పట్టిన గొడుగు. అమ్మ పనిచేసే పిల్లల పట్ల ఎంతో శ్రద్ధ కనబరిచేది. అమ్మ చెప్పిన డాక్టర్ జ్యోత్స్న అన్నపు తట్టలు మోసుకొని పొలాలకు వెళ్ళి ముద్దలు కలిపి పెట్టిన రోజులున్నవి. పండ్లు, మిఠాయిలుఎన్నో

పంపేది అమ్మ పని చేసే పిల్లల కోసం. క్రొత్త గడ్డితో పనిచేస్తే దురదలు వస్తవిరా అని రాధకు వేడి నీళ్ళు పెట్టించి ఇప్పించేది.

ఒక రోజు బొగ్గుపని చేసిన రాధకు జ్వరం వచ్చి వళ్ళు తెలియకుండా గడ్డివాముల మధ్యపడి నిద్రపోతుంటే అమ్మ వచ్చి స్వయంగా పరిచర్యలు చేసిన రోజులున్నాయి. దున్నకట్టిన బండి తోలుకొని వస్తుంటే కాలువలోపడిపోతే రాధను ఎద్దులను కాపాడిన రోజులున్నాయి. రాధకు అమ్మ వద్ద ఎంతో గారాబం. ఒక రోజు మధ్యాహ్నం అలిసి పడుకొని నిద్రలేస్తూ ఏదన్నా తినాలని ఉందమ్మా! అంటే, ఏం కావాలో చెప్పరా! అంటే నీయిష్టం ఏదైనా సరే నంటే అప్పటి కప్పుడు జీడిపప్పు వేయించి పెట్టిన రోజులున్నవి. ఈవిధంగా అమ్మ చేత స్వయంగా సేవ చేయించుకొన్న భాగ్యశాలి రాధ.

ఒకరోజు అకస్మాత్తుగా పొలంలో పని చేస్తున్న రాధను పిలిపించి పూరిపాకలోని స్నానాలగదిలో ఉన్న అమ్మ "వడుగు చేసుకుంటావురా"? అంది. "అదేంటమ్మా పొలం పనిలో ఉంటే పిలిపించి ఇదా అడగటం ఇప్పుడెందుకమ్మా" అన్నాడు. అంటే అమ్మ "ఇప్పుడు చేస్తే చేసుకుంటావా?" అన్నది. "నీఇష్టం నీవు ఏం చేసినా ఎప్పుడు చేసినా సరే" నన్నాడు రాధ. వెంటనే అమ్మ చిలకకొయ్యకు తగిలించిన జంధ్యం తీసి రాధకు వేసి వడుగైపోయింది ఫో అన్నది. వెంటనే కృష్ణవేణమ్మ గజేంద్రమ్మలతో చెప్పి తలంటి పోయించి పాదాలకు పారాణి పెట్టించి పసుపు బట్టలు కట్టించి ఆ రోజు శివరాత్రి కావటంతో "పూజలో ఉన్నప్పుడు భిక్ష అడగరా!" అని చెప్పింది. కిరీటంతో దేదీప్యమానంగా పరమశివునిలా వెలిగిపోతున్న అమ్మను "భవతీభిక్షాందేహి" అని అడిగాడు రాధ. అమ్మ అక్కడ ఉన్న పూలను రాధ జోలెలో వేసింది. జీవితం పూలబాటలా నడిపించటానికేనేమో. భద్రాద్రి రామశాస్త్రిగారి చేత 16రోజులు సంధ్యావందనం నేర్పించింది. బుగ్గలు పట్టుకొని భృకుటి మధ్య కుంకుమ బొట్టు పెట్టుతూ "నాన్నా! ఇది నా రక్ష" అన్నది అమ్మ. రాధనేగాదు అమ్మ వద్దకు వచ్చే వారందరికీ ఆ కుంకుమ రక్ష రక్షణే! ఎవరికి వారు అమ్మ తననే ప్రత్యేకించి చూస్తుంది అనుకుంటున్నా బ్రహ్మాండనాయకి అయిన అమ్మ దృష్టి ఏ అర్హతలేని ఈ అల్పజీవిపైపడ్డది కదా! అనిపొంగి పోయేవాడు రాధ. అమ్మ తనను ప్రత్యేకంగా చూస్తున్నది అనే ప్రగాఢ విశ్వాసం అతని నరనరాలలో పాతుకు పోయింది. జిల్లెళ్ళమూడి వదిలి హైదరాబాదు వచ్చేటప్పుడు

అమ్మ అతనికిచ్చిన హామీ కూడా అది. "నీవు ఎక్కడున్నా నేనెప్పుడూ నీతోనే ఉంటాను నాన్నా!" అన్నది; అలా ఉన్నది కూడా.

రామకృష్ణ ఊరికి వెళ్ళటంతో అమ్మ వద్ద దర్శనాలిప్పించటానికి పూజ చేయించటానికి రాధ ఉన్న రోజులున్నవి. ఆసమయంలో అమ్మ "అందరిచేత పూజలు చేయిస్తున్నావు నీ వెప్పుడూ పూజ చేసుకోవేరా!" అన్నది. "నిన్ను చూస్తూ, నీ మాటలు వింటూ, నీతో మాట్లాడుతూ ఆనందించటం తప్ప నాకువేరే పూజ అలవాటు ఆలోచనా లేదమ్మా. అంతా అసంకల్పితంగానే జరుగుతుంది" అన్నాడు రాధ. అమ్మ తన రెండు పాదాలు రాధ రెండు అరచేతుల్లో పెట్టింది. బ్రహ్మ కడిగిన పాదాలవి. అమ్మ పాదారవిందాలు రాధ కరాంజలిలో వాలాయి. అకారణ కరుణ అంటే అదే.

అమ్మ రాధతో పోతుకూచి విద్యాసాగర్‌గారి కుమారుడు రవి అనారోగ్యంతో బాధ పడుతుంటే అతనితో కాలక్షేపానికి నియోగించింది. అతని సేవలోనే రాధకు కాలంగడచిపోయింది. ఆ రోజుల్లోనే ఆ ఊరివ్యక్తి ఒకడు అమ్మ దగ్గరకు పూజకు, పండ్లు పూలు ఒక పళ్ళెంలో పెట్టుకొని వచ్చాడు. రవి ఇది గమనించి, "వాడు ఆ పళ్ళెంలో పూలక్రింద కత్తి పెట్టుకొని వచ్చాడు. నీవు వెళ్ళి తగు జాగ్రత్తతో ఉండు" అని రాధను పంపించాడు. రాధ లోపలికి వెళ్ళి అమ్మతో మాట్లాడివచ్చి ఇప్పుడే దర్శనాలు లేవని చెప్పాడు. వాడు పూలు అక్కడ పెట్టి అవతలకు వెళ్ళాడు. రాధ పూలక్రింద వెతికి కత్తి ఉండటం గమనించాడు. మళ్ళీ లోపలకు వెళ్ళితే అమ్మ కనిపించలేదు. అక్కడ వాళ్ళని అడిగితే అమ్మ శేషగిరిరావన్నయ్య గదిలో మాట్లాడు తున్నదని చెప్పారు. ఒక నిమిషం క్రిందనే తను ఇక్కడ అమ్మతో మాట్లాడాడు. ఆశ్చర్యం వేసింది రాధకు. అవసరమనుకుంటే అమ్మ ఒకేసారి అక్కడా ఇక్కడా కూడా ఉండగలదు, రవికి పూలక్రింద ఉన్నట్లు కనిపించేటట్టు చేయగలదు. రాధ మాత్రం అమ్మ లీలలకు ఆనందించాడు. చివరకు పోతుకూచి రవి అంత్యక్రియలు రాధ చేత చేయించటం విశేషం. విశ్వాసానికి రవి మారుపేరైతే అతనికి (భక్తునికి) సేవచేసే భాగ్యం, అంత్యక్రియలు చేసే అదృష్టం రాధకు అమ్మ ప్రసాదించిన అంతర్గతంగా ఏదో అర్థంకాని చారిత్రాత్మక విషయం.

రాధ జిల్లెళ్ళమూడిలో ఉన్న రోజులలోనే వసుంధర వివాహం జరిగింది. ఆ వివాహ క్రతువులో అమ్మను పురుషోత్తమునిగా దర్శించి ఆ కళ్యాణ వైభవాన్ని

ఛాయా చిత్రాలలో బంధించే మహద్భాగ్యం రాధకు కలిగింది.

హైమకు రాధన్నయ్యంటే చాల ఇష్టం. రాధకూ హైమంటే బంగారు తల్లే- వాళ్ళింట్లో ఆడబడుచుగా అన్ని మర్యాదలు (పెళ్ళిలోకూడా) పొందింది. రాధ వాళ్ళ అమ్మ, నాన్నలను అమ్మా, నాన్నా అని పిలిచేది. అంతటి బంధం- హైమ చివరి రోజులలో కారణాలేవైనా రాధ తనతో మాట్లాడకపోతే చాల బాధ పడేది. అది తలచుకొని హైమ ఎన్నిసార్లు పలుకరించినా తను మాట్లాడలేకపోయానే అని తనచివరి రోజులలో ఎంత కుమిలి కుమిలి అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నాడు. మరీ చివరి మూడు నాలుగు సంవత్సరాలు అమ్మస్మరణ హైమ చింతనే. తాను ఏమీ చేయలేకపోయానే అమ్మకు హైమకు అని. తెగించి మండల దీక్షలో ఉండాలని పోతే గుండె జబ్బుతో వెనుదిరిగి రావలసి వచ్చింది దీక్ష పూర్తికాకుండానే.

ఏదైనా అమ్మ నిర్ణయించిన నిర్ణయంలో పావులే ఎవరైనా. రాధ ముందు ముందు ఉండే అవకాశం ఉండదని తెలుసుకనుక కాబోలు రాధను రెండేళ్ళు తన వద్దనే ఉంచుకొన్నది అమ్మ. చివరికి 1967లో రాధ హైదరాబాదు బయలు దేరుతుంటే తాను స్వయంగా అన్నం కలిపి కొసరికొసరి గారాబంగా తినిపిస్తుంటే, కృష్ణ వేణమ్మక్కయ్య మరీ ఇంత గారాబం చేస్తున్నావేంటమ్మా అంటే "వీడు నా అడ్డాలలో బిడ్డడమ్మా!" అంది అమ్మ. మరి అప్పుడప్పుడు రాధలో అమ్మ ఉన్నదా అమ్మలో రాధ ఉన్నాడా అంటే- రెండూ నిజమే అనిపిస్తుంది నాకు. రాధను తలచుకొంటుంటే వాడి, అమాయకత్వమూ, ఆదరణగా ఆప్యాయంగా "ఆంజనేయులుగారూ! రండి రండి" అని పిలిచే ఆత్మీయతా అనుబంధం, స్వచ్ఛహృదయం ఇహపరభోగాలపట్ల నిర్లిప్తత, ఆ చిరునవ్వు, ఆ ముఖంలో ఆనందము ఇక కనిపించవే అనే ఆలోచనలు నాకు కన్నీళ్ళు తెప్పిస్తుంటాయి. జిల్లెళ్ళమూడికి సంబంధించినంత వరకు రాధ ఒక చారిత్రాత్మక పురుషుడు, ధన్యజీవి.

(29.3.2004న తంగిరాల రాధాకృష్ణమూర్తి అమ్మలో లీనమైన సందర్భంగా రాధ స్మరణకు ఈ రచన)



37. సిరిగిరి సుబ్బారావు

శ్రీ మత్పయోనిధి నికేతన! చక్రపాణే!
భోగీంద్ర భోగిమణి రాజిత పుణ్యమూర్తే ।
యోగీశ! శాశ్వత! శరణ్య ! భవాబ్ధి పోత !
లక్ష్మీనృసింహ ! మమదేహికరావలంబమ్ ॥

సంసార సాగర విశాల కరాళకాల
నక్రగ్రహ గ్రసన నిగ్రహ విగ్రహస్య ।
వ్యగ్రస్య రాగలసదూర్మ నిపీడితస్య
లక్ష్మీనృసింహ ! మమదేహి కరావలంబమ్ ॥

జిల్లెళ్ళమూడి అందరింటి ఆవరణలో గంభీరంగా మధురంగా ఈ శ్లోకాలు వినిపిస్తుంటే అవి సిరిగిరి సుబ్బారావుని అని అందరికీ గుర్తు. ఆర్తితో అతడు చేసే గానం ఆ లక్ష్మీ నరసింహస్వామి విన్నాడో లేదోగాని అమ్మమాత్రం మళ్ళీమళ్ళీ పాడించుకొని వినేది. అమ్మ వద్దకు వచ్చే సోదరీసోదరులు కూడా సుబ్బారావు పాడే పాటలు పద్యాలు స్తోత్రాలు వింటూ ఆనందించే వాళ్ళు. లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం మాత్రం అతడు పాడే వాటిలో హైలైట్ అని అందరూ అనుకునే వాళ్ళు.

శ్రీరాధాకృష్ణశర్మగారు రచించిన 'శ్రీ అంబికా కరావలంబస్తోత్రా'న్ని అర్థవంతంగా, అను 'రాగ' బద్ధంగా హృద్యంగా, మనోజ్ఞంగా గానం చేస్తుంటే చెట్లూ

చేమలేకాదు రాళ్ళూ రప్పలూ స్పందించేవి. అమ్మ శ్రీ చరణాలకు అంజలి ఘటించేవి. ఇక సార్ద్రహృదయులైన సోదరీ సోదరుల సంగతి చెప్పాలా?

సుబ్బారావు పుట్టుగుడ్డి. పర్చూరు నివాసి. సర్వేంద్రియాణాం నయనం ప్రధానం. అంటారు. అలాంటి కళ్ళులేకుండా జీవించటం దురదృష్టకరం. డబ్బులేనివాడు దుబ్బుకు కొరగాడు అనటం నిజమే. సుబ్బారావు బీదవాడు. కళ్ళులేని బీదవాని స్థితిని ఊహించుకుంటే అర్థమౌతుంది అతని బాధ. నిర్వీర్యుడై నిస్తేజుడై నిరాశోపహతుడై లోలోపల కుమిలి కుమిలి చివరకు ఆత్మహత్యకు ప్రయత్నించే స్థితికి దిగజారాడు. అదిగో ఆ స్థితిలో అమ్మ కేక వినిపించేదేమో! 1962లో కొందరు సోదరులు జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ ఒడిలో చేరితే నీ జీవితం ఉద్ధరించబడుతుందని సలహా ఇచ్చారు. ఒక శుభముహూర్తంలో అమ్మ పాదాలపై వ్రాలిపోయి అంధుడను, అనాథను, పాపిని, అపరాధిని రక్షించే బాధ్యత నీదేనమ్మా? అనాలని అనుకున్నాడు. కాని దేహం కంపించింది. మాటరాలేదు. ఆగకుండా కంటి వెంటకన్నీరు, కంఠంగాద్గదికమైంది. ప్రేమ భిక్షకోసం అమ్మ పాదాలపై పడిపోవటం జరిగింది.

అమ్మ తన అమృత హస్తంతో తలనిమిరి "భయపడకు నాన్నా! ఆత్మహత్య చేసుకుందామనుకున్నావా? నేనున్నాను నాన్నా? నీ జీవితం ఏలా జరుగుతుందని బాధపడుతున్నావా? సర్వమూ జరుగవలసినరీతిలో జరుగుతుంది. కళ్ళు ఉన్నవాళ్ళు చేయాలనుకున్నవన్నీ చేయగలగుతున్నారా? పిచ్చి భ్రమ. అయినా నీకు జరుగని దేముంది? జీవితాన్ని గూర్చిన బాధ అక్కరలేదు. ఇక్కడే ఉండు" అని అన్నం తెప్పించి కలిపి ముద్దలు నోటి కందించింది.


ఆ రోజు నుండి అతడికీ జీవితాన్ని గూర్చిన భయం పోయింది. తనకు అండగా అమ్మ ఉన్నదనే ధైర్యం వచ్చింది. హరికథలు చెప్పేవాడు. కావాలను కున్నప్పుడల్లా వచ్చి అమ్మ పద్యాలు పాటలూ పాడేవాడు. అవి ఎంతో మధురంగా ఉండేవి. బ్రహ్మాండం సుబ్బారావు వ్రాసిన "పాపాల పాకలో పాపాయి పుణ్యాల పాలకై పిలిచేవా", అలాగే బృందావనం రంగాచార్యుల వారు అమ్మను గూర్చి వ్రాసిన పూజా పుష్పాలు'లోని పద్యాలు చదివేవాడు. రాజుబావపాటలు సరేసరి. ఆ రోజులలో అందరికీ అవే వేదవాక్యాలు. ఆ రోజుల్లోనే నా చేత ఒకటి రెండు పద్యాలు వ్రాయించుకున్నాడు.

రెండు కన్నులు నాస్తి పండు వెన్నెలనాస్తి
నిండుగుండెలపైన కండనాస్తి
కనగ లోకమునందు గౌరవంబదినాస్తి
రంగులసౌరు హోరంగునాస్తి

జ్ఞానమార్గమునాస్తి గానమార్గమె ఆస్తి
కోనకోనలలోన గోమునాస్తి
కన్నులవి రెండు దుమ్ముచేకప్పబడియె
అమృత శీతల శాంత రసార్ద్రమైన
నీదు కమనీయమగు స్పర్శ నెగడుజేసి
దివ్యవాత్సల్య జలధిలో తేర్చుమమ్మ!
ధ్యానమార్గములోన తరియింతునందునా
మాయదారి మనస్సు మాటవినదు
ఆర్తితో నీపైన కూర్తు పద్యములన్న
ఛందాల అందాలు సాగిరావు
కనులారా నిన్నెప్డు కాంచెద నందునా
అంధుడనైయుంట అలవిగాదు
అమ్మ మాటలలోని అర్థమ్ము నెరుగగా
అఆలు కూడ నాకసలురావు
భక్తితో నీదుపాదాలు పట్టుకొనెడి
రక్తి యొక్కటి నాకు శ్రీరామరక్ష
ప్రేమతోనీవు నిమురుట నేమొ తల్లి
లక్ష స్వర్గాలు అక్షయాపేక్షలగును

ఈ పై పద్యాలను వింటూ అమ్మ "అరె సుబ్బారావు ఏదీ నీ పద్యాలు పాడు" అంటుండేది. సుబ్బారావు గొంతెత్తి పాడుతుంటే అతని కంఠంలోని ఆర్తికి చలించి పోయి అమ్మ కళ్ళ వెంట నీరు కార్చేది.

అమ్మ పాదాలపై సమర్పింప బడటానికి కుంటి, గుడ్డి పూలైనా యోగ్యాలే. మనసు ప్రధానంగాని రూపంకాదు. అమ్మకు అవిటి వారన్నా, అంధులన్నా, సమాజం నుండి విసిరివేయబడ్డ వారన్నా విపరీతమైన ప్రేమ. మంచివారిని అందరూ ఆదరిస్తారు వీళ్ళను నేనాదరించకపోతే ఏలా? అయినా తల్లికి తప్పేకనిపించదని. అందరికీ సుగతేనని చెప్పినతల్లి ఆదరణకు అనురాగానికి నోచుకున్న సిరిగిరి సుబ్బారావు ధన్యుడు.



38. సుబ్బారావు అన్నయ్య

'పది నెలల వాడికే చాలా చురుగ్గా మాటలు వచ్చు పిల్లల్లో సుబ్బారావునే చెప్పాలి. అంత త్వరగా పిల్లల్లో మాటలు వచ్చిన వాళ్ళు ఎవరూ లేరు. 10 నెలలవాడు ఇంటి పేర్లతో సహా పలికేవాడు. పొలము , పొలాల నెంబర్లు చెప్పేవాడు. అంత చురుకు.

"1942లో 'రాఘవరావు అన్నయ్య బుర్రకథ వ్రాస్తున్నాడు. మంగళపాండ్య, ఝాన్సీలక్ష్మీబాయి. ముసుగువేసి చిరుకప్పులో ప్రాణం వదలుతున్న చోట చాల బాగుంది. చెప్పటం కూడా మొదలు పెట్టాడు. వాళ్ళ మామయ్య కథ చెబుతుంటే వీడు (సుబ్బారావు) కూడా చిటికెలు వేస్తుండేవాడు. ఇట్లా ఉన్న వాడికి ప్రథమంగా పాల ఉబ్బసం వచ్చింది. మొదటిసారి భయపెట్టింది."

అమ్మ సుబ్బారావును గూర్చి చెప్పిన మాటలివి. ఇందులో సుబ్బారావు చాల తెలివి గలవాడని, జ్ఞాపకశక్తి కలవాడని, విషయాన్ని ఇట్టే గ్రహించగలడని, అయితే చిన్నతనం నుండే అనారోగ్యం వెంటపడ్డదని తెలుస్తున్నది. అయితే పెద్దవాడయిం తర్వాత కూడ తెలివి తేటలలో ఎక్కడాలోపం లేదు కాని, ఆయాసంతో ఉబ్బసంతో బాధపడ్డట్టు దాఖాలాలేం లేవు.

సుబ్బారావు పాఠశాల చదువువదిలి కాలేజి చదువుకు వచ్చినప్పటి నుండి కాస్తో కూస్తో అతనితో నాకు సాన్నిహిత్యం ఉంది. అతను, నేను కలసి, 4,5 సంవత్సరాలు మమేకంగా తిరిగాం కూడా, బంధువుల ఇళ్ళకు గానీ అమ్మ వద్దకు వచ్చే ఆత్మబంధువుల ఇళ్ళకు గానీ, రావిపాడు, సింగుపాలెం, తెనాలి, విజయవాడ, రాజమండ్రి ఇలా చాల ఊళ్ళు పర్యటించాం.

అక్కడి వారు అమ్మతో ఉన్నవారి అనుభవాలు చెబుతుంటే కొన్ని రికార్డ్ కూడా చేశాం. ఆరోజుల్లో- నాతో కలసి సుమారు రెండు సంవత్సరాలు ఉద్యోగం కూడా చేశాడు మా పాఠశాలలో. 1961లో మొదటిసారిగా గుంటూరులో డాక్టర్ వై.వి. సుబ్బారావు గారి హాస్పిటల్‌లో సుబ్బారావుకు ఆపరేషన్ జరిగింది. గోవిందరాజులు దత్తుగారు అక్కడ చేర్చారు. సుబ్బారావు దగ్గరుండి ఆ పది పదేహేను రోజులు సేవచేసే అవకాశం కలిగింది నాకు. అప్పటి నుండి చాలా సంవత్సరాలు ప్రతి యేడూ ఆపరేషన్ జరిగిన రోజున అమ్మకు పూజ చేసుకుంటుండేవాడు. ఆ పూజా కార్యక్రమంలో నన్ను కూడా పాలుపంచుకునే అవకాశం ఇచ్చి ప్రోత్సహించాడు.

1962లో అమ్మ పుట్టిన రోజు పండుగ నాడు ఒక ప్రత్యేక సంచిక మాతృశ్రీ ప్రథమ సంచిక తేవాలని సంకల్పించాడు. నేను సుబ్బారావు కలసి ఆ ప్రయత్నం చేశాము. గుంటూరులోనే సాహిత్య రంగంలో చాలమంది నాకు బంధువులు మిత్రులు కావడంతో వాళ్ళలో చాలమంది అమ్మ వద్దకు వచ్చి అమ్మ వాత్సల్యాన్ని ప్రేమామృతాన్ని గ్రోలిన వారు కావడంతో తమ తమ రచనలు ఇవ్వవలసిందిగా కోరాం. అందరూ ఎంతో ఆనందంతో వ్రాసి ఇచ్చారు. ఆరకంగా మాతృశ్రీ జన్మదిన సంచికలు ప్రారంభించడానికి సుబ్బారావే ప్రథముడు. పిమ్మట నాలుగేళ్ళు జన్మదిన సంచికలుగా వచ్చి, తర్వాత నెలసరి పత్రికలుగా రావడం జరిగింది. ఆరంభానికి మాత్రం సుబ్బారావే కారణం.

సుబ్బారావు మంచి కవి. అతడు వ్రాసిన గేయాలు ఎన్నో సిరిగిరి సుబ్బారావు పాడేవాడు. సుబ్బారావు వ్రాసిన 'పాపాల పాకలో పాపాయి పుణ్యాల పాలకై పిలిచేవా' అనే గేయం చాల ప్రసిద్ధి చెందింది. 'లేచింది గజక్క గొంతు' అని గజేంద్రమ్మక్కయ్య మీద. 'అమ్మమ్మా! ఎత్తుకో పళ్ళెం' అంటూ అందరమ్మమ్మ మీద 1964-65లలోనే వ్రాసిన పాటలు హాస్యస్ఫోరకంగా వాస్తవాలకు అద్దం పట్టే విధంగా ఉన్నాయి.

రాజకీయాలలో సుబ్బారావు గుంటూరులో శ్రీ జొన్నాభట్ల వెంకటరామయ్యగారి సాహచర్యంలో చిన్న తనంలోనే ప్రవేశించినా, రాజకీయ దురంధరులైన నడింపల్లి నరసింహారావు, కోన ప్రభాకరరావు, కాసు వెంగళరెడ్డి వంటి ఉద్దండుల వాత్సల్యంతో రాటు తేలాడు. అయితే తన రాజకీయ జీవితాన్ని గ్రామసర్పంచికే పరిమితం చేసాడు కాని, లేకపోతే జిల్లా, రాష్ట్ర రాజకీయాలలో ఎప్పుడో సమున్నత స్థానాన్ని సంపాదించుకొని ఉండేవాడు.

నాటక రంగంలో కూడా సుబ్బారావుకు అనుభవం ఉంది. తను చదువుకొనే రోజుల్లోనూ ఆ తర్వాత కూడా కొంపల్లి శేషు సాహచర్యంలో నాటకాల్లో పాల్గొన్నాడు. జిల్లెళ్ళమూడిలో మాతృశ్రీ క్రీడా సాంస్కృతిక (మాతృశ్రీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ లీగ్) సంస్థ నొకదానిని స్థాపించటానికి మూలకారకులలో ఒకడు. ఆసంస్థ తరపున కొన్ని నాటకాలకు దర్శకత్వం కూడా వహించాడు. ఆర్థికపుష్టిని కలిగించేవాడు.

జిల్లెళ్ళమూడి వచ్చే యాత్రికులు 1960 ప్రాంతాలలో చాలా ఇబ్బందులు పడుతుండేవారు. కాలువలు దాటలేక, తాటిబొందలపై, దాటుతూ, మోకాలులోతు, మొలలోతు బురదలో కూరుకుపోతూ నడచి రావల్సి వచ్చేది. పంచాయితీ బాధ్యతలు సర్పంచిగా చిన్న వయసులోనే చేపట్టి చక్కటి తారురోడ్డు రావడానికి అతను పడ్డ శ్రమను తలచకుండా ఉండలేం.

సుబ్బారావు చక్కటి స్నేహశీలి, అమ్మకోసం వచ్చేవారు అతి తక్కువ కాలంలోనే సుబ్బారావుకు సన్నిహితులయ్యేవారు. సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, నాటక, క్రీడారంగాలలో అతనికున్న ప్రవేశం వల్ల ఏ విషయం మీదైనా చక్కటి సంభాషణ చేసే చాతుర్యం ఉండేది. హాస్యలాస్యవరివస్యుడు. నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడు. నలుగురిలో కలిసిపోయేవాడు. జిల్లెళ్ళమూడికి పోస్టాఫీసు తేవడానికి అతను ఎంతో శ్రమించి కృతార్థుడైనాడు.

బయట ప్రపంచంలో పనులు చేయడానికి, చేయించడానికి వెళ్ళినప్పుడు అమ్మగారి కుమారుడిగా చెప్పుకొనేవాడు కాదు. తన వ్యక్తిత్వం ద్వారా ఆ పనులు పూర్తి చేసుకొచ్చేవాడు. తర్వాత ఎపుడో సుబ్బారావు 'ఫలానా' అని తెలిసి వాళ్ళు ఆశ్చర్యపోతూ ముందు చెప్పనందుకు నొచ్చుకొనేవారు.

జిల్లెళ్ళమూడికి కరెంటు తెప్పించటానికి నీటి పంపులువేయించడానికి, ఆర్.టి.సి. బస్సులు రప్పించడానికి ఎంతో కృషి చేశాడు. గోపాపురం మీదుగా జిల్లెళ్ళమూడికి రోడ్డు వేయించాలని జిల్లా పరిషత్‌లో ఎంతో కృషిచేశాడు. వారిచే అంగీకరింపచేశాడు. అది ఇంకా కార్యరూపం ధరించాల్సి ఉంది.

ఈరకంగా జిల్లెళ్ళమూడి సర్వతోముఖాభి వృద్ధికి సుబ్బారావు ఎంతో శ్రమించాడు. చాలా విజయాలు, సాధించాడు. జిల్లెళ్ళమూడి చరిత్రలో సుబ్బారావుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉన్నది.

అవిరామంగా ఇంత కృషిచేస్తున్నా అతని ఆరోగ్యం విషయంలో తగు శ్రద్ధ తీసుకోలేదనిపిస్తుంది. చిన్నతనం నుండి ఏదో ఒక వ్యాధి అతడి శరీరాన్ని


దెబ్బతీస్తూనే ఉన్నది. సేవాకార్యక్రమాలలో శరీరాన్ని ఒకరకంగా ఆహుతి చేశాడు. షుమారు గత 20 సంవత్సరాలుగా మధుమేహవ్యాధి అతని శరీరంలోని అంగాంగాన్ని దెబ్బతీస్తూనే ఉన్నది. గత సంవత్సరంగా దాని విజృంభణ మరీ పెరిగింది. ఆఖరికి రెండు రోజులకొకసారి రక్తశుద్ధి చేయవలసిన పరిస్థితికి దారి తీసింది.

ఇంత కష్టాల్లో కూడా ఎంతో మెచ్చుకోవలసిన విషయం- సుబ్బారావు సహనం. ఆ ఓపిక ఆ ఓర్పుకు ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. విచిత్రమేమిటంటే 51 సంవత్సరాల సుబ్బారావుకు 56సార్లు రక్తశుద్ధి చేశారు. 57వ సారి చేయటం పూర్తికాలేదు. మధ్యలోనే ఆ పేయవలసి వచ్చింది. అతని జీవితంలాగే సుబ్బారావుకు వైద్యసహాయం అందించిన సోదరులెందరో దేశవిదేశాల్లో ఉన్నారు. ఆర్థికసాయం చేసిన వారు కొందరైతే, సేవ చేసినవారు కొందరు. ఒక లక్ష్మీ నారాయణనో, ఒక పూర్ణచంద్రరావునో, ఒక రిచర్డ్‌నో, ఒక అప్పారావునో, ఒక ఉపేంద్రనో, ఒక నాగేంద్రమ్మనో ఒక రమేషునో పేరు పేరునా చెప్పటం మొదలు పెట్టితే పెద్ద పట్టిక అవుతుంది. అందరిలో తమ్ముడు తనవాడైనా ధర్మం చెప్పమన్నారు గనుక సుబ్బారావు ఆరోగ్యాన్ని గూర్చి 'రవి' పడ్డ తపన మాత్రం ఇద్దరి మధ్య ఉన్న బంధుత్వానికన్నా మించింది.

వైద్యం కొరకు మద్రాసులో ఉన్నా, హైదరాబాదులో ఉన్నా జిల్లెళ్ళమూడి మీద సుబ్బారావుకున్న ప్రేమ అపారం. జిల్లెళ్ళమూడికి వెళ్ళాలనే నిరంతరం తపన. ఈ ఊరి మీద ఈ నేల మీద అతనికున్న అప్యాయత అది. అంతర్గతంగా అది అమ్మ మీద అచంచల విశ్వాసం.

'మంచిగాని చెడుగాని ఏదిస్తే అది నా కరుణ' అని చెప్పిన అమ్మ మాత్రం తన బిడ్డలకు మరణమంటే భయం లేకుండా చేసింది. జిల్లెళ్ళమూడిలో అమ్మ వద్దకు వచ్చినవారి ప్రత్యేకత అది. సుబ్బారావు అన్నయ్యకు మృత్యువు అంటే భయం లేకుండా చేసి మృత్యుంజయత్వాన్ని ప్రసాదించింది అమ్మ.

విశ్వజనని పెద్దబిడ్డ. శ్రీ విశ్వజననీ పరిషత్ శాశ్వత సభ్యుడు జిల్లెళ్ళమూడి పంచాయితీ సర్పంచ్ శ్రీ బ్రహ్మాండం సుబ్బారావు ధన్యమూర్తి. జిల్లెళ్ళమూడి చరిత్రలో అతని పాత్ర మాన్యమైనది- అసామాన్యమైనది.



39. వడ్డాది నిహాల్ కృష్ణారావు

కృష్ణారావుగారు అమ్మకృపకు పాత్రులైన బిడ్డలలో ఒకరు. అమ్మ కృప లేకపోతే అమ్మ మీద విశ్వాసం ఏర్పడటం కూడా కష్టమే. ఎందుకంటే అమ్మ వద్దకు వచ్చిన లక్షల మందిలో కొన్నివందల మందితోనైనా సన్నిహితంగా సంబంధం కలిగినవారున్నారు. అమ్మకు అత్యంత సన్నిహితంగా మెలిగినవారున్నారు. సంవత్సరాల తరబడి వస్తూ వస్తూ రావడం ఆగిపోయిన వారున్నారు. అప్పుడప్పుడు వస్తూ వస్తూ రావడం ఆగిపోయిన వారున్నారు. ఎవరికి మనస్సులో ఏ బాధ వుందో చెప్పలేం. మనం అమ్మకోసం వస్తున్నాం, ఇంకా కొంచెం తరచి తరచి ఆలోచిస్తే మనం మన కోసమే వస్తున్నాం, ఇతరుల కొరకు కాదు అని మరచిపోతుంటాం. ఏది ఏమైనా కృష్ణారావుగారు జిల్లెళ్ళమూడి రావటం కూడా ఒక విచిత్రమైన సన్నివేశమే.

కాకినాడ గవర్నమెంట్ కాలేజీలో చేరిన కృష్ణారావుగారు చిత్తూరులో గవర్నమెంట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసేవారు. వారి భార్య శ్రీమతి వరలక్ష్మి మన్నవ వారింటి అడబడుచు. అమ్మకు ఒక పినతండ్రి కూతురు. అమ్మ మహిమలను గూర్చి చిత్రవిచిత్రంగా చెప్పుకొనేవారు. కృష్ణారావుగారు నమ్మేవారు కాదు. 'అంతా మీ భ్రమ' అని అవహేళన చేస్తుండేవారు. విధి బలీయమని తెలిసికోవడం కష్టం అమ్మ 'విధే దైవం' అన్నది. మన్నవలో అమ్మ చేసిన లీలలు, చెన్నకేశ్వవస్వామి, ఆలయంలో రాజ్యలక్ష్మి, అమ్మవారి ఆలయంలో, చింతల తోపుతో జరిగినవి చెప్పుకొనేవారు. విధే విధానమన్నది. మనకు వింతగా తోచే విధి లీలవల్ల కృష్ణారావుగారికి 1971లో పక్షవాతం వచ్చింది. అప్పటికే 40 ఏళ్లవయసులోనే

ఉన్నాడు. నోటమాటలేదు. మూగవాడైనాడు. నడువలేడు కుంటివాడైనాడు., తీవ్ర అస్వస్థత, అప్పుడు ఇంట్లోవాళ్ళు మీకోసం కాకపోయినా, మా కోసమైనా జిల్లెళ్ళమూడి వెళ్ళుదాం, అమ్మను దర్శించుకొందాం అని పట్టుబట్టితే చివరకు ఒక నియమం మీద జిల్లెళ్ళమూడి రావటానికి ఒప్పుకున్నాడు. ఏమిటంటే నా జీవితాన్ని గూర్చి గానీ నా జబ్బును గూర్చి నయం చేయమని అడగవద్దు. ఆమె మహత్తు కలిగినదైతే ఆమె గ్రహించగలదు అన్నాడు. 'బ్రతుకు జీవుడా రావడానికి ఒప్పుకొన్నాడు చాలు" అని ఆయన షరతులకు అంగీకరించారు.

ఎట్టకేలకు జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మ దర్శన స్పర్శలతో ఆయనలో ఆయనకు తెలియకుండానే మార్పు వచ్చింది. అమ్మ వాత్సల్యము, ప్రేమ, ఆప్యాయతలతో అమ్మలోని దివ్యత్వం వైపు ఆకర్షించబడ్డాడు. అమ్మ పట్ల విశ్వాసం ఏర్పడ్డది. అమ్మ ఆ ప్రథమ దర్శనంలోనే కిరీటధారిణియై దేదీప్యమానంగా విలసిల్లుతున్న రాజరాజేశ్వరిగా కన్నులకు కనిపించింది. ఆ తర్వాత ఆయన మాట్లాడాడు. నడిచాడు. మళ్ళీ ఆయనకు పునర్జన్మ ప్రసాదించబడి మళ్ళీ కాలేజీకి వెళ్ళి ఉద్యోగం చేయగల్గాడు.

"మూకం కరోతి వాచాలం పంగుంలంఘయతేగిరిం
యత్కృపాత మహంవందే పరమానంద మాతరం"

అనే విషయం ఆయన జీవితంలో అక్షర సత్యమైనిలిచింది. ఆనాటి నుండి ఆయన అమ్మలో లీనమయ్యేవరకు అమ్మ తప్ప మరే దైవము లేరు. ఆనాటి నుండి వారు అమ్మ తపస్సు చేశారు. అమ్మ ధ్యానం చేశారు. అమ్మ భావనే బ్రహ్మాభావనై నిలిచారు. ఆయన ఇల్లే అమ్మాలయం అయింది. ఆయనను కలవటానికి వచ్చిన బాధితులకు, అమ్మను తలచుకొని, అమ్మ ఆయన ఇల్లు నిత్యం ఇలా వచ్చే ఆర్తులతో, ఆయన తీర్థ ప్రసాదాల కోసం వచ్చే వారితో నిండిపోయేది. అమ్మను మనస్సులో తలచుకొని ఆయన చెప్పే మాట అక్షర సత్యమయ్యేది. తన స్వర్ణోత్సవాలలో లక్షమందికి ఒకే పంక్తిన భోజనం పెట్టిన అమ్మ కోటి మందికి దర్శనం ఇవ్వాలనే కోర్కెతో రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలు తిరుగుతూ తిరుపతి వెళ్ళి ఆ తర్వాత చిత్తూరు వెళ్ళినప్పుడు కృష్ణారావుగారింటికి వెళ్ళిన అమ్మ ఆసీనురాలైన పవిత్రమైన ఆసనం వారి ఇంట్లో భద్రంగా అమ్మ చిత్రపటం అలంకరించి నిత్య ధూప, దీప, నైవేద్యాలు సమర్పిస్తూ ఉంచుకున్నారు. ఆ యిల్లు మరొక జిల్లెళ్ళమూడిగా

విరాజిల్లుతున్నది. ఆ ఇంట్లో అమ్మ భజనలు, ఏకాహాలు జరగటమేగాక అమ్మ జన్మించిన ప్రతి ఆశ్లేషా నక్షత్రం రోజున, ప్రతి ఏకాదశి తిథి రోజు పూజలు వైభవంగా జరపి వచ్చిన ఆర్తులకు, భక్తులకు అన్నం పెట్టడం జరిగేది. అమ్మను నమ్మిన కృష్ణారావు ఆయనను నమ్మిన జనానికి మార్గదర్శకుడైనాడు.

ఆయన ఏం చెబితే అది జరిగేది. ఆయనకు అమ్మ ప్రసాదించిన వాక్శుద్ధి అలాంటిది. ఇదంతా అమ్మదయే అనేవాడు. అహంకార లేని నిగర్వి. ఆయన వద్దకు వచ్చేవారిలో ముస్లిములు, క్రైస్తవులు, ఆ బజారులో పూలమ్మే పూల వర్తకుడికి అమ్మ కనిపించి నేను ఫలానా వాళ్ళ ఇంట్లో ఉంటాను నీ పూలమాల అక్కడే ఇమ్మంటే కృష్ణయ్య అనే ఆ పూలవ్యాపారి రోజూ తానే అమ్మకు పూలమాల తెచ్చి ఇచ్చేవాడు.

అమ్మ దక్షిణ దేశయాత్రలో చిత్తూరులో వాళ్ళఇంటికి వెళ్ళేనాటికి పూర్తి ఆరోగ్యం రాలేదు. ఇంకా నడక పూర్తిగాలేదు. అయినా ఆశ్చర్యం అమ్మకారు వెంబడి పరుగెత్తాడు. ఆనాడు అమ్మ వెలిగించిన జ్యోతి వాళ్ళింట్లో అఖండ జ్యోతిగా వెలుగొందింది అంటే అతిశయోక్తి కాదు. అమ్మ చెప్పిన 'నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో" అన్న దానికి నిదర్శనంగా వేలాదిమందికి వస్త్రదానం, అన్నదానం చేసుకొన్నారు.

వారికి అమ్మ మీద ఉన్న ప్రగాఢ విశ్వాసం ఏలాంటి దంటే చిన్న బిడ్డ చేష్టతో తెచ్చిన పాపకు అమ్మ కుంకుమపెట్టి మందు అక్కరలేదు అంటే నిజంగా రెండో రోజుకే పాప తల్లి తండ్రులకు వచ్చి బిడ్డ కులాసాగా ఉన్నట్లు చెప్పి వెళ్ళారు. దసరాలలో 104 డిగ్రీల జ్వరంతో ఒక మహిళ వస్తే దసరా అయ్యేటప్పటికి తగ్గుతుంది, అని చెప్పితే మహర్నవమి నాటికే ఆరోగ్యం కలిగింది. అమ్మ తప్ప వేరే దైవం లేదని నమ్మి ఏకాదశిరోజు అమ్మ పూజచేసుకొని రాయవెల్లూరు ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరి అమావాస్యనాడు ఆశ్లేషా పూజాప్రసాదం తీసుకొని 16-8-2004న అమ్మలో లీనమైనారు. ఆ అంతిమ సమయంలో వారికి అమ్మ గాజులసవ్వడి వినిపించింది. అమ్మ పాదాలపై వాలిన మహత్తర పూజాపుష్పం. అలాంటి భక్తి, విశ్వాసము కలిగిన మహనీయుడు కృష్ణారావు ధన్యజీవి.



40. డాక్టరు నారపరాజు శ్రీధరరావు

తొలిరోజులలో అంటే 1958 ప్రాంతంలో అమ్మ వద్దకు తరచుగా చీరాల నుండి వచ్చిన వారిలో శ్రీహర్ష రావుగారొకరు. వారి ద్వారా అమ్మను గూర్చి విన్నారు డాక్టర్ నారపరాజు శ్రీధరరావుగారు. 1961లో మొదటిసారి జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను చూశారు. ఒకసారి చూసినవారెవరూ అమ్మను వదలలేరు. నిజానికి అమ్మే వారిని వదలదు.

శ్రీధరరావుగారిది ఇంకొల్లు గ్రామం (ప్రకాశం జిల్లా). వారి తాతగారు రామచంద్రయ్య ఆయుర్వేద వైద్యులు- కవి. తండ్రి సీతారామయ్య సంస్కృత పండితులు, ఉపాధ్యాయులు. వీరిద్దరి నుండి శ్రీధరరావుగారికి అటువైద్యము ఇటు కవిత్వము ఇంటబుట్టి వంటబట్టినయ్యనుకుంటాను. అయితే పార్వతీదేవికి తపస్సు చేసి పరమేశ్వరుడు ప్రత్యక్షమై స్వీకరించినతర్వాత గాని తాను సతీదేవిననే విషయం తెలియలేదు. అలాగే శ్రీధరరావుగారికి కూడా జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించిన తర్వాతనే వారిలోని కవితా శక్తి ఉద్బుద్ధం కాలేదు. 'కవిత పుట్టిల్లు ఇంకొల్లు కరణమిల్లు' అనే నానుడి ఉన్నా శ్రీధరరావుగారు మాతృశ్రీ పదపద్మ సేవాలబ్ధ సారస్వతుండను అని చెప్పుకున్నారు. శ్రీధరరావుగారు అమ్మను గూర్చి నివేదన, అమ్మ, వ్యాకృతి, అమ్మ అలంకృతి, అమ్మ యతి అనే గ్రంధాలే కాక దాదాపు 18 గ్రంధాలు వ్రాశారు.

వైద్య విద్యను నేర్చిన శ్రీధరరావుగారు రెండవ ప్రపంచ యుద్ధంలో ఐ.యమ్.స్ ఆఫీసర్‌గా పనిచేశారు. విశాఖపట్నం ఆంధ్రవైద్య కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగించారు. అటు దేశసేవ, ఇటు భాషాసేవ, రెండూ చేశారు.

చీరాలలో 1960లో వైద్యశాల ఏర్పాటు చేసుకొని సేవాభావంతో రోగులకు ఆరోగ్యాన్ని చేకూర్చే రోజులలో 1962లో అమ్మ వారింటికి వెళ్ళింది. పదిహేను రోజులున్నది. అదే వారి జీవితానికి పెద్ద మలుపు.

అమ్మ వాడరేవులో ఉండగా శ్రీధరరావుగారు అమ్మను దర్శించటానికి వెళ్ళారు. అమ్మ వారితో పూరీలు చేయించుకురారా! అమ్మ అడగటమే మహాభాగ్యమని పూరీలు చేయించుకొని అమ్మ వద్దకు తీసుకొని వెళ్ళారు. అయితే అమ్మ దర్శనం కాలేదు. కొన్ని గంటల కాలం అలావేచి ఉండాల్సి వచ్చింది. మామూలుగా కోపస్వభావుడైనా అమ్మతో వ్యవహారం కనుక ఎంతో ఓర్పుతోనే ఉన్నారు. కానీ సహనం పోయి ఆ పూరీలన్నిటిని సముద్ర తీరంలో ఉన్న జాలరివాళ్ళకు, కుక్కలకు, పందులకు పెట్టారు. ఖాళీ చేతులతో తిరిగివస్తూ పోని ఇప్పుడైనా అమ్మ దర్శన మవుతుందేమో చూద్దాం అని వచ్చారు. ఈసారి వెంటనే అమ్మ దర్శనమైంది. నిష్ఠూరంగా జరిగింది అమ్మకు నివేదించారు. అమ్మ 'పోనీలే నాన్నా! వాటికి మాత్రం ఎవరు పెడతారు? ఎవరు తింటే ఏమిట్లే?" అన్నది అయినా పూరీలు తీసుకు రమ్మన్నది తనకోసం కాదు. సముద్ర తీరంలోని ఆ జంతువుల కోసం, జాలర్ల కోసమే. అలా వాటికి పెట్టాలనే ఆ ప్రేరణ ఇచ్చింది అమ్మే కదా! అవి కూడా అమ్మ సంతానమే కదా! శ్రీధరరావుగారిలోని ఆ ఆలోచనకు లోచనం అమ్మదే...

శ్రీధరరావుగారి రెండవకుమార్తె వివాహం 1962 జూన్‌లో అమ్మ దగ్గర ఉండి జరిపింది. అలాగే శ్రీధరరావుగారి శ్రీమతి ప్రభావతి గారికి మెనోపాస్ సమయంలో రోజూ అధిక రక్తస్రావమౌతూ బాధపెట్టేది. ఎన్ని మందులేసినా తగ్గలేదు. శ్రీధరరావుగారికి ఏం చేయాలో తోచలేదు. ఆఖరికి ఆపరేషన్ చేయించాలి అని కూడా అనిపించలేదు. అమ్మ చీరాలలో పర్యటిస్తూ మీ యింటికి వస్తున్నాని కబురుచేసింది. ఆ రోజున కూడా ఆమెకు బాగోలేదు. అమ్మకు హారతివ్వటానికి కూడా ఆమె బయటకు రాలేకపోయింది. అమ్మ ఆమె ఉన్న గదిలోకి వెళ్ళి తన అమృతహస్తంతో పొత్తికడుపును నిమురుతూ "ఇక్కడేనా అమ్మా! నొప్పి" అని అప్యాయంగా పలకరించింది. ఔనన్నది ఆమె. అంతే తగ్గించుమని అమ్మను అడగలేదు. అమ్మకు చెప్పలేదు. ఆ రోజునుండి ఆ బాధనుండి విముక్తి పొందింది. ఆ తర్వాత కూడా డాక్టర్ గారికి అంతుచిక్కని బాధలు ఆమెకు వచ్చి వేధించాయి. అమ్మ అనుగ్రహంతో మాయమై ఆరోగ్యవంతురాలైంది.

శ్రీధరరావుగారు ప్రసిద్ధ వైద్యుడే అయినా ఒక్కొకసారి భగవచ్ఛక్తి తోడైతే తప్ప మందులు కూడా పనిచేయవేమో– వారి మూడవ కుమార్తెకు అన్నం అరగక

వాంతులవుతూ కడుపు నొప్పితో నరకయాతన అనుభవించేది. ఎన్ని మందులు వాడినా తాత్కాలిక ఉపశమనమేగాని జబ్బు తగ్గలేదు. అమ్మ మదరాసు వెళుతూ శ్రీధరరావును కూడా తమతో రమ్మన్నది. ఇల్లు వదిలి బయటకు వెళ్ళటానికి తొందరగా ఇష్టపడడు. అమ్మ పట్టుబట్టడంతో అమ్మతో మద్రాసుకు వెళ్ళక తప్పింది కాదు. ఆయన మద్రాసులో ఉన్నప్పుడు ఆ మూడవ అమ్మాయికి మళ్ళీ నొప్పి వచ్చింది. చీరాలలోని శ్రీధరరావుగారి మిత్రుడు డాక్టర్ ప్రతాప్ కుమార్‌కు చూపించటం జరిగింది. ఆ డాక్టర్ ఈ అమ్మాయికి ఎపెండిసైటిస్ 24 గంటలలోపల ఆపరేషన్ చేసితీరాలి. డాక్టర్‌గారు ఎక్కడ ఉన్నా వెంటనే పిలిపించండి అన్నారు. ఆశ్చర్యం అమ్మ అదే సమయానికి శ్రీధరరావుగారిని ఫోన్లు టెలిగ్రాములు లేకుండానే చీరాల వెళ్ళమని చెప్పటం జరిగింది. శ్రీధరరావుగారూ రావటం వెంటనే ఆపరేషన్ చేయించటం జరిగింది. శ్రీధరరావుగారే ఉంటే ఏదో మందు వేసేవారు. తాత్కాలికంగా తగ్గేది. చివరకు ప్రాణాపాయ స్థితి వచ్చేది. అమ్మవారిని తనతో తీసుకొని వెళ్ళి వేరే డాక్టరు చేత పరీక్ష చేయించి సమయానికి మళ్ళీ పంపించింది అంతా అమ్మ చూపించిన లీలగా వారు భావించారు.

అమ్మను గూర్చి వారి మాటలలోనే చెప్పాలంటే “అమ్మ జీవితమే వేదము శాస్త్రములలోని సత్యముల కాచరణ రూపమయిన బృహద్గ్రంథమామె జీవితము. ఒకసారి అమ్మ పరిచయము గల వ్యక్తి మనః ఫలకముపై ఆమె మాటలు తుడిచి వేయరాని శిలాక్షరములు. ఆమె మానవ నైతిక ఆర్థిక ప్రగతికి ధృవతార”.

‘నివేదన’ అనే అమ్మను గూర్చి వ్రాసిన గ్రంథం అంకితమిస్తూ హైమను గూర్చి వారు పలికిన పలుకులు ఆణిముత్యాలు, అక్షరసత్యాలు” హిమమువంటి హైమకు, బంగారమునకు తావి తెచ్చు హైమకు, హిమాలయమువలె ఉన్నతమైన హైమకు, కోరికలు లేని హైమకు, జీవించుటకు ఆహరించు హైమకు- నిరాడంబరమూర్తి హైమకు- ఒక అన్నకాలిలో ముల్లునకు, ఒక చెల్లెలి కాలిన కాలికి ఒక తమ్ముని జ్వరమునకు, ఒక అన్న గుండెలో దిగబడిన కత్తికి, ఒక నేరస్తునకు విధింపబడిన శిక్షకు, ఒక కాఫీ కప్పులో బడి చనిపోయిన చీమకు, ఒక గూటి నుండి పడి గిలగిల లాడెడు పిచ్చుక పిల్లకు నవ్య నవనీతమగు నిండు హృదయంతో అత్యంత ఆత్మీయతతో కన్నీరు కార్చే హైమకు - సర్వజీవరాసుల బాధను తనదిగా గణించు హైమకు ప్రాణావసాన పర్యంతము దేహధారులకు సుఖదుఃఖములలో అమ్మ నామము ఎట్లు చేయవలెనో చూపిన హైమకు- వయసున

పిన్నయయ్యు సర్వకాల సర్వావస్థల యందు నాకు ఆదర్శ ప్రాయురాలైన హైమకు" అంకితమిస్తున్నాను- ధన్యోస్మి అన్నారు.

నిజానికి హైమకు, నాన్నగారికి వైద్యం చేసిన వైద్యుడాయన. అయినా వారి భావాలు ఎంత స్పష్టంగా, పరిణతి చెందిన జీవిత క్షణాలు కనిపిస్తున్నాయో గమనించండి.

అమ్మకు "లాలిశ్రీ మాతృమూర్తీ! అతిలోక కారుణ్య రాజ్యవర్తీ! లాలిసౌజన్యకీర్తి! బుధవినుత పాదనీరజ స్ఫూర్తీ!" అంటూ వారు వ్రాసిన లాలిపాట జగద్విదితం. అంధసోదరులు శ్రీయార్లగడ్డ రాఘవయ్యగారి నుండి కవితా స్ఫూర్తిని పొంది, అమ్మ అనుగ్రహంతో వారి కవితా స్రవంతి సుదూరం ప్రయాణం చేసి వ్యాకరణం, అలంకారం, భక్తి, శృంగారం, సామాజిక విశ్లేషణ, యోగము, జ్ఞానముల గుండా ప్రయాణం చేసి నామరూపాతీతమై మాతృశ్రీ కృపాజలధిలో లీనమైంది.

అందువల్లనే అమ్మలోకి వారి మహాభినిష్క్రమణం కూడా విశిష్టంగా వివేక వివేచనలోనే జరిగింది. మూడు సంవత్సరాలు మంచానికి పరిమితమైనా అమ్మ వారికి బాధనివ్వలేదు. మరణానికి ముందు రోజు కూడా వారి అల్లుడు శ్రీమన్నారాయణ మూర్తితో సంభాషిస్తూ "మరణమంటే మార్పేగదా!" అన్న అమ్మ మాటను, సనత్సుజాతీయంలోని "దేహానికి సంబంధించిన మార్పుల కంటే దేహాన్ని ధరించిన వాడు అతీతంగా ఉన్నాడని గుర్తిస్తే అంతర్యామితత్వం అనుభవంలోకి వచ్చి అమృతత్వం సిద్ధిస్తుంది. ఆస్థితి నుండి ఏమరుపాటు కలిగితే అదే మరణం" అని శ్రీమన్నారాయణ గారు చెప్పగా శ్రీధరరావుగారు అయితే ఏమరుపాటులేకపోతే మరణానికి దుఃఖించవలసిన పనిలేదుగా, అసలు మరణం లేదుగా, అమ్మను గూర్చి నిరంతర చింతన వారిని చిరంజీవిని చేసింది. "నరః పతిత కాయోపి యశః కామేనజీవతి! నాసితతేషాంయశః కాయే జరామరణజంభయమ్" అన్నట్లు వారి కీర్తి. శరీరాలు నిలచే ఉంటాయి. వారిప్పుడు అమ్మలోనే ఉంటారు. వారింటికి వచ్చిన వారికి ఎలామృష్టాన్న భోజనం పెట్టారో, అలాగే, వారి రచనలలో కవితా పిపాసువులకు, ఆధ్యాత్మిక జీవులకు మృష్టాన్నభోజన సంతృప్తి కలిగించిన ధన్యజీవులు శ్రీ శ్రీధరరావుగారు.



41. ప్రభావతక్కయ్య

ప్రభావతక్కయ్య 01.09.1942న తూర్పుగోదావరిజిల్లా అమలాపురం తాలూకా పుల్లేటికుఱ్ఱు గ్రామంలో మాతామహుల ఇంట్లో పుట్టింది. బాపట్ల తాలూకా కొమ్మూరులో ఉన్న గంగరాజు లోకనాథరావు, బుచ్చమ్మల కుమార్తెగా అరుగురుతోబుట్టువులలో రెండవ సంతానం. లోకనాథంగారు, నాన్నగారు (బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు) సన్నిహితులు, స్నేహితులు. ఆ రకంగా తరచూ జిల్లెళ్ళమూడి వస్తూ అమ్మ చేతి వంట తిన్న అదృష్టవంతుడు లోకనాథంగారు. అమ్మతో ఆ రోజులలో సీతారామాంజనేయ సంవాదం పుస్తకంలోని విషయాన్ని గూర్చి సంభాషించినవాడు. ఆయన కుమార్తె ప్రభావతి. అమ్మతో సంభాషించిన లోకనాథంగారికి అమ్మ మానవాతీత శక్తిపట్ల విశ్వాసం కుదిరింది. గంగరాజు లోకనాథంగారి కుమార్తె ప్రభావతి 1955లో తన 13వ యేటనే అమ్మ సేవకు వచ్చింది.

లోకనాధంగారిని షుగర్ జబ్బుతో గుంటూరు హాస్పిటల్‌లో చేర్చారు. కాలు తీసివేయాలన్నారు. అప్పుడు అమ్మ హాస్పిటల్‌కు వెళ్ళి "ఏది ? ఈ కాలేనా? ఎక్కడ నుండి తీసివేయాలి' అంటూ చేతితో ఆ భాగాన్ని రాసింది. ఆపరేషన్ లేకుండానే ఆ తర్వాత నయమయింది. ఆ సమయంలో అమ్మ ప్రభావతితో రిక్షాలో రాజుబావ వాళ్ళ ఇంటికి వెళ్తూ 'నాతో జిల్లెళ్ళమూడి వస్తావా?' అని అడిగింది. ప్రభావతి వస్తానన్నది. అక్కడ ఇక్కడ ఉన్నట్లుండదు ఇల్లు, తేళ్ళు, పాములు, ఎలుకలు, పిల్లులు ఇంట్లో తిరుగుతుంటాయి అన్నది. 'నీవుండగా

నాకేమి భయంలేదు వస్తాను' అన్నది ప్రభావతి. ప్రభావతికి ఉబ్బసం ఉండటంతో అమ్మ వద్ద ఉంచితే తగ్గుతుందని లోకనాధంగారి నమ్మకం. అమ్మకు పనులలో సాయంగా ఉంటుందని మరొక కారణం. ఉభయతారకంగా ఉంటుందని ఉంచితే అప్పుడప్పుడు వాళ్ళ అమ్మ మీద ధ్యాసమళ్ళేది. మళ్ళీ జిల్లెళ్ళమూడి ఇలా తిరుగుతూ, తిరుగుతూ అమ్మ దగ్గరే ఎక్కువ కాలం గడపటం అలవాటు చేసుకొన్నది. అమ్మే ప్రభావతికి సుబ్బారావును రవి, హైమలను అప్పజెప్పింది.

రాజుబావ తండ్రి బాలకృష్ణశర్మగారు, ప్రభావతి తండ్రి లోకనాథంగారు మేనత్త మేనమామపిల్లలు. ఆ రకంగా రాజుబావ ప్రభావతి బావామరదళ్ళు. 1958 మార్చిలో వారి వివాహం జరిగింది. వారి వివాహంలో అమ్మ మంగళహారతి పాడింది. "రాజరాజేశ్వరి ! దేవి కన్యాకుమారి ! రక్షించు జగదీశ్వరి! కావవే" అంటూ జగన్మంగళకారిణి పాడిన పాట వారి జీవితాలకు బాటలు వేసింది. పల్లకీలలో ఊరేగుతున్న వారి వెంట పల్లకిపై చేయి వేసి నడిచింది.

అదృష్టం ఏమిటంటే అమ్మ చేతులమీదుగా జరిగిన మొదటి వివాహం కూడా ప్రభావతి రాజుబావలదే. రాజుబావ అమ్మచరిత్రను అమ్మ తాత్త్వికచింతనను అర్థం చేసుకొని వ్రాసిన గీతాలు అమ్మ చేత అంగీకరింపబడి రాజుబావను ఒక వాగ్గేయకారుని స్థాయిలో నిలబెట్టాయి. పెళ్ళి అయిన తర్వాత కూడా రెండు సంవత్సరాలు ప్రభావతి జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గరే ఉన్నది. రాజుబావే ఉద్యోగానికీ జిల్లెళ్ళమూడికీ తిరుగుతుండేవాడు.

ప్రభావతి రాజుబావలకు పుట్టిన పిల్లలు నలుగురు సుహాసిని, సుభాషిణి, హైమ, ప్రేమకుమార్, బాలకృష్ణశర్మలకు అమ్మచేతనే నామకరణం చేయించారు. నామకరణం తర్వాతనే అమ్మచేతులమీదగానే పిల్లలను రాజుబావ తన చేతులలోకి తీసుకొనేవాడు.

ప్రభావతి అమ్మ సమాధిస్థితిలోకి వెళ్ళటం, ముద్రలు పడటం, ఎన్నోసార్లు చూచింది. అమ్మకు హారతి యిస్తే అమ్మే 'కృష్ణా ! మా యింటికి రారాదా!' అనే పాట పాడటం విన్నది. అమ్మ ఇతర భాషలలో మాట్లాడటం విన్నది. రెండు వందల మంది వచ్చినా అవలీలగా వంట చేసి పెట్టేది. ఎన్నోసార్లు తనకు తేళ్ళు కుట్టినా ఏమందూ వాడకుండా తగ్గపోయేది.

అమ్మ – ప్రభావతి చేత హైమచేత తెల్లవారుఝామున ధ్యానం చేయించేది. ప్రభావతి అమ్మ సేవకు ఎక్కడ ఆటంకం అవుతుందోనని అన్నం తినటం మానేసింది. ఒక మాఘపూర్ణిమ రోజున అమ్మ గంటా ముప్ఫై నిమిషాల కాలంలో 600 మందికి మంత్రోపదేశం చేసినప్పుడు ప్రభావతి కూడా మంత్రోపదేశం పొందింది. సాధన విషయంలో అమ్మ ప్రభావతితో 'ప్రత్యేకించి సాధన చెయ్యవలసిన పనిలేదు. నీ మనస్సు ఎప్పుడూ నా మీదే ఉంటుంది' అని చెప్పింది. పెళ్ళి అయిన తర్వాత శ్రావణమాసం నోములు నోయించటానికి ప్రభావతి వాళ్ళ అమ్మ తీసుకెళ్ళుతానన్నది. 'దానికే వ్రతాలు అక్కర్లేదు' అన్నది అమ్మ.

అమ్మ అన్న ప్రకారమే ప్రభావతి ఏ పనిచేస్తున్నా ఎక్కడ ఉన్నా మనస్సు మాత్రం అమ్మ ధ్యానంలోనే ఉండేది. అమ్మ ఆలయంలో ప్రవేశించిన తర్వాత కూడా కలల్లో అమ్మ కనిపించేది. జ్యోతిస్వరూపంగా కూడా దర్శనం ఇచ్చేది. అమ్మ ఇచ్చిన మట్టి, కుంకుమ ఎంతో సువాసన రావటం గమనించింది. అమ్మలోని అణిమ – గరిమ శక్తులు చూచింది. ప్రభావతి అమ్మను తాను ఎత్తుకుండేంత తేలికగా అయిపోయేదిట. అమ్మ తన కోసం కాకపోయినా ఎవరికోసమో అడిగి అడిగి పదార్థాలు చేయించుకొని తినేది. అమ్మ ఎంతో మందికి తీర్థంతో, బత్తాయి రసంతో జబ్బులు తగ్గించిన సన్నివేశాలు చూసింది. పాలు, ఆవకాయ అన్నం, సాంబారు అన్నం బారెన్ వద్ద పెడితే శ్యామల, శకుంతల, అపర్ణవంటివారు తినిపోయేవారు. నాన్నగారు ఎక్కడ ఉన్నా రాత్రిళ్ళు జిల్లెళ్ళమూడి నుండి అమ్మ మాట్లాడుతుంటే చూసింది ప్రభావతి. కొమ్మూరులో ఆంజనేయస్వామి విగ్రహం వెనుక అమ్మ కనిపించింది. అమ్మ నాగేంద్రుని రూపంలో చాలామందికి కనిపించటం కూడా గమనించింది. అమ్మ కట్టుకున్న చీరెలు, రవికలు కూడా మంచి సువాసనలు వెదజల్లటం గమనించి అడిగితే అమ్మ 'దానిదేముంది నీ గుడ్డలూ అలా వాసనలు వస్తాయి అన్నది'. అలా అన్న కొద్దిరోజులు ప్రభావతి గుడ్డలు కూడా సువాసనలు వచ్చేవి. ఏది ఏమైనా ప్రభావతి జీవితాన్ని అమ్మ తీర్చిదిద్దింది. ప్రభావతి అనారోగ్యంతో ఉంటే హాస్పిటల్‌లో చేరిస్తే అమ్మ, హైమ ఆమెకు ఇరుప్రక్కల నిలబడటం ప్రభావతి చూసింది అమ్మ చెప్పిన రీతిలో పతిని దేవతగా భావించి సేవించింది. సంసార సముద్రాన్ని ఈదింది. అమ్మఒడ్డుకు చేరింది.

శరీరం వచ్చిం తర్వాత ఎప్పటికైనా రాలిపోక తప్పదు. లోకంలో ముత్తయిదువగా కాలం చేసిన వారంతా గౌరీలోకానికి వెళ్ళుతారని నానుడి. భర్తను వదిలి ముందుగా శరీరాన్ని స్త్రీలు వదలటం అమ్మ హర్షించలేదు. స్త్రీలు భర్తను ముందు పంపి తర్వాత భార్య శరీరం వదలటం ధర్మం అన్నది. స్త్రీలకు అంత స్వార్థం పనికిరాదన్నది. భర్త కన్నా ముందు వెళ్ళినా, భర్తను పంపి తర్వాత వెళ్ళినా వెళ్ళేది ఒక చోటికే, ఆ గౌరీలోకానికే, తనలోకే అని స్పష్టంగా చెప్పింది. ఏదైనా అమ్మ సేవలో, అమ్మ భావనలో తరించిన ప్రభావతి ధన్యురాలనడంలో సందేహం లేదు.

అమ్మ నాన్నగార్ల కుటుంబంలో ఒదిగిపోయి సేవలు జేసింది. చివరి సమయంలో అమ్మను, హైమను దర్శనం చేసుకొన్నది. 8.1.2012 ఆదివారం ఆదిశక్తి అయిన అమ్మలో లీనమైంది. ధన్యురాలు ప్రభావతి.

ప్రభావతి అక్కయ్య అంత్యేష్టి యజ్ఞాన్ని రాజుబావ, వారి పిల్లలు జిలెళ్ళమూడిలోనే అమ్మ సన్నిధిలో జరపాలని నిర్ణయించారు. అమ్మ చేయించే రీతిలో అనసూయేశ్వరాలయంలో కొడుకు, కోడలు అభిషేకాలు చేశారు. రాజుబావ తాను అమ్మను గూర్చి వ్రాసిన పాటలనన్నింటినీ అమ్మ సమక్షంలో పాడి అమ్మకు నివేదన చేశారు.

పతివ్రతకు పరాకాష్ఠ భర్త చేత కూడా తల్లిగా ఆరాధింపబడటం అనే అమ్మసూక్తి నిదర్శనంగా రాజుబావ ప్రభావతికి చేసిన ఈ గీతనీరాజనం అమ్మ ప్రభావతికి అందించి ఉంటుంది. ప్రభావతిని తనలో లీనం చేసుకొని ఉంటుంది. ఆ రకంగా ప్రభావతి మనందరికీ ఆదర్శవంతురాలైంది.



42. చీరాల డాక్టరు పొట్లూరి సుబ్బారావుగారు

'అందరమ్మచే' 'అమ్మ' అనిపించుకున్న అదృష్టవంతుడు

చీరాల డాక్టరు గారుగా జిల్లెళ్ళమూడిలో సుప్రసిద్ధుడైన శ్రీ పొట్లూరి సుబ్బారావుగారు అమ్మ వద్దకు తొలిరోజులలో వచ్చిన వారిలో ముఖ్యులు. చీరాలలో ఆయుర్వేద వైద్యం చేస్తుండేవారు. నోరి వేంకటేశ్వర్లుగారు, బెండపూడి అక్కిరాజుగారు, శ్రీహర్షరావుగారు. సుబ్బు ప్రసాద్ మొదలైన వారితో కలిసి జిల్లెళ్ళమూడి వచ్చేవారు. బాగా బస్కీలు, దండీలు కొట్టి లోడీలు త్రిప్పిన శరీర బలాఢ్యులు, కొంత హఠయోగంలో కూడా పరిశ్రమ చేసారు. గదిలో భూమికి కప్పుకీ మధ్యలో గాలిలో తేలియాడుతుండేవారు. ఓడరేవు వద్ద నున్న పశుమలై స్వామి వద్దకు వెళ్లేవారు. ఆధ్యాత్మికంగా చాల గ్రంథాలు చదివారు. చాలమంది సాధువులను దర్శించారు.

మొదటిసారి అమ్మను బాపట్లలో భావనారాయణ స్వామి ఆలయం వద్ద ప్రక్క సందులో ఉండగా చూడటానికి వెళ్లారు. అందరూ నమస్కారం చేశారు. ఒక స్త్రీకి నమస్కారం చేయడానికి ఆయన మనసు ఇష్టపడలేదు. అమ్మను పరీక్షించడానికి తను పూర్వం సాధించిన ఒక క్షుద్రశక్తినే ప్రయోగించారు. అయితే అమ్మపైన అది పని చేయక పోగా అమ్మ ఎదుట ఒక గంట నిలబడ్డ ఆయన శరీరం ఆయన అధీనం తప్పి వణికిపోయి ఆయన తల అమ్మ పాదాల మీద

వాలిపోయింది. ధృఢమైన తన శరీరం తన అధీనంలో లేకుండా పోవడానికి అమ్మలో ఏదో శక్తి ఉన్నదని అనిపించింది. మళ్ళీ మరునాడు అమ్మ వద్దకు వెళదామని లోపల ఏదో తపన ఈసారి కెమేరా తీసుకొని వెళ్ళి ఫోటోలు తీద్దామనిపించింది. వెళ్ళి ఫోటోలు తీసారు. ఇలా అమ్మ వద్దకు వెళ్ళాలనిపించడం వెళ్ళి ఫోటోలు తీయడం అలవాటయింది. ఒక వంద ఫోటోలు తీసి అమ్మకు ఇచ్చారు. అమ్మ అందరికీ పంచి పెట్టింది వాటిని. ఫోటోలు తీయడం ఆయన వృత్తి కాకపోయినా కొన్ని వేల ఫోటోలు తీశారు. ఒక ఫోటోకు మరో ఫోటోకు మరో ఫోటోకు సంబంధం లేదు. ఒకే సమయంలో తీసిన ఫోటోలలో రకరకాల వయసులలో అమ్మ సాక్షాత్కరించింది. అమ్మ ఇష్టం లేకపోతే ఒక్క ఫోటో కూడా వచ్చేది కాదు. "కంపెనీ వాడి" అనుజ్ఞ లేకపోతే ఏమీ జరుగదు అనేవారు. మనమంతా సర్కసులో ఆడే జంతువుల మనీ మనల్ని ఆడించే శక్తి అమ్మ అనీ డాక్టరు గారు తరచుగా చెపుతుండేవారు. అంతేకాదు అమ్మ రేడియో స్టేషన్ అనీ, మనమంతా రేడియో సెట్లమనీ, మనలోని శక్తి కొద్దీ మాత్రమే అమ్మ నుండి గ్రహించగలమనీ అనేవారు.

వారు అమ్మ వద్ద ఉండగా చీరాలలో వాళ్ళ ఇంటిలో దొంగలు పడి పాతరలో వున్న వడ్లన్నీ దోచుకొని పోయారు. ఆ విషయం తెలిసి నీ అనుగ్రహం ఇట్లా ఉన్నదమ్మా' ఈ యేడు తిండికి కూడా ఇబ్బందే- అని అమ్మతో నిష్ఠూరంగా మాట్లాడారు. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఎప్పుడో తన వద్ద మందు తీసుకొనిన ఒక పల్లెటూరి రైతు ఒక బండి వడ్లు ఊరికే తోలిపోయారు. అమ్మను నిష్ఠూరంగా మాట్లాడటం కూడా మంచిదే అనుకున్నారు డాక్టరుగారు.

కొంతకాలం చీరాలలో ఊరి బయట ఎడారిలో ఒక ఇంట్లో కాపురమున్నారు. ఆ రోజులలో ఒకసారి అమ్మ దైవం కదా! ఆమెను నమ్ముకున్న వాడిని నన్నేం చేస్తుంది. విషం అని గరళం మ్రింగాడు. అమ్మ రక్షించింది. అయితే తర్వాత జిల్లెళ్ళమూడి వచ్చినప్పుడు పిచ్చి వేషాలు వేయవద్దని మందలించింది.

వారు రేడియోలు రిపేరు చేసేవారు. రేడియోలో నుండి తరచుగా అమ్మ మాటలు వినిపిస్తుండేవి వారికి, అమ్మ తనని కనిపెట్టి చూస్తున్నదని భావించేవారు.

ఒకసారి నాన్నగారి కోరికపై అమ్మ ఆరోగ్యం డాక్టరుగా పరీక్షిస్తున్నారు. అమ్మది ఉష్ణశరీరం, రక్త క్షీణత అనుకున్నారు. అమ్మతో 'కాళ్ళ నొప్పులు కూడా

ఉన్నాయా అమ్మా?' అని అడిగారు. అమ్మ దానికి "ఆ ! అన్నీ ఉన్నాయి. శాస్త్రాలలో ఎన్ని రోగాలున్నాయో అన్నీ యిప్పటికున్నాయి. సర్వరోగ సమన్వితాయై నమః" అన్నది. దాంతో డాక్టరుగారు అమ్మకున్న రోగాలు మనం నయం చేసేవి కావు. ఆమె భిషగ్వరేశ్వరి. ఆమే నయం చేసుకోవాలి. ఆ సంకల్పం చేసుకోవలసింది అమ్మే అనుకున్నారు.

పరమయోగులకు అవసాన దశలో జరిగే కపాల భేదనం అమ్మకు జీవించి వుండగానే జరిగింది. అమ్మ బ్రహ్మరంధ్రం పగిలి రక్తం కారి మెదడు మెత్తబడటం మొదట గుర్తించింది చీరాల డాక్టరుగారే - 1960 దశకంలో పూజా సమయంలో అమ్మలో ఎన్నో దేవతా ముద్రలు పడటం చూచారు- వాటిని ఫోటోలు కూడా తీసారు.

ఒకసారి డాక్టరుగారు అమ్మతో "ఒకే సమయంలో జిల్లెళ్ళమూడిలోను, చీరాలలోను ఉండగలవా?" అని అడిగారు. అందుకు అమ్మ "అక్కడా, ఇక్కడా కాదు సర్వత్రా సర్వదా ఉంటాన"న్నది. "నీవు లేవు "నేనే" ఉన్నాను" అన్నది.

చీరాలలో అమ్మ హాస్పిటల్‌లో వుంటే అమ్మను చూడటానికి చాలమంది వచ్చారు. చీరాల డాక్టరు గారికి మాత్రం అమ్మకు ఈ బాధలు లేవనిపించేవి. డాక్టరు సుబ్బారావు గారు రాకముందే- "వాడు వస్తాడు. ఫొటోలు తీస్తాడు" అని అందరికీ చెప్పేది అమ్మ.

ఒకసారి డాక్టరుగారు అమ్మతో ఇంతకాలం బట్టీ నీ వద్దకు వస్తున్నాను, నాలో ఏ మార్పూ లేదే అని అడిగారు. అందుకు అమ్మ "నాన్నా! నీవు దేనికి వస్తున్నావో నాకు తెలుసు. జ్ఞానం అంటే వస్తువును వస్తువుగా గుర్తించటమే. ఉన్నదాన్ని ఉన్నట్లుగా చూడటం జ్ఞానం, నువు చూస్తూనే వున్నావు" అన్నది.

డాక్టరుగారు అమ్మతో మాట్లాడాలంటే అర్థరాత్రి గం. 12 నుండి 1.30 మధ్యకాలంలో మాట్లాడేవారు. అమ్మ నిరంతర నిర్నిద్ర అనేవారు. ఆమె గాఢ నిద్ర కలది అనేవారు. దానికి ఎన్నో ఉదాహరణలు చెప్పేవారు. మొదట్లో అమ్మకు ఫొటోలు తీయడం కూడా ఆ సమయంలో జరిగేది. అమ్మ కెమెరా తీసుకొని ఎంతో మంది అజ్ఞాత వ్యక్తులకు ఫొటోలు తీసి ఫలానావారు ఫలానావారు అని చెప్పేదిట. అమ్మను చూచినపుడు, తెలియని దుఃఖం వచ్చేది ఆయనకు. 'కాని

అది భక్తి, ఆర్తి అని అనుకోవడం లేదు నేను' అనేవారు. కానీ ఏదో భావోద్వేగం. అదీ అమ్మ కల్పించిందే అనేవారు.

నాన్నగారికి అమ్మ ధ్యాన సమాధి ఇచ్చిందిట. ధ్యానంలో నాన్నగారికి అమ్మే దర్శనం ఇచ్చిందిట. ఆయన దృష్టి మూలాధారం నుండి భూమిలోకి పోయిందిట. నాన్నగారు రాఘవరావు మామయ్యగారు కూడా అమ్మను అమ్మ అని పిలవడం డాక్టరుగారు ప్రత్యక్షంగా దర్శించారు. డాక్టరు గారికి జిల్లెళ్ళమూడిలో అమ్మ ఏ చీర కట్టుకుందో అలాగే కనిపించేది. ఎక్కడ కూర్చుందో ఎలా వుందో అలాగే కనుపించేది. పరీక్ష కోసం జిల్లెళ్ళమూడి వెళ్ళి చూచేవారు. అట్లాగే ఉండేది. అమ్మ ఆవిధంగా ఆయనను అనుగ్రహించింది దివ్యదృష్టితో.

తరువాత డాక్టరుగారు ఆయుర్వేదం నుండి హోమియోవైద్యంలోకి మారారు. వచ్చిన ప్రతిరోగికి అమ్మ విషయాలు చెప్పుతూ అమ్మ ప్రసాదంగా మందులిచ్చేవారు. దానితోనే రోగులకు టెన్షన్ తగ్గి ప్రశాంతత చిక్కేది. నిరంతరం అమ్మ స్మరణ తప్ప మరొకటి ఉండేది కాదు వారికి. అమ్మ ఫోటోలే కాక వీడియో టేపులు కూడా ఎన్నో తీసారు. ఆయన తీసిన ఫోటోలు జనాన్ని నిలబెట్టేవి. మొదటి రోజులలో అమ్మను సశరీరంగా సజీవంగా దర్శించాలంటే ఈ నాటికీ డాక్టరుగారు తీసిన వీడియోలు, ఫోటోల్లే మనకు ఆధారం. అమ్మ పుట్టిన రోజున అమ్మ నెత్తిన చమురు పెట్టి స్నానం చేసిన తరువాత, కుటుంబ సమేతంగా పూజ చేసుకునేవారు. అలాగే ముక్కోటి నాడు కూడా పూజ చేసేవారు. అమ్మకు వారు చేసే సేవానురాగాలు ఒకరకంగా పుట్టింటి వారిని కూడా మురిపించేవి.


డాక్టరుగారు ఒకసారి కీళ్ళ నొప్పులు సయాటిక్ పెయిన్స్‌తో బాధపడుతూ ఆ నొప్పుల బాధ భరించలేక కరెంటు తీగెలు పట్టుకొని అమ్మలో కలసి పోదామనుకున్నారు. ఏ రోజున చనిపోవాలనుకున్నారో ఆ రోజు అమ్మ వేటపాలెంలో రామచంద్రరావు గారింటికి వెళ్ళి తిరిగి వస్తూ డాక్టరు గారింటికి వచ్చి వారి చెయ్యి పట్టుకొని చూచి వెళ్ళింది. అంతే ! ఆ రోజు నుండి డాక్టరు గారికి నొప్పులు తగ్గిపోయాయి.

1958లో అన్నపూర్ణాలయం ఏర్పాటు విషయంలో కూడా చీరాల వారిదే అగ్రతాంబూలం. డాక్టరుగారు నాన్నగారితో మాట్లాడి వారిని ఒప్పించారు.

అన్నపూర్ణాలయ ఏర్పాటుకు నాన్నగారికి, డాక్టర్‌గారి పట్ల గౌరవం ఉండేది.

చీరాల నుండి వచ్చేవారిలో అమ్మతో సరదాగా చనువుగా మాట్లాడగలవారు. ఏదైనా కావాలంటే అడిగి పెట్టించుకోగలవారు డాక్టరుగారు. పకోడీలు చేసి పెట్టామ్మా! అని అడిగి చేయించుకొని తినేవారు. ఆ రోజుల్లో అమ్మే వంట చేసి పెట్టేది. సుబ్బమ్మ కొట్లో శనగపిండి బదులు తెమ్మని, తెచ్చిన పిండితో పకోడీలు చేసి మళ్ళీ ఆ గిన్నె పంపితే శనగపిండి తరిగేది కాదు. ఆ చిత్రాలన్నీ ఆ రోజులలో వారు దర్శించారు. తర్వాత అమ్మ చిన్న గిన్నెలోని ప్రసాదం ఎంత మందికి పెట్టినా మిగిలి వుండటం మనం కూడా దర్శిచాం!

అమ్మకు సర్వస్యార్పణ చెయ్యటం తప్ప మరో మార్గం లేదు. అమ్మను తెలుసుకోవడం మన వల్ల అయ్యేపని కాదు. ఆమె అనుగ్రహం కోసం ప్రార్థించటం తప్ప. అమ్మకు దోమ, చీమ, సాలె పురుగు, తేలు, కుక్క వంటివి లొంగిపోయి ప్రాణం వదిలాయి. మనుషులైనా అంతే- అర్పణే శరణ్యం. అపుడే అమ్మ అనుగ్రహిస్తుంది. ఒకసారి ఒక సన్యాసి అమ్మ వద్దకు వచ్చారు. సామాన్యంగా పూర్ణ కుంభంతో స్వాగతం చెబితేగాని వారు రారు. అమ్మ చుట్టూ జనం చేరారుగాని ఆయన వద్దకు ఎవరూ పోలేదు. ఆయనకు ఈర్ష్య, అహంభావం కలిగాయి. అమ్మను పరీక్షించాలనుకున్నాడు. కాని వారికి కూర్చుని ఉండగానే వరిబీజం విపరీతంగా బాధపెట్టి లేవలేక పోయారు. అపుడు అమ్మ చీరాల డాక్టరు తన కోసం, వేరే జబ్బు కోసం తెచ్చిన మందు వారికి వేయించి ఆ జబ్బు తగ్గించింది. సర్వాన్ని వదిలిందే సన్యాసం. అమ్మ వీటన్నింటికీ అతీతమైనది అని డాక్టరుగారు తన అనుభవాలెన్నో ఒకసారి వివరించారు.



43. మంత్రాయి

అమ్మ చిన్నప్పుడు మన్నవ రామబ్రహ్మంగారితో కలిసి వాసుదాస స్వామి వద్దకు పోయి తిరగి వచ్చేటప్పుడు దొప్పల పూడి వాస్తవ్యులు బ్రహ్మయ్యగారి బండిలో కొద్దిసేపు ప్రయాణం చేసింది. వాళ్ళింట్లో జీతగాడుగా పనిచేస్తున్న మంత్రాయిని అమ్మలోని అతిమానుషశక్తి ఆకర్షించింది. వాసుదాస స్వామితో అమ్మ జరిపిన సంభాషణ విన్న బ్రహ్మయ్యగారి కుటుంబం అమ్మను చూచి ఈ అమ్మాయేనా కాదా ఆ అమ్మాయి అని తర్కించుకుటుంటే మంత్రాయి ఈ అమ్మాయే అని చెప్పి బండి వెనుకగా నడుస్తున్న అమ్మను బండి తొట్టిలోకి ఎక్కించుకని తన వద్ద కూర్చోబెట్టుకున్నాడు. బండిలోపలికి అమ్మను పంపమని బ్రహ్మయ్యగారి కుటుంబం చెపితే "వద్దు లెండి. నా దగ్గరే కూర్చోనివ్వండి- బలే ముద్దుగా ఉన్నది" అని మంత్రాయి చెప్పాడు. బ్రహ్మయ్యగారి కుటుంబం దొప్పల పూడిలో దిగిపోయి అమ్మను మన్నవలో ఇంటి వద్ద దించి రమ్మని మంత్రాయికి చెప్పారు.

మంత్రాయి అమ్మని తీసుకొని బండిలో బయలుదేరగా అమ్మ మంత్రాయి వివరాలు కనుకున్నది. "మంత్రాయిది 'జడవల్లి' గ్రామమని బంధువులు తీసుకొని వచ్చి బ్రహ్మయ్యగారింట్లో జీతగాడుగా ఉంచాడని చెప్పాడు- బండి వెంట అమ్మ నడుస్తున్నపుడు చందమామ నడచినట్లుందని, కనకదుర్గాదేవి బ్రహ్మయ్యగారికి కనుపించటం ఆయన భార్యకు తను పూజించుకొనే దేవతగా కనుపించటం వాళ్ళంతా అమ్మకు నమస్కారం చేయటం చూచి మంత్రాయి తన్మయుడైనాడు.

అమ్మ తను నడిచి ఇంటికి వెళ్తానన్నది. మన్నవ మురుగుకాల్వదాకా బండిపై దించాడు. పొలానికి మేతకోసం వచ్చినపుడు వచ్చి కనిపించి పొమ్మన్నది. మంత్రాయి తనకు "ఎందుకో అమ్మ పాదాల వద్దనే పడి ఉందామనిపిస్తున్నదని, కానీ తనకు అన్నీ తప్పుడు అలవాట్లే చెడ్డవాడనని అయితే ఎవరు తినలేదన్నా సహించలేనని, తాను మానుకొని అయినా వాళ్లకు పెడతా"నని చెప్పాడు.

అందుకు అమ్మ "మనుషలందరూ మంచివాళ్లే నాన్నా! చెడు వాడెవడయినా ఉన్నాడంటే, మనం అనుకునే ఈ చెడ్డతనాన్ని మనకు ఇచ్చినది భగవంతుడు మాత్రమే" అన్నది.

అంతకు క్రితం మంత్రాయి తన తిండి తిప్పలు కామందుల ఇంట్లోనే గడచిపోతాయనీ వారిచ్చే జీతం పదిహేను రూపాయలు తన చెల్లెలి పెళ్ళికి దాచి పెట్టుతున్నానని చెప్పాడు.

అందుకు అమ్మ పదిహేను రూపాయలు ఏమి సరిపోతాయి ఈ "ఉంగరం" ఉంచు అంటూ తన చేతి ఉంగరం తీసి ఇచ్చింది. వద్దమ్మా! మా కామందులు అరుస్తారు. నీవు చిన్న పిల్లవి అన్నాడు. అమ్మ ఇందాక నాలో మహాత్మ్యాలు చూచానన్నావు! నీకు తెలియంది లేదన్నావు. ఇప్పుడేమో చిన్న పిల్లనంటావు అన్నది. అందుకు మంత్రాయి రెండూ అనిపిస్తున్నయ్యంటాడు.

అమ్మ జిల్లెళ్ళమూడి కాపురానికి వచ్చిం తర్వాత మంత్రాయి వచ్చి నాన్నగారింట్లో జీతగాడుగా కుదిరాడు. కాని తన అన్నం తానే వండుకునేవాడు. అన్నం వండుకుంటే కూరకోసం అమ్మ వద్దకు వచ్చేవాడు. లేకపోతే వచ్చేవాడు కాదు. ఒకరోజు అన్నం వండుకోలేదు. రాలేదు. అమ్మ కబురు చేసినా రాలేదు. నాన్నగారు కబురు చేయించినా రాలేదు. నేను పిల్చినా రాలేదే వీడు అని నాన్నగారు కూడా అనుకున్నారు. అమ్మ వాకిట్లోకి వచ్చి చూస్తే మొత్తన కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు. దొడ్లోకి పిల్చుకొని వెళ్ళి "ఏమిరా! నాకు కూడా చెప్పవా" ? అంటే "నా సంగతి సరేనమ్మా! ఎంతమంది ఉన్నారో ఈ ఊళ్ళో అన్నంతినకుండా అంటూ వారి అందరి పేర్లు చెప్పాడు.

మొదట్లో మంత్రాయికి గ్లాసులో నీళ్ళు పోస్తే అమ్మ స్నానం చేయాలనే నియమం ఉండేది. తరువాత వాడికి పెట్టినా, నీళ్ళు పోసినా స్నానం చెయ్యాల్సిన పనిలేకుండా ఒప్పుకున్నారు నాన్నగారు. అప్పటి నుండే ఒకరకమైన మార్పు విప్లవం బయలు దేరింది.

ఊళ్ళో పార్టీలుండేవి. ఎన్నీ పార్టీలున్నా మంత్రాయి ప్రక్కనుండటం వల్ల అందరూ భయపడే వాళ్ళు అమ్మ జోలికి, నాన్నగారి జోలికి రావటానికి.

మంత్రాయి పొలంలో ఉంటే అమ్మ ఏరంగుచీర కట్టుకున్నది, అమ్మ ఏ పని చేస్తున్నదీ కన్నుల ముందు కట్టినట్లు కనుపించేది. నిరంతరం అతడి మనస్సులో అమ్మ ధ్యాస ఉండేది. అమ్మ సర్వస్వమై భాసిల్లేది. అమ్మకు తొలిరోజుల్లో సేవచేసుకున్న ధన్యజీవి మంత్రాయి.



44. ధన్యచరిత - పెద్ద కుక్క

"నరత్వం దేవత్వం నగవన మృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననం ।
సదాత్వత్పాదాబ్జ స్మరణ పరమానందలహరీ
విహారాసక్తం చేద్ధృదయ మిహ కిం తేన వపుషా" ॥

తా॥ "పరమేశ్వరా ! నా జన్మనరుడుగా, దేవతగా, కొండలలో, అడవులలో నివసించు మృగముగా లేక దోమగా, పశువుగా, పురుగుగాగాని, పక్షిగాగాని అగుగాక. ఏ శరీరంతో జన్మించినా, నా హృదయం సదా నీ పాదపద్మముల స్మరణమనే మహానంద ప్రవాహంలో నిమగ్నమై ఆనందించటానికి ఆసక్తి కలిగినదైతే చాలు".

– శివానందలహరి (శ్లో॥10)

ఆదిశంకర భగవత్పాద విరచితమైన పై శ్లోకానికి ఉదాహరణగా భాసించింది ఈ ధన్యజీవి చరిత్ర.

తేది 3.8.1964 సాయంత్రం 6.45 ని.లు అయింది. అమ్మ దగ్గర కూర్చున్న చంద్రమ్మక్కయ్య మాటల సందర్భంలో అమ్మతో "రోజూ వచ్చే పెద్ద కుక్క యిటు వైపు కన్పించలేదమ్మా ఎక్కడుందో పాపం దానికి రోజులు దగ్గరకొచ్చినై" అన్నది.

ఆమె అన్న మాటల్లో అతిశయోక్తి లేదు. ఆనాటి దాని పరిస్థితిని చూస్తే రోజులు కాదు. కొన్ని గంటల వ్యవధి మాత్రమే వున్నదనిపిస్తుంది. వెంటనే సావిత్రిని పిల్చి కుక్క ఎక్కడుందో చూచి రమ్మని పంపించింది అమ్మ.

ఉదయం అమ్మ స్నానం చేసి హాల్లోకి రాగానే రోజులాగే కుక్క కన్పించక పోయేసరికి ఎక్కడుందో అని అప్పుడే వెతికించింది. అప్పటికది పోస్టాఫీసులో పడుకుని

వున్నది. "వర్షం పడినా యిబ్బంది లేని ప్రదేశమది. అక్కడే పడుకోనివ్వండి దాన్ని. నెమ్మదిగా అదే లేచి వస్తుంది" అన్నది. అమ్మ అన్నాక మళ్ళీ అటువైపు ఎవరూ వెళ్ళలేదు. మరి ఎప్పుడు లేచి వెళ్ళిందో అమ్మగదివైపు రాకుండా డాబాలవైపు వెళ్ళి వాటికెదురుగా వున్న ఇసుకు కుప్పల మీద పడుకున్నది.

పెద్దగా వర్షం లేకపోయినా తెరవాటుగా సన్ననిజల్లు పడ్తున్నది. చల్లగాలి వీస్తోంది. అయినా కుక్క లేవలేక మరణబాధ వలన శరీరంలో కలుగుతున్న తపనకు తట్టుకోలేక అక్కడే పడుకున్నది.

సావిత్రి యీ విషయం చెప్పగానే కుక్కను చూడటానికి అమ్మ వెంటనే బయల్దేరింది. అమ్మ హడావుడి చూచి కాత్యాయని "ఈ వర్షంలో బురదలో నువ్వేం వెళ్తావమ్మా, దాన్నే యిక్కడకు తీసుకొస్తాం" అన్నది.

డాబా వున్న ప్రదేశం అమ్మ వున్న ఇంటికి నూట యాభై గజాల దూరంలో ఉంటుంది. జల్లుపడటం వలన దారి బురదగా వున్నది. అందులో యీ నేల రేగడినేల కాత్యాయని వెళ్లద్దనటానికి కారణం కేవలం ఇదొకటే కాదు. సాయంకాలం నుండి అమ్మకు ఒక రకం నలతగా ఉన్నది.

కాత్యాయనికి సమాధానంగా అమ్మ "ఈ వర్షం ఈ బురద ఇవన్నీ నాకేం కొత్త కాదమ్మా. వీటికి అలవాటు పడ్డదాన్నే. పాపం పిచ్చిది. దానికి నేనంటే ఎంత ప్రేమో. దానికి ఓపిక వున్నన్నాళ్లూ నా కోసం వచ్చేది. ఇవాళ దాని కోసం నేను వెళ్తాను" అని అంటూ వరండాలో నుండి మందిరంలోకి రాబోతుండగా కాత్యాయని భుజం పట్టుకుని జాగ్రత్తగా బురదలో జారకుండా తీసుకొచ్చింది.

రామకృష్ణన్నయ్య కూడా కుక్కను అమ్మ దగ్గరకు తేవటానికి అమ్మను ఒప్పించాలని ప్రయత్నించాడు.

అందుకు అమ్మ నవ్వి "దాన్ని మీరు ఇక్కడే తీసుకొచ్చేది నా కోసం కాని దాని కోసం కాదుగా నాన్నా. నాకేం ఫర్వాలేదు. నేను వెళ్ళాల్సిందే" అని మందిర ద్వారం వద్దకు వచ్చింది. అమ్మ ద్వారం దాటి ఒక అడుగు వేసింది. మేము అనుకున్నట్లుగా అమ్మ శ్రమ పడలేదు. పొడినేల మీద నడచినట్లు బురదగా వున్న నేలమీద చకచకా నడుస్తూ అంతిమ దర్శనానికి ఎదురుచూస్తున్న ఆ కుక్కను (భక్తుడ్ని) సమీపించింది. ఇష్టం అయితే కష్టం లేదన్నది కదా అమ్మ.

అమ్మ వెళ్ళిన సమయానికి లక్ష్మీనరసమ్మక్కయ్య గిన్నెలో పాలుపోసి తాగిస్తున్నది. కుక్క అతి కష్టం మీద గుటకలు వేస్తూ మింగుతున్నది. "అన్నం తిన్లేదా" ఆ కుక్కను చూస్తూ అక్కయ్య నడిగింది.

ఇందాక పెడ్తే కాస్త తిన్నది కాని ఏమీ తినటం లేదమ్మా... అన్నది.

అమ్మ "జల్లు పడ్తున్నది కదా ! ఇక్కడే వుంచారేం పంచలో పడుకోబెట్టక పోయారా!!

"ప్రయత్నించాం కానీ రాలేదమ్మా"

గ్లాసులో మిగిలిన కొద్దిపాలలో తులసీదళాలు తెప్పించి వేసి తాను కుక్క పక్కన కూర్చొని దాని మీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమురుతూ పాలను అక్కయ్యను పట్టమన్నది. తన ప్రార్థన నాలకించి వచ్చిన ఆర్తత్రాణ పరాయణ అయిన అమ్మ అమృతస్పర్శకు ఆ కుక్కలోని నరనరమూ ఆనందంతో పులకించిందేమో, ఆ ఆనందఛాయలు దాని కదలికలోనే కాక ముఖంలో కూడా కన్పించాయి. కళ్ళు విప్పి అమ్మను చూడాలని ప్రయత్నించింది.

కాని దృష్టిమాంద్యం అందుకు అడ్డుపడింది. అక్కయ్య గిన్నెలో పాలు పోసి దాని ముందు పెట్టింది. అది ముట్టుకోలేదు. దాని ఉద్దేశం గ్రహించిన అమ్మ దాని మూతి కడిగి శరీరమంతా నీళ్ళు చల్లి తోకవైపు భాగం తుడిచి "కురుపు ఎక్కడుంది" అంటూ చెవి పట్టుకుని చూచింది. అది బాధగా మూల్గింది. మళ్ళీ ఒకసారి నీళ్ళు జల్లి చెవి అంతా కడిగి శరీరమంతా నిమిరి "దీన్ని వెచ్చగా వుండే ప్రదేశంలో పడుకోబెట్టండి" అని లేచిందక్కడ్నుంచి.

వరండాలో కూర్చున్న నాన్నగారు తిరిగి వస్తున్న అమ్మను చూసి కుక్క పరిస్థితి ఎట్లా వున్నదని అడిగారు.

"దాని పని అయిపోయింది పాపం" అన్నది అమ్మ.

"ఈ రాత్రికి కుక్కపోతుందేమో" అనుకున్నది స్వగతంగా. అమ్మ మాటలోని అంతరార్థమేమిటో !

కుక్క ఆ రాత్రి చనిపోలేదు.

2 రోజులుగా విపరీతమైన బాధననుభవిస్తోంది.

తేది 5.8.1964 సాయంకాలం 7.40 ని.లకు అంతిమశ్వాస వదిలింది. అమ్మకీ విషయం తెలియగానే మరో కుక్కలు గాని, జంతువులు కాని పీకి తినకుండా వుండేలా ఒక గొయ్యి తీసి పూడ్చి పెట్టమన్నది.

సంస్కారమనేది కేవలం మానవులలోనే కాక మిగతా జీవజాలంలో కూడా ఉన్నదని మనకు తెలియచెప్పిన ఆ కుక్కను గురించి యింకా చెప్పుకోవాలంటే దాని

ఆకృతి కుక్క రూపవే కావచ్చు వివేకవంతులం విజ్ఞానవంతులం అని అనుకుంటున్నమనకంటే దాని హృదయం ఎన్నో రెట్లు విశాలమైనది. అమ్మను అది ఎంత ప్రాణప్రదంగా ప్రేమించేది అంటే – అమ్మకు ఏ చిన్న బాధ కలిగినా, ఎవరైనా కలిగించినా సహించలేకపోయేది. ఆ విషయంలో ధర్మానికి కట్టుబడిన వేళల్లో కళ్ళనీళ్ళు కారుస్తూ, లేనప్పుడు అవతలివాళ్ల అంతు కనుక్కునే దాకా వదిలిపెట్టేది కాదు.

దాని చూపులో, నడకలో, నడతలో అమ్మ కోసం ఏ క్షణంలోనైనా ఆత్మార్పణం చెయ్యగల త్యాగం, ధైర్యం కన్పిస్తుండేవి. అనేక సంఘటనల్లో అమ్మకు తల్లిగా, తోడుగా, మిత్రుడుగా ప్రవర్తించింది. అందుకే ఒక సందర్భంలో అమ్మ దాన్ని గురించి ఒక మాటలో అన్నది "మనిషి మనిషిని ఎంత దూరం ప్రేమించవచ్చో అంత దూరం అది ప్రేమించగలదు". ఎప్పుడైనా ఇంట్లో పిల్లకు జబ్బుగా వుంటే అమ్మ వాళ్ళ దగ్గర కూర్చునే అశకాశం లేక ఏదో పనిలో వున్నప్పుడు అమ్మ ఆ పనిపూర్తిచేసుకుని వచ్చేవరకు వాళ్ళ దగ్గర కూర్చునేది. ఇంటికి ఎవరైనా కొత్తమనిషి వస్తే అమ్మ దగ్గరకెళ్ళి తాకి సంజ్ఞ చేసి చెప్పేది. అరవటం కానీ కరవటం కానీ లేదు. ఇటువంటి లక్షణాలతో కుక్కలన్నింటిలోకి ప్రత్యేకంగా వుండేది.

అమ్మచరిత్రలో ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమించాల్సిన యోగ్యత దానికున్నది.

1950 లో దానికి 7 సంవత్సరాల వయస్సు, వూళ్ళో కుక్కలకు పిచ్చి ఎక్కిందని వాటి తలలమీద కొట్టి వూరికి దూరంగా పారేసి వస్తున్న సమయంలో వాటిలో వున్న యీ కుక్క, దీని సోదరులతో మరొకటి, ఆ కొట్టిన దెబ్బలకు మరణించక, స్పృహ వచ్చాక నడవటానికి ఓపికలేకపోయినా, తగిలన గాయాలు బాధపెడ్తున్నా అలాగే పరుగెత్తుకు వచ్చి మజ్జిగ చిలుకుతున్న అమ్మ పాదాల మీద వాలిపోయాయి. వెంటనే ప్రాణం వదిలింది ఒకటి. ఇది అమ్మ చిలికిన మజ్జిగ చుక్కలు నాకి అమృతాన్ని ఆస్వాదించిన దానిలా తేరుకున్నది. మజ్జిగ చుక్కలు నాకినంత మాత్రాన తేరుకునే స్థితి మాత్రం కాదు.

ఆ అమృతంతో అమ్మ సన్నిధిలో, అమ్మ సేవలో 14 సం॥ జీవితం గడిపి అమ్మలో ఐక్యమైన ధన్యజీవి.

45. చాకలి బుచ్చమ్మ

గరికపాడులో చాకలి బుచ్చమ్మ మఠం ఉన్నది. బుచ్చమ్మ, ఆమె తమ్ముడు యల్లమంద బ్రహ్మం గారి కాలజ్ఞాన తత్వాలు పాడుతూ, వేదాంతులమనీ, గురువులమనీ చెప్పుతూ ఉండేవారు. యల్లమంద అన్నపూర్ణ కావిడితో ఊళ్ళో తిరిగి తెచ్చేవాడు. అక్కా తమ్ముళ్ళు మఠానికి వచ్చే బీదా బిక్కీ జనానికి అన్నం పెడుతూ వేదాంత విషయాలు చెపుతూ కాలక్షేపం చేస్తుండేవారు.

బుచ్చమ్మ ఊళ్ళో గుడ్డలు ఉతకటానికి పెద్దవాళ్ళ ఇండ్లకు వెళ్ళి ఏవేవో వేదాంత విషయాలు చెపుతూ ఉండేది. సూర్యనాడి, చంద్రనాడి అని ముక్కు దగ్గర వేలు పెట్టికొని కుడివైపు సూర్యనాడి, ఎడమవైపు చంద్రనాడి అని ఉచ్ఛ్వాస నిశ్వాసాలను గమనించి భవిష్యత్తు చెపుతూ ఉండేది. ఈ నాడీ గమనాన్నే స్వరశాస్త్ర మంటారు. చాల నిజాయితీ గల మనిషి బుచ్చమ్మ. నోటి వెంట ఎప్పుడూ నీతి వాక్యాలు వస్తూ ఉండేవి. కొంచెం కోపదారిగా కనబడేది.

గరికపాడులో అమ్మ మేనత్త సుబ్బమ్మగారుండేవారు. సుబ్బమ్మ రెండవ కూతురికి జబ్బు చేసిందని కబురు రావటంతో సీతాపతి తాతగారు, కామేశ్వరమ్మమ్మను, అమ్మను తీసుకొని గరికపాడు వెళ్ళారు. అక్కడ అమ్మ, అమ్మమ్మ రెండు మైళ్ళు కృష్ణ కాలువకు వెళ్ళి బిందెలతో నీళ్ళు తెచ్చేవారు. అలా గరికపాడు వచ్చిన అమ్మను ఈ వేదాంతి చాకలి బుచ్చమ్మ చూచి అమ్మ ముఖంలో ఏదో అద్భుత కాంతి కనిపించడంతో, అమ్మ మాటలలో ఏదో ఆత్మీయత మాధుర్యము కనిపించడంతో ఆకర్షితురాలై తన మఠానికి రమ్మని అడిగింది. అలా రోజూ వచ్చినప్పుడల్లా అమ్మను తన మఠానికి ఒకసారి వచ్చి పాదం మోపమని అడిగేది.

ఒక రోజు అమ్మ, మేనత్త పెద్దకూతురు సుందరి ఊరుబయటకు వాహ్యాళికి వచ్చారు. ఎటూ ఊరు బయటకు వచ్చాం కదా అని మఠానికి వెళ్ళారు. అక్కడికి పోయి చాకలి బుచ్చమ్మ కనిపించగానే సుందరి "ఏమే ! బుచ్చాం ఇంత కాలం నుంచీ నేను ఈ ఊళ్ళో ఉంటుంటే మఠానికి రమ్మని నన్నెప్పుడూ పిలువలేదేం?" అని అడిగింది. అందుకు బుచ్చమ్మ "ఎందుకోనమ్మా, అమ్మను చూస్తే పిలవాలనిపించింది. ఆ పిలుపులో చూడు నీవు బుచ్చాం అంటావు ఆ అమ్మాయి అమ్మా ! అంటుంది లేకపోతే బుచ్చమ్మా ! అంటుంది. ఏదో పనివాళ్ళుగా, చాకలి

వాళ్ళగా తీసిపారేసినట్లుండదు. అయినా మీ వంటి పెద్ద ఇంటివారు మా చాకలి వాళ్ళ ఇళ్ళకు వస్తారా?" అన్నది. "ఏం అమె రాంగాలేంది మేం మాత్రం ఎందుకు రాము. మాయెక్కువేంటి? ఆమె తక్కువేంటి ?" అన్నది. అందుకు చాకలి బుచ్చమ్మ "సుందరమ్మగారూ! అసలు విషయం ఏమిటంటే నేను రోజూ అందరి గుడ్డలు ఉతుకుతూనే ఉన్నాను. ఈ అమ్మాయి గారి గుడ్డలు ఉతుకుతుంటే ఏదో సుగంధ పరిమళం వస్తున్నది. ఏవన్నా అత్తర్లు రాసుకుందేమో అనుకున్నాను మొదట. అత్తరు రాసుకుంటే ఎంతసేపుంటుంది ? నాకు తెలియదూ ? గుడ్డలుతుకుతుంటే చెరువంతా వాసన వచ్చేది. రకరకాల వాసనలు వచ్చేవి. ముక్కు దగ్గర పెట్టలేనంత సంపెంగ వాసన వచ్చేది. గుడ్డలిచ్చి ఇంటికి వచ్చింతరువాత కూడా యోగంలో కూర్చుంటే నేను ఉతికిన పరికిణీలు చొక్కాలు మడతపెట్టి నా ముందర పెట్టినట్లు, గజ్జెల పట్టాలతో, జడకుప్పెలతో అమ్మవారిలా అలంకరించుకొని గుమ్మటంలా గిరగిరా తిరుగుతున్నట్లు అనిపించింది. ఆ చిన్న చిన్న పాదాలు, చేతులు గిరగిరా తిరుగుతుంటే ఎంత ముచ్చటగా ఉన్నాయో ! ఆ పాదాలు ఎంత ముద్దు వస్తున్నాయ్యో! తిరిగి తిరిగి అమాంతం నా వొళ్ళో వచ్చి కూర్చున్నది. ఆ అమ్మ స్పర్శ తగలగానే కళ్ళు తెరిచాను. వెంటనే మీ యింటికి రావాలనిపించింది. రాత్రి మీ యింటికి అందుకే వచ్చాను. తీరా మీరిద్దరూ కూర్చొని మాట్లాడుకుంటుంటే అమ్మ ముఖంలో ఏదో కాంతి కనబడింది. అటువంటి తల్లిని ఈ ఇంటికి తెచ్చి కూర్చోబెడదామనుకున్నా! నా అదృష్టం పండింది. ఆమె రావాలనుకున్నది వచ్చింది. అయినా నేను పిలిచే దేమిటి? ఆ అమ్మ ఇదివరకే వచ్చి న్నది. భౌతికంగా నా చేత పిలిపించుకున్నది. అంతే" – అన్నది బుచ్చమ్మ.

సుందరికి ఇదేమీ అర్థం కాక ఇంటికి వెళ్ళిపోయింది. అమ్మ అక్కడే ఉన్నది ఇంకా కొంచెం సేపు. బుచ్చమ్మ అమ్మను తన ఇల్లు చుట్టూతా త్రిప్పి తన అనుమానాలు త్రాటకం అంటే ఏమిటో, సోహం అంటే ఏమిటో అమ్మను అడిగి తెలుసుకొని అమ్మ పాదాల మీద పడి అరగంట తర్వాత లేచి కూర్చొని అమ్మ వంక తదేకదృష్టితో గంటసేపు చూస్తూ కూర్చున్నది.

బుచ్చమ్మ మంత్రాలను గూర్చి ఇంకా ఏవేవో అనుమానాలు అడగాలనుకున్నది. అమ్మను చూస్తూ అమ్మ ముఖమండలంలో ఏవేవో కాంతి చక్రాలు తిరుగుతూ ఉన్నట్లు, ఆ చక్రాల్లో సర్వమూ ఇమిడి ఉన్నట్లు కనబడటంతో

సందేహాలు తీరిపోయి ఏది ఆ మంత్రాల వల్ల పొందాలనుకున్నదో అదంతా పొందినట్లయింది.

బ్రహ్మంగారు చెప్పినట్లు అన్నీ నీ కుక్షిలోనే ఉన్నై చూచుకోరా అన్నాడు. మాలోకి మేమెట్లాగూ చూచుకోలేముకాని నీ కుక్షిలో అన్నీ కనిపిస్తున్నాయి. బ్రహ్మంగారు ఎవరి కుక్షిని వాళ్ళను చూసుకోమన్నాడు. కాని అందరి కుక్షులలో నీవున్నావని ఋజువు చేయలేదమ్మా! అని బుచ్చమ్మ చెప్పి నీవేమంటావమ్మా! అన్నది. అందుకు అమ్మ "నేనదేమున్నది అన్నీ నీవే చెబుతున్నావుగా ! నీవు చెప్పినవన్నీ నిజమే, అందరిలో ఉన్నది "నేనదేనా. ఆ నేను 'బ్రహ్మ'. నే చెప్పేది. నేను బ్రహ్మనని కాదు. ప్రతివాడు సామాన్యంగా 'నేను' అనుకుఉంటాడు. ఆ 'అహం' లేకపోతే 'అహంబ్రహ్మాస్మి' కాలేడు. అహం చేతనే అహంకారాన్ని పోగొట్టుకుంటాడు. నేను భగవంతుడ్ని అయివుండి భగవంతుడ్ని తెలుసుకోవటమేమిటి? అన్నదే అహాన్ని తెలుసుకోవటం. తన్ను తాను గుర్తించినవాడు సర్వాన్నీ గుర్తిస్తాడు". ఎన్నాళ్ళుంటావమ్మా ఈ ఊళ్ళో అని బుచ్చమ్మ అడగ్గా అమ్మ 'నేను', 'నీవు' అని ఉన్ననాళ్ళూ కనబడతాను. ఈ గరికపాట్లోనే కాదు ద్వంద్వాలు ఉన్ననాళ్ళు 'నేను' 'నీవు' ఉండేది అని చెప్పింది. అమ్మ ఏది మాట్లాడినా కొండకు నాగలి పట్టించినట్లే' అని మనస్సులో అనుకున్నది బుచ్చమ్మ.

బుచ్చమ్మ నిజంగా ఎంత అదృష్టవంతురాలు. అమ్మ అనేదీ నేను కనిపిస్తేనే మీరు చూచేది. లేకపోతే నేను ప్రక్కన పోతున్నా గుర్తించలేరు అని. అమ్మ తనకు తాను బుచ్చమ్మను అనుగ్రహించి తనుగా అసలై వెళ్ళి అసలును (తనకు) గుర్తించేటట్లు చేసింది. ఎంతమంది ఈ రకంగా అమ్మను దర్శించి తరించారో, అలాటి జీవులలో చాకలి బుచ్చమ్మ కూడా ఒకరు అనేది నిస్సశయం.

46. స్టేషన్ మాష్టరు పినమూక వెంకట్రామయ్య

అమ్మకు 13 సంవత్సరాలు నిండి 14వ సంవత్సరం జరుగుతున్న రోజులలో తెనాలి వెళ్ళింది తన అమ్మమ్మ వాళ్ళింటికి. అక్కడ మౌలాలీ, శ్యామల, మోహన, హనుమాయమ్మ, నాగభూషణం అమ్మను వదలకుండా అమ్మతో సంభాషణలు చేస్తూ అమ్మలోని అతిలోక మానవత్వాన్నీ దైవత్వాన్నీ గుర్తిస్తుంటారు. అమ్మ మన్నవ వెళ్ళటానికి సిద్ధపడుతూ వాళ్ళందరినీ కొంతకాలం మహానందిలో ఉండమని చెప్పింది. వాళ్ళందరినీ పంపించి రావటానికి సుబ్బయ్య తాతగారితో చెప్పి రైల్వేస్టేషన్‌కు వచ్చింది. వాళ్ళ అమ్మ రాక కోసం చూస్తూ టిక్కెట్లు తీసుకోలేదు. ఇంతలో రైలు వచ్చింది. అమ్మ అప్పుడే స్టేషన్ ప్లాట్ ఫారం మీదకు వచ్చి 'రైలెక్కండి' అనగా - "నీకోసం చూస్తూ టిక్కెట్లు తీసుకోలేదమ్మా!" అన్నారు. సరే మీరు రైలెక్కి కూర్చోండి నేను టిక్కెట్లు తెస్తానని స్టేషన్ మాస్టరు దగ్గరకు వెళ్ళి టిక్కెట్లు తీసుకున్నది. టిక్కెట్లు చేతిలో పెడుతూ "మీదేవూరు" ? అంటే ఈ ఊరే నన్నది. మీ అమ్మా నాన్నా ఏ ఊళ్ళో ఉన్నారు అంటే మన్నవలో అని చెప్పింది. మరి ఈ ఊరేనంటావేం? అని (అడగ్గా) నేనెక్కడుంటే అదే నా ఊరు అన్నది. బలిచక్రవర్తికి వామనుడు చెప్పినట్లుగా... ఒక్కదానికి అయిదు టిక్కెట్లెందుకమ్మా ? అంటే, అమ్మ అయిదుగురు ఉన్నారు నాయనా! ఎవరమ్మా అంటే, నా పిల్లలే నాయనా ! అన్నది. ఇంత చిన్నపిల్లవు వాళ్ళు నీకు పిల్లలేమిటి? ఇంత చిన్న పిల్లప్పుడే నీవు పూజ చేశావెందుకు ? అని ఎదురు ప్రశ్నించింది అమ్మ. ఎవరి చిన్నప్పుడు ? అన్నాడు అర్థం కాక స్టేషన్ మాష్టరు. ఇంతకు క్రింతం నీవు చిన్నవాడివే నేనూ చిన్నదానినే అన్నది. ఎప్పుడో ఎక్కడో చూచిన ముఖంగా ఉన్నదే అనుకున్నాడు. "చూస్తున్న కొద్దీ ముఖవర్చస్సు మారుతున్నది. నీ వెవరో చెప్పమ్మా?" అన్నాడు. వర్చస్సు మారేది కాదు నాయనా! అంటూ "నీకు ఎక్కడో చూచినట్లుంది" నాకు ఎప్పుడూ నిన్ను చూస్తున్నట్లే ఉన్నది, అన్నది. అంటే "చెప్పటానికి సందేహమెందుకు? చెప్పమ్మా! వీళ్లందరూ ఎవరు ? పోనీ అదన్నా చెప్పమ్మా?" అన్నాడు. "నీకెవరుగా కనబడుతున్నారు ? నాకు తెలిస్తే అడగను కదా! పిల్లలంటావు? ఇంత చిన్న పిల్లకు అంత పెద్దవారు పిల్లలేమిటి? అందుకు అమ్మ పొట్టిగా ఉన్నాననా చిన్నపిల్ల అంటున్నావు? అమ్మ కోసం ఉన్నవారంతా నవ్వుతూ ఇంతలో మౌలాలీ "రా అన్నాయ్యా ! కూర్చో. మనందరికీ అమ్మ ఆ చిన్నపిల్లే. అమ్మ ఎంత పెద్దదో మనకేం తెలుసు?" అనగానే స్టేషన్ మాష్టరుకు ఆశ్చర్యము రోమాంచము వేసి మౌలాలీని కౌగలించుకొని 'యేం అమ్మా! చెప్పవా?' అన్నాడు.

అమ్మ అప్పుడు స్టేషన్ మాష్టరుతో ఏడు సంవత్సరాల క్రితం ఏలూరులో

జరిగిన సన్నివేశాన్ని గుర్తుచేస్తూ దొడ్లో నేను తులసీ దళాలను వచ్చి కోస్తుండగా నా జడపుచ్చుకొని జడచూడు ఎట్లా ఉందో తాచుపాముల్లే అని నా బుగ్గ మీద విసిరి కొట్టలా? స్టేషన్ మాష్టరుకు అప్పటికీ జ్ఞాపకం రాక ఎవరింటి దగ్గర ఎప్పుడు ? అని అడిగాడు. అప్పుడు అమ్మ ఏలూరులో యల్లంరాజు హరినారాయణ గారి ఇంటి దగ్గర మీ ఇల్లు ఉండేది. మీ నాయన ఓవర్సీరు నీ పేరు వెంకట్రామయ్య మీ ఇంటి పేరు పినమాకవారు. మీ నాన్న పేరు నరసింహారావు. ఎప్పుడూ చౌడీశ్వరీ పూజ చేస్తుండేవారు. నువ్వు నన్ను కొట్టగానే మీ నాన్నగారు వచ్చి నిన్ను వెనక్కులాగి నన్ను తీసుకెళ్ళి ఇంట్లో కూర్చోబెట్టుకుని నా బుగ్గకందటం చూచి కొంచెం కొబ్బరి నూనె రాసి అప్పుడే నివేదనకు, రవ్వకేసరిని తెచ్చిన మీ అమ్మతో 'జ్ఞానేశ్వరిదేవి మంగళవారం నాడు ఈ రూపంలో మన ఇంటికి వచ్చింది. ఆ రవ్వకేసరి ఈ అమ్మకు పెట్టు' అన్నారు. ' ఆ దొంగపిల్లను ఈ ఇంట్లో కూర్చోబెట్టేరేంటి' అన్నావు నీవు. అంతకు వారం రోజుల ముందు నా చేతికి కారప్పూస పొట్లం ఇచ్చి నా చేతికి ఉన్న నాగవత్తులు లాగుతుంటే నీకు నొప్పి పుట్టుతుంది ఉండు అంటూ నేనే తీసి ఇస్తా అంటుండగా మీ జవాను వచ్చాడు. అప్పుడు నీవు దొంగతనం బయటపడుతుందని పరుగెత్తు కెళ్ళావు, అని పాత సంగతుల చెబుతుండగానే స్టేషన్‌మాస్టరు అమ్మ కాళ్ళమీద పడ్డాడు క్షమించమంటూ. క్షమ ఎప్పుడూ ఉన్నది. నీవు గుర్తు చేయమంటే చేసా. నీవు చేసింది తప్పు అని నేను అనుకుంటే ఆ రోజే మీ ఇంట్లో వాళ్ళతో చెప్పి శిక్ష వేయించేదాన్ని అని అమ్మ అనగా అమ్మ కాళ్ళు గట్టిగా పట్టుకొని ఈ దుర్మార్గుడికి ఏదైనా శిక్ష వేయమ్మా అని అడిగాడు. "దుర్మార్గుడికి సరియైన శిక్ష ఇదే నాయనా ! దుర్మార్గుడు దుర్మార్గాన్ని గుర్తించి సన్మార్గంలోకి మారి నాకు శిక్షవేయమని అడగటడమే శిక్ష, రక్ష. అటువంటి శక్తే వాడికి రక్షణ" అన్నది అమ్మ.

ఇంత పవిత్రమైన అన్నయ్య ఎవరమ్మా? అని శ్యామల అడగ్గా నేను పవిత్రుణ్ణి కాదమ్మా ! నా అంత అపవిత్రులు లేరు అని స్టేషన్ మాష్టరు అంటుండగా పవిత్రుల నోటి వెంట ఉచ్చరింపబడ్డావు కనుక నీవూ పవిత్రుడవే అన్నాడు నాగభూషణం. అందుకు అమ్మ "పవిత్రులు అపవిత్రులు అంటూ లేరు నాయనా! అమ్మకు అందరూ పవిత్రులే" అన్నది. "అందుకే అమ్మల కమ్మ వైనావు" అన్నాడు మౌలాలీ. అమ్మ స్టేషన్ మాష్టరుతో "జరిగి పోయినదాన్ని గూర్చి విచారపడకు నాయనా! వీళ్ళను మార్గాపురం వెళ్ళే రైలు ఎక్కించిపంపించు" అన్నది అమ్మ. "వీళ్ళను మా యింటికి తీసుకెళ్ళుతానమ్మా ! ఒక్కరోజు అట్టే పెట్టుకుంటా. ఇటువంటి వారి దర్శనం కావటం భగవంతుని దర్శనమైనట్లే. వీళ్ళు నన్ను బాగుపర్చటానికే ఈ ఊరొచ్చినట్లుంది" అన్నాడు స్టేషన్ మాష్టరు. అమ్మను గూర్చి తెలుసుకోవాలనే ఉద్దేశం పోయింది ఇప్పుడు అని

నాగభూషణం అనగా, ఏదో అర్థం కాని శక్తి అని తోస్తున్నది కాని, మిమ్మల్ని గూర్చి తెలుసుకోవాలని ఉన్నది అన్నాడు స్టేషను మాష్టరు. మనం అంతా అర్థం కాని ఆ శక్తిలోని వాళ్ళమే అన్నాడు నాగభూషణం. "అమ్మా ! వీరి మాటలు వింటుంటే వేదాల్లోని వాక్యాల్లా నావంటి అజ్ఞానికే అనిపిస్తున్నాయి. ఇక జ్ఞానులు ఈ మాటల్లో ఎంత సారం తీస్తారో" అని స్టేషను మాష్టరు అనగా అమ్మ "జ్ఞానులకు అన్నిమాటలు మహా వాక్యాలే. కొన్ని బాగుండటం కొన్ని బాగుండక పోవడం అజ్ఞానం. రెండుగా కనబడటం అజ్ఞానం. ఒకటిగా కనబడటమే జ్ఞానం" అన్నది. అమ్మను కూడా తన ఇంటికి ఆహ్వానించాడు స్టేషన్ మాష్టరు. అమ్మ కూడా అంగీకరించింది.

స్టేషను మాష్టరు స్నేహితుడు అప్పుడే రాగా అమ్మను దేవతగా చెప్పి నమస్కరించమనగా ముందు ఒప్పుకోని అతడు అమ్మతో జరిగిన సంభాషణ తరువాత అమ్మ సాక్షాత్ భగవత్స్వరూపమేనంటూ అమ్మ పాదాల మీద పడి రెండు గంటల అలాగే ఉండిపోతాడు. అమ్మ ఆప్యాయంగా తల నిమిరి లేపుతుంది. ఆ తర్వాత అందరూ కలిసి స్టేషను మాష్టరు ఇంటికి వెళ్ళారు.

అక్కడ స్టేషన్ మాష్టరు వెంకట్రామయ్యగారు భార్యను పిలిచి బిందెతో నీళ్ళు, కాళ్ళు కడుగు పళ్ళెం తెప్పించి గడపదగ్గరే కాళ్ళు కడిగి వాళ్ళ పెద్దకూతురు ఇందుమతి తెచ్చిన టెంకాయ కొట్టి కర్పూరం వెలిగించి హారతి ఇచ్చారు. అమ్మ కాళ్ళు కడిగిన తీర్థం అందరూ పుచ్చుకున్నారు. తమ అమ్మాయికి తెచ్చిన కొత్త పరికిణీ జాకెట్, స్టేషన్ మాష్టరు గారి ఉత్తరీయం వోణీగా తెచ్చి పూజా సామాగ్రి దగ్గర పెట్టుకొని అందరూ పూజ చేసుకున్నారు. అమ్మ అందరికీ తీర్థప్రసాదాలు ఇచ్చింది.

అమ్మ ఇంటికి బయలుదేరి గడపలు దిగుతుండగా పెద్ద త్రాచుపాము గడపలో పడుకొని ఉన్నది. అందరూ దాన్ని చంపటానికి ప్రయత్నిస్తుండగా స్టేషను మాష్టరు భార్య శివకామసుందరితో తీర్థప్రసాదాలు తెప్పించి పాముకు పట్టించింది అమ్మ. అమ్మ పాటపాడమనగా శివకామసుందరి పాడినపాటకు తగినట్టు తల ఊపుతూ నాట్యం చేస్తుంది పాము. ఆ రకంగా అమ్మ వెంకట్రామయ్య కుటుంబాన్ని దర్శన స్పర్శనాలు ప్రసాదించి ఎక్కడున్నా రక్షిస్తానని హామీ ఇచ్చి తరింప చేసింది. అమ్మ కరుణ పొందిన ఆ స్టేషన్ మాష్టరు వెంకట్రామయ్య, ఆ కుటుంబము, ఆయన స్నేహితులు ఎంత ధన్యులో.



47. పరుచూరి వీరయ్య చౌదరిగారు - మహాలక్ష్మమ్మగారు

వీరయ్య చౌదరిగారు రాష్ట్ర రెవెన్యూ విభాగంలో తహసిల్దారుగా పనిచేశారు. నర్సరావుపేటలో ఉండగానే అమ్మను గూర్చి విని వారి భార్య మహాలక్ష్మమ్మ గారితో కలిసి దర్శించారు. నాన్నగారు జిల్లెళ్ళమూడి కరణం కావటంతో వీరయ్యకారిని గౌరవంగా చూసేవారు. నాన్నగారి యెడల వీరయ్యగారికీ గౌరవము, భక్తి. మహాలక్ష్మమ్మగారు, వీరయ్యగారు ఒకరికన్నా ఒకరు అమ్మ యెడల అత్యంత విశ్వాసము భక్తి శ్రద్ధలు కలవారు.

తాను చేసే ఉద్యోగముపట్ల కర్తవ్య పరాయణులై మెలిగే వీరయ్యగారిని కలెక్టర్లు సైతం గౌరవించేవారు. వృత్తిని కూడా దైవంగా భావించే వారాయన. ఏ పనిచేసిన అది అమ్మపనే అనే భావనతో చేస్తే అదే తరింపచేస్తుంది. అని అమ్మ చెప్పిన మాట ఆయన పట్ల సార్థకం. వీరయ్యగారే మంత్రజపాలూ చేయలేదు. కాని అమ్మకు ఎంతో ఇష్టుడైనాడు.

మహాలక్ష్మమ్మ గారు అమ్మ వద్ద మంత్రోపదేశం పొంది ఆ మంత్రం అక్షర లక్షలు చేసింది. అమ్మ దగ్గరే ఎప్పుడూ ఉండటానికి ఇష్టపడేది. కాని అమ్మ అంగీకరించేదికాదు. ఒకసారి వీరయ్యగారు అమ్మతో తన భార్యను గూర్చి చెపుతూ ఎప్పుడూ నీ ధ్యాసే దానికి వంటకూడా సరిగా చేయటం లేదు అన్నారు. అమ్మ మహాలక్ష్మమ్మగారిని ఇంటికి పంపిస్తూ, భర్తసేవ చేస్తే భగవంతుని సేవ చేసినట్లేనని చెప్పింది. నా దగ్గర ఉండే వాళ్ళ మీదకంటే దూరంగా ఉండేవాళ్ళే నాకు దగ్గరగా ఉన్నట్టులెక్క ఎందుకంటే వాళ్ళు నా ధ్యాస మీద ఉంటారు. నేను వాళ్ళ ధ్యాసమీద ఉంటాను అన్నది అమ్మ.

ఒకసారి అమ్మ మహాలక్ష్మమ్మక్కయ్యను రాత్రి పదిగంటలకు ఊరికి వెళ్ళమన్నది. ఇప్పుడెట్లాగమ్మా! దారి కనబడదు, బస్సులుండవు. నేను ఇప్పుడు వెళ్ళను. రేపు వెళ్ళుతాను అన్నది. అమ్మ అంగీకరించలేదు. పట్టుబట్టి నడిచి వెళ్ళు ఏమీ దొరకకపోతే అని పంపింది. బాపట్ల దాకానడిచి అక్కడ ఏదో బస్సు పట్టుకొని వెళ్ళింది అక్కయ్య. అప్పుడనుకున్నది ఇక అమ్మ దగ్గరకు రాను. ఇంత నిర్దయగా పంపించింది. అని. కాని అక్కయ్య ఎప్పుడు అమ్మ తనవెంటే ఉన్నధ్యాస ఉండేది. అమ్మ ఏమి చెప్పినా ఏది చేయించినా దాని వెనుక ఏదో పరమార్థం ఉంటుంది. తననుఅమ్మ ఆ అర్ధరాత్రి పంపటంలోని అవసరం వెళ్ళిం తర్వాత గాని తెలియలేదు అక్కయ్యకు. వీరయ్య చౌదరికారు భార్య అర్ధరాత్రి రావటం చూచి ఆశ్చర్యపోయారు. అమ్మ చూపించిన కరుణకు ఆనందించారు.

అక్కయ్యకు నిరంతరం అమ్మనామస్మరణే. ఒకసారి అమ్మ "ఎప్పుడు నన్ను గూర్చే ఆలోచిస్తూ కూర్చోకపోతే చందాలు వసూలు చేసి జిల్లెళ్ళమూడి పంపవచ్చుగా" అని అన్నట్లు అక్కయ్యకు వినిపించింది. అక్కయ్య చందాలు వసూలు చేయటానికి బయలుదేరింది. ఇంటి బయటకు రాగానే ఒక ముత్తైదువ ఎదురువచ్చి అక్కయ్యతో మీకోసమే వస్తున్నాను. జిల్లెళ్ళమూడికి ఈ వెయ్యి రూపాయలు పంపించండి. అనిఇచ్చింది. ఆ తర్వాత అక్కయ్య కలెక్టరుగారింటికి వెళ్ళి కలెక్టరుగారి భార్యతో అమ్మ కబుర్లు చెపుతూ కూర్చున్నది గాని చందా అడగటం మరచిపోయింది. ఇంతలో మరొక ముత్తైదువ అక్కడికి వీళ్ళ సంభాషణవిని జిల్లెళ్ళమూడికి అయిదు వందల రూపాయలు చందా ఇవ్వాలని వచ్చాను తీసుకొండి అని అక్కయ్య అక్కడకు ఎందుకు వచ్చిందో గుర్తుకు వచ్చేటట్లు చేసింది. అక్కయ్య ఆశ్చర్యపోయి అమ్మ ఇన్ని రూపాయలలో ఇన్ని రకాలుగా వచ్చి తన కర్తవ్యాన్ని గుర్తుచేసి తన చేత చందాలు వసూలు చేసి జిల్లెళ్ళమూడికి పంపిస్తుండేది. ఆ రోజుల్లో నర్సరావుపేటనుండి అక్కయ్య చేసే సేవను గుర్తించి అమ్మ ఎందరికో చెపుతూ ఉండేది.

వీరయ్యచౌదరిగారి పెద్ద కుమారుడికి అమ్మంటే నమ్మకం ఉండేదికాదు. మనుషలను పట్టుకొని దేవత అనటం ఏమిటి? ఏమిటీ గోల? ఈలా ఆమె చుట్టూ తిరగటమేమిటి, రాత్రి పగలనకుండా? అనుకునేవాడు. ఒకరోజు ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ఒక 14 ఏళ్ళ బాలిక వాళ్ళ ఇంటికి వచ్చి ఆకలిగా ఉన్నది అన్నం పెట్టమని మహాలక్ష్మమ్మక్కయ్యను అడిగింది. ఆ అమ్మాయిలో అమ్మ పోలికలు కనిపించి అక్కయ్య అప్పుడే వండిన వేడి వేడి అన్నము, గోంగూర పచ్చడి తెచ్చి పెట్టబోగా ఆ అమ్మాయి లంగాలో పెట్టమని పైకి పట్టుకున్నది.

ఇప్పటి దాకా క్రిందకు వ్రేలాడుతున్న లంగాలో పైకిపట్టగానే అందులో నూకలు, బియ్యము ఉన్నవి. ఇవెక్కడవి? అని అక్కయ్య అనుకుంటూ ఉండగా ఆ అమ్మాయి నాకు కట్టకోవడానికి ఒక లంగా, జాకెట్టు ఇమ్మని అడిగింది. అమ్మ చిన్నప్పుడు చేసిన అల్లరి విని ఉన్న అక్కయ్య అమ్మే ఈ అమ్మాయి అనుకుంటూ లోపలి కెళ్ళి తన కూతురు లంగా జాకెట్టు తెచ్చి ఇచ్చింది. ఆ పిల్ల అక్కయ్య ఇచ్చిన లంగా జాకెట్టు వేసుకొన్నది. ఈ తంతంతా చూస్తున్నాడు వాళ్ళ అబ్బాయి.

ఇంతలో వీరయ్యచౌదరిగారు ఇంటికి వచ్చి మరొక విచిత్ర సంఘటన చెప్పారు. ఆయన బస్సుకోసం ఎదురుచూస్తూ బస్టాండ్‌లో నిలబడి ఉన్నారుట. అంతలో అయిదు సంవత్సరాల చిన్నపిల్ల ఒక రూపాయి ఇవ్వవా? అని వీరయ్యగారిని అడిగింది. చిల్లరలేదు అని చెప్పారు వారు. వెంటనే ఆ అమ్మాయి సరాసరి వీరయ్యగారింటికే వచ్చి మహాలక్ష్మక్కయ్యను అన్నం పెట్టమని అడిగింది. అక్కయ్యలోపలికి వచ్చి అన్నం తెచ్చేసరికి అంతకు ముందు ఏమీ చేతిలోలేని ఆ అమ్మాయి చేతిలో వెండి గిన్నెలాంటిది ఉన్నది. అందులో అన్నం పెట్టింది అక్కయ్య. వాళ్ళరెండవ అబ్బాయి ఈరెండు సంఘటనలు గమనిస్తున్నాడు, ఈ అమ్మాయి వంక గిన్నెవంక చూస్తూ నిలబడ్డాడు. అక్కయ్య ఆ అమ్మాయిని ప్రశ్నలు వేస్తున్నది. అన్నిటికి సమాధానాలు చెప్పుతూ అక్కయ్య వంక ఒక ఓర చూపు చూసింది. అది అచ్చం అమ్మ చూచిన చూపు లాగే ఉన్నది. అమ్మే, అమ్మే అని అక్కయ్య అనుకుంటుండగా ఆ అమ్మాయి బయటకు వెళ్ళింది. వాళ్ళ అబ్బాయి ఉత్సుకతతో బయటకు వెళ్ళి ఆ అమ్మాయికోసం చూశాడు. ఎక్కడా కనుపించలేదు. ఇంతలోనే ఎట్లామాయమైంది? అనుకున్నాడు, ఆశ్చర్యపోయాడు. ఇంతలో తాసిల్దారు వీరయ్యగారు ఇంటికి వచ్చారు. వీళ్ళు చెప్పిందంతా విని తనకు బస్టాండ్ దగ్గర ఒకమ్మాయి ఒకరూపాయి అడగటం, చిల్లర లేదని చెప్పటం తర్వాత చూడగా తన జేబులోని వందరూపాయలనోటు మాయం కావటం చెప్పి ఇవన్నీ అమ్మలీలలే అని అనుకున్నారు. ఇదంతా ప్రత్యక్షంగా చూచిన వాళ్ళమొదటి అబ్బాయికి అమ్మ పట్ల దేవత అనే విశ్వాసం రూఢి అయింది.

మహాలక్ష్మమ్మగారు ఒక రకంగా, తపస్విని, అమ్మచెప్పింది కదా! నిరంతర తపనే తపస్సని. అమ్మను గూర్చి చింతనే ఆమెకు ఎప్పుడూ, అమ్మ మంత్రం జపించి అమ్మకుంకుమ, తీర్థం ఇస్తే ఎంత కష్టప్రసవమైనా,సుఖంగా జరుగుతుంది. ఎంత బాధతో వచ్చినా నయమై హాయిగా వెళ్ళేవారు. ఒకసారి రాచర్ల కమల నడుము నెప్పితో బాధపడుతూ అక్కయ్య వద్దకు వెళ్ళింది. అక్కయ్య నడుముకు కుంకుమరాసి, మంత్రం జపించి తీర్థాన్నిచ్చింది. అలా మూడురోజులు చేయగా

నడుం నొప్పి పూర్తిగా తగ్గిపోయింది.

అక్కయ్య దగ్గరకు ఎవరువచ్చినా గంటల తరబడి అమ్మ సంగతులు చెపుతూ ఉండేది. వంట ఎప్పుడు చేస్తావమ్మా? అని అడిగితే, అమ్మే చేసి పెడుతుందిలే అనేది, పొయి మీద పెట్టివస్తే అన్నీ అలా తయారుచేయబడి ఉండేవిట. పూర్వం మరిడమ్మ తాతమ్మగారికి కూడా ఇలాటి అనుభవాలెన్నో జరిగాయి. ఆమె ఇంట్లో పని చేసుకొని రోలు దగ్గరకుపోగా ఆ రోట్లో బియ్యం పిండి చేయబడి ఉన్నది. అది ఆమె గురువుగారు మల్లెల రత్తమ్మగారి మహిమ అనుకున్నది. తర్వాత తర్వాత గాని అమ్మ మహిమ అర్థం కాలేదు.

మహాలక్ష్మక్కయ్యగారికి అలాకాక అన్నీ అమ్మ చేయించేవే అనే విశ్వాసం ప్రబలంగా ఉండేది. వాళ్ళ ఇంట్లో అమ్మ వచ్చిన దానికి గుర్తుగా రకరకాల సుగంధ వాసనలు వచ్చేవి. అక్కయ్యను బలవంతంగా ఇంటికి పంపిన నాటి నుండి ఆమె జిల్లెళ్ళమూడి వెళ్ళలేదు. తర్వాత అమ్మ ఒకరి ఒంటి మీదకు వచ్చి జిల్లెళ్ళమూడి రమ్మని బలవంతం చేయటం అక్కయ్య వెళ్ళటం జరిగింది. అమ్మను ఎత్తుకొని ఆవరణ అంతా తిరగాలనీ అక్కయ్య అమ్మను అడగగా, అమ్మ సరే అన్నది. అమ్మ కాసేపు బరువుగా అనిపించగా అమ్మ నామం తలచుకోగానే తేలికైనది. ఇలా అమ్మతో అక్కయ్యకు, వీరయ్య చౌదరిగారికి వాళ్ళింట్లో వారికి ఎన్నో ఎన్నో అనుభవాలు అమ్మ ప్రసాదించింది.

భార్యభర్తలిద్దరూ అమ్మలో కలిసి పోవటం కూడా విశేషసన్నివేశాలే- మహాలక్ష్మమ్మఅక్కయ్యకు పిచ్చికుక్క కరచింది. కుక్కలాగా అరుస్తూ అందరినీ దగ్గరకు పిలిచేది. భయపడి ఎవరూ దగ్గరకు పోయేవారు కాదు. చివరకు అమ్మను పెద్దగా పిలుస్తూ, నీ దగ్గరకు వస్తున్నా నమ్మా! అంటూ అమ్మలో లీనమైంది. ఇక వీరయ్యచౌదరిగారు కూడా అదృష్టవంతుడే. ఎవరైనా వైకుంఠంలోనో, కైలాసంలోనో తాము తమ ఆరాధ్య దైవం ముందు అంతిమ ఘడియలు గడపాలనుకుంటారు. అలాగే వాళ్ళ కుటుంబం అంతా విదేశాలకు వెళ్ళాల్సి రావటం, వివిధ కారణాలతో వీరయ్యగారిని జిల్లెళ్ళమూడిలో అమ్మ ఆశ్రమంలో అందరింటికి చేర్చటం జరిగింది. ఒక రకంగా అదృష్టవంతుడు. ఎన్నోవేల సంవత్సరాలు తపస్సు చేస్తేగాని పొందలేని అర్కపురిలో అమ్మ సంచరించిన పవిత్ర భూమిపై కాలం గడపటం అమ్మ ముంగిట అమ్మపాదాల చెంత అంతిమశ్వాస విడిచి అమ్మలో లీనం కావటం అమ్మ కారుణ్యవిశేషమేమరి. ధన్యజీవి.

48. పరమభక్తుడు పుల్లయ్య

అమ్మ నాన్నగారు జిల్లెళ్ళమూడిలో కాపురం పెట్టిన క్రొత్తల్లో ఒక పధ్నాలుగు సంవత్సరాల బాలుడు మంచి నీళ్ళడిగాడు దాహం వేసి అమ్మను. అమ్మ ఆకలితో ఉన్న అతన్ని చూచి అన్నం తిన్నావా? నాయనా! అని అడిగింది. లేదన్నాడు. అమ్మ అతనికి కడుపునిండా గడ్డపెరుగు వేసి అన్నం పెట్టింది. అదృష్టవంతుడు. కల్పవృక్షం క్రింద నిలిచి మంచి నీల్ళు కావాలనుకుంటే మంచి నీళ్ళే రావచ్చు నేమో! కామధేనువు వద్దకు వెళ్ళి కోరిన కోర్కెలు తీర్చుకోవచ్చునేమో కాని అతను అంతంలేని అమ్మకు తెలియక పోయినా మంచి నీళ్ళడిగాడు. అమ్మ అమృతాన్ని ప్రసాదించింది. బిడ్డ ఆకలి గుర్తించి పెట్టింది కడుపునిండా, ఒక్కొక్క మెతుకూ ఎన్నెన్ని జన్మలను తీసివేసిందో సద్గురువులు శ్రీ శివానందమూర్తిగారు చెప్పినట్టు.

అతడి పేరు పుల్లయ్య, పుల్లయ్య అంటే పూర్ణయ్యకు వికృతి రూపం. అంటే పూర్ణ స్వరూపమైన అమ్మ వద్దకు రావటం వల్ల అంతకు ముందు పేరులోనే పూర్ణయ్య, పుల్లయ్య అయినా అమ్మ కరుణా వాత్సల్య పూర్ణుడై నిజమైన పూర్ణయ్య అయినాడు. అతడిది గుంటూరు జిల్లా నర్సరావుపేట దగ్గర గురవాయపాలెం. ఆ ఊరి కరణంగారి దగ్గర వెట్టివానిగా పనిచేస్తున్నాడు. ఆ కరణంగారి కోసం వారు పంపగా గడ్డికొనటం కోసం జిల్లెళ్ళమూడి వచ్చాడు. వచ్చేటప్పుడు చద్దిమూట కుట్టకొని వచ్చాడు. కాని అతడి అనుకొన్నంత తొందరగా గడ్డి దొరకలేదు ఆలస్యం అయింది. తెచ్చుకొన్న చద్ది తిన్నాడు. హోటళ్ళో, పూట కూళ్ళ ఇళ్ళో ఉంటయ్‌లే అనుకున్నాడు అవేవీ ఈ పల్లెటూళ్ళో దొరకలేదు. చిల్లరకొట్లో వేయించిన శనగపప్పు బెల్లం,, కొనుక్కుని తిని కాసిని మంచి నీళ్ళు త్రాగి కాలక్షేపం చేద్దామనుకున్నాడు. అదృష్టవశాత్తు అన్నపూర్ణ అయిన అమ్మ దృష్టిలో పడ్డాడు. అమ్మ పెట్టిన అన్నంతోపాటు ఆప్యాయత అనురాగము అనుభవించిన తనపని పూర్తిచేసుకొని తిరిగి గురవాయపాలెం వెళ్ళాడు.

అతడికి వివాహమైంది. కాలం గడుస్తున్నది. ఇంతలో విషజ్వరం దాపురించింది అతనికి, ఎన్నో మందులిప్పించారు. ఎంత మంది డాక్టర్ల దగ్గరకో తీసుకొని వెళ్ళారు. కానీ వ్యాధి తగ్గే లక్షణం కనిపించలేదు. చివరకు ఆ వ్యాధి పెరిగి అతడు నిలబడలేడు. నడువలేడు, చేతులతో దేనినీ పట్టుకోలేడు,

మాటాడలేదు, ఆఖరికి చూడలేదు. పచేంద్రియాలు అతని వశం తప్పాయి. నోటి నుండి అసంకల్పితంగా చొంగకారుతున్నది. తల్లిదండ్రులు అతని జీవితంపై ఆశవదులుకున్నారు.

ఇదే సమయంలో అమ్మ వద్దకు వచ్చిన రాచర్ల అనంతరామయ్యగారు (సోదరుడు రాచర్ల లక్ష్మీనారాయణ తండ్రి) అనుకోకుండా వారి ఊరువెళ్ళగా అతడి తల్లిదండ్రులు తమ కొడుకుకు వచ్చిన దుస్థితి చెప్పారు. అనంతరామయ్యగారు పురోహితుడు. అంటే పురము హితము కోరేవాడు అని అర్థం. ఆయన మనస్సులో అమ్మ మెదలింది. ఈ పరిస్థితులలో జిల్లెళ్ళమూడి అమ్మను గూర్చి చెప్పి అమ్మే ఉద్ధరించాలి వీడ్ని. అమ్మ వద్దకు తీసుకెళ్ళమన్నాడు. గురువుగారి మాటమీద ఉన్న విశ్వాసంతో వాళ్ళుమంచం మీద వేసుకొని పుల్లయ్యను జిల్లెళ్ళమూడి తీసుకొచ్చారు. ఆసంవత్సరం 1962. అమ్మ ఇప్పుడు హైమాలయం ఉన్నచోట ఒక పూరి పాక ఉండేది. ఆ పాకలో ఉండేది అమ్మ. అమ్మ వద్దకు మోసుకొచ్చారు పుల్లయ్యను. నీవే వీడిని కాపాడాలమ్మా! అని అతని తల్లిదండ్రులు అమ్మ పాదాలపై పడ్డారు.

అమ్మ పుల్లయ్యను చూచి "నాన్నా! నీవు మునుపు ఇక్కడకు వచ్చినట్లుందే" అని పలకరించింది. అంతే పుల్లయ్యలో కదలిక మొదలైంది. నంగినంగి మాటలతో కొన్ని సంవత్సరాల క్రితం గడ్డికొనటానికి బండితోలుకొని వచ్చి నీ చేతి అన్నం తిన్నానమ్మా!" అని ఆనాటి విషయాలు జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. అమ్మ అప్పుడు "ఔను నాన్నా! 1946లో వచ్చేవు" అని పుల్లయ్యతో అని అప్పటి విషయమంతా అక్కడ చేరిన వాళ్ళందరికీ చెప్పింది. అప్పటికి 16 సంవత్సరాలవాడు జరిగిన సన్నివేశాన్ని పూసగుచ్చినట్టు వివరిస్తుంటే కళ్ళప్పగించి విన్నారు సోదరీసోదరులు. ఆనాటి ఆ అన్నపు ముద్దలుతిన్న అదృష్టమే అతనిని అమ్మ వద్దకు చేర్చింది కష్టకాలంలో.

ఆనాడు వచ్చిన పుల్లయ్య కొంతకాలం అమ్మ దగ్గరే ఉన్నాడు. అతన్ని మోసుకొచ్చి రోజూ అమ్మ దర్శనం చేయించేవారు. జిల్లెళ్ళమూడిలో ఆనాడు ఈనాడున్న సౌకర్యాలేవీ లేవు. కరెంటు లేదు. పంపులులేవు. ఫాన్లు లేవు, పడకలు లేవు. అమ్మ స్నానం చేయాలంటే చెరువు నుండి పీపాలతో బిందెలతో నీళ్ళు తెచ్చేవాళ్ళు. లాంతర్లు వెలిగించి ఆ వెలుతురులోనే కాలక్షేపం- అమ్మకు

విసనకఱ్ఱలతోనే విసిరేవారు. ఆ రోజుల్లోనే పుల్లయ్య అక్కడ నెలలతరబడి ఉన్నాడు. ఒక రోజు రాత్రి పుల్లయ్య పడుకున్న చోట చీకటిగా ఉన్నది. ఆ వైపు వచ్చిన నాన్నగారు చూచి "దారికి అడ్డంగా పడుకున్నావు చీకట్లో ఎవరైనా త్రొక్కుతారు. అవతలికి వెళ్ళి పడుకో" అన్నారు. అందుకు పుల్లయ్య నాకు కళ్ళు కనిపించవు నేను గుడ్డివాడినయ్యా! కళ్ళున్న మహానుభావులు నన్నెందుకు త్రొక్కుతారయ్యా! అంటూ నంగి నంగి మాటలతో చెప్పాడు. నాన్నగారు అయ్యో! అనుకున్నారు.

ఆ తర్వాత అమ్మకు అనారోగ్యం చేయటం వల్ల చీరాల తీసుకుని వెళ్ళుదామనుకున్నారు. అమ్మ జిల్లెళ్ళమూడిలో లేకపోతే అమ్మకోసం వచ్చిన వారెవరుంటారు? అందుకోసం పుల్లయ్యను వాళ్ళ ఊరు వెళ్ళమని చెప్పారు. కాని పుల్లయ్య "ఆస్పత్రిలో అమ్మమంచం ప్రక్కనే పడుకుంటానయ్యా! నన్ను రానివ్వం"దని ప్రాధేయపడ్డాడు. "ఏ తీరుగనను దయ చూచెదవో అర్కపురీశ్వరి అమ్మా' అనే భావం వచ్చేటట్లు రామదాసునివలె పాడుకుంటుండేవాడు. అమ్మను "నాకు ఈ జబ్బునమయ్యేటట్లుంటే ఉంచు లేకపోతే నన్ను తీసుకెళ్ళు. నేను పోయేలోపలే నా భార్యకు మరో మనువు చెయ్యి' అని ప్రార్థించేవాడు. ఎప్పుడూ అమ్మ సన్నిధిలోనే ఉండాలని కోరిక. జబ్బు నయం కావాలి అనేదాని కన్నా బాధలన్నీ ఈ జన్మలోనే అనుభవిస్తే మంచిదని అదీ అమ్మ చరణ సన్నిధిలో అనుభవిస్తేచాలనీ, ఈ జబ్బు రావటం కూడా ఒక అదృష్టమే అనుకున్నాడు. ఈ రకంగా అమ్మను చూడగలగటం, అమ్మ దగ్గర ఉండగలగటం జరిగింది. ఈ అంగవైకల్యం వల్ల మరో పని ధ్యాసలేకుండా ఎప్పుడు అమ్మనే తలుచుకుంటూ ఉండే అవకాశం కల్గింది. ఎప్పుడూ నా మనస్సు నీ మీదనే ఉండేటట్లు చూడమని వేడుకొనేవాడు.

అమ్మను చీరాలసోదరులు వాళ్ళ ఊరుతీసుకొని వెళ్ళే సమయం రావటంతో అప్పటికే జిల్లెళ్ళమూడివచ్చి మూడు నెలలు కావటంతో తల్లిదండ్రులు అతన్ని గురవాయపాలెం తీసుకొని వెళ్ళారు.

1962 జూన్‌లో అమ్మ చీరాల వెళ్ళింది. రెండు నెలలు అక్కడ ఉండి పిలిచిన జిల్లెళ్ళమూడి సోదరీసోదరులందరి ఇళ్ళకు వెళ్ళింది. పిలవని వారిండ్లకూ వెళ్ళింది. ఓడరేవులో బెస్తవారి గుడిసెలకు, పల్లెలకు, యానాది ఎఱుకల కాలనీలకు వెళ్ళి వాళ్ళను ఆనందపరిచేది. ఇలా వందలకు వందలు వేలకువేలు మంది అమ్మను దర్శించుకొనేవారు. అనుకోకుండా వారు ఆరాధించే దేవత కరుణించి

వారింటికి వచ్చిందని దర్శించుకొనేవారు. ఆనందించేవారు. ఇలా అమ్మ తనలీలా విలాసాలతో లోకాన్ని సమ్మోహన పరుస్తుండగా ఒకరోజు అకస్మాత్తుగా వెంటనే కారు పిలిపించమన్నది. ఇంత అర్జంటుగా ఉన్నది ఉన్నట్టు కారుపిలిపించమన్నది ఏమిటా అని అందరూ ఆశ్చర్యపోయారు. ఏ గజేంద్రుని మొర ఆలకించిందో ఏ సిరియాళునకు దర్శనం ఇవ్వాలనుకున్నదో లేక జిల్లెళ్ళమూడి కే తిరిగిపోవాలనుకున్నదో ఎవరికీ అర్థం కాలేదు. కారువచ్చింది. ఆ విషయం అమ్మకు చెప్పారు. నర్సరావుపేట దగ్గర గురవాయపాలెం వెళ్ళి పుల్లయ్యను తీసుకురమ్మంది. అందరూ ఒకరి ముఖాలొకరుచూచుకున్నారు. ఎవరీ పుల్లయ్య? అమ్మకు అంత కావలసినవాడెట్లా అయినాడు? కారుపంపించి పిలిపించుకొనేంత సన్నిహితుడెప్పుడైనాడు? అనుకున్నారు. అతని అదృష్టాన్ని తలచుకొని నివ్వెరపోయారు.

ఎట్టకేలకు కారు గురవాయపాలెం చేరుకుంది. ఎక్కడోకడజాతి పల్లెల్లో ఒక గుడిసెలో రోజులు లెక్కిస్తూ కాలం వెళ్ళబోస్తున్న పుల్లయ్య ఇంటి ముందుకు వెళ్ళి ఆగింది కారు. ఇంట్లో వాళ్ళు బయటకువచ్చారు. జిల్లెళ్ళమూడి అమ్మ కారు పంపించిందని, పుల్లయ్యను తీసుకురమ్మన్నదని చెప్పారు. వాళ్ళ నోట మాటరాలేదు. అతని అదృష్టానికి ఇంట్లో వాళ్ళేకాక ఆ పల్లెలో ఉన్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

పుల్లయ్యను అమ్మ దగ్గరకు తెచ్చారు. పుల్లయ్యను అమ్మ సముద్రంలోకి తీసుకొని వెళ్ళి ముంచి స్నానం చేయించింది. సముద్రస్నానం వల్ల ఏం పొందాడో లేదోకాని అమ్మదయాసముద్రంలో మునిగి పునీతుడైనాడు. కొన్నివందల వేలమంది అమ్మదర్శనం కోసం ఎదురుతెన్నులు చూస్తుంటే ఏ మూలనో కుగ్రామంలాంటి పల్లెలో వున్న వాడ్ని, కారు పంపించి పిలిపించుకొన్నదంటే పుల్లయ్య లోని తపన, ఆర్తి, అమ్మను కదిలించి వేసిందనేది అర్థమౌతున్నది. అమ్మ అనుగ్రహాన్ని, కరుణను పుష్కలంగా పొందినవాడని తెలుస్తున్నది. ఆ తర్వాత వారు ఊరువెళ్ళిన కొద్ది కాలానికే అమ్మలో లీనమైన ధన్యజీవి పుల్లయ్య.

అమ్మ చాల మందితో పుల్లయ్య పరమభక్తుడని చెపుతూ ఉండేది. అంతటి ఆదర్శభక్తుడు పుల్లయ్య.



49. వల్లూరు రామమోహనరావు

1960 కి పూర్వం అమ్మను దర్శింపవచ్చిన వారిలో వల్లూరు రామ మోహనరావు ఒకరు. చీరాలలో టీచర్‌గా పనిచేస్తుండేవాడు. అమ్మనుఏ సుముహూర్తాన చూచాడోగాని, చూచిన నాటి నుండి అమ్మను వదిలిపెట్టి ఉండలేకపోయేవాడు, సూదంటురాయికి ఇనుపముక్కలా అతుక్కుపోయాడు. ఆ సూదంటురాయి పరుసువేది అని తనకు తెలియదు. అతడు బంగారం అయిపోయాడు. విచిత్రమేమిటంటే తాను బంగారమయినానని బంగారానికి తెలియదు. ఆ విషయం ఇతరులకు మాత్రమే తెలుస్తుంది.

చీరాల నుండి రోజూ అమ్మదగ్గరకు వచ్చేవాడు. సాయంత్రం బడి అయిపోగానే పిల్లలకు ప్రైవేట్లు చెప్పి సైకిల్‌పై బయలుదేరి జిల్లెళ్ళమూడి వెళ్లేవాడు. రాత్రి ఎక్కువ భాగం అమ్మ సేవలోనే గడిపేవాడు. మళ్ళీ ప్రొద్దున్నే బయలుదేరి చీరాల వెళ్ళేవాడు.

ఆ రోజుల్లో ఇప్పటిలాగా భవనాలు, కరెంటు సౌకర్యాలులేవు. కృష్ణవేణ్మగారికి అమ్మకు కలిపి ఒక పూరిపాకలో రెండు భాగాలు ఉండేవి. ఒకరోజు అమ్మ స్నానం చేస్తున్నది. ఆ సమయంలో కూరలు తరగటానికో, దేనికో కత్తిపీట కావలసి వచ్చింది. మోహనరావు బయటనుండి అడిగాడు. లోపల ఉన్నవారు చూరులో నుండి బయటకు ఇచ్చారు. ఎలా ఇచ్చారో! ఆ కత్తిపీట మోహనరావు తలపై పడి ఒక అంగుళం లోతు గాటుపడి అలాగే తలలో దిగిపోయింది. మానవుడు ఎంత బాధపడ్డాడో! రక్తం కారుతున్నా ఏడవటం లేదు. డాక్టర్ సాంబయ్య వచ్చి మందు వేసి కట్టు కట్టాడు. విచిత్రం;సెప్టిక్ కాకుండా నయమైపోయింది. ఎందుకంటే

అమ్మ 'వాడికేం కాదు' అని అభయం ఇచ్చింది. అంతేకాదు అంతకు క్రితం కొంతకాలంగా అతడు వేపాకు తింటుండేవాడు. బహుశా అది కూడా 'యాంటి సెప్టిక్' గా పనిచేసి ఉండవచ్చు.

వివాహం అయిన తర్వాత "బాల " క్కయ్యను కూడా అమ్మ సేవలో వుంచాడు. తాను రోజు చీరాల పోయి వస్తుండేవాడు. కొన్ని సంవత్సరాలు అలా చేశాడు. పెళ్ళయినా పిల్లలు కలుగలేదు. అతడు వేపాకు తినటం వలన పిల్లలు కలగలేదు అనుకున్నారు అందరూ. ఒకరోజు అమ్మ బాలక్కయ్య చేత పొట్టరుద్దిచ్చుకుంటూ "ఈ బాధ నీకెప్పటికి వస్తుందో"? అన్నది, 'నాకెందుకు వస్తుందమ్మా? నాకు పిల్లలు కలుగరు కదా! నీవంటే బాలింతవు, నిత్య చూలింతవు' అన్నది బాలక్కయ్య,అప్పుడు అమ్మ "నీకు ఒకరోజు ఈ బాధ తప్పదు" అన్నది. విచిత్రం పిల్లలు కలుగరనుకున్న ఆ దంపతులకు వివాహం అయిన పాతిక సంవత్సరాలకు వంశోద్ధారకుడు కలిగాడు. అమ్మది తోలు నోరు కాదు కదా తాలుమాట రావటానికి.

చీరాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేసే రోజులలోనే రైల్వే సర్వీస్ కమిషన్ వారు ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే దానికి దరఖాస్తు చేసి పరీక్షలు వ్రాశాడు. నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నా దాని అతీగతీలేదు. తాను పరీక్ష వ్రాసిన విషయం కూడా మరిచిపోయినా మూడు సంవత్సరాలకు ఇంటికి వెతుక్కుంటూ రైల్వే ఉద్యోగంలో ప్రవేశించమని అపాయింటుమెంట్ ఆర్డర్ వచ్చింది. అమ్మను వదలి దూరంగా వెళ్ళే ఉద్యోగం నాకు వద్దు అన్నాడు మోహనరావు, అమ్మకాదు, కూడదు; మంచి ఉద్యోగం వెళ్ళి తీరాల్సిందేనని బలవంతం చేసి పంపింది. మద్రాసులో ఉద్యోగరీత్యా ఉన్నాడు. బాలక్కయ్య 'నేను వెళ్ళను' అన్నది అమ్మ. "నేను నీవెన్నంటే వుంటాను. నీ వెక్కడ వుంటే అక్కడ వుంటాను" అని చెప్పి పంపింది. మద్రాసు నుంచి హైదరాబాద్ వచ్చిన తర్వాత వారికి ఒకరోజు పూజలో అమ్మ ఎనిమిదేళ్ళ కన్యగా సర్వాభరణ భూషితయై దర్శనమిచ్చింది. పూజామందిరంలో గజ్జల శబ్దం వినిపిస్తుండేది.


బాలక్కయ్య అన్నం చాల తక్కువ తినేది. అమ్మ పెట్టితే మాత్రం ఎంత తిండి తిన్నా ఆకలివేస్తునే వుండేది. అమ్మ పాకలో ఉన్న రోజులలో అమ్మ నాగేంద్రుని రూపంలో కనిపించింది. అవి బాల బహిష్టు అయిన రోజులు. ఆ తర్వాత అమ్మ

వద్దకు వెళ్ళితే", ఈ మూడు రోజులలో నీకేమన్నా కనిపించిందా? అని అమ్మ అడిగితే "ఏం లేదామ్మా' అన్నది బాల "ఏమీ కనపడలేదా ఈ మూడు రోజులలో" అని అమ్మ మళ్ళీ అడిగి 'కనపడినా గుర్తించలేరు" అని అమ్మ అంటూ ఉండగా, ఆ నాగేంద్రుని రూపం అమ్మ ముఖంలో కనిపించింది. తనను గుర్తించాలన్నా తన అనుగ్రహం కావాల్సిందే.

బాలక్కయ్య రాత్రిళ్ళు అమ్మ ప్రక్కనే పడుకుండేది. ఎక్కడో కొండలలో, కోనలలో ఋషులకు తపస్వులకు అన్నం పంపుతున్నాననేది అమ్మ. ఆయా సమయాలలో అమ్మకు వచ్చే ముద్రలు చూచింది బాల. ఓంకారనదిని (డ్రెయిన్) లోకి అందరినీ వెంట తీసుకొని వెళ్ళి, అమ్మ తానొక్కతే దూరంగా వెళ్ళి నీటిని అటూఇటూ విసిరివేసేది. "మీకేమి కనపడింది? అని బాల వాళ్ళని అడిగితే 'పాముల్ని అటూ ఇటూ విసిరివేశావు కదమ్మా! అంటే "ఓసి! మీకు కూడ కనబడిందే" అనేది అమ్మ. అమ్మ ఆడిన ఎన్నో ఆటలలో భాగస్వామిగా కాలం గడిపింది బాలక్కయ్య.

రామమోహనరావు. బాల దంపతులకు లేక లేక కలిగిన కొడుకు 'హైమకర్'. 2000 సంవత్సరంలో హైమాకర్ వివాహం జరిగింది. పెళ్ళి అయిన తర్వాత కొత్త జంట జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మకు నమస్కరించుకొన్నారు. వారి కోడలు పెళ్ళి అయిన తర్వాతనే అమ్మను గురించి వినటం జరిగింది. అయితే ఆ కొత్త కోడలుకి కూడా అమ్మ విచిత్రమైన అనుభవాన్ని ప్రసాదించింది.

రామమోహనరావును అనారోగ్య కారణంగా హాస్పటల్‌లో చేర్చారు. కోడలు ఇంట్లో వున్నది. ఎఱ్ఱపట్టు చీర కట్టుకొని, బులాకీ పెట్టుకొని ఒక ముత్తైదువ వారి కోడలు వద్దకువచ్చి, "నేను వచ్చిన పని అయింది. వెళ్తున్నాను" అన్నది. 'అప్పుడే వెళ్తానంటారేమిటి? రండి, కూర్చోండి' అని ఆమె చెయ్యి పట్టుకున్నది వారి కోడలు. "కాదు. నేను వెళ్ళాలి-" అని చేయి విదిలించుకొని బయటికి వెళ్ళింది. ఆ ముత్తైదువ. కోడలు ఇంటి బయటకు వచ్చి చూస్తే ఎవరూ కనిపించలేదు. ఇంటి వచ్చిన బాలక్కయ్యకు ఈ సంఘటన చెప్పితే 'ఇది అమ్మ పనే' అని అన్నది. తమ కోడలికి కూడా దర్శనము, స్పర్శనము ప్రసాదించినందుకు బాలక్కయ్య, రామమోహనరావు మురిసిపోయారు.



50. గుంటూరు ఆదిశేషయ్య

గుంటూరు ఆదిశేషయ్య అంటే జిల్లెళ్ళమూడి వచ్చే ఎక్కువ మందికి తెలియదు. వంట శేషయ్య అంటే అందరికీ తెలుసు. అందరింటికి తొలి రోజులలో లక్ష్మీనరసమ్మగారు చింతకాయపచ్చడి, చారు వేసి అన్నం పెట్టినా ఎంతో రుచిగా లొట్టలు వేసుకొంటూ తినేవాళ్ళం. అలాగే 1966 కు పూర్వం ఎప్పుడున్నా అమ్మ పుట్టినరోజు, ఉత్సవానికో, కళ్యాణ మహోత్సవానికో వేలకు వేలు జనం వస్తే ఆ పండుగలకు పెద్ద వంటవాడిగా వచ్చి వంట చేసి వెళ్ళుతుండేవాడు. హనుమ బాబు వాళ్ళ అమ్మ భాగ్యమ్మగారు చిరకాలం వంటింట్లో సేవ చేసింది. భాగ్యమ్మగారు కూడా అమ్మవద్దకు రాకపూర్వం వంటలు చేయటానికి శేషయ్యగారి వెంట వెళ్ళుతుండేది. ఆ పరిచయంతో భాగ్యమ్మకారు వచ్చిం తర్వాత శేషయ్యగారు కూడా జిల్లెళ్ళమూడి రావటం మొదలైంది. శేషయ్యగారు బాపట్ల చుట్టు ప్రక్కల ఆరితేరిన వలలుడిగా ప్రసిద్ధి చెందినవాడు. వలలుడంటే విరాట రాజు కొల్వులో అజ్ఞాత వాసం చేసే రోజులలో పాండవులున్నప్పుడు, భీముడు వలలుడు అనే పేరుతో వంటవాడుగా ఉండేవాడు. విరాటరాజు కొలువులోకి వెళ్ళేముందు భీముడు.

"వలలుడనంగ పేరునను వంటల వాడనయైవిరాటునిం
గొలిచి మహానసంబున అకుంఠితతేజము మీర నేర్పుమై

పలురుచిరంబులైన రసవత్ నవపాకములందరుమెచ్చునట్లుగా
పెలుచన కూడు కూరలును పెట్టిన రేనికి ప్రీతి బుట్టగన్? అంటారు.

శేషయ్యగారు కూడా అమ్మకు ఇష్టమయ్యేటట్లుగా,అమ్మకు ఇష్టం కావటం అంటే అందరింట్లోని అందరూ ఇష్టపడేవిధంగా వంట చేసి పెట్టేవాడు. శేషయ్య సాంబారు చేశాండంటే ఆ సాంబారు ఘుమఘుమలు ఈనాటికి మనకు జ్ఞాపకం రావలసిందే, మన నోరూరిస్తూనే ఉంటుంది.

ఎప్పుడు ఎంతమంది అనుకోకుండా వచ్చినా, అర్ధరాత్రి, అపరాత్రి అని అనుకోకుండా 4,5 బస్సుల జనం వచ్చినా బయటకు వచ్చి ఒకసారి తేరిపార చూచి అరగంటలో వంట తయారుచేసే నేర్పు శేషయ్య గారిదే. ఎక్కడా ఎవరికీ ఏ ఇబ్బందీ కలిగేది కాదు.

అసలు శేషయ్యగారు వంటవాడు కావటమే ఒక విచిత్రం, భీముడంతటి వాడు వలలుడైనట్లు, నలమహారాజంతటివాడు బుతుపర్ణుడైనట్లుగా 40 ఎకరాల సుక్షేత్రమైన పొలమున్న శేషయ్యగారు కూడా వంట వాడైనాడు. కాలం, కర్మం కలిపి రాకపోతే తాడే పామై కరుస్తుందట. శేషయ్యగారిది గుంటూరు జిల్లాలోని పోలూరు గ్రామం. తండ్రి దక్షిణామూర్తి, తల్లి కనకమ్మ. చిన్నప్పుడే అంటే శేషయ్యగారికి 7 సంవత్సరాలున్నప్పుడే తల్లి చనిపోయింది. చిన్నతనమంతా చెరుకూరులో అమ్మమ్మగారింట్లోనే పెరిగాడు. తను పెరిగి పెద్దవాడు కాకముందే తండ్రి గతించాడు. కుటుంబ భారాన్ని మోయటంలో ఆనాటి వైదిక వృత్తిలో తగిన ఆదాయం రాక, బ్రాహ్మణ, వ్యవసాయం గిట్టుబాటు కాక తండ్రి అమ్మింది అమ్మగా, తానే పెద్ద కొడుకు కావడంతో తమ్ముళ్ళను పైకి తేవలసిన బాధ్యతతో ఉన్న పొలం కూడా ఊడి పోయింది. కర్పూరంలా కరిగిపోయింది.

ఆ సమయంలో బ్రతుకు తెరువుకోసం వంటవాడు కాక తప్పలేదు. పరిస్థితులు ప్రభావంతో వంట విద్యలో ఆరితేరి గుంటూరు జిల్లాలోనే పేరు ప్రఖ్యాతులు పొందిన వంటవాడుగా ఎదిగాడు. స్వీట్లు, వివిధ రకాల పిండి వంటలు చేయటం బొంబాయి వెళ్ళి చేయి తిరిగిన వంట వాళ్ళ వద్ద నేర్చుకొని వచ్చాడు.

మేనమామ కూతురు కమలమ్మతో వివాహమైంది. మూడుపూలు ఆరు కాయలుగా కాలం వెళ్ళదీస్తున్న సమయంలో 1966లో అమ్మ వద్దకు రావటం జరిగింది. అప్పటికే శేషయ్యగారి పేరు విన్న అమ్మ అందరింట్లో వంట బాధ్యతను అప్పగించింది. అమ్మ గుండెకాయ అనిపించుకొనే అన్నపూర్ణాలయానికి శేషయ్యగారు ప్రధానాధికారియైనాడు. శేషయ్యగారికి అన్నపూర్ణాలయం అప్పగించిం తర్వాత అమ్మ

ఎప్పుడూ దాని గూర్చి, ఆశాక పాకాలను గూర్చి ఆలోచించాల్సిన అవసరం కలుగలేదు. ఎందుకంటే ఆయనే గుండె అయి గుండిగలకు, గుండిగలు దించాడు. జిల్లెళ్ళమూడిలో ఆర్థిక వనరులు లేని రోజుల్లో ఉన్న వస్తువులతో రుచికరంగా చేశాడు. అర్ధరాత్రి, అపరాత్రి భక్తులు వందలలో వచ్చినా తన ఇంటికి బంధువులు వస్తే ఎంత ప్రేమగా, ఆదరణగా చేసి పెట్టుతామో అలా చేసిపెట్టేవాడు. అంతేకాదు ఎవరు అందరింట్లో పెళ్ళిళ్ళు జరుపుకున్నా మొగపెళ్ళివాళ్ళూ, ఆడపెళ్ళివాళ్ళూ మెచ్చుకొని సత్కరించి వెళ్ళేరీతిలో రుచికరంగా చేసేవాడు. తానువంట చేయటమే కాదు వడ్డన కూడా చేసేవాడు. మా వంటి చిన్న వాళ్ళకు వడ్డన ఎలా చేయాలో, ఎక్కువ ఉన్న పదార్థం ఎలా వడ్డించాలి. తక్కువ ఉన్న పదార్థం ఎలా వడ్డించాలో, వంట మధ్యలో పదార్థం అయిపోతే భోజనం చేసే వారికి ఎలా ఏ కార్యక్రమంతో కాలక్షేపం చేయించాలి వంటి మెళకువలు నేర్పేవాడు. మామూలు రోజులు కానివ్వండి, ప్రత్యేక ఉత్సవాలు కానివ్వండి, పెళ్ళిళ్ళు కానివ్వండి అన్నపురాశికి హారతి ఇచ్చింతర్వాతే వడ్డన కార్యక్రమం మొదలయ్యేది. అయితే వంట చేయటంలో నైపుణ్యం ఎవరికి వారు అనుభవంతో నేర్చుకోవాల్సిందేనని చెప్పేవాడు.

అమ్మ శేషయ్య గారితో....... "పుట్టిన రోజు పండుగకు పదార్థాలు తక్కువ ఉండాలి. చేసినవి రుచిగా దండిగా ఉండాలి. అట్లా అయితే వడ్డన చాలా సులభంగా ఉంటుంది. అంతమంది మీద. వడ్డన అందకపోతే కష్టం. పైగా నీళ్ళు త్రాగి త్రాగి ఉంటారు. పదిహేను పిండివంటలు చేసినా అందరూ తినలేరు. అయినా అప్పుడు ఆకలితో చకచకా తింటారే కాని, ఎప్పుడు అమ్మ వస్తుందో అనే ధ్యాసలో అన్నాల మీద ఆసక్తి ఎవరికుంటుంది?" నేను తలంటి పోసుకొని వచ్చేలోగా భోజనాలు చేసే వాళ్ళను చెయ్యమనండి. ముఖ్యంగా పసిపిల్లలు, భజంత్రీలు సుడిపడకుండా ఉంటారు. దగ్గర ఉండి వంటకు ఎట్లా వసతిగా ఉంటుందనుకుంటే అట్టా కట్టించుకోండి గాడిపొయ్య, ఏ పనివాళ్ళకు ఆ పనిలో మెలుకువ తెలుస్తుంది " అని చెప్పింది.

మొదట్లో శేషయ్యగారికి అమ్మను దేవతగా తలవటం ఇష్టం లేదు. అయితే రెండు సన్నివేశాల్లో కలిగిన అనుభవాలు ఆయనకు అమ్మ మీద విశ్వాసం కలిగించాయి. ఒకసారి తనకు తెలియకుండా తన శరీరం అవశమై క్రిందపడిపోయి స్మృహలేదు. అమ్మ శేషయ్యగారికి చేయించిన సేవవల్ల తనకేదో జరిగింది. అమ్మ రక్షించింది. అనుకున్నాడు. రెండవది సలసల మరుగుతున్న పులుసుకళాయిలో చేయిపెట్టి అమ్మ పులుసులోని ముక్కలను, పులుసును రుచి చూసింది. అలా చేస్తే చేయి ఏమౌతుందో ఆయనకు తెలుసు. కాని అమ్మకు ఏమీ కాకపోవటం, బాధ లేకపోవటం ఈమెలో


ఏదో మహత్తర శక్తి ఉన్నది అనిపించి స్థిరమైన విశ్వాసం కలిగింది.

అమ్మ స్వర్ణోత్సవాలలో లక్షమందికి ఒకే పంక్తిన భోజనం పెట్టిన ఘట్టం శేషయ్యగారి జిల్లెళ్ళమూడి అన్నపూర్ణాలయ నిర్వహణలో విశిష్టమైన ఘట్టం. వారి అధ్వర్యంలో వంద ఎకరాల పొలంలో 200 గాడిపొయిలపైన వంట జరిపించటం. అమ్మ అన్నపురాశికి హారతి ఇచ్చి అన్నం తినే అన్నయ్యలను, అక్కయ్యలను చూడటానికి బయలుదేరటం ఒక మరపురాని మనోహర దృశ్యం. శేషయ్యగారి పర్యవేక్షణ అమోఘం అనితరసాధ్యం, పులుసుపెట్టి అరటి కాయ కూర, దోసకాయ ముక్కల పచ్చడి, సాంబారు పులిహోర, పెరుగువంటి పదార్థాలు ఈనాటికీ గుర్తున్నాయంటే శేషయ్యగారి నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. ఆయన ఆసమయంలో చేసిన గోంగూర పులుసుకూర నెల రోజుల వరకు పాడుగాకుండా అందరూ తిన్నారంటే అమ్మ మహిమకు తోడు శేషయ్యగారి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది. భోజనాలకు ముందు 'జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి' అమ్మ నామం చేయించేవాడు. తాను ఒక వంట వానిగా, ఉద్యోగిగా, ఎన్నడూ భావించలేదు. అందరింటిలో అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ తలా ఒక పని చేస్తున్నట్లే ఎవరికి ఏ పనిలో అభినివేశం ఉంటే ఆ పనిని నైపుణ్యంగా వారు చేస్తున్నట్లే శేషయ్యగారు కూడా వంట పని చేసేవాడు. తను చేసే పనిని అమ్మ మెచ్చుకొనేటట్లుగా భగవంతునికి చేస్తున్న సేవగా, సమర్పిస్తున్న నివేదనగా చేసేవాడు.

సహజంగా శేషయ్యగారంటే అందరికీ భయం, కోపంగా కనిపించేవాడు. కాని వెన్నలాంటి మనస్సు ఆయనది.

శేషయ్యగారి కూతురి పెళ్ళి అమ్మ తన చేతుల మీదుగా జరిపింది. 1966 నుండి 1980 దాకా షుమారు 14 సంవత్సరాలు అందరింటిలో అమ్మ సేవలో జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు. వృద్ధుడై అనారోగ్యంతో వంట చేయలేక బాపట్ల ఉండి అప్పుడప్పుడు జిల్లెళ్ళమూడి వచ్చినపుడు శేషయ్యగారిని చూచి అమ్మ మనం పెన్షన్ ఏర్పాటు చేయలేక పోయామే అని బాధపడటం నేను చూచాను. 26.8.1986 నాడు మానసిక స్థిమితం తప్పి రైలు క్రిందపడి అమ్మలో కలిసి పోయినట్లుగా, తెలిసి జిల్లెళ్ళమూడి సోదరులు, అందరింటి సభ్యులు ఎంతో విచారించారు. తన వృత్తి ధర్మం నిర్వహిస్తూ అందులోనే అమ్మకు సేవ చేస్తున్న శేషయ్యగారు ధన్యజీవి.

(ఈ వ్యాసం విషయ సేకరణలో సహకరించిన సోదరుడు లక్కరాజు సత్యనారాయణకు (లాలా) కృతజ్ఞతలు).



51. యార్లగడ్డ రాఘవయ్యగారు

గుంటూరు జిల్లాలోని రేపల్లె, తెనాలి తాలూకా కవులకు పండితులకే కాక భక్తి ప్రవత్తులకు కూడా కుదురైనది. ఆంధ్ర వాల్మీకిగా ప్రసిద్ధి చెందిన వావిలి కొలను సుబ్బారావుగారు (వాసుదాస స్వామి) సంచరించటం వల్లగాని, జియ్యరుస్వామివారి ప్రచారం వల్లగాని, వైష్ణవ స్వాములు చాల మంది పల్లెలలో స్థిరవాసం ఉండటం వల్లగాని సామాన్య రైతు కుటుంబాలలో కూడా సంస్కృతాంధ్రాలు బాగా చదువుతున్న వారున్నారు. రేపల్లె అంటే వ్రేపల్లెకు పర్యాయపదం అయివుండవచ్చును. అందుకే రేపల్లె తాలూకా 'సింగుపాలెం' గ్రామాన్ని అమ్మ బృందావనంతో పోల్చింది. అక్కడి స్త్రీలలో, పురుషులలో ఎక్కువ మందిలో గోపికా భావాన్ని అమ్మ దర్శించింది. ఆ సింగుపాలెంలో యార్లగడ్డ రాఘవయ్యగారు చక్కని కవి పండితుడు మరియు రైతు. భక్తి ప్రవత్తులు కలవాడు. నటనలో కూడా మంచి ప్రావీణ్యం కలవాడు. సింగుపాలెంలో గల రామాలయంలోని రామునిపై ఆయన ఎన్నో పద్యాలు వ్రాశాడు. ఆ ఊళ్లో అందరూ ఆయనను కొత్తింటి రాఘవయ్య అనేవారు. రాఘవయ్య ఆ ఊళ్ళో చాల మంది ఉండటంవల్ల కొత్తగా ఇల్లు కట్టుకోవటంవల్ల ఆయనను ఆ పేరుతో పిలిచేవారు. అకస్మాత్తుగా జబ్బుచేసి రాఘవయ్యగారి రెండుకళ్ళు కనుపించకుండా పోయాయి. వైద్యం చేసినా విఫలం అయింది.

ఒకసారి చేబ్రోలులో శ్రీ అమృతానందస్వామి ఏర్పాటు చేసిన నామసంకీర్తనలో పాల్గొనేందుకు రాఘవయ్యగారు శ్రీ యార్లగడ్డ భాస్కరరావుతో కలసి వెళ్ళటం జరిగింది. సోదరుడు భాస్కరరావు ఆ సంకీర్తన పూర్తికాగానే తిరుగు ప్రయాణం అవుతుండగా జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను చూద్దామని రాఘవయ్యతో చెప్పాడు. అంతకు ముందే మోర్తోట వాస్తవ్యులు చీమకుర్తి సుబ్బారావు, మన్నవలో అమ్మకు నవరాత్రి సంకల్పంగా

జరిగిన పూజలలో దుర్గాదేవిగా అమ్మనుదర్శించిన శ్రీ వడ్లమూడి అంజనేయులు పంతులుగారు అమ్మను గూర్చి విశేషంగా చెప్పి ఉండటం వల్ల సరేనని జిల్లెళ్ళమూడి బయలుదేరి అప్పాపురం వద్ద లాంచీదిగి, నడచి జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ పాదాలపై వాలి పోయాడు.

అమ్మ ఆదరించింది, సేదదీర్చింది, ప్రసాదం నోటిలో పెట్టింది. అమ్మ మొదట నోటిలో పెట్టిన నారింజతొనలో గింజలున్నవి. అయినా అమ్మ పెట్టిన ప్రసాదం గదా అని అలాగే తిన్నాడు. రెండవసారి అమ్మ తొన పెట్టుతూ గింజలు తీసివేశాను నాన్నా!' అని పెట్టింది. తన మనసులోని భావాన్ని గ్రహించిన అమ్మ అనురాగానికి అప్యాయతకు మగ్ధుడై పోయాడు. రాఘవయ్యగారు దూరంగా కూర్చున్నా అమ్మ ఆయనవద్దకు వెళ్ళి నీవు నావద్దకు రాలేవుగానాన్నా! నేనే నీవద్దకు వచ్చాను అని వెళ్ళింది. అమ్మలోని ఆ వాత్సల్యామృతానికి మంత్రముగ్ధుడైనాడు. అమ్మ దగ్గర ఉన్న రోజుల్లో అమ్మకు అచ్యుతుని రామకృష్ణ శర్మగారు స్వయంగా వ్రాసిన అష్టోత్తర శతనామాలతో ఒకరోజు కుంకుమార్చన చేసుకుంటున్నారు. రాఘవయ్యగారు కూడా ఆ నామాల చివర నమః అని వచ్చినపుడల్లా కుంకుమ తీసుకొని ప్రక్కనున్న కాగితములో అమ్మపాదములు మనస్సులో ధ్యానించి ఆ పాదాలపై కుంకుమ అర్చన చేశారు. ఆయనకు ఎంతో ఆనందాన్నిచ్చింది ఆ అర్చన. చివరలో అమ్మవారు మణిమయకిరీటంతో, సకలాభరణ భూషితగా మిరపపండు రంగుచీర, జరీగళ్ళనల్లని రెవిక, మేలిమి బంగారు కాంతిగల శరీరంతో ఠీవిగా సింహ వాహనారుఢయై దర్శమిచ్చింది. శరీరం గగుర్పాటు చెందింది. అది దివ్యమంగళ విగ్రహం. అకారణ కరుణామయి కదా అమ్మ. తన మెడలో పూల హారాన్ని రాఘవయ్యగారి మెడలో వేసి లోపలకు వెళ్ళింది. అనిర్వచనీయమైన ఆనందంతో రాఘవయ్యగారు నిశ్చేష్టులైనారు.

ఒకసారి అమ్మ స్వయంగా బిడ్డలందరికీ ప్రసాదం పెట్టింది. చిన్న గిన్నెలో ఐదారుగురికి సరిపోయే ప్రసాదం ఎనభైమందికి పైగా పెట్టింది. ఆమె చేతిలోని పాత్ర అక్షయపాత్రగా మారి అమ్మ అన్నపూర్ణగా భాసించింది. అప్పుడప్పుడు పూర్ణిమకు, ఏకాదశికి అమ్మ ఓంకార నదిలో జలక్రీడలాడటం పరిపాటి. అర్ధరాత్రి పిల్లలందరినీ వెంటబెట్టుకొని అమ్మ నదికి వెళ్ళింది. శ్రీ రాఘవయ్య గారు కూడా వెళ్ళి ఆనంద రసజలధిలో స్నానం చేశారు. వ్రజభూమిలో శ్రీకృష్ణుడు గోపికలతో విహరించిన దృశ్యం కన్నులకు కట్టి, ఆ భాగ్యాన్ని పొందినట్లని పించింది రాఘవయ్యగారికి.

భాస్కరరావు అన్నయ్యతో కలసి అమ్మ అనుజ్ఞతో వారి ఊరికి వెళ్ళిం తర్వాత, ఒకసారి రాఘవయ్యగారికి పెద్ద జబ్బు చేసింది. బ్రతకరేమో అనుకునే స్థితి వచ్చింది.

అమ్మ అకారణకరుణామయి, దయాతరంగ, తనరెండవ కుమారుడు రవీంద్రు చేత కుంకుమ ప్రసాదము ఇచ్చి పంపింది రాఘవయ్యగారికి కోరకనే వరాలిచ్చేదేవతగా అమ్మను భావించారాయన. జబ్బునయమైంది. హాయిగా కోలుకున్నాడు.

రాఘవయ్యగారి చిన్న కొడుకు వెంకటేశ్వరరావు, అమ్మ వాడిని వెంకన్నా! అని ప్రేమతో పిలిచేది. వెంకన్నకు శరీరవైకల్యం ఉన్నది. మూర్ఛల వ్యాధి ఉన్నది. ఏడవ తరగతిదాకా చదువుకున్నాడు. లలిత కళలంటే ఆసక్తి. అమ్మంటే అచంచలమైన భక్తి. అమ్మ 'వెంకన్నా ' అని పిలిస్తే! ఆ పిలుపులోని స్వరతరంగాలుఅతనిని ఆనందపరచేవి. ముసిముసినవ్వులు నవ్వుకునేవాడు. జిల్లెళ్ళమూడిలో ఉన్నప్పుడు వెంకన్న వద్దకు వెళ్ళి అమ్మ తరుచుగా ఒళ్ళు నిమిరి, వాడి నోట్లో తీర్థం వేసి, ప్రసాదం నోటిలో పెట్టేది. అమ్మ పాదాలు తాకితేగాని వాటిని స్వీకరించేవాడు కాదు. అమ్మ పాదాలువాడి ఒడిలో పెట్టేది. వెంకన్న సింగుపాలెంలో ఉన్నప్పుడు కూడా అమ్మ సింగుపాలెం వెళ్ళి వాడికి దర్శనం ప్రసాదించింది. వాడికి వైకల్యం వచ్చినప్పటి నుండి జిల్లెళ్ళమూడిలో అమ్మ వద్ద ఎక్కువ కాలం గడపాలనేకోరిక ఎక్కువైంది. వాడి కోరిక నెరవేర్చటంకోసం రాఘవయ్యగారు సంవత్సరానికి రెండు లేక మూడు నెలలు జిల్లెళ్ళమూడిలో అమ్మపాదసన్నిధిలో ఉండేవారు. ఒకసారి వెంకన్న అమ్మకు చేసుకున్న పూజ చూచిన అందరికీ హృదయాలు ద్రవించాయి. ఇలాగా వాడి కోరిక రాఘవయ్యగారిని అమ్మ వద్దకు చేర్చింది. రాఘవయ్యగారు జిల్లెళ్ళమూడిలో స్థిరంగా ఉండటానికి ఒకపాక వేసుకున్నారు. వెంకన్నకు రానురాను జబ్బు ఎక్కువై అమ్మ సన్నిధిలోనే శివరాత్రి పర్వదినాన అమ్మలో ఐక్యమైనాడు. అమ్మే అన్నీ అంత్యక్రియలు నిర్వహించింది. అన్నింటికీ అమ్మ కరుణే కారణమయినా, రాఘవయ్యగారు జిల్లెళ్ళమూడిలో ఉండటానికి వెంకన్న కారయమయినారు. మామూలుగా "తండ్రి హరిచేరుమనియెడి తండ్రి తండ్రి" అన్నారుగాని ఇక్కడ బిడ్డలే తండ్రిని హరివద్దకు చేర్చాడు.

రాఘవయ్యగారు 'వేదమాత' అనే పేరుతో అమ్మ కథను హరికథగా మలిచి గానం చేశారు. సోదరులంతా ఆనాడు ఎంతో ఆనందించారు. తర్వాత బుఱ్ఱకథాగానం జరిగినా మొదటి హరికథ రాఘవయ్యగారిదే. రాఘవయ్యగారు కనులు లేకపోయినా అమ్మను దర్శించాడు. అమ్మను స్పర్శించాడు. అమ్మలో ఐక్యమైనారు. మనం కన్నులున్న వాళ్ళమనకుంటూ ఎంత వరకు అమ్మను దర్శించామో తెలిసిన వాళ్ళెందరు? ఏమైనా ధన్యుడు సోదరమూర్ధన్యుడు రాఘవయ్యగారు.



52. కొమ్మూరు డాక్టర్‌గారు

అమ్మ వద్దకు తొలిరోజులలో వచ్చిన వారిలో కొమ్మూరు డాక్టరు శీతాచలంగారు ప్రధానులు. అమ్మకు మందులు ఇవ్వడానికి నాన్నగారు పిలిపించారు కొమ్మూరు నుండి మొదట్లో, డాక్టర్ శీతాచలంగారు కొమ్మూరులో ఆయుర్వేదము, ఇంగ్లీషు మందులు ఇచ్చేవారు. అమ్మ ఎవరిని ఎందుకు ఎప్పుడు దగ్గరకు తీసుకొంటుందో మనకు తెలియదు. వాళ్ళను ఏ రకంగా ఉద్ధరించాలనుకుంటుందో తెలుసుకోవటం కష్టం.

డాక్టరుగారు ఒకసారి అమ్మకు ఇంజక్షన్ ఇస్తున్నారు. పిష్టన్ ఎంత వత్తినా మందు అమ్మ శరీరంలోనికి పోవటంలేదు. ఒకటికి రెండుసార్లు ప్రయత్నించారు. లాభం లేకపోయింది. "ఏమిటిది విచిత్రంగా ఉన్నది,ఎన్ని వేలమందికి ఇంజక్షన్ చేశాను. ఎప్పుడు ఇలా జరుగలేదు!" అని ఆలోచిస్తుండగా మందు దానంతట అదే శరీరంలోకిపోయింది పిష్టన్ వత్తకుండానే ఆశ్చర్యం వేసింది డాక్టరు గారికి. అందరూ అమ్మను గూర్చి రకరకాలుగా చెప్పుకొనే విషయాలు డాక్టరుగారి చెవికి వచ్చినా ఆయన అంతకుముందు పట్టించుకోలేదు. ఈ విషయం జరిగిం తర్వాత కొంత అమ్మను గమనించటం మొదలు పెట్టారు.

ఒకసారి డాక్టరుగారు అమ్మతో మాట్లాడుతుండగా అమ్మ పైట బుజం మీద నుండి కొంచెం ప్రక్కకు తొలిగింది. ఆ పైట క్రింద ఎలుకలు పిల్లులు కలసి ఆడుకుంటున్నాయి. ఆయన బిత్తరపోయారు. విరోధ భావం గల జంతువులు ఒకచోట కలసి అడుకోవటం విశేషమే. ఎక్కడో ఋషి ఆశ్రమాలలో అలాంటి వాతావరణం ఉండేదని వినటమే తప్ప ఇలా ప్రత్యక్షంగా చూడలేము. అంటే ఈ

కరణం గారి భార్యలో ఖచ్చితంగా ఏదో గొప్పతనం ఉన్నది అని భావించి అప్పటి నుండి తానొక డాక్టరుగా కాక అమ్మను సేవించుకొనే ఒక భక్తుడిగా జిల్లెళ్ళమూడి రావటం సాగించారు.

అమ్మ వద్ద డాక్టరుగారు ఎంతకాలం ఉంటే అంతకాలం రోగులు ఎక్కువగా కొమ్మూరు వారింటికి వచ్చేవారుకాదు. ఆయన జిల్లెళ్ళమూడి నుండి రాగానే ఎక్కడెక్కడివారు వచ్చి మందు తీసుకొని వెళ్ళారు. ఈ రకంగా వారికి అనుభవామీద అనుభవాలు జరుగుతుండేవి. దాంతో డాక్టరుగారి కుటుంబం అంతా అమ్మ వద్దకు వచ్చేవారు. అమ్మ కూడా కొమ్మూరు గంగరాజు లోకనాథం గారింటికి వెళ్ళినప్పుడు డాక్టరుగారింటికి కూడా వెళ్ళేది.

తరువాత తరువాత కొమ్మూరు డాక్టరుగారే అమ్మ ఆలయానికి చందాలు వసూలు చేసి పునాదులు వేయించి ఆలయం గోడలు కప్పు వేసేవరకు వారే ఆలయ బాధ్యతలు స్వీకరించి పూర్తి చేశారు. బహుశా అమ్మ అవతార కార్యక్రమాలలో ఆలయ నిర్మాణ కార్యక్రమ బాధ్యత కొమ్మూరు డాక్టరుగారిదే-

ఆ రోజులలో అమ్మను ఎత్తుకొని అవలీలగా ఆవరణంతా తిరగగలిగేవారు డాక్టరుగారు. అమ్మకూడా కొంతకాలం డాక్టర్ శీతాచలంగారితో సంస్థ వ్యవహారాలు చర్చించి నిర్ణయాలు తీసుకుంటుండేది. సర్వసమర్పణాభావంతో అమ్మను సేవించిన వారిలో డాక్టరుగారొకరు.

అమ్మ జీవిత చరిత్రలో కొమ్మూరి డాక్టరుగారిది ఒక విశిష్ట స్థానమనేది నిర్వివాదం.



53. మస్తాను - అంకదాసు

అమ్మకు ఐదు సంవత్సరాలప్పుడు ఒక రోజు బాపట్లలో చిదంబరరావు తాతగారింటి ఎదురుగా ఉన్న తాటి చెట్టు క్రింద కూర్చొని రైలుదిగి వస్తున్న జనం పాదాల వంక చూచింది. ఒక పాదము ముందు ఒక పాదం వెనుక వేసినట్లుంటే "ఇదే నా నడకంటే ఈ హెచ్చుతగ్గులేనా నడకడి. నడకకూ నడతకూ తేడా ఏమిటి? నడక అంటే నడవటమే. నడత అంటే నడకను నిపించేది. అంటే మనస్సున్నమాట' అని అమ్మ అక్కడ నుండి కొద్ది దూరంలో ఉన్న మఱ్ఱి చెట్టు వద్దకు పోయి కూర్చున్నది. అదే మార్గంలో పోతున్న ఒకపోలీసు అమ్మ మెడలో బంగారంతో ఉన్న పులిగోరు చూచి అమ్మ వద్దకు వచ్చి 'ఏయ్ అమ్మాయ్! నీపేరేమిటి?' అని అడిగాడు. అమ్మ మౌనంగా అతడ్ని చూచింది. వాడు మళ్ళీ గద్దించాడు. ఇలా చాలసార్లు పిలవగా అమ్మ 'ఇందాక పిలిచావుగా అదే నాపేరు అబ్బాయ్' అన్నది. 'అబ్బాయంటేవేమిటి'? అన్నాడతను. 'నన్ను అమ్మాయి అన్నావు కదా? అందుకే నిన్ను అబ్బాయ్ అన్నాను' అన్నది అమ్మ. 'నీవు అమ్మాయివి కనుక అలా అన్నాను' 'నీవు అబ్బాయివి కనుక అలా అన్నాను' అన్నది అమ్మ. అమ్మ ఇలా మాట్లాడే సరికి పోలీసుకు కోపం వచ్చి 'ఏయ్ జాగ్రత్త నిన్ను జైలులో పెడతాను' అన్నాడు. "జై" లు కొడతావా! నాకు అన్నది అమ్మ.

మాటకు మాట మాటకు రకరకాలు అర్థాలు తీస్తున్న అమ్మ మీద కోపంతో చెయ్యిపట్టుకొని మెడలో ఉన్న పులిగోరు గట్టిగా లాగాడు. చెయ్యి నొప్పి పుట్టిందిగాని పులిగోరు రాలేదు. అప్పుడు అమ్మ 'నీ చెయ్యి నెప్పి పుడుతుంది. నేనిస్తాగాని ఒక సంగతి అతుగుతాను చెప్తావా?' అంటే 'పులిగోరు గొలుసు ఇస్తానంటే చెప్పుతాన' నన్నాడు మస్తాను. అమ్మ పులిగోరు అతని చేతిలో పెట్టి 'ప్రమాణపూర్తిగా చెప్పు అసలు నీ ఉద్యోగమేమిటి'? వివరించి చెప్పు' అన్నది. 'ఎవరు ఏలోపాలు చేసినా కనిపెట్టి వారినిపట్టుకొని జైలులో పెట్టడం' అని చెప్పాడు. 'లోపమంటే'? అన్నది అమ్మ. 'దొంగతనం చేసినా, ఎవరినైనా చంపినా ఇంకా ఇటువంటి వేవైనా' అన్నాడతను 'నీవిప్పుడు చేసింది ఏమిటి? ఇది దొంగతనం కాదాః పోలుసులు చేస్తే తప్పుకాదా? మిమ్మల్నెవరు పట్టుకుంటారు? గవర్నమెంటు మీరుచేస్తే తప్పు లేదని చెప్పిందా?' అని అమ్మ అడుగుతుండగా అమ్మ ముఖంలో పెద్ద వెలుగు కనిపించి ఆశ్చర్యపడి పులిగోరు అమ్మ మెడలోవేసి అమ్మను ఎత్తుకొని పోలీసులు ఉండే ఇళ్ల వద్దకు తీసుకొని వెళ్ళాడు.

అమ్మకు తనకు జరిగిన సంభాషణ అక్కడ గుమిగూడిన పోలీసులందరికి ఉర్దూలో చెబుతుండగా అందులో సంభాషణ తప్పు చెప్పుతుంటే అమ్మ 'నేనలా అనలేదు'

అని జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది. అక్కడివారంతా బిత్తరపోయారు. అందులో ఒక పోలీసు అమ్మకు ఒక మహత్తర శక్తి ఉన్నదని భావించాడు. అర్థరాత్రి అమ్మను ఇద్దరు పోలీసులు ఇంటి వద్ద దించి పోయారు. అలా మొదటిసారి మస్తాను అంకదాసు అమ్మను చూడటం మాటలు వినటం అమ్మలోని కాంతి పుంజాలను అసాధారణ ధారణాశక్తిని దర్శించటం జరిగింది.

బాపట్లలో ఉన్న రోజుల్లో అమ్మ రోజూ సాయంత్రం మర్రి చెట్టుక్రిందనో, అద్దంకి, వారి తోటలోనే మస్తాను అంకదాసును కలుసుకొనేది. అమ్మ చెప్పినట్లు వాళ్ళు ఉద్యోగధర్మాన్ని నిజాయితీగా నెరవేరుస్తున్నారు. అమ్మ చెప్పిన పోలీసే దొంగైన కథవిని "మాకు నీతినిజాయితీ బోధచేస్తూ మమ్మల్ని తరింపచేయటానికి వచ్చావా! అమ్మా! మాకు తరించే సమయమొచ్చే నీ మెడలోని పులిగోరు పైన కోర్కె కలిగింది. నీవు అవతారమూర్తివమ్మా!" అంటూ నమస్కరించారు.

ఒకరోజు మస్తాను అంకదాసు అమ్మకు పీచుమిఠాయి. పంచదార బూందీ తీసుకువచ్చారు. అమ్మ పొట్లాలు విప్పింది. ఒక అరగంట మౌనంగా కూర్చుంటారు అందరూ. పోలీసులిద్దరూ పొట్లం వంక చూడగా ఖాళీగా ఉన్నాయి. 'అమ్మా! నీవు తీసుకున్నది లేదు. ఎవరో ముసలమ్మ తిన్నట్టుగా అనిపించింది. నీవెరమ్మా?' అంటూ భయంతో వణుకుతూ అమ్మ పాదాలపై బడ్డారు. 'నాకేం తెలియదు నాయనా!' అన్నది అమ్మ. 'భయము, ఆనందము, ఏడుపూ వస్తున్నవి' అని మస్తాను అంటే 'అమ్మకు ఆశక్తి లేకపోతే అయిదేళ్ళ పిల్లచుట్టూ మనమెందుకు తిరుగుతాం. మనకు జరిగిన అనుభవాలు గుర్తు తెచ్చుకుంటుంటే అమ్మ అన్నింట్లోనూ ఒప్పించి మెప్పించుతుంది' అన్నాడు అంకదాసు.


అందుకు మస్తాను 'అమ్మ మీద ఉన్న విశ్వాసం దొడ్డది. నేను ఇంత వరకు ఎవరికీ దణ్ణం పెట్టి ఎరుగను. అమ్మను చూడక ముందు చాల తప్పులు చేసేవాడిని. ఇప్పుడు అమ్మ తప్ప మరేమి గుర్తుకురావటం లేదు. భార్యాపిల్లలు ఇల్లుఉద్యోగము వదిలి పెట్టి పోయి అమ్మను చూస్తూ ఉంటే చాలనిపిస్తున్నది' అన్నాడు. 'మనమనేది పోయి అంతా అమ్మయితే అంతకన్నా కావల్సిందేమిటి?' అన్నాడు అంకదాసు. 'అంతా అమ్మయితే ఇంక అమ్మను చూచే దేముంది? ఆనందమేమున్నది. అమ్మ అమ్మగానే ఉండి మనం పిల్లలుగా ఉన్నప్పుడే ఆనందం. అదే పెద్దలు చెప్పే జీవన్ముక్తి లక్షణం. ఇదే భక్తి' అన్నాడు మస్తాను.

ఇంతలో అమ్మను ఇంటి వద్ద దించుదామని బయలు దేరుతుండగా దోవలో ఒక ముసలి బిచ్చగాడు అమ్మ వంకచూస్తూ అమ్మకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఎంతసేపటికి అమ్మ పాదాల మీద నుండి లేవకపోయేసరికి లేవదీయపోతే నోటివెంట

నురుగు పడుతు ఒళ్ళంతా పచ్చబడి ఉంది. లేపినా లేవలేక పోయాడు. 'ఇదివరకు ఎరుగుదువా?' అమ్మా!' అని మస్తాను అతగ్గా, 'ఒకసారి కలిశాడు బిక్షమనొస్తే పెట్టలేక పోయాను' అన్నది అమ్మ. ఒకసారి దర్శనానికే ధన్యుడైనాడు. అని, ఆజ్ఞతో పారవేసి వద్దామన్నాడు అంకదాసుతో మస్తాను. 'సరే అలాగే చేయండి. వీలయితే వస్తాను. నేను వీలుకాక రాలేకేపోయినా మీరే పని పూర్తిచెయ్యండి' అని చెప్పి వెళ్ళింది కాని మళ్ళీ వెంటనే వచ్చింది. మస్తాను అంకదాసు పుల్లలు తేవడానికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి అమ్మ అక్కడ ఉన్నది. శవం కొంచెం కదులుతున్నట్లున్నది. ఇద్దరూ అమ్మే బ్రతికించిందని భావించి తాత సమాధి స్థితిలోకి వెళ్ళాడేమో అని' 'అమ్మే తనలో లయ చేసుకొని మళ్ళీ స్మృతి తెప్పించింది.' అని ముష్టికి వచ్చినవానికే దర్శనమాత్రంతో ముక్తిని ప్రసాదిస్తున్నది' అని అమ్మవంక చూశాడు. అమ్మ తేజస్సు రకరకాలుగా మారుతూ అంకదాసుకు యశోదకు శ్రీకృష్ణుడు చూపించినట్లుగా విశ్వరూప సందర్శనం జరిగింది. మస్తానుకు కూడా తనలో ఉన్న జీవంలేని అమ్మలో ప్రవేశిస్తున్నట్లు, తనులేక ఉన్నదంతా అమ్మే అనే అనుభూతికి, లోనయ్యాడు. వాళ్ళిద్దరూ అమ్మను 'అజ్ఞానులకు జ్ఞానం ఎట్లా కలుగుతుంది?' అని ప్రశ్నించగా 'మీకు కల్గినట్లే' అన్నది అమ్మ. అంటే అమ్మవారిద్దరికి దయతో జ్ఞానాన్ని ప్రసాదించిందన్నమాట. మొదటిసారిగా "అనసూయ అంటే రాగద్వేష అసూయలను పారద్రోలేది అని వారికి వివరించింది. తెల్లవారుతుండగా అమ్మ ఇంటికి బయలుదేరగా 'మళ్ళీ కనబడవా? అమ్మా' అంటే "అమ్మ ఎక్కడ ఉన్నా ఉన్నది నాన్నా! మస్తాను. రూపం పరిమితం శక్తి అనంతం" అనగానే అరుణోదయకాంతి దిక్కులన్నీ నిండింది. జీవన్ముక్తి ప్రసాదించింది. అమ్మ అనుకుంటారు. చనిపోయి లేచిన తాత 'నాగతేమిటమ్మా?' అంటే "వాళ్ళగతే నీగతి. అందరికీ సుగతే" అన్నది అమ్మ.

తమతో ఉన్న కొద్దిరోజులలోనే ఇంత చరిత్ర జరిగితే భూమి మీదకు వచ్చిన ఈ అయిదేళ్ళలో ఎంతమందిని తరింపచేసిందో? అయినా పుట్టుక ముందు లేకపోతేగా ఇప్పుడు అనుకోవడానికి?

మస్తాను, అంకదాసు అమ్మ అనుగ్రహం పొంది విశ్వరూప సందర్శనం పొంది జీవన్ముక్తులైనారు. అమ్మతో ఏరకమైన అనుబంధం ఉన్నా వారంతా తరించేవారే అనటానికి నిదర్శనం వీరిద్దరూ. అమ్మ నగలు దొంగిలించాలనుకున్న ఒకే ఊహ కలిగిన మస్తాను. అతనితో కలిసి అమ్మను అనుసరించిన అంకదాసు, మధ్యలో బిచ్చానికి వచ్చిన తాత ఒకరనేమిటి? అమ్మను చూచినవారూ అందరూ తరిస్తారు. 'నేనుకనబడితేనే మీరు చూస్తారు' అన్న అమ్మ తాను కనబడి మస్తానును, అంకదాసును తరింపచేసినట్లే అమ్మను చూడవలసిన రీతిలో చూచి అమ్మచే చూడండి మనం కూడా తరిద్దామా మరి!



54. కొమరవోలు గోపాలరావు

జిల్లెళ్ళమూడిలో సుమారు మూడు దశాబ్దాల పైచిల్కు కాపురం వున్న శ్రీ గోపాలరావుగారు చాల మందికి పరిచితుడు. ఒక నియమ బద్ధమైన జీవితంతో సమయపాలన చేస్తూ విశ్వజననీ పరిషత్ ఆఫీసులో ఆయనదొక విభాగంగా నిర్వహించేవారు. పదవులతో సంబంధం లేకుండా తనకు తానుగా తీసుకున్న బాధ్యతలను వేలుపెట్టి చూపకుండా అమ్మ అనుమతితో అననుకూల వాతావరణం మధ్య కూడా నిర్వహించేవాడు. వారు ఏర్పాటు చేసిన శుక్రవారపు పూజా పథకం అందరి ప్రశంసలకు పాత్రమైంది. వారు నిర్వహించిన పర్మనెంట్ ఫిక్సెడ్ డిపాజిట్ పథకం, శాశ్వత నెలసరి డిపాజిట్ పథకం కొన్ని లక్షలకు చేరుకొన్నది.

గోపాలరావుగారి తండ్రి ముక్తేశ్వరరావుగారు 1950 దశకంలో తొలిరోజులలో అమ్మ వద్దకు వచ్చిన వారిలో ఒకరు. బాపట్ల నివాసి అయిన వారు బెండపూడి అక్కిరాజుగారు, వఝూ శివరామయ్యగారు వంటి వారితో కలసి వచ్చేవారు. అమ్మలోని అతిమానుష శక్తిపట్ల విశ్వాసం కుదిరినవాడు. ఆహారం స్వీకరించక పోయినా అమ్మలోని తేజస్సు తగ్గకపోవటం వారికి ఆశ్చర్యాన్ని కల్గించింది. ప్రతివారం చివర జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మ పూజా సమయంలో సమాధిలోకి పోయినపుడు వస్తున్న దేవతా ముద్రలు దర్శించిన వారు. అమ్మతో రకరకాల వేదాంత విషయాలు సంభాషించినవారు.

ఎవరికి ఎప్పుడు విరాగం వస్తుందో చెప్పలేము. తన బిడ్డ గోపాలరావు యౌవన కాలంలోనే హిమాలయ పర్వతాలకు పోయి తపస్సు చేసుకోవాలన్న కోరికను పసికట్టిన తండ్రి ముక్తేశ్వరరావుగారు అమ్మను గూర్చి చెప్పి ఒకసారి చూచిరమ్మన్నారు. అన్నీ అమ్మ చూచుకుంటుందన్న నమ్మకంతో, నిత్యసంధ్యా వందనాద్యనుష్ఠానాలతో, ఉద్యోగ

బాధ్యతలతో, సంసారంలో కొట్టుమిట్టాడుతున్న గోపాలరావు గారికి అంత తొందరగా అమ్మను చూడటం వీలుపడలేదు. ఒంగోలులో ఉద్యోగం చేస్తున్న వారు బాపట్ల వచ్చినపుడు తండ్రి చెప్పగా చెప్పగా ఒక రోజు జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మ ఆవరణలో అమ్మగారు ఎక్కడ ఉంటారని అక్కడ కనిపించిన వ్యక్తిని అడిగాడు. ఆయన వారిని అమ్మ వద్దకు తీసుకెళ్ళారు. తరువాత తెలిసింది అమ్మ వద్దకు తనను తీసుకొని వెళ్ళిన వ్యక్తి అమ్మ భర్తగారని ఆ ఊరికి కరణం అని.

అందరూ నాన్న గారిని పిలుస్తారని, ఆయనలోని నిరాడంబరతకు ఆశ్చర్య పోయారు గోపాలరావుగారు.

అమ్మ వద్దకు వెళ్లిన గోపాలరావుగారు అమ్మకు పండ్లు పూలు ఇచ్చి మోకాళ్ళ మీద కూర్చుని అమ్మ పాదాలు తాకకుండా నమస్కారం చేసుకొని లేవబోయేలోపలే అమ్మ సమాధి స్థితిలోకి వెళ్ళింది. షుమారు 20 నిమిషాలు అమ్మ సమాధి స్థితిలో ఉన్నది. గోపాలరావుగారు అమ్మ కళ్ళు తెరిచేదాకా అలాగే మోకాళ్ళపై అమ్మ ఎదురుగా కూర్చునే ఉన్నారు. అమ్మ బొట్టు పెట్టి అరటి పండిచ్చింది. ఆ పండు ఎవరికన్నా ఇద్దాంలే అనుకుంటుండగా ఎవరి పండు వాళ్ళే తినండి. ఊరికి వెళ్ళేటపుడు ప్రసాదం మళ్ళీ ఇస్తాను అన్నది. అమ్మ స్వయంగా భోజనం వడ్డించి తినిపించింది. వరుస వరుసగా జరుగుతున్న సంఘటనలు ఆయనలో ఏదో మార్పు తేవటం మొదలైంది. అంతకు ముందు ప్రత్యక్షంగా సమాధి స్థితిలోకి వెళ్ళినవారిని చూడలేదు. ఇక్కడ అమ్మను చూచాడు. తన మనసులో అరటి పండు తను తినకుండా ఎవరికన్నా ఇద్దామనుకున్నాడు. కాని అమ్మ తన మనస్సు ఎట్లా గ్రహించింది? అమ్మ స్వయంగా పెట్టిన అన్నం తిన్న తర్వాత తనలో ఏదో తనకు తెలియకుండా మార్పు కనిపిస్తున్నది. ఈమెలో ఏదో గొప్ప శక్తి వున్నది అనుకున్నారు.

అమ్మ దగ్గర నుండి వెళ్ళిందగ్గర నుండి నిరంతరం ఆధ్యాత్మిక గ్రంథాలు చదివే వ్యక్తిని దాని మీద మనసు పోవటం లేదు. నిరంతరం అమ్మ ముఖమే కనిపిస్తుండేది. ఇలా పదిహేను రోజులు గడిచింతర్వాత అమ్మ వద్దకు వచ్చారు. ఇంటికి వెళ్లింతర్వాత మళ్ళీ అదేస్థితి. అమ్మను వదిలి ఉండలేనిస్థితి వచ్చింది. భార్యా పిల్లలు ఉద్యోగము వీటన్నిటినీ వదులుకొని అమ్మ వద్ద ఉండటం ఎట్లా? అమ్మ మీద తనకు నమ్మకమేర్పడ్డంత మాత్రాన భార్య ఎంత అనుకూలవతియైనా ఉద్యోగం వదిలిన భర్తతో పిల్లలను పెట్టుకొని ఒకరి దయా దాక్షిణ్యాలపై బ్రతకడం ఎంత వరకు సబబు? ఈలోపల గోపాలరావుగారి భార్య సరోజినక్కయ్యకు ఒక అనుభవం కలిగింది.

ఒకసారి గోపాలరావుగారికి ఆటలమ్మ పోసింది. వరుసగా పిల్లలకు పోసింది. ఇంట్లో వీళ్ళందరినీ చూచుకోవటం అంత తొందరగా తగ్గక పోడంతో ఆమె ఎదురుగా

గోడకున్న అమ్మ పటం చూచి "ఈయన జిల్లెళ్ళమూడి అమ్మ అంటూ తిరుగుతున్నాడు వీళ్ళకు వెంటనే తగ్గిపోతే అమ్మ మహత్తు కలదని నమ్ముతాను. లేకపోతే లేదు" అని అనుకున్నది. (సరోజినక్కయ్య పుట్టింటివారు వస్తుతః కుసుమ హరనాథబాబా భక్తులు) అలా అనుకుని నిద్రపోయింది. తెల్లవారు ఝామున మెలకువ వచ్చి చూస్తే జిల్లెళ్ళమూడి అమ్మ గోపాలరావుగారి శరీరాన్ని, పిల్లల శరీరాన్ని ఆప్యాయంగా నిమురుతున్నది. సరోజిని అక్కయ్య వంక చూస్తూ "తగ్గిపోతుందిలేమ్మా! భయపడకు" అన్నది. అదంతా కలోనిజమో ఆమెకు తెలియలేదు. మరునాటి ఉదయానికి అందరికీ తగ్గింది. అమ్మ దేవత అనే విశ్వాసం కుదిరింది.

ఆ రకంగా విశ్వాసం కుదరటంతో జిల్లెళ్ళమూడి వచ్చి స్థిరపడాలనే గోపాలరావుగారి కోరిక సిద్ధించింది. ఉద్యోగానికి రాజీనామా చేసి అమ్మ సేవలోకి చేరారు. మొదటిసారి గోపాలరావుగారు అమ్మ వద్దకు వెళ్ళినప్పుడు ఒక యువకుడు గుంటూరు నుండి పూనా వెళ్ళుతూ అమ్మను చూచి వెళ్దామని వచ్చి నమస్కారం చేసుకొని పదిహేను నిమిషాలలోనే వెళ్ళాడు. అప్పుడు ఈ పిల్లవాడికి పిచ్చి పట్టిందా? పదిహేను నిమిషాలు ఉండటానికి గుంటూరు నుండి వచ్చి వెళ్ళుతున్నాడేమిటి? అనిపించిన ఆయనకు అమ్మను నిరంతరం, చూడాలని, అమ్మ వద్ధనే జీవితం చరితార్థం చేసుకోవాలని, అమ్మ సేవలో గడపాలని అనే పిచ్చి పూర్తిగా తలకెక్కింది. ఆయనతోపాటు ఆయన కుటుంబానికి కూడా పిచ్చి ఎక్కించాడు. ఒక రకంగా ఆలోచిస్తే గోపాలరావుగారి వల్లనే అన్నంరాజు వారి కుటుంబాలు, ఏకా వారి కుటుంబాలు అమ్మ ఒడిలోకి చేరే అవకాశం కల్గిందేమో అనిపిస్తుంది. గోపాలరావుగారు వారి పెద్దమ్మాయి పద్మ వివాహం జిల్లెళ్ళమూడిలో చేశారు. అప్పుడు వారి బంధుగణమంతా ఆ పెళ్ళికి జిల్లెళ్ళమూడి వచ్చారు. అలా వచ్చి అమ్మను చూచిన వారు అమ్మ ప్రేమకు పాత్రులైనారు.

ఒకసారి గోపాలరావుగారు ఒక కొబ్బరికాయ పట్టుకొని అమ్మ వద్దకు వెళ్ళారు. ఏమిటి విశేషం? అన్నది అమ్మ. పుట్టిన రోజమ్మా! అన్నారు. అదేమిటి నీవు జనవరి 11న కదా పుట్టింది! అన్నది అమ్మ. అవును గోపాలరావుగారిని మొదటిసారి అమ్మ కన్నది ఆ రోజున. అది ఆయనకు ఆధ్యాత్మిక పునర్జన్మ. అసలు అమ్మ మిమ్మల్ని నేనే కని మీ తల్లులకు పెంపుడిచ్చాను అన్నది కదా! మన పుట్టుక అమ్మకు తెలిసినట్లు మనకు తెలియదు. అమ్మ వద్ద ఏదో సాధిద్దామనే ఉద్దేశ్యంతో ఆయన వెళ్ళలేదు. తనకున్న అనుమానాలు అమ్మను చూడగానే పటాపంచలై పోయాయి. జవాబులు దొరికాయి. విరాగియై సంసారాన్ని వదిలి హిమాలయాలకు పోవాలనుకున్న వాడు అమ్మ విశ్వసంసారంలో వచ్చి పడ్డాడు. శక్తి, ముక్తి ఏది కావాలన్నా ఏది ఇవ్వాలన్నా

అమ్మే చూచుకుంటుందనే విశ్వాసం బలీయంగా ఏర్పడ్డది. అమ్మ వద్ద ఆ ఆవరణలో ఉండటం అసిధారవ్రతమే. ఆయన ఒడిదుడుకులకు తట్టుకొని కుటుంబంతో ఉండగలిగాడు.

మాతృశ్రీ అధ్యయన పరిషత్‌లు ఆయా పట్టణాలలో పెట్టడానికి గోపాలన్నయ్యతో కలిసి తిరిగాడు. అమ్మ సందేశాన్ని సంఘటనలను శుక్రవార లేఖలో లోకానికి అందించారు.

అమ్మను ఏదన్నా సందేశం ఇవ్వమ్మా అంటే తన జీవితమే సందేశమనీ అందులో ఏదన్నా మీకు నచ్చింది సందేశంగా తీసుకోమని చెప్పేది, గృహస్థాశ్రమంలో ఉండి ఆధ్యాత్మికోన్నతికి మార్గం వెతికేవారికి అమ్మ జీవితం ఒక ఉదాహరణ. అమ్మ దేవతనని ఎక్కడా చెప్పలేదు. ఒక పతివ్రతగా, ఒక గృహిణిగా లోకాన్ని జయించింది. పతిని ఆధారం చేసుకొని పంచభూతాలను జయించింది. సృష్టిని మొత్తాన్ని తల్లిగా లాలించింది.

ఆ కుటుంబంలోకి, ఆ ఒడిలోకి వచ్చిన గోపాలరావుగారి కుటుంబానికి కూడా ఆ లక్షణాలే అబ్బటంలో ఆశ్చర్యం లేదు. అన్నీ అమ్మే చూచుకుంటుంది అనే విశ్వాసము, నిర్లిప్తత గోపాలరావుగారి అయిదుగురి కూతుళ్ళ పెళ్ళిళ్ళు జిల్లెళ్ళమూడిలో జరిపించింది.

జిల్లెళ్ళమూడిలో ఏ కార్యక్రమం జరిగినా సరోజిని అక్కయ్య ముందుండేది. అభిమానవతి, మంచిమాటకారి, కలుపుగోలు, తనంగలది, కార్యనిర్వహణాదక్షురాలు అయిన సరోజినక్కయ్య ఉంటే ఉత్సవాలన్నీ జగజ్జేగీయమానంగా జరిగేవి. బంధుప్రీతి గల ఆమె చుట్టూ పుట్టినింటి మెట్టినింటి బంధువులే కాదు అందరింటి బంధువులు కూడా చేరి ఆమె కార్యనిర్వహణ దక్షతను చాకచక్యాన్నీ మెచ్చుకొనేవారు. అమ్మ కూడా సరోజినక్కయ్యను పిలవండిరా అదే చూచుకుంటుంది అనేది. అమ్మకు కూడా అంత నమ్మకం. అమ్మంటే అక్కయ్యకు చాల భక్తి, ప్రపత్తి. ఒక ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గోపాలరావుగారు ఎలా పని చేశారో అలాగే జిల్లెళ్ళమూడి ఉత్సవాల ఆర్గనైజర్‌గా సరోజినక్కయ్య కూడా పని చేసింది.

“నమ్మి చెడినవారూ లేరు నమ్మక చెడిపోతే పోయేరు” అనే పాట ఒకటుంది. అమ్మను నమ్మిన ఆ కుటుంబం జీవితాలు హాయిగా ఆనందంగా తృప్తిగా గడిచిపోతున్నాయి. గోపాలరావుగారి పిల్లలందరూ ఆడ, మొగ వారి వారి సంసారాలలో వారు స్థిరపడి సుఖసంతోషాలతో ఉన్నారు. సరోజినక్కయ్య ముత్తైదువుగా, గోపాలరావుగారు తృప్త జీవిగా అమ్మలో ఐక్యం గావటం ఎవరైనా కోరుకో తగ్గ అదృష్టమే– ఆదర్శవంతమైన దాంపత్యం వారిది. పరస్పర ప్రేమైక జీవులువారు. అందువల్లనే అమ్మ ప్రేమలో తరించారు వారు ధన్యజీవులు.



55. డి.యస్.పి.సత్యనారాయణగారు

మరకాని సత్యనారాయణగారిని డి.యస్.పి. సత్యనారాయణగారనటమే జిల్లెళ్ళమూడి సోదరీ సోదరుల అలవాటు. ఆయన గుంటూరు డి.యస్.పి.గా ఉన్న రోజులలో అమ్మ గుంటూరు వచ్చింది. గుంటూరులోని మాతృశ్రీ అధ్యయన పరిషత్ సోదరీ సోదరులు అమ్మను గుంటూరు ప్రజలు దర్శించుకొనేందుకు వీలుగా స్థానిక హిందూ కాలేజి ఆవరణలో ఎత్తైన వేదిక నిర్మించి అమ్మను అక్కడకు ఆహ్వానించారు. ఆ సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయమని పోలీసులను అభ్యర్థించారు. ఇద్దరు కానిస్టేబుళ్ళను పంపారు వారు. అక్కడకు వచ్చిన వేలాది మంది జనాన్ని చూచి వాళ్ళు ఇంకా కొందరు రక్షణ సిబ్బందిని పంపారు. అమ్మ వచ్చే సమయానికి ఇసుకవేస్తే రాలనంతగా జనం వచ్చారు. కాలేజి ఆవరణ చాలక జనం రోడ్ల మీద నిలబడ్డారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతున్నది. అప్పుడు డి.యస్.పి. సత్యనారాయణగారు యస్.ఐ.ని మరి కొంత మంది పోలీసులను తీసుకొని రంగంలోకి దిగారు. ఒక సామాన్య గృహస్థ స్త్రీని చూడటానికి ఇంత మంది జనం రావటం ఆయనకు ఆశ్చర్యాన్ని కలిగించింది. వారి కుటుంబాన్ని కూడా అమ్మ దర్శనానికి పిలిపించారు. చివరకు వారి కుటుంబానికి అమ్మ దర్శనం చేయించాలంటే వారికే సాధ్యం కాక వెళ్ళెక్కడున్నారో తెలియక మైకులలో చెప్పించవలసిన వచ్చింది. ప్రజల వత్తిడికి అమ్మ ఎక్కిన వేదిక ఒక వైపుకు ఒరిగి పోయింది. అమ్మను జాగ్రత్తగా కాలేజి మొదటి అంతస్థుపైకి తీసుకొని వెళ్ళి ప్రజలకు దర్శనం ఏర్పాట్లు చేయించారు. ఏదో శక్తి లేకపోతే

ఇంత మందిజనం ఇలా పొర్లబడటమేమిటి అని ఆలోచించారు.

ఆ సన్నివేశంలో సత్యనారాయణగారిలోనూ, వారి కుటుంబ సభ్యులలోనూ అమ్మ పట్ల ఒక ఆకర్షణ, ఒక మహోన్నత ఆధ్యాత్మిక భావన, విశ్వాసము ఏర్పడ్డాయి. అయితే సత్యనారాయణగారు తానొక పాపినని అమ్మను తాకే అర్హతలేని వాడినని భావించి అమ్మ దగ్గరకు వెళ్ళేవాడు కాదు. అమ్మ రమ్మన్నా దగ్గరకు వచ్చే వాడు కాదు. కారణం అడిగిన అమ్మతో నీ పాదాలుతాకే అర్హత ఈ పాపికి లేదమ్మా! అనేవాడు. ఈ వృత్తిలో నేను ఎంతమందిని హింసించారో, అందులో మంచి వాళ్ళూ చెడ్డవాళ్ళూ ఉండవచ్చు. ఆ హింస తాలూకు పాపం నన్నంటుకొని ఉన్నదమ్మా! అనేవారు.

అయితే సత్యనారాయణగారు నిజాయితీపరుడు. పోలీసు శాఖలో లంచగొండి కాని వారు తక్కువ అని లోకాపవాదు. కాని సత్యనారాయణగారిని ఆవిషయంలో శత్రువులు కూడా వేలెత్తి చూపలేరు. ఒకసారి గుంటూరులో సుప్రసిద్ధ న్యాయవాది జూపూడి యజ్ఞనారాయణగారు సత్యనారాయణగారిని గూర్చి మాట్లాడుతూ ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంటలో డి.యస్. పి. గా చేసి అందరూ లక్షలు కోట్లు సంపాదిస్తుంటే ఉన్న ఆస్తి అమ్ముకున్న పోలీసు ఆఫీసర్ ను సత్యనారాయణ గారినే చూస్తున్నాను అని ఆయన నిస్వార్థపరతకు, నిజాయితీకి, కర్తవ్యదీక్షను కితాబు ఇచ్చారు. రౌడీలకు సింహస్వప్నంగా, చండప్రచండుడుగా పేరుపొందిన డొక్కా సుబ్బారావు అనే డి.యస్.పి తర్వాత సత్యనారాయణగారే అంతటివాడు అని చెప్పేవారు ఆశాఖ విషయాలు తెలిసినవారు.

ఒకసారి కందుకూరిలో డి.యస్.పి.గా చేసే రోజులలో ఆయనకు ఒక కలవచ్చింది. ఒక నేరస్థుడి చేత నిజం చెప్పించటానికి చిత్రహింసలు పెడుతున్నాడు. సరిగ్గా అదే సమయానికి అమ్మ ఆ వైపుగా వచ్చి ప్రేమతో, వాత్సల్యంతో, అనురాగంతో అందరినీ పలుకరిస్తున్నది. సత్యనారాయణగారివైపు కన్నెత్తికూడా చూడలేదు. అలా అమ్మ అందరినీ పలుకరిస్తూ వెళ్ళిపోయింది. అది వారికి ఎంతో అవమానంగా మనసును తొలిచివేసింది. ఇంతలో మెలుకువ వచ్చింది. అదికలే. కానీ కలచెదిరిన తరువాత కూడా ఆయనలో ఆ బాధతొలగలేదు. ఆ సన్నివేశం ఆయన జీవితంపై చెరగని ముద్ర వేసింది. అమ్మను క్షమించమని ప్రార్థిస్తూ ఒక ఉత్తరం వ్రాశాడు. ఆ తర్వాత ఆయనలో అమ్మ తెచ్చిన మార్పు మరో మార్గానికి మళ్ళించింది. ఆ తదనంతరం ఎవరినీ అలా హింసించి ఎరుగడు.

నరుణ్ని, నరకుణ్ని, నారాయణుణ్ని ఒకటిగా తన పిల్లలుగా భావించే అమ్మ దృష్టిలో పాపులు, దుష్టులు అనే వారే లేరు. తప్పించుకోలేకనే ఎవరైనా తప్పుచేస్తారు. అనేది అమ్మ. ఎవరి బాధనైనా సహించలేని అమ్మ సత్యనారాయణగారిని కూడా ఇతరులను బాధించి తాను బాధపడే పని నుండి విరమింప చేసింది.


సత్యనారాయణగారితో వారు గుంటూరులో ఉన్నప్పుడుకానీ, కందుకూరులో ఉన్నప్పుడుకాని ప్రసంగిస్తే ఆయనలోని నిజమైన మనిషి దర్శనమిచ్చేవాడు. అమ్మ సేవలో ఉన్న సోదరీసోదరులను దేవతలుగా భావించేవాడు. అమ్మ పుట్టినరోజు ఉత్సవాలకు, స్వర్ణోత్సవాలకు ఎవరి దగ్గరకైనా ఆయన మనల్ని తీసుకొని వెళ్ళితే ఎన్నడూ ఏ విషయంలోనూ డబ్బులు అడిగి ఎరుగని సత్యనారాయణగారిని చూచి అడక్కుండానే విషయం తెలుసుకొని ఇచ్చేవారు. పదిసార్లు త్రిప్పుకుంటేగాని ఇవ్వనివారుగా ఖ్యాతి పొందినవారు కూడా వెంటనే ఇచ్చి పంపేవారు. ధనంగాని ధాన్యంగాని అవి సద్వినియోగం ఔతాయని ఆ దాతల విశ్వాసం.


ఉద్యోగ విరమణానంతరం ఎక్కువ కాలం జీవించాలని ఆయనకుండేది కాదు. నాకు పైకెళ్ళటానికి తొందరగా టిక్కెట్టిప్పించమ్మా! అని అమ్మను కోరుకునేవాడు. అమ్మకు సన్నిహితులైన సోదరీ సోదరులలో అమ్మకు మీరు చెప్పి నాకు తొందరగా టిక్కెట్టిప్పించండి అనేవాడు. చివరలో ఉన్నంతకాలం జిల్లెళ్ళమూడిలో అమ్మ సమక్షంలో ఉండాలని కోరుకున్నాడు. కాని తమ జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గర ఉండటం కాకుండా అమ్మనే తనలో ఉంచుకున్నాడు. నిరంతరం ఆ ధ్యాసలో ఉండేవాడు. అమ్మ చెప్పినట్లు రాముడి వద్దే లక్ష్మణుడున్నాడు, భరతుని వద్ద రాముడున్నాడు- పాదరక్షలరూపంలో. అలాగే సత్యనారాయణగారి వద్ద అమ్మ ఉన్నది. తమ ఇంటికి అమ్మ ఎప్పుడూ రాలేదు కదా అనుకుంటుండేది లలితాంబక్కయ్య. దీనికి ఉదాహరణగా లలితాంబక్కయ్యకు అమ్మ కృష్ణుడుగా కనిపించింది. తణుకులో వాళ్ళింట్లో ఉన్నప్పుడు వారు జిల్లెళ్ళమూడి వచ్చినప్పుడు ప్రాస్తావికంగా అమ్మ "మీ ఇంట్లో మామిడి చెట్టు క్రింద చాల చల్లగా ఉంటుందమ్మా!" అన్నది. ఇంటికి వెళ్ళిం తర్వాత చూస్తే మామిడి కొమ్మలు ఆక్రమించుకున్న గోడకు అమ్మ ఫోటో వ్రేలాడుతున్నది. అమ్మ అన్నమాట జ్ఞప్తికి వచ్చింది. అమ్మ తనింటికి వచ్చింది అనే విషయం అవగాహన అయింది- తన ఇంటికి అమ్మ వచ్చినట్లు అక్కయ్య గుర్తిస్తే తన యెదలోనే అమ్మకు గుడి కట్టారు

సత్యనారాయణగారు. ఆయన కోరుకున్నట్టుగానే ఆయన త్వరలోనే అమ్మలో కలిసిపోయారు. అయితే ఆ తర్వాత ఆయన కుటుంబం జిల్లెళ్ళమూడిలో స్థిరనివాసం ఏర్పాటుచేసుకున్నది. వారి పిల్లలు, భార్య అమ్మలో నిమగ్నమయ్యే అదృష్టాన్ని పొందింది. పెద్దకుమారుడు శ్రీ దినకర్ శ్రీ విశ్వజననీ పరిషత్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వైస్ ప్రెసిడెంటుగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. రెండవ కుమారుడు డాక్టర్ జన్వంత్ మాతృశ్రీ మెడికల్ సెంటర్ పరిపాలనలో భాగస్వామ్యం పంచుకుంటున్నాడు, లలితాంబక్కయ్య నిత్యకార్యక్రమాల్లోనేకాక, జిల్లెళ్ళమూడి గ్రామ పరిపాలనలోకూడా తన వంతు సహకారాన్నందిస్తున్నది. అల్లుడు శ్యామ్ పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు.

సత్యనారాయణగారి తండ్రి మన్నవలో ఓవర్‌సీర్‌గా పనిచేస్తున్న రోజులలో సత్యనారాయణగారికి, రాఘవరావు మామయ్యకు సఖ్యత ఉండేది. ఆ రోజులలోనే అమ్మను ఆయన గుర్తించక పోయినా అమ్మ ఆయనను గుర్తించింది. అమ్మది పేగు బంధం. తన బిడ్డ ఎక్కడున్నా అవసరాన్ని, బట్టి రప్పించుకుంటుంది. అందరికీ సుగతిని ప్రసాదించే అమ్మ సత్యనారాయణగారికి ఆయనలోని పరితాపము, పశ్చాత్తాపము ఆయనను శుద్ధి కావించవచ్చని తలచి త్వరగా సుగతిని ప్రసాదించింది. అమ్మ మనం కోరిందల్లా ఇవ్వదుకాని మనకు అవసరమైంది ఇవ్వకుండా ఉండదు. సత్యనారాయణగారికి అవసరమైంది ఇచ్చింది.

ఈ రకంగా తానే కాక, తన కుటుంబాన్ని అమ్మ సేవకు సమర్పించిన సత్యనారాయణగారు ధన్యులు.





56. సుందరరామిరెడ్డిగారు (రెడ్డన్నయ్య)

జిల్లెళ్ళమూడిలో 30 సంవత్సరాల పైచిలుకు అమ్మ సన్నిధిలో జీవితాన్ని పునీతం చేసుకొన్న మహానుభావుడు సుందరరామిరెడ్డిగారు, 1966లో మొదటిసారి అమ్మ వద్దకు వచ్చినప్పుడు అమ్మ రెడ్డిగారిని ఏయే క్షేత్రాలు చూశావు నాన్నా! అని అడిగింది. కాశీ, రామేశ్వరం, అరుణాచలం, పుట్టపర్తి, షిర్డి మొదలైన క్షేత్రాలను గురించి చెప్పారాయన. 'పుండరీపురం వెళ్ళావా, నాన్నా !" అని అడిగింది. వెళ్ళానమ్మా! అన్నారు రెడ్డిగారు. అప్పుడు అమ్మ 'అక్కడ ఎవరైనా ముత్తైదువ నిన్ను, ఏం నాన్నా! అని పలకరించిందా?' అని అడిగింది. రెడ్డిగారికి ఆశ్చర్యం వేసింది. ఎప్పుడో 1930లో ఆయన పుండరీపురం వెళ్ళిననాటి సంగతి అది. అక్కడ ఎంతో మంది జనం మధ్యలో, మన తెలుగుభాషలేని ఊళ్ళో ' ఏం నాన్నా?' అని ఒక ముత్తైదువ పలకరించింది. ఆమె తేజోవంతమైన చూపులు, నుదుటన పెద్ద కుంకుమ బొట్టు, బులాకీ; చూడటానికి ఈమె సామాన్యురాలుగా లేదు అనిపించింది పలకరింపులో ఏదో అప్యాయత, తియ్యదనం వినిపించింది. "ఇక్కడ ఒంటరిగా కనిపిస్తున్నావు. నీతో మగవాళ్ళు ఎవరూ రాలేదా? అమ్మా?" అని రెడ్డిగారు అడిగారు. "ఊళ్ళోకి వెళ్ళారు నాన్నా!" అన్నది ఆమె. "ఏం ఊరమ్మా! మీది?' అని రెడ్డిగారు అడగ్గా "విజయవాడ నాన్నా!" అని చెప్పింది. ఆమెతో మాట్లాడి నాలుగడుగులు ముందుకు వేసి వెనుకకు తిరగి చూసేసరికి ఆమె కనిపించలేదు. ఇంతలోనే మాయమై పోయిందేమిటబ్బా! అనకున్నారు.

ఇన్ని సంవత్సరాలు తర్వాత అమ్మ ఈ విషయం ప్రశ్నించేదాకా వారికి జ్ఞాపకం కూడా లేదు. మరొక విచిత్రం ఏమిటంటే, అమ్మ తన దగ్గర ఉన్న ఒక ఫోటో చూపించి "ఇలాగే ఉందా నాన్నా! ఆమె" అనగా రెడ్డిగారు "అవునమ్మా? అచ్చం ఇలాగే ఉన్నది" అని అమ్మే ఆరోజు అలా కనిపించిందని అమ్మలోని సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత్వానికి విస్తుపోయి, అమ్మ వాత్సల్యతరంగాలలో ఓలలాడారు. 36 ఏళ్ళక్రితమే తనను ఆనాడు ఏడు సంవత్సరాలు కూడా భౌతికంగా నిండని అమ్మ 1930లో ఒక ముత్తైదువుగా కనిపించి ఇన్నేళ్ళ తర్వాత తనను రప్పించుకోవటం తన బిడ్డగా తనను ఎన్నో ఏళ్ళనాడే ఎన్నుకున్నదని ఆనందించారు.

ఎన్ని క్షేత్రాలు తిరగినా, కలుగని అనుభవం ఆనందం అమ్మ దగ్గర కలిగే సరికి తన గమ్యం ఇదేనేమో! ననుకున్నారు. కాని అమ్మ ఉపన్యాసాలివ్వరు, భజనలు చేయించరు, ధ్యానం నేర్పించరు. మరి ఆధ్యాత్మిక పురోగతి ఎలా? అనుకున్నారు. కాని నిద్రలేచేసరికి వారి నుదుటన కుంకుమ బొట్టు ఉన్నది. తాను పెట్టుకోని కుంకుమబొట్టు ఎలా వచ్చింది? అమ్మ బొట్టుపెట్టి పిలిచింది. రమ్మని అనుకున్నారు. పుట్టపర్తి వెళ్ళాలి. అనుకున్న వారు జిల్లెళ్ళమూడి వెళ్ళారు. అమ్మలోని అతిమానుష వాత్సల్యానికి, అనురాగానికి పరవశించి అక్కడే ఉండిపోయారు.

అయితే అమ్మ వల్ల జరిగిన పనినైనా మనం అన్వయించుకొని అవగాహన చేసుకోవలసిందేగాని తన అస్తిత్వాన్ని అమ్మ అంగీకరించదు. తాను చేశానని ఒప్పుకోదుకదా! రెడ్డిగారితో జరిగిన సంభాషణలలో ఇలాంటి సన్నివేశమే ఒకటి జరిగింది.

ఉత్తరాది నుండి కొందరు సాధువులు రైలు ప్రయాణం చేస్తుండగా టిక్కెట్లు లేవని టిక్కెట్ కలెక్టర్ వాళ్ళను బాపట్ల స్టేషన్‌లో దించి వేశాడు. స్టేషన్‌కు ఎదురుగా ఉన్న గవర్నమెంట్ హాస్పటల్‌లో నేరేడు చెట్టుక్రింద వాళ్ళంతా కూర్చుని ఉన్నారు. అమ్మ మంచినీళ్ళ బిందెతో ఆ వైపు వెళ్ళుతూ వాళ్ళకేదైనా ఆహారం పెట్టుకోవాలనిపించి ఇంటి నుండి రొట్టెలు కూరచేసి తెచ్చి వారికి పెట్టింది. వాళ్ళంతా ఆశ్చర్యంగా అమ్మ వంక చూచి "నీవు మా దేశంలో ఇట్లానే పెట్టావు గదా మాకు.? ఇంతలోనే ఇక్కడకు ఎలా వచ్చావు?" అని అడిగారు. అమ్మ!" "ఏమో నాకేం తెలియదు" అంటూ వాళ్ళందరికి మంచినీళ్ళు ఇచ్చి వెళ్ళి పోయింది.

గబగబా. వాళ్ళలో కొందరు అమ్మ ఎక్కడ ఉంటుందో చూద్దామని అమ్మ వెనుకనే వెళ్లారు. వాళ్ళు చూస్తుండగానే అమ్మ మాయమైంది.

అమ్మ ఎవరికి ఎప్పుడు ఏ రకమైన అనుభవాన్ని ఇస్తుందో చెప్పలేం. అమ్మ సాధువుల ఉదాహరణ రెడ్డిగారికి చెప్పటంలో ఉద్దేశ్యం తానే అక్కడకు వచ్చి దర్శనమిచ్చానని కాదు. 'ఎక్కడైనా ఎప్పుడైనా ఏ రూపంలోనైనా ఉన్నది ఒకటే. ఎప్పుడు ఎలా కావాలనుకుంటే అలా దర్శనాలు ఇస్తుంది ఆ చైతన్యం' అని తెలియచేయటానికే. “నేనూ మీలాంటి దానినే- నాకేం తెలియదు నాన్నా! మీరేదన్నా చెపితే వింటాను. నేనేం చదువుకోలేదు నాన్నా!” అనే అమ్మ సర్వత్రా తానే ఉన్నానని తన చర్యల ద్వారా తెలియచేసింది.

రెడ్డిగారిది నెల్లూరుజిల్లా విడవలూరు గ్రామం. 40 ఏకరాల పొలాన్ని తన చాకచక్యంతో, తన నిరంతర కృషి ఫలితంగా 100 ఎకరాలుగా పెంచిన ఆదర్శ రైతు రెడ్డిగారు, 'చెట్టకు రూపాయిలు కాయిస్తామయ్యా!' అంటూ ఉండేవాడు. రైతుగా ఉంటూనే ఆధ్యాత్మిక జిజ్ఞాసను పెంచుకొన్న మహామనీషి రెడ్డిగారు. ఒకసారి రెడ్డిగారితో కలిసి నేనూ, రవీ, గోపాలన్నయ్య రమణాశ్రమం, అరవిందాశ్రమం, ఏర్పేడు ఆశ్రమం చూడటం జరిగింది. ఆశ్రమాలలో ఉండేవారు ఎంతటి సేవా భావంతో ఉంటారో, ఎంతటి త్యాగమయజీవనం గడుపుతుంటారో, ఆశ్రమాలంటే ఎలాంటి వాతావరణం ఉంటుందో చూపించి చెప్పేవారాయన. రెడ్డిగారు కూడ అలా నిరాడంబరంగా, నిస్సంగంగా, తన దినచర్యతో గడిపేవారు. త్రోవలో వెళ్ళుతూ పొలాల్లో పంపులదగ్గర స్నానాలు పూర్తి చేసేవారు.

అమ్మను ఏమీ ప్రశ్నించే వారు కాదు. అడగాల్సిన పనేముంది అన్నీ ఆమె, చూచుకుంటుంది. ఏది ఎవరికి ఇవ్వాలో అది వారికి ఇస్తుంది. అమ్మది అనుభూతిపరమైన హృదయానుభూతి, పరుసవేదిని తాకితే ఇనుము బంగారమైనట్లు మానవులు అమ్మ దర్శన స్మర్శలలోనే మంచిగా మారుతారు అని రెడ్డిగారి విశ్వాసం.

అందరింట్లో ఒకసారి వంట ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. ఎట్లా అని కార్యకర్తలు మధనపడుతున్నారు. ఇంతలో రెడ్డి అన్నయ్య పంపించాడని ఒక బండి నిండా బియ్యం బస్తాలతో వచ్చింది. అమ్మయ్య, గండం గట్టెక్కింది. అనుకున్నారు అక్కడివారు. మరుసటి రోజు రెడ్డిగారు జిల్లెళ్ళమూడి వచ్చారు. అన్నయ్య ఆపదలో ఆదుకున్నందుకు అందరూ ప్రశంసించారు. రెడ్డిగారు

బిత్తరపోయారు. నేనేమిటి? బియ్యం పంపడమేమిటి? నాకేమీ తెలియదే! అన్నారు. ఇప్పుడు ఆశ్చర్యపోవడం విశ్వజననీ పరిషత్ కార్యకర్తల పనైంది. రెడ్డిగారు వెళ్ళి అమ్మను అడిగారు "ఏమిటమ్మా ఇదంతా?" అని. "ఏమీ లేదునాన్నా! పని జరిగింది కదా! ఎవరు పంపితే ఏమిటి?" అది దాటవేసింది విషయాన్ని, అన్నపూర్ణాలయం తన గుండెకాయ అన్నందుకు దానిని ఎలా నిరంతరం ఆగకుండా నడిపిస్తున్నదో అర్థం చేసుకుంటే బ్రహ్మదేవుడు చేసిన మాయను శ్రీకృష్ణుడు గొల్లపిల్లలుగా, గోవులుగా, దూడలుగా మారి గోపాలుర ఇండ్లలోకి వెళ్ళిన విషయం స్ఫురణకు తెప్పిస్తుంది. ఈ సన్నివేశానికి రెడ్డిగారు ఉపకరణం కావటం వారి అదృష్టం మన భాగ్యం.

ఒకసారి అమ్మ రెడ్డిగారిని తమ ఊరువెళ్ళి మూడువేల అరటికాయలు, 6వేల అరటిఆకులు, రెండు వేల నిమ్మకాయలు తెమ్మని చెప్పింది. వారి ఊరిలో అన్ని దొరకటం అసంభవం అనిపించింది వారికి. ఎందుకంటే ఆ ఊరిలో కాసేపంటను గూర్చి వారికి క్షుణ్ణంగా తెలుసు గనుక. కాని అమ్మ చెప్పింది- ఏమో! చూద్దాం అని వారు విడవలూరు వెళ్ళారు.

ఆశ్చర్యం! పూర్వం బీడులా ఉండే భూమి అరటితోటలతో, నిమ్మతోటలతో కళకళ లాడుతూ ఉండటం చూశారు. అమ్మ అక్కడి నుండే విలవలూరు తోటలు పంటలు చూచిందన్నమాట. అమ్మ చెప్పినట్లుగా అన్నీ తీసుకొని జిల్లెళ్ళమూడి చేరారు. మధ్యలోలారీని చెక్‌పోస్టు వాళ్ళు అటకాయించగా 'ఇవి జిల్లెళ్ళమూడిలోఅన్న సంతర్పణకు తీసుకొని వెళ్ళుతున్నాము' అనగా ఆశ్చర్యంగా ముందు అంగీకరించని వాళ్ళే ఆదరంగా పంపారు.

రెడ్డి గారికి నాన్నగారితో సాన్నిహిత్యముండేది. నాన్నగారంటే గౌరవమూ ఉండేది. నాన్న గారితో రెడ్డిగారు "మా ఊళ్ళో ఇంత ఫలసాయం ఉందని నాకే తెలియదు. అమ్మకెట్లా తెలిసిందో నాన్నగారు!" అని అన్నారు. నాన్నగారు ఆ విషయమై అమ్మను ప్రశ్నించి రెడ్డిగారు ఇలా అనుకుంటున్నారు అని, అందుకు అమ్మ "నాకు అవసరం అనుకున్నప్పుడు చూస్తాను" అని చెప్పింది. ఆ విషయం నాన్నగారు రెడ్డిగారికి తెలియచేశారు.

"సత్సంగత్వే నిస్సంగత్వం- నిస్సంగత్వే నిర్మోహత్వం- నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః" అని నమ్మినవారు రెడ్డిగారు. రెడ్డిగారు నీతి శతకాలలోని

పద్యాలన్నీ చెప్పి వాటిని ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తుండేవారు. ఆయనను ఎవరైనా పొగిడితే అది వేరయ్యా! నేను మామూలు రైతును అని తన నిరాడంబరతను తెలియచేసేవారు. వారికి రామకృష్ణపరమహంస, రమణమహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ అంటే అత్యంత ఇష్టమైనవారుగా ఉండేవారు. ఆధునికంలో పరమహంస అని మరెవరికీ లేదనీ, మహర్షి అని ఇంకెవరికి పేరులో లేదనీ అలాగే అమ్మలాగా సర్వులనీ బిడ్డలుగా చూచుకొనే వారు ఎవ్వరూ కనబడరని వారు చెపుతుండేవారు. అమ్మ నామస్మరణ మాత్రంచేతనే సర్వసంశయాలు నివారణ అవుతాయనేవారు. నిరంతరం అమ్మ నామస్మరణలో కాలం గడిపేవారు. ఎవరు ఏ విషయానికి దిగులు పడుతున్నా 'ఏం బాధపడకండయ్యా! అన్నీ అమ్మే చూసుకుంటుంది.' అనేవారు. ఆ విశ్వాసం ప్రబలంగా ఉన్న వ్యక్తి రెడ్డిగారు. "ఏది కాదు అమ్మ కరుణ? కష్టమైనా సుఖమైనా అన్నీ అమ్మకరుణే అనుకుంటే గొప్ప విషయమైనా స్వల్ప విషయమైనా బాధపడటం ఉండదు" అని అమ్మ చెప్పిన విషయం అక్షరాలా నమ్మిన వ్యక్తి రెడ్డిగారు.

ఒకసారి రెడ్డిగారు అమ్మ మన మనస్సును, ఆలోచనలను ఎట్లా గ్రహించగలదో ఒక ఉదాహరణ చెప్పారు. ఒకసారి ఒక విదేశస్థుడు అమ్మకు విసనకర్రతో విసురుతున్నాడు. ఇంతలో అతడి మనసులో భగవత్సేవ అంటే ఇదే కాబోలు అనకుంటున్నాడు. ఆ ఆలోచన అతనిలో రాగానే అమ్మ "నాన్నా! నీవు ఇప్పటి దాకా చదివి ప్రక్కన పెట్టిన పుస్తకంలో ఫలానా పేజీతీసి చదువు" అని చెప్పారు. అతడు ఆ పేజీ చూచి అందులో ఉన్న " ఏ పని చేసినా అది భగవంతుని సేవేనని నమ్మి చేసేవారు చేస్తే అది తప్పక భగవంతునికి చెందుతుంది" అన్నవాక్యాలు చూచి ఆశ్చర్యపోయాడు. ఆ విషయమే చెప్పాడు. రెడ్డిగారు అప్పుడక్కడే ఉన్నారు.

రెడ్డిగారు ఒక రకంగా మృత్యుంజయుడు. 'మృత్యువంటే భయంలేకపోవటమే మృత్యుంజయత్వం' అని అమ్మ చెప్పింది. అలా మృత్యువంటే భయంలేకుండా నిర్మమునిగా జీవించిన మహాయోగి రెడ్డిగారు. అన్నీ తెలిసినా ఏమీ పట్టనట్లు, అడిగితే మాత్రమే తగురీతిలో సమాధానం చెప్పేవారు.

అమ్మ విశ్వజనీనత్వంపట్ల, అఘటన ఘటనా సామర్థ్యంపట్ల, అచంచల విశ్వాసంతో మూడు దశాబ్దాల పైచిల్కుగా జిల్లెళ్ళమూడిలో అమ్మ సన్నిధిలో ఒక మునిగా, ఒక ధ్యానయోగిగా, ఒక నిస్సంగునిగా, నాన్నగారు ఆలయంలో చేరిన

తర్వాత అందరింటి పెద్దగా, జీవితాన్ని ఒక తపస్సుగా, గడిపిన మాన్యులు శ్రీ మేనకూరు సుందరరామిరెడ్డిగారు. సంస్కృత కళాశాల విద్యార్థులంటే ఎంతో ప్రేమవారికి. తల్లిదండ్రులను వదిలి ఎంతో దూరం నుండి వచ్చి కష్టనష్టాలు భరిస్తూ విద్యను ఆర్జిస్తున్న వారిపట్ల ఎంతోసానుభూతి, అందరింటిలో పనిచేసే వారిపట్ల కూడా వారికి అటువంటి ఆదరమే ఉండేది.

అన్నపూర్ణాలయ భవన నిర్మాణంలో, అన్నపూర్ణాలయ సామానులు భద్రపరిచే స్టోర్ రూము నిర్మాణంలో, వాటర్‌టాంకులు ఏర్పాటు చేయటంలో వారి పాత్ర అందరూఎరిగినదే. అవసరమైన సమయాలలో ప్రచ్ఛన్నంగా అన్నపూర్ణాలయ నిర్వహణలో తను ఉదారహస్తాన్ని అందిచటంలో రెడ్డిగారెప్పుడూ ముందుండేవారు. నిజమైన బ్రహ్మచారిగా అమ్మను బ్రహ్మచారిగా గుర్తించి అమ్మచారియైన బ్రహ్మచారి.

ఏదైనా ఇబ్బంది వచ్చి విశ్వజననీ పరిషత్ కార్యకర్తలు రెడ్డిగారిని అడుగుతామంటే అమ్మ అంగీకరించేదికాదు. రెడ్డిగారిని మనం అడగవలసిన పనిలేదు. అవసరాన్ని గుర్తించి ఆయనే ఇస్తాడు. ఆయనను ఎప్పుడూ అడగకండి అని చెప్పేది. అలాగే రెడ్డిగారు కూడా తగిన రీతిలో నడుచుకొనేవాడు. తన సర్వస్వం అమ్మ పేరనే వ్రాసి ఉంచారు 26.7.2002లో వారు అమ్మలో లీనం కాకముందే.

శ్రీ విశ్వజననీ పరిషత్ కోశాధికారిగా కొంతకాలం, మాతృశ్రీ విద్యాపరిషత్ ఉపాధ్యక్షునీగా కొంతకాలం ఆయా సంస్థల పరిపాలనా బాధ్యతలు కూడా నిర్వహించారు. అందరింటి తలలోని నాల్కగా మెలిగారు. అన్నపూర్ణాలయ వార్షికోత్సవం నాడు వారి సంస్మరణార్థం ఊరి ప్రజలకు విందు భోజనం ఏర్పాటు చేయటంలో కూడా ఔచిత్యం ఉందనిపిస్తున్నది. జిల్లెళ్ళమూడి అందరింటి చరిత్రలో రెడ్డన్నయ్యది ఒక స్వర్ణాధ్యాయం.



57. రామరాజు కృష్ణమూర్తి

జిల్లెళ్ళమూడికి 1960 దశకంలో అమ్మను చూడటానికి వచ్చిన వారందరికీ రామరాజు కృష్ణమూర్తిగారు తెలిసేవుంటారు. ఏ భేషజాలు లేకుండా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా అమ్మతో కూడా ఏ సంకోచం లేకుండా మాట్లాడగలిగినవాడు కృష్ణమూర్తి. అమ్మ వద్దకు వచ్చే నాటికే అరవింద యోగి రచనలు ఆకళింపు చేసుకొన్నవాడు. చలం రచనల శైలీ విన్యాసం వారికి బాగా వంటపట్టింది. అమ్మను గూర్చి 1968లో వారు వ్రాసిన ప్రస్తుతి గ్రంథంలోని గల్పికలపై చలం ప్రభావం కనవడుతుంది. మాతృశ్రీలో కూడా వారి వ్యాసాలు ఎన్నో ప్రచురితమైనాయి.

గుంటూరులో 13.9.1933న రామరాజు వెర్రయ్య, లక్ష్మమ్మలకు జన్మించిన కృష్ణమూర్తిగారు గుంటూరులో పాఠశాల మరియు కాలేజీ విద్య పూర్తిచేసి, పూనాలో న్యాయశాస్త్ర పట్టభద్రుడైనాడు. జిల్లెళ్ళమూడి నాన్నగారు గురువుగా భావించే శ్రీ మోతడక రామచంద్రరావుగారి ద్వారా జిల్లెళ్ళమూడి అమ్మను గూర్చి విని తన మిత్రుడైన చీరాల భాస్కరరావుతో కలసి 1956లో జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను చూచాడు. ప్రథమ దర్శనంతోనే అమ్మ పట్ల అచంచల విశ్వాసం ఏర్పడింది. సాధనల ద్వారా మహర్షులు ఏది సాధించాలని కోరుకుంటారో ఆ లక్ష్యం ఇక్కడ మానవదేహం ధరించి మాతృమూర్తిగా అవతరించిదని నిశ్చయానికి వచ్చారు. మనస్సుకు తట్టింది. బాల్యంలోనే తండ్రి పోయాడు. ఐదుగురు ఆడపిల్లల తర్వాత తను ఒక్కడు మగశిశువు. ఇలా సాధనచేసుకుంటూ ఏ జిల్లెళ్ళమూడిలోనో ఉంటానంటే తల్లి ఎలా అంగీకరిస్తుంది? ఇంట్లో చెప్పాపెట్టకుండా జిల్లెళ్ళమూడి

వస్తూవుండేవారు. ఇంట్లో తల్లి గాభరాపడేది. అక్కలు, బావలూ మందలించేవారు. గుంటూరులో సుప్రసిద్ధ క్రిమినల్ లాయర్ శ్రీ మన్నవనరసింహారావుగారు వీరి బావగార్లలో ఒకరు. అప్పటికి కృష్ణమూర్తిగారు న్యాయశాస్త్రం చదువు పూర్తి కాలేదు. అప్పుడు అమ్మ మందలించి చదువు పూర్తి చేయమని చెప్పింది. అమ్మ మాట మీద లా చదువు పూర్తిచేశాననిపించు కున్నాడు. కాని న్యాయవాది వృత్తి చేయడే! అందులో అబద్ధాలు చెప్పటం- క్లైంటులను మోసం చేయటం వంటివి ఆయనకు నచ్చేవి కాదు, ఇది తన ప్రవృత్తికి భిన్నమైనదని భావించారు.

ఒకరోజు అర్ధరాత్రి ఇంట్లోంచి చెప్పకుండా బయలుదేరి తన దగ్గర దాచిపెట్టుకున్న డబ్బుతో ఒకచీర, ఫ్లాస్కులో కాఫీ తీసుకొని ఒక లారీ పట్టుకొని పెదనందిపాడుదాకా వచ్చి అక్కడ నుండి జిల్లెళ్ళమూడికి నడిచి తెల్లవారుఝామున అమ్మ వద్దకు చేరాడు. తాను తెచ్చిన చీరెను అమ్మ మంచం మీద పెట్టి, కాఫీ ఫ్లాస్కు క్రిందపెట్టి అమ్మకు నమస్కరించి కూర్చున్నాడు. అమ్మ 'ఈసమయంలో ఎలా వచ్చావు నాన్నా'! అని అడిగింది. నీవు త్రాగుతావని కాఫీ తెచ్చానమ్మా! అని కప్పులో పోసి ఇస్తే తాను కొద్దిగా త్రాగి కృష్ణమూర్తిచేత ఆప్యాయంగా త్రాగించింది. ఎన్ని కష్టనష్టాలనైనా భరించి తనను చూడటానికి వచ్చిన బిడ్డను చూచి అమ్మ కళ్ళు చెమర్చాయి. అమ్మ దగ్గరకు రాగలిగాననే విజయ గర్వంతో హాయిగా గడిపాడు ఆ రోజు అమ్మ వద్ద కృష్ణమూర్తిగారు. అమ్మకు విషయం తెలియందేముంది. ప్రయోజకుడివై పెద్దలను నొప్పించకుండా జిల్లెళ్ళమూడి వచ్చి ఉండమని అమ్మ పంపించింది ఇంటికి.

ఇంటికి చేరిన తర్వాత కృష్ణమూర్తిగారికి, వారి బావగారికి అమ్మ యొక్క దైవత్వాన్ని గూర్చి- అమ్మలోని అతిమానుషశక్తిని గూర్చి వాదన ప్రారంభమైంది.

ఇరువురు ఒకరికొకరు తమతమ వాక్చాతుర్యాన్ని చూపించుకున్నారు. కృష్ణమూర్తిగారితో వాదించి లాభం లేదని వాళ్ళ బావగారు మీ అమ్మ నిజంగా దైవమైతే ఎలక్ట్రిసిటి మెయిన్‌లోని ఫ్యూజుతీసి ఆ కరెంటు వైరు నీవు పట్టుకో ఎంతవరకు కాపాడుతుంటే చూద్దాం అన్నారు. ఆయన వీడెట్లాగూ పట్టుకోడని మాటవరసకు భయపెట్టడానికి అన్నాడు. కాని కృష్ణమూర్తికి పట్టుదల పెరిగింది. విశ్వాసం వెన్నుతట్టింది. అంతే వెళ్ళి ఆ కరెంటు వైరు పట్టుకున్నాడు. వారి బావగారు భయపడ్డారు. నిర్ఘాంతపోయినారు. అది కృష్ణమూర్తిగారిని షాక్ కూడా కొట్టలేదు.

ఇప్పటికైనా నమ్మండి అమ్మ దైవమని అన్నాడు కృష్ణమూర్తి. వాళ్ళ బావగారికి అనుమానం వచ్చింది. బహుశా ఆ సమయానికి కరెంట్‌పోయి ఉంటుందనీ, అదీ మీ అమ్మ మహిమేనా? అన్నారు. అప్పుడు ట్యూబ్‌లైట్‌వేసి వెలిగిం తర్వాత ఇప్పుడు కరెంట్ ఉన్నది కదా అని హోల్డర్ తీసి కరెంట్ పాస్ అవుతున్న హోల్డర్‌లో చేతివ్రేళ్ళు పెట్టి మీకు ధైర్యం ఉంటే నన్ను పట్టుకోండి అన్నాడు కృష్ణమూర్తి. అప్పటి నుండి అమ్మ దైవత్వాన్ని గూర్చి కృష్ణమూర్తి విశ్వాసాన్ని గూర్చి వాళ్ళూ తర్కించలేదు- ఎప్పుడూ ఏ పరిస్థితుల్లోనైనా అమ్మ కాపాడుతుందనే నమ్మకమే ఆయనను కాపాడింది. అయితే ఈ సంఘటన జరిగిన సమయానికి జిల్లెళ్ళమూడిలో సోదరి సోదరులతో మాట్లాడుతున్న అమ్మ ఒక అంగుళం అంగుళన్నర ఎత్తు ఎగిరిపడింది. అమ్మ ముఖం కూడా ఎర్రగా కమిలిపోయింది. ఏమైందమ్మా అని అక్కడి వారడిగితే కరెంట్ షాక్ కొట్టిందిలేరా అన్నదిగాని వివరాలు చెప్పలేదు. తర్వాత జిల్లెళ్ళమూడి వచ్చిన కృష్ణమూర్తిని సున్నితంగా మందలించింది. ఇలాంటి పిచ్చి పనులు చేయవద్దని.

ఆ తర్వాత కృష్ణమూర్తిగారి తల్లి వివాహ ప్రస్తావన తెచ్చిందనీ. జిల్లెళ్ళమూడి అమ్మ ఎవరిని చేసుకోమంటే ఆమె మెళ్ళో తాళి కడతానన్నాడు కృష్ణమూర్తి. మొత్తంమీద అమ్మ ఇష్టప్రకారమే గూడవల్లిలో హైస్కూల్లో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న శ్రీనాధుని రాజగోపాలరావుగారి మూడవ కుమార్తె ద్వారక్‌తో 1963లో వివాహమైంది. జిల్లెళ్ళమూడిలో అమ్మ సన్నిధిలో 1967లో అమ్మ నివసించే భవనం ప్రక్కనే ఇల్లు కట్టుకొని స్థిరనివాసం ఏర్పరచుకున్నవారిలో వీరే మొదటివారు. అంతా చిన్న వయసులో ఇలా ఈ పల్లెటూర్లో ఇల్లుకట్టుకోవటం బంధువులకూ, మిత్రులకు నచ్చలేదు. అన్నీ అమ్మే చూచుకుంటుందనే అచంచల విశ్వాసం ఈ విమర్శలను లెక్కచేయనీయలేదు. అందుకే అమ్మ అన్ని విషయాలలోనూ ఆయన కుటుంబాన్ని కాపాడుతూ ఆదుకుంటూ వచ్చింది.

అమ్మతో ఎక్కువకాలం గడపాలనుకున్నా వారి కోరిక రోజురోజుకూ వచ్చే జనాభా పెరగడంతో అవకాశం తగ్గిపోతున్నది. దానికి తోడు పిల్లలు పెరిగి పెద్దవారై పాఠశాలలో చదువుకొనే వయసు వస్తుండటంతో మళ్ళీ గుంటూరుకు కాపురం మార్చారు కృష్ణమూర్తిగారు. 1976లో జిల్లెళ్ళమూడిలో ఉన్న రోజులలో శ్రీవిశ్వజననీ పరిషత్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేశారు. ఆ సమయంలోనే

1974లో అమ్మ నెల్లూరు డాక్టర్ శిష్ట్లా సుబ్బారావుగారింటికి వైద్యం నిమిత్తం వెళ్ళింది. అమ్మవెంట కార్యకర్తలంతా వెళ్ళారు. సంస్థను నడిపే బాధ్యత కృష్ణమూర్తిగారిపై పడ్డది. జనం తక్కువగా ఉండటంతో అఖండనామం జరగడం కష్టమౌతున్నది. నిర్వాహకులకు "ఎలాగో సర్దుకుని అమ్మ వచ్చే దాకా కొనసాగించండి అమ్మ వచ్చి చూచుకుంటుందని" చెప్పారు కృష్ణమూర్తి. వాళ్ళు ససేమిరా మా వల్ల కాదన్నారు. అయితే ఈ రోజు నుండి అఖండనామం ఆపేద్దాం అన్నారు కృష్ణమూర్తి. నిరంతరాయంగా జరుగుతున్న అఖండనామం ఎక్కడ తమ వల్ల ఆగిపోయిందని చెడ్డపేరు వస్తుందో అనే భయంతో ఆవరణలోని వాళ్ళంతా పాల్గొని అంతకుముందుకన్నా బాగా చేశారు. అమ్మ తిరిగి వచ్చిం తర్వాత కృష్ణమూర్తిగారు అఖండనామం ఆపేస్తానన్నారమ్మా! అని ఫిర్యాదు చేశారు. అమ్మ కృష్ణమూర్తిని పిలిపించి అడిగింది. ఔనమ్మా! అలా నేనన్న తర్వాతే వీళ్ళంతా అంతకు ముందుకన్నా ఉత్సాహంగా చేశారు. అందుకే నేనలా అన్నాను అన్నారు వారు.

జిల్లెళ్ళమూడి సంస్థకు అత్యవసరమైన ఇబ్బందులు రావటంతో గుంటూరులోని తన ఇంట్లో వెనుకవైపు గల పెద్ద భవనాన్ని అమ్మి అప్పుగా ఇచ్చారు కృష్ణమూర్తిగారు. ప్రతినెలా దానిపై ఇచ్చే వడ్డీతో ఆయన తన ఇల్లు గడుపుకునేవారు. సంస్థ సకాలానికి ఇవ్వకపోతే ఇబ్బంది పడుతుంటే వాడు. ఆ సమయంలో ఈ ప్రస్తావన అమ్మ వద్ద వస్తే తాత్కాలికంగా కొద్దిగా సద్దమంటే నేను సర్దుతానమ్మా అని నేను చెప్పాను. అలా నావద్ద తీసుకొన్న ధనం జిల్లెళ్ళమూడి సంస్థ తెచ్చి ఇవ్వగానే నాకు తెచ్చి ఇచ్చేవాడు. అమ్మ ఆలయంలో చేరిన తర్వాత సంస్థలో వచ్చిన మార్పులలో వారికి వడ్డీ ఇవ్వటం కొంతకాలం ఆపటం వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. సంస్థ వారు వ్రాసి ఇచ్చిన ప్రోనోటు కాలం చెల్లిపోతుంటే కోర్టులో పడేయమని సలహా ఇచ్చాము. కాని కృష్ణమూర్తిగారు అలా చేయక నేను అమ్మ చేతికిచ్చాను నా డబ్బు. నేను దావా వేస్తే అమ్మ మీద వేసినట్టే కదా! ఇక అమ్మ మీద మన విశ్వాసం ఏమైనట్టు? ఇవ్వదలచుకుంటే అమ్మే ఇస్తుంది. నన్నెలా పోషించాలో అమ్మకు తెలుసు అని ఊరుకున్నారు.

గుంటూరులో వారి ఇంటి మేడ మీద ఉన్న గదిలో రాచర్ల లక్ష్మీనారాయణ కొంతకాలం ఉన్నాడు. నేను కొంతకాలం ఉన్నాను. అంత ఇబ్బందులలో కూడా

కరెంట్ ఖర్చులు కూడా నా వద్ద తీసుకోలేదు. తర్వాత 1988లో మాతృశ్రీ అధ్యయన పరిషత్ కేంద్రం ఆ గదిలోకి మార్చబడింది. అంతేకాదు జిల్లెళ్ళమూడి గ్రామంలో అమ్మ ఏర్పాటు చేసిన పిడికెడు బియ్యపు పథకం గుంటూరు మాతృశ్రీ అధ్యయన పరిషత్ ఏర్పటు చేసింది. ప్రతినెల రెండు మూడు క్వింటాళ్ళ బియ్యం సేకరించి జిల్లెళ్ళమూడి పంపటం జరిగేది. ఆసేకరణ కార్యక్రమమంతా కృష్ణమూర్తిగారి పిల్లలే నిర్వహించేవారు. అది యజ్ఞంగా చేసేవారు వారి కుటుంబం అంతా కృష్ణమూర్తిగారు కూడా హోమియో వైద్యం చదివి ఉచిత వైద్యసేవ చేస్తుండేవారు.

పిల్లలందరికీ మామూలు లౌకిక విద్యతో పాటు సంగీత విద్య కూడా నేర్పించాడు. కృష్ణమూర్తిగారు. ఏమిటయ్యా ఇది అంటే, ఉద్యోగాలు రాకపోతే త్యాగరాజులాగా అమ్మనామం చేసుకొంటూ వీధి వీధికీ తిరిగి బిచ్చమెత్తుకొనైనా బ్రతుకుతారుకదా? అనేవారు కాని వారి పిల్లలందరూ మంచి సంగీత విద్వాంసులైనారు. మృదంగంలో, వయోలిన్‌లో మంచి పరిణతి సాధించి పేరు ప్రఖ్యాతులు పొందుతున్నారు. వారి పెద్దకూతురు వివాహం చేయాల్సి వచ్చినపుడు అమ్మ రెండవ కుమారుడు రవి ప్రత్యేక శ్రద్ధ తీసికొని (అప్పటికి కృష్ణమూర్తిగారు అమ్మలో ఐక్యం అయినారు) వారి బాకీ క్రింద పెద్ద మొత్తాన్ని సేకరించి ఆదుకున్నారు. పిల్లలందరూ అమ్మ దయ వల్ల స్థిరపడ్డారు. అమ్మ యెడల భక్తి ప్రపత్తుల కలిగి సేవ చేసుకుంటున్నారు.

అమ్మ సేవలో, అమ్మ ధ్యాసలో నిరంతరం గడుపుతూ 13.7.1993న రాత్రి నిద్రలో నిశ్చింతగా అమ్మలో లీనమైన ధన్యజీవి. ఆదర్శపురుషుడు, విశ్వాసానికి మరో పేరు శ్రీరామరాజు కృష్ణమూర్తి.



58. భవానీకుమారి

"భవానీకుమారి" అంటే చాలా తక్కువ మందికి తెలుసు. కుమారి అంటేనే జిల్లెళ్ళమూడికి 1970లోపు వచ్చిన చాలా మందికి తెలుసు. అసలు పేరు. జి. సాయికుమారి.

వరంగల్‌లో ఫోటోగ్రాఫర్‌గా ఉన్న వాళ్ళ నాన్నతో తన చెల్లెలు నిర్మలతో కలసి అమ్మ వద్దకు వచ్చింది. అమ్మ దగ్గర ఉండిపోతానన్నది. అమ్మ సరే అన్నది. అలా కుమారి అమ్మ దగ్గర అందరింట్లో ఉండటం తటస్థించింది.

ఆ రోజులలో అమ్మ ఎన్నో విషయాలు దగ్గర చేరినవారికి చెబుతూ ఉండేది. అంతేకాదు అమ్మ పూజలలో అమ్మకు ఎన్నో ముద్రలు పడుతుండేవి. వాటన్నింటిని ప్రత్యక్షంగా చూచిన కుమారి అమ్మలోని అతిమానుష శక్తిని గుర్తించి అమ్మను గూర్చి లోకానికి తెలియచేయాలనే తపన పడ్డది. ఆ అమ్మాయి వచ్చేనాటికి మన కేరకమైన పత్రికలు, గ్రంథాలు పెద్దగా వెలువడలేదు. 1962 నుండి సంవత్సరాని కొకసారి అమ్మ జన్మదినోత్సవ సంచిక మాతృశ్రీ పేరుతో తీసుకొని రావటం జరిగింది. 1963లో మొదటిసారిగా కుమారి రచన అందులో చోటు చేసుకొన్నది. "నివేదిక" అన్న పేరుతో, అందులోనే కుమారి రచనా పాటవం స్పష్టంగా గోచరిస్తున్నది.

అమ్మ దర్శనంతో తన శిథిల జీవితానికి సుప్రభాతమైందనీ, ఆ ఉషస్సులో తన భవిష్యజ్జీవితానికి గమ్యం ఏర్పడిందని తెలుసుకొన్నది. తల్లి చిన్నప్పుడే

చనిపోయింది. మారుటి తల్లి వద్ద నానా కష్టాలు అనుభవించింది. అమ్మలోని మాతృవాత్సల్యం ఆ హృదయాన్ని కదిలించింది, కరిగించింది. బంధువులు, స్నేహితులు ఇదేమిటి ఈ పిచ్చిది, అమ్మంటూ ఇల్లు వదిలి అక్కడే ఉన్నది అని గేలిచేశారు. తండ్రి బలవంతం చేశాడు ఇంటికి రమ్మని. కాని కుమారి దృఢనిశ్చయంతో జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గరే ఉండిపోయింది. అక్కడి వాళ్ళే అన్నయ్యలు, అక్కయ్యలు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు అయ్యారు. వారితోనే జీవితం ముడివేసుకొని పోయింది. ఈ విశ్వకుటుంబంలో ఒక సభ్యురాలైంది. అమ్మ చల్లని ఒడిలోనే సేదదీర్చుకొన్నది. అంతే ఆ అమ్మాయిలో క్రొత్తరక్తం పట్టింది.

సోదరీసోదరులతో కలిసి క్రొత్తగా ఏర్పడే భవన నిర్మాణంలో ఇటుకలు మోసింది. లారీల మీద వెళ్ళి ఇసుకను నింపి తెచ్చేది. బండిమీద బస్తాలతో వరిపొట్టు ఎత్తుకొని వచ్చేది. భవనానికి పునాదులు త్రవ్వేది. పలుగు పారలు పట్టుకొని తలపై గడ్డి చుట్టలు పెట్టుకొని మట్టి తట్టలు మోసేది. అమ్మ స్నానానికి, అన్నపూర్ణలయానికి, పశువులకు కావలసిన నీళ్ళు బుంగలతోనో, బళ్ళ మీద పీపాలతోనో తీసుకొని వచ్చేది. అంట్లు తోమేది, గుడ్డలు ఉతికేది. ఒకటేమిటి అన్ని పనులూ చేసేది. మగ, ఆడా తేడా లేకుండా కలిసి పని చేసేది. అంతా అమ్మ ఆరాధనగా చేసేది. అమ్మ పలకరింపు అమ్మ చూపు తనలో క్రొత్త ఉత్తేజాన్ని నింపేది. కష్టాన్ని మరిపింప చేసేది. ఎంతకాలమున్నా అమ్మను విడిచి పెట్టలేని ఆకర్షణ, ఆనందము. ఎప్పుడైనా కొద్దికాలం విడిచిపోవాల్సి వచ్చినా కన్నీరు కార్చేది.

అసలు అమ్మలోని ఈ ఆకర్షణ ఏమిటి? తనకు తానే ఆలోచించుకున్న కుమారికి ఒక ఊహ తట్టింది. ఆనాడు రాముడు అరణ్యానికి బయలుదేరితే అయోధ్య ప్రజలంతా ఎందుకు ఆయన వెంటపడ్డారు? అరణ్యాలకు వెళ్ళితే వానరులు అన్నీ మరచి రఘువల్లభుని వెంట ఎందుకు సంచరించారు? శ్రీ కృష్ణుని వేణునాదం విన్న గోపికలు సర్వం వదిలి ఎందుకు పరుగులు తీశారు? ఆ ప్రేమతత్వానికే తాను బందీనైనాను అనుకున్నది. అంతేకాదు ఆ ప్రేమ మహాసాగరంలో స్నానం చేయకపోయినా దోసిళ్ళతో జలపానం మాత్రం చేసింది.

కుమారిని జిల్లెళ్ళమూడి ఒక వ్యక్తిగా నిలబెట్టింది అమ్మ డైరీ వ్రాయటం. అసలు ఆ సంకల్పం రావటమే గొప్ప విషయం. రమణాశ్రమంలో రమణ మహర్షి

దినచర్యను నాగమ్మ అనే సోదరి వ్రాసేది. అవి చదివిన కుమారి మనస్సులో అమ్మ డైరీ వ్రాయలనే ఆలోచన వచ్చింది. డైరీ వ్రాసే మెలకువలు తెలుసుకోవటం కోసం తిరువణ్ణామలై లోని రమణాశ్రమానికి వెళ్ళి నాగమ్మను కలిసి సంప్రదించింది. అలా పట్టుదలతో ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

మాతృశ్రీ పత్రిక 1966 జూన్‌లో మాసపత్రికగా మొదలైంది. 1966కు ముందు అమ్మ జన్మదినోత్సవ సంచికలలో వ్రాసేది. ఆ తర్వాత ప్రతినెల దాదాపు ఐదు సంవత్సరాలు నిరాఘాటంగా "అర్కపురి లేఖలు" శీర్షికతో "అర్కపురి విశేషాలు" శీర్షికలతో వ్రాసింది. అప్పుడప్పుడు విశేషమైన ఘట్టాలను అత్యంత సమర్ధవంతంగా చేయి తిరిగిన రచయిత్రిగా వ్రాసింది. శ్రీపాదవారు అమ్మ సంభాషణలు, అమ్మ-అమ్మ వాక్యాలు సంకలనం చేయడానికి కావలసిన ముడిసరుకు వసుంధర, కుమారి వ్రాసిన డైరీల నుండి సేకరింపబడిందే. ఆ విషయాన్ని శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు తమ ముందుమాటలలో వ్యక్తపరచారు కూడా.

అమ్మ వైకుంఠపాళి ఆడుతున్నది పిల్లలతో కలిసి, శేషగిరిరావన్నయ్య మనుమడు ఫణి నీకు ఆటలంటే ఇష్టమా? అమ్మా! అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. "అవును నాయనా! నేను వచ్చింది అందుకే. నేను చేస్తున్నదే అది" అన్నది. అమ్మ పందెం వేస్తున్నది. కుమారి అమ్మతో ముందు దేవుడి పందెం వెయ్యాలి అన్నది. అప్పుడమ్మ "దేవుడిపందెం ఏముంది? దేవుడే పందెం వేస్తుంటే" అన్నది. అమ్మ తాను దేవుడినని ఒప్పుకొన్న సందర్భాలు తక్కువ. కుమారి దగ్గర ఒప్పుకొన్నది మరి.

నిజమే ఆ దేవతతో, పరాశక్తితో ఆడుకొనే అదృష్టం కల్గిన కుమారి లాంటివారు ధన్యులే. ఒకసారి వసుంధర తల్లి కోన వెంకాయమ్మగారు చనిపోయినప్పుడు అమ్మే చితికి నిప్పటించింది. శవం కాలినవాసనే రాలేదే అని అందరూ ఆశ్చర్యపోతుంటే అమ్మ చేతిమీదుగా అగ్నికి ఆహుతి ఐతే ఇంకా వాసన లెక్కడుంటాయి. అనుకున్నారట అక్కడికి వచ్చిన పెద్దలు. అమ్మతో ఓంకారనదిలో స్నానానికి వెళ్ళిన కుమారి లాంటి వాళ్ళకు మానసిక తాపం ఎలా ఉన్నా శారీరక తాపం తీరిందట. అమ్మ అందరి మీద నీళ్ళు చల్లుతూ, కేరింతలు కొట్టుతూ, నవ్విస్తూ అల్లరి చేస్తుంటే జలదేవత ప్రత్యక్షమైనట్టే భావించింది కుమారి.

ఒకరోజు హైమ అమ్మ వద్దకు వచ్చి లలితా సహస్రనామం చేస్తున్నా,

జపం చేస్తున్నా తానుపొందాల్సిన దేదో పొందలేకపోతున్నాని, తన సంగతేమిటో చెప్పమని అడిగింది. అప్పుడు అమ్మ హైమతో "ఏమిటో హైమా! నీలా ఈ గమ్యాలు చేరటం వీటి గురించి ఆలోచన ఉండదు. నాకు పిల్లలతో ఆడుకోవటం అల్లరి చేయటంలోనే ఆనందంగా, హాయిగా ఉంటుంది" అన్నది. అప్పుడు ప్రక్కనే ఉన్నా కుమారి "అందుకేనమ్మా! నీ దగ్గర మాకింత చనువున్నది. హైమ ఎందుకు ఆలోచిస్తున్నదో కాని, ఈ సాధనలూ, గమ్యాన్వేషణలూ అంటూ బాధపడేకంటే నీ దగ్గర ఇట్లా ఆడుకుంటూ నీ అల్లరిలో పాలు పంచుకుంటుంటేనే బాగుంటుందనిపిస్తుంది" అన్నది. అవును భగవంతుడితో ఆడుకోవటం కంటే కావల్సిందేముంది? శ్రీకృష్ణుడితో ఆడుకున్న గోపబాలురెంత పుణ్యం చేసుకొన్నారో? భగవంతు డవతార మెత్తితే తనతోపాటే పరివారాన్నీ తెచ్చుకుంటాడట. అలాగే మనమూనూ, దర్శన స్పర్శనాదులిచ్చి మనల్ని ఉద్ధరించటమే భగవంతుని లక్ష్యం. కేశవశర్మ అందుకే అన్నాడు. "శ్రీకృష్ణునితో పుట్టి ఆడుకోలేదే- రామకృష్ణ పరమహంస కాలములో ఆయనను చూడలేకపోయానే అనే చింత నాకు లేదు. అమ్మతో ఆడుకోవటం పాడుకోవటం చేశాము అని. గుడిపాటి వెంకటాచలం కూడా అమ్మ అతని వద్దకు వెళ్ళి వాత్సల్యంలో దగ్గరకు తీసుకున్నప్పుడు "భగవంతు డెక్కడున్నాడని ఎవరైనా అడిగితే ఇప్పుడు చెపుతాను ఇదిగో ఇక్కడ అమ్మరూపంలో ఉన్నాడని" అన్నాడు. కుమారి కూడా అలా అమ్మతో ఆడుకొని ధన్యురాలైన గోపికలలో ఒకరు అని చెప్పవచ్చు. అయితే కుమారి అప్పుడప్పుడు అమ్మ మీద అలుగుతుండేది. అందుకే అందరూ "సత్యభామ" అంటుండేవారు. ఆ రోజుల్లో వసుంధరను రుక్మిణి అని కుమారిని సత్యభామ అని అనటం జరుగుతుండేది.

ఒకనాడు అమ్మ చెప్పే మాటను కుమారి డైరీలో త్వరత్వరగా వ్రాస్తున్నది. అమ్మ "ఇప్పుడు నే నన్నమాట వినపడిందా" అన్నది కుమారితో, కుమారి రోషంగా నేనేం నీ కోడలిని (ఒక సోదరిని అమ్మ ముద్దుగా పిలిచే పిలుపు) కాదమ్మా! వినబడక పోవటానికి" అన్నది. అప్పుడు అమ్మ "నా కోడలివి కాదుకానీ నా కూడలివి" అన్నది. అమ్మ కూడలిలో ఉండటం మాత్రం సామాన్యమైన విషయమా? మనం ఉండటం కాదేమో! అమ్మ ఉంచుకోవటమే నేమో! అనిపిస్తుంది. లేకపోతే క్షణం కూడా అమ్మ దగ్గర ఉండలేం.

కుమారి మాతృశ్రీ ప్రింటర్స్‌లో పనిచేసేది. అందరింటి నిర్వాహకులు ఏ పనిచేపితే ఆ పని చేసేది. అమ్మవద్ద ఉండాలని వచ్చే ఎవరైనా అమ్మతో ఆ ఆవరణలో ఉండాలనే కోరుకుంటారు. బాపట్లలో ప్రెస్ ఉండటం వల్ల కొందరు రోజూ అక్కడ పనిచేస్తూ పోయి వచ్చేవారు. కాని కుమారి బాపట్లలోనే ప్రెస్‌లోనే ఉండేది.

జిల్లెళ్ళమూడి వచ్చేనాటికి యస్.యస్.యల్.సి. చదివిన కుమారికి హిందీ పరీక్షలకు చదవాలనే ఆలోచన వచ్చింది. మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద ఇలా అన్ని పరీక్షలకు నాచేత పుస్తకాలు తెప్పించుకుని చదివి ఉత్తీర్ణురాలైంది. ఆ తర్వాత ఇంటర్, బి.ఏ.యం.ఏ. హిందీ ట్రయినింగ్ చదివి హిందీ టీచర్‌గా చేరింది. పది సంవత్సరాలు అమ్మ సన్నిధిలో గడిపి అక్కడి వారందరి మనస్సులలో ఒక సముచిత స్థానాన్ని సంపాదించుకున్న కుమారి జిల్లెళ్ళమూడిని, అమ్మను వదలి ఉద్యోగంలో చేరింది. ఉద్యోగంలో చేరినా ఇక్కడి సోదరీ సోదరులతో ఏర్పడిన అనుబంధాలు ఎలా పోగొట్టుకుంటుంది? కాత్యాయని అక్కయ్య, రాధాకృష్ణశర్మగారి కుటుంబంతో, రామకృష్ణన్నయ్యతో చిరకాలం తన సోదరీ బంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నది. అమ్మను తాను భౌతికంగా వదిలినా మానసికంగా అమ్మ వదలదు కదా! నన్ను వదిలి ఎవరూ ఉండలేరు అన్న అమ్మ మాట సార్థకమే. కుమారి కూడా ఆ తానులోని గుడ్డే.

కుమారి తేది 8.12.2009 న అమ్మలో ఐక్యమైంది. కాని జిల్లెళ్ళమూడిలో సంచరించిన ఆమె జ్ఞాపకాలు ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటాయి. రామాయణంలో శ్రీరామచంద్రుడు చిన్నమేలు చేసిన వారిని కూడా మరచిపోడు అని చెప్పబడింది. అలాగే సేవచేసిన కుమారిని అమ్మ మరచి పోతుందా? కుమారి చిరంజీవి-ధన్యురాలు.



59. శ్రీ కొండముది రామమూర్తిగారు

జరీ పేటంచు ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, నుదుటన కుంకుమబొట్టు, పెదవులపై చెదరని చిరునవ్వు, నిరంతర కర్తవ్య దీక్షాపరాయణత, కార్యనిర్వహణ దక్షత, జిల్లెళ్ళమూడి సోదరీసోదరుల పట్ల ఎనలేని ఆప్యాయత, ఆర్తులను ఆదుకొనే మనస్తత్వం, తన ఇంటిని మరొక జిల్లెళ్ళమూడిగా మలచటం, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం వెరసి శ్రీ కొండముది రామమూర్తిగారు అనటం ఉచితం. అందరి తలలోని నాల్కగా మసలుతూ అమ్మకు హాయినీ, విశ్రాంతిని కలిగించారు రామమూర్తిగారు. అమ్మ చెప్పకుండానే అమ్మ మనస్సు ఎఱిగి తగినట్లు పనులు చక్కదిద్దిన కర్తవ్యపరాయణుడు, కర్మవీరుడు.

జిల్లెళ్ళమూడిలో పనిచేసే వారి పట్ల సానుభూతి, సంస్థకు అండగా నిలచే వారిపట్ల ఆదరణ, సంస్థ బాగోగుల విషయంలో నిశ్చితమైన అభిప్రాయాలు, వాటిని సరియైన పదాలలో వ్యక్తీకరించగల నేర్పు, నిష్కర్షత రామమూర్తిగారికి పెట్టని భూషణాలు.

అమ్మ "ఎవరైనా తాను కనిపిస్తే చూస్తారుగాని లేకపోతే ప్రక్కనుండి పోతున్నా చూడలేర"న్నది. అంటే తాను కావాలనుకుంటేనే తన వద్దకు ఎవరైనా వస్తారు అని అర్థం. రామమూర్తిగారికి అమ్మ సేవలో పాల్గొనే అదృష్టం అమ్మ కల్పించిందే.

1960లో మొదటిసారి శ్రీ వల్లూరి రామమోహనరావుతో కలసి జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించారు. విచిత్రమేమిటంటే అమ్మ ఎవరి మనసులపై ఎలా ఎప్పుడు ప్రభావం చూపుతుందో చెప్పలేం. వీరికి తెలియకుండానే అమ్మ ముద్ర వీరిపై పడింది.

ప్రకాశం జిల్లా ఇంకొల్లు గ్రామంలో కొండముది లక్ష్మీనరసింహం- రత్తమ్మ దంపతులకు 1923లో జన్మించిన రామమూర్తిగారు గుంటూరు హిందూకాలేజీలో

చదువుకొని1943లో రైల్వేశాఖలో ఉద్యోగంలో చేరారు. సుప్రసిద్ధ గ్రంథాలయోద్యమ సేవకులు, వేటపాలెం గ్రంథాలయ వ్యవస్థాపకులలో ఒకరు అయిన శ్రీ అడుసుమల్లి శ్రీనివాసరావుగారి మేనల్లుడు శ్రీ రామమూర్తిగారు. శ్రీనివాసరావుగారి అల్లుడు, చీరాలలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులు అయిన రాజుపాలెం రామచంద్రరావుగారి ద్వారా 1959లోనే అమ్మను గూర్చి విన్నారు. వారి మరొక మేనమామ శ్రీహర్షరావుగారు కూడా అమ్మ వద్దకు తరచూ వస్తుండేవారు.

1943లో రైల్వేశాఖలో ఉద్యోగంలో చేరిన రామమూర్తిగారు మద్రాసులో ఉద్యోగరీత్యా ఉంటున్న సమయంలో శ్రీ వల్లూరి రామమోహనరావుకు కూడా రైల్వేలో మద్రాసులోనే ఉద్యోగం రాగా రామచంద్రరావుగారి సలహాపై రామమూర్తిగారితో కలసి ఒకే ఇంట్లో ఉండటం తటస్థించింది. రామమోహనరావు చీరాలలో ఉన్న రోజులలో ప్రతి శని,ఆదివారాలు జిల్లెళ్ళమూడికి వచ్చి అమ్మ సేవలో పాల్గొన్నవాడు కావటంతో మోహనరావు ప్రభావం రామమూర్తిగారి మీద బాగా పడ్డది. అమ్మను గూర్చిన చర్చ, చింతన వారిమధ్యబాగా జరిగేది. రామమూర్తిగారికి హైదరాబాద్ బదిలీ అయింది.

రామమూర్తిగారికి మద్రాసులోఉంటున్న రోజులలోనే అమ్మ 1973 స్వర్ణోత్సవాల తరువాత కోటిమందికి దర్శనం ప్రసాదించే ప్రణాళికలోని భాగంగా మద్రాసు వెళ్ళిన సందర్భంలో అమ్మ రామమూర్తిగారింటికి వెళ్ళి అక్కడే స్నానాదినాలు ముగించుకొని వారిని ఆనందాంబుధిలో ఓలలాడించింది. మాటల సందర్భంలో అమ్మ రామమూర్తిగారితో పదవీ విరమణ తర్వాత జిల్లెళ్ళమూడి రమ్మని చెప్పింది. ఏదో మాటల సందర్భంలో చెప్పిన ఈ మాట మామూలుగా అయితే మనం మరచిపోతాం. కాని వారి మనసులో అప్పుడే నిర్ణయం జరిగిపోయింది. అమ్మది తోలునోరు కాదు కదా! తాలు మాట రావటానికి.

మేనమామ అడుసుమల్లి శ్రీనివాసరావుగారి దౌహిత్రులు అయిన (శేషు) శేషగిరిరావు, రామకృష్ణరావు (కిష్టు)లతో కలిసి తరచు అమ్మ రెండవ కుమారుడు 'రవి' రామమూర్తిగారిని కలుస్తూ ఉండేవాడు. అది రానురానూ బాగా ఆత్మీయతగా బలపడింది. దానికి మరొక సంఘటన కూడా దోహదం చేసింది. రామమూర్తిగారి రెండవ కుమారుడు శ్రీనివాసమూర్తి యం,టెక్ చదివి ఐ.డి.యల్ లో పనిచేస్తుండేవాడు. ఒకరోజు ఆకస్మాత్తుగా ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళిపోయినాడు. అతడి కోసం విచారించాల్సిన అన్ని చోట్ల విచారించారు. ప్రయోజనం శూన్యం. ప్రయోజకుడైన కొడుకు కనిపించకపోతే తల్లిదండ్రుల పరిస్థితి, బాధ వర్ణనాతీతం. ఆ పరిస్థితులలో ఆ లోటును కొంత పూడ్చటానికి అమ్మ రెండవ కుమారుడు బ్రహ్మాండం రవి తోడ్పడ్డాడు. రామమూర్తిగారు రవిలో వాళ్ళ కుమారుని చూసుకుంటుండేవారు.

రవి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే రోజులలో రామమూర్తిగారి ఇంటికి దగ్గర ఉండటంలోని అంతర్యం రామమూర్తిగారి అనారోగ్యంతో పాటు ఇది కూడా ఒకటి.

ఇక కొండముది రామమూర్తిగారు అమ్మ అనుగ్రహించిన రీతిలో ఉద్యోగ విరమణ అనంతరం 1981లో అమ్మ సేవకై జిల్లెళ్లమూడి వచ్చారు. శ్రీ విశ్వజననీపరిషత్ స్థానిక కార్యదర్శిగా పనిచేశారు. నిరంతరం చెరగని చిరునవ్వుతో సోదరీ, సోదరులను పలుకరిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతూ చేయవలసిన కార్యం పట్ల అంకితభావాన్ని కలిగిస్తుండేవారు. అన్ని పనులు సమర్థవంతంగా నిర్వహించేవారు. ఆయన కార్యదక్షతకు అమ్మ ఎంతో సంతోషించేది. అమ్మ ఆలయప్రవేశం తర్వాత కూడా విశ్వజననీపరిషత్ కార్యక్రమాలను నాలుగేళ్ళు 1989 దాకా నిర్వహించారు. దురదృష్టవశాత్తూ రామమూర్తిగారికి పక్షవాతం రావటంతో ఒక పుష్కరకాలం పై చిల్కు మంచానికే పరిమితం కావల్సి వచ్చింది. హైదరాబాద్‌లో స్వగృహంలో ఉన్నా నిరంతరం ఆయన మనస్సు జిల్లెళ్ళమూడి పరిషత్ కార్యక్రమాల చుట్టూ తిరుగుతుండేది. 1946లో వివాహమైన దగ్గరనుండి వారి శ్రీమతి సుశీలక్కయ్య సహధర్మచారిణి అనే మాటను సార్ధకం చేస్తూ వారికొనర్చిన సేవ, అతిథి మర్యాదలు ఆదర్శనీయం.

తపనే తపస్సనీ, ధ్యాసేధ్యానమనీ అమ్మ చెప్పిన మాటలు రామమూర్తిగారు పట్ల అక్షరసత్యాలు. ఆయన తపనంతా జిల్లెళ్ళమూడి కార్యక్రమాలు సక్రమముగా జరగాలనీ, ధ్యాసంతా వైభవంగా అన్ని కార్యక్రమాలూ నిర్వహింపబడాలనీ, జిల్లెళ్ళమూడి సోదరీ, సోదరులకు పెద్ద దిక్కుగా నిండైన మనిషిగా ఉన్నారు. జిల్లెళ్ళమూడి అభివృద్ధికి వారి మనసులో ఒక ప్రణాళిక ఉన్నది. దాని అమలుకు ఆయన ఎన్నో సూచనలు చేశారు. అభివృద్ధి పథంలో పయనిస్తున్న నేటి అందరింటిని చూస్తే ఆయన ఎంతో సంతోషించేవారు. శ్రీ విశ్వజననీపరిషత్ విశ్వవ్యాప్తమై అమ్మ చూపించిన వెలుగు కిరణాలు దిగంతాల దాకా వెదజల్లాలనే వారి ఆకాంక్ష నెరవేరి, ఆ పరంవైభవ స్థితిని ఆకాశంలో ధృవతారగా నిలచిన రామమూర్తిగారు చూచి తృప్తిగా మనల్ని ఆశీర్వదించాలని కోరుకుందాం.

మరొకటి రామమూర్తిగారు పుట్టుకలోను, అమ్మలో చేరటంలోనూ విశిష్టతనే సంతరించుకున్నారు. అమ్మ జన్మించిన 1923లో జన్మించారు. నాన్నగారు అమ్మలో ఐక్యమైన ఫిబ్రవరి 17ననే వీరూ అమ్మలో ఐక్యమైనారు. తమ 80వ యేట 2003లో ధాన్యాభిషేకం రోజున అమ్మ పాదాలపై ప్రాణాభిషేకం చేసి ధన్యులైనారు. రామమూర్తిగారు ధన్యజీవి.



60. శ్రీ రాజగోపాలచారి

1970 ప్రథమార్ధంలోనే అమ్మను దర్శించుకున్న శ్రీ రాజగోపాలచారి గారు 1970లో అమ్మ హైదరాబాద్ మొదటిసారి పర్యటనలో ఎంతో ఉత్సాహంగా శ్రద్ధాసక్తులతో అమ్మకిష్టమైన రీతిలో ఏర్పాటు కావించి చిరస్మరణీయమైనదిగా చేయటంలో చారి గారి పాత్ర ఎంతో కీలకమైనది.

శ్రీ విశ్వజననీపరిషత్‌ను రిజిష్టరు చేసే రోజులలో మనకు కావలసిన రీతిలో బైలాస్ రూపొందించటానికి కేశవశర్మగారు చారిగారిని కూడా సంప్రదించి వారి విలువైన సలహాలు స్వీకరించారు. 1979లో అమ్మ స్వర్ణోత్సవాలు జరిగినప్పుడు లక్షమందికి ఒకే పంక్తిన భోజనాలు పెట్టిన అమ్మ కోటిమందికి దర్శనాలు ప్రసాదించాలనే కార్యక్రమంలో భాగంగా 1974లో హైదరాబాద్ విజయం చేసింది. ఆ సమయంలో చారిగారు అమ్మ సందర్శించదలచుకొన్న పేద, బడుగు, దీన, దరిద్రులు నివసించే ప్రదేశాలు, సమాజం నుండి నిరాదరణకు గురికాబడిన వారుండే ప్రదేశాలు, భంగీకాలనీలు వంటివి జంటనగరాలలో ఎన్నికచేసి ప్రజలందరికీ అమ్మ వాత్సల్యము ఆదరణ ఆప్యాయతలు, అనుగ్రహము అందించటానికి విశేష కృషి చేశారు. వారందరికి అమ్మ పులిహోర, చక్రపొంగలి, దధ్యోదనము వంటివి పంచటానికి, దుప్పట్లు, వస్త్రాలు పంచటానికి తగు వ్యవస్థను ఏర్పాటు చేయటంలో వారి కృషి ప్రశంసనీయం. ఆశ్చర్యకరమైన విషయమేమటంటే అమ్మ తిరిగిన స్లమ్ ఏరియాలన్నీ వెళ్ళి వచ్చిన తరువాత అభివృద్ధి చెంది ఆ బడుగు ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారు.

విశేషమేమిటంటే శ్రీ విశ్వజననీపరిషత్‌కు కొన్ని కారణాల వల్ల అమ్మ ప్రెసిడెంట్‌గా ఉండటం బాగుండదు అనుకున్నప్పుడు ఆస్థానానికి శ్రీచారిగారు ఎన్నికకావటం అమ్మ సంకల్పమే. వారి నేతృత్వంలో పరిషత్ తన కార్యక్రమాలను విజయవంతంగా సాగించింది.

అనారోగ్య కారణాల వల్ల అమ్మను 1980లో హైదరాబాద్‌లో వైద్యపరీక్షలకు తీసుకొని వెళ్ళటం జరిగింది. ఆ సమయంలో అమ్మ బంజారాహిల్స్ జర్నలిస్టుకాలనీలోని చారిగారింట్లోనే ఉండటం జరిగింది. చారిగారు వారి శ్రీమతి లలితలు చూపించిన ఆదరణ, ఆప్యాయత, అతిధి సత్కారాలు అనన్య సామాన్యమైనవి. కొన్ని నెలల పాటు అమ్మ కొరకు వచ్చిన అశేషజనసమూహానికి చారి ఆదరణను మరువరానిది.

ఒక అతిసామాన్య గుమాస్తా ఉద్యోగంతో ప్రారంభమైన చారిగారి జీవితం జాతీయ అంతర్జాతీయ ఖ్యాతి నార్జించే స్థాయికి చేరిందంటే చారిగారి ప్రతిభా పాటవాలు, దేనిలోనైనా దూసుకుపోయే తత్వము, సేవాదృక్పథము, తన వ్యక్తిత్వం ద్వారా చుట్టూ ఉన్నవారిని ప్రభావితం చేసే సౌమనస్యము. చారిగారిని ఉన్నత పథాన నిలబెట్టాయి.

శ్రీ తోపు రాజగోపాలచారి గారు 19.4.1928న మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల కృష్ణ అగ్రహారంలో జన్మించారు. గద్వాలలోనే పాఠశాల విద్యపూర్తి చేసి ఉన్నత విద్యకోసం హైదరాబాదు చేరారు. నిజాం కాలేజీలో కళాశాల విద్యపూర్తి చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యాప్రవీణులైనారు. తరువాత పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ సాధించారు. ఆ రోజుల్లో గుంటూరులో డిప్యూటీ కలెక్టరుగా ఉన్న కె.కృష్ణమాచారిగారి కుమార్తె లక్ష్మీ సౌభాగ్యవతి లలితను వివాహమాడారు. అమ్మ అనుగ్రహంతో వారికి ఇద్దరు కుమార్తెలు చంద్రిక, సుధలు ఒక కుమారుడు రాజు జన్మించారు. చారి గారి జీవితము వారి పిల్లల జీవితము మూడు పూలు ఆరుకాయలుగా విల్లసిల్లింది.

లోయర్ డివిజన్ క్లర్క్‌గా సెక్రటేరియట్‌లో చేరినవారు అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా సికిందరాబాద్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసి మహబూబ్ నగర్ మున్సిపల్ కమీషనర్‌గా ఎదిగారు. అంకితభావము, నిబద్ధతతో పనిచేయటం వల్ల పనిలో నైపుణ్యాన్ని

సాధించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డులోనూ, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గానూ పనిచేశారు. అంతేగాక భారతదేశంలోని మెట్రోపాలిటన్ సిటీస్‌లో బీదరికం మీద ఒక బృహద్గ్రంథాన్ని ప్రచురించి ఎందరి మన్ననలో పొందారు. 1983లో స్వచ్ఛందపదవీ విరమణ చేసి వరల్డ్‌బాంక్ అడ్వయిజర్‌గా ఎన్నికై పట్టణ సముద్ధరణ కార్యక్రమాలకు సలహాదారుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ బాడీ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ హాండ్‌బాల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్‌లకు వివిధ బాధ్యతలలో విశేష సేవలు చేసి భారతీయ క్రీడారంగానికి తోడ్పడ్డారు. వృద్ధాశ్రమాన్ని స్థాపించటానికి మూల స్తంభమై 30 సంవత్సరాల పాటు దాని నిర్వహణలో కృషి చేశారు.

శ్రీ చారిగారి సర్వతోముఖ విజ్ఞానం వేద విద్య వైపు కూడా ప్రసరించింది. భారతీయ ఆధ్యాత్మిక భావుకులైన చారిగారు ఎన్నో ఆధ్యాత్మిక చర్చలలో పాల్గొని విలువైన తమ అభిప్రాయాలు వెలిబుచ్చేవారు. 1972 నుండి అమ్మతో వారి అనుబంధం పెరిగిన నాటి నుండి అమ్మ సాహిత్యాన్ని మథించారు. అమ్మ "జీవిత మహోదధిలో" కొన్ని వందలసార్లు ఈత కొట్టారేమో. వారికి అత్యంత ఆత్మీయులైన సి.సింహాద్రిగారు - చారి గారు అమ్మ చరిత్రను వందలసార్లు చదివినట్లు చెప్పారు.

ఒకసారి అమ్మకు సహస్రఘటాభిషేకం జరపాలని సంకల్పించి రాచర్ల లక్ష్మీనారాయణ, శ్రీ వల్లూరి పాండురంగారావు గారితో కలసి బ్రహ్మాండం రవి సహాయంతో విజయవంతంగా నెరవేర్చారు. అమ్మ జీవిత మహోదధిని భద్రపరచటంలో వారి కృషి చెప్పుకోదగినది. గోపాలన్నయ్యను హైదరాబాద్‌లో అట్టిపెట్టి ఆ కార్యాన్ని పూర్తి చేయించారు. జీవితం చివరిదశలో నిరంతరం అమ్మ చింతనలో గడుపుతూ సహస్ర చంద్రదర్శనం చేసి దాదాపు 85 సంవత్సరాలు జీవించిన చారిగారు 25.3.2013న అమ్మలో ఐక్యమైనారు. చాలమంది బడుగు ప్రజల బాగుకోసం, వృద్ధుల సేవ కోసం, భారతీయ క్రీడారంగస్ఫూర్తి కేంద్రంగా, శ్రమించిన శ్రీ చారిగారి జీవితం ధన్యం - వారు ధన్యజీవి.



61. రాచర్ల శ్రీరామమూర్తి

రాచర్ల అనంతరామయ్యగారు నర్సరావుపేటలో పురోహితులు. వారికి నలుగురు కుమారులు. ఎవరూ వైదిక వృత్తికి పోలేదు. కాస్తో కూస్తో ఆంగ్లభాషాభ్యసనం చేసి ఉద్యోగాలు వెతుక్కున్నారు. చివరివాడైన శ్రీరామమూర్తి రెంటికీ చెడిన రేవడైనాడు. అనంతరామయ్యగారి చెల్లెలు లలితాంబగారు అమ్మ వద్దకు వస్తుండేది. 1959లో ముక్కోటి ఏకాదశికి లలితాంబగారు శ్రీరామమూర్తిని వెంటబెట్టుకొని అమ్మ వద్దకు వచ్చింది. అదే శ్రీరామమూర్తి అమ్మ వద్దకు మొదటిసారి రావటం.

లలితాంబగారు అమ్మకు శ్రీరామమూర్తిని చూపిస్తూ 'వీడికి సరిగ్గా చదువు అబ్బలేదమ్మా! వీడిని గూర్చే దిగులు' అన్నది. అపుడు అమ్మ "ఇంతలావు తల్లిని నేనుండగా నీకు దిగులెందుకు?" శ్రీరామూర్తిని దగ్గర తీసుకున్నది. అంతే అప్పటి నుండీ భౌతికంగా కూడా శ్రీరామమూర్తి బాధ్యతలు అమ్మ తీసుకున్నది.

శ్రీరామమూర్తి అమ్మ వద్ద ఉండే లారీమీద పనిచేస్తుండేవాడు. శేషగిరిరావు గారి అజమాయిషీలో ఆ లారీ నడుస్తుండేది. ఎక్కడికి వెళ్ళినా ఏ పనిమీద వెళ్ళినా జమాఖర్చులు ఖచ్చితంగా చెప్పేవాడు శ్రీరామమూర్తి. ఖర్చుపెట్టటంలో ఇది నా సంస్థ. ఇది నాడబ్బు దీనిని జాగ్రత్తగా ఖర్చు చేయాలి అని ఎంతో జాగ్రత్తగా ఉండేవాడు. లెక్కలు చెప్పటంలో ఇతరులకూ శ్రీరామమూర్తికీ ఉన్న తేడా నిక్కచ్చితనం చూచిన శేషగిరిరావు గారు అమ్మతో శ్రీరామమూర్తి

సేవాతత్పరతను ప్రశంసిస్తూ మాట్లాడాడు. అమ్మ కూడా శ్రీరామమూర్తి నిజాయితీని మెచ్చుకున్నది.

ఒకసారి అమ్మకు పాలాభిషేకం చేస్తున్నారు. శ్రీ రామమూర్తి చూచి ఇదేమిది దేవుడికి కదా అభిషేకం చేసేది అమ్మకు చేస్తున్నారేమిటి? అనుకున్నాడు. ఆ క్షణంలోనే అమ్మ శివునిగా దర్శనం ప్రసాదించింది. ఆనాటి నుండి అమ్మ పట్ల అచంచల విశ్వాసం ఏర్పడింది.

అమ్మ ఓడరేవులో ఉన్నది కొంతకాలం. శ్రీరామమూర్తి జిల్లెళ్ళమూడిలోనే ఉండి ఇక్కడికి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుండేవాడు. అమ్మ సమక్షంలో సేవ చేయడంలో ఒక తృప్తి ఆనందం ఉంటుంది. కాని అమ్మ అప్పజెప్పిన పని అమ్మ సర్వత్రా ఉన్నది అనే భావనతో అమ్మ పరోక్షంలో చేయడంలోని భావౌన్నత్యం, సమర్పణ గొప్పవి.


చెరువునుండి నీళ్ళు తేవటంలోగాని, అవసరమైతే అన్నపుగుండిగలు అవలీలగా గాడిపోయినుండి ఇవతలకు లాగటంలోని లాఘవంగాని శ్రీరామమూర్తికి అబ్బినవి అంటే అది అమ్మ ప్రసాదించిన శక్తి – అనుగ్రహమే.

శ్రీరామమూర్తికి వివాహమైంది. సంవత్సరాలు దాటుతున్నా వారికి సంతానం కలుగలేదు. నర్సరావుపేటలో అమ్మ వద్దకు వచ్చే డాక్టర్ కమలకు చూపించారు. కమల కూడా పిల్లలు పుట్టే అవకాశం లేదని చెప్పింది. ఆ విషయం శ్రీ రామమూర్తి, లలిత అమ్మకు చెప్పారు. వీరున్నప్పుడే డాక్టర్ కమల అమ్మ వద్దకు వచ్చింది. అమ్మ కమలను అడిగింది "ఏమిటే దీనికి (లలితకు) పిల్లలు పుట్టారని చెప్పావుట" అన్నది. అందుకు కమల అవునమ్మా ! ఏకోశాన పుట్టే అవకాశం లేదని మా శాస్త్రం చెపుతున్నది అన్నది. అప్పుడు అమ్మ లలితతో "దాని బొంద దానికేం తెలుసు అదేమన్నా కడుపులోకి పోయిం చూసిందా ఏమిటి? పిల్లలు ఏలా పుట్టరో చూద్దాం హైమాలయంలో 40 రోజులు ప్రదక్షిణలు చేయి" అని చెప్పింది. అలా లలిత ప్రదక్షిణలు చేయటం పిల్లలు పుట్టటం జరిగింది. మొదటిసారి డాక్టర్లు మగపిల్లవాడు పుడతాడని చెప్పారు. కాని హైమచుట్టూ ప్రదక్షిణలు చేసింది కదా ! ఆడపిల్లే పుట్టింది. ఆ పాపకు హైమ అనే పేరు పెట్టుకున్నారు. ఆ హైమకు పెళ్ళయి ఒంగోలులో ఉంటున్నారు.

హైమకు పుట్టినబాబుకు ఒంట్లో బాగోలేదని ఒంగోలు ప్రయాణమైన లలితకు ఒక పెద్ద ముత్తయిదువ కనిపించి పసుపు కుంకుమ అడిగి తీసుకొని సాయిబాబా గుడికి 21 రూపాయిలు చందా ఇమ్మనడం అప్పుడు డబ్బులు లేక ఇవ్వకపోవడం జరిగింది. ఈసారి రా ఇస్తాం అంటే ఈసారి ఇలా వస్తానా ? వచ్చే రీతిలో వస్తా తీసుకునే రీతిలో చీర పసుపు కుంకుమలు తీసుకుంటానని వెళ్ళింది. ఒంగోలు వెళ్ళి నర్సరావుపేట రావటం పళ్ళెంలో ఉన్న బియ్యంలో అమ్మ పాదాల గుర్తులు పడడం ఆ పెద్ద ముత్తయిదువ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి గుడికి వెళ్ళి శ్రీరామమూర్తి లలిత అమ్మకు చీరె రవిక పసుపు కుంకుమలు సమర్పించుకోవడం. హుండీలో 21రూపాయిలు వేయడం జరిగింది. ఇలా అమ్మ ఎన్నో అనుభవాలు శ్రీరామమూర్తి కుటుంబంలో అందరికీ ఇస్తూనే ఉన్నది. వాళ్ళ జీవితాలకు మార్గదర్శనం చేస్తూనే ఉన్నది. ఆర్థికంగా అండగా శ్రీరామమూర్తికి మేనత్త లలితాంబగారు తన ఇల్లు ఇచ్చింది.

ఆశ్చర్యం ఏమిటంటే శ్రీరామమూర్తికి పక్షవాతం వచ్చిసరిగా మాట్లాడలేని స్థితిలో ఆసరా లేకుండా నడవలేని స్థితిలో ఉండి కూడా ఇంకా ఒక నెలరోజులలో అమ్మలో ఐక్యమౌతాడనగా సకుటుంబంగా జిల్లెళ్ళమూడి వచ్చాడు. అమ్మను హైమను దర్శించుకున్నాడు. శ్రీ రావూరి ప్రసాద్ అమ్మతో తమ అనుభూతులను వీడియో తీస్తున్నాడు. దాదాపు 200 మందిని తీశాడు కూడా. హైదరాబాద్‌లో వీళ్ళ ఇంటికి వెళ్ళి శ్రీరామమూర్తిని లలితను అడిగి ప్రశ్నించి ఆ అనుభూతులను లలిత చెప్పగా వీడియోలో బంధించాడు. ఆనాడు తీసిన ఫోటోనే శ్రీరామమూర్తిది అవసరానికి ఉపయోగపడ్డది.

1936లో జన్మించిన శ్రీరామమూర్తి 2013లో అమ్మలో లీనం కావటం అమ్మసేవలో తరించటం అమ్మ నిర్దేశించిన పథకం ప్రకారమే జరిగింది. శ్రీరామమూర్తి ధన్యజీవి.



62. బొడ్డుపల్లి సీతారామస్వామిశాస్త్రి

మాతృశ్రీ సంస్కృత కళాశాల అభివృద్ధికి విశేషమైన కృషి చేసినవారిలో శ్రీ బొడ్డుపల్లి సీతారామస్వామి శాస్త్రిగారొకరు. వీరు కళాశాల ప్రధమ ప్రిన్సిపాల్ అయిన శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మగారికి బావగారు. శ్రీ సీతారామస్వామివారిని, శ్రీరాధాకృష్ణశర్మగారిని కూడా జిల్లెళ్ళమూడి అమ్మవద్దకు రావటానికి కారకురాలు శ్రీమతి బొడ్డుపల్లి హనుమాయమ్మగారు, బుల్లెమ్మ అని పిలిచేవారు ఆమెను. ఆమె రాధాకృష్ణశర్మగారికి అక్కగారూ, సీతారామస్వామిగారికి వదినగారు. రాధాకృష్ణశర్మగారూ, సీతారామస్వామిగారు కృష్ణార్జునవలె సంస్కృత కళాశాల నిర్వహణకై తిరుగుతుండేవారు.

శ్రీ సీతారామస్వామిగారు 1919లో బాపట్ల దగ్గరలోని కర్లపాలెం గ్రామంలో శ్రీ బొడ్డుపల్లి రామకృష్ణశాస్త్రి శ్రీమతి మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. బాపట్లలోనే విద్యాభ్యాసం చేశారు. సంపన్న కుటుంబం కావటం వల్ల ఉద్యోగం కోసం ఉన్న ఊరినీ కన్నవారిని వదిలివెళ్ళటం ఇష్టం లేక గ్రామంలోనే వ్యవసాయం సాగించుకుంటూ ఊరి పోస్టుమాస్టరుగా పనిచేశారు.

యుక్తవయస్సులో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులైన శ్రీ వేదాంతం వాసుదేవరావు గారి కుమార్తె సత్యకామాదేవిని వివాహం చేసుకొన్నారు. త్రిమూర్తుల వంటి ముగ్గురు బిడ్డలను కన్నారు. కుమారులందరూ చక్కగా చదువులలో ఆరితేరారు. రెండవ కుమారుడు మాత్రం అకాలంలో కాలం చేశాడు.

సీతారామస్వామి గారు 1971లో మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి స్థాపనకు కృషి చేశారు. అమ్మ వారి యెడల ఎంతో ప్రేమతో ఉండేది. కాలేజీ పాఠశాలల కార్యదర్శిగా చిరకాలం పనిచేసి శ్రీ అధరాపురపు శేషగిరిరావుగారు చూపిన మార్గంలో

కళాశాలను చక్కదిద్దారు. కళాశాల, పాఠశాలల ఉపాధ్యాయులకు, గ్రాంటు సమయానికి రాక ఆలస్యమై బాధపడుతున్న రోజులలో వారే అడ్వాన్సు చేసి సహాయపడుతుండేవారు. కళాశాల స్థాపనలోనే కాక పాఠశాల స్థాపించటానికి కూడా ఆర్థికంగా సహాయపడ్డారు.

సీతారామస్వామిశాస్త్రిగారికి వారి శ్రీమతి సత్యకామాదేవిగారికి లలితా సహస్రనామ పారాయణలు పూజలు ఎంతో ఇష్టమైనవి. ఉత్సాహంగా జిల్లెళ్ళమూడిలో జరిగే లక్షనామార్చనలలో, కోటి నామార్చనలలో పాల్గొంటుండేవారు. అమ్మ రాచర్ల లక్ష్మీనారాయణ చేత మొదటిసారి లలిత కోటి నామపారాయణ జరిపించినప్పుడు శ్రీమతి సత్యకామాదేవి గారే అందరికంటే ఎక్కువసార్లు లలితసహస్రనామ పారాయణ చేసి ప్రథమ స్థానంపొందిన విశిష్ట వ్యక్తిగా ఎన్నికైనది. ఆమె అన్ని నోములు, అన్ని వ్రతాలు అమ్మ సన్నిధిలో అమ్మకే పతిదేవునితో కలసి చేసుకొనేది. ఇక సీతారామశాస్త్రి గారి షష్ట్యబ్ధిపూర్తి ఉత్సవం ఎంతో వైభవంగా 1979లో అమ్మ సన్నిధిలో జరుపుకొని ఎందరికో మార్గదర్శనం చేశారు.

సాధుస్వభావుడు, ఆధ్యాత్మిక సంపన్నుడు అయిన సీతారామస్వామిశాస్త్రి గారు జిల్లెళ్ళమూడి కార్యక్రమాలలో స్వర్ణోత్సవాలలో సైతం ఎంతో కృషి చేశారు. ధాన్యం పోగు చేయడమేగాక లక్షమందికి భోజనం ఏర్పాటు చేసే కార్యక్రమానికి ముందు జిల్లెళ్ళమూడికి తరలించబడ్డ పొలాలలోని డేరాల వద్ద బియ్యంబస్తాలన్నింటికి శాస్త్రిగారే కాపలాదారు. అక్కడే రాత్రిళ్ళు సైతం పడుకుని బాధ్యతలను అత్యంత శ్రద్ధాభక్తులతో చేశారు. ఒక జిల్లెళ్ళమూడిలోనే ఎక్కడ ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలకై ముందుండే వారు. 1960 నుండి 1992 దాకా బాపట్లలోని అనుభవానందస్వామి వారిచే నిర్వహింపబడే రామకృష్ణభక్తసమాజమునకు మేనేజరుగా, కార్యదర్శిగా అకుంఠిత సేవలు అందించారు.

స్వగ్రామమైన కర్లపాలెంలో శ్రీ గంగా గౌరీ సమేత కేదారేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేసి ప్రతిసంవత్సరం వసంత నవరాత్రులు, దేవీనవరాత్రులు చాల కాలం నిర్వహించిన పరమభాగవతోత్తములు. ఏకాదశీవ్రతానుష్ఠానపరులు. పెద్దల యెడ విధేయత సమవయస్కుల యెడ సౌభ్రాతృత్వము, పిన్నల యెడ అనురాగము, ఆప్యాయత సీతారామస్వామిశాస్త్రి గారి సహజ లక్షణాలు.

అటు స్వగ్రామంలో ఇటు బాపట్లలోనే కాక జిల్లెళ్ళమూడి లోని ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ సేవచేస్తుండేవారు. 1992 ఆశ్వయుజ బహుళ ఏకాదశీ వ్రతం జరిపి ద్వాదశి పారాయణ కావించి ఆప్తులను దుఃఖజలధిలో ముంచి అమ్మలో ఐక్యమైనారు. శాస్త్రిగారు భేషజం లేని, పటాటోపం చూపని కర్మయోగిగా జీవించిన ధన్యజీవి.



63. వల్లూరి పాండురంగరావు

జిల్లెళ్ళమూడిలో అమ్మ వద్ద ఎప్పుడూ జనం ఉంటారు. దానికి రాత్రిపవళ్ళు అనే తేడా లేదు. ఒక రోజు రాత్రి మేడపైన ఇప్పుడు వాత్సల్యాలయం ఉన్నచోట అప్పుడు ఆరుబయట అమ్మ మంచం మీద కూర్చొని ఉన్నది. దాదాపు రాత్రి 10 గంటలు దాటింది. చాపదిండు దుప్పటి తీసుకొని అంత దూరంగా పడుకోవటానికి ఒకరు వెళ్ళుతున్నారు. అమ్మసన్నిధిలో పడుకోవటమంటే దైవసన్నిధిలో పడుకోవటమనేదే సోదరీసోదరుల ఆలోచన. పాండురంగారావు అలా వెళ్ళుతున్నాడు పడుకోవటానికి. అమ్మ సన్నిధి ఆయనకు పెన్నిధి. నిరంతరం అమ్మ ఆలోచనలే నిద్రలో కూడా. ఆ వెళ్ళుతున్న పాండురంగారావు చూచి ఎవరూ ? అన్నది అమ్మ. నేనే నమ్మా ! అన్నాడు రంగారావు - "రంగడా !" అన్నది అమ్మ. ఔనమ్మా ! అన్నాడు. అలా అమ్మచేత ముద్దుగా 'రంగడు' అని పిలిపించుకోనే అదృష్టానికి నోచుకున్న పరమ విశ్వాసపాత్రుడు రంగారావు.

రంగారావు 1936 ఏప్రియల్ 5న పుట్టాడు. 1961 నుండి అమ్మ వద్దకు వస్తున్నాడు. వల్లూరి చలపతిరావు గారు - రుక్మిణమ్మగారు తల్లిదండ్రులు. వల్లూరి బసవరాజుగారు పితామహుడు. యామర్తి బుచ్చిరామయ్యగారు మాతామహుడు. తల్లివైపు వారు, తండ్రివైపువారు కూడా మంచి సంపన్న కుటుంబీకులు - గుంటూరు అరండల్‌పేట 3వలైను మెయిన్‌రోడ్డు నుండి 4వలైనులోని 1వ అడ్డరోడ్డువరకు వల్లూరివారి సంస్థానమే. ఇప్పటికీ అరండల్‌పేటను ఆనుకొని వల్లూరివారితోట అని ఒక పేట ఉన్నది. అలా వల్లూరి వారు పెద్ద సంస్థానాధీశులు ఒకప్పుడు.

గుంటూరుకు 15 కిమీ. దూరంలోని వల్లూరు సొంత ఊరు. గుంటూరులో గృహాలున్నాయి. చదువంతా గుంటూరులోనే. తండ్రి న్యాయవాది. మాతామహుడు న్యాయవాది. పాండురంగరావు చక్కటి నైపుణ్యం గల క్రికెట్ ప్లేయర్. గ్రాడ్యుయేషన్ కాగానే 'వెయిట్స్ అండ్ మేజర్స్' డిపార్టుమెంట్‌లో ఉద్యోగంలో ఇన్స్పెక్టర్‌గా చేరాడు. 1965లో జిల్లెళ్ళమూడి వచ్చే కుటుంబంలోని సుజాతను వివాహం చేసుకున్నాడు.

అమ్మ వద్దకు తరచుగా వచ్చే అలవాటున్న పాండురంగారావు 1967లో దసరాలకు అమ్మవద్దకు వెళ్ళాలనుకున్నాడు. జిల్లెళ్ళమూడి చుట్టూ వరదనీరు. జిల్లెళ్ళమూడి ఒక ద్వీపకల్పంలాగా ఉన్నది. బాపట్లలో శేషగిరిరావన్నయ్య కలిశాడు. ఎలాగండీ జిల్లెళ్ళమూడి వెళ్ళటం అని అడిగితే, నాలుగురోజుల నుండి ప్రయత్నిస్తున్నా కుదరలేదయ్యా ! ఈ రోజు ఏలాగైనా వెళ్ళాలి, అన్నాడు శేషగిరిరావుగారు. ఇద్దరూ కలిసి మర్రిపూడి గుళ్ళ దగ్గర దిగి నడవటం మొదలు పెట్టారు. 'బ్రతకాలని లేదా?' అన్నారు త్రోవలో ఊళ్ళవాళ్ళు. వీళ్ళు మనసు మార్చుకోలేదు. ఏమైనా వెళ్ళి తీరాలి అని పట్టుబట్టారు. రెండు సొరకాయ బుఱ్ఱలు తెచ్చి ఇచ్చారు పూళ్ళోవాళ్ళు. వాటి సాయంతో కొంత దూరం వెళ్ళగా అమ్మ అనుగ్రహంతో జిల్లెళ్ళమూడి వాళ్ళ తెప్ప కనిపించింది. దాంట్లో జిల్లెళ్ళమూడి చేరారు. అమ్మను ఏమైనా చూడాలనే తీవ్రమైన కోరికే అమ్మవారిని తన వద్దకు చేర్చుకుంది. దసరాలలో విజయదశమిపూజ పాండు రంగరావుది. అమ్మకు రంగారావు కుటుంబం అంతా ప్రదక్షిణలు చేసుకోవటం అలవాటు. అనారోగ్యంతో ఉన్నా పాండురంగారావు కోసం లేచి కూర్చొనేది అమ్మ.

ఒకసారి 11 రోజులు అభిషేకం చేసుకుందాం అనసూయేశ్వరాలయంలో అనుకున్నాడు పాండురంగారావు. లక్ష్మీనారాయణ మండలదీక్షతో చేసుకో అని చెప్పగానే అలా చేసుకొని చివరిరోజు. అనసూయావ్రతం చేసుకుందామనుకున్నాడు. లక్ష్మీనారాయణ నామాలు చెప్పటం రామకృష్ణ కథ చదవటం ఇవి ప్రత్యక్షంగా అమ్మకే చేసుకున్నాడు అమ్మ అనుగ్రహంతో. ఇలా ఒకసారి కాదు రెండుసార్లు కాదు అనేకసార్లు అమ్మకే ప్రత్యక్షంగా చేసుకున్నాడు. ఇందులో ఒకసారి ఏకాదశి ఆశ్లేషానక్షత్రం కలిసి వచ్చాయి. బస్తా విరజాజి పూలతో పూజ చేశాడు.

మండలదీక్ష చేసిన రాచర్ల లక్ష్మీనారాయణ అమ్మకు లలితాకోటి నామపారాయణ పూజచేయాలనుకున్నపుడు అన్ని నదుల నీటితో అభిషేకం చేయాలనుకున్నాడు. 12 పుష్కర నదుల తీర్థాన్నీ కన్యాకుమారిలోని సముద్ర

సంగమతీర్థాన్ని తెచ్చే బాధ్యత అమ్మ సూచన మేరకు పాండురంగారావు భుజస్కంధాల మీద పెట్టబడింది. పాండురంగారావు మహాప్రసాదంగా స్వీకరించి ఆ పనిని విజయవంతంగా నెరవేర్చాడు. అప్పుడే కాదు తర్వాత, అమ్మ విగ్రహ ప్రతిష్ఠ సమయంలో కూడా ఇంతటి బృహత్ కార్యాన్నీ ఒక్కడే నెరవేర్చాడు.

ఒకసారి ఒక విచిత్రమైన పూజ జరిగింది. సామాన్యంగా పిల్లలు పుట్టనివాళ్ళు పుత్ర కామేష్టి యజ్ఞం నిర్వహిస్తారు. జిల్లెళ్ళమూడిలో అలాంటి దేముంది? దేనికైనా అమ్మే దిక్కు. దిక్కున్న వాళ్ళకీ దిక్కులేని వాళ్ళకీ అన్ని దిక్కులకూ అమ్మే దిక్కు. వివాహమై సంవత్సరాలు గడుస్తూన్నా పిల్లలు పుట్టని ముగ్గురు దంపతులు కలసి అమ్మకు పూజ చేసుకోవాలనుకున్నారు. అమ్మ అంగీకరించింది. ఆశ్చర్యమేమిటంటే అందులో పాండురంగారావు ఒకడు. మిగతావారు ఏకా అంజన్, నాదెండ్ల లక్ష్మణరావు. అమ్మ అనుగ్రహం వల్ల పాండురంగారావుకు ఏకా అంజన్‌కు పిల్లలు పుట్టారు. లక్ష్మణరావు భ్రమరాంబతో నేనే మీ కూతురుని అని చెప్పింది. నిజానికి అమ్మంతటి కూతురు కలగటం ఆ భాగ్యం ఎంతమందికి కలుగుతుంది వారి అదృష్టం అది. పాండురంగారావు అతని కోరిక మేరకు ప్రేమకుమారుని పుత్రునిగా అనుగ్రహించింది.

పాండురంగారావు చేసిన మరొక గొప్ప పని 1963కు పూర్వం అమ్మ నివసించిన పూరిపాకకు శాశ్వత రూపం కలిగించటం. ఎన్నిసార్లు వేసినా తాటాకులు నిలువవు. శిథిలమై పోతాయి. కాని ఆ స్మృతి చిహ్నం శాశ్వతంగా నిలవాలి. ఎన్ని చారిత్రక గతస్మృతులకు ఆలవాలమే ఆ కుటీరం. అంతరాలయం, అంతరాంతరాలయమే కాదు అమ్మ స్నానాలగది, అమ్మకు కాఫీ టిఫెన్లు చేసే గది, అమ్మ దర్శనాలిచ్చిన వరండా ఒకటేమిటి అన్నీ ఎంతమంది ఎన్నివేలమంది హృదయాలలోనో పదిలంగా, భద్రంగా ఉన్న కుటీరమది. దాన్ని రూపురేఖలు మార్చకుండా శాశ్వతంగా సిమెంటుతో ఏర్పాటు చేశాడు - పాండురంగారావు తన కుటుంబ సహాయంతో సోదరులు అన్నంరాజు రామకృష్ణారావు కుటుంబసాయంతో. నిజంగా చిరస్థాయిగా నిలిచే విషయం.

హైమవతి ఈనాడు దేవతయై ఆలయంలో కొలువుదీరి ఉన్నది. కోరినవారి కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ఉన్నది. పాండురంగారావుగారి అక్కయ్య సరోజనమ్మను భర్త రంగారావుగారిని జిల్లెళ్ళమూడి తీసకొని వచ్చిహైమాలయంలో సేవ చేసే అవకాశం కలిగించింది పాండురంగారావే. అమ్మ అతని నివేదనను

అంగీకరించింది.

హైమమ్మ గుంటూరు వచ్చినపుడు పాండురంగారావు వాళ్ళ ఇంటికి తీసుకొని వెళ్ళి సత్కరించాడు. 14.1.2003 ధనుర్మాస పూజ సందర్భంగా హైమవతీదేవికి కిరీటం చేయించి అలంకరించాడు హైమమ్మంటే రంగారావుకు ఎంతో యిష్టం.

సామాన్యంగా సేవచేయటానికి "కమిటీలెందుకు కమిట్‌మెంట్ ఉండాలి కాని" అనే అమ్మ మాటను మనసున పట్టించుకున్న పాండురంగారావు జిల్లెళ్ళమూడిలో కొంతకాలం అవ్యవస్థ అనంతరం బాపట్ల సివిల్ జడ్జి శ్రీ శంకర్‌గారు ఏర్పాటు చేసిన రివైనల్ కమిటీలు మెంబరుగా ఉన్నాడు. తర్వాత తర్వాత ఏర్పాటు చేసిన కార్యవర్గాలలో కార్యదర్శిగా కూడా ఉన్నాడు. తాను కార్యదర్శిగా ఉన్నా లేకున్నా నిరంతరం సంస్థకు ఉపయోగపడే కార్యక్రమాలమీదనే దృష్టి. ఆలయ సామానుభద్రపరచటానికి స్టీల్ బీరువా కొని ఇవ్వటమే కాకుండా దేవాలయాలలో కార్యక్రమాలు సరిగా జరుగుతున్నవా లేదా, వంట ఇంటిలో పని సక్రమంగా జరుగుతున్నదా లేదో తెలుసుకోవటానికి ఆఫీసు కేంద్రంగా ఆయా కేంద్రాలలో కెమేరాలు ఏర్పాటు చేశాడు. వంటషెడ్డులో వర్షం వచ్చి క్రింద కూర్చొని భోజనాలు చేయటం ఇబ్బంది కలుగుతున్నదని బల్లలు కుర్చీలు ఏర్పాటు చేయటానికి సోదరీ సోదరులు సాయంతో ఆ పని పూర్తిచేశాడు.

సాయిమాష్టరుగా ప్రసిద్ధుడైన ఎక్కిరాల భరద్వాజ జిల్లెళ్ళమూడిలో అమ్మవద్ద కొన్ని సంవత్సరాలుండి ఆంగ్ల మాతృశ్రీ పత్రిక సంపాదకునిగా పనిచేసినప్పుడు వ్రాసిన రచనలన్నింటినీ "వింతలు విశేషాలు" అనే ఒక గ్రంథంగా సొంతఖర్చుతో ప్రచురించి అందరికీ ఉచితంగా పంచాడు. సంస్కృత కళాశాల అధ్యాపకురాలు సోదరి సుగుణ రచించిన "ప్రేమతత్వం" గ్రంథాన్ని స్వయంగా అచ్చొత్తించి అమ్మతత్వ ప్రచారానికి సందేశవ్యాప్తికి గాను ఉచితంగా పంచిపెట్టాడు.

"అనసూయావ్రతకల్పం" ఒక గంటలోనే పూర్తిచేసేలా పి.యస్.ఆర్.ఆంజనేయ ప్రసాద్ రచించిన గ్రంథాన్ని అప్పుడు, ఆత్మీయునిగా భావించి శివశ్రీశివానందమూర్తి గారిచే ఆవిష్కరింప జేసి పాండురంగారావుగారికి అంకితమిచ్చాడంటేనే పాండురంగారావు వ్యక్తిత్వం సేవాభావం ద్యోతకమౌతుందని నలుగురు అన్నమాట సత్యదూరం కాదు.

వీటన్నింటికి మించి భాగవతంలో ఒక పద్యానికి నిదర్శనంగా నిలుస్తాడు రంగారావు.

"నీ పాదకమల సేవయు
నీపాదార్చకుల తోడి నెయ్యము నితాం
తాపారభూత దయమును
తాపసమందార నాకు దయసేయగదే"

ఈ పద్యంలోని లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నవాడు శ్రీ రంగారావు. అమ్మపాద కమలాలసేవ అతని జీవం - జీవనం - అమ్మ పాదార్చకులయిన భాస్కరరావన్నయ్య, కాసు రాధాకృష్ణరెడ్డి, రాములక్కయ్య వంటి వారి స్నేహంలో, సేవలో పునీతుడైన వాడు. గోవును పెంచి అమ్మ అభిషేకానికి పాలు సమర్పించేవాడు. కుక్కలను పెంచి వాటికి కావలిసిన సదుపాయాలు చేసేవాడు. ఆకలిగొన్నవానికి అన్నంపెట్టడం, అన్నపూర్ణాలయం పరిశుభ్రంగా ఉంచి ఆదరంగా, ఆప్యాయంగా నలుగురికీ కడుపునిండా పెట్టాలి అనేది అతని తపస్సు.

కాసు రాధాకృష్ణరెడ్డి అంటే పాండురంగారావు కుటుంబానికి ఎంతో యిష్టం. సంగీత సార్వభౌముడైన ఆ మహావిద్వాంసుడు పాండురంగారావు ఇంట్లో చాలాకాలం ఉండేవాడు. అమ్మ వాళ్ళిద్దరినీ అలా కలిపి ఉంచింది. రాధాకృష్ణరెడ్డి అమ్మలో తన ఆఖరి శ్వాసను లీనం చేసినపుడు అంత్యక్రియలు తానే చేయాలని, తన యింటికి రాధ భౌతిక శరీరాన్ని తేవాలని కోరుకున్నాడు. ఏది ఏమైనా తనకి అత్యంత ఆప్తుడైన రాధాకృష్ణారెడ్డి అంత్యక్రియలు నిర్వహించే భాగ్యాన్ని సంస్థతో పాటు పాండురంగారావు పాల్గొన్నాడు. అటువంటి సేవామూర్తి పాండురంగారావును అభినందించకుండా ఉండలేం.

ఉద్యోగం చేస్తున్నంతకాలం తనుండే గృహాన్ని అందరిల్లుగా తీర్చిదిద్దాడు. నేను, రాచర్ల లక్ష్మీనారాయణ అతడు ఖమ్మంలో ఉన్న రోజులలో వెళ్ళాం. మమ్మల్ని భద్రాచలాది పుణ్యక్షేత్రదర్శనం చేయించి అత్యంత ప్రేమాదరాలు చూపించాడు. జిల్లెళ్ళమూడిలో ఇల్లు నిర్మించుకొని ఉద్యోగవిరమణానంతరం వచ్చి అక్కడే ఉండి నిరంతరసేవలో అమ్మ నామంలో గడిపేవాడు. గుంటూరులో ఉన్న రోజులలో వసుంధర వాళ్ళింట్లో ఉన్నది కొన్నాళ్ళు వైద్యం నిమిత్తం. ఎంతో భక్తిశ్రద్ధలతో సేవ చేసుకున్నారు. ప్రతినెలా జరిగే గుంటూరు మాతృశ్రీ అధ్యయనపరిషత్ పూజా కార్యక్రమాలకు క్రమం తప్పకుండా సకుటుంబంగా హాజరయ్యేవాడు.


జిల్లెళ్ళమూడిలో ఇప్పుడున్న నవనాగేశ్వరాలయం ఈ రూపు ధరించటానికి పూర్వం రావూరిప్రసాద్ కుమారుని రక్షణకై శేషు కానుపు క్షేమంగా జరగటానికి

అమ్మ మొక్కుకున్న మొక్కు నాగేశ్వరప్రతిష్ఠ. దానిని చాలాకాలం తర్వాత రావూరి ప్రసాద్ తీర్చాడు అతని శక్తికి తగ్గట్టుగా. రాచర్ల లక్ష్మీనారాయణ నవనాగేశ్వరాలయ నిర్మాణం చేయాలని సంకల్పించి రావూరి ప్రసాద్ పెట్టిన విగ్రహం కూడా ఉంచేటట్లు, పాండురంగారావు మరొక నాగేశ్వర విగ్రహన్ని కూడా ప్రతిష్ఠించేటట్టు ఏర్పాటు చేసి చివరకు ఈ మహత్తర రూపాన్ని తెచ్చారు. ఈ క్రియాకలాపంలో పాండురంగారావు కీలకపాత్ర వహించాడు. ఆ స్థలం చాలాకాలం అమ్మ నాన్నగారు నివసించిన స్థలం. మహత్తర మైన నాగేంద్రుడు సంచరించిన స్థలం. వెలుగు వెల్లువలు ప్రసరించిన స్థలం. అమ్మ వద్ద ఎన్నో మహిమలు జరిగిన స్థలం.

పాండురంగారావుకు పట్టిన మరొక మహా భాగ్యం అందరికీ అందేదికాదు. ఏ జీవియేమైనా భగవంతుని సేవలో ప్రాణాల సమర్పించటంకంటే విశేషమేమున్నది. అన్నపూర్ణాలయం స్వర్ణోత్సవాల సమయంలో 100 చోట్ల అమ్మ కిష్టమైన భోజన కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి. పాండురంగారావు స్వగ్రామమైన వల్లూరులో స్వర్ణోత్సవ భోజనాలు వైభవంగా కొన్ని వేలమందికి సంతర్పణ జరిగింది. ఆ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఉత్సాహంలో వల్లూరు నుండి జిల్లెళ్ళమూడి కారులో వస్తున్నాడు. ఇంకా ఎంతకాలం ఈ సేవలు, పూజలు నాలోకిరా అని అమ్మ పిలచి తనలో లీనం చేసుకొన్నది 6.7.2008న.

పాండురంగారావు చేసిన తపస్సు, సేవ, పూజ, నామము, తను మన ధనాలలో సాగించిన అమ్మ కైంకర్యము, అమ్మ పదార్చకుల సేవాభాగ్యము వల్ల అమ్మ తృప్తి పడ్డది పాండురంగారావుకు ముక్తిని ప్రసాదించింది. నిజంగా రంగారావు ఆదర్శజీవిగా మన కళ్ళముందు ఇంతెత్తున నిలబడ్డ ధన్యజీవి.

(ఈ రచనకు కుసుమాచక్రవర్తి, ఎ.వి.ఆర్.సుబ్రహ్మణ్యం రచనలు కొంత తోడ్పడ్డాయి)



64. అన్నంరాజు మాధవరావు -కనకదుర్గాంబ

శ్రీ అన్నంరాజు మాధవరావుగారు గుంటూరు నగరంలో సుప్రసిద్ధ న్యాయవాది అయిన అన్నంరాజు సీతాపతిరావుగారి తమ్ముడు. శ్రీ అన్నంరాజు వెంకట కృష్ణయ్య, ముత్తమ్మగార్లకు కలిగిన ఏడుగురుసంతానంలో మాధవరావుగారు అయిదవ కుమారుడు. వెంకట కృష్ణయ్యగారికి అన్నంరాజు సీతాపతిరావు, పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు, రామారావు, మాధవరావు అయిదుగురు మగపిల్లలు. సుబ్బమ్మ, పున్నమ్మ ఇద్దరు ఆడపిల్లలు.

మాధవరావుగారు కూడా న్యాయవాద వృత్తిలోనే చేరారు. వారు యం.ఎ.యల్.యల్.బి. లక్నో విశ్వవిద్యాలయంలో చదివారు. మంచి టెన్నిస్ ఆటగాడు. పోటీలలో కప్పులు కూడా గెలిచారు. 1942లో లా చదివిన మాధవరావుగారు 1955 వరకు తెనాలిలో న్యాయవాద వృత్తిలో ఉన్నారు. 1955 నుండి సీతాపతిరావు గారు అనారోగ్యవంతులు కావడంతో గుంటూరు వచ్చి వారి వద్ద జూనియర్‌గా చేరారు.

శ్రీ మాధవరావుగారికి విజయవాడలో శ్రీ రామమోహన్ గ్రంథాలయము, శ్రీ రామమోహన ఆయుర్వేద వైద్యశాలలు నెలకొల్పిన శ్రీ శంకర వెంకట్రామయ్య గారి కుమార్తె కనకదుర్గాంబ నిచ్చి వివాహం చేశారు. వివాహమై అయిదు సంవత్సరాలయినా పిల్లలు పుట్టలేదు. దాంతో మాధవరావు గారికి రెండవ వివాహం చేద్దామనుకున్నారు పెద్దలు. మాధవరావు అన్నగారు రామారావుగారు కుసుమహరనాథ భక్తులు. కుసుమహరనాథ భక్తి ప్రచారం చేసే శ్రీ రాళ్ళబండి వీరభద్రరావుగారి వద్దకు తీసుకువెళ్ళారు. వారు కుసుమనాథ పంచాక్షరీ మంత్రం ఉపదేశించారు. కనకదుర్గాంబ గారు నిరంతరం ఆ జపం చేసింది. సీతాపతిరావు గారింట్లో కుసుమహరనాధ్ బాబా ఏకాహం జరుగుతుండగా బాబా ఫోటోలో నుండి ఒక పిల్లవాడు, పాకుతూ దుర్గాంబగారి ఒడిలోకి వచ్చాడు. ఆ తర్వాత మురళీకృష్ణ పుట్టాడు. తర్వాత రెండున్నర సంవత్సరాలకు ఆడపిల్ల పుట్టింది. ఆ పుట్టిన పిల్లకు ఫిట్స్, తల్లి దుర్గాంబకు కళ్ళు కనిపించలేదు. కుసుమ హరనాథ్ బాబాకు అమ్మపేరు పెట్టుకుంటామని మ్రొక్కుకున్న తర్వాత అన్ని జబ్బులు తగ్గిపోయాయి. అందుకు ఆ పిల్లకు 'కుసుమకుమారి' అని పేరు పెట్టుకున్నారు. ఆ రకంగా కుసుమహరనాథ్ బాబా భక్తిలో అనుష్ఠానంలో కాలం గడుపుతుండగా దుర్గాంబగారికి వసంతకుమారి, రాజ్యలక్ష్మీకుమారి, సీతారామారావు జన్మించారు.

1958లో దుర్గాంబగారు మొదటిసారి జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించింది. తెనాలిలో మాధవరావుగారి అన్నగారు వెంకటేశ్వరరావుగారు న్యాయవాది. వారి కుమార్తె సరోజినీదేవి, కొమరవోలు గోపాలరావు గారు జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించుకుంటుంటే వారితో వచ్చిన దుర్గాంబగారితో నిన్ను 1956కు పూర్వమే తెనాలిలో చూచానని అమ్మ చెప్పింది. అప్పుడే నీ ఒడిలోకి ఎందుకు తీసుకోలేదమ్మా! అంటే దేనికైనా తరుణం రావాలిగా అని బదులిచ్చింది.

తరువాత మాధవరావుగారు, అన్నంరాజు రామకృష్ణారావుగారు వారి తండ్రిగారి ఆబ్దికం జిల్లెళ్ళమూడిలో పెడుతుంటే వెళ్ళారు. బ్రాహ్మణుడు లేకుండా మంత్రాలు లేకుండా అమ్మకు నైవేద్యం ఇస్తుంటే ఇదేమిటి? ఈ ఆబ్దికం అని బాధపడుతున్నారు. ఇంతలో అమ్మ "ఏది గారెల్లోకి ఆవపచ్చడి చేయించలేదా?" అని అడిగింది. ఆ మాటలు వారి అన్నగారైన శ్రీ వెంకటేశ్వరరావుగారి గొంతులా

వినిపించడంతో ఆశ్చర్యపోయారు మాధవరావుగారు.

మాధవరావగారి కూతురు కుసుమ పెళ్ళి గుంటూరులో జరిగింది. అన్నంరాజు రామకృష్ణారావుగారు జిల్లెళ్ళమూడి నుండి పెళ్ళికి గుంటూరు బయలుదేరుతుంటే అమ్మ "మీ పిన్నికి పుట్టింటి వారెవరూ లేరు కదరా అని కనకదుర్గాంబగారికీ, మాధవరావుగారికి బట్టలు, పెళ్ళికూతురికి మధుపర్కాలు, తలంబ్రాలు, ప్రసాదం, తీర్థం అమ్మ స్వయంగా ఇచ్చి పంపింది. రామకృష్ణారావుగారు వాటిని తీసుకొని సరాసరి గుంటూరు చేరారు. గుంటూరులో మాధవరావుగారి భార్య దుర్గాంబగారు ఒంట్లో బాగోలేక అపస్మారకంలో ఉన్నది. పీటల మీద పెళ్ళి ఆగిపోతుందేమోనని భయం. మరునాడు పెళ్ళి. ఇక్కడ పరిస్థితి ఇది.

బందరు చక్రవర్తిగారి కుటుంబానికి ఫోను చేసి తరలి రావద్దని చెబుదామను కున్నారు. అప్పుడు రామకృష్ణారావుగారు "అమ్మ ప్రసాదం ఇచ్చి పంపింది. పిన్ని లేస్తుంది. భయపడవద్దు. పెళ్ళికి ఎటువంటి ఆటంకం రాదు" అని దుర్గాంబగారికి అమ్మ ఇచ్చిన కుంకుమతో బొట్టు పెట్టి తీర్థం ఇచ్చి పిన్నీ! అమ్మ మీకు బట్టలు, ప్రసాదం పంపింది అని చెవిలో గట్టిగా చెప్పాడు. స్పృహలో లేని దుర్గాంబగారు కదిలింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పీటల మీద కూర్చొని కన్నెధార పోసింది. డాక్టర్లకే అంతుబట్టని విషయంగా మిగిలిపోయింది ఆనాటి విషయం.

గుంటూరు మాతృశ్రీ అధ్యయన పరిషత్తువారు వారం వారం అమ్మ పూజలు పెట్టేవారు. ఒక్కొక్క వారం ఒక్కొకరింట్లో జరిగేది. మాధవరావుగారు, దుర్గాంబగారు పార్వతీ పరమేశ్వరుల్లాగా ప్రతివారం పూజలకు వచ్చేవారు. మాధవరావుగారు చిన్నలలో చిన్నగా, పెద్దలలో పెద్దగా సంచరించేవాడు. అమ్మవద్దకు వచ్చి శ్రీశైలంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్న శ్రీ పూర్ణానందస్వామి మాధవరావుగారిని వృద్ధబాలుడు అనటం నిజంగా వారికి బాగా సరిపోతుంది. అంత ఉత్సాహంగా ఉండేవారు. దుర్గాంబగారికి క్రిందపడి చేతులకు ఫ్రాక్చరయింది. ఆపరేషన్ చేయిద్దామనుకున్నారు. ఈ వయసులో దానికి ఆపరేషన్ ఎందుకు వద్దులే అని అమ్మ అన్నది. మాధవరావుగారు అమ్మ చెప్పింది కనుక ఆపరేషన్ వద్దనుకున్నారు. కాని కూతురు కుసుమ ఒప్పుకోలేదు. రామకృష్ణారావుగారు అయితే అమ్మను

ఒప్పించు అలాగే చూద్దాం అన్నారు. కుసుమ జిల్లెళ్ళమూడి అమ్మవద్దకు ఒకరోజు అనుకున్నదానికన్నా ముందే వచ్చింది. అదే మొదటిసారి కుసుమ అమ్మ వద్దకు రావటం. ఒకరోజు ఉందామని వచ్చిన కుసుమ అమ్మ కోర్కెపై నాలుగురోజులు ఉండటానికి ఒప్పుకొన్నది. కాని మూడవరోజు మాధవరావుగారికి హార్ట్ ఎటాక్ వచ్చిందని కబురు వచ్చింది. అమ్మ 'ఫరవాలేదమ్మా ! తగ్గిపోతుంది !' అన్నా మనసు ఆగక గుంటూరు వెళ్తానమ్మా ! అని అడిగింది. అమ్మ గారె, ప్రసాదం ఇచ్చి పంపింది. ఇక్కడ అమ్మ ప్రసాదం కుసుమ చేతిలో పెట్టిందో లేదో అక్కడ మాధవరావుగారికి తగ్గటం మొదలైంది. కోలుకున్నారు. గుంటూరు వెళ్ళిన కుసుమ మాధవరావుగారిని, తల్లిని తీసుకొని మళ్ళీ జిల్లెళ్ళమూడికి వచ్చి అమ్మను అర్చించుకున్నారు.


ఒకసారి దుర్గాంబగారు జిల్లెళ్ళమూడి వెళ్ళింది. ఆమెతో అమ్మ 'మీరేమో ఇడ్లీలో కారప్పొడి నెయ్యి, కొబ్బరి చట్నీ అన్నీ వేసుకొని తింటారు. నాకేమో వట్టి ఇడ్లీ పెట్టారు. ఎట్లా తినేది' అన్నది. హడావిడిగా నివేదన పెట్టడంలో మరచిపోయిన విషయం అమ్మకు తెలిసిందని ఆశ్చర్యపోయిందామె. దుర్గాంబగారు జిల్లెళ్ళమూడిలో ఉంటే మాధవరావుగారు పులిహోర చేసి అమ్మకు నివేదన పెట్టారు. 'అబ్బాయి ఇవాళ పులిహోర చేశాడు. చాలా బాగుంది' అని చెప్పింది దుర్గాంబకు అమ్మ. ఇంటికి వెళ్ళాక అడిగితే అవును నేనే చేశాను అన్నారు మాధవరావుగారు. అమ్మకు మనస్సు ప్రధానం. బిడ్డలపై మమకారం. అన్నింటిలో అందరిలో ఉన్నది అమ్మే కదా ! ఆమెకు తెలియందేముంది. అందుకే అమ్మ అన్నది 'మీరు నన్ను మానవిగా చూస్తారు. నేను మిమ్మల్ని దేవతగా చూస్తాను' అని దుర్గాంబగారు ఆమెకు ఏ జబ్బు చేసినా అమ్మ కుంకుమ నీళ్ళలో వేసి త్రాగటమే మందు. ఎవరికేం చేసినా అదే మందు అందరికీ ఇచ్చేది, తగ్గిపోయేవి. నిరంతరం అమ్మ నామం చేస్తూ ఇస్తుంటే తగ్గక యేం చేస్తుంది. విశ్వాసం అంతటిది.

మాధవరావుగారి కుటుంబం అంతా అమ్మకు సన్నిహితులైనవారే – అమ్మను తప్ప మరొకరిని తలవనంతగా తలమునకలైనారు. మాధవరావుగారి కుమారుడు మురళీకృష్ణ, కుమార్తె కుసుమ ఇద్దరూ అమ్మను ఆరాధించేవారే. అమ్మను above God గా భావిస్తాడు మురళీకృష్ణ. విశాఖలో అమ్మకు వారింట్లోనే గుడి కట్టించి నిత్యం మూడుసార్లు పూజలు చేసుకొనే కుసుమ, భర్త చక్రవర్తి ఇద్దరూ

ఆదర్శమూర్తులు. మురళీకృష్ణకు కూడా గుంటూరులో దేవాలయం నిర్మించాలని దృఢసంకల్పం. అంతేకాక తనను రక్షించి తన వ్యాపారాన్ని వృద్ధిలోకి తెచ్చిన అమ్మను అందులో భాగస్వామిని చేయాలని అతని సంకల్పం.

మాధవరావుగారికి వార్ధక్యంలో జిల్లెళ్ళమూడిలో నివాసమేర్పరచుకోవాలని ఉండేది. కాని అమ్మ వారికి అది అనుగ్రహించలేదు. వారి కుమారుడు మురళీకృష్ణ స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ఉంటున్నాడు. అయితే మాధవరావుగారి మరణం మహాద్భుతం. గడ్డం చేసుకొని కుర్చీలో పేపరు చదువుతూ అనాయాసంగా అమ్మలో లీనమైనారు. అలాగే కనకదుర్గాంబగారు నిరంతరం అమ్మ జపం చేస్తూ అమ్మలో లీనమైనారు. 29.05.1909న పుట్టిన మాధవరావుగారు 25.04.1972న అమ్మలో కలిసిపోయారు.

మాధవరావుగారి శతజయంతి ఉత్సవాన్ని వాళ్ళ పిల్లలంతా కలిసి 29.05.2009వ తేదీన గుంటూరులో అమ్మవ్రతం అనసూయావ్రతం చేసుకొని వందమందికి అన్నవితరణ చేశారు. అమ్మ చెప్పినట్లు 'నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టు' అన్న మాటను అక్షరాల పాటించినవారు మాధవరావు కనకదుర్గాంబా దంపతులు. వారు అమ్మ సేవలో తరించటమే కాక వారి పిల్లలకు కూడా అమ్మ ఆ అనుగ్రహాన్ని ప్రసాదించింది. నిజంగా మాధవరావు, కనకదుర్గాంబ ధన్యజీవులు.



హరిదాసు కృష్ణవేణమ్మ

శ్రీరాముల వేంకటేశ్వర్లుగారు కాకుమానులో కాపురం ఉండేవారు. ఊరు ఊరూ తిరిగి హరిలో రంగహరి అంటూ సంకాంత్రి రోజులలో పుష్యమాసమంతా హరికీర్తనా వర్తనులై జీవితాన్ని భగవచ్చింతనలో కాలం గడిపేవారు. ఆయన ధర్మపత్ని 'కృష్ణవేణమ్మ' గారు అనుకూలవతియైన సాధుశీల.

దాసుగారు మొదట్లో జిల్లెళ్ళమూడికి అరకంగా వచ్చి వెళ్ళేవారు. కాని రాను రాను అమ్మను గూర్చి ఆ నోటా విని వచ్చి వెళుతూండేవారు. కృష్ణవేణమ్మ అక్కయ్య అమ్మకు బాగా సన్నిహితం కావడంతో తరచుగా వచ్చి ఒక్కొక్కసారి 'అమ్మ వద్దనే ఉంటాను కాకుమాను వెళ్ళనని మారాం చేసేది. అమ్మ 'ఉంటే భార్యాభర్తలు ఇద్దరూ ఉండండి అంతేకాని ఒక్కళ్ళుండటం కాద'న్నది.

అంతలో చీరాల నుండి వచ్చే సోదరులు అమ్మ సేవకై ఒకళ్ళను ఏర్పాటు చేస్తే బాగుంటుందని అనుకుంటుండగా, నాన్నగారు కూడా అమ్మ ఆరోగ్యం సరిగా లేనందున ఎవరైనా ఒకరు సహాయంగా ఉంటే మంచిదేనని ఆలోచించారు. ఆ సందర్భంగా నాడు తరచు వచ్చి వెళ్తూ అమ్మకు అన్ని పనులలో సాయం చేస్తున్న కృష్ణవేణమ్మగారు దృష్టి పథంలోకి రావడంతో ఆ కుటుంబాన్ని జిల్లెళ్ళమూడికి ఆహ్వానించడం వారు సంతోషంతో అంగీకరించి 1958లో రావడం జరిగింది.

అమ్మకు అన్ని పనులలో సహాయపడుతూ కృష్ణవేణమ్మక్కయ్య ఉండగా, దాసుగారిని వచ్చిన సంవత్సరమే సంక్రాంతి దినాలలో అమ్మ మొదటి భిక్ష వేసి పంపింది పల్లెలకు. ఆది మాత వేసిన భిక్ష అక్షయ పాత్ర అయింది ఆయన పాలిటికి. ఆదిభిక్షువుకు కూడా భిక్ష వేసిన అన్నపూర్ణాదేవి చేయి కదా అది. ఆ సంవత్సరం ఏ యేడు లేని విధంగా పది బస్తాల బియ్యం పోగయినవి. ఆ ధాన్యాన్ని అమ్మకు సమర్పించారు. అమ్మ ఆలయాలు కడుతున్న పనివారికి, ఆ రోజులలో జిల్లెళ్ళమూడి వచ్చే సోదరీసోదరులకు వినియోగించింది. తదాది జిల్లెళ్ళమూడి వచ్చేవారికి సౌకర్యాలు చూస్తూ అన్నపూర్ణాలయ నిర్వహణ చేస్తూ కాలం వెళ్ళబుచ్చేవారు దాసుగారు.

వస్తుతః దాసుగారికి ఆయుర్వేదవైద్యంగా కొద్ది తెలుసు. తనకు తన మందే వాడుకుంటూ ఇతరులకు కూడా వైద్యం చేస్తుండేవారు.

హరిదాసుగారు ఒక కుక్కను పెంచేవారు. అది వారి మంచం ప్రక్కనే పడుకునేది. జిల్లెళ్ళమూడి వచ్చి వెళ్ళే వారిని యేడవ మైలు వరకూ తోడుగా వచ్చి దించి వెళ్ళేది. అమ్మ హరిదాసుగారి కుక్కను 'దమయంతి' అనే పేరుతో పిలిచేవారు. దమయంతీ 'ఒక పాటపాడవే' అని అమ్మ అంటే పాట పాడేది. అది తీసేరాగం అలా ఉండేది. ఒక అన్నయ్య 'ఇంకొక పాట పాడించవమ్మా!' అని అడిగితే అమ్మ "ఇంకొకపాట పాడవే" అనగానే మరోపాట పాడింది. ఈ సంఘటన విచారిస్తుంటే విశ్వాసం గల కుక్కతో పాటు హరిదాసుగారు కూడా అమ్మను విశ్వాసంతో సేవించారు అని అర్థమవుతుంది. 'దమము' అంటే ఇంద్రియ నిగ్రహము అని అర్థం. ఇంద్రియాలను నిగ్రహించింది దమయంతి. దాసుగారు ఇంద్రియనిగ్రహులో కాదో తెలియదు. కాని అన్ని ఇంద్రియాలతో అమ్మను సేవించుకున్నారు. దమము అంటే క్లేశము నోర్చుతనము అని కూడా అర్థం. కష్టసహిష్ణుత అక్కడ పనిచేసేవారికి అమ్మనుండి సంక్రమించిన వరం. అది దాసుగారికి ఉన్నది.

హరిదాసుగారికి, కృష్ణవేణమ్మగారికి చాల నియమాలుండేవి. జపం చెయ్యటం ధ్యానంలో కూర్చోవటమూ, తమకు కలిగిన అనుభవాలను పుస్తకాలలో వ్రాసుకోవటం ఉండేదిట. ఎందరినో దర్శించారు. ఎక్కడెక్కడికో తిరిగారు. ఎక్కడా తృప్తి కలగలేదు. అమ్మ ఒకసారి కొమ్మూరులో గంగరాజు లోకనాథరావుగారింటికి వెళ్ళినప్పుడు లోకనాథరావుగారి మీద గౌరవం కొద్దీ వారు పిలువగా అక్కడకు వచ్చారు. అక్కడ అమ్మను చూచి దాసుగారు కృష్ణవేణమ్మతో "ఓసీ నీ దుంపతెగా

నువ్వు కలలో చూచిన అమ్మ ఈ అమ్మే" అన్నాడట.

జిల్లెళ్ళమూడి రాకముందు కృష్ణవేణమ్మగారికి కలలో ఒక పల్లెటూరు, ఆ ఊరిడొంక, ఆ ఊళ్ళో రాళ్ళమెట్లున్న మంచినీళ్ళ చెరువు, అందులో కలువలు, పద్మాలు, ఒక పూరి గుడిసె, అందులో నుదుటన పెద్ద కుంకుమబొట్టుతో, దివ్యతేజస్సుతో ఒక ముత్తైదువ కనిపించాయి. ఆ తర్వాత భార్యభర్తలిద్దరూ ఆ విషయమై చర్చించుకున్నారు. ఈ అమ్మే ఆ పోలికలలో ఆ విధంగా కనిపించిందని వారు గుర్తించారు.

హరిదాసుగారు కృష్ణవేణమ్మతో కలసి జిల్లెళ్ళమూడి మొదటిసారి అమ్మ వద్దకు వెళ్ళినప్పుడు అమ్మ ప్రేమతో అన్నం కలిపి దాసుగారి నోట్లో ముద్దలు పెట్టింది. ఆ అనురాగానికి వాత్సల్యానికి ముగ్ధుడైన దాసుగారు ఆనందంతో పెద్దగా అన్నపూర్ణాష్టకం చదివి పరవశుడై కళ్ళవెంట ఆనందాశ్రువులు కార్చాడు. అనుభవించితే తెలిసేది కాని మాటలకు అందని ఆనందమది.

కృష్ణవేణమ్మ మొదటిసారి జిల్లెళ్ళమూడి వెళ్ళినపుడు అమ్మ 'నీవు ఇదివరకు ఈ ఊరు వచ్చావా? నన్ను చూచావా ? అని అడిగింది. 'లేదమ్మా! ఇదే మొదటిసారి రావటం' అని చెప్పింది. కృష్ణవేణమ్మ ఇంటికి వెళ్ళి హరిదాసు గారికి ఈ విషయం చెప్పగా 'నీవు కలలో జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను చూచావు గదా!' అన్నారు. కృష్ణవేణమ్మగారు 'నిజమే మరచిపోయాను' అన్నది.

ఒకసారి హరిదాసుగారు ఒక్కరే అమ్మను చూడటానికి జిల్లెళ్ళమూడి వెళ్ళగా, అమ్మ 'ఇప్పుడు నేను వెళ్ళితే కృష్ణవేణమ్మ నన్ను గుర్తుపడుతుందా?' అని అడిగింది. ఆ టైమును గుర్తుపెట్టుకొని దాసుగారు ఇంటికి వెళ్ళిం తర్వాత 'ఆ సమయంలో ఏం చేస్తున్నావు?' అని అడిగారు. ఆమె అప్పుడు 'మంచం మీద పడుకొని ఉన్నాను. ఎవరో తలుపుకొట్టిన చప్పుడైంది. ఎవరోలే అని వెళ్ళలేదు. మళ్ళీ పెద్దగా తలుపుకొట్టిన చప్పుడైంది. బద్ధకంతో వెళ్ళి తలుపుతీశాను. కాని ఎవరూ కనిపించలేదు' అని చెప్పింది.

దాసుగారు మరొకసారి జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు కాకుమానులో వాళ్ళింటికి ఒక బాలుడు అన్నం అడుక్కుంటూ వచ్చాడు. కృష్ణవేణమ్మగారు అన్నం పెట్టింది. అయితే ఆ అబ్బాయి తనతో కలసి కృష్ణవేణమ్మను కూడా తినమన్నాడు. ఆమె అన్నం పెట్టి చేతులు కడుక్కొని వచ్చే లోపల అడుక్కునే అబ్బాయి అవతలి ఇంటి వద్దకు పోయి కనిపించలేదు. అతని కోసం అన్ని బజార్లు వెతికింది. కనిపించలేదు.


తరువాత అమ్మ వద్ద ఈ ప్రస్తావన వస్తే అమ్మ 'మూగవాడేనా? పొడుగు చేతుల చొక్కాను చివర చేతుల వద్ద మడిచి తొడుకున్నాడా?' అని అడిగింది. అమ్మే ఆ రూపంలో వచ్చిందని అప్పుడు గాని వారికి అర్థం కాలేదు. ఆ రకంగా అమ్మపై విశ్వాసం నమ్మకం మొదలైంది జిల్లెళ్ళమూడి రాకముందు.

హరిదాసుగారు అమ్మ రవికలు కుడుతుండేవారు. వచ్చిన మొదటి రోజులలో చాలాకాలం వారే కుట్టేవారు. తన రవిక కుట్టటానికి హరిదాసుగారికి ఆదికి రెవిక యిస్తూ అమ్మ "ఇవ్వాళ రవిక బిగుతయింది. నిన్న వదులుగా వున్నది. మరి ఎట్లాకుడతావో ! ఏమో ? నా రవిక కుట్టడంలో నీ నేర్పంతా బయటపడుతుంది" అన్నారు ఒకసారి. అందుకు దాసుగారు నీ ఆది' తెలియదు అన్నారు. అందుకు అమ్మ 'నాది అనాది కనుక నా ఆది అందదు" అన్నారు. ఈ రకంగా అనాది అయిన ఆదెమ్మతో ఆడుతూ పాడుతూ సేవ చేస్తూ ఆ అందరింట్లో విశ్వజనని సేవలో తరించిన మహనీయుడాయన.

అమ్మను కృష్ణపరమాత్మగా దర్శించిన దార్శనికుడు దాసుగారు. ప్రేమతో చూచేవాడు అందరినీ. ఎవరైనా అన్నం తినకుండా ఉంటే సహించేవాడు కాదు. అన్నపూర్ణాలయం నుండి అన్నం తెచ్చి వాళ్ళ గుడిసెలో పెట్టించేవాడు కృష్ణవేణమ్మ గారితో. 1958, 1960 ప్రాంతంలో చాలామంది వాళ్ళింట్లోనే సంచులు పెట్టుకొనేవారు. ఆ దంపతులు అమ్మ వద్దకు వచ్చే వారిని తమ పిల్లలుగా భావించి సేవచేసేవారు.

చివరి రోజులలో దాసుగారు అనారోగ్యంతో బాధపడుతూ డాక్టరు వద్దకు వెళ్ళితే ఏ డాక్టరూ జబ్బు నిర్ధారించలేకపోయారు. ఎంతో కాలంగా శరీరంలో కాన్సర్ జబ్బు ఉన్నా బాధ లేకుండా చేసింది అమ్మ. ఆ కాన్సర్ లక్షణాలను అంత్యకాలంలో మాత్రమే గ్రహించారు.

దాసుగారు మామూలుగా చాల పరిశుభ్రమైన దుస్తులు ధరించి క్రొత్త పెళ్ళికొడుకులా కన్పించేవాడు ఎప్పుడూ. చివరి రోజులలో రాచర్ల లక్ష్మీనారాయణ 'నీకింకా జీవించాలని ఉందా?' అని అడిగాడు. అందుకు దాసుగారు 'ఆ కోరిక లేదు కాని శరీరం ఉన్నంత వరకు పరిశుభ్రంగా ఆచ్ఛాదన ఉండాలికదా!' అన్నాడు. అవును అమ్మ వద్ద తృప్తితో జీవించిన సేవించిన ధన్యజీవి. తృప్తే ముక్తి అన్నది అమ్మ. ఆ తృప్తిని అమ్మ దాసుగారికి ప్రసాదించింది. ధన్యుడు.



శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్, శ్రీమతి గిరిబాల

రచయిత పరిచయం

తల్లి, తండ్రి : పోతరాజు పురుషోత్తమరాయ కవి- స్వరాజ్యలక్ష్మి

అగ్రజుడు, గురువు : డాక్టర్ ప్రసాదరాయ కులపతి

శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ 24 పైచిలుకు గ్రంథాలు వ్రాసారు. తను మన ధనాలతో జిల్లెళ్ళమూడి అమ్మను ఆరాధించే తపన గలవారు. దాదాపు 10 రచనలపైన అమ్మను గూర్చే వ్రాసారు. గత 15 ఏళ్ళుగా మాతృశ్రీ, విశ్వజనని మాసపత్రికలలో వారు వ్రాసిన సంపాదకీయాలను ఈమధ్యనే నాన్నగారి శతజయంతి సంవత్సరంలో 'విశ్వజననీ వీక్షణం' అనే బృహత్ గ్రంథముగా ప్రచురించారు.

ఇక ఇప్పుడు హైదరాబాద్‌నుండి వస్తున్న 'మదర్ ఆఫ్ ఆల్' త్రైమాసిక పత్రికలో ధారావాహికంగా 'ధన్యజీవులు' శీర్షికలో వారు వ్రాసిన 60 పైగా రచనలతో కూడిన గ్రంథం ఇప్పుడు ఆవిష్కరింపబడుతున్నది.

శ్రీ పి.యస్.ఆర్. గారిచేత అమ్మ ఇలాగే ఇంకా సేవ చేయించుకోవాలని ఆ శక్తి ఆయనకు అమ్మ ప్రసాదించాలని మనసారా కోరుతున్నాం.

- శ్రీ విశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి

ధన్యజీవులు





శ్రీపాద



భరద్వాజ



హరిదాసు



క్రిష్ణవేణమ్మ



సింగుపాలెం జానకి



గజేంద్రమ్మ

ప్రచురణ

శ్రీ విశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి